## సమాజశాస్త్రం

# అనుప్రయుక్త సమాజశాస్త్రం

BRAOU

డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్

2004

# రచయితల బృందం

**సంపాదకుడు**

ప్రొ. పి.మురళీధరుడు

అల్లం నారాయణ

**సమన్వయకర్త, సహ సంపాదకులు**

డా. ఘంటా చక్రపాణి

**రచయితలు**

డా. ఘంటా చక్రపాణి

డా. ఎం.ఎస్. పార్థసారధి

డా. వి. కనకదుర్గాంబ

డా. వి. వెంకటేశ్వర్లు

డా. కె. విజయ్‌కుమార్

**ముఖచిత్రం**

రమేష్

115077
27-4-05

Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No. 115077
Date 27-4-2005
Call No.

BRAOU

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,

హైదరాబాద్, ఆం.ప్ర.

ప్రథమ ముద్రణ 2004

కాపీరైట్ © డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2004.

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏభాగం అయినా ఉపయోగించదలచుకొంటే డా.బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి. ఈ పాఠ్యాంశాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో భాగం.

ఇతర వివరాలకు:

డైరెక్టర్, అకడమిక్

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,

జూబిలీహిల్స్, హైదరాబాద్-500 033.

LR No. 648 / Dr. BRAOU / DMP / PTG / F.No. 45 / J.O. : 201 (2004) Date : 6-05-04, Copies : 1000

**Printed by : Graphica Art Printers, Shivam Road, Hyderabad.**

# ఖండం- I

## సామాజిక సమస్యలు: సిద్ధాంత దృక్పథాలు

సామాజిక మార్పు ఒక నిరంతర ప్రక్రియ. మారుతున్న సామాజిక వ్యవస్థలో ఎన్నో సమస్యలు తలెత్తుతుంటాయి. ఈ సమస్యలు సామాజిక అవ్యవస్థకు దారితీస్తాయి. పర్యవసానంగా సామాజిక వ్యవస్థలో పురోగతి కుంటుపడుతుంది. సంక్షోభం తలెత్తుతుంది. అది క్షీణతకు దారితీస్తుంది. ఇటువంటి సామాజిక సంక్షోభాలు, సమస్యలు, అవ్యవస్థలను అధ్యయనం చేసి పరిష్కార మార్గాలు అన్వేషించడం 'అనుప్రయుక్త సమాజశాస్త్రం' ప్రధాన కార్యక్షేత్రం.

ఈ ఖండంలో సామాజిక సమస్యలు, వాటి వర్గీకరణతోపాటు సామాజిక సమస్యల విశ్లేషణకు కావాల్సిన వివిధ సిద్ధాంత దృక్పథాలను వివరించే ప్రయత్నం జరిగింది. ఇందులో మొత్తం నాలుగు భాగాలున్నాయి. అవి:


భాగం-1: సామాజిక సమస్యలు-భావన, వర్గీకరణ

భాగం-2: జైవిక-మానవశాస్త్ర సిద్ధాంతాలు

భాగం-3: మనోవైజ్ఞానిక సిద్ధాంతాలు

భాగం-4: సామాజిక సిద్ధాంతాలు


BRAOU

BRAOU

# పరిచయం

సమాజం అంటే మానవ సంబంధాల అల్లిక. సాలెగూడులో ఒక్కోపోగు అల్లుకుని వున్నట్టే సమాజంలో కూడా మనిషికీ మనిషికి, మనిషికీ సమూహాలకు, సముదాయాలకు సామాజిక వ్యవస్థలూ సంస్థలకు మధ్య పరస్పర సంబంధాలు ఒక అల్లికగా వుంటాయి. అయితే సమాజంలో అప్పుడప్పుడు అనేక కారణాల వల్ల అవ్యవస్థ ఏర్పడడం, సామాజిక సమస్యలు ఉత్పన్నం కావడం జరుగుతుంది. సమాజం నిరంతరంగా మార్పులకు లోనవుతూవుండడం వల్ల సామాజిక చరాంశాల మధ్య సమతుల్యత లేకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు తలెత్తుతాయి. పంతొమ్మిదో శతాబ్ది పూర్వార్థంలో సమాజ శాస్త్రానికి పునాది ఏర్పడ్డ తరువాత సామాజిక అవ్యవస్థను, సామాజిక సమస్యలనూ, శాస్త్రీయంగా విశ్లేషించే అవకాశం ఏర్పడింది. సమస్యలను విశ్లేషించడంతోపాటు వాటి పరిష్కార మార్గాలు సూచించే కృషి కూడా ప్రారంభమైంది. ఇది సమాజ పునర్వ్యవస్థీకరణకు మార్గదర్శి అయ్యింది. దీంతో సమాజ శాస్త్రానికి ప్రాధాన్యత పెరిగింది. ఇది అనుప్రయుక్త సమాజశాస్త్రం(Applied Sociology) అనే ప్రత్యేక అధ్యయనాంశం ఆవిర్భావానికి దోహదపడింది.

సాధారణ సమాజశాస్త్రం సామాజిక వ్యవస్థల్లోని వివిధ ప్రక్రియలను, సంస్థలను అవి పనిచేసే విధానాలను విశ్లేషించి కొన్ని సాధారణీకరణలను రూపొందిస్తే 'అనుప్రయుక్త సమాజశాస్త్రం' సాధారణీకరణలను కేవలం సామాజిక అవ్యవస్థ, సామాజిక సమస్యల అవగాహన, పరిష్కారాలకు అనువర్తింపజేస్తుంది. దీంతోపాటు సామాజిక సమస్యలపట్ల 'అనుప్రయుక్త సమాజశాస్త్రం' స్వతంత్ర విశ్లేషణ చేస్తుంది.

భారతదేశంలో 'అనుప్రయుక్త సమాజశాస్త్రం' ఇటీవలే ఒక అధ్యయనాంశంగా ఎదిగింది. ఈ శాస్త్రం సామాజిక అవ్యవస్థ లేదా సాముాజిక పునరావాసానికి సంబంధించిన సమస్యలు, అలాగే సామాజిక పునరావాసానికి పునర్నిర్మాణానికి సంబంధించిన సమస్యలు ప్రధానంగా చర్చిస్తుంది.

అధ్యయన ప్రాధాన్యతను దృష్టిలోవుంచుకొని ఈ కోర్సును డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సమాజశాస్త్రం స్నాతకోత్తర (పి.జి) కార్యక్రమంలో భాగంగా, రెండో సంవత్సరం ఎం.ఏ సోషియాలజీ విద్యార్థులకు అందిస్తోంది. ఈ కోర్సు అధ్యయనం వల్ల విద్యార్థులకు సామాజిక సమస్యలు, అవ్యవస్థకు కారణాలవుతోన్న వివిధ అంశాలపై అవగాహన కలుగడంతోపాటు, సమస్యల విశ్లేషణ పరిష్కారంలో శాస్త్రీయ దృక్పథం అలవడుతుందని ఆశిస్తున్నాం.

ఈ కోర్సులో మొత్తం 9 ఖండాలున్నాయి. ఇవన్నీ సమాజంలోని ప్రధాన సవాళ్లపై దృష్టి కేంద్రీకరిస్తాయి. అలాగే ఇందులో ఉన్న 29 భాగాలు ఆయా సమస్యల పట్ల అవగాహన కలిగిస్తాయి. సమాజశాస్త్రం, సంఘసంక్షేమశాస్త్రంలో నిపుణులైన అధ్యాపకులచే ఈ కోర్సులోని పాఠ్యాంశాలను రూపొందించాం. ఇది మా విద్యార్థులకు అన్ని రకాల ఉపయుక్తంగా ఉంటుందని ఆశిస్తున్నాం.

BRAOU

BRAOU

# విషయసూచిక


| | పేజీ నెం |
|---|---|
| **ఖండం-I: సామాజిక సమస్యలు: సిద్ధాంత దృక్పథాలు** | |
| భాగం-1: సామాజిక సమస్యలు-భావన, వర్గీకరణ | 3 |
| భాగం-2: జైవిక-మానవశాస్త్ర సిద్ధాంతాలు | 11 |
| భాగం-3: మనోవైజ్ఞానిక సిద్ధాంతాలు | 18 |
| భాగం-4: సామాజిక సిద్ధాంతాలు | 27 |
| **ఖండం-II: యువత, వృద్ధుల సమస్యలు** | |
| భాగం-5: యువత-అశాంతి | 45 |
| భాగం-6: యువత-జాతీయనిర్మాణం, అభివృద్ధి | 57 |
| భాగం-7: వృద్ధాప్యభావన | 66 |
| భాగం-8: ఆధునిక సమాజాలలో వృద్ధాప్యం | 74 |
| భాగం-9: భారతదేశంలో వృద్ధాప్యం | 84 |
| **ఖండం-III: హింస ఉద్రిక్తతలు** | |
| భాగం-10: హింస-కారణాలు, పర్యవసానాలు | 95 |
| భాగం-11: సామాజిక ఉద్రిక్తత-హింస | 105 |
| భాగం-12: హింస-నివారణ, అభివృద్ధి | 112 |
| భాగం-13: భారతదేశంలో కులం, మతం, సామాజిక ఉద్రిక్తతలు | 120 |
| భాగం-14: భారతదేశంలో సాముదాయక ప్రకర్షణలు-సముదాయాభివృద్ధికి సూచనలు | 135 |
| **ఖండం-IV : భావప్రసారం** | |
| భాగం-15: భావప్రసారం: సూత్రాలు, వైఖరులు | 143 |
| భాగం-16: భావప్రసారం-విస్తరణ: సూత్రాలు, పద్ధతులు | 154 |
| **ఖండం-V: వ్యక్తి సమస్యలు దృక్కోణాలు** | |
| భాగం-17: కేసుఅధ్యయనం-సమస్య నిర్ధారణ | 165 |
| భాగం-18: మనో సాంఘిక విశ్లేషణ, వ్యక్తి సమస్య పరిష్కారానికి మూలసూత్రాలు | 178 |
| భాగం-19: మార్గదర్శకత, కౌన్సెలింగ్: సూత్రాలు | 182 |
| **ఖండం-VI: సామూహిక సమ్యలు: దృక్కోణాలు** | |
| భాగం-20: సమూహ నిర్మాణం సూత్రాలు-నమూనాలు | 193 |
| భాగం-21: సమూహం-కార్యక్రమాలు-భాగస్వామ్యం | 206 |
| భాగం-22: నాయకత్వం-రకాలు-పాత్ర-అభివృద్ధి | 213 |


BRAOU

ఖండం-VII: సాముదాయిక సమస్యలు

భాగం-23: సముదాయ నిర్మాణం:భావన, సూత్రాలు, నమూనాలు 221

భాగం-24: సహభాగిత-గ్రామీణ కార్యక్రమాల మదింపు, సూక్ష్మ ప్రణాళిక 229

భాగం-25: సామాజిక కార్యాచరణ-భావన, సూత్రాలు 240

ఖండం-VIII: సామాజిక సమస్యలు

భాగం-26: ప్రజాభిప్రాయం వైఖరులు-ప్రజాసమీకరణ 258

భాగం-27: సామాజిక శాసనాలు-లాబీయింగ్-చట్టం రూపకల్పన-ఆచరణ 269

ఖండం-XII: స్వచ్ఛంద కార్యాచరణ: ఎన్.జి.వోలు

భాగం-28: స్వచ్ఛంద కార్యాచరణ-స్వచ్ఛంద సంస్థలు 283

భాగం-29: ప్రభుత్వేతర సంస్థలు-ప్రభుత్వ అన్యోన్య చర్యలు 293

BRAOU

# భాగం-1: సామాజిక సమస్యలు-భావన, వర్గీకరణ

విషయక్రమం


1.0 ఉద్దేశాలు

1.1 పరిచయం

1.2 సామాజిక సమస్యలు-భావన-వర్గీకరణ

1.3 సామాజిక సమస్యలు-లక్షణాలు

1.4 సామాజిక సమస్యలు-ప్రతిస్పందనలు

1.5 సామాజిక సమస్యలు-కారకాలు

1.6 సామాజిక సమస్యలు-రకాలు

1.7 ముగింపు

1.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

1.9 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 1.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సామాజిక సమస్య లేదా సాంఘిక సమస్య, దాని భావనలు తెలుసుకుంటారు.
- సామాజిక సమస్యలను వర్గీకరించగలుగుతారు.
- సామాజిక సమస్యల లక్షణాలు, కారణాలు, వాటిపట్ల సామాజిక ప్రతిస్పందనలను అర్థం చేసుకుంటారు.

## 1.1 పరిచయం

సమాజంలో అవ్యవస్థలు ఏర్పడినప్పుడు సామాజిక సమస్యలు ఏర్పడతాయి. సమాజంలో ఆమోదం పొందిన పద్ధతులు, విలువలు, ఆచార, సంప్రదాయాలకు భిన్నంగా వ్యవహరించడాన్నే అవ్యవస్థ అంటారు. వ్యక్తిగత అవ్యవస్థను వ్యక్తి అవ్యవస్థ అని సమాజంలో ప్రభావాన్ని కలుగజేసే సాముదాయిక, సామూహిక అవ్యవస్థలను సామాజిక అవ్యవస్థలు అంటాము. 'సామాజిక సమస్యలు, సమాజ స్థిరతను భంగపరుస్తాయి. అవ్యవస్థ ఏర్పడినందువల్ల సమాజంలో భాగంగా ఉన్న వ్యక్తుల శారీరక, ఆర్థిక, మానసిక ఆరోగ్యాలను భంగపరుస్తాయి. తద్వారా జాతీయ ఆదాయాన్ని తగ్గిస్తాయి. తలెత్తిన సామాజిక సమస్యను పరిష్కరించకపోతే, ఒక సమస్య విస్తృతమై మరొక సమస్యకు దారితీసి సమాజ విచ్ఛిన్నానికి కారణమవుతుంది. అందువల్ల సామాజిక సమస్యలను నియంత్రించడం, పరిష్కరించడం అవశ్యం. ఇందుకోసం సామాజిక సమస్యల స్వభావాన్ని, లక్షణాలను, కారణాలను, ప్రతిస్పందనలను క్షుణ్ణంగా అధ్యయనం చేయవలసి ఉంది. సమాజశాస్త్రంలో, అనుప్రయుక్త సమాజశాస్త్రం (Applied Sociology) ప్రధాన కార్యక్షేత్రం సమస్యల మూల శోధనే అని గమనించాలి. అందువల్ల సామాజిక సమస్యల అధ్యయనం అవశ్యం.

## 1.2 సామాజిక సమస్యలు -భావన-వర్గీకరణ

ఒక వ్యక్తికి సంబంధించిన అవ్యవస్థగా కాకుండా, సామాజిక అవ్యవస్థకు దారితీసే, సామూహిక సమస్యలను

సామాజిక సమస్య అంటారు. ఒక వ్యక్తి సమస్య, ఆ ఒక్క వ్యక్తికే సంబంధించినదై ఉన్నందువల్ల, సమాజం మీద ప్రభావం చూపే స్థాయిలో ఉండదు. కానీ, సామాజిక సమస్య, సమూహం మీద ప్రభావం చూపుతుంది. పేదరికం, నిరుద్యోగం, నేరం, మద్యపానం, మాదకద్రవ్యాల సేవనం, ఉగ్రవాదం, వ్యభిచారం లాంటివి వ్యక్తి సమస్యలు కావు. సామాజిక సమస్యలు. ఈ సమస్యలు ఎట్లా ఉత్పన్నమవుతున్నాయి. సామాజిక నిర్మాణం ఈ సమస్యలకు ఎంతవరకు హేతువు? సమాజంలో అంతర్భాగమైన వ్యక్తుల మధ్య మానవ సంబంధాలు సామాజిక సమస్యలకు ఎంతవరకు కారణం? అన్న విషయాల ఆధారంగా సామాజిక సమస్యల భావన ఏర్పడుతుంది. అదేవిధంగా ఈ సామాజిక సమస్యలు, సమాజం మీద కలిగిస్తున్న దుష్పరిణామాలు, వాటి నియంత్రణకు సమాజం సమష్టిగా తీసుకోవలసిన, నియంత్రణ లేదా, సంస్కరణ చర్యలు కూడా ఈ భావనలో భాగమే. సామాజిక సమస్యలకు కారణమైన, సామాజిక వ్యవస్థ ఎలా ఉండాలి? ఏ పునర్నిర్మాణం జరగాలి? అన్న విషయాలన్నింటిపైనా సామాజిక శాస్త్రవేత్తల అధ్యయనం జరుగుతుంది.

## కొన్ని భావనలు

'సామాజిక ఆదర్శం నుంచి దారిమళ్లి, సమూహ ప్రయత్నంతో దారికి రావడాన్ని' సామాజిక సమస్యగా వార్ష్ ఫర్ఫే అన్న సామాజిక శాస్త్రవేత్తలు అభివర్ణించారు. ఈ నిర్వచనంలో రెండు అంశాలున్నాయి. అవి: 1. సామాజిక ఆదర్శానికి మనిషి దూరం కావడం. ఇది అవాంఛనీయమైనది. 2. దారి మళ్లిన వారిని సమూహప్రయత్నంతో దారికి తేవడం. అంటే సమస్య, దానికి పరిష్కారం గురించి నిర్వచనం చెప్పేది. అయితే, సామాజిక ఆదర్శాల గురించి ఈ నిర్వచనంలో ప్రస్తావన ఉన్నందువల్ల, సామాజిక ఆదర్శమనే సాపేక్షిక విషయం ఏది మంచిది? ఏది చెడ్డది? అనే మీమాంసకు కారణం అవుతుంది. ఈ మీమాంసను తేల్చిచెప్పడం అంత సులువుకాదు. ఇది ప్రధానంగా ఆయా సమాజాల సాంఘిక ప్రవర్తనా నియమావళిపై ఆధారపడి ఉంటుంది. సమాజంలో ఏది ఆదర్శమో? ఏది మంచి? ఏది చెడో? అనే విషయాన్ని సామాజిక ప్రవర్తనానియమావళి నిర్దేశిస్తుంది. ఆ నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించినప్పుడే అది సామాజిక సమస్య అవుతుంది.

'సామాజికంగా పాటించవలసిన నియమాలను ఎక్కువ మంది ఉల్లంఘించినట్టయితే, ఆ పరిస్థితినే సామాజిక సమస్య అంటారు' అని ఫుల్లర్, మేయర్స్ అనే సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం.

BRAOU

సామాజిక ఏర్పాటులోనే వ్యక్తుల ఉమ్మడి భావన ఉంటుంది. కావున వ్యక్తి సమాజంలో భాగంగా, ఆ సమాజానికి ఉపయోగపడే విధంగా వ్యవహరించాలి. అట్లాగే సామాజికంగా ఏర్పడిన సమస్య కూడా ఒక వ్యక్తి ఒంటరిగా పరిష్కరించజాలనిదై ఉండాలి. ఉదాహరణకు మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వ్యక్తి, చికిత్స చేయించుకోవడం ద్వారా ఆ వ్యసనం నుంచి బయటపడవచ్చు. ఇది వ్యక్తిగత సమస్య. కానీ, అదే మాదకద్రవ్యాల అక్రమరవాణా, గంజాయిసాగు, దానికి సంబంధించిన నేర ప్రపంచం, 'మాఫియా' ఏర్పడడం లాంటివి సామాజిక సమస్యలు అవుతాయి. దీన్ని సామూహికంగా మాత్రమే పరిష్కరించగలం. అదేవిధంగా మాదక ద్రవ్యాల ప్రోత్సాహం, అమ్మకం, సాగు, పంపిణీ క్రమం లాంటివి సామాజిక నియమావళిని ఉల్లంఘించడం కనుక ఆ క్రమమంతా సామాజిక సమస్య అవుతుంది. అంటే వ్యక్తి సమస్యను వ్యక్తి పరింష్కరించుకుంటే, సామాజిక సమస్యను సమాజమే పరిష్కరిస్తుంది.

ఇక్కడ మరొక విషయం గుర్తుంచుకోవాలి. సామాజిక ఆమోదం, నియమావళి కూడా పరిస్థితుల మీద, మార్పు క్రమం మీదా ఆధారపడి ఉంటాయి. నిన్న సమస్యగా పరిగణించింది నేడు సమస్యగా కనిపించకపోవచ్చు. నిన్నటి సమస్యకు నేటి సమాజంలో ఆమోదం కూడా లభించవచ్చు. ఉదాహరణకు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన జాతీయోధ్యమంలో విద్యార్థి ఉద్యమాలు అశాంతి సమస్యకాదు. ఎందుకంటే అప్పటి విద్యార్థి ఉద్యమాలను జాతీయోద్యమ పోరాటాలుగా భావించారు. అదే స్వాతంత్ర్యం అనంతరం 1960, 1970 దశకాలలో జరిగిన విద్యార్థి ఉద్యమాలను అశాంతి, సామాజిక సమస్యలుగా భావించారు.

మెర్టన్, నిక్‌బెల్ అనే సామాజిక శాస్త్రవేత్తలు సామాజిక సమస్యను 'సాంఘిక నియమాలను ఉల్లంఘించే ప్రవర్తన' అన్నారు. అయితే ఈ నిర్వచనం సామాజిక దుష్ట సంప్రదాయాలైన మద్యపానం, లంచగొండితనం, అవినీతి,

మతతత్వం లాంటి వాటికి వర్తిస్తుంది. కానీ, అధికజనాభా లాంటి సామాజిక సమస్యలకుమాత్రం వర్తించదు. ఎందుకంటే కొన్ని సమస్యలు, సాధారణ ప్రవర్తననుంచి కూడా పుడతాయి.

రాబ్, సెల్‌నిక్‌లు ఈ సమస్యను ఇట్లా అభివర్ణించారు. 'సామాజిక సమస్య అధిక సంఖ్యాకుల ఆంక్షలను భగ్నం చేసి, సామాజికంగా భయ భీతావహం సృష్టించే మానవ సంబంధాల సమస్య' అని వారు నిర్వచించారు.

హోర్టన్, లెస్‌లీ అనే సామాజిక శాస్త్రవేత్తలు 'సామాజిక సమస్య అధిక సంఖ్యాకులపై ప్రభావం చూపుతూ 'అవాంఛనీయమైనది' అని అధిక సంఖ్యాకులు భావించేవిధంగా ఉంటుంది. దీన్ని సమాజం సమూహంగా వ్యతిరేకించి, నిలబడితే తప్ప సమసిపోని పరిస్థితే సామాజిక సమస్య' అని అన్నారు. అయితే ఈ నిర్వచనం ప్రకారం ఒక సమస్యను సమాజంలో అధిక సంఖ్యాకులు గుర్తించి, అవాంఛనీయమనుకోవాలి. ఇందుకు కొలమానం ఏమిటి? ప్రజల ప్రతిస్పందన. మరి ఈ ప్రతిస్పందనను తెలుసుకోవాలంటే, ఒక సమస్య గురించి ప్రసారసాధనాల అభిప్రాయం, అట్లాగే ప్రజల స్పందన అవసరం. ఉదాహరణకు 'పర్యావరణ పరిరక్షణ' అనేది వెనుకబడిన దేశాల్లో 1980ల దాకా ఒక సమస్యగా ఎవరూ భావించలేదు. కానీ ఇటీవలికాలంలో ప్రసారసాధనాలలో విపరీతంగా ఈ అంశంపై ప్రచారం జరగడంతో, ప్రజలు కూడా ప్రతిస్పందించి దాన్నొక సమస్యగా పరిగణిస్తున్నారు.

ఇక హోర్టన్, లెస్‌లీల భావనలో సామాజికంగా 'అవాంఛనీయత' అన్న విషయాన్ని కూడా పరిశీలిద్దాం. అవాంఛనీయత అనగానే ఒక సామాజిక సమస్యను గుర్తించడంలో ఏది అవాంఛనీయత, ఏది కూడనిది? అన్న విలువల తీర్పు (Value Judgement) మిళితమై ఉందన్న విషయాన్ని గుర్తించాలి. అంటే ఒక సమాజంలో అప్పుడున్న విలువల ప్రకారమే 'అవాంఛనీయత'ను గుర్తించగలం. ఉదాహరణ సతీసహగమనం. దీన్ని ప్రజలు ఒక ఆచారంగా సాంప్రదాయంగా అమలుపరిచినంతవరకు ఒక సమస్య కాదు. కానీ రాజారామ్ మోహన్‌రాయ్ లాంటివారు ఇది దుష్ట సాంప్రదాయం, మూఢాచారం అని దీన్ని నిర్మూలించాలని ఉద్యమం లేవనెత్తినప్పుడు సమాజం దాన్ని ఒక సామాజిక సమస్యగా గుర్తించింది. ఎన్నో ఏళ్లుగా పాతుకుపోయిన కొన్ని సమస్యలను, విలువలను తీర్పువల్ల, మారిన కాలమాన పరిస్థితులవల్ల సామాజిక సమస్యలుగా గుర్తించడం చూడవచ్చు. అవినీతి, స్త్రీలపై హింస, పిల్లలపై వేధింపులు లాంటివి ఇందుకు మంచి ఉదాహరణలు.

BRAOU

లయితే, సామాజికంగా ఏర్పడిన సమస్యలలో, అసలు మార్చడానికి వీలుకాని సమస్యలను కూడా సాంఘిక సమస్యగా భావించరు. ఇటీవలి కాలం వరకు కరువును ఒక సమస్యగా భావించలేదు. కానీ, అనంతపురం, మహబూబ్‌నగర్‌లాంటి ప్రాంతాలలో కరువే ఒక సామాజిక సమస్య. ఈ సమస్యకు పరిష్కారాలు వెదుకుతున్నారు. అట్లాగే మంచినీటి సమస్య. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్‌లలో మంచినీటి సమస్యను నివారించే మార్గాలు ఉన్నాయని గుర్తించినందువల్లే దాన్నొక సామాజిక సమస్యగా భావిస్తున్నారు.

ముందుగా పేర్కొన్న విధంగా హోర్టన్, లెస్‌లీ నిర్వచనంలో చివరిభాగం 'సామూహిక చర్య' ద్వారా సమస్య నివారణ. సామూహిక చర్య అనే సాంఘిక చర్య ద్వారా మాత్రమే ఒక సామాజిక సమస్య పరిష్కారమవుతుంది. అన్నదే ఈ భావన. అంటే సామాజిక సమస్యలను ఏ ఒక్క వ్యక్తి విడిగా పరిష్కరించజాలడు. సమాజమే ప్రజల గురించిన పట్టింపుతో చర్చలు, అభిప్రాయాల రూపకల్పన, అంతిమంగా ఒత్తిడి తెచ్చినప్పుడు మాత్రమే సామాజిక సమస్యలు పరిష్కారం అవుతాయి.

ఈవిధంగా ఆయా నిర్వచనాల అనుసారంగా సామాజిక సమస్యలను వర్గీకరించవచ్చు.

## 1.3 సామాజిక సమస్యలు-లక్షణాలు

మెయిన్‌బెర్గ్ అనే సామాజిక శాస్త్రవేత్త సామాజిక సమస్యలకు సంబంధించి ఆరు లక్షణాలను వివరించారు. అవి:

1. సామాజికంగా ఏదైతే అవాంఛనీయమైనదో, సమాజం ఆ కాలమాన పరిస్థితుల్లో దేన్నైతే అవాంఛనీయం

అనుకుంటుందో, అదే సామాజిక సమస్య. కొన్ని సమస్యలను సమాజం సాంఘిక సమస్యగా గుర్తించదు. ఉదాహరణకు మద్యపానాన్ని సమాజం సమస్యగా గుర్తించకపోతే, అది అవాంఛనీయం అనుకోకపోతే అది సాంఘిక సమస్య కాదు. కానీ, మద్యపానం వల్ల కలుగుతున్న దుష్పరిణామాలను గుర్తించి, నివారణ కోసం సమాజం ప్రయత్నిస్తే దాన్ని తప్పనిసరిగా సామాజిక సమస్యగా భావించవచ్చు.

2. ప్రవర్తనా సరళిని బట్టి సాంఘిక సమస్యగా గుర్తించడం. అంటే సాంఘిక సమస్యలు అప్పటికి ఆమోదయోగ్యమైనప్పటికీ ప్రవర్తనారీతుల వల్లకూడా సమస్యలు మారతాయి. ఒకప్పుడు మానసిక వైకల్యాన్ని కుటుంబానికి సంబంధించి అవమానకరంగా భావించేవారు. కానీ ఇప్పుడదొక గతి తప్పిన ప్రవర్తనా రీతిగా భావించి ఆసుపత్రికి తీసుకెళుతున్నారు.

3. సమాచార మాధ్యమాలు, వార్తాపత్రికలు, టెలివిజన్, రేడియోలాంటి వాటి ద్వారా ప్రచారం పొందే సమస్యలు. వాటి ద్వారా సామాజిక సమస్యలను గుర్తించే విధంగా ప్రజాభిప్రాయం ఏర్పడుతుంది.

4. సామాజిక సమస్యలు, ఆయా సమాజాలలోని విలువలు, సాంఘిక సంస్థల నిర్మాణంపై ఆధారపడి ఉంటాయి. ఒక సమాజంలోని సమస్యకు, మరొక సమాజంలోని సమస్యకు తేడా ఉంటుంది. ఉదాహరణకు అమెరికాలోని నల్లజాతి ప్రజలు, భారతదేశంలోని దళితులు ఇద్దరూ ఒకే రకమైన వివక్ష ఎదుర్కొంటున్నప్పటికీ అందుకు సంబంధించి సామాజిక సమస్యలక్షణాలు ఒక్కటి కాదు.

5. సామాజిక సమస్యల మీద, సామాజిక సంబంధాలు, సమూహ ప్రక్రియల ప్రభావం ఉంటుంది. ఐతే ఈ విషయాల ప్రభావం సామాజిక సమస్యలపై ఎంత ఉందనే విషయాన్ని గుర్తించాలి.

6. సామాజిక సమస్యలకు, చరిత్రతో సంబంధం ఉంటుంది. అంటే ఒక సామాజిక సమస్యకు ప్రత్యేక పరిస్థితులు, అప్పటి రాజకీయ, సాంఘిక సంఘటనల నేపథ్యం, తదితర అంశాలు కూడా కారణం అవుతాయి. అందువల్ల ఒకే సమస్యగా కనిపించే అనేక సమస్యలు ఒక్కటిగా ఉండవు. ఉదాహరణకు శరణార్థుల సమస్యను తీసుకుందాం. 1968లో అస్సాంలో శరణార్థులుగా ఉన్నవారికీ, 1947-48 దేశవిభజన సమయంలో భారత దేశంలో శరణార్థులు అయిన వారి సమస్యకు తేడా ఉంది. ఈ తేడాను అర్థం చేసుకోవడానికి విధిగా చరిత్ర పరిజ్ఞానం అవసరమవుతుంది.

BRAOU

**లక్షణాలు**

1. సామాజిక సమస్యలు అన్నీ సామాజిక ఆదర్శాలనుంచి గతితప్పినవి.
2. సామాజిక సమస్యలన్నింటికీ పునాది ఒక్కటే.
3. అన్ని సామాజిక సమస్యలకు సమాజంలో అంతర్భాగంగా ఉండే సామాజిక పరిస్థితులే కారణం. మూలం ఒక్కటే.
4. సామాజిక సమస్యలన్నింటికీ ఒకదానితో ఒకటి పరస్పర సంబంధం ఉంటుంది.
5. సామాజిక సమస్యలు సమాజంలోని అన్ని వర్గాల మీదా ప్రభావం చూపుతాయి.
6. సామూహికంగా ప్రతిస్పందించకుండా, సామూహిక చర్య లేకుండా ఈ సమస్యలు పరిష్కారం కావు.

## 1.4 సామాజిక సమస్యలు - ప్రతిస్పందనలు

ఒక సామాజిక సమస్య గురించిన సామాజిక స్పందనలు కూడా భిన్నంగా ఉంటాయి. వివిధ సమూహాలు, వర్గాలు, రకాల ప్రజలు సామాజిక సమస్యల పట్ల భిన్నంగా స్పందిస్తారు. ఈ భిన్న ప్రతిస్పందనలను నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. ప్రతిస్పందించిన తీరుపై ఈ వర్గీకరణ ఆధారపడి ఉంటుంది.

### 1. నిర్లక్ష్యవైఖరి

సామాజిక సమస్యల పట్ల అధిక సంఖ్యాకులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తారు. సమస్యను సరిగ్గా గుర్తించగలిగిన చైతన్యవంతమైన సమాజంగా అభివృద్ధి చెందని వెనుకబాటు సమాజంలో ఇది ఎక్కువ. వ్యక్తి ఒక సమస్యను తనదాకా రానంతవరకు గుర్తించడు. తన చుట్టూ తాను గిరిగీసుకొనే ధోరణివల్ల, సమాజం పట్టనందువల్ల ఈ పరిస్థితి తలెత్తుతుంది. అట్లాగే కుటుంబంలో ఒత్తిళ్లు, ఉద్యోగ విధులు, ఆర్థిక సమస్యలు లాంటి ఒత్తిళ్లు కూడా ఒక వ్యక్తిని సామాజిక సమస్యలను పట్టించుకోనీయకుండా చేస్తాయి.

### 2. ఖర్మసిద్ధాంతం

భారతదేశం లాంటి దేశాలలో 'ఖర్మ' సిద్ధాంతాల వల్ల కూడా సామాజిక సమస్య పట్ల ప్రతిస్పందన కనబడదు. ఖర్మానుసారమే ప్రపంచంలోని అన్ని విషయాలూ జరుగుతాయని, ఆ విధంగానే ప్రపంచం నడుస్తుందని భావించే వారు, అన్ని సమస్యలకూ, ఖర్మకూ ముడిపెడతారు. అందువల్ల పేదరికం, నిరుద్యోగం లాంటి సమస్యలను కూడా 'మన ఖర్మ' అనుభవించవలసిందే అనుకుంటారు. అందువల్ల సామాజిక సమస్యల పట్ల స్పందన ఉండదు.

### 3. స్వలాభాపేక్ష

సమాజంలో కొందరు స్వీయ ప్రయోజనాలకోసం, స్వార్థ చింతనతో, స్వలాభాపేక్షతో సామాజిక సమస్యలను సృష్టిస్తుంటారు. వాటికి ఇక ఏరకంగానూ పరిష్కారాలు లేవని చెబుతుంటారు.

### 4. నిపుణత కొరత

సమాజంలో సమస్యల పట్ల ప్రతిస్పందించేంత నిపుణత, ప్రావీణ్యత కొరవడడం కూడా సామాజిక స్పందనలు లేకపోవడానికి కారణం, మరికొందరు వాస్తవ విరుద్ధమైన విశ్వాసాలతో మిడిమిడి జ్ఞానంతో కూడా సమస్యలపట్ల అలక్ష్యంగా ఉంటారు.

BRAOU

## భిన్న స్పందనలు

1. ఒకవంక సామాజిక స్పందనలు లేకుండా ఉంటే మరోవంక సామాజిక సమస్యలన్నింటి పట్లా ఒకే ప్రతిస్పందన కనిపించదు. అట్లాగే, ఈ సమస్యల పట్ల స్పందనలు వేర్వేరుగానూ, భిన్నమైనట్టుగానూ కనబడతాయి. ఉదాహరణకు మాదకద్రవ్యాలు. కొందరికే ఈ సమస్య పరిమితమైంది కనుక ఇది సమస్యే కాదని కొందరంటారు. మరికొందరు అంటరానితనం ఇంకా సమస్యగా ఉందా? అని అడుగుతుంటారు.

2. సామాజిక సమస్యలు ప్రకృతి వల్ల ఏర్పడ్డాయని, నమ్మేవాళ్లున్నారు. మానవుని చేతుల్లో ఏమీ ఉండదని అంతా ప్రకృతి సిద్ధంగా ఏర్పడిందనేది అంతర్గతంగా వీరి వాదన. కానీ ఏ సమస్యా మానవాతీతంగా ఉండదు. ప్రతీ సమస్యకూ పరిష్కారం ఉంటుంది.

3. సామాజిక సమస్యల గురించి ఎంత ఎక్కువ మాట్లాడితే అంతగా అవి పెరుగుతాయని నమ్మేవాళ్లు కూడా ఉన్నారు. ఇది పొరపాటు ఆలోచన. ప్రస్తావనల వల్ల, కేవలం వాటి గురించి మాట్లాడడం వల్ల సమస్యలు పెరగవు.

4. కేవలం దుష్టుల వల్ల, చెడ్డవారి వల్ల మాత్రమే సమస్యలు ఉత్పన్నమవుతాయని ఆలోచించేవారుకూడా ఉన్నారు. ఇది కూడా తప్పుడు ఆలోచనే. మంచివారు వక్రదారి పట్టినప్పుడు, లేదా నిర్లక్ష్యంతో వ్యవహరించినప్పుడు కూడా సామాజిక సమస్యలు ఉద్భవిస్తాయి.

5. సామాజిక సమస్యలు పరిష్కారం కావాలని కూడా అందరూ కోరుకోరు. కొందరి స్వార్థపరత్వం కూడా

సమస్యల పరిష్కారాన్ని కోరుకోదు. నిరుద్యోగం లాంటి సమస్య పరిష్కారం అయితే, తక్కువ వేతనాలకు పనివాళ్లు దొరకనందున ధనికులు నిరుద్యోగ సమస్యను గుర్తించి, అది పరిష్కారం కావాలని కోరుకోరు.

6. సామాజిక సమస్యలు కాలంతోపాటే పరిష్కారమవుతాయని, అందువల్ల వాటిని కాలానికి వదిలేయాలని మరికొందరు భావిస్తారు. వాటిని పట్టించుకోకుండా ఉంటే సమస్యలు వాటంతటవే పరిష్కారం అవుతాయని కొందరు నమ్ముతారు.

7. ఏవో కొన్ని సంగతులు వాటికవే సామాజిక సమస్యలను పరిష్కరిస్తాయని నమ్మేవాళ్లు కూడా ఉంటారు. ఇది అసంగతం. సామాజిక సమస్యల పరిష్కారానికి వాటి మూలాలను శోధించి, శాస్త్రీయ పద్ధతులను అవలంభించవలసి ఉంటుంది. సమస్యలు వాటంతటవే పరిష్కారం కావు.

సామాజిక సమస్యలు సామాజిక స్థితిగతుల ద్వారా ఉద్భవిస్తాయని ముందే చెప్పుకున్నాము. సంస్థాగతంగా ఎలాంటి మార్పులు రాకుండా, సామాజిక మూలాలు కలిగి ఉన్న సమస్యలు పరిష్కారం కావు. ఒక సమస్య పరిష్కారానికి, ఆసమస్యకు మూలమైన సంస్థాగత మార్పులు జరగాలి. మూలమేదో పరిష్కారం కాకుండా ఉపరితలంగా ఉన్న ఆలోచనలు, ధోరణులు, ఆచరణ, విలువలు మాత్రమే మారితే సమస్య పరిష్కారం కాదు. ఒక్కొక్కప్పుడు సామాజిక సమస్యల ఒక పరిష్కారం మరొక కొత్త సమస్య ఉద్భవించడానికి కూడా కారణం కావచ్చు.

## 1.5 సామాజిక సమస్యలు-కారణాలు

BRAOU

సమాజ పునాదులను పురుగులా ఆశించి సమాజాన్ని క్షీణింపజేసేవే సామాజిక సమస్యలు. అన్ని సమాజాలలోనూ ఆ సమాజమూలాల్లోనే సమస్యల మూలాలు కూడా ఉంటాయి. ఇవి బహిర్గతమై సామాజిక అవ్యవస్థకు కారణమవుతాయి. సామాజిక సమస్యలు ఏర్పడడానికి ప్రధాన కారణాలు రెండు. అవి:

1. వ్యక్తులవల్ల ఏర్పడేవి.
2. సామాజిక పరిసరాల్లోంచి ఉద్భవించినవి.

వ్యక్తులవల్ల ఏర్పడే సమస్యలు తీసుకున్నప్పుడు అంగవైకల్యం మంచి ఉదాహరణ. మనిషికి ఏ ప్రమేయం లేకుండానే, వారసత్వంగాకూడా ఈ సమస్య రావొచ్చు. లేదా, నిర్లక్ష్యం కారణంగా కూడా రావచ్చు.

సామాజిక పరిసరాలవల్ల తలెత్తే సామాజిక సమస్యలు ఈ క్రింది పరిస్థితుల్లో ఏర్పడతాయి. అవి:

1. సామాజిక వ్యవస్థాగత లోపాలు.
2. ఆర్థిక వ్యవస్థ లోపాలు.
3. మత వ్యవస్థలో జడత్వం.
4. రాజకీయ వ్యవస్థ లోపభూయిష్టం కావడం.

సామాజిక సమస్యలు ఉత్పన్నం కావడానికి గల మూడు కారణాలను 'రెయిన్ హార్ట్' ఇలా పేర్కొన్నారు.

1. సమాన అవకాశాలకోసం రెండు సమూహాలు లేదా రెండు వ్యవస్థల మధ్య పోరాటం వల్ల ఒక యంత్రంలో అన్ని భాగాలు దేని పని అది చేసినప్పుడే ఆ యంత్రం సక్రమంగా పనిచేస్తుంది. ఏ విడిభాగం విధి నిర్వహించలేకపోయినా మొత్తం యంత్రమే పనిచేయదు. అట్లాగే సమాజంలోని మనుషులందరూ సమాన అవకాశాలతో పనిచేస్తేనే సామాజిక సుస్థిరత ఏర్పడుతుంది. కానీ, ఒకరి అవకాశం ఒకరికి నిరాకరణ అన్నట్టుగా

కొందరికే అవకాశాలు వుండడం ఘర్షణలకు దారితీస్తుంది. అందువల్లే వర్గపోరాటాలు, కులపోరాటాల వంటి సమస్యలు ఏర్పడతాయి.

2. సామాజిక మార్పుల వేగం పెరుగుదల, ఆధునికీకరణ పెరుగుదల కొత్త పరిశోధనలు, సాంస్కృతిక పునరుజ్జీవన యుగం తర్వాత మానవుడి ఆవిష్కరణలు, యంత్రాలు కనుగొనడం, శాస్త్రీయ విప్లవం లాంటివి పలు సామాజిక మార్పులను వేగవంతం చేశాయి. నిశ్చలంగా ఉన్న సమాజం కుదుపులకు లోనయింది. దీనివల్ల సామాజిక సమస్యలు తలెత్తాయి. అదేవిధంగా యంత్రాల ఆవిష్కరణ అప్పటి సమాజాల్లో కార్మికులకు, వ్యవసాయకూలీలకు పనిలేకుండా చేసింది. దానివల్ల కొత్త వర్గపోరాటాలు జరిగాయి.

3. హేతువు ఆధారంగా జ్ఞానం పెరిగిన తర్వాత మనిషిలో జిజ్ఞాస కూడా పెరిగి, ప్రతీ విషయం పట్లా శాస్త్రీయ వివేచన కలగడం కూడా సమస్యలకు ఒక కారణం ఎందుకంటే, పాత విలువలను, ఆచార, సాంప్రదాయాలను, భావనలను శాస్త్రీయ వివేచనతో పరిశీలించినప్పుడు ఘర్షణ ఏర్పడింది. అట్లాగే ప్రకృతిలోగల చాలా సమస్యలు ఇప్పుడు తీవ్రతరమయ్యాయి. అందుకు పర్యావరణం ఒక ఉదాహరణ.

## 1.6 సామాజిక సమస్యలు-రకాలు

కారెన్స్ మార్షల్ సామాజిక సమస్యలను నాలుగు రకాలుగా గుర్తించారు. అవి:

1. భౌతిక పరిస్థితుల మూలంగా ఉత్పన్నమయినవి.
2. జనాభా పెరుగుదల కారణంగా ఉత్పన్నమైనవి.
3. సామాజిక అవ్యవస్థ కారణంగా ఏర్పడినవి.
4. సామాజిక సాంస్కృతిక విలువలలో ఏర్పడిన మార్పుల వలన ఉత్పన్నమయినవి.

BRAOU

ఫుల్లర్, మేయర్‌లు సామాజిక సమస్యలను మూడు రకాలుగా వర్గీకరించారు. అవి:

### 1. భౌతిక సమస్యలు

అంటే ప్రకృతిపరంగా ఏర్పడిన సమస్యలు. అంతిమంగా సమాజంమీద ఇవి ప్రభావం చూపుతాయి. ఇవి మానవ సంబంధాలలో విలువల ఘర్షణల వల్ల ఏర్పడినవి కావు. ఉదాహరణకు: వరదలు, కరువు

### 2. స్థితి మెరుగుదల సమస్యలు

సామాజిక సమస్యల ప్రభావం గురించి ఏకాభిప్రాయం వుందికానీ అవి మెరుగుపడే విషయంలో సామాజికంగా భిన్న ప్రతిస్పందనలు ఉంటాయి. సమాజం ఆధునికీకరణ పొందుతున్నకొద్దీ సమస్యలు తీవ్రతరమవుతాయి. ఇవి క్రమానుగతంగా మెరుగుపడి పరిష్కారం అవుతాయి.

### 3. నైతిక సమస్యలు

సమాజ ఆమోదం పొందని రీతులు, ప్రవర్తనలను సమాజం ఆమోదించదు. సమాజ విలువల ఆధారంగా ఈ నైతికత అలవడుతుంది. నైతికత సాపేక్షికమైన విలువే కాబట్టి వీటి గురించిన ఏకాభిప్రాయం మాత్రం ఉండదు. ఉదాహరణకు: విడాకులు.

## 1.7 ముగింపు

సామాజిక సమస్యలు, సామాజిక మూలాలనుండి ఉద్భవిస్తాయి. సమాజంలో అవ్యవస్థకు కారణమయ్యే పరిస్థితులనే సామాజిక సమస్య అంటారు. ఒక వ్యక్తి అవ్యవస్థగా కాకుండా, ఒక సమస్య సమాజం మొత్తం మీద

ప్రభావం పడవేసి, సామాజిక స్థిరతను దెబ్బతీస్తుంది. 'సామాజిక ఆదర్శం నుండి దారిమళ్లి, సామూహిక ప్రయత్నంతో దారికి రావడాన్నే' సామాజిక సమస్యగా శాస్త్రవేత్తలు భావించారు. అయితే, ఒక సామాజిక సమస్యకు సామాజిక ప్రతిస్పందనలుంటాయి. ఇవి భిన్నంగా ఉంటాయి. ఈ ప్రతిస్పందనల కారణంగా సమాజం ప్రతిస్పందించి, సమస్యకు పరిష్కారం వెదుకుతుంది.

## 1.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. సామాజిక సమస్య నిర్వచనాలు తెలుపండి? భావనలను వివరించండి?
2. సామాజిక సమస్యల లక్షణాలు వివరించండి?
3. సామాజిక సమస్యల కారణాలను వివరించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. సామాజిక సమస్యలకు ప్రతిస్పందనలు ఏమిటి?
2. సామాజిక సమస్యల కారణాలు రాయండి?
3. సామాజిక సమస్యల రకాలు పేర్కొనండి?

## 1.9 చదవదగిన పుస్తకాలు


1. Modern Sociological Thoutht- An Introduction, Fransis Abraham, M.
2. Modern Sociological Theory-Colen Perry


BRAOU

# భాగం-2: జైవిక మానవ సిద్ధాంతాలు

విషయక్రమం


2.0 ఉద్దేశాలు

2.1 పరిచయం

2.2 జైవిక మానవ శాస్త్రం విభాగాలు

2.3 జైవిక మానవశాస్త్ర సిద్ధాంతం

2.3.1 మానవ పరిణామం- బహువర్గ సిద్ధాంతం

2.3.2 మానవ పరిణామం-ఏకవర్గ సిద్ధాంతం

2.3.3 పూర్వ నియాండర్ థాల్ సిద్ధాంతం

2.3.4 ప్రి-సేపియన్స్

2.4 జన్యుశాస్త్ర సంబంధిత సిద్ధాంతాలు

2.4.1 మెండల్ ప్రముఖ గుణ న్యాయం

2.4.2 మెండల్ సెగ్రిగేషన్ సిద్ధాంతం

2.4.3 వ్యత్యాసాలు-మెండల్ భావనలు

2.4.4 అనువంశికత-బాహ్య ప్రవృత్తి

2.5 ముగింపు

2.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

2.7 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 2.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- మానవశాస్త్ర విభాగాలలో శారీరక మానవశాస్త్రం జైవిక మానవ శాస్త్రం ఒక భాగమని తెలుసుకుంటారు.
- జైవిక మానవ శాస్త్ర సిద్ధాంతాలు ప్రైమేట్, శిలాజమానవుని గురించి వివరించగలరు.
- మానవ పరిణామం, జాతుల ఉత్పత్తి లాంటి వాటి గూర్చి తెలుసుకుంటాము.

## 2.1 పరిచయం

మానవుని గురించి సమగ్ర అధ్యయనం, శాస్త్రీయ. అధ్యయనం చేసేదే మానవశాస్త్రమని అనేక మంది మానవశాస్త్రవేత్తలు వివరించారు. ప్రసిద్ధ తత్వవేత్త అరిస్టాటిల్‌ను (క్రీ.పూ. 384-322) మానవశాస్త్రానికి పితామహునిగా భావిస్తున్నారు. పునరుజ్జీవన కాలంలో మానవశాస్త్రాన్ని మానవుని భౌతిక, నైతికాంశాల అధ్యయనంగా నిర్వచించారు. ప్రముఖ మానవశాస్త్ర వేత్తలు మానవుడి వివిధాంశాలను ప్రాతిపదికగా తీసుకుని మానవశాస్త్రాన్ని ఉపవిభాగాలుగా విడగొట్టారు. దీని ఫలితంగా మానవశాస్త్రాన్ని రెండు ప్రధాన క్షేత్రాలుగా విభజించారు. శారీరక మానవశాస్త్రం లేదా

జైవిక మానవశాస్త్రం, సాంస్కృతిక మానవశాస్త్రం లేదా సామాజిక మానవశాస్త్రం.

జైవిక లేదా శారీరక మానవశాస్త్రం మానవ పరిణామం గూర్చి తులనాత్మక జంతు, వృక్ష రూప పరిశీలన శాస్త్రం, ప్రజలలో కాలక్రమేణా జైవిక వ్యత్యాసాలు, ఉత్పన్నమయ్యే యంత్రాంగాన్ని మొదలైన వాటిని గూర్చి అధ్యయనం చేస్తుంది.

ఇటీవలికాలంలో మానవశాస్త్రం శబ్ద లక్షణపరంగా అన్ని ప్రాంతాలలో, అన్ని స్థాయిలలోనూ సంక్లిష్టతను సంతరించుకొన్న మానవజాతి అధ్యయనమని తేల్చారు. ఫలితంగా మానవశాస్త్రాన్ని వివిధ ఉప విభాగాలుగా విభజించడం సైతం పునఃపరిశీలించారు. ఇప్పుడు శారీరక మానవశాస్త్రం, జైవిక మానవశాస్త్రం ఒక దానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయి.

## 2.2 జైవిక మానవశాస్త్రం-దాని విభాగాలు

జైవిక మానవశాస్త్రాన్ని ఐదు ముఖ్యమైన విభాగాలుగా చెప్పవచ్చు. అవి: 1. మానవ పరిణామం (Human Evolution), 2. మానవ జీవశాస్త్రం (Human Biology), 3. మానవమితి (Anthropometry ), 4. జాతి విజ్ఞాన శాస్త్రం ( Raciology), 5. అనుప్రయుక్త శారీరక మానవ శాస్త్రం (Applied Physical Anthropology ).

## 2.3 జైవిక మానవ శాస్త్ర సిద్ధాంతాలు

BRAOU


జైవిక మానవ శాస్త్రంలో ముఖ్యభాగమైనటువంటి మానవ పరిణామం గూర్చి మొదట తెలుసుకుందాం. ప్రస్తుతం జీవించి ఉన్న ప్రైమేటు, లేదా తొలి క్షీరద జీవాలు-జంతువుల లక్షణాలను, శిలాజప్రైమేట్‌ల శారీరక లక్షణాలను మానవలక్షణాలతో పోల్చి, మానవులు ఏవిధంగా ప్రైమేటు క్రమంలో పరిణతి పొందినారో మానవ పరిణామ సిద్ధాంతాలు వివరిస్తాయి.

మానవుడు, కోతులు కూడా పిథికాయిడ్ స్థాయి వరకు ఒకే పరిణామ మార్గాన్ని అనుసరించినట్లు, ఆ తరువాత కోతులు ప్రత్యేక శాఖగా వృద్ధిచెందగా ఇంకొక శాఖ ద్వారా మానవుడు ఏప్ (Ape ) రూపాన్ని పోలిన జీవిగా పరిణతి చెంది చివరకు తన ప్రస్తుత రూపాన్ని పొందినట్లు ప్రముఖ సామాజిక శాస్త్ర వేత్త థామస్ హక్స్లీ(Thoma Huxely) అభిప్రాయపడ్డారు. కానీ, మానవుడు ఏప్‌లను పోలిన జీవులనుంచి కాక పాత ప్రపంచం కోతుల నుండి పరిణామం చెందినాడని ఫ్రెంచి మానవ శాస్త్రజ్ఞుడు మార్సెల్‌య్ బౌల్ (Marceleie Boule) అభిప్రాయపడ్డాడు. దీనిని విలియమ్.ఎల్.స్ట్రాస్ (William L. Strauss Junior) జూనియర్ తన అధ్యయనం ద్వారా శరీర నిర్మాణంలో కోతులకు, మానవులకు కొన్ని సారూప్యతలున్నాయని బలపరిచాడు.

జీవశాస్త్రం, జంతు శాస్త్ర వర్గీకరణ రీత్యా మానవ జాతి అంతా ఒకే జాతిగానూ ఒకే ప్రజాతి(Genus)గానూ పరిగణింపబడుతుంది. కానీ ప్రపంచంలోని వివిధ దేశాలలో నివసిస్తున్న భౌతిక స్వభావాలున్న మానవులు వివిధ తెగలకు చెందినట్టుగా వర్గీకరణ చేయడం జరిగింది.

### 2.3.1 మానవ పరిణామం- బహువర్గ సిద్ధాంతం

వీడెనర్‌రీచ్ మొదలైన శాస్త్రజ్ఞులు ఈ సిద్ధాంతాన్ని బలపరిచారు. ప్రపంచంలోని వివిధ ఖండాలలోగానీ, వివిధ ప్రదేశాలలోగానీ, ఇప్పుడు నివసిస్తున్న ముఖ్యమైన తెగలకు చెందిన మానవులు అక్కడికక్కడ ఎవరికి వారు, మరొక ప్రాంతం వాళ్లతో సంబంధం లేకుండానే వివిధ రకాల శిలాజ మానవులనుంచి పరిణామం చెంది వుండవచ్చునని ఈ సిద్ధాంతం ద్వారా తెలుసుకోవచ్చు.




పై పటంలో చూపిన విధంగా ఆస్ట్రేలియన్‌లు, మంగోలియన్‌లు, ఆఫ్రికన్‌లు మరియు యురేషియన్‌లు అనేక దశలలో పరిణామం చెంది ఉండవచ్చునని 'రీచ్' భావన. తదుపరి ఈ సిద్ధాంతాన్ని సవరించి, నాల్గవ హిమానీనద యుగానికి చెందిన నియాండర్‌తల్ మానవునినుంచి ఇప్పుడు జీవించి ఉన్న ఏ తెగకు చెందిన మానవుడూ పరిణామం చెందలేదని ఇతడు భావించినాడు. అదీగాక, వివిధ తెగల ప్రజలు ఒకచోట నుంచి మరొక చోటికి వలసపోవడం వల్ల ఈ పరిణామం చెంది వుండవచ్చునని అభిప్రాయపడినాడు. వివిధ మానవ తెగల పరిణామం ఒకేసారి వివిధ ప్రాంతాలలో సమాంతరంగా జరిగిందని తద్వారా పరిణామ సంసరణానికి (Evolutionary Convergency) ప్రాముఖ్యతను సంతరింపచేశాడు.

B R A O U

## 2.3.2 ఏకవర్గ సిద్ధాంతం

ఏకవర్గ సిద్ధాంతాన్నే నియాండర్ తల్ ఫేజ్ సిద్ధాంతమని కూడా అంటారు. మొదట దొరికిన శిలాజమానవుల శిలాజఅస్థికలు పరిశీలించగా పితి కెంత్రోపస్ నియాండర్‌తాల్ మానవుడు క్రోమేగ్నన్ ద్వారా హోమోసేపియన్స్‌గా పరిణామం చెందగా, తదుపరి దశలో మానవుడు పరిణామం చెందుటకు రొడీషియన్, సోల్ మానవులు కారకులై ఉండవచ్చుననని కొంతమంది శాస్త్రజ్ఞులు అభిప్రాయపడ్డారు.

## 2.3.3 పూర్వ నియాండర్‌తాల్ సిద్ధాంతం

నియాండర్‌తాల్ మానవుని శిలజ అస్థికలను రెండు రకాలుగా విభజించాడు. ఒకటి, వృద్ధి చెందనిది. రెండవది, వృద్ధి చెందిన నియాండరత్ మానవుడు. తొలినియాండర్‌తాల్ మానవుని శిలాజాస్థికలు 1908వ సంవత్సరంలో ఫ్రాన్స్ దేశంలో కొర్రేజ్ డిపార్ట్‌మెంట్‌లో ఒక గుహలో దొరికినాయి. మార్సలిన్ బౌల్ అనే శాస్త్రజ్ఞుడు వీటిని క్షుణ్ణంగా పరిశీలించారు.

తొలినియాండర్‌తాల్ మానవుని మస్తిష్కలంబికలన్నీ పితికెంత్రోపస్‌లో కంటే ఎక్కువగా వృద్ధిచెందినాయి. నిమ్నలతాటిక రేఖ బాగా వృద్ధి చెందడం వల్ల వీరికి మాట్లాడే శక్తి ఉండేదని చెప్పవచ్చు. ఈ మానవులతో మాట్లాడే శక్తి ఇంతవరకూ ఏ శిలాజ మానవులలో వృద్ధి చెందినంతగానూ వృద్ధి చెందిదని బెల్లీ అభిప్రాయపడ్డారు.

వృద్ధి చెందిన నియాండర్‌తల్ మానవుడి కపాల శిలాజాస్థికలు జర్మనీలోని దుయినర్ దగ్గరున్న గనులలో 1925లో

విర్టింగ్స్ డాల్ఫ్ రకం దొరికాయి. తర్వాత 1935లో వుర్టంబర్గ్ దగ్గరలో స్టీన్‌హీమ్ మానవుని కపాలాస్థికలు లభించినాయి.


జూనర్ అనే శాస్త్రవేత్త అంచనాల ప్రకారం స్టీన్ హీమ్ మానవుడు దాదాపు 230000 నుంచి 187000 సంవత్సరాల మధ్య జీవించినాడు. అంటే పశ్చి యూరప్‌నకు చెందిన నియాండర్తల్ మానవుని నాల్గవ హిమానినద కాలం తర్వాత నుంచి ఉన్నారని అభిప్రాయం.

మానవ పరిణామంలో నియాండర్తల్ మానవుని స్థానాన్ని నిర్ణయించడం రెండు సిద్ధాంతాల మీద ఆధారపడి ఉంది. ఒక సిద్ధాంతం ప్రకారం వృద్ధి చెందని నియండర్తల్ మానవులు ఒక దశకు ప్రాతినిథ్యం వహిస్తారు. మరొక సిద్ధాంతం ప్రకారం పాలస్తీనియన్ నివాసులు నియండర్తల్, ఒక రకపు హోమోసేపియన్స్ సంయోగం వల్ల ఉద్భవించిన సంకర జాతిగా భావించవచ్చు.

నియాండర్తల్ మానవులనుంచి ప్రస్తుత మానవులు పరిణామం చెంది ఉండవచ్చుననడానికి రెండు ముఖ్యమైన అభ్యంతరాలున్నాయి. మొదటిది ప్రస్తుత మానవ పరిణామానికి అనువైన స్వభావాలకంటే చాలా భిన్నమైన స్వభావాలు ఉండడం, రెండవది, పశ్చిమ యూరప్‌లో నివసించే ప్రస్తుత మానవులు నియాండర్తాల్ మానవుల సమకాలీకులుగా కానీ, వాళ్ళకు పూర్వీకులుగా కానీ జీవించి ఉండడం. హూటన్ ఉద్దేశం ప్రకారం నియండర్తల్ వృద్ధి చెందుతున్న మానవులు ఇప్పటి ఆస్ట్రేలియన్ గిరిజనులుగా పరిణామం చెంది వుండవచ్చునని, ఇప్పటి మానవ జాతి పరిణామానికంతటికీ ఒక్క నియాండర్ తల్ మానవుడే కారకుడని గమనించాలి.

BRAOU

**నియాండర్తల్ ముందు సిద్ధాంతం**





## 2.3.4 ప్రి-సేపియన్స్ సిద్ధాంతం

స్టీన్‌హ్యామ్ మానవులు మూడవ హిమనీనదాంతర కాలావధిలేని నియాండర్తల్ మానవులుగానూ, వుర్మ్ నియాండర్తల్ మానవులుగానూ పరిణామం చెందినారని వల్‌యిస్, గియుసెలర్ మొదలగువారు భావించారు. వుర్మ్ నియాండర్తల్ మానవులనుంచి స్కూహుల్ మానవులు, వీరి నుంచి క్రోమేగ్నన్ మానవులు, మరలా వీరి నుంచి హోమోసేపియన్స్ పరిణామం చెందగా, ఇంకొక శాఖ స్వాన్స్కొంబ్ మానవులుగానూ, స్వన్స్కొంబ్ మానవులనుండి

పంట్ చెవడే మానవులుగానూ ఒక ప్రత్యేకమైన మార్గంలో పరిణామం చెంది ఉంటారని అభిప్రాయం.

పితికెంత్రోపోయిడ్ సముదాయం నుంచి చాలా ఆదిమమైన హోమోసేపియన్స్ ఉద్భవించారని, వీరినుండి వివిధ రకాల మానవులు పరిణామం చెందారని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ఎల్.హెచ్.వేల్స్ అభిప్రాయపడినాడు.

ప్రి-స్పేసిస్ థియరీ




BRAOU

అయితే జావా మానవులు ఉద్భవించిన పిదప మానవ పరిణామం వివిధ మార్గాల్లో జరిగింది. అంతేకాకుండా మానవులు వలస పోవడం మొదలైన కారణాల వల్ల వివిధ మానవుల మధ్య సంపర్కం ఏర్పడి క్రమంగా వివిధ రకాల జావా, హైడల్ బర్గ్ మానవులు పరిణామం చెంది ఉండవచ్చునని అభిప్రాయపడినారు. ఈ పరిస్థితులలో భారతదేశం నుంచి నియాండర్తల్ మానవులు మధ్య ప్రాచ్య దేశాలకు వలసపోవడం వల్లనే అక్కడ జావా పెకెన్ మానవుల శిలాజాస్థికలు లభించినవి. పితికెంత్రోపస్ సముదాయం నుంచి సోలో, వాజ్జక రకాల మానవుల ద్వారా ఆస్ట్రేలియన్‌లు పరిణామం చెందినారని, వాళ్లు తాస్మనాయిడ్ సముదాయంతో సంపర్కం చెంది ఇప్పటి ఆస్ట్రేలియన్‌లుగా వృద్ధి చెందినారని హూటన్ అభిప్రాయపడినాడు.

పైన తెలిపిన విధంగా మానవ పరిణామం ఎన్నో యేళ్లకింద దొరికిన ఆధారాలనుబట్టి మానవ శాస్త్రజ్ఞులు విశ్లేషించి, సిద్ధాంతీకరించారు.

## 2.4 జన్యుశాస్త్ర సబంధిత సిద్ధాంతాలు

జన్యుశాస్త్రం అనేది అనువంశికత, విచారణం లేదా వైవిధ్యం అనే వాటికి సంబంధించిన జీవశాస్త్రమని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. అనువంశికత అంటే ఒక మాదిరి, ఒకే సంతతి, విచారణము. అంటే పూర్వ పరిస్థితులు లేదా సాధారణ

115077

పరిస్థితులు లేదా ఒక ప్రామాణికమైన తరహానుంచి మార్పు మొదలైన వాటి గూర్చి తెలియజేస్తుందని. ఈ విషయమై మొట్టమొదటిసారిగా 1864వ సంవత్సరంలో గ్రిగర్ మెండల్ అనే ఆస్ట్రేలియన్ దేశస్తుడు అనువంశికంగా సంక్రమించిన లక్షణాలను పరిశీలించి అనేక నియమాలను సిద్ధాంతాలుగా చెప్పాడు.

### 2.4.1 మెండల్ ప్రముఖ గుణ న్యాయం

మెండల్ బఠానీ గింజలలో పరస్పర విరుద్ధమైన లక్షణాలున్న అనేక జంటలను పరిశీలించినాడు. ఒకటి పొడవైనది, మరొకటి పొట్టిది. ఈ రెండు రకాలను తీసుకొని సంయోగం చేసినాడు. మొదటితరం విత్తనాలను సేకరించి, నాటినప్పుడు అవన్నీ పొడవు మొక్కలు అయినాయి. ఈ మొక్కలను F 1 తరానికి చెందిన మొక్కలు అంటారు. ఇందులో విధేయగుణమైన పొట్టి తనాన్ని ప్రముఖమైన పొడవు అణిచి వేసింది. దీనినే మెండల్ 'ప్రముఖ గుణన్యాయమని' వివరించాడు.

అయితే మెండల్ రెండవ తరంలోని పొట్టి వాటినన్నింటినీ లెక్కపెట్టి అవి మొత్తం విత్తనాలలో 25 శాతం ఉన్నట్టు కనుక్కొన్నాడు. ఈ పొట్టి మొక్కలలో ఆత్మపరాగ సంపర్కం జరిగినప్పుడు ఎప్పుడూ పొట్టి మొక్కలే పుడతాయి. అంటే వాటిలో పొట్టితనమనే లక్షణమొక్కటే ఉంది. కాబట్టి ఇవి పొట్టితనమున్న జన్యువులను మాత్రమే కలిగి వుంటాయి. మిగిలిన 50 శాతం పొడవు మొక్కలతో ఆత్మపరాగ సంపర్కం జరిగినప్పుడు, పొడవు, పొట్టి రకాల మొక్కలు వస్తాయి. కాబట్టి వాటిలో పొడవుతనం ఉన్న జన్యువులున్నాయి. రెండవతరం(F 2) మొక్కల ఫలితాలను విశదీకరించినప్పుడు 1 పొడవు, 2 పొడవు (పొట్టి), 1 పొట్టి అవుతుంది. అంటే ప్రతీ నాలుగు మొక్కలలో ఒకటి శుద్ధమైన పొడవు, మరొకటి శుద్ధమైన పొట్టి, మిగతా రెండు మిశ్రమం పొడవు అవుతాయి.

### 2.4.2 మెండల్ సెగ్రిగేషన్ సిద్ధాంతం

ఒక జీవి సంయోగ బీజంలో ఏదో ఒక రకమైన జన్యువు మాత్రమే ఉంటుందిగానీ, పరస్పర విదరుద్ధమైన జన్యువులు ఉండవు. అంటే పొడవుకు సంబంధించిగానీ, పొట్టికి సంబంధించిగానీ ఒకే జన్యువు ఉంటుంది. కానీ రెండూ కలిసి వుండవు. F 1 తరానికి చెందిన వాటిలో పొడవుకు సంబంధించిన జన్యువు, పొట్టికి సంబంధించిన జన్యువు వుంటాయి. ఈ వర్గానికి చెందిన స్త్రీ, పురుషులలో రెండు రకాల సంయోగ బీజాలు తయారవుతాయి. వీటిలో సగంలో పొట్టికి సంబంధించిన జన్యువులు వుంటాయి. సంయోగ బీజాలు తయారయ్యేటప్పుడు ఆయా జన్యువులు వేరైపోయి వేర్వేరు కణాలను చేరతాయి. వీటిని మెండల్ పరస్పర విరుద్ధ లక్షణాలు కలిగిన జంటలని అభిప్రాయపడినాడు.

తదుపరి మెండల్ ప్రతిపాదించిన 'స్వతంత్ర నిర్ధారిత న్యాయం' (Law of Independent Assortment) ప్రకారం వ్యతిరేక లక్షణాలున్న రెండు లేదా అంతకంటే ఎక్కువ జంటలున్నప్పుడు ప్రతీ జంట వేరైపోయి, అవకాశాన్ని బట్టి యధేచ్ఛగా వ్యవహరించడం జరుగుతుంది.

### 2.4.3 వ్యత్యాసాలు-మెండల్ భావనలు

ఒక జాతికి చెందిన వ్యక్తులు వాళ్ల వాళ్ల లక్షణాలలో ఒకరినొకరు పోలి వున్నప్పటికీ, జాగ్రత్తగా పరిశీలిస్తే ఏ ఇద్దరూ ఒకేవిధంగా లేరని తెలుస్తుంది. నిజానికి ఒకే కుటుంబానికి చెందిన సభ్యులలో కవలలైనాసరే, ఆకృతి, ఒంటిరంగు తెలివితేటలు మొదలైన వాటిలో తేడాలు వుంటాయి. వీటినే 'వ్యత్యాసాలు' అంటారు. ఇవి వంశానుగత వ్యత్యాసాలు, అర్జిత వ్యత్యాసాలుగా మెండల్ అధ్యయనాన్ని కొనసాగించాడు.

### 2.4.4 అనువంశికత-బాహ్య ప్రవృత్తి

మానవ శాస్త్రజ్ఞుల అధ్యయనాల ప్రకారం అనువంశికత వలన సంక్రమించేది గుణం కాదు, ఆయా పరిసరాలకు తగినట్టు జీవి ప్రతిక్రియ చూపించే పద్ధతి మాత్రమేనని గ్రహించవచ్చును. దీన్ని గూర్చి కాంక్లిన్, కెజిల్ మొదలైనవారు అధ్యయనం చేసినారు. పరిసరం, వారసత్వం, ప్రతిక్రియ మొత్తం మూడూ కలిసి ఒక మూర్తిమత్వాన్ని నిర్ణయిస్తాయి.

BRAOU

అనువంశికమే అన్నిటికీ కారణమని అనువంశికత తీవ్రవాదులు అంటారు మెదడుకు సంబంధించిన అన్ని అవలక్షణాలు అనువంశికంగా వచ్చేవేనని వారి ఉద్దేశం. అయితే మేధాశక్తి అభివృద్ధి చెందడం అనేది పూర్తిగా పరిసరాలకు సంబంధించినదేనని పరిసరాల తీవ్రవాదులు అభిప్రాయపడ్డారు. కాబట్టి అనువంశికతవల్ల అరికట్టబడిన అంతర్గత శక్తి అభివృద్ధికి, వికాసానికి తగిన అవకాశాలను పరిసరాలు కలుగజేస్తాయి.

## 2.5 ముగింపు

జైవిక మానవశాస్త్రం ప్రకారం మానవ పరిణామ క్రమంలో జైవిక లక్షణాలు-తొలిక్షీరద జీవాలు, శిలాజ ప్రైవేట్‌ల శారీరక లక్షణాలను పోల్చి మానవులు ఏవిధంగా ప్రైవేట్ క్రమంలో పరిణతి చెందినాడో వివరించడమైంది. మానవుడు ఏప్‌నుంచి పరిణామ క్రమంలో ఉద్భవించానడని లామార్క్ 1809వ సంవత్సరంలో తెలిపాడు. కానీ ఈ విషయాన్ని చార్లెస్ డార్విన్ సిద్ధాంతం 'The Origin of Speices' అనే గ్రంథం ప్రచురించేంతవరకూ ఎవ్వరూ పట్టించుకోలేదు. తదుపరి 'The Descent of Man' అనే గ్రంథం ద్వారా డార్విన్ ఆంత్రోపోయిడ్ ఏప్‌లు, మానవులు ఒకే పూర్వ వంశం నుంచి ఉద్భవించినారని అభిప్రాయపడినాడు.

మానవుడు ఏ ప్రైమేట్ నుంచి పరిణామం చెందినాడో, అట్లా పరిణామం చెందడంలో ఏ ఏ మార్పులు ఏర్పడినవో అనే విషయాలపై బిన్నాభిప్రాయాలున్నాయి. ముఖ్యంగా జైవిక మానవ శాస్త్ర పరిణామ సిద్ధాంతాలు ప్రాచీన కాలంనుండి పరిణామ క్రమాన్ని సూచిస్తూ అనేక దశలలో మానవుని రూపాలను విశ్లేషించాయి. అట్లాగే జన్యుశాస్త్ర సిద్ధాంతాలు అనువంశికత, పరిసరాలు మూర్తిమత్వాన్ని నిర్ధారించడంలో ఎటువంటి పాత్ర వహిస్తాయో విపులీకరించాయి.

## 2.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి:**

1. జైవిక మానవశాస్త్ర విభాగాలేవి? వివరించండి.
2. మెండల్ వ్యత్యాసభావనలు వివరించండి?
3. అనువంశికత, బాహ్య ప్రవృత్తి గురించి రాయండి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.**

1. పూర్వ నియాండల్తర్ సిద్ధాంతాన్ని పేర్కొనండి?
2. ఏక వర్గ సిద్ధాంతం పేర్కొనండి?
3. ప్రి సేపియన్స్ గురించి రాయండి?

## 2.7 చదవదగిన పుస్తకాలు


1. Fundamentals of Physical Anthropology
2. శారీరక మానవశాస్త్రం : బి.ఎ. తెలుగు అకాడెమీ, 1972. డి. నరసింహరావు అండ్ జి. గొల్లారెడ్డి.
3. సామాజికమానవశాస్త్రం : తెలుగు అకాడమీ, 1972.
4. An Introduction to Anthropology - Olien, M.D.


BRAOU

# భాగం-3: మనోవైజ్ఞానిక సిద్ధాంతం

విషయక్రమం


3.0 ఉద్దేశాలు

3.1 పరిచయం

3.2 సి.హెచ్.కూలే

3.3 అహం అనగానేమి?

3.4 ప్రతిబింబిత అహం

3.5 మీడ్ ప్రతిపాదనలు

3.6 చర్య లేక ప్రవర్తన

3.7 సంజ్ఞలు లేదా అంగవిక్షేపాలు

3.7.1 ప్రముఖ ప్రతీకలు

3.7.2 మానసిక ప్రక్రియలు, మేధస్సు

3.8 'నేను-నాది' భావన

3.9 హెడ్సర్‌లూ, బ్లూమర్ సిద్ధాంతం

3.10 ముగింపు

3.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

3.12 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 3.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సామాజిక సంబంధాలకు అవసరమైన పరస్పర చర్యలను గుర్తిస్తారు.
- మానవుడి మీద వాటి ప్రభావం అర్థం చేసుకుంటారు.
- మనో వైజ్ఞానిక సిద్ధాంతాలను అర్థం చేసుకుంటారు.

## 3.1 పరిచయం

కొందరు సామాజిక శాస్త్రవేత్తలు మానవుని ప్రవర్తనారీతులను విశ్లేషించారు. సామాజిక జీవిగా మానవుడు తన వ్యక్తిగత అవసరాలను తీర్చుకోవడం కోసం ఆలోచించడం, సంజ్ఞల ద్వారా పరస్పర చర్య జరపడం, భాషను అభివృద్ధి చేసుకోవడం, ప్రతీకలను ఉపయోగించి పరస్పర చర్యలలో పాల్గొనడం చేస్తూనే ఉన్నాడు. ఈ ప్రతీకాత్మక పరస్పర చర్యలను, వాటికి గల కారణాలను అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. మానవుడి ప్రవర్తనా రీతులపైన ప్రధానంగా కేంద్రీకరించిన సామాజిక సిద్ధాంతాలను తెలుసుకోవాల్సి ఉన్నది.

## 3.2 సి.హెచ్.కూలే

చార్లెస్ హోర్టన్‌కూలే, జార్జి హర్‌బర్ట్ మీడ్‌లు ఇద్దరూ సామాజిక శాస్త్ర వేత్తలుగా వ్యక్తికి, సామాజిక నియంత్రణకు ఉన్న సంబంధాన్ని విశ్లేషించేందుకు కృషి జరిపారు. వ్యక్తి అహం (self) చుట్టూ వీరి పరిశోధనలు జరిగాయి. 1940 నుంచి సి.హెచ్.కూలే, మీడ్‌లు ప్రతిపాదించిన ఈ 'అహం' చుట్టే మనస్తత్వ శాస్త్రం, సామాజిక శాస్త్రంలో ప్రాధాన్యత సంతరించుకున్నది. 1902 సంవత్సరంలో కూలే, 1913లో మీడ్‌లు 'అహం' చుట్టూ సిద్ధాంతాలను అభివృద్ధి పరిచారు. మనిషి వ్యక్తిత్వ క్రమంలో 'అహం'తో తనను తాను గుర్తించుకుంటాడు. తన 'అహం' ద్వారా, దైనందిన జీవన కార్యకలాపాలలో, ప్రవర్తనా రీతులను నిర్ణయించుకుంటాడు. వివిధ పరిస్థితులకు తగినట్టుగా ప్రవర్తించే విధంగా వ్యక్తి 'అహం' పనిచేస్తుంది. వ్యక్తి ప్రేరణ, జిజ్ఞాస 'అహం' వల్ల రూపొందుతాయి. అట్లాగే పరిస్థితులకు అనుగుణంగా తనను తాను తీర్చిదిద్దుకోవడానికి, సామాజికంగా ఆమోదయోగ్యం కాని చర్యలను నియంత్రించుకోవడానికి 'అహం' ఉపకరిస్తుంది.

చార్లెస్ హోర్టన్ కూలే 1864లో అమెరికాలోని మిషిగన్ పట్టణంలో జన్మించాడు. స్థిరమైన, ఉన్నత కుటుంబంలో జన్మించిన కూలే నెమ్మదస్తుడు. 15 సంవత్సరాలపాటు అనారోగ్యంతో గడిపాడు. మాట సంబంధమైన సమస్యతో సతమతమవుతూ ఒంటరిగా ఉండేవాడు. ఎక్కువగా ఊహాలోకంలో విహరించేవాడు. ఇంజనీరింగ్‌లో పట్టా పొందిన అనంతరం చరిత్ర, అర్థశాస్త్రం, తత్వశాస్త్రాలలో కూడా ప్రవేశం పొందాడు. 'థియరీ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్' ద్వారా 'సోషల్ ప్రాసెస్', 'సోషల్ ఆర్గనైజేషన్' గ్రంథాలు వెలువరించాడు. ప్రతీకాత్మక చర్యల సిద్ధాంతకర్త కూలే, మనిషి సమాజం గురించిన మానసిక కోణాల విశ్లేషకుడు.

## 3.3 'అహం' అనగా ఏమి?

అహం (self) అంటే ఒక వ్యక్తి మనస్తత్వ రీతి, ప్రవర్తనా రీతులను నియంత్రించే వ్యక్తిత్వ నమూనాగా భావించవచ్చు. తన భౌతిక రూపం, దాని సామర్థ్యం, పరిసరాలు, వ్యక్తులు, కుటుంబం, సమూహాలు, సామాజిక ఆమోదాలు, విలువలు, సాంఘిక సంస్థలకు సంబంధించిన విషయాలకు సంబంధించి వ్యక్తి మనస్తత్వ ఆంతర్యాన్నే 'అహం' అని అంటారు. ఇది సామాజికుల మధ్య సాగే భావ ప్రసారం.

మానసిక మూర్తిమత్వానికి సంబంధించి సి.హెచ్.కూలే ఈ శతాబ్దం ప్రారంభంలోనే విశ్లేషించి తన సిద్ధాంత రూపకల్పన చేశాడు. మూర్తిమత్వంలో ప్రధానపాత్ర పోషించే అహం పుట్టుక బాల్యంలోనే మొదలవుతుందని కూలే సిద్ధాంతీకరించాడు.

'అహం' ఆవిర్భావానికి సంబంధించి మీడ్ మాత్రం సంజ్ఞల సంభాషణ నేపథ్యంలో అహం పుడ్తుందని అన్నాడు. మనిషి పరస్పర చర్యలలో నడవడిక పుడ్తుందని, ఈ నడవడికలోనే పాత్రల నిర్వహణ, పోషణ ఏర్పడుతుందని ఆయన విశ్లేషించాడు. అందుకు మీడ్ 1. ఆటలదశ, 2. క్రీడాదశ, 3. సాధారణ ఇతరుల దశలను ప్రస్తావించాడు.

1. **ఆటలదశ:** బాల్యంలో పిల్లలు రకరకాల ఆటల ద్వారా ఇతరుల పాత్రల పోషణ చేస్తారు.
2. **క్రీడాదశ:** ఈ దశలో శిశువు మామూలు పాత్రలు కాకుండా, సంక్లిష్ట పాత్రల పోషణ చేస్తాడు. ఈ దశలో క్రీడా నియమాలు పాటించడం నేర్చుకుంటాడు.
3. **సామాజిక ఇతరులు:** ఈ దశలో ఇతరులకు అనుసారంగా తన అహాన్ని వ్యవస్థీకృతం చేసుకొని ప్రవర్తించడం ఉంటుంది.

వ్యక్తి శిశువుగా ఉన్నప్పుడే పలకరింపులకు ప్రతిస్పందించి నవ్వటం, ధ్వనులు చేయడం చేస్తాడు. శిశువు తన పరిసరాలనుంచి, తల్లినుంచి భిన్నమైనవాడినని ఆదశలోనే తెలుసుకుంటాడు. తన అవసరాలను తీర్చి, ముద్దు, మురిపాలు తీర్చడం, పలకరించడంతోనే తనను ప్రత్యేకంగా పరిగణిస్తున్న విషయాన్ని శిశువు కనిపెట్టగలుగుతాడు.



BRAOU

అనంతరం కుటుంబ చర్యలలో వచ్చే మార్పులను గమనించి, మిగతా కుంటుంబ సభ్యులు తనను ఎలా అంచనా వేస్తున్నారో? తన రూపు రేఖలు, ప్రవర్తనలకు సంబంధించి కొన్ని ప్రమాణికతల ప్రకారం కుటుంబ సభ్యులు ఎలా అంచనా వేస్తున్నారో తెలుసుకుంటాడు.

శిశువు శైశవం దాటి, పెరిగిన తర్వాత, కుటుంబ పరిధినుంచి బయట సంబంధాలతో, బయటి వాళ్ల ప్రవర్తనను నమూనాగా చేసుకుని తాము ఎలా ఉన్నామో? తెలుసుకుంటాడు. దీనినే కూలే ప్రతిబింబిత అహం (looking glass self) గా అభివర్ణించాడు. దీని ఆధారంగా శిశువు సామాజికీకరణ పొందుతాడని కూలే అభిప్రాయం. ముందు ప్రాథమిక సమూహంగా కుటుంబం, అనంతరం సమవయస్కుల సమూహం పిల్లల సామాజికీకరణ సాధనాలుగా కూలే పేర్కొన్నాడు. ప్రాథమిక సమూహంగా కుటుంబం, దాని సభ్యులు, సామాజిక వ్యవస్థతో శిశువులను సంఘటితపరిచే వ్యవస్థ. కుటుంబంలోని వ్యక్తులు విడివిడి ఆదర్శాలు కలిగి ఉన్నప్పటికీ, ఉమ్మడిగా కుటుంబ ఆదర్శాల కోసం పనిచేస్తాడు. సమవయస్కుల సమూహంలో ఆటపాటల ద్వారా, అనుకరణల ద్వారా సామాజిక చర్యల శిక్షణ జరుగుతుంది.

ప్రాథమిక సమూహం, సమవయస్కుల సమూహంలో శిశువు ప్రతిబింబిత అహం ఏర్పరచుకుంటాడు. ఇతరుల భావనలను గుర్తించడం, మన్నించడం, వారి ఆలోచనలను, విలువలను గుర్తించి వాటికి అనుగుణంగా మలచుకోవడం ప్రతిబింబిత అహం వల్ల సాధ్యమవుతుందని కూలే అభిప్రాయం.

మానసిక గుణశీలత ఏర్పడడం వ్యక్తిత్వంలో ముఖ్యమైంది. మనసు ప్రేరణల ఆధారంగా మనిషి ప్రవర్తన రూపుదిద్దుకుంటుంది. అయితే, జంతువులను పోలి వుండే మనిషి ప్రాథమిక, సమవయస్కుల సమూహాల ద్వారా సామాజికీకరణం పొంది ప్రవర్తనా రీతులను నేర్చుకుంటాడు. ఇందుకు అతని 'ప్రతిబింబిత అహం' తోడ్పడుతుంది.

## 3.4 ప్రతిబింబిత అహం

BRAOU

అహం, సమాజం అనేవి ఒకేసారి పుట్టాయని కూలే అంటాడు. అహానికి, సమాజానికి విడదీయరానంత గాఢమైన, దృఢమైన సంబంధం ఉందనేది కూలే చేసిన ప్రధాన ప్రతిపాదన. కూలే ప్రకారంగా సమాజం ఒక మానసిక దృగ్విషయం. ఒక వ్యక్తికి, మరొక వ్యక్తికి ఉండే పరస్పర సంబంధాలు, ఆలోచనాత్మక సంబంధాలు అవుతాయి. 'నేను' అనే థామస్, సుసాన్ తదితర వ్యక్తులు, ఆ వ్యక్తుల మధ్య ఉండే పరస్పర సంబంధాలు, ప్రభావాలు నామనస్సులో ఆలోచనాత్మక సంబంధమే నాలో సమాజ భావనలను రూపొందిస్తుంది'. ఈ మానసికపద్ధతినే కూలే వ్యక్తి మూర్తి మత్వాన్ని వివరించడానికి ఉపయోగించాడు. అందువల్లనే అహం, సామాజిక అహం ఒక వ్యక్తి తాలూకు మూర్తిమత్వం లోని ఒకే అంశాలని కూలే వివరించాడు. అహం సహజమైన ఆత్మభావనతో, స్పందనతో కూడి ఉంటుంది.

అహాన్ని కూలే రెండు రకాలుగా విభజించాడు. ఒకటి, నేను, నాది, లేదా వ్యవహారిక అహం. రెండు, సామాజిక అహం, ప్రతిబింబిత అహం. సామాజిక చర్యలలో ఇతరుల అభిప్రాయాలకు, ఆలోచనలకు ప్రతిస్పందనగా నిర్మితమయ్యేదే ప్రతిబింబిత అహం. ఈ భావనలో ప్రధానాంశాలు మూడు. అవి: 1. ఒక వ్యక్తి ఇతరులకు మనం ఎలా కన్పిస్తున్నామో? అనే ఊహ. 2. తను కనిపించిన తీరుపై ఇతరులు ఏమనుకుంటున్నారోననే ఆలోచన, 3. వీటి ఫలితంగా ఆత్మన్యూనతా (Inferiority complex) లేదా ఆత్మాభిమానం (superiority) అంకురించడం.

సమాజశాస్త్రంలో కూలే ప్రతిపాదించిన ఈ ప్రతిబింబిత అహం భావన బహుళ ప్రచారం పొందింది. సమాజంలో ఇతరులతో గల సంబంధాలను బట్టి, వారితో జరిగే పరస్పర చర్యలను బట్టి, మనిషి బహురూపిగా కనిపిస్తాడు. ఇలా కనిపించినందువల్లే అతనికి సామాజిక సర్దుబాటు అనుసరణ సులువై, సామాజికీకరణ పొందుతాడు. కూలే ప్రతిబింబిత అహం సిద్ధాంతం ప్రతిపాదించడమే కాకుండా, సమాజానికి సంబంధించిన ఒక సాధారణ సిద్ధాంతాన్ని కూడా ప్రతిపాదించాడు. సమాజాన్ని ప్రాథమిక, గౌణ సమాజాలుగా విభజించి, ప్రాథమిక సమూహానికి (కుటుంబానికి) వ్యక్తి ప్రతిబింబిత అహానికి ఉన్న సంబంధాన్ని విశ్లేషించాడు.

## 3.5 జార్జ్‌హెర్బర్ట్ మీడ్ ప్రతిపాదనలు

ప్రతీకాత్మక పరస్పర చర్యావాద చరిత్రలో జార్జ్‌హెర్బర్ట్ మీడ్ ప్రముఖ తత్వవేత్తగా ప్రసిద్ధికెక్కాడు. మీడ్, 'మైండ్, సెల్ఫ్‌అండ్‌సొసైటీ' అనే గ్రంథం ద్వారా తన భావనలను వెల్లడించాడు. ఇది అనంతర కాలంలో సామాజిక, మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలకు స్ఫూర్తిదాయకమైంది.

ప్రతీకాత్మక చర్యావాదం వివరణతోనే ఆగిపోకుండా మీడ్, సమాజం, సామాజిక సంబంధాలు, చర్య, పరస్పరచర్యల విశ్లేషణలు కూడా చేశాడు. చరిత్ర గురించి సరికొత్త నిర్వచనం ఇచ్చిన మీడ్ అమెరికన్ వ్యవహార వాదులలో సంస్కరణ వాదిగా పేరొందినవాడు. మీడ్ 1863లో సౌత్‌హాడ్లీ మాసాచుసెట్‌లో జన్మించాడు. ఏలోటులేని జీవితం మీడ్‌ది. 1883లో మీడ్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసేనాటికి అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి క్షీణించింది. ఉపాధ్యాయవృత్తిలో కొన్నాళ్లు కొనసాగి అనక మీడ్ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్ర పరిశోధనలు చేశాడు. 1893లో చికాగో విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్ర విభాగం అధ్యక్షుడిగా కూడా పనిచేసిన మీడ్, సమాజశాస్త్రంలోని వివిధ అంశాలను చర్చించడంతో పాటుగా ప్రతీకాత్మక పరస్పర చర్యావాదాన్ని అభివృద్ధి చేశాడు.

### మీడ్ ముఖ్య ప్రతిపాదనలు

మీడ్ ప్రధాన గ్రంథం "మైండ్,సెల్ఫ్ అండ్ సొసైటీ"లో అతని ఆలోచనల ప్రాధాన్య క్రమాన్ని గుర్తించవచ్చు. అహం, సామాజికీకరణలకు సంబంధించిన అధ్యయనానికే అతను ప్రాధాన్యతను ఇచ్చాడు. ఒకనిర్దిష్ట సమాజ సిద్ధాంతాన్ని రూపొందించడం కన్నా, సమాజంలోని పుట్టు పూర్వోత్తరాలు దానిలోని ప్రధానాంశాలు, దాని అభివృద్ధి వికాసాల గురించి చర్చించడానికే మీడ్ ఎక్కువగా ప్రయత్నించాడు. ఇప్పుడిక మీడ్ మౌళిక భావనల గురించి చూద్దాం.

## 3.6 చర్య లేదా ప్రవర్తన

మీడ్ ప్రతిపాదించిన సిద్ధాంతంలో చర్య లేదా ప్రవర్తన అనేది అత్యంత ప్రాచీనమైన అధ్యయన భాగం. మనిషి ఉద్దీపన అనేది చర్యకు ఉపక్రమించడానికి అనువైన అవకాశాన్ని, పరిస్థితిని కల్పిస్తుందని మీడ్ అభిప్రాయం. కొందరు శాస్త్రవేత్తలు ఉద్దీపనకు, ప్రతిస్పందనకు ప్రత్యక్ష సంబంధం ఉందని భావిస్తే, మీడ్ మాత్రం అది స్వయంచాలకం కాదని అంటాడు.

ప్రతిచర్యలోను నాలుగు మౌలికమైన, పరస్పరాధారిత దశలు ఉంటాయని మీడ్ ప్రతిపాదించాడు. ఈనాలుగు చర్యలకు గతితార్కిక సంబంధం ఉంటుందని ఆయన భావన. అవి 1. సహజాత ఉద్వేగం (instinct) 2. గ్రహణశక్తి లేదా జ్ఞానం 3. అభిసంధానం లేదా అనుకూలంగా మలుచుకోవడం 4. సిద్ధి.

### 1. సహజాత ఉద్వేగం

జీవులలో ముఖ్యంగా మనిషిలోనూ, జంతువులలోనూ జ్ఞానేంద్రియాలలో కలిగే తక్షణ ఉద్దీపన. ఇది సర్వ సామాన్య లక్షణం ఉదాహరణకు ఆకలి. ఒక సంఘటన జరిగినప్పుడు మనిషి గతంలో. ఇలాంటి సంఘటనలకు, అనుభవాలకు సంబంధించిన భవిష్యత్ ఫలితాల ద్వారా ప్రవర్తనను నిర్ణయించుకుంటాడు. జంతువులు మాత్రం ఈఆలోచననేది లేకుండా తక్షణం స్పందిస్తాయి. ఆకలి వేసినప్పుడు మనిషి తినడానికి తగిన సమయం, అవకాశాల గురించి ఆలోచించి తన ప్రవర్తన ఏర్పరచుకుంటాడు. దీనితో రెండో దశ ప్రారంభం అవుతుంది.

### 2. గ్రహణశక్తి లేదా జ్ఞానం

బాహ్యఉద్దీపనకు మనిషి తక్షణమే స్పందించి చర్యకు పూనుకోడు. సాధ్యా, సాధ్యాలను అనువైన అవకాశాలను, సాధనాలను నిర్ణయించుకుంటాడు. ఆహార విషయమే తీసుకుంటే రంగు, రుచి, వాసన చూసి అవి లభ్యమయ్యే అవకాశాలు ఎంత వరకు ఉన్నాయో, ప్రత్యామ్నయాలు ఏమిటో? ఆలోచించి నిర్ణయం తీసుకుంటాడు. ఈదశలోనే అభిసంధానం ప్రారంభమౌతుంది.



BRAOU

### 3. అభిసంధానం

ఈ దశలో ఉన్న పరిస్థితులను అంటే అకలి బాధను తీర్చుకోవడానికి ఉన్న అవకాశాలను, వాటి సాధ్యాసాధ్యాలను గురించి ఆలోచించడం ప్రారంభిస్తాడేకానీ, కనిపించిన ప్రతీదాన్నీ తినడు. ఉదాహరణకు: పుట్టగొడుగులను చూడగానే జంతువులు వాటిని తిని క్షుద్బాధ తీర్చుకుంటాయి. కానీ, మనిషి పుట్టగొడుగులను పరిశీలించి అవి విషపూరితం కావని నిర్ధారించుకున్న అనంతరమే వాటిని తింటాడు. ఆతర్వాత మనిషి వివేచనా జ్ఞానంతో ఫలితం సిద్ధిస్తుంది.

### 4. సిద్ధి లేదా పూర్తి చేయడం

ఈ దశలో మొదటి దశలో ఏర్పడిన సహజాతోద్వేగాన్ని సంతృప్తి పరచడం జరుగుతుంది. అంటే మొదట్లో ఏర్పడిన ఆకలిబాధను ఎంపిక చేసుకుని ఆహారం తీసుకోవడం ద్వారా తీర్చుకుంటాడు. ఇందతా ఒక వ్యక్తి చర్యే అయినా మీడ్ దాన్ని సామాజిక ప్రవర్తనకు వర్తించి చూపాడు. ఈసందర్భంలోనే మీడ్ సంజ్ఞలు లేదా అంగవిక్షేపాల గురించి ప్రస్తావిస్తాడు.

## 3.7 సంజ్ఞలు లేదా అంగవిక్షేపాలు

వ్యక్తిసామాజిక చర్యల సాధనంగా లేదా యంత్రంగా సంజ్ఞలు ఉపకరిస్తాయని మీడ్ భావన. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పాల్గొనే సామాజిక చర్యలలో ఈ చర్యలు మౌలికమైన భావ ప్రసార సాధనంగా ఉపయోగపడతాయి. వ్యక్తి చేసే స్పందనలు ఇతరుల చర్యలకు ఉద్దీపనలుగా ఉపయోగపడి వారిలో తగిన స్పందనలు కలిగిస్తాయి. సంజ్ఞలు మనుషులలోనూ, జంతువులలోనూ భావ ప్రకటనా మాధ్యమాలుగా పనిచేస్తాయి. ఒకరి సంజ్ఞలు ఇతరులలో స్వయం చాలకంగా ప్రతిస్పందనలు కలుగజేస్తాయి. ఒక కుక్క మరొక కుక్క పోట్లాడుకోవడాన్ని ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఒక కుక్క పోట్లాటకు దిగి కాలు దువ్వి, గుర్రు మంటే, మరొక కుక్క కూడా అందుకు సిద్ధమవడం. మనుషులలోనూ, జంతువులలోనూ ఇవి సహజాతాలు. వీటికి ప్రత్యేకతలేదు. కానీ మనుషులకు జంతువులకు గల ప్రధాన తేడా సంజ్ఞలు ఉపయోగించడంలో తేడా మాత్రమే. మనుషులు సంజ్ఞలను అర్థవంతంగా ఉపయోగిస్తారు.

BRAOU

పై సంజ్ఞలన్నింటిలోనూ వాచ్యసంజ్ఞలదే ప్రధానపాత్ర. కొన్ని శబ్దాలు కూడా అర్థరహితంగానే ఉంటాయి. భాషారూపంలో ఉన్న సంజ్ఞలు మాత్రమే అర్థవంతమైనవి. ఈ అర్థవంతమైన సంజ్ఞలే మానవ జీవన వికాసంలో, విజ్ఞానార్జనలో ప్రముఖపాత్ర వహిస్తాయి. వ్యక్తి అంగవిక్షేపాలతో ఇతరులకు స్పందన కల్పించగలడు. కానీ అద్దంలో తన ప్రతిబింబాన్ని తాను చూసుకుంటే తప్ప వాటిని స్వయంగా చూడలేడు. కానీ వాచ్య సంజ్ఞలపై మాత్రం అతనికి పూర్తి అదుపు ఉంటుంది. అందువల్ల వాగ్రూప సంజ్ఞలు మానవ సమాజంలో సామాజిక వ్యవస్థ మాధ్యమాన్ని కల్పించాయని మీడ్ అభిప్రాయం.

### 3.7.1 ప్రముఖ ప్రతీకలు

మానవులకు మాత్రమే సాధ్యమైన, వారు మాత్రమే చేయగలిగిన సంజ్ఞలను మీడ్ ప్రముఖ ప్రతీకలన్నాడు. ఇవి ఉపయోగించే వ్యక్తిలోనూ ఎదుటి వ్యక్తిలోనూ సదృశ్యమైనవి కాకపోయినా ఒకే రకమైన స్పందనను కలుగజేస్తాయి. ఈ ప్రముఖ ప్రతీకలతోనే అసలు సిసలు భావ ప్రసారం సాధ్యమౌతుంది. అంగవిక్షేపాలను కూడా ప్రధాన ప్రతీకలుగా ఉపయోగించవచ్చు. కానీ, అవి ఉపయోగిస్తున్న మనిషి తనను తాను చూసుకోవడం కుదరదు. కనుక తెలిసి చేసే వాచ్య సంజ్ఞలనే మనం భాష అంటున్నాం. ఒక ప్రతీక ఒక వ్యక్తిలో కలుగజేసే భావాన్నే, ఎదుటి వ్యక్తుల్లో కూడా అదే భావనను కలుగజేస్తే దానిని భాష అనవచ్చు. అప్పుడది ప్రముఖ ప్రతీక అవుతుంది. అంటే భావ వాహకమైన సంజ్ఞ భాష అని అర్థం. అందుకే భాష ప్రముఖ ప్రతీక.

ప్రముఖ ప్రతీకలను పేర్కొనడమే కాకుండా మీడ్, ఈ ప్రతీకల ప్రకార్యాలను కూడా వివరించాడు. సామాజిక పరస్పర చర్యలలో పాల్గొంటున్న వ్యక్తుల మధ్య ఈ సంజ్ఞలు సర్దుబాటు కల్పిస్తాయని, ప్రముఖ ప్రతీకల ప్రకార్యం

ఇదే అని మీడ్ భావన.

ఇదే కాకుండా, ప్రముఖ ప్రతీకల మరో ముఖ్య ప్రకార్యం ఇవి మేధస్సును, మానసిక ప్రక్రియలను కొనసాగించడానికి తోడ్పడతాయి. ప్రముఖ ప్రతీకలలో ఒకటైన భాష ద్వారానే మనుషులలో ఆలోచించే గుణం ఏర్పడింది. ఆలోచనను మీడ్ 'ఒక మనిషిలో అంతర్గతంగా తనతో తానే సంజ్ఞల ద్వారా సంభాషించడమే' అన్నారు. ఆలోచించడం అంటే మనిషి తనతో తాను మాట్లాడుకోవడం. అట్లాగే ప్రముఖ ప్రతీకలు ప్రతీకాత్మక పరస్పర చర్య ఏర్పడడానికి దోహదం చేస్తాయి. అంటే వ్యక్తుల పరస్పర చర్య కేవలం సంజ్ఞల ద్వారానే కాక ప్రముఖ ప్రతీకల ద్వారా ఏర్పడుతుందన్నమాట. ఈ సామర్థ్యమే సంక్లిష్ట పరస్పర చర్యల తీరును ఎదుర్కొనే సాధన సంపత్తి కల్పిస్తుంది. ఇదే సామాజిక వ్యవస్థలు ఏర్పడడానికి దోహదపడుతుంది.

### 3.7.2 మానసిక ప్రక్రియలు - మేధస్సు

మానసిక ప్రక్రియలకు సంబంధించి మీడ్ వివరంగా ప్రస్తావించాడు. ఈ విషయంలో మీడ్ నిర్మితులు లేదా విషయాలకంటే, ప్రక్రియలకే ప్రాధాన్యత ఇచ్చాడు. అందుకే అతడిని 'ప్రక్రియల తత్వ వేత్త' అనికూడా అంటారు 'జీవుల పరస్పర చర్యలలోని సర్దుబాటు లక్షణమే తెలివితేటలు' అని మీడ్ అభిప్రాయం. అందుకే మానవుని తెలివితేటల శక్తి జంతుజాలంకన్నా హేతుబద్ధమైంది. మానవుడికి ఆలోచనాశక్తి ఉన్నందువల్ల ఒక ఉద్దీపనకు వెంటనే ప్రతిస్పందించి చర్యకు పూనుకోకుండా కొంత ఆలోచించి పర్యవసానాలను బేరీజు వేసుకొని చర్యను చేపడతాడు. అందువల్ల 'విలంబిత ప్రతిస్పందన ప్రజ్ఞా ప్రవర్తనకు ముఖ్యం'.

మీడ్ పేర్కొన్న విలంబిత ప్రతిస్పందనలో మూడు ముఖ్యాంశాలు ఉంటాయి. అవి: 1. చర్యలను వాయిదా వేయగల శక్తి ఉన్న మానవుడు ఒక ఉద్దీపనకు గల వివిధ రకాల ప్రతిస్పందనను గురించి ఆలోచించగలడు. ఒక చర్యకు ముందు ప్రత్యామ్నాయ చర్యలను కూడా ఊహించుకోగలడు. 2. మనిషి ప్రవర్తనకు సంబంధించి ఉన్న వివిధ ప్రత్యామ్నాయాలను మనసులోనే పరిశీలించి అనువైన దానిని ఎన్నుకొంటాడు. ఈ ఎంపికలో తనకు తాను సంభాషించుకోవడం ఉంటుంది. కానీ, సామాజిక సమన్వయం ఉండదు. 3. రకరకాల ఉద్దీపనలలో ఒక దానిని ఎంచుకోగల శక్తి కూడా మానవుడికి ఉంది. అందువల్ల ఏ ఉద్దీపనకు స్పందించాలో నిర్ణయించుకోగల శక్తి ఉంటుంది.

BRAOU

తెలివితేటలతోపాటు మీడ్ చైతన్యాన్ని గురించి కూడా వివరంగా చర్చించాడు. చేతనత్వానికి ఆయన రెండు విశిష్టార్థాలు చెప్పాడు. అవి: 1. ఒక వ్యక్తికే అందుబాటులో ఉండేటటువంటిది. అంటే ఆత్మాశ్రయమైనది. 2. ఆలోచనతోకూడిన ప్రజ్ఞ. ఈ రెండు అర్థాలలో మీడ్ రెండో దాని పట్ల ఎక్కువ శ్రద్ధ వహించాడు. మనిషిలో తక్షణం కలిగే బాధ లేదా ఆనందం కన్నా ప్రపంచాన్ని గురించిన ఆలోచనే ఎక్కువ అన్నాడు. అందువల్ల చైతన్యం మనిషి మేధస్సులోనే ఉంటుందని అతని భావన. అందువల్ల మీడ్ సంఘటనలను సామాజిక దృగ్విషయంగా భావించాడు. వ్యక్తి ప్రవర్తనలోనే అర్థం ఉన్నందువల్ల అది ప్రతీకలతో కలిసి చైతన్యం అవుతుంది. ఇది చైతన్యం అయినప్పటికీ సామాజిక ప్రవర్తనలో అంతర్భాగంగా ఉంటుంది. అందువల్లనే మనుషులు అర్థవంతంగా ప్రవర్తిస్తారు. చైతన్యంలోలాగే, మీడ్ మేధస్సును నిర్వచించాడు. మేధస్సును ఆయన ఒక వస్తువుగా కాకుండా ప్రక్రియగా భావించాడు. మేధస్సు అంటే ఒక సామాజిక దృగ్విషయమని, తనలో తాను మాట్లాడుకోవడమని మీడ్ భావన. మేధస్సు కన్నా ముందు సామాజిక ప్రక్రియ ప్రారంభం అవుతుందని, అది మానవ మేధస్సులో ఉద్భవించింది కాదని అతని భావన. మేధస్సును మీడ్ ప్రకార్య అనుసారంగా నిర్వచించాడు. మానవ మేధస్సుకు ఒక విశిష్ట లక్షణం, శక్తి ఉన్నది. తన చర్యల వల్ల ఇతరులలో స్పందన కలగడాన్ని ప్రేరేపించడానికే పరిమితం కాకుండా ఒక మొత్తం సముదాయంలో కూడా స్పందన కలిగించగల శక్తి మానవ మేధస్సుకు వుంది. ఒక సమస్యను పరిష్కరించే దృష్టితో జరిగే ఆలోచనా ప్రక్రియే మేధస్సు అని మీడ్ అంటాడు.

## 3.8 'నేను-నాది' భావన

అహంలో రెండు దశలున్నాయని మీడ్ భావన. అవి 'నేను', 'నాది' (I and Me) అనేవి. మీడ్ దృష్టిలో ఈ రెండు దశల గుండా సాగే సామాజిక ప్రక్రియే అహం. ఈ అహం తాలూకు విశాల ప్రక్రియలో నేను, నాది ఉపప్రక్రియలు. నేను అనేది ఒక వ్యక్తి విషయంలో కలిగే తక్షణ ప్రతిస్పందన. ఇది అంచనాలకు అందనిది. ముందుగా ఊహించలేనిది. సృజనాత్మకమైనది. నేను ఏ చర్యకు పాల్పడుతుందో ముందుగా ఊహించలేరు. అది వ్యక్తి స్మృతి పథంలోదే కానీ, అతనికే అంతుపట్టనిది. మీడ్, నేను భావనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడానికి నాలుగు కారణాలున్నాయి. అవి: 1. సామాజిక ప్రక్రియలో నవ్యతకు ఇదొక కీలకమైన మూలం. 2. ఈ నేనులోనే మానవుని విలువలన్నీ ఇమిడి ఉంటాయి. 3. మనుషులందరూ ఆశించేది, ఆకాంక్షించేది 'నేను' అనే అంశమే. ఇది మనిషి ఒక నిర్దిష్ట మూర్తిమత్వాన్ని రూపొందించుకోవడానికి ఉపయోగపడుతుంది. 4. ఆధునిక సమాజంలో 'నేను'కు ప్రాధాన్యత ఎక్కువ.

మీడ్ ప్రతిపాదించిన సైద్ధాంతిక వ్యవస్థను సృజనాత్మకం, చైతన్యవంతం చేయడంలో 'నేను' అనే భావన ఎంతో తోడ్పడింది. ప్రతీ వ్యక్తిలో నేను, నాది రెండూ ఇమిడి ఉన్న, ప్రతీ వ్యక్తిలో 'నేను' పాలు అధికంగా ఉంటుంది. ఒక వ్యక్తి తాలూకు జీవితానుభవాలు అతనిలోని నేను, నాదిల సమ్మేళన స్వభావాన్ని నిర్ణయిస్తాయి. తెలియజేస్తాయి.

ఇక 'నాది' అనేది సుసంఘటితమైన ఇతరుల అభివ్యక్తి. 'నేను' 'నాది'కి వ్యతిరేకంగా స్పందిస్తుంది. మరొక మాటలో చెప్పాలంటే 'నాది' అనేది సాధారణంగా ఇతరులలో మరో రూపమే. నేనుకు భిన్నంగా 'నాది' చైతన్యయుత బాధ్యత. నాది సాంప్రదాయక, అలవాట్లతో కూడుకున్న వ్యక్తి. సమాజం నియమనిబంధనలకు లోబడే వ్యక్తులలో 'నాది' ప్రాబల్యం అధికం. ఈ 'నాది' ద్వారానే వ్యక్తిపై సమాజం నియంత్రణ కొనసాగిస్తుంది. నిజానికి 'నాది' తాలూకు ప్రాబల్యరూపమే సామాజిక నియంత్రణ అని మీడ్ అభిప్రాయం.

సామాజిక వ్యవహార దృష్టితో పరిశీలించినప్పుడు 'నాది' అనేది సామాజిక ప్రపంచంలో వ్యక్తి సుఖప్రదంగా బతకడానికి అవకాశం కల్పిస్తుంది. 'నేను' సామాజిక మార్పులకు తోడ్పడేది. సమాజంలో ఏ అడ్డంకులు లేకుండా బతకడానికి వీలు కల్పించడంతోపాటు, సమాజం స్తబ్ధతకు గురికాకుండా పురోగమించడానికి ఈ 'నేను' 'నాది' తోడ్పడతాయి. 'నేను','నాది'లు మొత్తం సామాజిక ప్రక్రియలో భాగంగా ఉంటూ అటు వ్యక్తులు, ఇటు సమాజం రెండూ కూడా సమర్థంగా పనిచేయడానికి సహాయపడతాయి.

BRAOU

## 3.9 హెర్బర్ట్ బ్లూమర్ సిద్ధాంతం

ప్రతీకాత్మక చర్యావాదం అనే శబ్దాన్ని, భావనను లేదా దృక్పథాన్ని 1934లో హెర్బర్ట్ బ్లూమర్ మొట్టమొదటిసారి ప్రతిపాదించాడు. మీడ్ శిష్యులలో బ్లూమర్ అగ్రగణ్యుడు. మీడ్ ఆలోచనలను, అభిప్రాయాలను ఒక చోట క్రోడీకరించి వాటికి ఒక సిద్ధాంత స్థాయి కల్పించిన ఘనత బ్లూమర్‌దే. బ్లూమర్ వల్లనే ప్రతీకాత్మక, పరస్పర చర్యావాదాన్ని ఒక దృక్పథంగా పరిగణించారు.

"మనుషుల మధ్య జరిగే పరస్పర చర్యకు ఒక విశిష్టత ఉంది. ఈ విశిష్ట చర్యనే ప్రతీకాత్మక పరస్పర చర్య అనవచ్చు. మానవుల మధ్య జరిగే చర్య, ప్రతిచర్యగా సాగదు. ఒక పని చేసేటప్పుడు, ఒక చర్యకు ఉపక్రమించేటప్పుడు మనుషులు పరస్పర చర్యలను నిర్వచించి, దాని అర్థాన్ని వ్యాఖ్యానించి, తమ స్థితికి అన్వయించుకొని చర్యకు ఉపక్రమిస్తారు. మానవ చర్య, ప్రతీకల ద్వారా, వ్యాఖ్యానం ద్వారా, పరస్పర చర్యల అర్థవివరణ ద్వారా కొనసాగుతుంది. ప్రేరకానికి, ప్రతిస్పందనకు మధ్య ప్రతీకలు ప్రవేశించి ఒక వ్యాఖ్యానాత్మక ప్రక్రియను సృష్టిస్తాయి". ఇది బ్లూమర్ సిద్ధాంతం.

అలాగే సమాజ అధ్యయనం ఉమ్మడి చర్య అధ్యయనం అయి వుండడం ముఖ్యమని బ్లూమర్ భావన. వ్యక్తుల మధ్య ఏర్పడే ప్రతీకాత్మకక పరస్పర చర్యల ఫలితంగానే సమాజం రూపుదిద్దుకుంటుందని, వ్యక్తులు తమ చర్యలకు

అర్థాన్ని కల్పించి, నిర్వచిస్తారని ఈ ప్రక్రియ ప్రేరణ, ప్రతిస్పందనలుగా ఉంటుందని బ్లూమర్ భావన.

ప్రతీకాత్మక ప్రతిచర్యకు సంబంధించి బ్లూమర్ మౌలిక భావనలు ఈ క్రింది విధంగా వివరించవచ్చు.

1. పరస్పర చర్య జరుపుకుంటున్న మానవుల సమూహమే సమాజం. ఈ కార్యకలాపాలన్నీ వివిధ సంక్లిష్ట రూపాల ఉమ్మడి చర్యలో ఒక సమాజాన్ని సంఘటిత పరుస్తాయి. లేదా ఒక వ్యవస్థ ఏర్పాటుకు తోడ్పడతాయి.

2. పరస్పర చర్య ఇతర మానవుల కార్యలాపాలకు ప్రతిస్పందన. ప్రతీకాత్మకం కాని పరస్పర చర్యలు సాధారణ ప్రేరణ, ప్రతిస్పందనల రూపంలో సాగుతుంటాయి. భాష సర్వసాధారణ ప్రతీక.

3. వస్తువులకు స్వతస్సిద్ధమైన అర్థం అనేది ఏదీ ఉండదు. అది ప్రతీకాత్మక పరస్పర చర్య ద్వారా ఏర్పడేది మాత్రమే. భౌతిక వస్తువుల అర్థాలు ఆయా సామాజిక సంస్కృతులను బట్టి మారుతూ ఉంటాయి.

4. మానవులను వస్తువులుగా గుర్తిస్తారు. తమను కూడా వస్తువులుగా భావిస్తారు.

5. మానవ చర్య అనేది స్త్రీ, పురుషులు కల్పించిన వ్యాఖ్యానాత్మక చర్య. మానవుడు పరిగణనలోకి తీసుకునే వస్తువులలో అతని ఆశలు, ఆకాంక్షలు, లక్ష్యాలు, వాటిని సాధించడానికి ఉన్న మార్గాలు, సాధనాలు, వారి చర్యలకు సంబంధించిన ఇతరుల చర్యలు, ఆత్మభావన తన చర్యలవల్ల కలుగబోయే పర్యవసానాలు ముఖ్యమైనవని బ్లూమర్ భావించాడు.

6. ఒకరి చర్యలు సమూహంలోని ఇతర సభ్యుల చర్యలతో ముడిపడి ఉంటాయి. దీన్నే 'ఉమ్మడి చర్య' అంటారు. ఉమ్మడి చర్య 'భిన్న వ్యక్తుల విభిన్న చర్యలకు సంబంధించిన సామాజిక వ్యవస్థ' వీటినే సామాజిక శాస్త్రవేత్తలు 'సంస్కృతి', అని 'సామాజిక క్రమం' అని అంటారు.

ఈ విధంగా బ్లూమర్ అనుభవిక ప్రపంచమే అనివార్యమైన కేంద్రబిందువు కావాలి, దానిపైనే దృష్టి కేంద్రీకరించాలని భావించాడు. అనుభవం ఆధారంగా వాస్తవాల నిగ్గుతేల్చడం అంటే పరిశోధనాపద్ధతిని అనుసంధానించడం వల్ల కాదు అని కూడా ఆయన భావన.

BRAOU

## 3.10 ముగింపు

సామాజిక సమస్యలకు సంబంధించిన అనేక సిద్ధాంతాలలో మనస్తత్వ శాస్త్రం ప్రాతిపాదికన సమస్యల మూలాలను శోధించడం. సామాజికీకరణ, సామాజిక ప్రతిచర్యలను, పరస్పర చర్యలను నిర్వచించడం మరో పద్ధతి. మనిషి అంతరంగం ఆధారంగా సాగే ఈ భావనలకు ఆద్యుడు కూలే, మీడ్‌లు. మీడ్ భావనలను బ్లూమర్ సిద్ధాంతీకరించి అనుభవిక వాదాన్ని సిద్ధాంతంగా ప్రతిపాదించాడు. సామాజిక జీవిగా మానవుడి ప్రవర్తనా రీతులు, మూర్తిమత్వం, మనిషి అహం, నియంత్రణ, ప్రతీకాత్మక చర్యలను కూలే వివరించాడు. మీడ్, 'నేను','నాది' అనే భావనలను వివరించాడు. బ్లూమర్ మీడ్ ప్రతిపాదించిన ప్రతీకాత్మకచర్యల సామాజికభావనను ప్రతిపాదించాడు. అభి వృద్ధి పరిచాడు. సమాజనిర్మాణాన్ని అర్థం చేసుకోవడానికి ఇది మనోవైజ్ఞానికశాస్త్ర సిద్ధాంతంగా చెలామణిలో ఉంది.

## 3.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.

1. కూలే ప్రతిపాదించిన 'అహం', ప్రతిబింబిత అహంలను వివరించండి?

2. మీడ్ మౌలిక భావనలు ఏవి?

3. బ్లూమర్ సిద్ధాంతాన్ని వివరించండి?

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి?

1. ప్రతీకాత్మక చర్య అనగానేమి?

2. 'నేను', 'నాది'ని నిర్వచించండి.

3. బ్లూమర్ అనుభవిక వాదాన్ని వివరించండి?

## 3.12 చదువదగిన పుస్తకాలు


1. Francis Abraham, M. : Modern Sociologycal thouthit - An Introduction.

2. Cohen Press : Modern Sociological Theory.


BRAOU

# భాగం-4: సామాజిక సిద్ధాంతాలు

విషయక్రమం


4.0 ఉద్దేశాలు

4.1 పరిచయం

4.2 దుర్క్‌హైమ్ సిద్ధాంతం-శ్రమ విభజన

4.3 ఆత్మహత్య రకాలు

4.4 టాల్కట్ పార్సన్స్- వ్యక్తి ప్రాధాన్యత

4.4.1 ప్రకార్య పూర్వావసరాలు

4.4.2 నమూనా చరాంశాలు

4.5 మేర్టన్-అభివ్యక్త ప్రకార్యాలు-అంతర్లీన ప్రకార్యాలు

4.5.1 సామాజిక నిర్మాణం-అనియతి

4.6 కార్ల్ మార్క్స్

4.6.1 పరాయీకరణ

4.6.2 దోపిడీ భావన- అదనపు విలువ

4.6.3 వర్గపోరాటం

4.6.4 సిద్ధాంతం-ఆచరణల ఐక్యత

4.7 ముగింపు

4.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

4.9 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 4.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సామాజిక సిద్ధాంతాలు సంశ్లిష్టతగల సమాజాన్ని అవగాహన చేసుకుంటారు.
- సామాజిక సిద్ధాంతాల గురించి తెలుసుకుంటారు.
- సమాజశాస్త్ర సిద్ధాంతాల వికాస క్రమాన్ని అర్థం చేసుకుంటారు.

## 4.1 పరిచయం

భౌతిక ప్రపంచాన్ని, ప్రకృతిని అర్థం చేసుకోవడానికి అనేక సిద్ధాంతాలున్నాయి. అట్లాగే మానవ ప్రవర్తనకు, సంబంధాలకు, వ్యవస్థలకు సంబంధించి కూడా సిద్ధాంతాలున్నాయి. మనుషుల చర్యలు, ప్రతి చర్యలు, ఈ చర్యల వల్ల కలుగుతున్న మార్పులు, మార్పుల ఫలితంగా ప్రపంచంలో సంభవిస్తున్న పరిణామాలు పరిశీలించి, విశ్లేషించిన

అనేక మంది సామాజిక శాస్త్రవేత్తలు, వ్యవస్థ గమనం పట్ల అనేక సిద్ధాంతాలు చేశారు. సామాజిక సమస్యల పరిష్కారంలో ఈ సిద్ధాంతాల అన్వయం అవశ్యం. సమాజశాస్త్ర సిద్ధాంతాలు సమాజ ఆవిర్భావం, దశలు, మార్పులు, కారణాలను వివరిస్తాయి. సమాజశాస్త్ర సిద్ధాంతాలు అంటే ఒక క్రమపద్ధతిలో వ్యవస్థీకృతమై, తార్కికంగా అన్వయపరచిన ఏవైనా రెండు చరాంశాల మధ్యగల దృగ్విషయాన్ని వివరించగలిగినవి. వాస్తవాలను ఒక క్రమపద్ధతిలో వివరించేదే సిద్ధాంతం.

సమాజశాస్త్ర సిద్ధాంతం శాస్త్రీయంగా సామాజిక వికాస క్రమాన్ని, దానిలోని మానవ సంబంధాలను వివరించేది. సమాజం ఎట్లా పుట్టింది? మనిషి ఎట్లా పరిణామం చెందాడు? ఎలా మనగలిగాడు? మనుగడ కోసం ఏయే దశలలో ఎలాంటి అవస్థలు పడ్డాడు? ప్రకృతికి మనిషికి, మనిషికి మనిషికి, మనిషికి సమూహాలకు మధ్య సంబంధాలు, ఘర్షణలు తదితర అంశాల విశ్లేషణల సమాహారం సామాజిక సిద్ధాంతం.

సమాజశాస్త్ర సిద్ధాంతానికి ఫ్రెంచ్ సమాజశాస్త్రవేత్తలు ముఖ్యంగా తొలి దశలో సెయింట్ సైమన్, ఆగస్ట్ కోమ్టే, దుర్క్‌హైమ్‌లు ఎనలేని కృషి చేశారు. ఆగస్ట్‌కోమ్టే సమాజశాస్త్ర పితామహుడు. సమాజశాస్త్రాన్ని ఇతర శాస్త్రాల మాదిరిగా పరిశోధించవచ్చునని నిరూపించింది ఆయనే. దుర్క్‌హైమ్ సమాజశాస్త్రాన్ని బోధనాంశంగా అభివృద్ధి చేశాడు. కార్ల్‌మార్క్స్, మాక్స్ వెబర్, జార్జి సిమ్మెల్ లాంటి వారు సమాజశాస్త్రాన్ని తమ సిద్ధాంతాల ద్వారా పరిపుష్టం చేశారు. అమెరికా సామాజిక సిద్ధాంత వేత్తలు గ్రాహం సమ్నర్, లెస్టర్ వార్డ్‌లు, టాల్కాట్ పార్సన్ లాంటి వారు సామాజిక సిద్ధాంతాలు చేశారు. తొలి సంప్రదాయవాదులనుంచి నేటి ఆధునిక వాదుల దాకా సామాజిక సిద్ధాంతాల మహా ప్రస్థానం కొనసాగింది.

## 4.2 దుర్క్‌హైమ్ సిద్ధాంతం-శ్రమవిభజన

సమాజశాస్త్రంలో ప్రకార్యవాదానికి ఎమిలీదుర్క్‌హైమ్ ఆద్యుడు. సామాజిక దృగ్విషయాలను ఆయన ప్రకార్యాల దృష్ట్యా నిర్వచించాడు. సామాజిక వాస్తవాంశాలకు సంబంధించిన కారణాలను, పర్యవసానాలను ఒక క్రమపద్ధతిలో వివరించడం ద్వారా, సామజిక విశ్లేషణకు ప్రకార్యవాదం ఒక శక్తివంతమైన విశ్లేషణ సాధనమని దుర్క్‌హైమ్ నిరూపించాడు. వ్యక్తి స్వేచ్ఛ(Individual Will) కన్నా సామాజిక ఇచ్ఛ (Social Will) ముఖ్యమైనదని దుర్క్‌హైమ్ వాదన. 'ఒక వాస్తవాంశం ఎలా ఉపయోగకారిగా వుంటుందో తెలియజేయడానికి దాని మూలమేమిటో? అది ఎందుకు సంభవించిందో? అసలు అది ఏమిటో వివరించవలసిన అవసరం లేదు. ఒక దృగ్విషయం వల్ల కలిగే ప్రయోజనాలు, దాని ప్రత్యేక లక్షణాలను స్పష్టంగా తెలియజేస్తాయని కానీ దానిని సృష్టించలేవు' అని దుర్క్‌హైమ్ భావన.

దుర్క్‌హైమ్ 1958లో ఫ్రాన్స్‌లోని ఎపినాల్‌లో జన్మించాడు. దుర్క్‌హైమ్ ప్రధాన పరిశోధనావ్యాసం 'The Division of Labour' ద్వారా శ్రమ విభజనకు కొత్త సామాజిక అర్థాన్ని కల్పించాడు. శ్రమ విభజన ప్రకార్యాలు, కారణాలు, విపరీత రూపాలను గురించి చర్చించి దానికి సామాజిక హోదా చేకూర్చాడు. దాన్ని ఆయన 1893లో వెలువరించాడు. 1895లో 'The Rule fo Sociological Methods' పేరిట సామాజిక వాస్తవాంశాల నిర్వచనాలు ఇచ్చాడు. 1897లో ఆత్మహత్యలకు సంబంధించి దుర్క్‌హైమ్ వెలువరించిన గ్రంథం ఆత్మహత్యలకు సామాజికాంశాలే కారణమని చూపి సంచలన కారకమైంది.

### సామాజికాంశాలు

విజ్ఞానశాస్త్రానికి ఒక ప్రత్యేక శాస్త్ర ప్రతిపత్తి కలగడానికి ప్రత్యేక అధ్యయనాంశం ఉండాలని దుర్క్‌హైమ్ భావన. ఈ నిర్దిష్ట అధ్యయనాంశం అనుభవైకంగా ఉండాలని, జ్ఞానేంద్రియాలతో పరిశీలించదగిందిగా ఉండాలని ఆయన అన్నారు. అందుకే సమాజం, సామాజికాంశాలు ఆయన అధ్యయన వేదికలయ్యాయి. భాష, న్యాయ సూత్రాలు, సామాజిక విశ్వాసాలే సామాజికాంశాలు.

BRAOU

**సామాజిక లక్షణాలు:** సామాజికాంశాలు ప్రధానంగా మూడు లక్షణాలను కలిగి వుంటాయి. అవి: 1. బహిరత, 2. సాధారణ, 3. పరిమిత లేదా నియంత్రణ. సామాజికాంశాలు వైయక్తిక జైవిక కోణాలలో కాకుండా సమాజంలోనే సామాజికులకు బహిరంగంగా ఉంటాయి.

అయితే, సామాజికాంశాల వివరణకు కొన్ని నియమాలుంటాయి. అవి 1.కారణభూతమైనవి, 2.ప్రకార్యసంబంధమైనవి.

## దుర్క్‌హైమ్-శ్రమవిభజన

శ్రమ విభజనగురించి దుర్క్‌హైమ్ రాసిన 'The Study on Division of Labour in Society' అన్న గ్రంథం నిజానికి అతని పరిశోధనా వ్యాసం. తొలివ్యాసం కూడా. శ్రమ విభజన గురించి దుర్క్‌హైమ్ ప్రతిపాదనలు మొట్టమొదటివేమీ కాదు. అంతకుముందు సాంప్రదాయ వాదులైన ఆర్థిక శాస్త్రవేత్త ఆడమ్‌స్మిత్ లాంటివారు శ్రమ విభజన సిద్ధాంతాలు చేశారు. సంక్లిష్టమైన కార్యాలను చిన్నవిగా విభజనచేసి, ప్రక్రియలో పాల్గొనేవారందరికీ ఒక్కొక్కవిధి కేటాయించడం వల్ల సామర్థ్యం, ఉత్పాదకత పెరుగుతాయని సాంప్రదాయ ఆర్థికవేత్తల అభిప్రాయం.

తద్విరుద్ధంగా దుర్క్‌హైమ్, శ్రమవిభజన సమాజానికి అంతటికీ వర్తించే ఒక మౌలికమైన, సమగ్రమైన అంశమని యావత్ సమాజం దాని ప్రభావానికి లోనవుతుందని చెప్పాడు. సాంప్రదాయవాదుల శ్రమవిభజన సంకుచితమైందని దుర్క్‌హైమ్ తిరస్కరించాడు. నిజానికి ఆర్థిక వ్యవస్థలోని ప్రత్యేకీకరణ కూడా సమాజంలోని సాధారణ విభేదీకరణ ఫలితమేనని దుర్క్‌హైమ్ వాదించాడు. సమాజంలోని సభ్యుల మధ్య సంఘీభావానికి, శ్రమవిభజనకు సంబంధం ఉందని దుర్క్‌హైమ్ భావన.

దుర్క్‌హైమ్ శ్రమ విభజన ముందు, సమష్టి వివేకం గురించి ప్రతిపాదించాడు. 'ఒకానొక సమాజంలోని సగటు సభ్యుల విశ్వాసాలు, మానసిక భావనల సమగ్రరూపమే సమష్టి వివేకం. వీటివల్లనే ఒక నిర్దిష్ట వ్యవస్థ ఏర్పడుతుంది'అని దుర్క్‌హైమ్ అన్నాడు. ఇది అందరికీ సమానంగా వర్తించి, తరతరాలను అనుసంధానం చేస్తుందని సమష్టితత్వం వ్యక్తులకు అతీతంగా ఉంటుందని పేర్కొన్నాడు.

BRAOU

## రెండు రకాల సంఘీభావం

దుర్క్‌హైమ్ సమాజాలను రెండు రకాలుగా వర్గీకరించాడు. అవి:

1. లింగ, వయో భేదాల ఆధారంగా ఆపాదిత గుణాల ద్వారా విభజన. ఈ విభజనలో అన్ని రకాల పనులు అందరూ సమానంగా చేస్తుండడం వల్ల ఏకతా భావంతో సమాజంలో సంఘీభావం ఏర్పడుతుంది. దీన్ని దుర్క్‌హైమ్ 'యాంత్రిక సంఘీభావం' అన్నాడు.

2. భారీ పారిశ్రామిక సమాజాలు: ఈ సమాజాలలో వ్యక్తులు నిర్వహించే బాధ్యతలు భిన్నంగా ఉంటాయి. అందువల్ల సమాజంలోని అన్ని భాగాలు పరస్పరం భిన్నంగా కనబడతాయి. ఇటువంటి సమాజాలలో సంఘీభావాన్ని దుర్క్‌హైమ్ 'సాంఘిక సంఘీభావం' అన్నారు. ఇలాంటి భిన్నత గల సమాజాలలో శ్రమ విభజన అత్యున్నత స్థాయిలో ఉంటుంది.

యాంత్రికంగా సంఘీభావం ద్వారా ఏర్పడిన సమాజాలు అంశిక స్వభావం కలవి. ఈ సమాజాలలో వివిధ అంశాల మధ్య పరస్పర ఆధారిత కన్పించదు. అల్పజనాభా, భౌతిక, నైతిక సాంద్రత అల్పస్థాయిలో ఉండడం ఇలాంటి సమాజాలలో కనిపిస్తుంది. అయితే, ఈ సమాజాలలో సమష్టి వివేకం సర్వవ్యాప్తమై ఉంటూ, వ్యక్తిగా సభ్యుల వైయక్తికత కనుమరుగయ్యే స్థాయిలో సమష్టి తత్వం నెలకొంటుంది. ఈ సమాజాలలో సమష్టి వివేకం ప్రధానంగా మతం. ఇందుకు కారణం మతం సామాజిక జీవితమంతటా పరివ్యాప్తమై ఉండడమే.

యాంత్రికంగా సంఘీభావంగల వ్యవస్థలో న్యాయసూత్రాలు, చట్టాలు, అణచివేత, శిక్ష ప్రధాన లక్షణాలుగా కలిగి

వుంటాయి. నేరస్తులను బాధించి ఆ నేరం మరోసారి జరగకుండా చూడడమే ప్రధాన అంశంగా ఉంటుంది. ఈ సందర్భంగా నేరం అంటే, సమష్టి వివేకానికి విఘాతం కలిగించేదని దుర్క్‌హైమ్ నిర్వచించాడు.

జనాభా పరిమాణం పెరిగేకొద్దీ భౌతిక, నైతిక సాంద్రతలు పెరుగుతాయి. అయితే, జనాభా పరిమాణం, సాంద్రత పెరిగినందువల్ల ఉత్పన్నమయ్యే అవసరాల పెరుగుదలను శ్రమవిభజన ద్వారా శాంతియుత మార్గంలో తీర్చుకోవచ్చునని దుర్క్‌హైమ్ సూచించాడు. ఇట్లా అధిక శ్రమ జైవిక సంఘీభావానికి దారితీస్తుంది. జైవిక సంఘీభావం పెరిగినాకొద్దీ సమష్టి వివేకం తుగ్గముఖం పడ్తుంది. శ్రమ విభజన ప్రత్యేకీకరణ పెరిగినకొద్దీ సమష్టి వివేకం పాత్ర తగ్గుతూ వస్తుంది. ఈ పరిస్థితులలోనే వ్యక్తులు స్వతంత్రులుగా మారి, పరస్పర ఆధారితను గుర్తిస్తారు. ఇది సంఘీభావానికి తోడ్పడుతుందని దుర్క్‌హైమ్ అంటాడు. ఈ దశలోనే న్యాయ సూత్రాలు, చట్టాలు కూడా ప్రత్యర్పణ ప్రధానంగా మారి, నియమపాలనకు రకరకాల సంస్థలు, ట్రిబ్యునళ్లు, కౌన్సిళ్ల లాంటివి ఏర్పడతాయని దుర్క్‌హైమ్ ప్రతిపాదించాడు.

## 4.3 ఆత్మహత్యా రకాలు

దుర్క్‌హైమ్ 1897లో ప్రచురించిన మూడవ గ్రంథం 'Suicide' సమష్టి వివేకానికి సంబంధించిన సామాజిక పరిమితులకు సంబంధించిన గ్రంథం. భావనాపరమైన అంశాలను, అనుభవైక పరిశోధనా పద్ధతులను మేళవించి రూపొందించిన గ్రంథంగా ఇదొక మైలురాయి. ఆత్మహత్యను విశ్లేషించడంలో గణాంక వివరాలను విశేషంగా ఉపయోగించారు. ఎందుకంటే, 1. మనోవిజ్ఞాన శాస్త్రం, జన్యుశాస్త్రం, వాతావరణ, భౌగోళిక శాస్త్రాలపై ఆధారపడిన సిద్ధాంతాలను తిరస్కరించడానికి, 2. ఆత్మహత్యకు సామాజిక వివరణ ఇచ్చే క్రమంలో అనుభవిక సాక్ష్యాలకు మద్దతు ఇవ్వడం కోసం.

BRAOU

ఆత్మహత్యలను తొలిసారిగా సామాజిక అంశాల ఆధారంగా విశ్లేషించిన దుర్క్‌హైమ్ ఇవి సమాజేతర అంశాలు అని భావించిన సిద్ధాంతాలను తిరస్కరించడానికి, ఆత్మహత్యల రేటును, ఉపయోగించాడు. అందుకోసం ఉన్మాదానికి ఆత్మహత్యల రేటుకు, వాతావరణంలో మార్పులకు ఆత్మహత్యల రేటుకు, అనుకరణకు ఆత్మహత్యల రేటుకు ఉన్న సంబంధాన్ని దత్తాంశ విశ్లేషణ చేసిన దుర్క్‌హైమ్ ఈ అంశాల మధ్య ఏ సానుకూల సహసంబంధం లేదని రుజువు చేసి సమాజేతర కారణాల మూలంగా ఆత్మహత్యలు జరుగుతున్నాయన్న సిద్ధాంతాలను తిరస్కరించాడు.

ఆత్మహత్యలకు మానసిక కారణాలను పూర్తిగా తిరస్కరించకపోయినా, మానసిక పూర్వాభిమానాలు, సామాజిక నిర్ధారణ వంటి అంశాల మధ్య విభేదాన్ని మాత్రం స్పష్టపరిచాడు. జాతి, జాతీయతలకు ఆత్మహత్యలకు సంబంధంలేదు. కాథలిక్ మతం వారిలో, ప్రొటెస్టంట్ మతం వారికన్నా ఆత్మహత్యల నిష్పత్తి భేదం చాలా స్వల్పమని ఆయన పేర్కొన్నాడు. ఇందుకు కారణాలున్నాయి. కాథలిక్ మతం తన సభ్యులను మరింత సంఘటిత పరుస్తుంది. కావున ఆత్మహత్యల రేటు తక్కువ. ప్రొటెస్టెంట్లు వ్యక్తి స్వేచ్ఛను ప్రోత్సహించినందువల్ల క్రమానుగత శ్రేణి ఉండకపోవడం, అందరికీ సమానస్థాయి నమ్మకాలు, విశ్వాసాలు లోపించినందువల్ల వీరిలో ఆత్మహత్యలు ఎక్కువ అని సామాజిక కారణాలు చూపవచ్చు. మతం మాదిరిగానే కుటుంబ వ్యవస్థ కూడా ఆత్మహత్యలను నిరోధించే శక్తివంతమైన సాధనం. అవివాహ స్థితి ఆత్మహత్యల రేటు పెరుగుదలకు తోడ్పడితే, వివాహ వ్యవస్థ వల్ల ఆత్మహత్య రేటు సగానికి సగం పడిపోతుందని, అలాగే కుటుంబ సభ్యుల పరిమాణం పెరిగినకొద్దీ ఆత్మహత్యల రేటు తగ్గుతుందని దుర్క్‌హైమ్ భావన.

ఆత్మహత్యలకు అనువంశికత, శీతోష్ణస్థితి, జాతి లక్షణాలు, అనుకరణ వంటి కారణాలను తిరస్కరించారు. అందువల్ల వైయక్తిక అంశంగా కనిపించే ఆత్మహత్యకు సమాజపరమయిన వివరణ ఇవ్వవచ్చునని దుర్క్‌హైమ్ అంటాడు. సమాజ నిర్మితి, అది నిర్వహించే ప్రకార్యాల కారణంగా ఆత్మహత్యలు సంభవిస్తాయి. ఆత్మహత్య ఒక సంఘటితమైన, కచ్చితమైన యధార్థమనే దానిపైనే దుర్క్‌హైమ్ సిద్ధాంత మూలాలున్నాయి. అందువల్ల సమాజమే ఆత్మహత్యలకు మూలమన్న భావన ప్రతిపాదనలోకి వచ్చింది.

రకాలు

భిన్న సమాజాలు, సంస్కృతుల నుంచి సేకరించిన దత్తాంశ విశ్లేషణల ఆధారంగా దుర్క్‌హైమ్ ఆత్మహత్యలను మూడు రకాలుగా విభజించాడు. అవి: 1. అహంభావంతో కూడిన ఆత్మహత్యలు, 2. పరుల క్షేమేచ్ఛతో ఆత్మహత్యలు, 3. అనియతి కారణ సంబంధమైన ఆత్మహత్యలు. వాటి వివరాలను కింద పరిశీలించవచ్చు.

## 1. అహంభావంతో కూడిన ఆత్మహత్యలు

ఒక వ్యక్తి తన సామాజిక సమూహంతో సమైక్యం కానప్పుడు ఇటువంటి ఆత్మహత్య సంభవిస్తుంది. వ్యక్తులు సమాజంలో సమైక్యం కావడంలో మతం, కుటుంబం, రాజకీయ జాతీయ సముదాయాలలో తరతమ భేదాలుంటాయని వ్యక్తులు అలాంటి పరిస్థితులలో బతుకు భారం తగ్గించుకోవడానికి ఆత్మహత్యే శరణ్యంగా భావిస్తారని చెప్పవచ్చు. ఈ అభిప్రాయాలు కలగడానికి తక్కువ సమైక్యతా స్థాయి కారణమని దుర్క్‌హైమ్ భావన. సమైక్యత అధికమయ్యేకొద్దీ ఆత్మహత్యల రేటు తగ్గుతుంది. కుటుంబ పరిమాణం పెద్దదైన కొద్దీ సమైక్యతాస్థాయి పెరుగుతూంది. అది ఆత్మహత్యల విషయంలో రక్షణ కవచంగా పనిచేస్తుంది. అందుకే, రాజకీయ ఉత్పాతాలు ఆత్మహత్యలను ప్రేరేపిస్తాయన్న సాంప్రదాయ భావనలను దుర్క్‌హైమ్ తిరస్కరించి సామాజిక అలజడులు, యుద్ధాల వల్ల సమైక్యతాస్థాయి పెరిగి ఆత్మహత్యలు తగ్గుతాయని భావించినాడు.

## 2. పరుల క్షేమేచ్ఛతో ఆత్మహత్యలు

ఒక వ్యక్తి తన సామాజిక సమూహంతో మోతాదుకు మించి సమైక్యత చెందడం వల్ల ఇటువంటి ఆత్మహత్యలు సంభవిస్తాయి. వ్యక్తి జీవితం పూర్తిగా ఆచార వ్యవహారాలు, అలవాట్ల ఆధీనంలో ఉన్నప్పుడు ఉన్నత ఆదర్శాలకోసం ప్రాణాల్ని కూడా తీసుకుంటాడు. భారతదేశంలో 'సతి' ఇట్లాంటిదే. వృద్ధాప్యంలో డేనిష్ యోధులు ప్రాణత్యాగం చేయడం, సహజమరణాన్ని తప్పించుకోవడానికి ఎత్తైన ప్రదేశాలనుంచి దూకి చనిపోయే గోథ్‌లు ఇందుకు మంచి ఉదాహరణ. ఈ ఆత్మహత్యల విషయంలో ఆత్మార్పణ, ఆత్మపరిత్యాగం వంటి ఉదాత్త, హర్షణీయ చర్యలుగా భావించడం ఉంది. ఆత్మాహుతి దళాలు, జపాన్‌లో హారికెరి లాంటివి ఇందుకు ఉదాహరణలు. అంటే ఇతరుల క్షేమేచ్ఛతో కూడిన ఆత్మహత్యలకు ఉన్న సామాజిక ఆమోదం వల్ల ఒక వ్యక్తి గొప్ప ఆశయం, ఆదర్శం, విలువల కోసం ప్రాణాల్ని త్యాగం చేయడంగా ఈ ఆత్మహత్యలను భావించవచ్చు.

## 3. అనియతి కారణంగా ఆత్మహత్యలు

సమాజంలో ప్రమాణాలు, కట్టుబాట్లు లేని పక్షంలో ఇలాంటి ఆత్మహత్యలు జరుగుతాయి. పారిశ్రామిక, ఆర్థిక సంక్షోభాలు నెలకొన్న సమాజాలలో అనియతి కారణంగా ఆత్మహత్యలు జరుగుతాయి. ఇది ఒక్క దరిద్రం వల్ల మాత్రమే కాదు. హఠాత్ సౌభాగ్యం వల్ల కానీ, దౌర్భాగ్యం వల్లగాని ఏర్పడిన సామాజిక అలజడి నియమరాహిత్యానికి దారితీసి, స్వచ్ఛంద మరణాలకు వ్యక్తులను ప్రేరేపిస్తాయి. మానవుడి జైవిక నిర్మితిలో కానీ, మానసిక వ్యవస్థలోకానీ పెరుగుతున్న ఆకాంక్షలకు పగ్గంవేసే యంత్రాంగం లేదు. సామాజిక కోర్కెలను నియతిద్వారా నియంత్రించగలం. ఇదిలేనప్పుడు సంక్షోభం ఏర్పడి ఆత్మహత్యలు పెరుగుతూ వుంటాయని దుర్క్‌హైమ్ భావన.

# 4.4 టాల్‌కాట్ పార్సన్స్-వ్యక్తి ప్రాధాన్యత

1950 నుంచి 1970 దశకం మలినాళ్లదాకా పార్సన్స్ సామాజిక సిద్ధాంతాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. సమస్తానికి ఒక భావనాత్మక నిర్మితిని సమకూర్చాలన్న లక్ష్యంతో పార్సన్స్ సిద్ధాంతాలు చేశాడు. 1902లో జన్మించిన టాల్‌కాట్ పార్సన్స్ 'The Structure of Social Action', 'Social System', 'Social Structre and Personality' లాంటి గ్రంథాలు వెలువరించాడు.

## సామాజిక చర్య:

మానవుల బాహ్యాశక్తుల ప్రతిక్రియ చూపడానికి ముందు వాటిని గ్రహించి, అర్థం చేసుకొని వివరించవచ్చుననుకుంటారు. ఈ మానవ ప్రవృత్తియే సామాజిక చర్య అని పార్సన్స్ నిర్వచించాడు. ఈ అర్థం ప్రకారం ప్రతిచర్యా ప్రవృత్తి కిందకు వస్తుంది. ఈ ప్రవృత్తి చర్యగా పరిణమించడానికి నాలుగు స్థితులను పార్సన్స్ సూచించాడు. అవి:

1. ఉద్దేశాలు, లక్ష్యాలు లేదా ఆక్షేపించిన ఇతర వ్యవహారాలను సాధించేందుకు పూర్తిగా కలిసి ఉండాలి, 2. కొన్ని పరిస్థితులలో అది సంభవించాలి, 3. సామాజిక విలువలు, నియమాల చేత అది నియంత్రితమై ఉండాలి, 4. శక్తి లేదా ప్రేరణ లేదా కృషి మదింపు ఉండాలి. ఈ అంశాలన్నీ కలిస్తే ప్రవృత్తి చర్యగా మారుతుంది. అట్లాగే ఒక స్వచ్ఛంద చర్యకు, పాత్రధారులు వ్యక్తులై ఉండాలని, లక్ష్యసాధకులై వుండాలని, వారికి ప్రత్యామ్నాయ సాధనాలుండాలని, ప్రతిబంధకాలుంటాయని, వాటిని అధిగమించాలని గుర్తించాలని, విలువలు, నియమాలు, భావనలను పరిగణనలోకి తీసుకోవాలని, అనువైన మార్గాలు గుర్తించాలని కూడా పార్సన్స్ అంటాడు.

ఇట్లా వివిధ రకాలుగా ప్రేరేపితులైన పాత్రధారులు పరస్పరం కలుసుకున్నప్పుడు నమ్మకాలు ఏర్పడతాయని అవి వ్యవస్థీకృతమవుతాయని, వీటి నమూనాయే సామాజిక వ్యవస్థగా భావించాలంటాడు. 'సూక్ష్మంగా చెప్పాలంటే, ఒకానొక పరిస్థితిలో పరస్పర ప్రతిక్రియ నెరుపుతున్న విడివిడి పాత్రధారుల బహుళత్వంలో సామాజిక వ్యవస్థ రూపుదిద్దుకుంటుంది. కనీసం ఒక భౌతిక లేదా పర్యావరణ అంశం ఆ పరిస్థితిలో చేరి ఉంటుంది. సుఖాన్ని విస్తరించుకోవడం ఒక ధోరణి పరంగా పాత్రదారులు ప్రేరణ పొంది ఉంటారు. ఈ పరిస్థితుల్లో పాత్రదారులకు, పాత్రదారుకూ మధ్య ఉండే సంబంధాలు మొత్తం సాంస్కృతికంగా నిర్మితమై ఉమ్మడి ప్రతీకల వ్యవస్థపరంగా నిర్వచించవచ్చునని అంటారు. పార్సన్స్ ప్రకారం సామాజిక వ్యవస్థకు ఈ క్రింది లక్షణాలు ఉంటాయి.

BRAOU

1. సామాజిక వ్యవస్థలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పాత్రదారుల మధ్య పరస్పర ప్రతిక్రియ నెలకొంటుంది.
2. ప్రతిక్రియ చోటుచేసుకుంటుందంటే పాత్రదారులు లేదా ఇతర ప్రత్యామ్నాయలు ఉండవని అర్థం. భావావేశాన్ని, విలువల వివేచనను వీరు కలిగి ఉంటారు. లక్ష్యసాధన వాటి ద్వారా జరుగుతుంది.
3. సమాజానికి ఉమ్మడి విలువలు, ఉమ్మడి లక్ష్యం, ఆకాంక్షలపై ఏకీభావం ఉంటుంది.

## వ్యక్తి ప్రాముఖ్యత

టాల్‌కాట్ పార్సన్స్ ప్రకారం

1. ఒక వ్యక్తి సామాజిక కార్యకలాపాలు సామాజిక పరిస్థితులనుంచి, వ్యక్తిగత అంశాలనుంచి ఏర్పడతాయి.
2. వ్యక్తి తన లక్ష్యాలను, గమ్యాలను చేరడానికి ప్రయత్నం చేస్తాడు.
3. ఇందుకు తగిన మార్గాలను ఎన్నుకుంటాడు.
4. పనిచేయలేని పరిస్థితులలో పాత్రదారుల చర్యలపై నియంత్రణ ఉంటుంది.
5. మనోబలంతో నిర్ణయాలు, ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తారు.
6. కొన్ని ప్రమాణాలకు, నియమాలకు, నీతికి కట్టుబడి నిర్ణయాలు తీసుకుంటారు.

పార్సన్స్ రెండు దశలుగా సామాజిక వ్యవస్థ గురించి మాట్లాడుతారు. ఒకటి వ్యక్తిగత స్థాయిలో వ్యక్తి చర్యలు, ఆలోచనలకు ప్రాధాన్యత ఇచ్చారు ఆ దశనుంచి వ్యక్తిని, పరస్పరం సంబంధం, సాంఘిక పద్ధతులు తద్వారా పరిశీలించిన సామాజిక చర్య ప్రధానమైంది.

### 4.4.1 ప్రకార్య పూర్వావసరాలు

ఒక సమాజంలో కుటుంబం, ఆర్థిక వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ వంటి అన్ని వ్యవస్థలు నిరంతరాయంగా కొనసాగే ఏర్పాటు ఆ సమాజంలోనే ఉంది. సమాజంలో సభ్యులుగా ఉండేవారు ఆ సామాజిక విలువలు, ప్రామాణికతలకు అనుగుణంగా సాంఘికీకరణం చెందుతూ ఉన్నందువల్ల ఈ వ్యవస్థ నిరంతరాయంగా అభివృద్ధి చెందుతూ వర్థిల్లుతున్నది. సామాజిక విలువలకు అనుగుణంగా వ్యక్తుల ప్రవర్తన, ఉద్దీపన, విలువలు రూపొందుతాయని టాల్‌కాట్ పార్సన్స్ భావించాడు.

సామాజిక వ్యవస్థ ఎప్పటికప్పుడు బయటినుంచి వచ్చే మార్పులకు అనుగుణంగా సర్దుబాటు చేసుకుంటూ ఉంటుంది. ఒక సామాజిక వ్యవస్థలో ఇలాంటి స్వయం నియంత్రణ, స్వయం నిర్వహణ గుణాలు పుష్కలంగా ఉన్నాయి.

ఇలా వ్యవస్థ కొనసాగడానికి కొన్ని దోహదపడే వ్యవస్థలోని ప్రకార్యాలను పార్సన్స్ ప్రకార్యపూర్వ అవసరాలు అన్నాడు. అవి:

1. అనువర్తితం (adaptation)
2. లక్ష్యసాధన (goal attainment)
3. సమగ్రత (intigration)
4. సముద్ధరణ (latency)

ఈ నాలుగు ప్రకార్యపూర్వావసరాలు వాటి పరిధి, అంతర్గతంగా అలాగే బాహ్యంగా అవి నిర్వహించే ప్రక్రియలను బట్టి ఉంటుంది. అది పరస్పర చర్యలు, సర్దుబాట్లను బట్టి ఉంటుంది. వాటి గురించి వివరంగా

**1. అనువర్తితం:** వ్యవస్థ, బయటినుంచి వనరులను స్వీకరించి అంతర్గత అవసరాలకు అనుగుణంగా మలిచి పంపిణీ చేసే విధిని అనువర్తితం అంటారు. ఆర్థిక వ్యవస్థను పరిశీలించినట్టయితే వనరుల సమీకరణ, ఉత్పత్తుల తయారీ, పంపిణీ, వినిమయం వంటి సామాజిక అవసరాలు తీర్చి వ్యవస్థ నిరాటంకంగా కొనసాగడానికి తోడ్పడుతుంది. అనువర్తితం ద్వారా సామాజిక వ్యవస్థ పనులలోటును అధిగమిస్తుంది.

**2. లక్ష్యసాధన:** లక్ష్యసాధన సామాజిక వ్యవస్థ ప్రకార్య సిద్ధికి ఒక ప్రధాన పూర్వ అవసరం ఇలా అవసరాల అంచనాకు ఒక యంత్రాంగం, వ్యవస్థీకృత నిర్మాణం కూడా అవసరం. వ్యవస్థలో రాజకీయ, అధికార యంత్రాంగం ఈ విధిని నిర్ణయిస్తుంది. బాహ్యవనరులను, ఆంతరంగిక వనరులను అంచనావేసి, లక్ష్యాలు నిర్ణయించుకొని చట్టాలు, శాసనాల ద్వారా అమలు పరచి ఈ వ్యవస్థలో నిర్వహిస్తారు. ఇలా ముందుగా అంచనావేసి లక్ష్యాలు నిర్ణయించుకొని సాధించడమే లక్ష్యసాధన.

**3. సమగ్రత:** సమాజంలో వ్యక్తులమధ్య అంతరాలు లేకుండా చూస్తూ, సమైక్యతను నిరంతరాయంగా సమన్వయ పరిచే వ్యవస్థ కూడా ఒకటి వుంటుంది. వ్యక్తుల సాంస్కృతిక జీవనం, పండగలు, ఉత్సవాలు సంబంధాలను బలోపేతం చేయడానికి, వ్యక్తుల విధులు, బాధ్యతలు గుర్తుచేసి ఐక్యతకు తోడ్పడతాయి.

**4. సముద్ధరణ:** సామాజిక వ్యవస్థ ప్రకార్య పూర్వ అవసరాలలో సముద్ధరణ ప్రధానమైంది. సామాజిక వ్యవస్థలో ఉద్దీపనాశక్తులను సమీకరించి, సముపార్జించి, సమపరిచి అందించే కార్యకలాపాల నిర్వహణలో తోడ్పడే అంశాలన్నీ సముద్ధరణ కిందికే వస్తాయి. నమూనాను కొనసాగించడం వ్యవస్థలో తలెత్తే ఉద్రిక్తతలను తగ్గించడానికి వ్యవస్థలో ఉండే సాంఘికీకరణ యంత్రాంగాలైన విలువలు, ఆచారాలు, సంప్రదాయాలు, అభిరుచులు, ఆసక్తులు, అలవాట్లు లాంటివి సంస్కృతి కొనసాగడానికి ఉపయోగపడతాయి.

BRAOU

## 4.4.2 నమూనా చరాంశాలు

సామాజిక వ్యవస్థలో 'పాత్ర' అనే ప్రవర్తనా వ్యవస్థ ఇమిడి ఉంటుంది. సామాజిక వ్యవస్థ, సమాజంలోని వ్యక్తులకు ఈ పాత్రలను, అయా పాత్రలకు సరిపోయే ప్రవర్తనా రీతులను అపాదిస్తుంది. వ్యక్తి కూడా సాంఘికీకరణం ద్వారా వ్యవస్థ అపాదించిన పాత్రలను స్వీకరిస్తాడు. ప్రవర్తనా ధోరణులను అనుసరిస్తాడు. ప్రమాణాలను అంతరంగీకరణం చేసుకుంటాడు. పాత్ర స్వీకరణ, పాత్రపోషణ సమాజంలో ఒక కొత్త ఒత్తిడికి దోహదం చేస్తాయి. ఈ పాత్రల పోషణలో, స్వీకరణలో ఒత్తిడివల్ల వ్యక్తులు (పాత్రదారులు) సందిగ్ధానికి గురవుతారు. వ్యక్తి ఇష్టాఇష్టాలు లేదా ప్రాధాన్యతలు అలాగే అవసరాలు, విలువల్లోంచి ఈ సందిగ్ధత, ఉద్రిక్తతలు ఏర్పడతాయి. పరిస్థితికి అనుగుణంగా అడుగువేసే ముందు పాత్రదారి తన ముందున్న అవకాశాలలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవలసి వస్తుంది. పాత్ర పోషణలో వ్యక్తి ఎదుర్కొనే ఈ సందిగ్ధాన్ని పార్సన్స్ నమూనా చరాంశాలు (Pattern Variable) అన్నాడు. ఈవిధంగా పార్సన్స్ ఐదు రకాల చరాంశాలను పేర్కొన్నాడు. ప్రతీ చరాంశానికి దాన్ని తీవ్రంగా విభేదించే భిన్న ధృవం కూడా ఉంటుందని పేర్కొన్నాడు. వ్యక్తి సామాజిక అపాదితాల ద్వారా సాంఘికీకరణ ప్రక్రియ ద్వారా, ప్రమాణికతలను అంతర్లీనం చేసుకోవడం ద్వారా సమాజం ఆమోదించే 'నమూనా చరాంశాన్ని' గుర్తిస్తాడు. అనుసరిస్తాడు.

పార్సన్స్ ప్రతిపాదించిన నమూనాచరాంశాలివి..

1. విశ్వజనీనవాదం-ప్రత్యేకవాదం(Universalism Vs Perticularism)
2. గుణం-ఆచరణ(Quantity Vs Performance)
3. ప్రభావం-తటస్థత(Affectivity Vs Neutrality)
4. నిర్దిష్టత-వ్యాపకత(Specificity Vs Difuseness)
5. స్వీయాత్మ అవగాహన-ఉమ్మడి అవగాహన(Self Orientation Vs Collective Orientation)

ఈ పరస్పర భిన్నాంశాలు, నమూనా చరాంశాలు ఒక పాత్రధారిలో ఎలాంటి ఒత్తిడి కలిగిస్తాయో పార్సన్స్ వివరించాడు.

BRAOU

## 4.5 మెర్టన్ అభివ్యక్త ప్రకార్యాలు - అంతర్లీన ప్రకార్యాలు

సామాజికశాస్త్ర ఆలోచనావిధానం అభివృద్ధిలో రాబర్ట్ కింగ్ మెర్టన్‌ది కీలక పాత్ర. రెండవ ప్రపంచయుద్ధం ముగిసేనాటికి కూడా యూరోపియన్ సామాజికవేత్తలందరూ సమాజ నైతిక క్రమాన్ని వెతికి పట్టుకోవడంలో మునిగి ఉన్నారు. అమెరికా సామాజిక శాస్త్రవేత్తల చర్చ కుటుంబం పరిధి దాటలేదు. ఈ దశలో 1949లో సామాజిక సిద్ధాంతం, సామాజిక నిర్మాణం అన్న పుస్తకం ప్రచురించడంలో, నిర్మాణ, ప్రకార్యవాద క్షేత్రంలో మెర్టన్‌ది పెట్టిందిపేరు. ప్రకార్య విశ్లేషణకు మెర్టన్ ఉత్తమ కృషి జరిపారు.

మెర్టన్ తన ప్రకార్యవాదాన్ని(Function) ప్రకార్యానికి ఉన్న వేర్వేరు అర్థాలతో ప్రారంభించాడు. వేరువేరు భావనలను వివరించడానికి ఒకే పదాన్ని ఉపయోగించడం, ఒకే భావాన్ని వివరించడానికి వేర్వేరు పదాలను వాడడం తరచుగా జరుగుతుంటుందని ఆయన భావన. అందుకే ప్రకార్యాన్ని మెర్టన్ వేర్వేరు అర్థాలుగా చర్చించాడు.

మొదటగా ఒక వేడుకగా, అంటే పది మంది కలిసి చేసుకునే ప్రకార్యంగా చూసాడు. దీనికి సామాజిక శాస్త్ర అర్థంతో ఎలాంటి సంబంధం లేదు. వృత్తి, గణాంకం, సామాజిక హోదాలో ఉన్న వ్యక్తికి అప్పగించే బాధ్యతలను కూడా 'యాక్షన్' అంటారు అసలైన అర్థంలో ప్రకార్యం అంటే ఒక ప్రాణి జీవించడానికి దోహదం చేసే జీవ ప్రక్రియలనే ప్రకార్యం అని అంటారు. రాడ్‌క్లిఫ్ బ్రౌన్ ఈ అర్థంలోనే ప్రకార్యాన్ని వివరించాడు.'ఒక ప్రక్రియ యావత్ సమాజ

జీవితంలో ఆప్రక్రియ నిర్వహించే విస్తృత పాత్రలో ఒక భాగమే. అందువల్ల ఆ సమాజ నిర్మాణ, నిర్వహణకు ప్రకార్యం దోహదం చేస్తున్నట్లే' అని బ్రౌన్ అభిప్రాయం. మెర్టన్ ఈ అర్థం ఆధారంగా అవిభక్త ప్రకార్యాలను, అంతర్లీన ప్రకార్యాలను సిద్ధాంతంగా ప్రవేశపెట్టాడు.

## అభివ్యక్త ప్రకార్యాలు, అంతర్లీన ప్రకార్యాలు

మెర్టన్ కొత్తగా అంతర్లీన ప్రకార్యం అనే భావనను వృద్ధి చేశాడు. ఈ అంతర్లీన ప్రకార్యానికి ప్రకార్యానికీ మధ్య భేదాన్ని చూపాడు. ఇదే ఆయన ప్రకార్య విశ్లేషణకు అర్థాన్నిచ్చింది. ఒక వ్యవస్థ సర్దుబాటుకు, అనుసరణకు దోహదం చేయగల వస్తుగత పర్యవసానాలు, అభివ్యక్త ప్రకార్యాలని మెర్టన్ భావన. ఆ వ్యవస్థలో భాగస్వాములుగా ఉండే ప్రజలు, వాటిని గుర్తిస్తారు. అంతర్లీన ప్రకార్యాలు కూడా వస్తుగత పర్యవసనాలే. అయితే వీటిని వ్యవస్థలోని ప్రజలు గుర్తించరు. ఒక క్రియకు సంబంధించి అనుద్దేశ పర్యవసానాలు మూడు రకాలుగా ఉంటాయని మెర్టన్ భావన. అవి:

1. నిర్దేశిత వ్యవస్థకు నిర్దేశించిన వికార్యాలు.. వీటిలో అంతర్లీన ప్రకార్యాలు కూడా ఉంటాయి.

2. నిర్దేశ వ్యవస్థకు ఉద్దేశించిన ప్రకార్యాలు.. వీటిలో కూడా అంతర్లీన ప్రకార్యాలు ఉంటాయి.

3. వ్యవస్థతో సంబంధంలేనివి.. అంటే ప్రకార్య, వికార్యాల రీత్యా ఏ ప్రభావం చూపనివి.

అట్లాగే అవిభక్త, అంతర్లీన ప్రకార్యాల భేదాన్ని ఎత్తిచూపడం వల్ల ప్రపంచాన్ని సాధారణ దృష్టికన్నా మించి పరిశీలించవచ్చునని కూడా మెర్టన్ అభిప్రాయపడ్డాడు. దీనివల్ల అంతర్లీన ప్రకార్యాల సాంస్కృతిక విశ్వాసాలను లోతుగా పరిశీలించడానికి, వాటిలో దాగిఉన్న అంతరార్థాన్ని కనిపెట్టడానికి అవకాశం ఉటుంది. ఈ విధంగా చూస్తే సహేతుకత, అసంబద్ధత, నైతికత, అనైతికత వంటి భావనలపై వున్న అభిప్రాయాలను బలవంతంగా మార్చుకోవలసి వస్తుంది. తత్ఫలితంగా విశ్లేషణ పరిధి పెరిగి అభివ్యక్త, అంతర్లీన ప్రకార్యాల మధ్య భేదాన్ని పట్టుకోవడం వల్ల పైకి నిర్హేతుకంగా కనిపించే సామాజిక ధోరణుల విశ్లేషణకు ఆస్కారం లభిస్తుంది. ఇదే కాకుండా మెర్టన్ ప్రకార్య ఐక్యతల గురించి కూడా తన భావనలను వివరించాడు.

ప్రకార్య విశ్లేషణకు మెర్టన్ ఒక అవగాహనా చట్రాన్ని రూపొందించాడు. ఈ అవగాహనా చట్రంలో కొన్ని భావనలతో కూడిన కనీస సమితి ఉంటుంది. అదిలేకుండా సామాజిక శాస్త్ర వేత్తలు ప్రకార్య విశ్లేషణ నిర్వహించండం కష్టం. అవగాహనా చట్రం వల్ల ప్రకార్య విశ్లేషణ తేలికై రాజకీయ, సామాజిక సైద్ధాంతిక ప్రభావాలను తట్టుకోవడం సామాజిక శాస్త్రవేత్తలకు సులభమవుతుంది.

### 4.5.1 సామాజిక నిర్మాణం-అనియతి

కట్టుబాటు కాకుండా ఉల్లంఘన కూడా సామాజిక నిర్మితి ప్రతిఫలమేనని మెర్టన్ భావన. ప్రకార్యవాది విశ్లేషణ కేవలం సామాజిక క్రమం, మార్పు వగైరాలకే పరిమితమైంది. కానీ అనియతి సిద్ధాంతం ద్వారా ప్రకార్య విశ్లేషణ ముఖ్యం అని మెర్టన్ అభిప్రాయం. అనియతి అంటే ఏ నియమాలు, క్రమమూ లేని సమాజం అని అర్థం. అనియతి భావనను ముందు దుర్క్‌హైమ్ ప్రవేశపెట్టాడు. పొంతనలేని పరస్పరం సంఘర్షణపడే విలువలు, నియమాలు ఉన్న సమాజం నుంచి అనియతి సమాజంలోని ప్రజలకు నేర్చుకోవడానికి ఏమీ ఉండదు.

ఒక సమాజంలో సాంస్కృతిక లక్ష్యాలను, ఆ లక్ష్యాల సాధనకు ఏర్పాటు చేసుకున్న వ్యవస్థీకృత మార్గాలకు మధ్య ఎలాంటి సామరస్యంలేని స్థితిలో అనియతి పరిస్థితి వృద్ధి చెందుతుందని మెర్టన్ సిద్ధాంతీకరించాడు. బాగా సంపన్నులు కావడానికి, సామాజిక అంతస్తును సాధించుకోవడానికి సమాజంలోని వ్యక్తులందరికీ, సమాజం ప్రోత్సాహాన్నిస్తుంది. అయితే ఇలాంటి లక్ష్యాలను సాధించడానికి ఆమోదిత మార్గాలు అనుసరించిన కొందరిని మాత్రమే ఈ లక్ష్యాలు విజయపథంలో చేరుస్తాయి. అయితే సమాజం ఆమోదం పొందిన ఇలాంటి నియమాలు, మార్గాల వల్ల ఉన్నతస్థాయికి ఎగబాకడం అసాధ్యమని గ్రహించిన వారిలో కొందరు, ఆ నియమాలను, మార్గాలను ఉల్లంఘించే అవకాశం ఉంది.



BRAOU

'ఏ సమాజంలోనైనా ప్రజలు విజయ లక్ష్యాలను చేరుకోవడానికి కొన్ని ఉమ్మడి మార్గాలను అనుసరించడం సమాజం హర్షిస్తుంది. కానీ, మరోవైపు సమాజ నిర్మితి మాత్రం అదే సమాజంలోని అధిక సంఖ్యాక ప్రజలకు ఆ విజయ లక్ష్యాల మార్గాలను మూసివేసి, తృణీకరించినప్పుడు సమాజంలో అనియతి ప్రబలే అవకాశం ఉంది. విజయ లక్ష్యాల సాధనకు ఆమోదిత మార్గంలోనే కాకుండా, అవసరమైతే అడ్డదారిలోనైనా సాధించాలని ఒత్తిడి పెరుగుతుంది'. అని మెర్టిన్ భావన.

విజయం కోసం ప్రజలు సమాజ ఆమోదిత మార్గాలనుంచి అనామోదిత మార్గాకు మళ్లినప్పుడు అనియతి పెరుగుతుంది. ఈ సందర్భంగా ఏ సమాజంలోనైనా లక్ష్యాలు, వాటిని చేరే మార్గాలకు సంబంధించి అయిదు రకాల ప్రతిస్పందన ఉంటుందని మెర్టన్ పేర్కొన్నాడు. అవి.. ఇవీ..

| అనుసరణ విధానం | ప్రకార్యలక్ష్యాలు | వ్యవస్థీకరించిన మార్గాలు |
|---|---|---|
| 1. ఔదలదాల్చడం | + | + |
| 2. కొత్త పోకడలు | + | - |
| 3. తంతుగా మార్చడం | - | + |
| 4. పలాయనం | - | - |
| 5. తిరుగుబాటు | + - | + - |

BRAOU

వీటిని వివరంగా చూసినప్పుడు

1. **ఔదల దాల్చడం:** అంటే ఉప సంప్రదాయ లక్షణాలను, వాటిని చేర్చుకోవడానికి వ్యవస్థీకృతం చేసిన మార్గాలను రెంటినీ అంగీకరించడం.

2. **కొత్త పోకడలు:** అంటే సంప్రదాయక లక్ష్యాలను అందుకోవడానికి సంప్రదాయ విరుద్ధ మార్గాలను తొక్కడం (నేరంతో సహా).

3. **తంతుగా మార్చడం:** లక్ష్యాలను అటకెక్కించి, సంప్రదాయ మార్గాలను పూజ్యం చేయడం. అసలు అర్థాల్ని, ప్రకార్యాలను విస్మరించి, వ్యవస్థీకృత మార్గాలను దానికదే పరమార్థంగా మార్చడం.

4. **పలాయనం:** అంటే సామాజిక లక్ష్యాలను, వ్యవస్థ చూపిన మార్గాలను రెంటినీ వదిలి మరొకచోట నడవడం... తాగుబోతులాంటివారిని ఉదాహరణగా చెప్పవచ్చు.

5. **ధిక్కారం:** సంప్రదాయ లక్ష్యాలను ప్రకటించి అందుకు తగినరీతిగా కొత్త మార్గాల అన్వేషణ... విప్లవకారుల లాంటివారిని దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు.

పైన పేర్కొన్న పట్టిక రూపంలో వ్యక్తులు, ప్రతిస్పందనలను ఈ క్రింది విధంగా సూచించారు. ఒక వ్యవస్థలోని లక్ష్యాలు వాటిని చేరుకునేందుకు ప్రమాణీకరించిన మార్గాల పట్ల ప్రజల ప్రతిస్పందనను సూచించే అయిదు మార్గాలను మెర్టన్ ఈ పట్టికలో చూపారు. పట్టికలో '+' ఆమోదానికి, '-' తిరస్కారానికి గుర్తు. '+ -' ఆ విలువలను తిరస్కరించి కొత్త విలువలను ప్రతిపాదించినట్టు గుర్తు.

## 4.6 కార్ల్ మార్క్స్

సిద్ధాంతానికి, ఆచరణకు, భావాలకు, భౌతిక కార్యాచరణకు మధ్య సంబంధాన్ని ఎత్తిచూపిన మేధావి, సంఘర్షణా సిద్ధాంత వేత్త కార్ల్ మార్క్స్. అప్పటిదాకా తత్వవేత్తలు ప్రపంచాన్ని కేవలం వ్యాఖ్యానించారని, కానీ చేయవలసిన పని ప్రపంచాన్ని మార్చడమని చెప్పిన మార్క్స్ నాలుగు దశాబ్దాలపాటు కార్మికవర్గ కార్యాచరణలో వుంటూ, మరోవైపు ఆనాటి యూరోపియన్ సైద్ధాంతిక, భావజాల రంగంలో తీవ్రకృషి చేశాడు. 'మార్క్స్ మానవ మేధోచరిత్రలో 'అసాధారణ ప్రభావం చూపిన, చూపుతున్న మహాతత్వ వేత్త. దార్శనికుడు'.

'సేంద్రియ ప్రకృతి పరిణామ సూత్రాన్ని డార్విన్ కనిపెట్టగానే మానవ చరిత్ర పరిణామ సూత్రాన్ని మార్క్స్, కనిపెట్టాడు' అని ఆయన సహచరుడు ఎంగెల్స్ అభిప్రాయపడ్డాడు. మార్క్స్ మానవ సమాజ గతి సూత్రాలను విశ్లేషించి, ఆ గతి సూత్రాల ఆధారంతో భవిష్యత్ మానవ సమాజం ఏదిశగా పయనిస్తున్నదో పరికల్పన చేశాడు. సామాజిక చలన సూత్రాలు, ప్రకృతి చలన సూత్రాల మాదిరిగానే అనివార్యమైనవ'ని ఆయన ఊహ.

మార్క్స్ సామాజిక, తాత్విక, ఆర్థిక, రాజకీయ రంగాలలో చేసిన ఆలోచనలను మొత్తంగా ఆయన సామాజిక సిద్ధాంతాన్ని మార్క్సిజం అంటారు.

అప్పటి యూరోపు, ప్రధానంగా బ్రిటిష్, జర్మనీ పెట్టుబడిదారీ, ఫ్యూడల్ సమాజాల నేపథ్యంలో 1840 నుంచి 1890ల దాకా వెలువడిన మార్క్స్, ఎంగెల్స్‌ల రచనలు ఇప్పటికీ ప్రభావం చూపుతున్నాయి. భావాలు భౌతిక శక్తిగా మారతాయన్న మార్క్స్, ఎంగెల్స్‌ల సూత్రీకరణ అసమానతలు, దోపిడీ, పీడనలపై సంఘర్షణలకు ఇప్పటికీ పురికొల్పుతున్నాయి. కార్ల్‌మార్క్స్, 1818 మే 5వ తేదీన జర్మనీలోని ట్రియర్‌లో జన్మించాడు. 1864 నుంచి 1872 వరకు ఆయా కార్మికోద్యమాలతో కలిసి పనిచేశారు. 1867లో 'కాపిటల్' ప్రచురించాడు.

BRAOU

మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంతాలలో గతితార్కిక భౌతికవాదం, చారిత్రక భౌతికవాదం, పరాయీకరణ భావన, అదనపు విలువ సిద్ధాంతాలు, సిద్ధాంత కార్యాచరణకు సంబంధించిన భావనలు ప్రముఖమైనవి.

### గతి తార్కిక భౌతికవాదం

యూరోపియన్ తాత్విక ధారలో భిన్నంగా ఉండే భౌతికవాద దృక్పథాన్ని, గతి తార్కిక సంవిధానాన్ని ఏకం చేసి గతితార్కిక భౌతికవాద ఆలోచనాధోరణిని సుసంపన్నం చేసిన ఘనత కార్ల్ మార్క్స్‌దే.. గతి తర్కం ఒక తార్కిక పద్ధతి. గతి తర్కం ప్రధానంగా ప్రకృతికీ, పదార్థానికీ చలననియమం వుండడం గురించి చెప్పింది. గతి తార్కిక భౌతికవాదం ప్రాకృతిక, సామాజిక పరిణామానికి గల సూత్రాలను వివరించింది. సాధారణ, ఆమూర్త స్థాయిలో, ప్రకృతిలో సమాజంలో ప్రతి వస్తువూ, ప్రతి దృగ్గోచరమూ ఒకదానితో ఒకటి కలిసి ఉన్నాయని, ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయని, ఒకదాన్ని మరొకటి నిర్ణయిస్తుందనీ గతితార్కిక భౌతికవాదం అంటుంది. వస్తువులో మార్పులకు మూలం అంతర్గతంగా ఉంటుందని ప్రతీ వస్తువులోనూ రెండు విరుద్ధ అంశాలు ఉంటాయని, ఆ రెండు విరుద్ధాంశాల మధ్య ఐక్యత, ఘర్షణ కొనసాగుతుండడమే గతితార్కిక భౌతికవాదపు మొదటి సూత్రమని ఎంగెల్స్ వివరించాడు. గతితార్కిక రెండో సూత్రంగా 'వ్యతిరేకించినది వ్యతిరిక్తమవుతుంది' అని, మూడవ సూత్రంగా పరిమాణం గుణంగా, గుణం పరిమాణంగా పరివర్తన చెందుతాయనేవి. మార్పు క్రమం అనేది సాధారణంగా ఉండదని, సంక్లిష్టంగా వుంటుందని, ప్రతీ మార్పులోనూ మొదటి పరిణామాత్మక మార్పును, ఆ పరిణామం ఒక దశకు చేరిప్పుడు విప్లవాత్మకంగా గుణం మారిపోయి కొత్త వస్తువు ఏర్పడే మార్పును గుర్తించవచ్చునని గతి తార్కిక భౌతికవాదం చెబుతోంది.

### చారిత్రక భౌతికవాదం

చరిత్రపట్ల భౌతికవాద దృక్పథాన్ని అనుసరించి చేసే విశ్లేషణను చారిత్రక భౌతికవాదం అంటారు. చరిత్రను రాజవంశాల చరిత్రగానో, తారీఖులు, దస్తావేజులుగానో, ఆయా కాలాల పాలకుల, ప్రజల మంచి చెడ్డల ఫలితంగానో చూడకూడదని, చరిత్రకు భౌతిక పునాది ఉన్నదని మార్క్స్ భావన. భౌతిక జీవితావసరాల ఉత్పత్తి క్రమంలోనే మానవ

సమాజం పురోగమిస్తున్నదని, ఉత్పత్తి సాధనాలను ఉపయోగిస్తూ, మారుస్తూ అభివృద్ధి చేస్తూ, సమూహాలు తమ సామాజిక ఆచరణ ద్వారా సంబంధాలలోకి వస్తారని, ఈ ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల సమాహారాన్నే సమాజం అంటారని మార్క్స్ భావన. ఈ పరిణామ క్రమాల్లో ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి, ఉత్పత్తి సంబంధాలే ఆటంకంగా నిలినప్పుడు ఒక గుణాత్మకమైన గంతు ద్వారా, విప్లవాత్మకమైన మార్పుద్వారా ఉత్పత్తి శక్తులు పాత ఉత్పత్తి సంబంధాలను రద్దు పరచి కొత్త ఉత్పత్తి సంబంధాలను నెలకొల్పుతారని మార్క్స్ భావన. చారిత్రక భౌతిక వాదం ప్రకారం ఇప్పటికీ సమాజం నాలుగు దశలు గడిచింది. మొదటి దశ ఆదిమ కమ్యూనిజం, రెండవదశ బానిస సమాజం, మూడవదశ ఫ్యూడల్ సమాజం, నాలుగవ దశగా పెట్టుబడిదారీ సమాజం అని, భవిష్యత్తులో పెట్టుబడిదారీ సంబంధాలలో ఉన్న వైరుధ్యాల కారణంగా ఉత్పత్తి సంబంధాల్లో విప్లవాత్మక మార్పులు జరిగి సోషలిస్టు సమాజం, అనంతరం రాజ్యం అంతరించే కమ్యూనిజం ఏర్పడుతుందని మార్క్స్ భావన.

### 4.6.1 పరాయీకరణ భావన

మార్క్స్ భావనలలో సామాజిక పరిణామానికి, సామాజిక ఘర్షణకు కీలకమైన పరాయీకరణ (Allienation) భావన ముఖ్యమైనది. మార్క్స్ తొలినాళ్ల రచనలలో ఒకటైన 'Economy and Phylosophical Manuscript of 1844'లో ప్రధానంగా హెగెల్ ప్రభావంతో వ్యక్తమైన ఈ భావనను మార్క్స్ అనంతర రచనలలో విస్తరించాడు. పెట్టుబడిదారీ సమాజంలో కార్మికుడు పరాయీకరణకు గురవుతాడని, నిత్యజీవిత కార్యాచరణలో ఈ పరాయీకరణను గుర్తించినందువల్లే ఆ పరాయీకరణ నుంచి బయటపడడానికి పోరాడతాడని మార్క్స్ తాత్విక స్థాయిలో వివరించాడు.

పెట్టుబడిదారీ సమాజంలో కార్మికులు నాలుగు రకాల పరాయీకరణలను అనుభవిస్తారని మార్క్స్ విశ్లేషించాడు. ఉత్పత్తి విధానంలోనే ఈ పరాయీకరణ మూలాలు ఉన్నందువల్ల అది సమాజమంతా వ్యాపిస్తుందని మార్క్స్ చెప్పాడు. ఈ నాలుగు పరాయీకరణలు ఇవీ.

1. కార్మికుడు ఉత్పత్తి ప్రక్రియనుంచి పరాయి కావడం.
2. శ్రమ ఫలితం నుంచి కార్మికుడు పరాయికావడం.
3. కార్మికుడు తోటి కార్మికులనుంచి పరాయి కావడం.
4. కార్మికుడు తననుంచి తాను, చివరకు మానవీయతనుంచి పరాయి కావడం.

పెట్టుబడిదారీ పూర్వ సమాజాలలో ఉత్పత్తిలో పాల్గొనే ఏ మనిషికయినా తాను చేయబోయే ఉత్పత్తి ఏమిటో? ఆ ప్రక్రియ ఎక్కడ ప్రారంభమై ఎక్కడ పూర్తవుతుందో తెలుసు. అప్పుడు మనిషి ఆ ఉత్పత్తిలోనూ, ఉత్పత్తి ప్రక్రియతోనూ తనను తాను అనుసంధానించుకోగలిగేవాడు. ఇది నా ఉత్పత్తి అని గర్వపడేవాడు. ఆ శ్రమ ఫలితం తనకు దక్కకపోయినా, తన శ్రమ ఏమి సాధించిందో? ఆ ఉత్పత్తిదారుడికి స్పష్టంగా తెలిసే వుంటుంది.

కానీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ప్రధానమైన శ్రమ విభజన ఒకే ఉత్పత్తి ప్రక్రియను అనేక ముక్కలుగా విడగొట్టి, ఒక్కొక్క ముక్కను ఒక్కొక్క విభాగానికి అప్పగించడం వల్ల ఉత్పత్తి ప్రక్రియ ఆద్యంతాలు కార్మికులకు అగమ్యగోచరమయ్యాయి. అదేవిధంగా ఉత్పత్తిలో సృజనాత్మకత లోపించి, ఇచ్చిన పనిచేయడం వల్ల కార్మికుడికి అది పరాయిదైపోతుంది.

రెండో పరిణామం, తాను ఉత్పత్తి చేసిన సరుకు మారకపు విలువ సంతరించుకొని, కార్మికుడికి శక్తికి మించిన కొనుగోలు వస్తువై కూడా పరాయిదై పోయింది. ఆ రకంగా కార్మికుడి శ్రమశక్తి ఫలితమైన ఉత్పత్తి కూడా కార్మికుడికి పరాయిదైపోయింది.

 ఇక ఉత్పత్తి ప్రక్రియ శ్రమ విభజనకు గురై ముక్కలవడం, ఉత్పత్తి మారకపు విలువ కావడం, సరకుగా మారడం

BRAOU

వల్ల కార్మికుడికి ఆ సరుకులో మానవసారం లోపించి కేవలం సరుకుగా కనబడుతుంది. ఇక మనిషితో మనిషి పరాయికావడం అంటే తోటి మనుషులతో మానవ సారం దూరమైపోవడం. మానవసారమంటే మానవ సంబంధాల సమాహారమే. అంటే అంతిమంగా మనిషి మానవ సంబంధాల నుండి దూరం కావడమే. అట్లా పెట్టుబడిదారీ సమాజంలో మనిషి తననుంచి తాను పరాయి అవుతాడు. అని మార్క్స్ భావన.

## 4.6.2 దోపిడీ భావన, అదనపు విలువ

శ్రమక్రమంలో పరాయీకరణ అనే తాత్విక, సామాజిక భావనను రాజకీయార్థిక పదజాలంతో విశ్లేషిస్తే దోపిడీ భావన, దోపిడీకి పారిభాషిక పదరూపమైన అదనపు విలువ భావన వస్తాయి.

మార్క్సుకన్నా ముందు రాజకీయార్థికశాస్త్రం వినిమయంలో వ్యాపారంలో మాత్రమే మిగులు వస్తుందని భావించేది. అందువల్ల ఉత్పత్తి సాధనాల మీద ఆధిపత్యం ఎవరిదనేది అంత ప్రాముఖ్యంగా కన్పించలేదు. వర్గాలను గుర్తించినప్పటికీ వర్గపోరాటం ఎందుకు అనివార్యమవుతుందనే భావనలేదు. మార్క్స్ విశ్లేషణ వీటికి భిన్నంగా శ్రమ క్రమం, ఉత్పత్తి, కార్మికుడి దగ్గర ప్రారంభించాడు. కనుక మిగులు, అదనపు విలువ ఉత్పత్తి క్రమంలోనే వెలువడతాయని, అక్కడే దోపిడీ భావన, అదనపు విలువ గురించి కీలకమైనవని మార్క్స్ అంటాడు.

పెట్టుబడిదారులు కార్మికుల శ్రమను దోపిడీచేయడం ద్వారా లాభాలు సంపాదిస్తారు. ఏ సరుకు విలువ అయినా ఆ సరుకును ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమ పరిమాణంతో నిర్ణయమవుతుంది. 'కార్మికుడు ఒక సరుకును ఉత్పత్తి చేయడానికి ఎంత శ్రమ కాలాన్ని వెచ్చిస్తాడో, అందుకు అతను వేతనంగా పొందే ప్రతిఫలం ఆశ్రమ కాలం కన్నా తక్కువకు మాత్రమే సరిపోతుంది. ఉదాహరణకు ఒక శ్రామికుడు తన వేతనానికి సరిపోయిన ఉత్పత్తిని ఐదు గంటల శ్రమ కాలంలోనే తయారు చేస్తాడనుకుందాం. కానీ, ఆ కార్మికుడు రోజుకు పది గంటలు పనిచేస్తాడు. అంటే కార్మికుడు రోజుకు అయిదు గంటలు మాత్రమే పనిచేస్తూ మిగిలిన అయిదు గంటలు యజమాన్యానికి లాభాలు సమకూర్చి పెట్టడానికి పనిచేస్తున్నాడన్న విలువను నిర్వచించడానికి 'అదనపు విలువ' అనే మాటను వాడాడు. అవసరమైన శ్రమకాలం అనేది కార్మికుడు పొందిన వేతనానికి తగిన విలువను సృష్టించడానికి అవసరమై శ్రమకాలం అన్నమాట' అని మార్క్స్ అంటారు.

B R A O U

ఉత్పత్తి సాధనాలమీద యజమానులకే గుత్తాధిపత్యం ఉంటుంది కనుక వాళ్లు కార్మికులను ఎక్కువ గంటలు పనిచేసేలా ఎక్కువ అదపు విలువ సృష్టించేలా ఒత్తిడి చేస్తారు. కార్మికులను ఎంత ఎక్కువగా దోపిడీ చేస్తే యజమానులకు లాభాలు అంతగా పెరుగుతాయి.

## 4.6.3 వర్గపోరాటం-విప్లవం

పెట్టుబడిదారీ విధానం ఉత్పత్తిని సామాజికం చేసినందువల్ల, సంఘటితం చేసినందువల్ల కార్మిక వర్గానికి చైతన్యం పెంచుకునే అవకాశం ఏర్పడుతుంది. తామంతా ఒక వర్గం అన్న స్పృహ, పోరాడాలన్న స్పృహ పెరుగుతుంది.

బానిస సమాజం నుంచి సమాజంలో వర్గాలు ఉన్నప్పటికీ, ఏదో ఒక స్థాయిలో వర్గాల మధ్య ఘర్షణ ఉన్నప్పటికీ, పెట్టుబడిదారీ సమాజంలో మాత్రం వర్గపోరాటానికి స్పష్టత, అనివార్యత వస్తాయి. ఈ దశలో వర్గ విభజన నిశితంగా ఉంటుంది. కేవలం ఉత్పత్తిని సంఘటితం చేసినంత మాత్రాన సామాజిక వర్గాల అభివృద్ధి పూర్తికాదు. ఇది ప్రజా బాహుళ్య పరంగా విభజన కావలసి ఉంది. ఆర్థిక ఫలితాల పంపిణీ విషయంలో పదేపదే సంఘర్షణలు జరగవలసి ఉందని, తద్వారా వర్గ చైతన్యం పొందవలసి ఉన్నదని మార్క్స్ భావించాడు. పెట్టుబడిదారీ సమాజంలో ఇవన్నీ సాధ్యమవుతాయి. ఆ విధంగా వర్గవిభజన జరిగేటప్పుడు అది కేవలం ఉత్పత్తి సాధనాలతో సంబంధం మీద మాత్రమే నిర్ణయమౌతుంది. ఏ ఇతర లక్షణాలతో వర్గాన్ని గుర్తించడం సాధ్యం కాదు. మార్క్స్ వర్గాన్ని నిర్ధారించడంలో ఐదు ప్రమాణాలు పాటించాడు. అవి:

1. ఆర్థిక ఫలితాల పంపిణీ గురించి వర్గాల మధ్య ఘర్షణ ఉంటుంది.

2. ఒక వర్గం ప్రజల మధ్య సమాచార వినిమయం సులభంగా సాధ్యమవుతుంది. అందువల్ల భావనలను, ఆచరణ ప్రణాళికలను సులభంగా ప్రచారం చేయడానికి వీలవుతుంది.

3. ఒక వర్గానికి చెందిన ప్రజలు తమమధ్య సంఘీభావాన్ని, తమ చారిత్రక బాధ్యతలను గుర్తించగలుగుతారు. అంటే వారిలో వర్గ చైతన్యం ఏర్పడుతుంది.

4. ఆర్థిక వ్యవస్థను తాము అదుపు చేయలేకపోతున్నామని, అందువల్ల దోపిడీకి గురవుతున్నామని ఒక వర్గంలో అసంతృప్తి రగులుతుంది.

5. ఈ అసంతృప్తి చారిత్రక స్థితికి, వర్గ చైతన్య పరిణతికి తగినట్టుగా ఉంటుంది.

ఈ విధంగా స్పష్టమైన వర్గ విభజన జరిగిన అనంతరం ఆ మేరకు వర్గపోరాటం నిశితమవుతుంది. చరిత్రలో, సమాజంలో అది నిరంతరాయంగా వేర్వేరు రూపాలలో జరుగుతున్నదని మార్క్స్ నిర్ధారించాడు. పెట్టుబడిదారీ సమాజాలలో వర్గపోరాటం మరింత తీవ్రతరమవుతుందని, కానీ, అధికారంలో ఉన్న వర్గాలు అంత సులభంగా అధికారాన్ని వదులుకోలేవని, అవి అణచివేతకు పాల్పడతాయని, మరో వర్గం దాన్ని ఎదిరిస్తుందని మార్క్స్ భావన. అందువల్ల 'హింస విప్లవానికి మంత్రసాని'గా పనిచేస్తుందని ఆయన చారిత్రక సూత్రాన్ని వివరించాడు. ఈ ఘర్షణ, వర్గపోరాటం ఫలితంగా, సమాజం మరొక మెట్టు పైకి ఎదిగి సామాజిక పరివర్తన సాగి విప్లవం సంభవిస్తుందని మార్క్స్ అన్నాడు.

### 4.6.6 సిద్ధాంతం-ఆచరణల ఐక్యత

మార్క్స్ సామాజిక సిద్ధాంతంలో అతి ముఖ్యమైన అంశం సిద్ధాంతానికి, ఆచరణకు అవినాభావమైన ఐక్యత. తత్వవేత్తలు ఇప్పటివరకు సమాజాన్ని వ్యాఖ్యానించారు కానీ, సమాజాన్ని మార్చడమే ముఖ్యం అని అన్న మార్క్స్, ఆచరణకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఆచరణనుంచే సిద్ధాంతం రూపొందుతుందనేది మార్క్స్ భౌతికవాద అవగాహనకు అనుగుణమైందే. మార్క్స్ గతితార్కిక భౌతికవాదం సిద్ధాంతానికి, ఆచరణకు మధ్య పరస్పర చర్య-ప్రతిచర్యలను ప్రతిపాదించారు. అందుకే మార్క్స్ భావాలు, భౌతికశక్తిగా మారతాయన్నారు. ఆచరణ-సిద్ధాంతం-ఆచరణ అనే నిరంతర చక్రంలో ఆచరణ ఒక సిద్ధాంతాన్ని సృష్టిస్తుందని, సిద్ధాంతం ఆచరణకు దారి చూపుతుందని ఆయన వర్తులాకార అభివృద్ధిని ఊహించాడు.

BRAOU

ఈ తాత్విక అవగాహనను సామాజిక చరిత్రకు అన్వయించినప్పుడు వర్గ విభజన, వర్గపోరాటమే ఒక సైద్ధాంతిక అవగాహనను కల్పిస్తుందనీ, ఆ సైద్ధాంతిక అవగాహన, మళ్లీ వర్గ పోరాటాన్ని ఉన్నతస్థాయికి తీసుకుపోవడానికి ప్రణాళిక సిద్ధం చేస్తుందని అర్థం చేసుకోవచ్చు.

పెట్టుబడిదారీ సమాజంలో కార్మిక వర్గం నిరంతర పోరాటాల క్రమంలో తనదైన సిద్ధాంతాన్ని ఆవిష్కరించుకుంటుంది. ఆ సిద్ధాంతం వెలుగులో మరింత నిశితమైన కార్యాచరణకుపూనుకుంటుంది. ఈ సిద్ధాంతం-ఆచరణ ఐక్యత, పరస్పర ప్రభావం నిరంతరం సాగుతూ సామాజిక అవగాహనకు, పురోగతికి తోడ్పడతాయి.

## 4.7 ముగింపు

భౌతిక ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి అనేక సిద్ధాంతాలు ఉన్నట్టుగానే సామాజిక ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి సామాజిక సిద్ధాంతాలున్నాయి. మనుషుల చర్యలు, ప్రతిచర్యల వల్ల కలిగే మార్పులు తదనుగుణంగా ప్రపంచంలో సంభవించే పరిణామాలను అవగాహన చేసుకొని సామాజిక శాస్త్రవేత్తలు సిద్ధాంతాలు రూపకల్పన చేశారు. సమాజ ఆవిర్భావం, దశలు, మార్పులకు కారణాలను వివరించే సామాజిక సిద్ధాంతాలు సమాజశాస్త్ర సిద్ధాంతానికి తొలిదశలో సెయింట్ సైమన్, ఆగస్ట్‌కోమ్ట్, దుర్క్‌హైమ్ లాంటి ఫ్రెంచి సామాజిక శాస్త్రవేత్తలు, ఎనలేని కృషి జరిపారు. ఆగస్ట్‌కోమ్ట్ సామాజిక శాస్త్ర పితామహుడంటారు. దుర్క్‌హైమ్ సిద్ధాంతాలలో శ్రమవిభజన,

సంఘీభావం, ఆత్మహత్యల భావనలు ప్రసిద్ధమైనవి. టాల్‌కాట్ పార్సన్స్, సామాజికచర్య గురించి సిద్ధాంతీకరించాడు. మెర్టన్ సామాజిక నిర్మాణం, అనియతి, మార్క్స్ గతితార్కిక భౌతిక వాదం, వర్గపోరాటం ముఖ్యమైన సిద్ధాంతాలు.

## 4.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. దుర్క్‌హైమ్ శ్రమ విభజనను వివరించండి?
2. మెర్టన్ సామాజిక నిర్మాణం-అనియతి భావనలను వివరించండి.
3. కార్ల్‌మార్క్స్ అదనపు విలువ-లాభాన్ని వివరించండి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులివ్వండి.**

1. టాల్కాట్ పార్సన్స్ సామాజిక చర్య అంటే ఏమిటి?
2. ఆత్మహత్యల రకాలేవి?
3. కార్ల్‌మార్క్స్ పరాయీకరణ గురించి రాయండి?

## 4.9 చదవదగిన పుస్తకాలు


1. Raymond Aran : Main Currents in Sociological Thought.
2. Fransis Abraham, M. : Modern Sociological Thought- An Introduction.
3. Cohen Persy : Modern Socialogical Theory.
4. Dursheer.E. : The Division of Labour in Sociology.


BRAOU

BRAOU

# ఖండం- II

## యువత, వృద్ధుల సమస్యలు

సమాజంలో నిరంతరం ఎదురయ్యే సమస్యల్లో ప్రధానమైనవి వ్యవస్థకు వ్యక్తికి మధ్య తలెత్తేవి. సామాజిక వ్యవస్థలో భాగమైన మనిషికి ఆ వ్యవస్థాపరమైన నియమాలు, పద్ధతులు, గమనానికి అనుగుణంగా నడచుకోవడం తనను తాను మలుచుకోవడం ప్రధానమైన సమస్య. ఇటువంటి వయస్సుకు సంబంధించిన సమస్యలు ప్రధానంగా యవ్వనంలో, వృద్ధాప్యంలో వనిపిస్తాయి.

యువతలో, వృద్ధుల్లో ఏర్పడే అసంతృప్తి, అవ్యవస్థలు సామాజిక సమస్యలకు కారణమవుతున్నాయి. కొన్ని సార్లు ఈ అశాంతి సామాజిక వ్యవస్థకు సవాలుగా మారుతోంది. అటువంటి రెండు ప్రధాన వయః సమూహాలు యువత, వృద్ధుల సమస్యలను ఈ ఖండంలో చర్చించడం జరిగింది.

ఈ ఖండంలో మొత్తం ఐదు భాగాలున్నాయి. అవి:

**భాగం-5: యువత-అశాంతి**
**భాగం-6: యువత-జాతీయ నిర్మాణం, అభివృద్ధి**
**భాగం-7: వృద్ధాప్య భావన**
**భాగం-8: ఆధునిక సమాజాలలో వృద్ధాప్యం**
**భాగం-9: భారతదేశంలో వృద్ధాప్యం**

BRAOU

BRAOU

# భాగం-5: యువత-అశాంతి

విషయక్రమం


5.0 ఉద్దేశాలు

5.1 పరియం

5.2 యువత-లక్షణాలు

5.3 తరాల మధ్య అంతరం

5.4 యువత సాధారణ సమస్యలు

5.6 గ్రామీణ యువజన సమస్యలు

5.7 నగర యువజన సమస్యలు

5.8 విద్యార్థి యువజన సమస్యలు

5.9 యువతుల సమస్యలు

5.10 యువత అశాంతికి కారణాలు

5.11 అశాంతి రూపాలు

5.12 ఆందోళన లక్ష్యాలు

5.13 అశాంతి ఆందోళనల వర్గీకరణ

5.14 ముగింపు

5.15 మాదిరి పరీక్షా ప్రశ్నలు

5.16 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 5.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- దేశానికి యువత ప్రాముఖ్యతను గుర్తిస్తారు.
- యువజనులు అని ఎవరిని అంటా-రో తెలుసుకుంటారు.
- యువత గురించి, యువజనం లక్షణాల గురించి ఈ పాఠంలో అధ్యయనం చేస్తారు.
- యువజనంలో అశాంతి, తరాల మధ్య అంతరం, యువత సమస్యలను అవగాహన చేసుకుంటారు.

## 5.1 పరిచయం

మానవజీవితాన్ని దాదాపు అయిదు భాగాలుగా చేయవచ్చును. అవి: 1. శైశవం, 2. బాల్యం, 3. యవ్వనం, 4. కౌమారం, 5. వార్ధక్యం. ఆయా వయస్సులలో ఉన్న వారిని వరుసగా 1. శిశువులు, 2. బాలబాలికలు, 3. యువజనులు, 4. వయోజనులు, 5. వృద్ధులు అని పిలవవచ్చును. వీరి వయస్సులను ఈ క్రింది విధంగా

వర్గీకరించవచ్చును. పుట్టినప్పటినుంచి ఐదు ఏళ్ల వరకు శైశవం, 6వ ఏడు నుండి 14వ ఏడు వరకు బాల్యం, 15వ ఏడు నుండి 25వ ఏడు వరకు యవ్వనం, 26వ ఏడునుండి 60వ ఏడు వరకు కౌమారం అని పేర్కొంటారు. 60 ఏడు నుండి తుదివరకు వార్ధక్యం లేదా వృద్ధాప్యం అని అంటారు. కానీ, స్త్రీల విషయంలో ప్రతీ వయస్సులోను పురుషులకంటె రెండు మూడేళ్లు శారీరకంగా తక్కువగా పరిగణిస్తారు. వయస్సులో భేదమున్నా మానసిక పరిపక్వతలో సమానంగా ఉంటారు. స్త్రీలు 13వ ఏడు నుండి 23వ ఏడు వరకు యువతులు అని చెప్పవచ్చును.

## 5.2 యువత-లక్షణాలు

బాల్యదశ నుండి యవ్వనదశను పొందే సమయంలో యువజనులలో మానసిక, శారీరక మార్పులు అనేకం చోటు చేసుకుంటాయి. పాత, కొత్త భావనల మధ్య భిన్నాభిప్రాయాలతో మానసికమైన ఉద్వేగాత్మకమైన బాధలు పొందుతుంటారు. ఉదాహరణకు 14, 15 సంవత్సరాల ప్రాయం వచ్చేసరికి మగపిల్లలకి నూనూగు మీసాలు వస్తాయి. దానితో తాము బాల్యాన్ని వదిలి యవ్వనంలోకి అడుగుపెట్టినామన్న హుందాతనం, పౌరుషం, వంటివి వారిలో తలెత్తుతాయి. దానితో వారి ఆలోచనలో, నడవడిలో, ప్రవర్తనలో మార్పులు సంభవిస్తాయి. ఈ మార్పుల ప్రభావం వలన చదువు పట్ల శ్రద్ధ వహించకపోవడం, స్నేహితులతో ఎక్కువగా కాలక్షేపం చేయడం, తల్లిదండ్రులు వారిని మందలించడం, వాళ్లు పెడచెవిన పెట్టి తల్లిదండ్రులతో వాదనకు దిగడం జరుగుతుంది. యువజనులు సాధారణంగా తల్లిదండ్రుల మీద ఆధారపడి ఉండడం వల్ల కుటుంబ సంబంధమైన బాధ్యత ఏమీ లేకుండా కాలం గడుపుతుంటారు. వారి కాలాన్ని చదువు సంధ్యలను కొనసాగించడం, ఆటపాటలతో కాలం గడపడం, ధైర్యసాహసాలను ప్రదర్శించాలని ప్రయత్నించడం, అందరిలో గుర్తింపు పొందాలని ప్రయత్నించడం మొదలైన కార్యకలాపాలలో గడుపుతారు. ఇప్పుడు యువజనుల అవసరాలలో ముఖ్యమైనవాటిని గురించి తెలుసుకుందాం.

యువజనులు సహజసిద్ధంగా తమ తోటివారితో కలిసిమెలిసి పనిచేయాలనే కుతూహలంతో ఉంటారు. యువజనులు తమ అవసరాలను తీర్చుకోవడానికి అనేక సమూహాలలో సభ్యులుగా చేరతారు. ఉదాహరణకు బ్యాట్‌మెంటన్ ఆట నేర్చుకోవడానికి వారు బ్యాట్‌మెంటన్ క్లబ్బులలో సభ్యులుగా చేరతారు. ఇతర అవసరాలను తీర్చుకోవడానికి అనేక ఇతర క్లబ్బులలో చేరతారు. ఆయా సమూహాల కార్యక్రమాల ద్వారా వారి అవసరాలను తీర్చుకుంటారు.

BRAOU

యువజనులు పెద్దల సలహాపై ఆధారపడక స్వయంగా నిర్ణయాలను తీసుకోవడానికి ఉత్సాహాన్ని చూపుతారు. తాము కూడా స్వయం సహాయంతో పనులు నిర్వర్తించుకోగలమనీ, తామేది చేయవలెనో, ఏది చేయనక్కరలేదో పెద్దల వలె నిర్ణయించుకోనే స్వతంత్ర్యం అధికారం, తమకు ఉన్నాయనీ, వారు భావిస్తారు. ఈ భావన వారి వయస్సును బట్టి, సామాజిక జీవన విధానాలను బట్టి సహజమైనది. యువజనులు తమకు తగిన వృత్తిని తామే ఎంచుకోవాలని ప్రయత్నిస్తారు. సమవయస్కులైన యువతీయువకులు ఒకరితో ఒకరు స్నేహ సంబంధాలను పెంపొందించుకోవాలనుకుంటారు. జీవితంలో బాధ్యతాయుతమైన వ్యక్తులుగా రూపొందాలనే అభిలాషను కలిగి ఉంటారు. అనేక ఆశయాలతో ఆశయసాధనకు విశాల దృక్పథాన్ని కలిగియుంటారు.

యువజనులు స్వాతంత్ర్యాభిలాష, విద్యాభిలాష, క్రీడాభిలాష, స్నేహాభిలాష, కామోద్రేకాలు, లైంగికమైన సహజ్ఞానం ఇత్యాదులు కలిగి ఉంటారు. వీరు బాల్యలక్షణాలకు, వయస్కుల లక్షణాలకు మధ్యస్థంగా ఉంటారు. బాల్యంలో నేర్చుకున్న వాటికి, బాహ్య ప్రపంచానికి తేడా తెలుసుకుని మానసికంగా డోలాయమాన పరిస్థితిలో ఉంటారు. యువజనులు బాహ్య వాతావరణ పరిస్థితులకు ప్రభావితులౌతుంటారు. వీరి ప్రవర్తనలో మార్పులు చోటు చేసుకుంటాయి. యువజనులు వారి అవసరాలు వారికే తెలియని పరిస్థితిలో ఉంటారు. అందరి దృష్టినీ ఆకర్షించి గుర్తింపు పొందాలని ఏదో ఒకటి చేస్తుంటారు. వారి శక్తి సామర్థ్యాలను నిరూపించుకోవాలని ప్రయత్నిస్తుంటారు. అయితే ఈ ప్రయత్నంలో యువజనులు వారి తల్లిదండ్రుల ప్రభావం నుండి, పెత్తనం నుండి బయట పడాలని ప్రయత్నిస్తుంటారు. ఈ పరిణామ దశలో తరాల మధ్య అంతరం ఏర్పడి, పెరిగి, అది తరాల మధ్య ఘర్షణకు దారితీస్తుంది.

## 5.3 తరాల మధ్య అంతరం

మానవ జీవిత దశలన్నిటిలో యవ్వన దశకు అధిక ప్రాధాన్యత ఉంది. ఈ దశకు ఎంత ప్రాధాన్యత ఉందో, అంత క్లిష్టమైన దశ అని కూడా చెప్పవచ్చు. బాల్యదశనుండి యవ్వన దశలోకి అడుగు పెట్టే సమయంలో యువజనులలో అనేక రకాలైన మానసిక, శారీరక మార్పులు చోటు చేసుకోవడం సంభవిస్తుంది. ఆ మార్పుల వల్ల యువజనులు అనేక మానసిక ఒత్తిడులకు లోనౌతారు. ఈ దశలో వ్యక్తిగత అభిరుచులు, అభిప్రాయాలు, ఆశయాలు ఏర్పడతాయి. వ్యక్తిగత విజ్ఞానాన్ని కూడా ఈ దశలోనే సంపాదించుకుంటారు. ప్రత్యేక వ్యక్తిత్వ గుర్తింపును కోరుకోవడం కూడా ఈ దశలోనే ప్రారంభమౌతుంది. అందుకే కీలకమైన ఈ దశలోనే యువజనుల అభిరుచులను, ఆశయాలను, సమస్యలను అర్థం చేసుకుని వారికి సరియైన శిక్షణనివ్వడం అవసరం.

సాధారణంగా ప్రతీ కుటుంబంలో యువతకు, వారి తల్లిదండ్రులకు మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడడం సహజం. కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను యుక్త వయస్సు వచ్చిన తర్వాత కూడా వారి జీవితం గురించి వారు ప్రణాళికలు వేసుకోవడానికి, ఆలోచించడానికి పూర్తి స్వాతంత్ర్యాన్ని ఇవ్వడానికి వెనుకంజ వేస్తారు. యుక్త వయస్సు వచ్చిన తర్వాత కూడా తమ సంతానాన్ని చిన్నపిల్లల్లాగా భావిస్తూ, వ్యవహరిస్తుంటారు. తమ అదుపాజ్ఞలలోనే యువత ఉండాలని, వారిని శాసిస్తుంటారు. యువత తమ భావి జీవిత ప్రణాళికలను వేసుకోవడానికి ఉత్సుకత చూపినా తల్లిదండ్రులు బాల్య చేష్టగా కొట్టిపారేస్తుంటారు. యవ్వన దశలో ఈ రకమైన గృహవాతావరణం వలన యువజనులలో తీవ్ర అసంతృప్తి చెలరేగుతుంది. ఈ అసంతృప్తి యువజనులలో తీవ్ర సమస్యలకు కారణమౌతుంది. సాధారణంగా యువతులవలె, యువకులు, బాల్యంలో వలె తల్లిదండ్రుల అదుపాజ్ఞలలో ఉండడానికి ఇష్టపడరు. కనుక, మానసిక అశాంతి, అసంతృప్తి యువతులలో కంటే యువకులలో ఎక్కువ గోచరిస్తుంది.

యువత తల్లిదండ్రుల అదుపునుండి బయటపడాలని స్నేహితులతో ఎక్కువగా తిరుగుతారు. కానీ ఇది చెడు అలవాట్లకు దారితీస్తుందన్న భయంతో తల్లిదండ్రులు యువతను స్నేహితులతో తిరగరాదని ఆంక్షలు విధించి కట్టడిచేయడానికి ప్రయత్నిస్తుంటారు. ఈ విధమైన తల్లిదండ్రుల ప్రవర్తన యువతలో మానసిక ఆందోళనను కలిగిస్తుంది. ఈ మానసిక ఆందోళన అశాంతి రూపం ధరించి, యువజనులకు, వారి తల్లిదండ్రులకు మధ్య ఘర్షణకు దారితీస్తుంది. ఈ ఘర్షణ తీవ్రరూపం ధరించినప్పుడు కుటుంబ అవ్యవస్థ చోటుచేసుకుంటుంది. దీన్నే తరాల అంతరం అంటారు.

BRAOU

యువత మానసిక అశాంతిని తొలగించడానికి కుటుంబ సభ్యులు ప్రయత్నం చేయాలి. యువజనులను తల్లిదండ్రులు సరిగా అర్థం చేసుకుని, వారి వయస్సుకు తగిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఇచ్చి, వారు సక్రమ మార్గంలో పయనించడానికి సూచనలు, సలహాలు ఇవ్వాలి. యువజనులకు స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని ఇవ్వడం వలన వారు స్వయంశక్తిని పొంది, స్వతంత్ర్య జీవనాన్ని గడపడానికి వారితో అన్ని అంశాలను గురించి వివరంగా, స్వేచ్ఛగా చర్చించాలి. తమ జీవనోపాధికై ఏ వృత్తిని స్వీకరించాలి అనే అంశాలన్ని యువజనులకు ఆలోచించుకునే అవకాశాన్ని పెద్దలు ఇవ్వగలగాలి. అయితే ముఖ్యమైన ఈ అంశాన్ని గురించి యువజనుల భవిష్యత్తు గురించి తల్లిదండ్రులు ముందుగా నిర్ణయించుకోవడం జరగడంలేదు. సాధారణంగా, తమ పిల్లలు తమ ఇష్టానుసారమే ఇంజనీరో, డాక్టర్ కోర్సే చదవాలనే ఆంక్షలు తల్లిదండ్రులు విధించడం జరుగుతోంది. యువతకు వారి భవిష్యత్తును వారు నిర్ణయించుకునే అవకాశాన్ని, స్వాతంత్ర్యాన్ని ఇవ్వక, వారికి అభిరుచిలేని చదువులను చదివించడం జరుగుతోంది. దీని వలన తల్లిదండ్రులు అంచనాలకు తగినట్టుగా యువత రూపొందలేకపోతున్నది. ఒక్కొక్కసారి యువత వారు ఊహించని వృత్తులను పెద్దల బలవంతంపై చేపట్టినప్పుడు, ఆ వృత్తులలో సర్దుబాటు చేసుకోలేక, అసమయోజకత్వాన్ని పొందడం జరుగుతున్నది. తమ శక్తి సామర్థ్యాలను పూర్తిగా వినియోగించుకోలేక తక్కువ వేతనాన్ని పొంది, అనేక సమస్యలకు గురవుతున్నారు.

ఏ దేశ భవిష్యత్తు అయినా యువజనులపైనే ఆధారపడి ఉంటుంది. కనుక యువజనులను కుటుంబ సభ్యులు (పెద్దలు, తల్లిదండ్రులు) సక్రమంగా అర్థం చేసుకుని, వారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఇవ్వాలి. అదే విధంగా యువత కూడా తల్లిదండ్రుల అభిప్రాయాలు, సలహాలలోని విలువలను గమనించి ప్రవర్తించాలి. అప్పుడే తరాల

మధ్య అంతరాలు తొలగి, కుటుంబ సుస్థిరత, తద్వారా సామాజిక సుస్థిరతలు ఏర్పడతాయి.

నేటి సామాజిక పరిస్థితులలో యువజనులు తమ అవసరాలను నెరవేర్చుకోవడంలో అనేక సమస్యలను ఎదుర్కొనవలసి వస్తోంది. అనాదినుండి వస్తున్న సాంఘిక వ్యవస్థ రోజురోజుకు మార్పు చెందడం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్షీణించడం, పారిశ్రామికంగా సమాజం మార్పుచెందడం, పట్టణ జీవితంపై వ్యామోహం పెరగడం, పాశ్చాత్యుల సంస్కృతిని అనుకరించడం మొదలైన పరిస్థితులు యువజనుల సమస్యలను మరింత జటిలం చేస్తున్నవి. గ్రామాలలోని యువజనులు, పట్టణాలలోని వారు, చదువుకున్నవారు, చదువులేనివారు, గిరిజనులు ఆయా సామాజిక పరిస్థితులను బట్టి వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నారు. వివిధ వర్గాలకు చెందిన యువజనుల ప్రత్యేకమైన సమస్యలను చర్చించేముందు, అందరికీ సంబంధించిన కొన్ని సమస్యలను తెలుసుకుందాం.

## 5.4 యువజనుల సాధారణ సమస్యలు

యువజనులలో చాలామంది తమ గృహాలలో ప్రత్యేకమైన వసతిలేకపోవడం కారణంగా ఇబ్బందుల పాలవుతుంది. ఆర్థికపరమైన ఇబ్బందుల వలన అనేక కుటుంబాలు తమ కుటుంబ సభ్యులందరి అవసరాలకు తగిన గృహవసతిని కలిగించలేవు. ఇట్లాంటి పరిస్థితులలో యువజనులు శారీరకంగా మానసికంగా అనేక వ్యధలను, బాధలను అనుభవించవలసి వస్తుంది. తద్వారా వారి అభివృద్ధి కుంటుపడుతుంది.

యువజనులు శారీరక, మానసిక వికాసాన్ని పొందడానికి విరామ సమయాలలో, ఆటపాటలలో, విజ్ఞాన, వినోద కార్యక్రమాలలో పాల్గొనవలసిన అవసరం ఉన్నది. కానీ, కొంతమంది తల్లిదండ్రులు అటువంటి విజ్ఞాన వినోద కార్యక్రమాలలో పాల్గొనడం వలన తమ పిల్లలు పాడయిపోతారని భయపడతారు. పేద కుటుంబాలకు చెందినవారు వాటి అవసరాన్ని గుర్తించరు. విజ్ఞాన వినోద కార్యక్రమాలలో పాల్గొనడం వలన తమ పిల్లలు అమూల్యమైన కాలాన్ని వృథా చేసుకుంటారని, చెడ్డవారితో సావాసం చేస్తారని సాధారణంగా తల్లిదండ్రులు భావిస్తారు. దీని వలన యువజనులలో ఉత్సాహం, మానసిక వికాసం లోపించే అవకాశముంది.

BRAOU

సమాజంలోని యువతీయువకులు వారి యవ్వనంలో వచ్చే మార్పులు ఎదుర్కోవలసి ఉంటుంది. కొన్ని సందర్భాలలో యువజనులు సామాజిక విలువలతో, ఆశయాలతో, ఆచారాలతో, కట్టుబాట్లతో ఏకీభవించక అన్యమార్గాలను అనుసరిస్తుంటారు. కొంతమంది యువకులు తమ వ్యక్తిగత దౌర్బల్యం వల్ల వక్రమార్గాలలో పయనిస్తారు. మురికివాడలలో నివసించే యువకుల పురోభివృద్ధికి సరైన అవకాశాలు లేకపోవడంతో వారు సంఘవ్యతిరేక శక్తులుగా ప్రవర్తించే అవకాశముంది.

మనదేశ సంస్కృతి, సంప్రదాయాల దృష్ట్యా యువతీ యువకులకు లైంగిక బోధన జరగడంలేదు. యువజనులు తమ యవ్వన దశలో లైంగిక సంబంధమైన ఆంతరంగిక సమస్యలకు లోనయి మానసిక ఒత్తిడిని, ఆందోళనను అనుభవిస్తుంటారు. అటువంటి పరిస్థితిలో వారు చవకబారు అశ్లీల సాహిత్యాన్ని రహస్యంగా చదవడం, లైంగికవిషయంలో తప్పుదారిపట్టడం జరుగుతుంది. దీనివల్ల యువకుల శారీరక, మానసిక, నైతిక ఆరోగ్యం దిగజారిపోతుంది.

భావిపౌరులు, దేశానికి వెన్నెముక అయిన యువజనులు నిరక్షరాస్యులుగా ఉన్నట్లయితే వారు దేశాభ్యుదయానికి ఏ విధంగానూ తోడ్పడలేరు. యువజనులలోని నిరక్షరాస్యతకు ఆర్థిక పరిస్థితులు కొంతవరకు కారణమైనప్పటికీ, అసలు విద్య ఉద్యోగం కోసమేగాక, సుఖమయ జీవితానికి అవసరమైనది అని గుర్తించకపోవడం కూడా ఒక ముఖ్యకారణం. ఈ విధంగా యువజనులలో నిరక్షరాస్యత శాతం అధికమవుతున్నది. యువత నిరక్షరాస్యతవల్ల అనేక సమస్యలను ఎదుర్కొంటోంది.

కొంతమంది యువజనులు, నిరక్షరాస్యత, అజ్ఞానం, అమాయకత్వం మొదలైన కారణాలవల్ల మతం, దైవం, ఆచారం, సంప్రదాయం మొదలైన విషయాలలో మూఢ విశ్వాసాలతో ఉండి మార్పునకు అంగీకరించరు.

మానసిక వికాసానికి, ఉల్లాసానికి విజ్ఞాన వినోద కార్యక్రమాలు యువతకు ఎంతో అవసరం. అయితే నేడు సమాజం వీటికి అంతగా ప్రాధాన్యతను ఇవ్వలేకపోతోంది. సామాజిక కేంద్రాలు, గ్రంథాలయాలు, పార్కులు మొదలైనవాటిని స్థాపించి సమర్థవంతంగా నడపలేకపోతోంది. దీనివలన యువత తమ విరామ సమయాన్ని అల్లరిచిల్లరిగా తిరగడానికే వినియోగిస్తోంది.

ఏనాడో ప్రజలలో అక్షరజ్ఞానం కలిగించడానికి ఏర్పాటు చేసిన విద్యావిధానం నేడు యువజనుల అవసరాలను తీర్చలేకపోతున్నది. అందువలన వారు ఈ విద్యావిధానంపైననే ఏహ్యభావాన్ని పెంపొందించుకొంటున్నారు. తమ అవసరాలు తీరడం లేదన్న అసంతృప్తి వలన అశాంతి, నిరాశ, నిస్పృహలకు లోనై ఉద్రేకపూరితమైన మనఃప్రవృత్తి కలిగి ఉంటున్నారు.

ఈనాటి విద్యావిధానం అటు విజ్ఞానానికిగానీ, ఇటు ఉద్యోగానికిగానీ సంతృప్తికరంగా ఉపయోగపడలేక పోతోంది. సంపూర్ణ విజ్ఞానం అందించే పాఠ్యప్రణాళికలు ప్రస్తుత విద్యావిధానంలో లేవు. విద్యార్థి జీవితం యాంత్రికంగా బట్టీపట్టడానికి పరిమితమయింది.

విద్య ప్రైవేటీకరణవల్ల ఆసక్తిగల యువతకు ఉన్నతవిద్య ఆర్థికంగా భారం కావడంతో, ఆర్థికంగా వెనుకబడిన యువజనులు తీవ్ర అశాంతికి గురవుతున్నారు.

అర్హతకు తగిన ఉద్యోగాలు దొరకకపోవడం, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం, ఉద్యోగావకాశాలు కుదింపు, మొదలైన అశాంతివల్ల కనీస అవసరాలు కూడా తీరని యువత తీవ్ర అసంతృప్తికిలోనై, తీవ్రవాదం వైపు మొగ్గుచూపడం జరుగుతోంది.

మనదేశంలో సామాజిక పరిస్థితి ఎంతో అభివృద్ధి చెందవలసి ఉన్నది. మన దేశంలోని కుల వ్యవస్థ సాంఘిక జీవనాన్ని నాశనం చేస్తున్నది. ఎన్నో కులాలు, మతాలు, ఉన్నందువల్ల స్నేహాన్ని యువజనులు తమ కులంవారితోనో, మతం వారితోనో చేయవలెననే పెద్దల ఆంక్షలవలన కులాల మధ్య, మతాల మధ్య అంతరాలు పెరిగిపోతున్నాయి. దీనివలన కులాల మధ్య, మతాల మధ్య ఘర్షణలు తలయెత్తే అవకాశముంది. జాతి, మత, కుల విభేదాలు లేకుండా పెరగవలసిన భావిభారత యువతీయువకులు పెద్దల కులమత వైషమ్యాలను తాము కూడా నేర్చుకుని, కుల తత్వాన్ని, మతతత్వాన్ని పెంచి పోషించే అవకాశముంది.

విద్యావంతులు కాని యువజనులు కొందరు ఏ వ్యాపకం లేక చెడ్డ స్నేహాలకులోనై, ముఠాలలోనూ, గుంపులలోనూ చేరి సంఘవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటున్నారు.

## 5.5 గిరిజన యువజనులు-సమస్యలు

నగరీకరణ, పారిశ్రామికీకరణ మొదలైన కార్యక్రమాల వలన గిరిజనుల సంస్కృతిలోను, ఆచార వ్యవహారాలలోనూ ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అయితే గిరిజనులు కొన్ని మార్పులను అంగీకరించి, అలవర్చుకోవడానికి ప్రయత్నించడం, మరికొన్ని మార్పుల విషయంలో వ్యతిరేకించడం జరుగుతున్నది. కొన్ని మార్పులతో ఏకీభవించి, కొన్ని మార్పులతో విభేదించడం వలన గిరిజన యువజనులు కొత్త పాతల మధ్య తికమక పడుతుంటారు. దీనివలన అభివృద్ధి కార్యక్రమాల ద్వారా అనేక మార్పులు ప్రవేశపెట్టినప్పటికీ యువజనులు సరిగా వాటిని అర్థం చేసుకోలేక నిరాశా నిస్పృహలకు గురౌతున్నారు.

గిరిజనులలో అధికశాతం ఈనాటికీ నిరక్షరాస్యులుగానే ఉన్నారు. తమకు విద్య అవసరమని గిరిజన యువజనులు గుర్తించడం లేదు. గిరిజనులకు అవసరమైన పాఠశాలలు, వసతిగృహాలు అందుబాటులో లేవు. ఈ పరిస్థితుల వలన యువజనుల విద్య కుంటుపడుతోంది. అవిద్యే అన్ని సమస్యలకు మూలం.

BRAOU

## 5.6 గ్రామీణ యువజన సమస్యలు

విజ్ఞాన వినోద కార్యక్రమాలకు గ్రామాలలో తగిన వసతులు సాధారణంగా ఉండవు. విరామసమయాన్ని గ్రామీణ యువజనులు వ్యర్థ సంభాషణలతో వృధా చేస్తున్నారు. దీనివలన అనవసరపు తగాదాలు, కక్షలు గ్రామాలలో చోటు చేసుకుంటున్నాయి. అయితే గ్రామ పంచాయితీలలో యువకుల మనోవికాసానికి అవకాశాలను కల్పించలేకపోతున్నారు. కొన్ని పంచాయితీలు ఈ విషయంలో కృషి చేస్తున్నప్పటికీ అంతగా చెప్పుకోదగిన అభివృద్ధి సాధించలేదు. సామాజిక కేంద్రాలు, గ్రంథాలయాలు, పార్కులు మొదలైనవి సమాజానికి చెందినవనీ, వాటిని పంచాయితీ ద్వారా సాధించి, పరిరక్షించుకోవలసిన బాధ్యత సమాజ పౌరులుగా తమకున్నదనీ తెలియని గ్రామీణ సమాజ యువకులు విజ్ఞాన వినోద వికాస అవకాశాలను పొందలేకపోతున్నారు.

## 5.7 నగర యువజనుల సమస్యలు

నేడు పట్టణాలలో, నగరాలలో యువజనులు అధిక సంఖ్యలో ఉన్నారు. అవివాహిత యువతీ యువకులకు తగిన గృహ వసతి లేకపోవడం ఒక సమస్యగా పరిణమించింది. అనుకూలమైన గృహవసతిలేకపోవడం వలన వారి సంక్షేమం ఒక విధంగా కుంటుపడుతోందని చెప్పవచ్చు.

సక్రమమైన రవాణా సౌకర్యాల లోపంవలన నగర యువజనులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. రవాణా సౌకర్యాల కొరత వలన యువజనులు సకాలంలో వారి వారి గమ్యాలకు చేరకపోవడంతో ఇంటర్వ్యూలకు హాజరుకాలేక కొందరు, కార్యాలయాలకు సకాలంలో వెళ్లలేక మరికొందరు తీవ్రమైన మానసిక ఒత్తిడిని, ఆందోళనను అనుభవిస్తున్నారు.

BRAOU

పట్టణాలలోని మురికివాడలు అనేక సమస్యలకు నిలయాలు. ఈ మురికివాడలలో నివసించే యువజనులు చాలా వెనుకబడి ఉంటారు. మురికివాడల భౌతిక పరిస్థితుల వలన, ఆర్థిక పరిస్థితుల వలన అక్కడి యువజనులు అన్ని అంశాలలోనూ వెనుకబడి ఉన్నారు. మురికివాడలలో నివసించే యువజనులకు సరైన జీవనోపాధి దొరకకపోవడం వలన వారు అనేక సంఘ వ్యతిరేక విధానాలను అవలంబించే అవకాశం పెరుగుతున్నది.

## 5.8 విద్యార్థి, యువజనుల సమస్యలు

లోపభూయిష్టమైన విద్యావిధానం ఈ తరం యువజనుల అవసరాలను తీర్చడంలేదు. దీనివలన విద్యార్థులు నేటి విద్యావిధానంపై ఒకరకమైన ఏవగింపును పెంచుకుంటున్నారు. విద్యావిదానంలోని లోపాలవల్ల యువజనులు ఒక విధమైన అశాంతిని పొంది నిరాశా నిస్పృహలతో విద్యావిధానంలో మార్పులు కోరుతూ అలజడి చేస్తున్నారు. ఇది ఈనాడు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ప్రధాన సమస్య.

విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత ఉద్యోగావకాశాలు లేకపోవడం, ఉద్యోగం దొరికినా అర్హతకు తగినదిగా ఉండకపోవడంతో కనీసావసరాలు తీరని యువత తీవ్ర నిరాశకులోనై, ఆందోళనకారులుగా మారడం నేటి విద్యావ్యవస్థలోని లోపమేనని చెప్పవచ్చు.

## 5.9 యువతుల సమస్యలు

నేటి యువతులు ఎదుర్కొంటున్న సమస్యలలో ర్యాగింగ్, లైంగిక హింస, వరకట్న సమస్యలను ముఖ్యమైనవిగా పేర్కొనవచ్చును. విద్యార్థినులు, కళాశాలలలో ఎదుర్కొంటున్న ర్యాగింగ్ సమస్యవల్ల అనేకమంది విద్యార్థినులు చదువు మధ్యలోనే వదిలేస్తుండగా, మరికొందరు విద్యార్థినులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఉద్యోగినులు తమ కార్యాలయాలలో పైఅధికారుల వల్ల లైంగిక హింసకు గురిఅవుతున్నారు. సహ ఉద్యోగులు, పైఅధికారులు

అశ్లీలమైన మాటలు, చేతలతో ఉద్యోగంలో ఉన్న యువతులను మానసికంగా ఆందోళనకు, అశాంతికి గురిచేస్తున్నారు.

వరకట్న సమస్యవల్ల ఆర్థికంగా వెనుకబడిన యువతులకు వివాహాలు జరుగక, ఆయువతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కొన్ని కులాలలో భర్త చనిపోయిన యువతికి తిరిగి వివాహం చేసే ఆచారం లేనందువల్ల అమె చిన్న వయస్సులోనే కోరికలు చంపుకొని, జీవచ్ఛవంలా బతకడం యువతుల పాలిట సమస్యగా తయారవుతున్నది.

## 5.10 యువత-అశాంతి, కారణాలు

మానవులు పుట్టుకతోనే దుర్మార్గులుగా పుట్టరు. పసిపిల్లలను పరిశీలిస్తే వారు ఎంతో అమాయకులుగానూ, మంచి వారుగానూ కనబడతారు. వారు ఎదిగినకొద్దీ పెద్దవారితో సంపర్కం ఎక్కువయినకొద్దీ, దురలవాట్లను నేర్చుకొంటారు. కొందరు యువజనులు పెద్దవారి దుర్నడతలతో వెంటనే రాజీపడక ఎదిరించడానికి ప్రయత్నిస్తారు. ఈ సహజగుణ పరిణామమే ఇప్పటి యవజనుల అశాంతికి, అసంతృప్తులకు, ఆందోళనకు కారణమవుతున్నది.

లోపభూయిష్టమైన సామాజిక వ్యవస్థను ప్రశ్నించడం ద్వారా ఈనాటి యువజనులు తమ అశాంతిని ప్రకటిస్తున్నారని చెప్పవచ్చు. ఎటు చూసినా మనకు కనబడే విద్యార్థుల అలజడి, ఆందోళన, సంఘవిద్రోహ చర్యలు, వినాశక చర్యలు, క్రమశిక్షణా రాహిత్యం మొదలైన విఫల మనోరథ సూచనలు పైన వివరించిన యువజన సమస్యల ఫలితాలని చెప్పవచ్చు.

యువజన విద్యాభ్యాసానికి ప్రభుత్వం చాలా కాలంనుంచి తగిన కృషి చేస్తున్నప్పటికీ విద్యావిధానంలో లోపాలుండడం వల్ల లేదా మొత్తం ప్రజలలో అనేక కారణాల వల్ల అశాంతి ప్రబలడం వల్ల యువజనులలో బలవత్తరమైన అశాంతి బయలుదేరి శాంతి భద్రతలకే గాక ప్రభుత్వానికి, పౌరుల, ఆర్థిక జీవనానికి ప్రబలమైన ముప్పు వచ్చే సూచనలు కానవస్తున్నాయి. విద్యార్థుల అశాంతి సంగతి అందరికీ తెలిసిందే. అయినా వాస్తవంగా దాని స్వభావాన్ని, పరిష్కార మార్గాలను చాలామంది ఆలోచించినట్లు కనబడదు. ఈ సందర్భాలలో సామాజిక శాస్త్రవేత్తలు వెల్లడించిన అభిప్రాయాలను తెలుసుకుందాం.

భారత ప్రభుత్వ విద్యాయువజనశాఖ మాజీ మంత్రి డాక్టర్ వి.కె.ఆర్.వి. రావు తమ అభిప్రాయాలను ఈ క్రింది విధంగా వెల్లడించాడు.

'యువజన అశాంతి అనేది ప్రపంచంలో అన్నిచోట్లా బయలు దేరిన మానవ అశాంతిలోని ఒక భాగం మాత్రమే. ఒక్కొక్కప్పుడు అది హింసాపూర్వకంగా ఉండేది నిజమే. దానిని ఎవరూ సమర్థించరు. కానీ ఇతరులు ఎవరైనా చేసే ఆందోళనలో కూడా హింస అనేది ఉంటున్నటుందని మనం జ్ఞాపకం ఉంచుకోవాలి. లేనివారు ఉన్నవారికి వ్యతిరేకంగా అలజడి చేస్తారు. స్త్రీలు, పురుషుల పెత్తనానికి వ్యతిరేకంగా అలజడి చేస్తారు. ఈ అన్నింటిలోనూ అసంతృప్తి అనేది మితిమీరినప్పుడు, ఒక్కొక్కప్పుడు అది హింసలోకి దిగుతుంది. ఈ అన్నిటి వెనకాల ఉండే మానసిక అసంతృప్తి, ఆందోళన గురించి ఆలోచించాలి.. ఈనాటి యువజనులే రేపటి పౌరులుగా పెరిగి ప్రపంచ పోకడలకు సారథ్యం వహించబోతారు, అన్నప్పుడు వారు ప్రవేశించే ప్రపంచం ఎట్లా ఉంటుంది అన్న ఆలోచన వారికి ఏర్పడుతుంది. అట్లా ఆలోచించేటప్పుడు, వారు నిర్వహించే ప్రపంచం సరిగా లేదని, అందులో లోపాలు చాలా ఉన్నవని వారు కనుక్కున్నప్పుడు, వారి మనస్సులలో ఉదయించే మనో వేదన ఎట్లా ఉంటుందో మనం ఊహించవచ్చు. వారు చిన్నప్పటినుండి పెంచుకున్న ఆదర్శాలు, రేపటి ప్రపంచానికి భిన్నంగా ఉన్నందువల్ల వారి జీవితాలలో ఏమార్గాన్ని అనుసరించాలో వారికే దిక్కుతోచకుండా ఉంటుంది.

ఈ పరిస్థితులలో యువజనుల పట్ల మన దృక్పథం ఎలా ఉండాలి? యువజనులలో ఏవో దురవాట్లు ఉన్నవని మనం ఆగ్రహించకూడదు. దురలవాట్లు కొన్ని ఉండవచ్చు. కానీ ఆ దురలవాట్లు యువజనులందరికీ ఉన్నవా లేదా ఎవరికో కొందరికి మాత్రమే ఉన్నవా అని పరిశీలించాలి. అట్లా పరిశీలించాక వారిలో తప్పులున్నవనే దురభిప్రాయం

B RAOU

ఏర్పరచుకుంటే పరిస్థితులింకా అధ్వాన్నంగా తయారవుతాయి.

రెండోది, ప్రతీ మానవునికి ఉన్న సహజశక్తి సామర్థ్యాలను మనం ఉపయోగించుకొని, సౌకర్యాలను అభివృద్ధి చేసుకొని, వాటిని సమానంగా పంచుకొని మనలో ఉన్న హెచ్చుతగ్గులను రూపుమాపాలి. ఈ ఆశయాన్ని సాధించాలంటే మనకంటే ఎక్కువ శక్తి సామర్థ్యాలు గల, యువజనశక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోక తప్పదు.

మూడోది, అతి త్వరగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రపంచంతో మనం కూడా సరిసమానంగా అభివృద్ధి అయి ముందుకు నడవకపోతే, నడిచి యువకులకు మార్గదర్శకత్వం వహించకపోతే, మనం అభివృద్ధి చెందుతున్న దేశాలకంటే ఎంతో వెనుకబడిపోయి భావి పౌరులైన యువజనులకెంతో ద్రోహం చేసినవారమవుతాము.

నాలుగోది, యువజనులపట్ల మన ప్రవర్తన, మనకు వారు సమానులు కారని, వారికంటే మనం గొప్పవారమనిగానీ భావించకూడదు. వారు కూడా మనలాగ ఎదిగినవారేనని గుర్తించాలి. వారిపై పెత్తనం చేసే అలవాట్లను విస్మరించి, స్నేహభావంతో మెలగాలి.

యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్, జపాన్‌లో భారత మాజీ రాయబారి బద్రుద్దీన్ త్యాబ్జి ఇట్లా అన్నారు. పెద్ద వయస్సులవారికి, యువజనులకు మధ్య మొదటినుండీ ఎదిరింపు, దౌర్జన్యం, ఎప్పుడూ లేదు. యువకులలో పెద్దవారిపట్ల, అధికారులపట్ల, ఇప్పటి ధిక్కారం ఎప్పుడూలేదు. ఈ ధిక్కారానికి ముఖ్యకారణం వారి సమస్యలను పెద్దవారుగానీ, అధికారులుగానీ తీర్చలేకపోతున్నారన్నదే... తమ ధోరణిలో, తమ ప్రవర్తన లాంటి ప్రవర్తనవల్లే రాజకీయ పెద్దలు అధికారంలోకి రాగలిగినారనే భావం కూడా వారి దౌర్జన్య ప్రవర్తన పెరగడానికి కారణం. యువజనులు భావిజీవితానికి ఇప్పటి ఏలికలు ఏవిధంగానూ ఆశాజనకమైన విధానాలు ఏర్పాటు చేయలేదనే అసంతృప్తి మరొక కారణం. పెద్దవారు యువకుల అభివృద్ధికి ఏ మాత్రం దోహదం చేయక, వారిని అధికారంలోకి రానీయక, తామే తమ పదవులను అంటిపెట్టుకుని ఉండడం మరొక కారణం. యువకులకు సంబంధించిన వ్యవహారాల్లో కూడా పెద్దవారే పెత్తనం చేస్తుంటారనేది మరొక కారణం. తమ వ్యవహారాల్లో పెద్దవారికంటే తమకు తగిన పరిజ్ఞానం, శక్తి సామర్థ్యాలున్నవని, యువజనుల మార్పుల విషయంలోగానీ, యువకులకు సంబంధించిన మరే విషయాలలోగానీ నిర్ణయాలను యువజనులకే వదిలివేయాలి. ఇవేమీ చేయకపోగా, అధికారంలో ఉన్న పెద్దలు యువజనులను తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకొని, తరువాత వారి సంగతులేవీ పట్టించుకోరు. యువకులు కూడా ఈ కపట వ్యూహాలను పరిశీలించక కేవలం ఆందోళనకు అవకాశం చిక్కిందనే సంతోషంతో దేశ విద్రోహక కార్యకాలాపాలకు ఉపక్రమిస్తారు. అట్లాకాకుండా యువకులు ప్రభుత్వంలోనూ, సామాజిక జీవితంలోనూ తమ యోగ్యతలకు తగిన స్థానం ఇవ్వాలని ఆందోళన జరపాలి.

విధ్వంసక చర్యలకంటే నిర్మాణాత్మకమైన కార్యాల విషయంలో శ్రద్ధ చూపాలి. ఈ విధంగా నిర్మాణాత్మకమైన చర్యలను తీసుకుంటే అవి వారి జీవితాలలో చాలా లాభదాయకంగా ఉంటాయి అనే విషయం వారు సదా దృష్టిలో ఉంచుకోవాలి.

మాజీ పార్లమెంటు సభ్యుడు, పార్లమెంటు విధానం, చట్టశాస్త్ర అధ్యయన సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎల్.ఎం. సింఘ్వి ఇట్లా అభిప్రాయపడ్డాడు.

యువజనులు సమాజంలో ఒక భాగం. అందువల్ల వారిని వేరుగా చూడరాదు. నిజంగా వారు అద్దంలో మాదిరిగా ప్రస్తుత పరిస్థితులను ప్రతిబింబంలో చూపుతారు. వారి దృక్పథంలో లోపాలుండవచ్చు. వారి ఆగ్రహం ఒక ప్రత్యేక ఆశయం కోసం, ఒక సత్యం కోసం కాకపోవచ్చు. వారి అవసరాలేమిటో వారికే సరిగా తెలియకపోవచ్చు. దీనికంతటికీ కారణం మనం వారి భావిభారత నిర్మాణంలో వారిని భాగస్వాములుగా చేయకపోవడమే. వారి చుట్టూ వారికగుపడే పరిసరాలు కూడా వారి అశాంతికి, అసంతృప్తికి కారణం. ఎక్కడ చూసినా సందేహం, అనుమానం, నిరుత్సాహం, దారిద్ర్యం, నష్టం. ఎక్కడ చూసినా సామాన్య జీవితంలో మితిమీరిన రాజకీయాలు, వైఫల్యాలు, నిరాశ, నిరుద్యోగం, విద్యా ప్రమాణాల పతనం, లోపభూయిష్టమైన విద్యావిధానం, సౌకర్యాలు లేని విద్యాసంస్థలు... ఇవే యువజనులకు ఎప్పుడూ కనబడే దృశ్యాలు. వీటి బారినుండి తప్పించుకోవడానికి చేసే ప్రయత్నమే విద్యార్థుల ఆందోళన. పదే పదే

BRAOU

జరుగుతున్న యువజనుల ఆందోళనలు దేశశక్తిని, విద్యాభివృద్ధిని, సామాజిక, నైతిక జీవనాన్ని, ప్రజాస్వామ్య భావాన్ని, విధానాలను, నాశనం చేస్తున్నవి. కళాశాలల విద్యార్థులు రాజకీయాల గురించి తెలుసుకోవలసిందే కానీ, రాజకీయ ఆందోళనలో పాల్గొనరాదు. రాజకీయ నాయకుల చేతులలో కీలుబొమ్మలు కారాదు.

1917వ సంవత్సరంలో భాగల్పూరు విద్యార్థుల సభలో మహాత్మాగాంధీ ఈ విధంగా ఉపన్యసించారు. 'రాజకీయాలు రెండు రకాలుగా ఉన్నాయి. అవి సిద్ధాంతం, కార్యాచరణ విద్యార్థులు రాజకీయ సిద్ధాంతాలను తెలుసుకోవలసిందేగానీ, కార్యాచరణలో చొరబడితే వారు నష్టపోవచ్చు. అందులో ముఖ్యంగా క్రియాశీల రాజకీయాలలో అసలే ప్రవేశించరాదు. విద్యార్థి దశలో వారు తమను తాము అభివృద్ధి చేసుకుంటే భావిజీవితంలో ఉత్తమ పౌరులుగా దేశసేవ చక్కగా చేయగలుగుతారు'.

డాక్టర్ సింఘ్వి ఈ క్రింది సలహాలను ఇచ్చారు. అవి:

ఉద్రేక స్వభావం గల విద్యార్థులను దేశోద్ధరణ పథకాలలో చేరేటట్లు చేయాలి. విశ్వవిద్యాలయాల పరిపాలనలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోరాదు. విశ్వవిద్యాలయాలలో ఉండేవారే రాజకీయాలను చెలాయించే అలవాటును ఖండించాలి. విద్యాన్వేషణలో విద్యార్థులను సంపూర్ణంగా నిమగ్నులను చేయాలి. బోధకులు వారి సంక్షేమం విషయంలో ఇంకా ఎక్కువ శ్రద్ధ చూపాలి. వారికి తగు సలహాలివ్వాలి. విద్య ముగిసిన తర్వాత వారు ఏయే వృత్తులలో ప్రవేశించాలో, ఎట్లా బతకాలో చెప్పాలి. వారి సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించాలి. సాంఘిక సంస్కరణలో కూడా వీరికి ప్రవేశముండాలి.

కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ అధ్యయన సంస్థ, దక్షిణాసియా అధ్యయన కేంద్రం- వీటిలో పనిచేసిన డాక్టర్ మార్గరేట్ యల్. కోర్మాక్ ఈ క్రింది విధంగా అభిప్రాయాలను వెల్లడించారు.

విశ్వవిద్యాలయ విద్యార్థుల అశాంతిని తొలగించడానికి ఏదో కొంత చేయాలనే అభిప్రాయం అందరిలోనూ ఉన్నదే. కానీ ముస్లిమ్‌లు, క్రైస్తవుల వలెనే వారు కూడా ఒక అల్ప సంఖ్యాకవర్గమని గుర్తించకపోతే ప్రమాదం ఏర్పడే సూచనలున్నాయి. ఈ పరిణామం ఇండియాలోనే కాదు, విదేశాలలో మరీ ఎక్కువగా ఉన్నది... అన్ని దేశాలలోనూ యువజన అశాంతి ఉన్నదని భావిస్తే ప్రయోజనం లేదు. ఇది యువజన విప్లవం, ఈ విప్లవం మన కళ్లను తెరిపించాలి. అట్లాకాక వారిని దూషిస్తూ, విమర్శిస్తూ కూర్చుంటే వారి కోపాగ్ని ఇంకా రగులుతుంది. సామాజిక మార్పులు అతి త్వరగా జరుగుతున్నాయి. హింసను హింసతోనే చల్లార్చాలనే వాదం సరైనది కాదు. గాంధీ మార్గమొకటే మనకు శరణ్యం. వారి అవసరాలను గుర్తించి వాటిని తీర్చడానికి ప్రయత్నించాలి.

సామాజికవ్యవహారాల ఆచార్యులు సీమన్ మార్టిన్ లిప్సెట్ ఈ క్రింది విధంగా చెప్పారు.

భారతదేశంలో క్రమశిక్షణారాహిత్యం కొంతవరకు ఉపాధ్యాయుల వేతనాలలోపం నుంచి బయలు దేరుతున్నది. తక్కువ వేతనాల మూలంగా ఉపాధ్యాయులు ఉదాసీనంగా ఉంటున్నారు. వారి ఉదాసీనతవల్ల విద్యార్థుల ఆందోళన, అశాంతి ప్రబలుతున్నాయి. ఈ పరిణామాలు... మరొక కారణం సైన్స్ విద్యార్థులకు ఉన్న ఉద్యోగ అవకాశాలు ఆర్ట్స్ విద్యార్థులకు లేనందువల్ల ఆర్ట్స్ విద్యార్థులు రాజకీయ అశాంతిలో ఎక్కువగా పాల్గొంటారు.

రాజ్యాంగ చట్టాల, శాసన మండలుల మాజీ అధ్యయన సంచాలకుడు డాక్టర్ సుభాష్ సి. కాశ్యప్ ఈ విధంగా చెప్పారు. "యువజన ఆందోళన అనేది ఒక సాంస్కృతిక, ఆర్థిక, సాంఘిక విద్యా సమస్య అయినందువలన దాని పరిష్కారం సమగ్రంగా ఆలోచింవలసిన విషయం. దీనికి మూలకారణం యువజనులకు, పెద్దవారికి మధ్య ఉండే దృక్పథ దూరమే. ఒక్కొక్క తరం వారికి ఒక్కొక్క దృక్పథం ఉంటుంది. కొత్త తరం వారి ఆశయాలకు, పాత తరం వారి ఆశయాలకు తేడాలుంటాయి. కొత్త ఆశయాలకోసం కొత్త తరంవారు ఆందోళన జరుపుతారు. ప్రతీ సంఘంలోనూ, ప్రతీ తరంలోనూ యువజనులు పెద్దవారిమీద తిరగబడడం, పెద్దవారు యువజనులను నిరసించడం జరిగింది. పెద్దవారు తమ అనుభవ సంపదను, యువజనులు ఉపయోగించుకోవాలంటారు. కానీ, వారి అనుభవం పాతదని, కొత్త కాలానికి పనికిరాదని యువజనులు అభిప్రాయపడతారు. పెద్దల పెత్తనం నుంచి యువజనులు

BRAOU

తప్పించుకోజూస్తారు. ఈ ఘర్షణ ఎల్లకాలం ఉంటుంది.

ఈ భేదాభిప్రాయం తర తరాలనుంచి వస్తూనే వుంది. ఈ దృక్పథ దూరం ముందుకంటే ఇప్పుడు చాలా ఎక్కువగా ఉంది. భావి ప్రపంచం ఎట్లా ఉండాలనే నిర్ణయాన్ని మనం యువజనులకే వదిలివేయాలి. ఎందుకంటే ఆ ప్రపంచంలో మనబోయేవారు వారే కదా.

ఒక విధంగా యువజన ఆందోళన పురోభివృద్ధికి ఒక ముఖ్యమైన నాంది. చైతన్యంలేని ప్రజలు పురోభివృద్ధిని సాధించలేరు. అందువల్ల యువజన ఆందోళన గురించి మనం ఆందోళన పడనవసరంలేదు. వారి నిరుత్సాహం గురించే మనం ఆందోళన పడాలి. విప్లవోత్సాహం మంచిదే.. నిరుత్సాహమే చెడ్డది. మన దేశంలో విప్లవోత్సాహం కంటే నిరుత్సాహమే ఎక్కువగా కనబడుతోంది. ప్రస్తుత పరిస్థితులను మార్చలేమని, ఈ పరిస్థితులలోనే ఒక సురక్షిత స్థానం కోసం ఇప్పటి యువజనులు వెతుకుతారు. అట్టి రక్షణ స్థానం దొరకకపోతే నిరుత్సాహపడతారు.

రాజకీయ నాయకులు తమకు అవసరమైతే విద్యార్థుల క్షేమాన్ని గురించి ఎంతో ఆసక్తి చూపిస్తూ వారిని రెచ్చగొడతారు. కానీ తమ అవసరాలు తీరి తాము ఆశించిన పదవులలో చేరగానే విద్యార్థులు వారి చదువుల మీద మాత్రమే శ్రద్ధ చూపాలని, క్రమశిక్షణలోనే ఉండాలని, వారికి బోధిస్తారు. పదవులలో చేరిన పెద్దవారు శాంతిని ప్రకటించి విద్యార్థులు రాజకీయాలకు దూరంగా ఉంటారు.

ప్రస్తుతం ఉన్న నిరుత్సాహం, నైతిక పతనం యువజన సమస్యలోనేగాదు. మొత్తం సమాజ పరిస్థితులలోనే ఇది కనబడుతోంది. మన అందరిలోనూ ఏదో ఒక అసంతృప్తి ఉండనే ఉన్నది. ఆ అసంతృప్తే యువజనులలో కూడా ఉన్నది. అందువల్ల యువజనుల అశాంతి వారికి మాత్రమే పరిమితమైనదని మనం ఉదాసీనంగా ఉండరాదు.

మాజీ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి ఒకరు ఈ విధంగా అన్నారు. 'యువజనులను దూషించేముందు మన హృదయాలలో ఏముందో పరిశీలించుకోవాలి. ఉన్నత రాజకీయాలలో ఒకరినొకరు భయపెడుతూ, తిడుతూ ఉంటుంటే ప్రతీరోజు కోపోద్రేకాలు పెరుగుతూ ఉంటే నిరుత్సాహంతో అప్పుడప్పుడు మాత్రమే విద్యార్థులు కోపోద్రేకులవుతున్నారు. వారిని నిందించడం సమంజసం కాదు. మనలో ఉండే క్రమశిక్షణా రాహిత్యం వారిలోకి గుప్తంగా ప్రవేశించిందంటే అబద్ధం కాదు.

పెద్దవారమైన మనం మన నైతిక గుణాన్ని యువజనులకు ఎంత చూపిస్తున్నామో ఆలోచించాలి. ఉద్యోగావకాశాలలోనూ, ఎన్నికలలోనూ, పరీక్ష మొదలైన వాటిలోనూ మనలో ఎంతమందికి కులమత భేదాలు, ప్రాంతీయ పక్షపాతం లేదో శోధించి చూడాలి. క్రమశిక్షణా రాహిత్యమనేది యువజనులలోనే కాదు మనందరిలోనూ ఉన్నది. ప్రజల ప్రవర్తన అందరికీ తెలిసిందే. మంచి అనేదంతా క్షీణిస్తూ వుంది. ప్రతీవాడు డబ్బు, లాభం, అధికారం-వీటి గురించి తప్ప మరి వేటి గురించి ఆలోచించడంలేదు.

యువజనులలోనే అంతో ఇంతో నైతికత దీక్ష ఉన్నవి. మానసికంగా వారు పెద్దలతో సమానులు. అవకాశం ఇచ్చినట్టయితే వారు తప్పకుండా మనకంటే బాగా బాధ్యతలను నైతికంగా నెరవేర్చుతారు.

## 5.11 అశాంతి రూపాలు

సమాజంలో యువజనులలో అశాంతి ఈ క్రింది రూపాలద్వారా వ్యక్తమవుతుంది. అవి: 1. సమ్మెలు, 2. బందులు, 3. ఘెరావ్‌లు, 4. రాస్తారోకోలు.

## 5.12 యువజనుల ఆందోళన లక్ష్యాలు

1. సామూహిక అసంతృప్తిని వ్యక్తం చేయడం,
2. వర్తమాన పరిస్థితులలో మార్పు తీసుకురావడం,



BRAOU

ఆందోళన తీవ్రరూపం దరించినప్పుడు ఒక్కొక్కసారి హింసాత్మక చర్యలు కూడా చోటు చేసుకుంటాయి. ఉదాహరణ: బస్సుల దహణం, దుకాణాల దోపిడీ మొదలైనవి.

## 5.13 అశాంతి, ఆందోళనల వర్గీకరణ

యువజనుల అశాంతి, ఆందోళనలను ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చును.

**1. ఒప్పుదలకు ఆందోళన:** ఈ రకమైన అశాంతి, ఆందోళనలో యువత, అధికారంలో ఉన్నవారి దృక్పథంలో మార్పులు తీసుకురావలని ప్రయత్నిస్తారు. యువత నినాదాలు చేయడం ద్వారా ఒక్కొక్కసారి అధికారంలో ఉన్నవారితో చర్చలు జరపడం ద్వారా కూడా ఈ మార్పు తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతాయి. ఉదాహరణకు

1. పరీక్షలు వాయిదా వేయించుటకు
2. కళాశాలల్లో ప్రవేశానికి గడువు పొడిగించుటకు,

యువత ఆందోళనవలన అధికారులు, పదవిలోనివారు తిరిగి ఆలోచించి వారి అభిప్రాయాన్ని మార్చుకునే అవకాశం ఉంటుంది. ఈ విధంగా యువజన విద్యార్థులు హానికరంగాని పద్ధతిద్వారా తమ అసంతృప్తి వెల్లడిచేసి తమ ప్రయోజనాలనుసాధించుకోవాలని ప్రయత్నం చేస్తారు.

**2. ప్రతిఘటన ఆందోళన:** ఈ రకమైన ఆందోళనలో అధికారంలో, పదవిలో ఉన్నవారు చేపట్టిన మార్పులను యువత తమ ప్రయోజనాలకు భంగకరంగా భావించినప్పుడు వాటిని ప్రతిఘటిస్తారు. ఉదాహరణకు విద్యార్థులు ఒక పి.జి కోర్సుకంటే ఎక్కువ చేయకూడదనే నిబంధన విశ్వవిద్యాలయ అధికారులు ప్రవేశపెట్టినప్పుడు, దానిని ప్రతిఘటించడం, రెండు, కళాశాలల్లో హాజరు 75 శాతం కంటే తక్కువ అయినప్పుడు విద్యార్థులు పరీక్షలకు పంపరాదనే నిబంధనను విధించినప్పుడు విద్యార్థులు దానిని ప్రతిఘటించడం.

ఈ పద్ధతి ద్వారా విద్యార్థులు విశ్వవిద్యాలయాల అధికారుల నియామకాలపై తమ అసంతృప్తిని, ఆందోళనను వ్యక్తం చేస్తారు.

BRAOU

**3. విప్లవాత్మక ఆందోళన:** ఈ రకమైన పద్ధతిద్వారా సామాజిక వ్యవస్థలోగానీ, విద్యా వ్యవస్థలోగానీ తీవ్రమైన ఆకస్మిక మార్పులు తీసుకురావడానికి యువత ప్రయత్నాలు చేస్తుంది.

విద్యా వ్యవస్థలోని పద్ధతులు మారుతున్నప్పుడు ఒక తరగతిలో ఉత్తీర్ణులు కాకున్నప్పటికీ పై తరగతిలో ప్రవేశాన్ని కోరడం. ఉదాహరణకు ఇంటర్మీడియెట్ కోర్సును ఎత్తివేసినప్పుడు ఇంటర్‌లో ఉత్తీర్ణులు కానివారికి కూడా డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం కల్పించమని కోరుతూ ఆందోళన చేయడం, అస్సాంలో బోడో ఆందోళన, సమాజంలో ఉన్న అవకతవకలు, అన్యాయాలు, దుర్మార్గాలపై ధ్వజమెత్తి, సాయుధ పోరాటాల ద్వారానే ఈ సమాజం మారుఃతన్న అవగాహన, దృక్పథంలో సామాజిక మార్పుకు సమాజాల మార్పుల కోసం పనిచేయడం.

1960లో యునివర్సిటీ గ్రాంట్స్ కమిటీ విద్యార్థుల అశాంతి, ఆందోళనకు ఈ క్రింది వాటిని కారణాలుగా పేర్కొన్నది.

1. కళాశాలలో ఫీజులు తగ్గింఛాలని, స్కాలర్‌షిప్పుల మొత్తాన్ని పెంచాలనే ఆర్థిక పరమైన కారణాలు.
2. ఇప్పుడున్న విద్యాసంస్థలలోని ప్రవేశ ప్రమాణాలలో, పరీక్షలు జరిపే పద్ధతిలో, విద్యాబోధనా పద్ధతులలో మార్పుతేవాలనే డిమాండ్లతో.
3. కళాశాలలోని, విశ్వవిద్యాలయాలలోని లైబ్రరీలలో కావలసినన్ని పుస్తకాలు, జర్నల్స్ లేకపోవడం.

4. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు గల సమన్వయ లోపం వలన, ఘర్షణలు తలెత్తడం వలన.

5. హాస్టల్‌లో సరైన వసతులు లేకపోవడం వలన,

6. కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడం.

పైన పేర్కొన్న కారణాలేకాక సరియైన విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలు లేకపోవడం కూడా విద్యార్థుల అశాంతికి కారణంగా చెప్పవచ్చు.

## 5.14 ముగింపు

యువత అనగా, సాధారణంగా 15 సంవత్సరాలు పైబడి 26 సంవత్సరాల వరకు వయస్సుగలవారు. దేశానికి వెన్నెముక యువత. అసాధారణ శక్తి సామర్థ్యాలు గల యువజనం అశాంతితో కొట్టుమిట్టాడుతున్నది. తరాల మధ్య అంతరాల కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్నది. యువత బాదర బందీలు లేనిది. బాల్యం దాటి, అనంతర దశలో ఆట పాటలతో, యువ్వనోత్సాహపు కార్యకలాపాలతో గడుపుతారు. విద్యావిధానంతోపాటు, ఉపాధికరువులాంటి సమస్యలు, సున్నితంగా ఆలోచించే యువజనం మీద తీవ్ర ప్రభావం చూపి వారిని ఇంకొక మార్గంలోకి మళ్లిస్తున్నాయి. యువకుల సమస్యలలో గ్రామీణ యువకుల సమస్యలు, గిరిజన యువకుల సమస్యలు ప్రత్యేకం. యువజనంలో రాజీ పడని తత్వం కారణంగానే ఎక్కువ అశాంతి, అసంతృప్తి ఏర్పడి అది ఆందోళనకు దారితీస్తున్నది. అందువల్లనే వివిధ లక్ష్యాల సాధనకు యువజనం వివిధ రూపాలలో ఆందోళన చేపడుతున్నారు.

BRAOU

## 5.15 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. యువజనం అంటే ఎవరు? వారి కార్యకలాపాలను వివరించండి?

2. తరాల మధ్య అంతరాన్ని వివరించండి?

3. యువజనం ఆందోళనా రూపాలేవి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబు రాయండి?**

1. గ్రామీణ యువజనుల సమస్యలేమిటి?

2. గిరిజన యువజనుల సమస్యలు?

3. యువజనుల అశాంతికి కొన్ని కారణాలు పేర్కొనండి.

## 5.16 చదవదగిన పుస్తకాలు

1. G.S. Gharve : Social Tensions in India.

2. C.B. Mameria : Social Problems and Social Disorganisation in India.

3. Vishwa Yuvaka kendra : Indian Journal of Youth Affairs.

# భాగం-6: యువత-జాతీయ నిర్మాణం, అభివృద్ధి

విషయక్రమం


6.0 ఉద్దేశాలు

6.1 పరిచయం

6.2 యువత- సంక్షేమ కార్యకలాపాలు-లక్ష్యాలు

6.3 సంక్షేమ కార్యక్రమాలు-రకాలు

6.3.1 విశ్వవిద్యాలయ సేవలు (కేంపస్ సర్వీసెస్)

6.3.2 యువజనుల సలహాకేంద్రాలు

6.3.3 యువజనుల వృత్తి మార్గదర్శక కేంద్రాలు

6.3.4 యువజనుల వసతి గృహాలు

6.3.5 యువజనుల సెలవు దిన శిబిరాలు

6.3.6 నేషనల్ కేడెట్ కోర్ (ఎన్‌సిసి)

6.3.7 జాతీయ సేవా పథకం

6.4 గ్రామీణ పథకాలు

6.4.1 పట్టణ పథకాలు

6.4.2 జాతీయ క్రీడా పథకం

6.5 విద్యార్థులు కాని యువజనులు-కార్యక్రమాలు

6.6 యువ కర్షకుల అంతర్జాతీయ వినిమయ పథకం

6.7 యువజన మండలులు

6.8 యువజన సంక్షేమ కార్యక్రమాలు-స్వచ్ఛంద సేవా సంస్థ

6.8.1 వైఎంసిఎ

6.8.2 వైడబ్ల్యూసిఎ

6.8.3 భారత్‌సేవక్ సమాజ్

6.8.4 ఇండియన్ అసెంబ్లీ ఆఫ్ యూత్

6.8.5 విశ్వ యువక కేంద్రం

6.9 యువత-అభివృద్ధి

6.10 ముగింపు

6.11 నూదిరి పరీక్షా ప్రశ్నలు

6.12 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 6.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- యువజనం జాతీయ నిర్మాణ ప్రక్రియలో, అభివృద్ధిలో నిర్వహించే పాత్రను తెలుసుకుంటారు.
- యువతకోసం అమలుజరుపుతున్న సంక్షేమ కార్యకలాపాలను, జాతీయ పథకాలను వివరించగలుగుతారు.

## 6.1 పరిచయం

జీవితంలో మానవ కర్తవ్యానికి, సాంఘిక వ్యవహారాలకు, సాంస్కృతిక వ్యవహారాలకు వీలుగా సంసిద్ధంగా ఉన్న జీవిత భాగమే యవ్వనం. ఈ దశలో పెరుగుదల, కార్యాచరణ, నాయకత్వం మొదలైన వాటిని అభివృద్ధి చేసుకోవాలి. స్వాతంత్ర్యం, చైతన్యం, ప్రోత్సాహం, అవకాశం ఎంత ఎక్కువగా ఉంటే అంత త్వరగా యువతీ యువకులు అభివృద్ధి చెందుతారు. ఈ దశలో యువజనులకు విద్యాబోధనతోపాటు తమ వ్యక్తిత్వాన్ని వెల్లడించడం, స్నేహభావం, సాంఘికజీవనం, దేశసేవ మొదలైనవాటిని కూడా బోధించడం అవసరం వీటి ద్వారా యువజన అభివృద్ధి సాధ్యపడుతుంది.

పై అంశాలను దృష్టిలో ఉంచుకుని భారతదేశంలో యువజన సంక్షేమ కార్యక్రమాలను రూపొందించారు.

పూర్వం ప్రజలకు కేవలం రక్షణ కల్పించడం మాత్రమే ప్రభుత్వ ధ్యేయంగా ఉండేది. ఆ భావన రానురాను మారిపోయి ప్రజా సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన ధ్యేయమైంది. ప్రభుత్వ బాధ్యతలు పెరిగినకొద్దీ సంక్షేమ కార్యక్రమాలు కూడా పెరుగుతూ వచ్చాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మనదేశంలో ప్రభుత్వం కూడా సంక్షేమ ప్రభుత్వంగా మారిపోయింది. మొత్తం దేశానికి సంబంధించిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను పాలకులు చేపట్టారు. వీటిలో ప్రధానమైనవి రైలు మార్గాలు, రహదారులు, తపాలా సౌకర్యాలు, విద్యాసంస్థలు, ఆరోగ్యశాలలు నెలకొల్పడం మొదలైనవి. రానురాను ఈ కార్యకలాపాలకే కాకుండా, ఒక్కొక్క విభాగానికి సంబంధించిన ప్రత్యేక సంక్షేమ పథకాలను కూడా ప్రారంభించారు. ఉదాహరణకు హరిజన సంక్షేమం, ఆదివాసుల సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, స్త్రీ సంక్షేమం, శిశు సంక్షేమం మొదలయినవి.

భారతదేశంలో ఇటీవలే యువజన సంక్షేమ అవసరాన్ని గుర్తించి యువజన సంక్షేమ శాఖను, యువజన సంక్షేమ కార్యకలాపాలను చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒక యువజన సంక్షేమశాఖను ఏర్పాటు చేశారు. ఈ యువజన సంక్షేమ శాఖ ఉద్భవించడానికి పూర్వం యువజన సంక్షేమ కర్యాకలాపాలు లేవని కాదు. కానీ అటువంటి కార్యకలాపాలను హరిజన సంక్షేమశాఖ, వెనుకబడిన వర్గాల సంక్షేమశాఖ, స్త్రీ, శిశు సంక్షేమశాఖలు నిర్వహించేవి. ఇప్పుడు యువజన కార్యకలాపాలను ప్రత్యేకంగా యువజన సంక్షేమశాఖవారే నిర్వహిస్తున్నారు. యువజన సంక్షేమమనేది ఇంత ఆలస్యంగా వృద్ధి చెందడానికి కారణం, యువజనులు వారి క్షేమాన్ని వారే చూసుకోగలరనీ, బాల్యం నుంచి యవ్వనానికి మార్పు చెందే దశలో ప్రభుత్వం శ్రద్ధ వహించవలసిన సమస్యలేమీ లేవనే నమ్మకం. అయితే ఇప్పుడు ఆ నమ్మకం తొలగిపోయింది. బాల్యం నుంచి యవ్వనానికి పెరిగే దశలో కూడా మానసిక సాంఘిక సమస్యలుంటాయనీ, వాటి పరిష్కారానికి ప్రభుత్వ సహాయం అవసరమనీ ఇప్పుడు అంగీకరిస్తున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజలలో సామాజిక ఆర్థిక రాజకీయ చైతన్యం వృద్ధి చెందింది. యువజన చైతన్యం కూడా పెరిగింది. దీనిని పరికించి ప్రణాళికా సంఘం, కేంద్ర విద్యాశాఖ, యువజన సమస్యల గురించి దీర్ఘంగా ఆలోచించి, యువజనులకు వాక్ స్వాతంత్ర్యం సాంఘిక కార్యాచరణ, వారి క్షేమాన్ని వారు అభివృద్ధి చేసుకోవడానికి వీలుగా పెంపొందించాలని నిశ్చయించింది. విశ్వవిద్యాలయాలలోనూ, కళాశాలలోనూ వాటి బయటనూ కనబడుతున్న యువజన సమస్యలను పరిశీలించారు. దేశం మొత్తంలో యువజన సంక్షేమ కార్యక్రమాన్ని రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖలో ఒక విభాగంగా యువజన సంక్షేమశాఖను ఒకదానిని నెలకొల్పింది.

BRAOU

ఈ శాఖ దేశం మొత్తానికి యువజన సంక్షేమ కార్యక్రమాలను తయారు చేస్తుంది. వాటి ప్రకారం వివిధ యువజన సంక్షేమ కార్యక్రమాల అభివృద్ధికి ధన సహాయం చేస్తుంది. ప్రణాళికా సంఘం వీటికోసం ప్రత్యేకంగా ధనాన్ని కేటాయిస్తుంది.

## 6.2 యువత- సంక్షేమ కార్యకలాపాలు, లక్ష్యాలు

సమగ్ర యువజనాభివృద్ధి కోసం ఉద్దేశించిన యువజన సంక్షేమకార్యక్రమాల లక్ష్యాలను ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.

1. యువజనుల వ్యక్తిత్వవికాసానికి, సద్గుణాభివృద్ధికి, వారసత్వానికి దోహదమివ్వడం,
2. యువజనులు తమ శారీరక, మానసిక శక్తులను అభివృద్ధి చేసుకొని సమాజంలో ప్రయోజకులుగా తయారవ్వడానికి అవకాశాలు కల్పించడం,
3. యువజనులను బాధ్యతాయుతమైన, సంతృప్తికరమైన మూర్తిమత్వంగల వయోజనులుగా తయారు చేయడం,
4. యువజనులకు మానసిక స్వాతంత్ర్యాన్ని కలుగజేసి వారి భావిజీవితాన్ని సంరక్షించడం,
5. యువతీయువకుల మధ్య స్నేహభావాన్ని అభివృద్ధి పరచి సర్దుబాటు కలుగజేయడం, స్నేహితులతో సత్సంబంధాలను ఏర్పరచుకునేటట్లు చేయడం,
6. యువజనులకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కలుగజేయడానికి వృత్తి శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం.

## 6.3 సంక్షేమ కార్యక్రమాలు, లక్ష్యాలు

BRAOU

యువతను జాతీయ పునర్నిర్మాణంలో పాల్గొనేటట్లు చేయడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, చేపట్టిన వివిధ యువజన సంక్షేమ కార్యక్రమాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చును.

### 6.3.1 విశ్వవిద్యాలయ సేవలు (Campus Services)

విద్యామంత్రిత్వశాఖ The Campus Works Project పథకాన్ని నెలకొల్పింది. ఈ పథకం ద్వారా విద్యాసంస్థలలో వినోద కార్యక్రమాలు మెరుగుపరచి, పెంపొందించడం జరిగింది. పాఠశాలల్లోనూ, కళాశాలలలోనూ వినోదపు హాలు, ఆడిటోరియమ్, ఆటల స్టేడియమ్, జిమ్నాజియమ్, ఎయిర్ థియేటర్ మొదలగు సౌకర్యాలకు గ్రాంట్లు ఇచ్చే ఏర్పాటు ఈ పథకంలో ఉంది. ఇందులో మరొక ముఖ్యమైన అంశమేమిటంటే వివిధ వినోద సౌకర్యాలను ఏర్పరచిన సంస్థలు వాటికయ్యే మొత్తం ఖర్చులో 25 శాతం ఈ పథకం ద్వారా పొందుతాయి. అందులో 5 శాతం ఉపాధ్యాయులు-విద్యార్థుల శ్రమదానం నుంచి పొందడం జరుగుతుంది. ఈ పథకం ముఖ్యోద్దేశం శ్రమకు విలువనివ్వడం. ఉపాధ్యాయులు, విద్యార్థులు వినోద కార్యక్రమాల నిర్మాణంలో పాల్గొనడం వలన వారి మధ్య సదవగాహన పెంపొందే అవకాశముంది.

### 6.3.2 యువజనుల సలహా కేంద్రాలు

వివిధ రకాలైన సమస్యలు గల యువజనులకు శాస్త్రీయ పద్ధతిలో సలహానివ్వడాన్ని యువకుల సలహా సేవలు అంటారు. ఈ సలహా సేవలను వ్యక్తిగతంగా గానీ, సామూహికంగాగానీ, అందించవచ్చు. ఈ సలహా సేవలు పాఠశాలలు, కళాశాలల్లోనే కాకుండా ఉద్యోగ కేంద్రాలు, పునరావాస కేంద్రాలు, వైద్యాలయాలు, ఆరోగ్యాశ్రమాలు, కారాగారాలు, సంక్షేమ సంస్థలు మొదలైన అనేక సంస్థలలో యువజనులకు సలహానిచ్చి వివిధ రకాలైన సమస్యలను పరిష్కరించడానికి ఉపయోగపడతాయి. దీనివల్ల వ్యక్తుల సమస్యలు పరిష్కారమవడమే కాకుండా, వారి సర్వతో

ముఖాభివృద్ధికి కూడా కృషి జరుగుతుంది. ఈ సలహా పద్ధతి వలన యువజనులు తమ ప్రస్తుత సమస్యలను పరిష్కరించుకోవడమేకాక, భావిజీవితంలో మరి ఏ ఇతర సమస్యలు ఎదురైనా ఇతరుల సలహా సంప్రదింపుల అవసరం లేకుండా తమంతట తామే పరిష్కరించుకోగల సమర్థతను పొందుతారు. యువజనులు తమ సర్వతో ముఖాభివృద్ధికి తమ వ్యక్తిగత వనరులు ఉపయోగించుకోగలిగే శక్తి సామర్థ్యాలను పొందుతారు. ఉదాహరణకు పాఠశాలలో చదువుతున్న సిగ్గు, బిడియం గల బాలుడు సలహా సేవా కేంద్రానికి చేరినట్టయితే సలహాదారుడు కేవలం ఆ బాలునికి సిగ్గు, బిడియం తొలగించడమే కాక, అతడు ధృఢమైన వ్యక్తిగా అభివృద్ధి చెందడానికి కూడా సహాయపడతాడు.

వ్యక్తులు యవ్వనదశలో గల తమ మూర్తిమత్వం కుటుంబ జీవితంలోను, పాఠశాలలలోనూ వృత్తి విషయంలోనూ, యువతీయువకుల మధ్యగల లైంగిక తేడాల విషయంలోనూ అసమయోజనం చెందకుండా ఉండడానికి వారికి యవ్వన దశలో కొన్ని సలహా సహాయాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. లేకపోతే వారు జీవితంలో సర్దుబాటు చేసుకోలేక అనేక సమస్యలకు గురౌతారు. ఈ సలహా సహాయాలను యువజనులు సలహా సహాయ సేవల ద్వారా పొందడానికి వీలౌతుంది. ఈ కేంద్రాలలో సలహా పద్ధతి నాలుగు దశలలో పూర్తవుతుంది. మొదటి దశలో కార్యకర్త సేవార్థితో (సలహాకోసం వచ్చినవాడు) వృత్తి బాంధవ్యాన్ని ఏర్పరచుకుంటాడు. రెండో దశలో సేవార్థికి తన సమస్య గురించి, తాను చేరిన సంస్థ గురించి అవగాహన కలుగజేయడం. మూడోదశలో సమస్య పరిష్కారానికి ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుంది. నాలుగో దశలో ప్రణాళిక ద్వారా సేవార్థి సమస్యను పరిష్కరించుకొనేటట్లు చేయడం లేదా అవసరమైతే వేరొక సంస్థకు పంపడం జరుగుతుంది.

### 6.3.3 యువజనుల వృత్తి మార్గదర్శక కేంద్రాలు

వృత్తి మార్గదర్శక కేంద్రాలంటే వృత్తిలో ఎదురైన సమస్యలను పరిష్కరించుకోవడానికి ఏర్పాటు చేసిన మార్గదర్శక సలహాలిచ్చే కేంద్రాలు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉద్యోగావకాశాలకోసం ఎదురుచూస్తున్న యువకులకు, ఉద్యోగాలున్న యువకులకు ఈ వృత్తి మార్గదర్శక కేంద్రాలు విద్య, వృత్తి సంబంధిత సమస్యలేకాక ఆరోగ్యం, మూర్తిమత్వ సర్దుబాటు, కుటుంబ సర్దుబాటు మొదలైన వాటికి సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించడానికి కృషి చేస్తోంది. వృత్తి మార్గదర్శక కేంద్రాల పరిధి సమాజాలను బట్టి మారుతోంది. వృత్తి మార్గదర్శక కేంద్రాలు యువజనులకు ఉద్యోగావకాశాలను అన్వేషించి పెడుతాయి. వృత్తి మార్గదర్శక కేంద్రాలు యువజనుల స్వభావానికి, వృత్తి లేదా శిక్షణా స్వభావాల మధ్య సమన్వయాన్ని ఏర్పరచడానికి కృషి చేస్తుంది. ఉదాహరణకు సిగ్గు, బిడియం ఎక్కువగా ఉన్న యువకుడికి సేల్స్‌మెన్ ఉద్యోగం లభిస్తే, అతని అధికారి అతడి స్వభావం ఆ ఉద్యోగానికి సరిపోదని అతడిని కొద్ది కాలంలోనే ఉద్యోగం నుంచి తొలగించే ప్రమాదముంది. అయితే అటువంటి సమస్యగల యువకుడికి వృత్తి మార్గదర్శక కేంద్రాలు సంతృప్తి కరమైన శాస్త్రీయ పద్ధతులను, పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ యువకునిలో గల సిగ్గు, బిడియం మొదలైన మానసిక ప్రవృత్తులను తొలగించి, అతడు కొద్ది కాలంలోనే తన వృత్తి స్వభావంతో సర్దుబాటు చేసుకునేలాగా చేయవచ్చు. యువజనులు తమ శక్తి సామర్థ్యాలను, అశక్తతలను తెలుసుకునేటట్లు ఈ కేంద్రాలు సలహాలిస్తుంటాయి. వృత్తిలో చేరిన మొదట్లో యువజనులకు ఎదురైన సమస్యలను పరిష్కరించడానికి ఈ కేంద్రాలు సలహాలిస్తుంటాయి.

### 6.3.4 యువజనుల వసతి గృహాలు

పారిశ్రామికీకరణ, నగరీకరణ, త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న ఈ దేశంలో యువజనులకు వసతి గృహాలను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది. వసతి గృహాలు విద్యార్థులకు, విద్యార్థులు కాని యువకులకు కూడా ఉపయోగపడతాయి. వివిధ వర్గాలకు చెందిన యువజనులు ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి, ఒకరి అనుభవాలు వేరొకరు తెలుసుకోవడానికి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడానికి ఈ వసతి గృహాలు ఉపయోగపడతాయి. ఈ వసతి గృహాలు స్వయం సహాయక పథకాన్ని అనుసరించి పనిచేస్తాయి. మొట్టమొదట రిచర్డ్‌షిర్‌మేన్ అనే జర్మనీ ఉపాధ్యాయుడు ఈ వసతి గృహాలను స్థాపించాడు. వసతి గృహాలలో గడిపిన యువకులు బాధ్యతాయుతమైన పౌరులుగా తయారై తమ సంక్షేమ కార్యక్రమాలను అవసరమైన సహాయంతో తామే నిర్వహించుకోగలుగుతారు.



BRAOU

### 6.3.5 యువజనుల సెలవు దిన శిబిరాలు

వివిధ ప్రాంతాలలో గల యువజనుల మధ్య పరిచయం ఏర్పడటానికి, సామూహిక జీవితంలో అనుభవం కలిగించడానికి, విరామ కాలాన్ని సద్వినియోగపరచడానికి సెలవుదిన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిబిరాలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా నెలకొల్పడం జరిగింది.యువజన సంక్షేమానికి కృషి చేసే స్వచ్ఛంద సేవా సంస్థలు ఇటువంటి శిబిరాలను ఏర్పాటు చేస్తాయి. శ్రమదానం చేయడానికి అనుకూలమైన స్థలాలలో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తారు. సుమారు ఒక పక్షంపాటు ఈ శిబిరాలను నిర్వహిస్తారు. ఈ శిబిరాలలో విశ్రాంతికి, వినోదానికి, విజ్ఞానానికి అత్యంత ప్రాధాన్యతనిస్తారు.

### 6.3.6 నేషనల్ కేడెట్ కోర్ (N.C.C)

విద్యార్థి యువజనులలో శీలాన్ని, సత్ప్రవర్తనను, సౌభ్రాతృత్వాన్ని, సేవా దృక్పథం, నాయకత్వ శక్తి సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. ఈ పథకం ద్వారా ప్రజలకు దేశ రక్షణలోనూ, దేశ సమైక్యతలోనూ బాధ్యతను పెంపొందింపజేయడం, ఇంకా అత్యవసర పరిస్థితులలో సాయుధ రక్షణ దళాలకు సహాయం చేసేందుకు నేషనల్ కెడెట్ కోర్ (N.C.C)ను సిద్ధంగా ఉంచడం ప్రధాన లక్ష్యం. విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల విద్యార్థులు మొదటి రెండు సంవత్సరాలలో ఈ పథకంలోగానీ, జాతీయ సేవా పథకంలోగానీ జాతీయ క్రీడా పథకంలోగానీ తప్పనిసరిగా శిక్షణ పొందాలి.

### 6.3.7 జాతీయ సేవా పథకం (N.S.S)

విశ్వవిద్యాలయ విద్యార్థులు తమ విద్యాభ్యాసంతో పాటు వివిధ జాతీయాభివృద్ధి కార్యక్రమాలలో, సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొనేటట్టుగా చేయడం ఈ పథకం ముఖ్యలక్ష్యం. సాముదాయిక కార్యక్రమాల ద్వారా విద్యను బోధించవలెననేది ప్రధాన నియమం. ప్రజాప్రతినిధులు, నాయకులు, మొదలైనవారితో కలిసి మెలిసి పనిచేయడానికి విద్యార్థి యువజనులకు అవకాశాలను కల్పించడం, విద్యార్థి యువజనుల అపారమైన శక్తిని నిర్మాణాత్మకంగానూ, సృజనాత్మకంగానూ ఉపయోగించడం, తద్వారా జాతీయాభివృద్ధి కార్యక్రమాలను అమలు జరపడం, విద్యార్థి యువజనులు తమ మేధాశక్తిని ఉపయోగించుకుని ప్రజాసమస్యలను అర్థం చేసుకుని వాటిని పరిష్కరించుకోవడం ప్రజలకు సహాయపడేటట్లు చూడడం, విద్యార్థి యువజనులు నాయకులుగా తయారుకావడానికి అవకాశాలు కలిగించడం మొదలైనవి ఇతర పథకాలు. సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొనదలచిన విద్యార్థులు వారానికి కొన్ని గంటల కాలాన్ని ఈ పనికి వినియోగించవలసి ఉంటుంది.

BRAOU

## 6.4 గ్రామీణ పథకాలు

సంస్థల ఆవరణలను అభివృద్ధి పరచడం, ఆటస్థలాలను ఏర్పాటు చేయడం, పరిసరాలను బట్టి వనరులను బట్టి అవసరమైన కార్యక్రమాలను చేపట్టడం ఇవి సంస్థాసంబంధమైన గ్రామీణ పథకాలు నిరక్షరాస్యతను నిర్మూలించడం, చిన్న నీటివనరులను ఏర్పాటు చేయడం, ఇతర వ్యవసాయ పనులు, ఆరోగ్య పారిశుద్ధ్యాలకు సంబంధించిన పనులు, సహకార సంస్థల కార్యక్రమాలు, పొదుపు ఉద్యమం, రహదార్లను నిర్మించడం మొదలైనవి గ్రామీణ పథకాలు.

### 6.4.1 పట్టణ పథకాలు

వయోజన విద్య-మురికివాడల నిర్మూలన, పౌర రక్షణలో శిక్షణ, ప్రథమ చికిత్స శిక్షణ, అస్పత్రులలో రోగులకు సహాయం చేయడం మొదలైనవి పట్టణ యువజన సంక్షేమ పథకాలు.

### 6.4.2 జాతీయ క్రీడా పథకం

కళాశాల విద్యార్థులు ఆటపాటలలో విరివిగా పాల్గొనేటట్లు చేయడానికి, ఆయా క్రీడలలో వారి అభిరుచులను

పెంపొందించడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆటస్థలాలను ఏర్పాటు చేయడం, శిక్షణ శిబిరాలను ఏర్పరచడం, నిపుణులకు బహుమతులనిచ్చి ప్రోత్సహించడం ఈ పథకంలోని ముఖ్య కార్యక్రమాలు.

## 6.5 విద్యార్థులు కాని యువజనులు-కార్యక్రమాలు

విద్యార్థులు కాని యువజనులు కూడా తమ విరామ సమయాన్ని సముదాయాభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించే అవకాశాలను కలిగించడానికి ప్రారంభించిన పథకమిది. ఈ పథకానికి నాల్గవ పంచవర్ష ప్రణాళికలో 5 కోట్ల రూపాయలను కేటాయించారు.

## 6.6 యువ కర్షకుల అంతర్జాతీయ వినిమయ పథకం

మన దేశంలోని యువకర్షకులు అమెరికా దేశంలోని కర్షకులను, యువజన సంక్షేమ కార్యక్రమాలను అర్థం చేసుకునేటందుకు అవకాశాలను కల్పించడానికి ఉద్దేశించిన కార్యక్రమమిది. ఈ యువ కర్షకులు అమెరికాలో గ్రామీణ ప్రాంతాలలోని కొన్ని కుటుంబాలవారికి అతిథులుగా ఉండి ఆరుమాసాలు గడుపుతారు. ఇందుకు వ్యవసాయంలోను, గృహ విజ్ఞానంలోను మంచి అనుభవం గల, 20 సంవత్సరాలనుంచి 30 సంవత్సరాల మధ్య వయస్కులయిన యువతీయువకులను ఎంపిక చేస్తారు.

## 6.7 యువజన మండలులు

యువజనుల శారీరక, మానసిక, సాంఘిక, ఆర్థిక, అభివృద్ధిని పెంపొందించడానికి యువజన మండలులు కృషి చేస్తాయి.

BRAOU

## 6.8 యువజన సంక్షేమ కార్యక్రమాలు-స్వచ్ఛంద సేవా సంస్థ

యువజన సంక్షేమం కేవలం ప్రభుత్వ రంగానికే పరిమితమైనదిగా భావించరాదు. ప్రజలు యువజన సంక్షేమానికి స్వచ్ఛంద సంస్థల ద్వారా ఇతోధికమైన కృషి చేయాలి. యువజన సంక్షేమానికి కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలలో ఈ క్రింది వాటిని పేర్కొనవచ్చును.

### 6.8.1 వైఎంసిఎ (Y.M.C.A)

ఇది అంతర్జాతీయ సంస్థ. అన్ని తరగతులకు, అన్ని మతాలకు చెందిన యువజనులకు ఆధ్యాత్మిక, సాంఘిక, శారీరక అభివృద్ధిని కలిగించడానికి ఈ సంస్థ కృషి చేస్తుంది. వసతి గృహాలను నిర్వహించడం, సారస్వత కార్యక్రమాలను నిర్వహించడం, శ్రమదానాన్ని, సాంఘిక సేవను ప్రోత్సహించడం మొదలైనవి ఈ సంస్థ నిర్వహించే కొన్ని కార్యక్రమాలు. ఈ సంస్థ జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో అనుబంధాన్ని పొంది యువజన సంక్షేమ కార్యక్రమాలను అభివృద్ధి చేస్తున్నది.

### 6.8.2 వైడబ్ల్యూసిఎ (Y.W.C.A)

మహిళలు, బాలికలు కలిసిమెలసి పనిచేసేటట్లుగా చేసి విశ్వవ్యాప్తమైన సౌభ్రాతృత్వాన్ని, సౌహార్ద్రాన్ని వారిలో పెంపొందింపజేయడం ఈ సంస్థ ప్రధానోద్దేశం. ఈ సంస్థలు పట్టణ ప్రాంతాలలో ఉంటాయి. ఇది కూడా వైఎంసిఎ వలె ఒక సేవా సంస్థ. ఉద్యోగాలు చేసుకుంటూ ఒంటరిగా ఉన్న యువతులకు వసతి గృహాలను నడపడం, ఆటపాటలను ప్రోత్సహించడం, శ్రమదాన కార్యక్రమాలను నిర్వహించడం, వృత్తి శిక్షణా కేంద్రాలను నిర్వహించడం,

వృత్తి సలహా కేంద్రాలను నిర్వహించడం ఈ సంస్థ ప్రధాన ఉద్దేశం.

### 6.8.3 భారత్‌సేవక్ సమాజ్

రాజకీయాలతో నిమిత్తం లేని ఈ సేవా సంస్థను జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించారు. సెలవుదినాలలో విద్యార్థుల శ్రమదానంతో రోడ్లు, వంతెనలు మొదలైన నిర్మాణ కార్యక్రమాలను నిర్వహించడం ఈ సంస్థ ఆశయం.

### 6.8.4 ఇండియన్ అసెంబ్లీ ఆఫ్ యూత్

వరల్డ్ అసెంబ్లీ ఆఫ్ యూత్‌కు అనుబంధ సంస్థ ఇండియన్ అసెంబ్లీ ఆఫ్ యూత్, యువజన సంక్షేమాన్ని పెంపొందిపజేయడం, జాతీయ, అంతర్జాతీయ యువజన సమస్యలను పరిశీలించి యువజన సంస్థల దృష్టిని వాటిపై కేంద్రీకరించడం ఈ సంస్థ లక్ష్యాలు.

### 6.8.5 విశ్వ యువక కేంద్రం

విశ్వయువక కేంద్రాన్ని ఇండియన్ అసెంబ్లీ ఆఫ్ యూత్ స్థాపించింది. వివిధ యువజన సంస్థల కార్యక్రమాలకు సహాయం చేయడం, యువజన సంక్షేమరంగంలో సమాచార కేంద్రంగా పనిచేయడం అంతర్జాతీయ సదవగాహన పెంపొందించడానికి యువజన కార్యకర్తలను, నాయకులను, విద్యార్థులను, ఇతర దేశాలకు బదిలీ పద్ధతిపై పంపడం మొదలైనవి ఈ సంస్థ లక్ష్యాలు.

## 6.9 యువత-అభివృద్ధి

పైన వివరించిన విధంగా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థ అనేక విధాలుగా యువజన సంక్షేమానికి కృషి చేస్తున్నవి. అయితే యువజన సంక్షేమ కార్యక్రమాలను అమలు జరపడంలో యువజనేతరుల సహాయ సహకారాలు కూడా చాలా అవసరం. ఇందుకు వివిధ సంస్థలు ప్రజా సంబంధాలను పెంపొందించుకోవాలి. యువజన సంక్షేమం అభివృద్ధి చెందాలనే దృక్పథం ప్రజలలో కలిగేటట్లుగా కృషి చేయాలి.

BRAOU

వ్యక్తిగత విలువలు, కట్టుబాట్లు, ఆచారాలు మొదలైన విషయాలలో మన తాతల తరంనుంచి తల్లిదండ్రుల తరానికి, మన తల్లిదండ్రుల తరం నుంచి మన తరం వరకు ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇంకా మార్పులు సంభవిస్తున్నాయి. ఇంకా వస్తాయి. రెండు తరాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సాధ్యమైనంతవరకు తగ్గించడానికి కృషి చేయాలి. ఆవిధంగా చేయడం వలన తల్లి, దండ్రులు, ఇరుగుపొరుగు మొదలైనవారు నేటి యువతరాన్ని అర్థం చేసుకోగలుగుతారు. దానివలన సమాజంలో యువజన సంక్షేమానికి అవకాశాలు అధికమవుతాయి.

యువజనుల భావి జీవితంపై దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. యువజనుల సమస్యలను తెలుసుకుని ఆ సమస్యలనుండి వారిని రక్షించడానికి శ్రద్ధ వహించవలసిన ఆవశ్యకత కుటుంబంపైన, సమాజంపైన, ప్రభుత్వంపైనా ఉంది.

ప్రభుత్వ గృహ నిర్మాణ సంస్థల ద్వారా, గృహ కాలనీల పథకం ద్వారా, స్వచ్ఛంద సంస్థలద్వారా గృహ వసతి సౌకర్యాల కోసం తగిన చర్యలు తీసుకుని, యువజనులు సరైన గృహ వసతి సౌకర్యాలు లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను తొలగించవచ్చు.

గ్రామాలలో, గిరిజన ప్రాంతాలలో పంచాయితీలు, పట్టణాలలో పురపాలక సంఘాలు, ప్రభుత్వం యువజన మండలులు. వ్యాయామ మండలులు, పార్కులు, రేడియో కేంద్రాలు మొదలైన వాటిని ఏర్పాటు చేసి యువజనులు విజ్ఞాన వినోద కార్యక్రమాలలో పాల్గొనేలాచేసి, వారి మానసిక వికాసానికి తోడ్పడవచ్చు.

యువకుల సంఘ వ్యతిరేక ప్రవర్తనను సరిదిద్దడానికి విద్యా సంస్థలు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సేవా సంస్థలు

ప్రభుత్వం కృషి చేయాలి. నేరస్తులైన యువజనులతో కలిసి పనిచేసి వారి దృక్పథంలో మార్పు తీసుకురావాలి. తరువాత వారికి పునరావాస సౌకర్యాలను కల్పించడం ద్వారా వారి సంక్షేమానికి కృషి చేయాలి.

లోపభూయిష్టమైన విద్యావిధానాన్ని సంస్కరించి ఉపాధి అవకాశాలు కల్పించగల విద్యను ప్రోత్సహించాలి. వృత్తి విద్యను ప్రోత్సహించాలి. విద్య సముపార్జన అనంతరం ఉపాధి దొరకదేమోనన్న అభద్రతా భావం యువకుల మనస్సుల నుంచి తొలగిపోవాలి. అప్పుడు వారు మానసిక ఆందోళనలకు, అలజడులకు గురికాకుండా ఉంటారు. ఆసక్తిగల, తెలివితేటలుగల, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులో ఉండేటట్లు చేయాలి. యువజనులకు శాస్త్రీయ పద్ధతిలో లైంగిక విజ్ఞానాన్ని బోధించాలి. ఈ బాధ్యతను ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు చేపట్టాలి. అశ్లీల సాహిత్యాన్ని, అశ్లీల చలనచిత్రాలను నిషేధించాలి. దీనివలన యువజనుల ప్రవర్తన తప్పు దారి పట్టకుండా ఉండడమేకాక వారు శారీరకంగా, మానసికంగా, నైతిక ఆరోగ్యాన్ని కలిగి ఉంటారు.

గ్రామీణ యువజనులలో నిరక్షరాస్యతను పోగొట్టడానికి రాత్రి బడులను స్థాపించి, వాటి ద్వారా వారిని అక్షరాస్యులుగా చేయాలి. అస్పృశ్యతను రూపుమాపడం వల్ల కులాల మధ్య అంతరాలు తగ్గి, యువజనులు కులభేదం పాటించక కలిసి మెలిసి ఉండి, సమాజాభివృద్ధికి, తద్వారా జాతి పురోభివృద్ధికి పాటుపడతారు.

యువజనులకు 'శ్రమగౌరవం' ప్రాముఖ్యతను వివరించాలి. దీనివలన యువజనులు స్వశక్తితో వారి కాళ్లపై వారు నిలబడడమేకాక, ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని కలిగి వుంటారు. ప్రభుత్వం స్వయం ఉపాధి కల్పనకు అవకాశాలు కల్పించి, తక్కువ వడ్డీతో బ్యాంకుల ద్వారా నిరుద్యోగ యువజనులకు రుణ సౌకర్యాన్ని కల్పించాలి.

గిరిజనులకు అవసరమైన పాఠశాలలను, వసతి గృహాలను స్థాపించి, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దాలి. పట్టణాలలో మురికివాడలల్లో నివసించే యువతీ యువకులకు ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలను ఏర్పచాలి.

పైన పేర్కొన్న కార్యక్రమాలు యువజనుల శారీరక, మానసిక ఉద్వేగ జనిత, సాంఘిక సమస్యలకు సంబంధించినవయినందువల్ల, వీటిని అమలు పరచిననాడు, యువజన సమగ్ర అభివృద్ధి సాధ్యపడుతుంది. యువజనుల శారీరక, సాంస్కృతిక, సాంఘిక అవసరాల విషయంలో సంపూర్ణ సమగ్ర కార్యక్రమం అవసరం. ఈ కార్యక్రమాన్ని సక్రమంగా కుటుంబం, సమాజం, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం నిర్వహించిననాడు యువజనుల శక్తియుక్తులు జాతీయ పునర్నిర్మాణానికి దోహదం చేస్తాయి.

BRAOU

యువజనులు శక్తికి మారుపేరు. వారిలో ఉత్సాహం, విప్లవ భావాలు ఎక్కువగా ఉంటాయి. వారి శక్తి, ఉత్సాహం నిర్మాణాత్మక ప్రక్రియలకు ఉపయోగించకపోయినట్టయితే సరైన సలహాలు పొందలేని యువజనులు సమాజ వ్యతిరేక చర్యలకు పాల్పడే అవకాశముంది. యువకులు తమ శక్తి తమ ఒక్కరి సంక్షేమానికే కాక, సమాజ, దేశ సంక్షేమానికి కూడా ఉపయోగపడేటట్లుగా చేయడం సమాజ లక్ష్యమై ఉండాలి. ఆనాడే యువజనుల అభివృద్ధి జరిగి వారు ఉత్సాహంగా పాల్గొని దేశాభివృద్ధికి తమవంతు కృషిని అందించే శారీరక, మానసిక వికాసాన్ని పొందుతారు.

## 6.10 ముగింపు

జీవితంలో కర్తవ్యానికి, నిష్ఠకు సాస్కృతిక, సాంఘిక కార్యకలాపాలు చురుకుగా నిర్వహించేందుకు వీలుగా ఉండే పార్శ్వమే యవ్వనం. అందువల్ల ఒక జాతి నిర్మాణం, అభివృద్ధి ముఖ్యంగా యువజనుల మీదనే ఆధారపడి ఉంటుంది. ఈవిషయం ఆధారంగా జాతీయ ప్రభుత్వం యువజనాన్ని దృష్టిలో ఉంచుకొని జాతి నిర్మాణంలో వారి క్రియాశీలతను ఉపయోగించుకోవడానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. యువజనులను తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ సంక్షేమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కేంపస్ సర్వీసెస్, యువజనుల సలహా కేంద్రాలు, వసతి గృహాలు,వృత్తి మార్గదర్శక కేంద్రాలు, సెలవు దినాల్లో శిబిరాలు, ఎన్.సి.సి లాంటివి, యువజనుల కోసం జాతీయ క్రీడా పథకాల లాంటివి కూడా ఏర్పాటు చేస్తున్నాయి. యువజనులను అశాంతినుంచి దారి మళ్లించి నిర్మాణాత్మక ప్రక్రియలవైపు ప్రోత్సహించే ఈ పథకాలు అనేకం ఉన్నాయి.

## 6.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.

1. జాతీయ నిర్మాణంలో యువత పాత్రను వివరించండి.
2. అభివృద్ధిలో యువజనం పాత్రను పేర్కొనండి?
3. యువజన సంక్షేమ కార్యకలాపాల లక్ష్యాలు వివరించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.

1. 'కేంపస్ సర్వీసెస్' గురించి రాయండి?
2. ఎన్.సి.సి గురించి క్లుప్తంగా తెలుపండి?
3. విశ్వయువక కేంద్రం గురించి రాయండి?

## 6.12 చదవదగిన పుస్తకాలు


1. M. Venkataiah : Welfare State and Social Estate.
2. Vishwa Yuvaka Kendra : Indian Journal of Youth Welfare.
3. D. Phani Chowdari : An Introduction to Social Welfare.


BRAOU

# భాగం-7: వృద్ధాప్య భావన

విషయక్రమం


7.0 ఉద్దేశాలు

7.1 పరిచయం

7.2 వృద్ధాప్యం- నిర్వచనం

7.3 వృద్ధుల సమస్యలు

7.3.1 సామాజిక సమస్యలు

7.3.2 ఆర్థిక సమస్యలు

7.3.3 ఆరోగ్య సమస్యలు

7.3.4 మానసిక సమస్యలు

7.3.5 విశ్రాంతి సమయం- ఉపయోగిత సమస్యలు

7.4 వృద్ధాప్యం-సైద్ధాంతిక దృక్పథాలు

7.4.1 క్రియాశీలత-కార్యశీలత సిద్ధాంతం

7.4.2 ఆధునికీకరణ సిద్ధాంతం

7.4.3 అనాసక్తత సిద్ధాంతం

7.4.4 వినిమయ సిద్ధాంతం

7.4.5 ఉపసాంస్కృతిక సిద్ధాంతం

7.4.6 మూర్తిమత్వం

7.4.7 అవిచ్ఛిన్నతా సిద్ధాంతం

7.4.8 స్వయం సంతృప్తి సిద్ధాంతం

7.4.9 పాత్రసిద్ధాంతం

7.4.10 ముద్ర సిద్ధాంతం

7.4.11 వయోస్తరీకరణ నమూనా

7.4.12 దృగ్విషయ సిద్ధాంతం

7.5 ముగింపు

7.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

7.7 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 7.0 ఉద్దేశాలు

ఈ బాగం చదివిన తరువాత మీరు

- సమాజంలో నానాటికీ పెరుగుతున్న వృద్ధుల సమస్యల గురించి అర్థం చేసుకుంటారు.
- వృద్ధాప్య భావనను తెలుసుకుంటారు.

● వృద్ధాప్య భావన గురించిన వివిధ రకాల సైద్ధాంతిక దృక్పథాలను వివరించగలుగుతారు.

● వృద్ధుల వివిధ రకాల సమస్యలను అవగాహన చేసుకుంటారు.

## 7.1 పరిచయం

వృద్ధాప్య భావన భారతదేశంలో ఇటీవలికాలంలో ప్రాధాన్యతను సంతరించుకున్నది. సమాజంలో వృద్ధుల సంఖ్య నానాటికీ పెరుగుతున్నకొద్దీ అభివృద్ధి చెందిన దేశాలలోనూ, అభివృద్ధి చెందుతున్న దేశాలలోనూ ముఖ్యంగా భారతదేశంలోనూ వృద్ధాప్య భావనకు సంబంధించిన పరిశోధనాంశాలకు ప్రాముఖ్యత పెరుగుతూ ఉన్నది.

సమాజ సంక్షేమ విషయాలలో విద్య, గృహ సదుపాయాలు, నీటి సదుపాయం వంటి వాటికి ఇప్పటివరకు ప్రాధాన్యతను ఇచ్చిన భారత ప్రభుత్వం ఇటీవలికాలంలో సామాజిక సంక్షేమ విభాగాలలో కుటుంబం, శిశు సంక్షేమం, స్త్రీ సంక్షేమం, వృద్ధుల సంక్షేమం, వికలాంగుల సంక్షేమం వంటి విషయాలకు ప్రాధాన్యతనివ్వాలని గుర్తించింది. బాలలు, వృద్ధులు, స్త్రీలు ఏవర్గానికి, కులానికి చెందినవారైనా వారిని ప్రత్యేక వర్గంగా భావించి పూర్తి రక్షణ, శ్రద్ధ వహించాలని నేడు గుర్తించారు.

వృద్ధాప్య వివిధ రూపాల మధ్యగల వ్యత్యాసాన్ని పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉంది. వివిధ రూపాలలో ముఖ్యంగా సాంఘిక వార్ధక్యం, జీవ పరమైన వార్ధక్యం, సంజ్ఞాపరమైన వార్ధక్యం, ఉద్వేగపూరితమైన వార్ధక్యం, సాంఘిక వార్ధక్యం, సమాజంలోని వ్యక్తి వృద్ధాప్య వయస్సు పెరిగేకొలది అతనితో ఇతర వ్యక్తులు పరస్పర చర్య జరపడంలో, ఇతరులతో అవ్యక్తి కలిసి పరస్పర చర్యలు జరుపడంలో తగ్గుదలను గమనించడం గురించి వివరిస్తుంది. జీవనపరమైన వార్ధక్యం (Biological Aging) వ్యక్తి వృద్ధాప్య వయస్సు పెరిగే కొద్దీ అతనిలో వచ్చే శారీరక వార్ధక్యం గురించి వివరిస్తుంది. సంజ్ఞాపరమైన వార్ధక్యం (Cognitive Aging) వ్యక్తి వృద్ధాప్య వయస్సు పెరిగే కొద్దీ కొత్త విషయాలను లేదా ప్రవర్తనను నేర్చుకొనే, అలవరచుకొనే సామర్థ్యంలో తగ్గుదలను గమనించడం గురించి వివరిస్తుంది. ఉద్వేగపూరిత వార్ధక్యం(Affective Aging) వ్యక్తి వయస్సు పెరిగే కొద్దీ మారుతున్న పరిసరాలతో సర్దుబాటు చేసుకునే శక్తిలోని తగ్గుదల గురించి వివరిస్తుంది.

BRAOU

సాంప్రదాయ సమాజాలలో వృద్ధులకు అత్యంత ఉన్నత స్థానాన్ని, గౌరవ మర్యాదలను ఇవ్వాలని వివిధ మతాలు, సామాజిక విలువలు, కట్టుబాట్లు, సమాజంలోని ఆర్థిక సంస్థలు వివరించాయి. ఎన్నోమతపరమైన రచనలు కూడా వృద్ధుల సంతానం తన వయస్సు మళ్లిన తల్లిదండ్రుల గురించి తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వివరించాయి. అదేవిధంగా వార్ధక్యం పొందిన వ్యక్తులు కూడా ఉత్పాదకతా కార్యక్రమాలలో పాల్గొని, గృహ సంబంధ విషయాలలో కానీ, సమాజపరమైన విషయాలలోగానీ తగురీతిలో సలహాలనిస్తూ, నిర్ణయాలు తీసుకుంటూ సాంఘికీకరణను సమర్థవంతంగా జరుపుతూ సమాజాభివృద్ధికి తోడ్పడేవారమనడంలో సందేహంలేదు. కానీ ఇటీవలికాలంలో మారుతున్న పరిస్థితుల ఫలితంగా అధిక జనాభా పెరుగుదల, వేగవంతమైన పారిశ్రామికీకరణ, నగరీకరణ, వలసపోవుట, ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై వ్యష్టి కుటుంబాలుగా ఏర్పడడం లాంటి సమస్యల వల్ల వృద్ధులు శారీరకపరమైన సమస్యలనే కాకుండా సామాజిక, ఆర్థిక, ఆరోగ్య, మానసిక సమస్యలను ఎదుర్కొంటూ సమాజంలో తమ ఉన్నత స్థానాన్ని, గౌరవ మర్యాదలను కోల్పోయి నిరాదరణకు గురవుతూ ఉన్నారు.

భారతదేశంలోని వ్యక్తుల అరవయ్యో సంవత్సరపు వయస్సును ఆ వ్యక్తుల వృద్ధాప్యానికి ప్రారంభంగా భావిస్తారు. అరవై సంవత్సరాలు పూర్తిచేసుకున్న వ్యక్తులు 'షష్టిపూర్తి' చేసుకోవడం అనేది ఆ వ్యక్తుల జీవితాలలో ముఖ్యఘటనగా భావించవచ్చు. వీటితోపాటు వయస్సుపైబడిన వ్యక్తుల పళ్లుఊడిపోవడం, కంటిచూపు పడిపోవడం, చర్మం ముడుతలు పడడం, కీళ్లనొప్పులు, తల వెంట్రుకలు నెరవడం, నడకలో, మాటల్లో తడబాటు, మనవడు లేదా మనవరాలు జన్మించడంతో తాతగా గుర్తింపు అనేవి భారతదేశంలో ఆయా వ్యక్తులయొక్క వృద్ధాప్య లక్షణాలుగా పరిగణిస్తున్నారు.

వృద్ధాప్యం పొందడం అనేది జైవిక, సాంఘిక, మానసిక, పర్యావరణ కారకాల ఫలితంగా సంభవిస్తుంది.

మానవాభివృద్ధి దశలో వృద్ధాప్యాన్ని అంతిమదశగా చెప్పవచ్చు. పాత్రసంబంధంపై వృద్ధాప్య ప్రభావం అనేది సమాజానికి సమాజానికి, ఒక సమాజంలోని వివిధ సమూహాలకు వివిధ రకాలుగా వుంటూ మార్పు చెందుతూవుంటుంది. సాధారణంగా సమాజంలో పురుషులకంటే స్త్రీలను ముందుగా వృద్ధులుగా పరిగణించడం జరుగుతుంది. స్త్రీలలో జరిగే రుతుక్రమ ప్రక్రియ వృద్ధాప్య ప్రక్రియలో ముఖ్యమైనదిగా చెప్పవచ్చును. కొన్ని సమాజాలలో ముఖ్యంగా ప్రాక్ పారిశ్రామిక సమాజాలలో ఉత్పాదక కార్యక్రమాలలో పాల్గొనే దానిని బట్టి యువకులు, వృద్ధులు అని వ్యక్తులను విభజించడం జరిగేది. వృద్ధాప్య నిర్ణయం సమాజానికి సమాజానికి తేడా ఉంటూ ఆయా సమాజాలలోని సామాజిక వ్యవస్థపై ముఖ్యంగా దానిలో ఇమిడి ఉన్న సాంస్కృతిక నమ్మకాలపై ఆర్థిక వ్యవస్థ స్థాయి, జీవన పరిమాణం, జీవన, ఆరోగ్య సదుపాయాలపై ఆధారపడి ఉంటుంది.

వయస్సుపైబడే కొద్దీ సమాజంలోని వృద్ధులు యాజమాన్య, వ్యవహారాలనుండి ఉపసంహరించుకోవడం, గతంలో ఉన్న గౌరవ మర్యాదలను కోల్పోవడం, కుటుంబ సభ్యులలో నేను, నాది అన్న సంకుచిత భావన పెరగడం, వృద్ధులకు ఆదాయం లేకపోవడం, అనారోగ్య సమస్యలు పెరగడం, గతంలోవలె వారు సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనలేకపోవడం మొదలైన కారణాల వల్ల వృద్ధులు నిరాదరణకు గురవుతూ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు.

## 7.2 వృద్ధాప్యం - నిర్వచనం

మానవ సమాజంలో భావనలు ఎప్పటికప్పుడు మారుతూ వుంటాయి. గతకాలంలో 'వృద్ధులు' అనే పదానికి అనుభవజ్ఞులు అనే నిర్వచనం ఉండేది. కానీ నేటి కాలంలో ఇది ఒక వయస్సుకు, శారీరక లక్షణాలకు, సామాజిక-మానసిక విషయాలకు సంబంధించినదిగా భావిస్తున్నారు. నేడు వృద్ధులు అంటే అభివృద్ధి చెందుతున్న దేశాలు, ముఖ్యంగా భారతదేశంలో 60 సంవత్సరాల వయస్సు పైబడినవారని అర్థం. అభివృద్ధి చెందిన దేశాలలో 65 సంవత్సరాల వయస్సుపైబడిన వారిని వృద్ధులుగా పరిగణిస్తున్నారు. ఇది వయస్సు ప్రామాణికంగా నిర్వచనం. జైవికంగా నరాలకు సంబంధించిన న్యూట్రాన్ కణాలు బలహీనపడటంతోనూ, తదితర అవయవాల శక్తి తగ్గడం ప్రారంభం కావడంతోను ముసలితనం వస్తుంది. ఈ జైవిక మార్పు ఆకారం, తెలివితేటలు, ప్రవర్తనలో కూడా మార్పు తీసుకువస్తుంది. సామాజికంగా ముసలితనమనేది ఆ సమాజం, సంస్కృతి, విలువలు, నిర్ణయాలపై ఆధారపడి వుంటుంది. అతనిని ముసలివాడని ఎప్పుడు ఆ సమాజంలోని సభ్యులు నిర్ణయిస్తారనేది ముఖ్యం. వృద్ధాప్యం పై లక్షణాలన్నిటితో కూడి వుంటుంది. సుమారు 60 సంవత్సరాలు పైబడిన తరువాత శరీరం బలహీనపడినప్పుడు సాంఘిక అసౌకర్యాలు, సమస్యలు ఏర్పడి అల్పన్యూనతా మనోభావాలకు గురయ్యే పరిస్థితి వృద్ధాప్యమవుతుంది.

ప్రపంచవ్యాప్తంగా అన్ని సమాజాలలోనూ వృద్ధులు కీలకపాత్ర నిర్వహిస్తూ వచ్చారు. అపారమైన అనుభవంతో వృద్ధులు కుటుంబాన్ని, సంఘాన్ని, రాజ్యాన్ని, సమాజాన్ని నడుపుతూ వుండేవారు. వీరు వారి ముందు తరాలవారు చెప్పిన విషయాలను సామాజిక వారసత్వంగా పొంది అన్ని రంగాలలోనూ యజమానులుగా వ్యవహరించే వారు ప్రతీచోట వారికి పెద్దపీట వేసేవారు. కుటుంబంలో యజమానులు వృద్ధులే. వయసు మళ్లిన వారే కుల, జాతి, గ్రామ సంఘాల నాయకులు పరిపాలకులు కూడా వీరే. కాల క్రమేణా భౌతిక పరిస్థితులలో వచ్చిన మార్పు సాంఘిక వ్యవస్థలలో కూడా పరివర్తనలకు కారణమయింది. యంత్రాలు, పరిశ్రమలు, నూతన శాస్త్రీయవిద్య ప్రతీ ఒకటి, రెండు దశాబ్దాలకు ఒకసారి విప్లవాత్మక పరివర్తనలకు లోనవుతూ ఉన్నాయి. దీనితో ఒక తరానికి రెండవ తరానికి ఆలోచనల్లో ఎంతో మార్పు వస్తున్నది. నేడు యాంత్రిక యుగమని, పారిశ్రామిక యుగమని, ఆధునిక యుగమని, అణు, అంతరిక్ష, ఎలక్ట్రానిక్ యుగమని యువకులు మాత్రమే ఈ యుగంలో విజ్ఞానపరంగా, సాంఘికంగా నిర్ణయాలు తీసుకోగలరని, విధి నిర్వహణలు చేయగలరని భావిస్తున్నారు. వృద్ధుల సూచనలు, అనుభవం, శిక్షణ నిరుపయోగమే కాకుండా హానికరమని కూడా నిర్ణయిస్తున్నారు. యాంత్రికత్వం, భౌతికవాదం అనే పేర్లతో ప్రేమ, అభిమానం, బంధుత్వం అనే వాటికి ప్రాధాన్యత సన్నగిల్లుతుంది. దీనితో నేడు వృద్ధులు అనేక సమస్యలకు గురి అవుతున్నారు. వీరి సమస్యల తీవ్రత పెరగడంతో వృద్ధాప్యమే 'ఒక శాపం'గా, ఒక సాంఘిక సమస్యగా మారింది.

BRAOU

## 7.3 వృద్ధుల సమస్యలు

వృద్ధాప్యం గతానికి, వర్తమానానికి, సంప్రదాయానికి, ఆధునికతకు, వయస్సు పైబడిన వారికి, యువతరానికి మధ్య అనుసంధానంగా వుంటుంది. సాంప్రదాయ సమాజంలో వృద్ధులను చారిత్రాత్మక వారసత్వంగా లేదా చారిత్రాత్మక కొనసాగింపుగా పరిగణిస్తున్నందువల్ల అక్కడ పెద్దల పాత్ర అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుని వుండేది. ఒకసారి నిర్ణయించిన విలువల వ్యవస్థ త్వరగా మార్పుచెందడమనేది కష్టసాధ్యమైన విషయం. మారుతున్న సమాజంలోని విలువలకు సాంప్రదాయ సమాజంలో సాంఘికీకరణ చెందిన వృద్ధులు అనుసరణ పొందడమనేది వారిని ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తుందనడంలో సందేహంలేదు. వృద్ధులు కొన్ని సందర్భాలలో సంఘర్షణలకు లోనవుతూ వాటిని తరాల అంతరాన్ని అధిగమించి కొత్త విలువలకు సర్దుబాటు చేసుకుంటున్నారు. సాధారణ సమస్యలైన ఆర్థిక వెనుకబాటుతనం, అనారోగ్యం, అంతస్తు రక్షణ లేకపోవడం మొదలగునవి వృద్ధులలో సామూహిక తత్వాన్ని పెంపొందిస్తాయి. దీని వలన వివిధ వయస్సులవారికి వివిధ రకాల సంస్థలైననటువంటి క్లబ్బులు, వినోదాన్ని అందించే కేంద్రాలు, హాబీ కేంద్రాలు మొదలైనవి ఆవిర్భవిస్తున్నాయి. వయస్సుపైబడే కొద్దీ వృద్ధులు సామాజిక కార్యక్రమాలలో పాల్గొనడం, ఇతరులతో కలిసిమెలిసి చురుకుగా వుండటం అనేవి తగ్గి ఇతరులతో పటిష్టమైన సాంఘిక సంబంధాలను కొనసాగించడంలో విఫలమవుతున్నారు. ఇప్పుడు వృద్ధుల సమస్యలను కొన్నింటిని పరిశీలిద్దాం.

### 7.3.1 సామాజిక సమస్యలు

పైన పేర్కొన్న విధంగా వృద్ధాప్యం అనేది మానసిక లేదా జైవికం మాత్రమే కాకుండా సామాజిక, సాంస్కృతిక పరమైన దృగ్విషయంగా చెప్పుకోవచ్చును. ప్రతీ సమాజం వృద్ధాప్యానికి సంబంధించి ఒక్కొక్క విధంగా తన భావనను కలిగి వుంటుంది. సాంఘికీకరణ ప్రక్రియ ద్వారా సమాజం సాంఘిక, సాంస్కృతిక విలువలను ఒకతరం నుండి మరొక తరానికి ప్రసాదిస్తూ వ్యక్తులను అవసరమైన నైపుణ్యాలు, విలువలు, కట్టుబాట్లను సముపార్జించుకునేవిధంగా చేస్తుంది. సమాజంలోని వ్యక్తి తన వయస్సు స్తరీకరణ క్రమంలో ఒక వయసు నుండి మరొక వయసుకు ఎదిగేటప్పుడు సమాజంలో ఉన్నటువంటి ఆచార, సంప్రదాయాలకు సంబంధించి సమాజం కోరుకున్న రీతిలో కొత్త పాత్రలను సముపార్జించుకుంటాడు. వయస్సు సంబంధిత పాత్రలు అంతస్తులు, అవకాశాలు, అవసరాలు అన్నీ కూడా సమాజం చేత నిర్వచించి వుంటాయి. సమాజంలో ఒక వ్యక్తి వృద్ధాప్యానికి లోనయ్యాడని చెప్పటానికి కొన్ని సాంఘిక లక్షణాలను చెప్పుకోవచ్చును. అవి అతని ఉద్యోగ విరమణ, సంతానం, వివాహం, లైంగిక సంబంధాలనుండి విరమణ, సాంఘిక తొలగింపు, కొత్త బాధ్యతలను పైన వేసుకోవడం మొదలైనవి. కాబట్టి వృద్ధాప్యాన్ని రెండు కోణాలనుండి సామాజిక సమస్యగా భావించవచ్చు. మొదటిది వృద్ధాప్యం నేరుగా వృద్ధాప్యానికి లోనైన జనాభా మొత్తానికి సంబంధించిన సమస్యగా చెప్పుకొనవచ్చును. వృద్ధులు శారీరక మరియు ఉద్వేగపూరితమైన వైమనస్కతను, గౌరవ మర్యాదలను, కోల్పోవడం, అధికారం, అంతస్తు కోల్పోవడం, కుటుంబ సభ్యుల వైఖరిలో మార్పు వచ్చి చులకన భావనతో చూడడం మొదలైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. రెండవది వృద్ధాప్యం మొత్తం సమాజానికి సంబంధించిన సమస్యగా చెప్పుకొనవచ్చును. వృద్ధులను మానసికనైరాశ్యానికి గురిచేసేటటువంటి ఎన్నో సమస్యలు సామాజిక నిర్మితి, ప్రకార్యాలమీద వ్యతిరేక ప్రభావాన్ని కలిగి వుండి మరికొన్ని సామాజిక సమస్యలకు దారితీస్తున్నాయని చెప్పవచ్చు.

### 7.3.2 ఆర్థిక సమస్యలు

వ్యక్తుల వయసు మళ్లే కొద్దీ కుటుంబ విత్తంపై యాజమాన్యం ఆవ్యక్తుల చేతులనుండి జారిపోతుంది. వృద్ధులు ముఖ్యంగా ఉద్యోగ విరమణ చేసినవారు, ఏ ఆదాయం లేని వారు, వృద్ధాప్యంతోపాటు వచ్చే అనారోగ్యానికి అయ్యే మందులుకూడా కొనుక్కోలేని దీన స్థితిలో వుంటున్నారు. కానీ వృద్ధాప్యంలో శారీరకపరమైన అనారోగ్య సమస్యలెన్నో ఉన్నందున వృద్ధులు నిత్యం మందులు వాడుకోవలసి వుంటుంది. కాబట్టి ఆర్థిక సమస్యలు ఆరోగ్య సమస్యలకు కూడా దారితీస్తాయి. ఆర్థిక, ఆరోగ్య సమస్యలు పరస్పరాధారపూరితమైనవి. ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉండటం వలన మందులకు అయ్యే ఖర్చులు కూడా ఎక్కువగా ఉండడం వలన వృద్ధులు రుణాలతో జీవిస్తూ ఆర్థికంగా

BRAOU

ఇతరుల మీద ఆధారపడుతూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. ఫలితంగా తరువాత వృద్ధులు మానసిక అనారోగ్యానికి గురయి కొంత మంది భిక్షకులుగా మారుతున్నారు. మరికొందరు సమాజ ఏహ్యాభావనకు గురవుతూ కనీస అవసరాలు తీర్చుకోలేక కుటుంబ సభ్యుల, సమాజ సభ్యుల ప్రేమ, అప్యాయతలు, ఆదరణ కరువై దుర్భర జీవితాలను గడుపుతున్నారు.

## 7.3.3 ఆరోగ్య సమస్యలు

అనారోగ్యం వృద్ధుల ప్రధాన సమస్య. వృద్ధాప్యంలో వయస్సు పెరిగే కొలదీ వ్యక్తుల శారీరక ధృఢత్వం తగ్గుతూ వుంటుంది. అయితే ఈ శారీరక దృఢత్వంలో తగ్గుదల వ్యక్తికి వ్యక్తికి మారుతూ వుంటుంది. వృద్ధాప్యంలోని వ్యక్తి వయస్సు పెరిగే కొలదీ ఆ వ్యక్తి శరీరంలోని వ్యాధి నిరోధక శక్తి తగ్గుతూ వుంటుంది. అందువల్ల వృద్ధులు ఎక్కువగా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. సాధారణంగా వృద్ధాప్యంలో వ్యక్తుల ఆర్థిక స్థోమత క్షీణించడం వలన వారి మందుల ఖర్చులకు ఇబ్బందులు పడుతూ కొంతమంది పూర్తిగా ఇతరుల మీద ఆధారపడుతున్నారు. మరికొందరు ఋణగ్రస్తులుగా మిగిలిపోతున్నారు. ఎథెల్‌షనాస్ జార్జి.ఎల్.మాడాక్స్ ఆరోగ్య, అనారోగ్యాలు వ్యక్తి శక్తి సామర్థ్యాలను ప్రభావితం చేస్తాయని, నిజజీవితంలో వ్యక్తులు పోషించే వివిధ రకాల పాత్రలను ప్రభావితం చేస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. వ్యక్తి జీవితం సంతృప్తి కరంగా వుండటానికి ఆరోగ్యం ప్రదాన భూమికను పోషిస్తుందని భావించారు. వృద్ధాప్యంలోని వ్యక్తికి ప్రధానంగా ఎదురయ్యేటటువంటి అనారోగ్య సమస్యలలో మోకాలి నొప్పులు, కీళ్ల నొప్పులు, వెన్నునొప్పి, బి.పి, గుండెకు సంబంధించిన జబ్బులు, కంటి చూపు పడిపోవడం వంటి సమస్య, కిడ్నీ సమస్య, షుగర్, అరుగుదల తగ్గిపోవడం, వళ్లు నొప్పులు, చర్మ వ్యాధులు, తలనొప్పి వేధిస్తుంటాయి.

## 7.3.4 మానసిక సమస్యలు

BRAOU

వృద్ధాప్యంలోని వ్యక్తులకు మానసికపరమైన మార్పులతోపాటు ఆలోచనాశక్తి మందగించడం, గుర్తింపు శక్తి సన్నగిల్లడం, కుతూహలశక్తిలో తగ్గుదల, నిద్రలేమి, చావు భయం, మొదలైన లక్షణాలు కూడా వెంటవస్తాయి. సాధారణంగా కొంతమంది వృద్ధాప్యాన్ని శారీరకమైన క్షీణతకు, ఉద్వేగపూరితమైన ఎన్నో సంఘర్షణలకు లోను కావడానికి పర్యాయపదంగా వాడుతుంటారు. అయితే వృద్ధాప్యాన్ని అనేక రకాలైన శారీరక, మానసిక లోపాలు, సామాజిక-ఆర్థిక పరిస్థితులు, వారసత్వ లక్షణాలు, మతపరమైన నమ్మకాలు, ఎన్నో ఇతర కారకాలు ప్రభావితం చేస్తాయని చెప్పవచ్చు.

## 7.3.5 విశ్రాంతి సమయం-ఉపయోగిత సమస్యలు

మానసిక బాధలనుంచి, శారీరక బాధలనుంచి బయటపడడానికి ప్రతీ వ్యక్తికి విశ్రాంతి అవసరం. విశ్రాంతి సమయంలో వ్యక్తి ఇప్పటివరకు తాను విపరీతంగా చేసిన పని వలన వచ్చిన విసుగు, నీరసం, అలసట నుండి శారీరకంగా, మానసికంగా ఉపశమనం పొందుతాడు. అయితే విశ్రాంతి సమయాన్ని ఉపయోగించుకోవడం అన్నది అర్థవంతంగా ఉన్నప్పుడు ఆ వ్యక్తి జీవితం కూడా అర్థవంతంగా, సంతృప్తికరంగా వుంటుంది. లేనప్పుడు ఆ వ్యక్తి జీవితం కడు దుర్భరమవుతుంది. అందువల్ల జీవితం సంతృప్తికరంగా ఉండటమనేది తనకున్న విశ్రాంతి సమయాన్ని వ్యక్తి ఏవిధంగా గడుపుతున్నాడన్న విషయం మీద ఆధారపడి వుంటుంది. అయితే, వృద్ధాప్యంలో వ్యక్తులు ఉద్యోగ విరమణ, సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనలేకపోవడం వల్ల ఉత్పాదకతా కార్యక్రమాలలో పాల్గొనలేక పోవడంవల్ల వారి సమయాన్ని సరైన మార్గంలో వినియోగించుకోలేక తద్వారా వారిలో మానసిక నైరాశ్యం, వైమనస్కత పెంపొంది వారి జీవితాలలో ఆనందకరమైన క్షణాలు కరువవుతున్నాయని చెప్పవచ్చును. ఈవిధంగా సమాజంలోని వృద్ధులు ఏపనీ చేయలేక, కొన్ని పనులు చేయగలిగినప్పటికీ వారిమీద పడిన 'ముసలివారు ఏపని చేయలేరు' అన్న ముద్రతో పని దొరకక తమ సమయాన్ని అర్థరహితంగాను, అసంతృప్తికంరగానూ గడుపుతూ పాత్రరహిత పాత్రను పోషిస్తూ దుర్భర జీవితాలను నెట్టుకొస్తున్నారు.

## 7.4 వృద్ధాప్యం-సైద్ధాంతిక దృక్పథాలు

వృద్ధాప్యానికి సంబంధించిన ఇప్పటి సిద్ధాంతాలు అన్నీ కూడా వ్యక్తి వృద్ధాప్యంలో మారుతున్న సామాజిక పరిస్థితులలో ఏవిధంగా సర్దుబాటు చేసుకుంటాడో వివరిస్తాయి. ఇప్పుడు వృద్ధాప్యానికి సంబంధించిన కొన్ని సైద్ధాంతికపరమైన దృక్పథాలను పరిశీలిద్దాం.

### 7.4.1 క్రియాశీలత- కార్యశీలత సిద్ధాంతం

ఈ సిద్ధాంతాన్ని హావిగ్‌హర్స్ 1968వ సంవత్సరంలో ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతం ప్రకారం ఉద్యోగ విరమణ తరువాత జీవితంలో పొందే సంతృప్తి అనేది ఉద్యోగ విరమణకు ముందు ఎంత మేరకు పనిలో చురుకుగా పాల్గొన్నాడు, ఎలాంటి ముఖ్య పాత్రను పోషించాడు అన్న విషయంపై ఆధారపడి వుంటుంది. వ్యక్తి తన మధ్య వయస్సులో సామాజిక కార్యక్రమాలలో లేదా ఏదైనా పనిలో చురుకుగా పాల్గొన్నట్లయితే ఆవ్యక్తికి వృద్ధాప్య జీవితం సంతృప్తికరంగా వుంటుందని, గతంలో ఎలాంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనకపోతే తరువాత అతని జీవితం సంతృప్తికరంగా వుండదని హావిగ్ హర్స్ తెలియజేశారు. కాబట్టి సమాజంలోని వృద్ధుల జీవన సంతృప్తి స్థాయి అనేది గతంలో వారు ఏమేరకు వివిధ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారన్న విషయాలపై ఆధారపడి వుంటుంది.

### 7.4.2 ఆధునికీకరణ సిద్ధాంతం

కౌగిల్, హామ్స్ అనే సామాజిక శాస్త్రవేత్తలు 1972వ సంవత్సరంలో ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతం ప్రకారం సమాజాలు ఎక్కువ ఆధునికీకరణ చెందే కొద్దీ ఆ సమాజాలలోని వృద్ధుల అంతస్తు క్షీణిస్తుంది. సమాజాల పరిణామ క్రమలో వేటాడి, ఆహారాన్ని ప్రోగుచేసే దశలో ఆ సమాజాలలో వృద్ధుల అంతస్తు తక్కువగా ఉండేది. వ్యవసాయక సమాజాలలో భూమి ఎక్కువగా వృద్ధుల ఆధీనంలో ఉండి ఎక్కువ అంతస్తును కలిగి వున్నారని చెప్పవచ్చును. అయితే పారిశ్రామికీకరణ ఎక్కువగా జరిగే కొద్దీ ఆధునిక సమాజాలలో వృద్ధులు తగిన హోదాను కోల్పోయి నిరాదరణకు గురవుతున్నారు. ఈ సిద్ధాంతం ప్రకారం సాంకేతికపరమైన ప్రగతి, వృద్ధుల పాత్ర, అంతస్తు విలోమ సంబంధాన్ని కలిగి వుంటాయి. ఆధునిక సమాజాలలో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, సామాజిక గతిశీలత లాంటి కారణాలు కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తూ వృద్ధులు తమ అంతస్తు, హోదాను కోల్పోయేలా చేస్తున్నాయని చెప్పవచ్చు.

BRAOU

### 7.4.3 అనాసక్తతా సిద్ధాంతం

కమ్మింగ్, హెన్రీ అనే సామాజిక శాస్త్రవేత్తలు 1961వ సంవత్సరంలో ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. సమాజంలోని వ్యక్తులు తమ వయస్సు పెరిగే కొద్దీ సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడం నుండి విరమించుకుంటారు. వృద్ధాప్యంలోని వ్యక్తులు వయస్సు పైబడే కొద్దీ వివిధ కార్యక్రమాలలో పాల్గొనే విధానంలో మార్పులు చోటు చేసుకుంటాయి. గతంలో వలె వృద్ధులు చురుకుగా పాల్గొనలేరు.

### 7.4.4 వినిమయ సిద్ధాంతం

ఈ సిద్ధాంతాన్ని మార్టిన్ ప్రతిపాదించాడు. సమాజంలోని ఏ వ్యక్తికి అయినా మానసిక, సామాజిక, ఆర్థిక వనరులు వున్నట్లయితే అతనికి ఇతరులనుండి తప్పనిసరిగా మద్దతు లభిస్తుంది. ఏ వ్యక్తి అయినా తన దగ్గర వున్న వనరులను ఇతరులకివ్వడం ద్వారా వారి దగ్గర నుండి సహాయ సహకారాలను, మద్దతులను కూడగట్టుకుంటారు. అదేవిధంగా వృద్ధులుకూడా తమ వద్ద ఆర్థిక, మానసిక, సామాజిక వనరులు వుంటే కుటుంబ సభ్యులు, ఇతరుల నుండి మద్దతు పొందుతూ ఉంటారు. వనరులు లేనివారు ఎటువంటి మద్దతు లేకుండా నిరాదరణకు గురవుతారు.

### 7.4.5 ఉప సంస్కృతి సిద్ధాంతం

రోజ్ ఈ సిద్ధాంతాన్ని 1965వ సంవత్సరంలో ప్రతిపాదించాడు. వృద్ధాప్యం ఒక ఉప సంస్కృతిగా సమాజంలోని సభ్యులు ఒకరితో ఒకరు పరస్పర చర్యలు జరుపుకునేటప్పుడు పెంపొందుతుంది. వృద్ధాప్య ఉప సంస్కృతి వలన

సకారాత్మక, నకారాత్మక పరిణామాలుంటాయి. సకారాత్మక పరిణామం అనేది వృద్ధులలో సామాజిక చర్య సమూహం, రూపొందటానికి దోహదం చేయడం, నకారాత్మక పరిణామం ఇతర వయస్సుల సమూహాలను అణగదొక్కేవిధంగా ఉండడం.

## 7.4.6 మూర్తిమత్వ సిద్ధాంతం

ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వారిలో ముఖ్యులు ఆర్.జె.హావిగ్‌హర్స్ట్. ఈయనే కార్యశీలత సిద్ధాంతాన్ని, అనాసక్తతా సిద్ధాంతాల దత్తాంశాన్ని స్పష్టంగా వివరించలేవని అభిప్రాయపడినాడు. జీవన సంతృప్తిని నిర్ణయించడంలో చర్య మొత్తాన్ని ఒక ముఖ్యమైన చలనరాశిగా కార్యశీలత, అనాసక్తతా సిద్ధాంత కర్తలు స్పష్టంగా వివరించలేక పోయారని హావిగ్ హర్స్ట్ పేర్కొన్నారు. హావిగ్ హర్స్ట్ ప్రకారం జీవన సంతృప్తిని నిర్ణయించడంలో చర్యాస్థాయి చలనరాశి కాకుండా మూర్తిమత్వ రకం అనే చలనరాశి ముఖ్య పాత్ర వహిస్తుంది. ఉన్నత జీవన సంతృప్తిని పొందడానికి వివిధ రకాల మూర్తిమత్వం కలిగిన వ్యక్తులకు వివిధ రకాల చర్యస్థాయిలు అవసరమవుతాయి.

## 7.4.7 అవిచ్ఛిన్నతా సిద్ధాంతం

సమాజంలోని ఒక వ్యక్తి జీవితంలోని అతని గతకాలపు ప్రవర్తనా నమూనాలోని జైవిక, మానసిక, సామాజిక మార్పుల మధ్య ఉన్నటువంటి అన్యోన్య సంబంధాన్ని పరిశీలించడం ద్వారానే ఒక వ్యక్తి వృద్ధాప్యం పట్ల ఏవిధంగా ప్రతిస్పందిస్తాడన్న విషయాన్ని ఈ సిద్ధాంతం వివరిస్తుంది. ఒక వ్యక్తి అలవాట్లు, ప్రాధాన్యతలు, సంఘాలు, ఆరోగ్యస్థితి, అనుభవాలు అనేవి ఆవ్యక్తి జీవనశైలిని కొనసాగించడానికిగల అతని శక్తి సామర్థ్యాలను నిర్ణయిస్తాయని ఈ సిద్ధాంతకర్తలు నమ్ముతారు.

## 7.4.8 సవ్యం సంతృప్తి సిద్ధాంతం

ఈ సిద్ధాంతాన్ని బట్లర్ 1963వ సంవత్సరంలో ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతం ప్రకారం జీవిత పునఃసమీక్ష అనేదిసహజంగా విశ్వవ్యాప్తమైన సర్దుబాటు ప్రక్రియ. వృద్ధులు తమ గతానుభవాలను సమీక్షించుకుంటూ, అపరిష్కృతంగా వున్నటువంటి సంఘర్షణలను పునఃపరీక్షించుకుంటూ తమను తాము సమైక్య పరచుకుంటారు.

## 7.4.9 పాత్ర సిద్ధాంతం

వృద్ధాప్యంలోని వ్యక్తుల ప్రవర్తనను పాత్ర సిద్ధాంతం ద్వారా చక్కగా వివరించవచ్చుననని ఫిలిప్స్ (1957), కావన్ (1962)సామాజిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడినారు. సమాజశాస్త్రంలో వివిధ అంతస్తులను లేదా స్థాయిలను కలిగివున్న వ్యక్తులనుండి సమాజం కోరుకున్న రీతిలో ఉండేటటువంటి ప్రవర్తనను 'పాత్ర'గా చెప్పవచ్చును. ఒక నాటకంలోని వ్యక్తులు వివిధ పాత్రలు పోషించే విధంగానే నిజజీవితంలో కూడా వ్యక్తులు వివిధ పాత్రలను పోషిస్తారు.

## 7.4.10 ముద్ర సిద్ధాంతం

సమాజశాస్త్రవేత్తలు సాంప్రదాయకంగా నేరస్తుల ప్రవర్తనను, మానసిక రుగ్మతలను గురించి వివరించడానికి ఈ సిద్ధాంతాన్ని ఉపయోగిస్తారు. వృద్ధుల ప్రవర్తన గురించి వివరించడానికి ఈ సిద్ధాంతం అత్యంత ఉపయోగకరమైనది బెంగస్టన్ (1973) అభిప్రాయపడినాడు. ఈ సిద్ధాంతం ముఖ్యంగా ఒక వ్యక్తి మీద పడే ముద్ర, ఆవ్యక్తి ఇతరులతో, ఇతరులు అతనితో ప్రవర్తించే తీరుపై చాలా ప్రభావం చూపుతుందని తెలియజేస్తుంది. సమాజంలో వృద్ధాప్యానికి సంబంధించి కొన్ని తప్పుడు అభిప్రాయాలు వున్నాయి. సాధారణంగా వృద్ధులు ఎటువంటి చర్యలలో పాల్గొనలేరని, వృద్ధాప్యంలో శక్తిసామర్థ్యాలు నశిస్తాయని, నిస్సహాయస్థితిలో వుంటారని వారిపై పడే ముద్రలు వారిని మానసికంగా కృంగదీసి మానసిక నైరాశ్యానికి గురిచేస్తున్నాయి.

## 7.4.11 వయస్సు స్తరీకరణ మోడల్

ఈ మోడల్ గురించి వివరించిన వారిలో ముఖ్యులు రిలే, జాన్సన్, ఫోరర్. ఈ సిద్ధాంతం ప్రకారం సమాజంలోని ఒక వ్యక్తి ప్రవర్తనను నిర్ణయించడంలో వయస్సు ప్రధానమైన పాత్ర వహిస్తుందనడానికి రెండు కారణాలున్నాయి.



BRAOU

మొదటిది: వయసు వ్యక్తి వివిధ రకాల పాత్రలను నిర్వహించడంలో అతని శక్తి సామర్ధ్యాలను క్షీణింపచేయవచ్చు. రెండవది, వయసును బట్టి వివిధ రకాల వ్యక్తులకు సమాజం వివిధ రకాల హక్కులను, అవకాశాలను, పాత్రలను కల్పిస్తుంది.

### 7.4.12 దృగ్విషయ సిద్ధాంతం

దృగ్విషయ సిద్ధాంతాన్ని మొదటిసారిగా డోనాల్డ్ స్నిగ్ 1941లో రాసిన గ్రంథంలో తెలియజేశారు. తరువాత ఈ సిద్ధాంతాన్ని కోమ్బ్స్, స్నిగ్ 1959వ సంవత్సరంలో అభివృద్ధి చేశారు. ఈ సిద్ధాంతం ప్రకారం ఒక వ్యక్తి ప్రవర్తనను అర్థం చేసుకోవాలంటే ఆ వ్యక్తి ప్రపంచాన్ని ఏ విధంగా చూస్తున్నాడో ముందుగా అర్థం చేసుకోవాలి. వ్యక్తులు ఒకే విషయాన్ని వివిధ రకాలుగా చూస్తారు. ఉదాహరణకు వృద్ధులు ఉద్యోగవిరమణ, ఆరోగ్య మార్పులు, వైధవ్యం అనే విషయాలకు ఇతర వ్యక్తులకంటే భిన్నంగా స్పందించవచ్చు. వారి భిన్నమైన ప్రతిస్పందనలకు కారణం దృగ్విషయం కాకుండా ఆ దృగ్విషయాన్ని వ్యక్తులు ఏవిధంగా చూస్తున్నారన్నదానిపై ఆధారపడివుంటుంది.

## 7.5 ముగింపు

వృద్ధాప్య భావన భారతదేశంలో ఇటీవలికాలంలో ప్రాధాన్యతను సంతరించుకున్నది. సమాజంలో వృద్ధుల సంఖ్య నానాటికీ పెరుగుతున్న కొద్దీ అభివృద్ధి చెందిన దేశాలలో అభివృద్ధి చెందుతున్న దేశాలలో ముఖ్యంగా భారతదేశంలో వృద్ధాప్య భావనకు సంబంధించిన పరిశోధనాంశాలకు ప్రాముఖ్యత పెరుగుతున్నది. వృద్ధులు వయస్సు పైబడేకొద్దీ వారు సామాజిక, ఆర్థిక, ఆరోగ్య, మానసిక సమస్యల సుడిగుండంలో చిక్కుకుని దానినుంచిబయటపడలేక కాటికి కాళ్లు చాచుకుని చావుకోసం ఎదురు చూసే దురవస్థ ఏర్పడింది.

BRAOU

## 7.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. **ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. వృద్ధాప్య భావనను వివరించండి?
2. వృద్ధాప్యం నిర్వచాలు ఏవి? సవివరంగా రాయండి.
3. వృద్ధాప్యంలో సమస్యలు తెలుపండి?

II. **ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. పాత్ర సిద్ధాంతం అనగానేమి?
2. క్రియాశీలత కార్యశీలత సిద్ధాంతం గురించి క్లుప్తంగా రాయండి.
3. వృద్ధుల ఆర్థిక సమస్యలు తెలుపండి.

## 7.7 చదువవదగిన పుస్తకాలు

1. బలహీనవర్గాలు-సామాజిక పునర్నిర్మాణం: తెలుగు అకాడమీ, మోనోగ్రాఫ్-115, సమాజశాస్త్రం

2. Bhatia, H.S, : Aging and Society- A Sociological Study of Retired Servents, Udaypur, Ther Arya Book Centre Publishers.

# భాగం-8: ఆధునిక సమాజాలలో వృద్ధాప్యం

విషయక్రమం


8.0 ఉద్దేశాలు

8.1 పరిచయం

8.2 ఆధునిక కాలంలో బలహీనవర్గాలు

8.3 అధునిక సమాజంలో వృద్ధాప్యం

8.4 వృద్ధాప్యం-అపోహలు

8.4.1 సామాజిక అపోహలు

8.4.2 ఆర్థిక అపోహలు

8.4.3 ఆరోగ్య అపోహలు

8.4.4 లైంగిక అపోహలు

8.4.5 మానసిక అపోహలు

8.5 ముగింపు

8.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

8.7 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 8.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివినతరువాత మీరు

- ఆధునిక సమాజాలలో బలహీనవర్గాలవారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటారు.
- వృద్ధాప్యంపై సమాజాలలో నెలకొన్న అపోహలను అర్థం చేసుకుంటారు.
- బలహీనవర్గాల సమస్యల గురించి వివరించగలుగుతారు.

## 8.1 పరిచయం

సమాజాలలో సమాజాభివృద్ధి శ్రమవిభజన విశిష్టీకరణ వీటివల్ల విభేదీకరణ సంక్లిష్టత అధికమయితే దానిని సామాజిక పరిణామం అని చెబుతారు. సమాజాలు క్రమంగా పరిణామం చెందుతుంటాయి. ఆధునిక యుగంలో పారిశ్రామికాభివృద్ధి జరగడంతో సమాజంలో పరిణామం రేటు అధికమయింది. అయితే సమాజాభివృద్ధి కేవలం స్వాతంత్ర్య నూతన కల్పన వల్లనే కాకుండా వ్యాప్తి ద్వారా కూడా జరుగుతుంది. ఆధునిక యుగంలో సాంకేతిక, శాస్త్రీయ రంగాలలో విశేషాభివృద్ధి జరిగింది. సులభసాధ్యాలు అయిన రవాణా, వార్తా ప్రసార సాధనాల మూలంగా ప్రపంచంలో సమాజాల మధ్య ఆధారప్రదానాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సమాజాలు పరస్పరం ప్రభావితం అవుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల ప్రజలు వెనుకబడిన దేశాలకు వెళ్లి వలస సామ్రాజ్యాలు ఏర్పరచ కున్నారు. అంతేకాదు కొన్ని సందర్భాలలో వెనుకబడిన దేశాల ప్రజలు అభివృద్ధి చెందిన దేశాలలో సాంకేతిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో సాధించిన అభివృద్ధిని చూసి ప్రభావితులై వాటికి ఆకర్షితులవుతున్నారు. దీనివల్ల ఈ

సమాజాలు ఆధునీకరణం చెందుతున్నాయి. మత ప్రచారకులు కూడా వెనుకబడిన దేశాలలో మతంతో పాటు దేశాలతో సంబంధాలు పెంపొందించుకోవడం వల్ల వాటిలో కూడా ఆధునీకరణ జరుగుతుంది. ఈనాడు ఆధునీకరణం అనేక సమాజాలలో జరుగుతుంది. దీనివల్ల అయినా సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలలో మార్పులు కలుగుతాయి.

డబ్ల్యూ.సి. మోరి ఆధునీకరణ ప్రక్రియను ఇలా నిర్వచించాడు. "సాంప్రదాయక సమాజం సమగ్రంగా పరివర్తనం చెందుతూ ఆర్థిక సంపన్నత రాజకీయ సుస్థిరతలతో అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలోని సాంకేతిక విధానాలు అనుసరిస్తూ వాటికి అనుబంధమైన సామాజిక వ్యవస్థను రూపొందించుకునే ప్రక్రియ ఆధునికీకరణం".

ఆధునికీకరణం మొదట పాశ్చాత్య దేశాలలో ప్రారంభమైంది. తరువాత క్రమంగా ఇతర దేశాలలో వ్యాప్తి చెందింది. దీనివల్ల టర్కీ, జపాన్, రష్యాలాంటి దేశాలలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. ఈనాడు అభివృద్ధి చెందుతున్న దేశాలు అమెరికా, ఇంగ్లాండ్ లాంటి అభివృద్ధి చెందిన దేశాల నమూనాలను, రష్యా, జపాన్ లాంటి దేశాల అభివృద్ధి నమూనాలను కూడా అనుసరించవచ్చు. ఆధునికీకరణ చెందుతున్న దేశాలలో అభివృద్ధికోసం విశేష కృషి జరుగుతున్నది. దానివల్ల ఆర్థిక వ్యవస్థలో, సామాజిక వ్యవస్థలో గణనీయమైన మార్పులు కలుగుతున్నాయి. సామాజిక జీవితంలోని అన్ని రంగాలలోనూ యంత్ర పరికరాలను వాడడం జరుగుతోంది. పారిశ్రామికీకరణ ఫలితంగా వ్యవసాయరంగంలో కూడా యంత్రాలను ఉపయోగిస్తున్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం సాగించడం వల్ల ఉత్పత్తులు పెరుగుతాయి. ఇలా పారిశ్రామిక రంగంలో వ్యవసాయ ఉత్పత్తులు పెరడంతో జాతీయాదాయం అభివృద్ధిచెంది ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. ఆధునీకరణ, పారిశ్రామికీకరణల పర్యవసానంగా నగరాలలో జనాభా పెరుగుతుంది. పరిశ్రమలు, ఇతర ఆర్థిక, సాంస్కృతిక, విద్యాసంస్థలు పట్టణాలలో ఉండడం వల్ల పల్లె ప్రాంతాలనుంచి ప్రజలు పట్టణ ప్రాంతాలకు తరలిపోతుంటారు. ఈవిధంగా గ్రామీణ ప్రాంతాలలో, నగర ప్రాంతాలలో అవ్యవస్థ స్థితిగతులు పెంపొంది, వాటి ఫలితంగా సమాజంలో అనేక మంది బలహీనవర్గాలవారు అనేక సమస్యలను ఎదుర్కొంటూ మానసిక నైరాశ్యానికి గురవుతున్నారు.

## 8.2 ఆధునిక కాలంలో బలహీనవర్గాలు

ప్రతీ సమాజంలోనూ, అన్ని కాలాలలోనూ, బలహీనవర్గాలు ఏర్పడడం సహజమని చెప్పుకోవచ్చు. అయితే ఆధునిక కాలంలో ప్రతీ నాగరిక సమాజంలోనూ ఏదో ఒకరకమైన రక్షణ వీరికి కల్పించడం జరుగుతున్నది. ప్రాచీనకాలంలో ఈ పద్ధతిని నీతి పేరుతోనో, మతం పేరుతోనో ప్రోత్సహించేవారు. కానీ ఆధునిక కాలంలో ఇట్టి వ్యక్తిగతమైన సేవయేకాక ప్రభుత్వ పరంగా, స్వచ్ఛంద సంస్థల ద్వారా ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. వ్యక్తులు బలహీనులైనప్పుడు సమాజం వారికి సరియైయన స్థానం కల్పిస్తే వ్యక్తులు బాధలకు గురికారు. అధిక సంఖ్యలో వ్యక్తులు సమస్యలు లేకుండా సంతృప్తికరంగా జీవిస్తే వ్యక్తి అవసరాలకు సామాజిక ప్రమాణాలకు చక్కని సమన్వయం కుదిరిందని చెప్పవచ్చు. నిశ్చలమైన సమాజాలలో మార్పు త్వరగా కన్పించక నెమ్మదిగానూ, క్రమబద్ధంగానూ ఉంటుంది. ఇటువంటి సమాజాలలో వ్యక్తులకు సర్దుబాటు సమస్యలు చెప్పుకోదగినంత పెద్దగా వుండవు. ఎందుకంటే సమాజంలో వ్యక్తులు సంస్థలకు అనుగుణంగా సర్దుకోవడం సులభం. అట్లాగే వ్యక్తుల వివిధ అవసరాలను పూర్తి చేయడంలో సంస్థలు కూడా చాలావరకు ఉదారంగా వ్యవహరిస్తాయి. ఈ సమాజంలో వ్యక్తులు చాలామంది పేచీ లేకుండా జీవిస్తారు. ఈ సమాజంలో వున్న వ్యక్తులు తమ జీవితాలను యాంత్రికంగా గడుపుతూ సంప్రదాయాన్ని శిరసావహిస్తూ అలజడి లేకుండా కాలం వెళ్లబుచ్చుతారు. కానీ గతిశీలమైన సమాజంలో మార్పు ఉధృతవేగంతో ఉంటుంది. వ్యక్తుల అవసరాలకు అనుగుణంగా సంస్థలు మారవు. వ్యక్తి కాంక్షించే సామాజిక ప్రయోజనాలు నెరవేరవు. దీనితో వ్యక్తికి వ్యక్తికీ, వ్యక్తికీ సమూహాలకు మధ్య ఉండే సంబంధాలు దెబ్బతింటాయి. వ్యక్తులు మౌలికమైన మార్పు కోరుతూ ఉద్యమిస్తారు. సామాజిక వ్యవస్థ బలహీనమై, జీవిత మార్గంలో పొదుపులు పెరిగి, అవ్యవస్థతా ధోరణులు వ్యాపిస్తాయి. సామాజిక వ్యవస్థలో కొత్త పద్ధతులను, మార్గాలను ప్రవేశపెట్టినప్పుడు పాత విధానాలు, పద్ధతులు దెబ్బతింటాయి. సంస్కృతిలో వివిధ రంగాలలో సామరస్యం లోపిస్తుంది. వ్యక్తికీ సమాజానికి మధ్య పెరిగిన సాంస్కృతిక విలంబనము మనిషి వ్యక్తిత్వంలో వైముఖ్యాన్ని సృష్టిస్తుంది.

BRAOU

పారిశ్రామికీకరణం, ఆధునికీకరణం ముందంజవేస్తున్న కొద్దీ మనిషి ఆర్థిక అవసరాలు కూడా పెరిగాయి. బ్రతుకులో దారిద్ర్యాన్ని పారద్రోలి సుఖమయజీవిత ప్రయాణం కోసం మానవుడు అధికంగా ప్రయత్నిస్తాడు. అయితే భౌతిక, ఆర్థిక అవసరాలు తీరినంత మాత్రాన మనిషి సంతృప్తి చెందుతాడని అనుకోవడం భావ్యం కాదు. ఈ విషయాన్ని బెర్ట్రాండ్ రస్సెల్ ఇట్లా అంటాడు. 'సమాజ వాదం ద్వారా మనిషి అవసరాలు పూర్తిగా తీరవచ్చు. కానీ అవి తీరడం వల్లనే మనిషి ఆనందిస్తాడని అనుకోవడం సమంజసం కాదు. అంతకుమించిన స్వేచ్ఛను, సృజనాత్మక శక్తినీ స్వచ్ఛంద సహకారాన్ని ఆత్మప్రేరణతో కూడిన ఆనందమయ జీవితాన్ని పెంపొందించే అవకాశాలను అతడు అధికంగా కాంక్షిస్తాడు. అయితే ఆధునిక కాలంలో బలహీనవర్గాలలో ముఖ్యంగా వృద్ధులు అనేక సమస్యలకు గురవుతూ కాలం గడుపుతున్నారు. వేగంగా మారుతున్న సామాజిక స్థితిగతులు వృద్ధాప్యంపై పెను ప్రభావాన్ని చూపుతున్నాయి.

## 8.3 ఆధునిక సమాజంలో వృద్ధాప్యం

సాంప్రదాయ సమాజంలో వృద్ధాప్యాన్ని ఒక వరంలా భావించేవారు. అప్పటి సమాజాలలో వృద్ధులకు తమ జీవిత చరమాంకంలో ఆనందాన్ని అరబోసుకునే ఒకజాగృదావస్థ వలె ఉన్నట్టుగా తమ స్వీయానుభవాలను రేపటి తరానికి పంచి ఇచ్చే అపురూపమయిన సామాజిక విద్యా వ్యవస్థగానూ, బాధ్యతల భారంతో అలసి సొలసిన ఒక తరం ప్రతినిధులు కుటుంబ ఆత్మీయతానుబంధాల మధ్య ఆడిపాడే పసిపాపల్లో ఒకరిగా మమేకమై గడిపి, మహాప్రస్థానాన్ని ముగిస్తూ మహాభినిష్క్రమణం చేసే మహోన్నత ఘట్టంగానూ చెప్పుకొనవచ్చును. అయితే నేటి ఆధునిక సమాజంలో విలువలు కనుమరుగైన, మానవతలోపించిన, నగరవాసంలో ఇరుకు గదుల నివాసంలోవలె సమాజంలోని వ్యక్తుల గుండెగదులు ఇరుకై వృద్ధాప్యం ఒక శాపంలా మారిపోయింది. తల్లిదండ్రులకు బిడ్డలకు పొసగని లోకంలో, ఆర్థిక సంబంధాలే సామాజిక సంబంధాలను, అనుబంధాలను శాసిస్తున్న నేపథ్యంలో కన్న మమకారాన్ని కాదుపొమ్మనే ప్రబుద్ధులు పెరుగుతుండడం వలన వృద్ధులకు కాటికి కాళ్లు చాపుకొని చావుకోసం ఎదురుచూసే దురవస్థ ఏర్పడింది. ఆర్థిక క్లేశాల్లో చిక్కుకున్న బిడ్డలు ప్రేమపాశాల కోసం, గూడుకోసం అలమటిస్తూ రోడ్లమీద పడుతున్నవారు కొందరైతే, కన్నబిడ్డలే మెడపట్టి రోడ్డుమీదకు గెంటేయగా వీధినపడుతున్నవారు మరికొందరు. మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజం మార్పులకు లోనవుతుంది. జీవితంలో వేగం పెరిగిన కారణంగా మానవ సంబంధాలలో సైతం మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గత దశాబ్దంలో వచ్చిన ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణలు కూడా సమాజంపై ప్రభావాన్ని చూపిస్తున్నాయి. వీటన్నిటి ఫలితమే ఇటీవల పెరుగుతున్న వృద్ధుల శరణాలయాలు. ఉద్యోగాలు చేస్తూ వృద్ధులకు సేవ చేసే తీరికలేక కొందరు తమ తల్లిదండ్రులను వృద్ధుల శరణాలయాల్లో చేర్పిస్తున్నారు. 'ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న పెను మార్పులు, ఆర్థిక సరళీకరణల ప్రభావం మానవ సంబంధాల్లో అనూహ్య మార్పులకు శ్రీకారం చుడుతున్నాయి.'

BRAOU

ఇప్పుడు ఈ క్రింద పేర్కొన్న 30 అభివృద్ధి చెందిన దేశాలలో వృద్ధుల జనాభా శాతాన్ని, వివిధ దేశాల మధ్య వృద్ధుల సంఖ్యలోని తేడాలను పరిశీలిద్దాం.

ఈ కింది పట్టికను పరిశీలించినట్టయితే 30 అభివృద్ధి చెందుతున్న దేశాలలోనూ 60+ వయో వృద్ధుల శాతం పెరుగుతూ వుంది. అయితే చైనా, ఇండియా, శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాలలోని వయో వృద్ధుల శాతం గణనీయంగా పెరుగుతుండగా, బంగ్లాదేశ్, ఇథియోపియా, జైర్ దేశాలలోని వృద్ధుల శాతం కనీస స్థాయిలో పెరుగుతూవుంది. భారతదేశం విషయానికి వచ్చినట్టయితే 1995వ సంవత్సరంలో భారతదేశంలోని అన్ని వయస్సుల జనాభా 936.5 మిలియన్‌లు వుండగా అది 2020 నాటికి 1320.7 మిలియన్‌లకు పెరిగింది. అదేవిధంగా 1995లో 60+ వయస్సుగల వారు 6.4 శాతం, 75+ వయస్సు గలవారు 1.1 శాతం వుండగా అవి 2020 నాటికి 10.4, 2.1 శాతానికి పెరుగుతుందని అంచనా.

పట్టిక-1: 30 అభివృద్ధి చెందుతున్న దేశాల వయోవృద్ధుల జనాభా శాతం, 1995, 2020 (మిలియన్‌లలో)

| | 1995 | | | 2020 | | |
|---|---|---|---|---|---|---|
| దేశం | అన్ని వయసుల మొత్తం జనాభా | 60+ వయో వృద్ధుల శాతం | 75+ వయో వృద్ధుల శాతం | అన్నివయసుల మొత్తం జనాభా | 60+ వయో వృద్ధులశాతం | 75+వయో వృద్ధులశాతం |
| అర్జెంటీనా | 34.3 | 13.5 | 3.6 | 43.2 | 16.1 | 4.7 |
| బంగ్లాదేశ్ | 128.1 | 4.8 | 0.7 | 210.2 | 6.9 | 1.1 |
| బ్రెజిల్ | 160.7 | 7.0 | 1.4 | 197.5 | 13.5 | 3.2 |
| కామరూన్ | 13.5 | 5.3 | 1.0 | 28.3 | 5.6 | 1.2 |
| చైనా | 1203.1 | 9.3 | 1.8 | 1424.7 | 17.0 | 3.9 |
| కొలంబియా | 36.2 | 6.7 | 1.4 | 49.3 | 13.8 | 3.2 |
| కొస్టారికా | 3.4 | 7.1 | 1.8 | 5.3 | 13.0 | 3.3 |
| క్యూబా | 10.9 | 12.6 | 4.1 | 12.3 | 20.4 | 6.8 |
| ఈజిప్టు | 62.4 | 5.8 | 0.9 | 92.4 | 8.9 | 1.5 |
| ఇథియోపియా | 56.0 | 4.4 | 4.4 | 114.4 | 4.5 | 0.8 |
| ఫిజి | 0.7 | 5.1 | 0.7 | 1.0 | 10.6 | 1.8 |
| ఘనా | 17.8 | 4.7 | 0.8 | 35.9 | 5.1 | 0.9 |
| ఇండియా | 936.5 | 6.4 | 1.1 | 1320.7 | 10.4 | 2.1 |
| ఇండోనేషియా | 203.6 | 6.1 | 0.9 | 276.5 | 11.2 | 2.3 |
| ఇరాన్ | 64.6 | 5.9 | 1.1 | 104.3 | 7.6 | 1.8 |
| జమైకా | 2.6 | 9.1 | 2.7 | 3.3 | 12.5 | 3.4 |
| కెన్యా | 28.8 | 3.7 | 0.6 | 44.2 | 4.8 | 1.1 |
| దక్షిణకొరియా | 45.6 | 8.6 | 1.6 | 54.0 | 18.8 | 4.5 |
| మెక్సికో | 94.0 | 6.4 | 1.6 | 136.1 | 11.2 | 3.1 |
| మొరాకో | 29.2 | 6.4 | 1.4 | 44.5 | 10.0 | 2.5 |
| నైజీరియా | 101.2 | 4.7 | 0.7 | 215.9 | 5.3 | 1.1 |
| పాకిస్తాన్ | 131.5 | 6.0 | 1.2 | 251.3 | 5.9 | 1.2 |
| పెరూ | 24.1 | 6.4 | 1.2 | 34.2 | 11.1 | 2.5 |
| ఫిలిప్పీన్స్ | 73.3 | 5.6 | 1.1 | 116.0 | 8.8 | 1.8 |
| శ్రీలంక | 18.3 | 8.7 | 2.0 | 22.9 | 16.4 | 4.1 |
| టాన్జానియా | 28.7 | 4.8 | J.9 | 48.5 | 4.3 | 1.0 |
| థాయ్‌లాండ్ | 60.3 | 7.6 | 1.5 | 62.9 | 16.9 | 4.3 |
| ఉరుగ్వే | 3.2 | 17.1 | 4.9 | 3.8 | 19.3 | 6.9 |
| వెనిజులా | 21.1 | 6.3 | 1.5 | 31.3 | 11.9 | 2.9 |
| జైర్ | 44.1 | 4.2 | 0.7 | 92.9 | 3.9 | 0.8 |

*ఆధారం:* *యు.ఎస్. బ్యూరో ఆఫ్ ది సెన్సెస్. ఇంటర్నేషనల్ ప్రోగ్రాం సెంటర్. ఇంటర్నేషనల్ డేటా బేస్ ఆన్ ఏజింగ్. హెల్ప్‌ఏజ్ ఇన్ ఇండియా. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ జర్నల్. వా. 5. నం.2., 1999 పే.10*

BRAOU

సాధారణంగా జననాల సంఖ్య, మరణాల సంఖ్య, శిశుమరణాల సంఖ్య జనాభా పెరుగుదలపై ప్రభావం చూపిస్తాయని చెప్పవచ్చు. ఆధునిక కాలంలో ప్రజలలో పెంపొందిన సామాజిక చైతన్యం వలన, మరణాల సంఖ్యను అరికట్టడంలో సత్ఫలితాలను సాధించడం, ప్రజలు విద్యావంతులు కావడం వలన జనన మరణాలపై వ్యక్తి పట్టు సాధించడం జరిగింది. అయితే దీని ప్రభావం వృద్ధాప్య సమస్యపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని చెప్పవచ్చు.

ఇప్పుడు భారతదేశంలో 1950 సంవత్సరం నుండి 2025 సంవత్సరం వరకు గల జననాల సంఖ్య, మరణాల సంఖ్య, శిశుమరణాల సంఖ్యను పరిశీలిద్దాం.

**పట్టిక-2: భారతదేశంలో జనన మరణాలు, శిశుమరణాలు-ప్రణాళికలు (ప్రొజెక్షన్స్)-1988**

| | 1950-55 | 1990-95 | 2000-05 | 2020-25 |
|---|---|---|---|---|
| A. జననాలరేటు (వెయ్యిమంది వ్యక్తులకు జననాల సంఖ్య) | 44.10 | 25.90 | 20.30 | 14.80 |
| B. మరణాలరేటు (వెయ్యిమంది వ్యక్తులకు మరణాల సంఖ్య) | 25.00 | 9.80 | 8.10 | 7.70 |
| C. శిశు మరణాలు (వెయ్యిమంది జననాలకు) | 190 | 88 | 67 | 35 |

***ఆధారం:*** *ప్రపంచ జనాభా అంచనాలు, ప్రణాళికలు, 1950-55, ఐక్యరాజ్యసమితి, న్యూయార్క్. 2988లో ప్రచురితమైన హెల్పేజ్ ఇండియా, పరిశోధన, అభివృద్ధి జర్నల్, వాల్: 5. నం. 2, 1999, పే.14.*

పై పట్టికను అనుసరించి 1950-55 సంవత్సరంలో ఉన్నటువంటి జననాల సంఖ్య (44.10), మరణాల సంఖ్య (25.00), శిశుమరణాలు (190) తరువాత కాలంలో గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. జననాలరేటు, మరణాల రేటులు జనాభా వృద్ధాప్యాన్ని నిర్ణయించడంలో ముఖ్యమైన కారకాలుగా చెప్పుకొనవచ్చు. జనన మరణాలలో వచ్చే మార్పులు వృద్ధాప్యంపై ప్రభావం చూపడమేకాకుండా, వృద్ధుల జీవన ప్రమాణాలపై ప్రభావాన్ని చూపిస్తాయి. జననాల సంఖ్యలో తగ్గుదలను వృద్ధులకు సహాయ సహకారాలను అందించేవారి సంఖ్యలో తగ్గుదలగా చెప్పుకోవచ్చు. చివరకు అది వృద్ధుల సామాజిక రక్షణ సమస్యగా మారుతుంది.

భారత దేశంలో మరణాల సంఖ్యను తగ్గించడంలో సాధించిన విప్లవాత్మక మార్పుల వలన, అన్ని రోగాలకు అవసరమైన మందులను కనుగొనడంద్వారా, అనేక సంక్షేమ కార్యక్రమాల ఫలితంగా వ్యక్తుల ఆయుఃప్రమాణ స్థాయి గణనీయంగా పెరిగిందని చెప్పవచ్చు.

**పట్టిక-3: భారతదేశ జనాభా ఆయుః ప్రమాణస్థాయి (ప్రణాళికలు), 1988.**

| లింగభేదం | సంవత్సరం | | | |
|---|---|---|---|---|
| | 1950-55 | 1990-95 | 2000-05 | 2020-25 |
| పురుషులు | 39.40 | 60.10 | 64.40 | 69.60 |
| స్త్రీలు | 38.00 | 60.70 | 65.90 | 73.60 |

***ఆధారం:*** *ప్రపంచ జనాభా అంచనాలు, ప్రణాళికలు 1950-2025. ఐక్యరాజ్యసమితి, న్యూయార్క్, 1988.*

BRAOU

పట్టిక-3 లో 1950 నుంచి 2025 సంవత్సరాలకు ప్రతీ ఐదు సంవత్సరాలకు పురుషులలో, స్త్రీలలో ఆయుః ప్రమాణస్థాయిలు ఎలా వున్నాయో తెలుసుకోవడానికి ప్రణాళికలు చేయబడినాయి. 1950-1995 సంవత్సరాల కాలంలో ఉన్నటువంటి పురుషుల ఆయుఃప్రమాణస్థాయి 2020-25 కాలంలో 69.60కి పెరిగింది. అదేవిధంగా 1950-55 సంవత్సరాల కాలంలో స్త్రీలలో వున్న 38.00 ఆయుః ప్రమాణస్థాయి 2020-25 సంవత్సరాల కాలంలో 73.60కి పెరిగింది.

ఆయుఃప్రమాణస్థాయి గణనీయంగా పెరగడం ఫలితంగా వివిధ రకాల వయస్సుల సమూహాల వారు అనేక ప్రభావాలకు గురవుతారు. ముఖ్యంగా 60+ వయస్సు వారి సంఖ్య విపరీతంగా పెరుగుతుంది. ఇప్పుడు భారతదేశంలోని వివిధ సమూహాలను పరిశీలిద్దాం.

**పట్టిక-4: వయసు, లింగ ప్రాతిపాదికన జనాభా ప్రణాళికలు**

| సంవత్సరం | వయస్సు సమూహాలు | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | 0-14 | 15-59 | 60+ | 0-14 | 15-59 | 60+ | 0-14 | 15-59 | 60+ |
| | మొత్తం | | | పురుషులు | | | స్త్రీలు | | |
| 1950 | 39.9 | 55.5 | 5.6 | 38.4 | 56.4 | 5.2 | 39.5 | 54.4 | 6.1 |
| 1960 | 39.8 | 54.5 | 5.7 | 39.8 | 54.6 | 5.6 | 39.7 | 54.5 | 5.8 |
| 1970 | 40.4 | 53.6 | 6.0 | 40.6 | 53.5 | 5.9 | 40.5 | 53.5 | 6.0 |
| 1980 | 38.5 | 54.9 | 6.6 | 38.6 | 55.0 | 6.4 | 38.5 | 54.9 | 6.6 |
| 1990 | 36.5 | 56.4 | 7.1 | 36.5 | 56.6 | 6.9 | 36.5 | 56.2 | 7.3 |
| 2000 | 34.5 | 57.7 | 7.8 | 34.5 | 58.1 | 7.4 | 34.5 | 57.3 | 8.2 |
| 2010 | 30.4 | 60.9 | 8.7 | 30.4 | 61.4 | 8.2 | 30.4 | 60.3 | 9.3 |
| 2020 | 25.1 | 64.0 | 10.9 | 25.1 | 64.5 | 10.4 | 25.1 | 63.5 | 11.4 |
| 2025 | 23.3 | 64.6 | 12.3 | 23.3 | 64.9 | 11.8 | 23.3 | 63.9 | 12.8 |

*ఆధారం: యునైటెడ్ నేషన్స్ ప్రపంచ అంచనాలు, ప్రణాళికలు (వయస్సు, లింగ ప్రాతిపాదికన) ప్రచురణ- హెల్పేజ్ ఇండియా, పరిశోధన, అభివృద్ధి జర్నల్, వాల్.5, నం. 2,1999. పేజీ .11*

BRAOU

పై పట్టిక (4) ప్రకారం 1950వ సంవత్సరం నుండి 2025వ సంవత్సరం వరకు మొత్తం జనాభాలోనూ, పురుషులలోనూ, స్త్రీలలోనూ కూడా 0-14 వయస్సువారి జనాభా తగ్గుతూ వుంది. దీనికి కారణం జననాల సంఖ్య తగ్గుదలగా చెప్పుకొనవచ్చును. అదేవిధంగా 15-59 మరియు 60+ వయస్సు వారి జనాభా గణనీయంగా పెరుగుతూవుంది. దీనికి మరణాల సంఖ్యలో తగ్గుదల, వ్యక్తుల జీవన ప్రమాణస్థాయి పెరగడాన్ని కారణాలుగా చెప్పుకొనవచ్చును. 60+ వయస్సు స్త్రీల, వృద్ధుల శాతం పురుషులకంటే ఎక్కువగా నమోదై అది భవిష్యత్‌లో కూడా వేగంగా పెరుగుతూవుంది.

60+ వయస్సు సమూహాల సంఖ్య పెరిగే కొలదీ వృద్ధుల శాతం, వారి ఆధారపూరిత నిష్పత్తి కూడా పెరుగుతూ వుందని చెప్పవచ్చు. భారతదేశంలో ఈ వయో వృద్ధుల ఆధారపూరిత నిష్పత్తి 1961 నుండి 2016 సంవత్సరం వరకు

పురుషులలోనూ, స్త్రీలలోనూ ఏవిధంగా పెరుగుతున్నదో ఈ క్రింద ఇవ్వబడిన పట్టికలో పరిశీలిద్దాం.

**పట్టిక-5: భారతదేశ వయో వృద్ధుల ఆధారపూరిత నిష్పత్తి**

| సంవత్సరం | మొత్తం | పురుషులు | స్త్రీలు |
|---|---|---|---|
| 1961 | 10.93 | 10.91 | 10.94 |
| 1971 | 11.47 | 11.39 | 11.57 |
| 1981 | 12.04 | 11.84 | 12.24 |
| 1991 | 12.26 | 12.16 | 12.23 |
| 1996 | 12.00 | 11.99 | 12.02 |
| 2001 | 11.88 | 11.72 | 12.05 |
| 2011 | 12.84 | 12.67 | 13.01 |
| 2016 | 14.12 | 13.94 | 14.31 |

***ఆధారం:*** *భారతదేశ జనాభాలెక్కలు, 1991.*

BRAOU

పై పట్టిక (5) ప్రకారం భారతదేశంలోని వయో వృద్ధుల ఆధారపూరిత నిష్పత్తి 1961 సంవత్సరంనుండి 2016 వరకు పరిశీలించినట్టయితే పురుషులు, స్త్రీల వయోవృద్ధుల ఆధారపూరిత నిష్పత్తి పెరుగుతూ వున్నది. దీనికి కారణం వయస్సు పైబడే కొలదీ ఆదాయ మార్గాలేమీ లేక అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ సంతానం మీదా లేక ఇతరుల మీద ఆధారపడి జీవిస్తారు.

ఇప్పుడు వయోవృద్ధుల ఆర్థికపరమైన స్వతంత్ర, ఆధారపూరితమైన శాతమును పరిశీలిద్దాం.

కింది పట్టిక (6)ను పరిశీలించినట్టయితే 51 శాతం గ్రామీణ ప్రాంతాలలోను 45 శాతం పట్టణ ప్రాంతాలలోని వృద్ధులు ఆర్థిక పరంగా ఆధారపడి జీవిస్తున్నారని చెప్పవచ్చును. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సుమారు 71 శాతం వయోవృద్ధుల ఆధారపూరిత భారాన్ని పెంచడం జరుగుతుంది. ఆయుఃప్రమాణాలు పెరిగే కొలదీ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వృద్ధులు ఇతరుల మీద ఆధారపడేవారి శాతం పెరుగుతుందని చెప్పవచ్చు.

**పట్టిక-6: భారతదేశ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ఆర్థికపరమైన స్వతంత్రుల, పూర్తిగా ఆధారపూరితమైన వయోవృద్ధుల శాతం. 1996**

| | స్వతంత్రమైన | | పూర్తిగా ఆధారపూరితమైన | | స్వతంత్రమైన వ్యక్తులు ఆధారపూరితమైన భారాన్ని పంచే శాతం | |
|---|---|---|---|---|---|---|
| రాష్ట్రం | | | | | | |
| | గ్రామీణ | పట్టణ | గ్రామీణ | పట్టణ | గ్రామీణ | పట్టణ |
| భారతదేశం | 51.1 | 45.7 | 32.7 | 37.4 | 0.7 | 71.6 |
| ఆంధ్రప్రదేశ్ | 54.4 | 50.7 | 34.4 | 35.3 | 74.9 | 72.0 |
| అస్సాం | 35.2 | 35.6 | 43.9 | 42.0 | 88.1 | 83.8 |
| బీహార్ | 47.9 | 45.6 | 32.6 | 38.9 | 63.6 | 70.3 |
| గుజరాత్ | 43.1 | 38.2 | 49.1 | 46.8 | 65.2 | 57.6 |
| హర్యానా | 43.5 | 39.4 | 48.3 | 44.1 | 82.3 | 76.0 |
| హిమాచల్ ప్రదేశ్ | 59.4 | 59.9 | 25.1 | 28.6 | 68.4 | 58.7 |
| జమ్మూకాశ్మీర్ | 59.3 | 53.0 | 24.0 | 28.0 | 77.3 | 80.4 |
| కర్ణాటక | 46.3 | 42.0 | 46.0 | 38.3 | 57.4 | 77.9 |
| కేరళ | 46.3 | 39.9 | 41.0 | 46.8 | 78.2 | 79.4 |
| మధ్యప్రదేశ్ | 55.5 | 49.6 | 31.1 | 33.9 | 67.2 | 69.8 |
| మహారాష్ట్ర | 47.4 | 43.6 | 31.3 | 32.7 | 63.7 | 66.4 |
| ఒరిస్సా | 42.6 | 33.4 | 37.5 | 39.2 | 64.3 | 61.5 |
| పంజాబు | 48.2 | 48.6 | 42.3 | 41.8 | 78.8 | 71.1 |
| రాజస్థాన్ | 41.3 | 41.7 | 38.8 | 37.2 | 62.3 | 61.3 |
| తమిళనాడు | 50.3 | 44.7 | 31.1 | 32.7 | 70.4 | 73.7 |
| ఉత్తరప్రదేశ్ | 55.1 | 51.6 | 27.2 | 34.6 | 65.6 | 73.7 |
| పశ్చిమబెంగాల్ | 44.1 | 50.0 | 39.7 | 35.7 | 76.2 | 79.5 |

BRAOU

**ఆధారం:** *కౌముదిని దండేకర్ (1996). ప్రచురణ-హెల్పేజ్ ఇండియా, పరిశోధన, అభివృద్ధి జర్నల్ వాల్.5 నం.2, 1999 పేజీ. 16*

## 8.4 వృద్ధాప్యం- అపోహలు

వృద్ధాప్యానికి సంబంధించిన అపోహలు సమాజంలో వృద్ధులపట్ల వ్యతిరేక వైఖరులను పెంపొందింపజేయడమే కాకుండా వృద్ధులలో తమ గురించి, తమ శక్తి సామర్థ్యాల గురించి న్యూనతాభావాన్ని అభివృద్ధి చేస్తాయి. సాంఘికీకరణ ప్రక్రియ ద్వారా ఒక తరం నుండి మరొక తరానికి సాంస్కృతిక విలువలు, కట్టుబాట్లు, వయస్సుకు సంబంధించిన నిర్బంధాలు రూపాంతరం చెందుతాయి. ఆధునిక కాలంలో వృద్ధాప్య భావన చాలా ప్రాచుర్యాన్ని పొందింది. అదేవిధంగా విలువలు కనుమరుగవుతూ, ప్రేమ, అభిమానం, ఆప్యాయతలకు స్థానం లేక వ్యక్తుల గుండె గదులు ఇరుకవుతున్న నేటి సమాజంలో వృద్ధులు అనేక సమస్యలకు గురవుతుండడమే కాకుండా, వృద్ధాప్యానికి సంబంధించి కొన్ని కల్పిత భావనలు కూడా సమాజంలో ప్రజల మనస్సులలో గూడుకట్టుకుపోతున్నాయి. ఇప్పుడు వృద్ధాప్యానికి సంబంధించిన కొన్ని అపోహలను పరిశీలిద్దాం.

### 8.4.1 సామాజికపరమైన అపోహ

సమాజంలోని సభ్యులంతా వృద్ధులను చిన్నచూపుతో చూడడం వలన, వయసు పైబడే కొద్దీ వృద్ధులలో అన్ని శక్తులు నశిస్తాయని సమాజం అపోహపడి వారిని అవిధంగా చూడడం వలన వృద్ధులలో కూడా అలాంటి అపోహలు పెంపొంది వారి శక్తి సామర్థ్యాలపై నమ్మకం సన్నగిల్లుతుంది. ఫలితంగా అనేక సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనలేక, చేయదగిన పనులు కూడా సక్రమంగా చేయలేక సమాజంలో వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారు. చివరకు ఈ అపోహలు సమాజంలో వృద్ధులకున్నటువంటి అంతస్తును కూడా తగ్గింపజేస్తున్నాయని చెప్పవచ్చును.

### 8.4.2 ఆర్థికపరమైన అపోహలు

వృద్ధులలో ఎక్కువమంది పేదరికంతో బాధపడుతూ ఇతరులమీద అధారపడుతున్నారని చెప్పడం సత్యదూరం కాదు. వృద్ధాప్యంలోని ముఖ్య సమస్య వారి అవసరాలను తీర్చుకోవడానికి తగిన ఆదాయం లేకపోవడం. దీనికి కారణాలు అనేకమున్నా సమాజంలోని వ్యక్తుల మనస్సులలో గూడుకట్టుకుపోయిన ఆర్థికపరమైన అపోహలను ఒక ముఖ్య కారణంగా చెప్పుకొనవచ్చు. సమాజంలోని వృద్ధులు అనేక శారీరకమైన సమస్యలు, మానసిక రుగ్మతలు, బలహీనత, మొదలగు సమస్యలతో బాధపడుతుండడం వలన వృద్ధాప్యంలో వారు ఎలాంటి పనులు చేయలేరు అన్న అపోహ సమాజంలో ప్రతీ ఒక్కరిలోనూ ఉన్నది. దీని ఫలితంగానే వృద్ధులు తమకు చేయదగిన శక్తి సామర్థ్యాలు వున్నా 60 సంవత్సరాలు దాటిన తరువాత పదవీ విరమణ చేయవలసి వస్తున్నది. ఈ విధమైన అపోహలు వృద్ధులలో పేదరికాన్ని, నిరుద్యోగాన్ని పెంచి మరెన్నో సమస్యలకు దారితీస్తున్నాయి.

### 8.4.3 ఆరోగ్యపరమైన అపోహ

కొంతమంది వృద్ధాప్యాన్ని రుగ్మతకు మారుపేరుగా ఉపయోగిస్తుంటారు. సమాజంలోని వృద్ధులు వారి వయస్సు పైబడే కొద్దీ వారు అనేక రుగ్మతలకు లోనవుతారు. అది సహజమే అన్న నానుడి ప్రతీ ఒక్కరిలోనూ వుంది. సాధారణంగా వయస్సు పైబడే కొద్దీ వారిలో వ్యాధి నిరోదకశక్తి తగ్గడం, సమాజం చిన్న చూపు చూడడం, గౌరవ మర్యాదలు కోల్పోవడం, ప్రేమ ఆప్యాయతలను కోల్పోయిన వృద్ధులు శారీరక రుగ్మతలకు గురవుతారు. కానీ వృద్ధాప్యంలో అడుగుపెట్టడం వల్లనే వారు అనేక రుగ్మతలకు లోనవుతారు అన్న అపోహ వృద్ధులను చిన్న చూపు చూడడానికి దారితీస్తుంది. ఈ అపోహ వలన రుగ్మతలు మరింత జటిలమయ్యే అవకాశం వుంటుంది.

### 8.4.4 లైంగికపరమైన అపోహ

వృద్ధాప్యానికి చేరిన అడవారు, మగవారిలో (ఆడవారికి మోనోపాజ్ తరువాత మగవారికి 60 సంవత్సరాలు నిండిన తరువాత) సహజంగా లైంగిక పరమైన ఆసక్తులు, శక్తి తగ్గిపోతాయని అపోహ. సమాజంలో ఈ అపోహలు బలీయమైనకొద్దీ వృద్ధులు కూడా తమ శక్తి సామర్థ్యాలపై నమ్మకం సన్నగిల్లి తమ లైంగిక చర్యలను సక్రమంగా నిర్వర్తించలేక ఆత్మ న్యూనతాభావానికి గురవుతారు.

BRAOU

### 8.4.5 మానసికపరమైన అపోహ

వయస్సు పైబడే కొద్దీ వృద్ధులు యువకులకన్నా మానసిక శక్తి సామర్థ్యాలు కోల్పోతారని, ఆలోచించే శక్తి క్షీణిస్తుందని, వారి ప్రజ్ఞాపాటవాలు తగ్గుతాయన్న కల్పితభావనే మానసిక పరమైన అపోహ. ఈ విధమైన అపోహ సమాజంలో బలపడేకొద్దీ వృద్ధులలో మానసిక శక్తి సామర్థ్యాలు సన్నగిల్లుతాయని చెప్పవచ్చును. అంతేకాకుండా సమాజంలో ఎక్కువ మందిలో ఈ అపోహ వుండటం వలన దాని ప్రభావం వృద్ధులపై వ్యతిరేకంగా వుంటుంది.

## 8.5 ముగింపు

పారిశ్రామికీకరణం, ఆధునికీకరణం, ముందంజ వేస్తున్నకొద్దీ మనిషి ఆర్థిక అవసరాలు కూడా పెరిగాయి. ఆధునిక సమాజంలో విలువలు కనుమరుగై, మానవత లోపించి, నగరవాసంలో ఇరుకుగదుల వాసంవలె సమాజంలోని వ్యక్తుల గుండెగదులు ఇరుకై వృద్ధాప్యం ఒక శాపంలాగా మారిపోయింది. తల్లిదండ్రులకు, బిడ్డలకు పొసగని లోకంలో, ఆర్థిక సంబంధాలే సామాజిక సంబంధాలను, అనుబంధాలను శాసిస్తున్న నేపథ్యంలో కన్న మమకారాన్ని కాదు పొమ్మనే ప్రబుద్ధులు పెరుగుతుండడం వలన వృద్ధులకు కాటికి కాళ్లు చాచుకుని చావుకోసం ఎదురుచేసే దురవస్థ ఏర్పడింది. వృద్ధాప్యంలో సామాజిక అపోహలు కూడా ఏర్పడి వారి శక్తి సామర్థ్యాలు సన్నగిల్లుతున్నాయి.

## 8.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి?**

1. ఆధునిక సమాజంలో వృద్ధాప్యం గురించి వివరించండి?
2. వృద్ధాప్యం గురించి అపోహలేవి? వాటిని విపులీకరించండి?
3. వృద్ధులలో అపోహలకు దారితీసే పరిస్థితులు ఏమిటి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. లైంగిక అపోహలను క్లుప్తంగా పేర్కొండి?
2. ఆధునిక సమాజాల్లో వృద్ధాప్యం క్లుప్తంగా రాయండి?
3. ఆధునిక కాలంలో బలహీనవర్గాల గురించి రాయండి?

## 8.7 చదవదగిన పుస్తకాలు

1. బలహీనవర్గాలు- సామాజిక పునర్నిర్మాణం- తెలుగు అకాడెమీ, మోనోగ్రాఫ్, 115- సమాజశాస్త్రం.

2. National Journal of Professional Social Work, Vol.2, No. 1-2, January-Devember2001.

BRAOU

# భాగం-9: భారతదేశంలో వృద్ధాప్యం

విషయక్రమం


9.0 ఉద్దేశాలు

9.1 పరిచయం

9.2 భారతదేశంలో వృద్ధాప్యం-లక్షణాలు, సమస్యలు

9.3 భారతదేశంలో వృద్ధాప్య పరిస్థితులు

9.4 రాజ్యాంగపరమైన నిబంధనలు, శాసనపూర్వకమైన చర్యలు

9.4.1 సంక్షేమపథకాలు-సంఘటితరంగం

9.4.2 సంక్షేమపథకాలు

9.5 వయోవృద్ధులు-జాతీయవిధానం

9.6 సారాంశం

9.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

9.8 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 9.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివినతరువాత మీరు

- మీరు వృద్ధాప్య లక్షణాలను, సమస్యలను వివరించగలరు.
- వృద్ధుల సంక్షేమ పథకాలను గురించి తెలియజేయగలరు.
- భారతదేశంలో వృద్ధుల జాతీయ విధానం గురించి వివరించగలరు.

## 9.1 పరిచయం

భారతదేశంలో వృద్ధాప్య సమస్య ఇటీవలికాంలో ఉద్భవించింది అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన, ఏర్పడుతున్న పరిస్థితుల దృష్ట్యా అది తీవ్ర సమస్యగా రూపొందుతున్నదనడంలో సందేహంలేదు. వయస్సు మళ్లినవారికి వేరే సంఘాలు ఏర్పరుస్తున్నారు. గృహాలు నిర్మిస్తున్నారు. కానీ ఈ సమస్యను ఇవి పరిష్కరించలేవు. వయస్సు మళ్లినవారు కుటుంబంలో వుండటానికి, అందరితో కలిసి మెలసి బతకడానికి, అనువైన కార్యక్రమాలు చేపట్టాలి. కొన్ని ప్రత్యేక పనులు వీరికి కేటాయించాలి. సొరోకిన్ వివరించినట్లు 'విషయక సంస్కృతి ప్రాబల్యం వహించకుండా జాగ్రత్తపడడం ఒక్కటే వృద్ధుల సమస్యను కొంతవరకు నిర్మూలించగలదు. టోఫ్లర్ పేర్కొన్నట్లు తొలగింపు సంస్కృతి మనల్ని మరమనుషులుగా మారుస్తుంది. అంటే పెద్దల కాలంనాటి సంస్కృతి వుండాలని కాదు. సమష్టి కుటుంబాలే శరణ్యమని కూడా కాదు. కానీ ప్రేమ, అభిమానం, మానవసేవ, సహనం అనే విలువలను కుటుంబాలు కోల్పోకూడదు. ఈ విలువల్ని కుటుంబాలు కలిగి వున్నత వరకు వృద్ధుల సంక్షేమానికి ఏ సమస్యా వుండదు.

## 9.2 భారతదేశంలో వృద్ధాప్యం-లక్షణాలు, సమస్యలు

2020 నాటికి ప్రపంచ జనాభాలో సుమారు 30 శాతం వృద్ధులదే అవుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల వెల్లడించింది. పాశ్చాత్య దేశాల్లోని కుటుంబాల్లో వృద్ధులకు దాదాపు స్థానమే కరువైంది. భారతదేశంలో కూడా ప్రస్తుతం ఈ పరిస్థితి ఉత్పన్నమవుతోంది. తమను కని, పెంచి, కష్టసుఖాలలో వెన్నంటి వుండి, మార్గదర్శకంగా నిలిచిన వృద్ధులైన వారిని ఎక్కడో వదిలివేయడం అమానుషత్వం. అయితే, ఉద్యోగాల నిమిత్తం విదేశాలకు తరలిపోయినవారు మాత్రం తమ తల్లిదండ్రులను వృద్ధుల శరణాలయాలలో వదిలివేస్తున్నారు. వృద్ధుల శరణాలయాలు ప్రస్తుతం ధనిక, ఎగువ మధ్యతగతి వర్గాలకే ఎక్కువగా అనుకూలంగా వుంటున్నాయి. పేద, దిగువ మధ్యతరగతి వృద్ధుల పట్ల కూడా ప్రభుత్వ సేవా సంస్థలు, సమాజం మానవత్వంతో స్పందించి చేరదీయాలి. వృద్ధాప్య లక్షణాలు వారి సమస్యలు సమాజానికి సమాజానికి మార్పు చెందుతూ ఉంటాయి. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చినప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశాలలో ముఖ్యంగా భారతదేశంలో వృద్ధాప్య లక్షణాలు సమస్యలు వేరుగా వుండవచ్చు. ఇప్పుడు భారతదేశంలోని వృద్ధాప్య లక్షణాలను, సమస్యలను కొన్నింటిని పరిశీలిద్దాం.

### 1. వయస్సు

సుమారు 60 సంవత్సరాల వయస్సు వచ్చే సరికి వృద్ధాప్యం వస్తున్నదని సమాజం గుర్తింస్తుంది. పనినుండి తొలగించడం లేదా పని అప్పగించడానికి ఇష్టపడకపోవడం జరుగుతుంది. బాధ్యతలు భయపెడుతుంటాయి. కుటుంబ పోషణ కష్టంగా తోచి చిరాకు, అసౌకర్యం పెరిగి తనకుతానే ఒక సమస్యగా భావించుకుంటారు.

### 2. శారీరక బలహీనత

చూపు తగ్గిపోవడం, జ్ఞాపకశక్తి తగ్గుతున్నట్లు భావించడం, రూపంలో మార్పు రావడం జరుగుతుంది. వీటివలన కొన్ని సందర్భాలలో ఇతరులపై ఆధారపడవలసి వస్తుంది. ఇతరులకు బరువుకావడం, వారికి అసౌకర్యం కలిగించడం, ఎంత చేసినా చివరకు సంతృప్తి లేకపోవడం వృద్ధాప్యంలో సాధారణంగా జరిగేవిషయాలు. ఇటువంటి కారణాల వలన వయస్సుపైబడుతున్న కొద్దీ ఒక భయం ప్రారంభమవుతుంది.

BRAOU

### 3. సాంఘిక-మానసిక ఫలితాలు

సాంఘిక, సాంస్కృతిక, మానసిక ఫలితాలు నేడు వృద్ధాప్యాన్ని ఒక సమస్యగా మార్చాయి.

### ఎ) పేదరికం

ఆదాయం లేకపోవడం లేదా తగ్గడం వృద్ధాప్యంలో జరుగుతుంది. దీనితో కుటుంబం అనేక ఒడిదుడుకులకు గురికాక తప్పదు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, అమ్మాయిల పెళ్లిళ్లు సమస్యగా మారుతాయి. వినియోగస్థాయి పడిపోతుంది. పూర్వపు స్థాయిలో కుటుంబం నివసించలేక తక్కువ అద్దె ఇంటికి మారడం, రాకపోకలు తగ్గించుకోవడం జరుగుతుంది.

### బి) ఆధారపడడం

ఇది కొంత వరకు ఆర్థిక పరిస్థితి అయితే మరికొంత సామాజిక మానసిక స్థితి. తన స్వంత ఆదాయంలో తను హాయిగా బ్రతికే వ్యక్తి. ఇతరుల దగ్గర చేయిచాచే పరిస్థితి ఏర్పడిందని బాధపడుతుంటాడు. చిన్న చూపు చూడడం జరుగుతుంది. తక్కువగా చూస్తున్నారనే బాధ, భయం ఏర్పడుతాయి.

### సి) ఆరోగ్య సమస్య

వయస్సు పెరగడంతో రోగనిరోధకశక్తి తగ్గుతుంది. దీనికి తోడు పౌష్టికాహారం లోపించినా, మానసిక ఒత్తిడులెక్కువ

అయినా ఆరోగ్య పరిస్థితి ఇంకా దెబ్బతింటుంది. ఈ సమయంలో జాగ్రత్తగా చూసేవారు, చేసేవారు అవసరమవుతారు. ఈ అవసరం తీరకపోతే వృద్ధాప్యం ఒక సమస్య అవుతుంది.

### డి) మానసిక సమస్యలు

పైకారణాల వలన మానసికపరమైన సమస్యలు ఏర్పడతాయి. ఊహించినదైనా నిజమైనదైనా 'భయం' వృద్ధునికి ఏర్పడినప్పుడు అతను మానసిక రోగిగా మరతాడు. శక్తిహీనత, అర్థరాహిత్యం, ఒంటరిననే భావన, నిరాశ ఇవన్నీ మానసిక ఫలితాలు.

## 9.3 భారతదేశంలో వృద్ధాప్య పరిస్థితులు

వివిధ దేశలలో ప్రపంచ జనాభావలే ఇండియాలోనూ తారతమ్యాలున్నాయి. క్రీ.పూ. 300 నుండి క్రీ.శ. 1850 వరకు ఇండియా జనాభా స్థిరంగా ఉండేది. ఆతరువాత 1920 వరకు స్వల్ప మార్పులతో జనాభా పెరిగింది. ఇండియా జనాభాలో 1921 తరువాత 1971 వరకు విపరీతమైన పెరుగుదల కనిపించింది. 1971 -2001 మధ్య జనాభా తగ్గుముఖం పట్టింది. 1872లో ప్రప్రథమంగా భారతదేశంలో జనాభా లెక్కల సేకరణ జరిగింది. తరువాత ప్రతీ పదేళ్లకొకసారి జనాభా లెక్కలు సేకరించారు. అంతకు పూర్వం పురావస్తు, చారిత్రక, సాహిత్య వర్ణనల ఆధారంగా జనాభా అంచనాలుండేవి. హరప్పా, మొహంజోదారో తవ్వకాలలో క్రీ. పూ. నాలుగు వేల సంవత్సరాలనాడే ఇండియాలో స్థిరపడి ముమ్మరంగా జనాభా గల నగరాలుండేవని రుజువైంది.

ప్రస్తుతం ప్రపంచ జనాభాలో చైనా తరువాత స్థానాన్ని ఇండియా ఆక్రమించింది. ప్రస్తుతం భారతదేశ జనాభా 100 కోట్లను అధిగమించింది. భారతదేశంలో మొత్తం జనాభాతోపాటు వయోవృద్ధుల సంఖ్య కూడా వేగంగా పెరిగిపోతూ వుంది. వయో వృద్ధుల సంఖ్య ఇంతవేగంగా పెరుగుతుండటానికి ఆయుఃప్రమాణాలు పెరుగుతుండటం ప్రధాన కారణం కాగా, ఇది పెద్ద సామాజిక సమస్యగా పరిణమిస్తుండడానికి ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై వ్యష్టి కుటుంబాల సంఖ్య పెరిగిపోతుండటం ముఖ్యకారణంగా చెప్పుకొనవచ్చు. 20వ శతాబ్దం ఆరంభంలో దేశంలో సగటు ఆయుఃప్రమాణం 20 సంవత్సరాలు ఉండేది. అప్పట్లో 60 ఏళ్ళకు పైబడ్డవారి సంఖ్య 1.2 కోట్లు ఉంది. దీనితో పోలిస్తే దేశంలో నేడు సగటు ఆయుఃప్రమాణం 65 సంవత్సరాలు ఉంది. పైగా, వీరిలో చాలామంది వృద్ధులకు ఆర్థికంగా గానీ, వైద్యపరంగా కానీ, ఎటువంటి ఆధారం లేదు. సామాజిక విలువల్లో గణనీయమైన మార్పులు వస్తుండటంతో రెండు, మూడు తరాలవారు తమ తల్లిదండ్రులను, తాత ముత్తాతలను ముసలితనంలో కంటికి రెప్పలా కాపాడుకునే పరిస్థితి నానాటికీ కనుమరుగుపుతోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్‌లో భారతదేశంలో వృద్ధుల సంఖ్య పెద్ద సామాజిక సమస్యగా పరిణమించడం తథ్యమని భావించవచ్చు. ఉమ్మడి కుటుంబం ఒక పురాతన భావనగా మారిపోతూ చిన్న చిన్న కుటుంబాల పట్ల వ్యామోహం పెరిగిపోతుండడంతో వృద్ధులను ఆదరించేవాళ్లు లేక పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. ఇప్పుడు భారత దేశంలో వృద్ధాప్య సమస్య తీవ్రత గురించి పరిశీలిద్దాం.

క్రింది పట్టిక ప్రకారం భారతదేశంలో వయోవృద్ధుల సంఖ్య విపరీతంగా పెరుగుతూవుందని చెప్పవచ్చును. 1901వ సంవత్సరంలో భారతదేశంలో 12.06 మిలియన్‌లు ఉన్నటువంటి వయోవృద్ధుల సంఖ్య 2001 నాటికి 75.95 మిలియన్‌లకు అనగా 6 రెట్లకు పెరిగింది. అదేవిధంగా 1901 వ సంవత్సరంలో మొత్తం జనాభాలో వయోవృద్ధుల శాతం 5.06 కాగా, అది 2001లో 7.70 శాతానికి పెరిగింది. మొత్తం జనాభాలో స్త్రీ, పురుష వయోవృద్ధుల శాతాలు పరిశీలించినట్టయితే స్త్రీలశాతం పురుషుల శాతాలు పెరుగతున్నాయి. ముఖ్యంగా స్త్రీ వయో వృద్ధుల శాతం పురుషుల వయో వృద్ధుల శాతం కంటే ఎక్కువగా వుండటం విశేషం. దీనికి కారణం స్త్రీలకు, పురుషులకంటే ఆయుఃప్రమాణశక్తి ఎక్కువగా వుంటడం. వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా వుండడం, జైవికపరమైన సామర్థ్యం ఎక్కువగా వుండటంగా చెప్పవచ్చు.

BRAOU

పట్టిక 1: భారతదేశంలో మొత్తం జనాభాలో వయో వృద్ధుల శాతం 1901-2001

| సంవత్సరం | వయోవృద్ధుల జనాభా | మొత్తం జనాభాలో వయోవృద్ధుల శాతం | మొత్తం జనాభాలో పురుషుల వయో వృద్ధుల శాతం | మొత్తం జనాభాలో స్త్రీ వయోవృద్ధుల శాతం |
|---|---|---|---|---|
| 1901 | 12.06 | 5.06 | 4.55 | 5.59 |
| 1911 | 12.17 | 5.22 | 4.81 | 5.65 |
| 1921 | 13.48 | 5.37 | 5.04 | 5.70 |
| 1931 | 14.21 | 5.09 | 4.86 | 5.35 |
| 1941 | 18.04 | 5.06 | 5.43 | 5.91 |
| 1951 | 19.61 | 5.43 | 5.21 | 5.66 |
| 1961 | 24.17 | 5.63 | 5.46 | 5.80 |
| 1971 | 32.70 | 5.79 | 5.94 | 5.99 |
| 1981 | 43.93 | 6.42 | 6.35 | 6.50 |
| 1991 | 55.30 | 6.75 | 6.45 | 6.60 |
| 2001 | 75.93 | 7.70 | 7.55 | 7.86 |

**ఆధారం:** *ఎస్.పి.శర్మ, గ్జెనాస్‌పీటర్ (1992), 'భారతదేశంలో వృద్ధాప్యం' గ్రంథం.*

*S.P.Sharma and Xenos Peter (1992), Aging in India, Demographic background and Analysis based on census materials, occassional paper. P. 2, Census of India.*

BRAOU

పైన పేర్కొన్న విధంగా వయో వృద్ధుల సంఖ్య ఇప్పటివరకు ఎక్కువగా ఉండడమే కాకుండా అది భవిష్యత్‌లో కూడా శరవేగంగా పెరిగి కుటుంబంలో కష్టపడి పనిచేసి సంపాదించేవారిపై ఆధారపడి జీవించేవారు (వృద్ధులు, చిన్నపిల్లలు) పెరగడానికి దోహదం చేస్తుంది. ఈ విధంగా భారతదేశంలో వేగంగా పెరిగిపోతున్న వయోవృద్ధుల నిష్పత్తిని "వయోవృద్ధుల విస్ఫోటనం"గా చెప్పవచ్చు.

ఇప్పుడు వృద్ధాప్యాన్ని మరొక కోణంలో వారి నివాసం లింగభేదం ఆధారంగా పరిశీలిద్దాం.

పట్టిక-2: నివాస, లింగభేదం ఆధారంగా భారతదేశ వయోవృద్ధుల శాతం-1992.

| నివాసం | లింగభేదం | వృద్ధులశాతం |
|---|---|---|
| గ్రామీణ ప్రాంతం | మొత్తం | 6.3 |
| | పురుషులు | 6.0 |
| | స్త్రీలు | 6.6 |
| పట్టణ ప్రాంతం | మొత్తం | 5.4 |
| | పురుషులు | 5.3 |
| | స్త్రీలు | 5.4 |

*ఆధారం: శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్. ఫెర్టిలిటి, మోర్టాలిటీ సూచికలు, 1992, భారత రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం. హోం మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ.*

పై పట్టిక (2)ను పరిశీలించినట్టయితే గ్రామీణ ప్రాంతాలలోనూ, పట్టణ ప్రాంతాలలోనూ నివసించే వయో వృద్ధులలో స్త్రీలు పురుషులకంటే ఎక్కువగా ఉండడం విశేషం.

**పట్టిక-3: వివాహ అంతస్తు ఆధారంగా భారతదేశ వివిధ వయస్సు సమూహాల శాతం, 1992.**

| | అవివాహితులు | | | వివాహితులు | | | వైధవ్యం పొందిన/విడాకులు పొందినవారు/విడిపోయినవారు | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| వయస్సు సమూహం | వ్యక్తి | పురుషులు | స్త్రీలు | వ్యక్తి | పురుషులు | స్త్రీలు | వ్యక్తి | పురుషులు | స్త్రీలు |
| గ్రామీణప్రాంతం | | | | | | | | | |
| అన్ని వయసులవారు | 50.5 | 55.0 | 45.7 | 44.1 | 42.2 | 46.2 | 5.4 | 2.8 | 8.2 |
| 50+ | 0.6 | 1.0 | 0.2 | 69.4 | 83.5 | 55.3 | 30.0 | 15.5 | 44.4 |
| 60+ | 50.5 | 55.0 | 45.1 | 50.5 | 55.0 | 45.1 | 50.5 | 55.0 | 45.1 |
| పట్టణ ప్రాంతం | | | | | | | | | |
| అన్ని వయసులవారు | 52.1 | 56.1 | 47.7 | 43.1 | 42.1 | 44.2 | 4.8 | 1.8 | 8.2 |
| 50+ | 0.9 | 1.2 | 0.6 | 69.6 | 87.6 | 50.7 | 29.5 | 11.2 | 48.7 |
| 60+ | 0.7 | 1.1 | 0.4 | 56.2 | 80.7 | 33.1 | 43.1 | 18.2 | 66.4 |

ఆధారం: శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్, జననాలు, మరణాలు సూచికలు, 1992. భారత రిజిస్ట్రేషన్ జనరల్ కార్యాలయం, హోం మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ.

BRAOU

పైన ఇచ్చిన పట్టికను చూసినట్టయితే గ్రామీణ ప్రాంతాలలో, పట్టణ ప్రాంతాలలో అవివాహితులలో పురుషుల సంఖ్య స్త్రీల సంఖ్య కంటే ఎక్కువగా నమోదైంది. వైధవ్యం పొందిన/విడాకులు పొందిన/విడిపోయిన వారి కేటగిరీని పరిశీలించినట్టయితే గ్రామీణ ప్రాంతాలలో పట్టణ ప్రాంతాలలో స్త్రీ వయో వృద్ధులు పురుష వయోవృద్ధులకంటే ఎక్కువగా వున్నారు. వైధవ్యం పొందిన, విడాకులు తీసుకున్న, విడిపోయినవారి కేటగిరీలో పురుషులకంటే స్త్రీలశాతం ఎక్కువగా వుండటానికి ముఖ్యంగా రెండుకారణాలను చెప్పుకోవచ్చు. మొదటిది, భారతీయ పితృస్వామిక వ్యవస్థలో స్త్రీలకంటే పురుషులకు ఎక్కువగా పునర్వివాహాలు జరుగటానికి అవకాశం వుంటుంది. రెండవది, భారతీయ వివాహ వ్యవస్థలో పురుషులకంటే స్త్రీల వయస్సు తప్పనిసరిగా తక్కువగా వుంటుంది. స్త్రీ వయోవృద్ధులు వృద్ధాప్యంలో అడుగుపెట్టేసమయానికి వారి భర్తలు అప్పటికే వృద్ధాప్యంలో వుండి చివరకు చనిపోవడంకూడా జరుగుతుంది. ఈ విధంగా పురుషులతో పోల్చినప్పుడు స్త్రీలు ఎక్కువగా వైధవ్యం పొందినవారిలో వుండటానికి స్త్రీల వివాహ వయస్సు పురుషులకంటే తక్కువగా వుండడం ముఖ్యకారణంగా చెప్పుకోవచ్చు. ఈ కేటగిరిలోని స్త్రీలు సమాజంలో తక్కువ అంతస్తు కలిగివుండి, చిన్నచూపునకు గురవుతూ, ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ ఇతరులమీద ఆధారపడి జీవిస్తారు.

## పనిభాగస్వామ్యం

భారతేశంలో జరుగుతున్న పారిశ్రామికీకరణ, నగరీకరణ, ఆధునికీకరణ ప్రక్రియలు సమాజ నిర్మాణంలోని మార్పులకు దోహదం చేస్తూ చివరకు అవి వయోవృద్ధుల సంక్షేమంపై కూడా వ్యతిరేక ప్రభావాన్ని కలిగిస్తున్నాయని చెప్పవచ్చును. వయస్సు పెరిగేకొద్దీ వృద్ధుల క్షీణిస్తున్న ఆరోగ్యం, ఆదాయం మరెన్నో సామాజిక, మానసిక సమస్యలకు దారితీస్తున్నాయి. హిందూ సమాజంలో మానవ జీవితాన్ని నాలుగు దశలలో అనగా బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం,

వానప్రస్థాశ్రమం, సన్యాసాశ్రమంగా అభివృద్ధి చెందుతుంది. వానప్రస్థాశ్రమాన్ని సన్యాసాశ్రమాన్ని పొందుటకు సన్నద్ధమయ్యే దశగా చెప్పుకోవచ్చును. అయితే సాంప్రదాయక సమాజంలో వున్న వృద్ధుల సమస్యలు నేటి అధునిక సమాజంలోని వృద్ధుల సమస్యలకంటే చాలా తక్కువగా వున్నాయని చెప్పవచ్చు.

**పట్టిక-4: భారత వయోవృద్ధుల పనిలో పాల్గొనే రేటు, 1991**

| వయస్సు సమూహం | మొత్తం | | | గ్రామీణ | | | పట్టణ | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | మొత్తం | పురుషులు | స్త్రీలు | మొత్తం | పురుషులు | స్త్రీలు | మొత్తం | పురుషులు | స్త్రీలు |
| 60+ | 39.1 | 60.5 | 16.1 | 43.1 | 65.4 | 19.0 | 25.0 | 42.9 | 6.3 |
| 60-69 | 46.9 | 71.4 | 20.8 | 51.7 | 77.1 | 24.4 | 30.0 | 50.7 | 8.0 |
| 70-79 | 28.8 | 47.0 | 9.2 | 31.9 | 51.2 | 10.8 | 17.8 | 31.3 | 3.7 |
| 80+ | 19.3 | 31.7 | 5.7 | 20.9 | 33.5 | 6.7 | 13.4 | 24.7 | 2.6 |
| అన్ని వయసులవారు | 37.5 | 51.6 | 22.3 | 40.3 | 52.5 | 26.7 | 30.2 | 48.9 | 9.2 |

*ఆధారం: భారతదేశ జనాభా లెక్కలు 1991. భారత వృద్ధాప్య జనాభా 1991. జనాభా లెక్కల దత్తాంశ విశ్లేషణ. స్టడీ రిపోర్టు.*

BRAOU

పై పట్టికను చూస్తే అన్ని వయస్సుల వారు, 60+ కేటగిరీలోనూ స్త్రీలు, పురుషులకంటే పనిలో పాల్గొంటున్నారు. పట్టణ ప్రాంతాలకంటే గ్రామీణ ప్రాంతాలలోని 60+ వయస్సులవారు మరియు అన్ని వయస్సులవారు కూడా ఎక్కువగా పనిలో పాల్గొంటున్నారు. అయితే స్త్రీలు గ్రామీణ ప్రాంతాలలోనూ, పట్టణ ప్రాంతాలలోనూ, 60+ కేటగిరీలోనూ, అన్ని వయస్సుల వారి సమూహంలోనూ పురుషులకంటే పనిలో పాల్గొనడంలో వెనుకబడి వున్నారు. అయితే వయోవృద్ధుల వయస్సు పెరిగేకొద్దీ వారి పనిలో పాల్గొనేవారి రేటు తగ్గుతూ వుంటుంది. దీనికి కారణం పెరుగుతున్న వయస్సు, ఆరోగ్యాన్ని క్షీణింపజేయడం, శక్తి సామర్థ్యాలను హరింపజేయడంగా చెప్పవచ్చు.

**పట్టిక-5: భారతదేశంలో వయోవృద్ధుల అక్షరాస్యతశాతం, 1991.**

| నివాసం | లింగభేదం | శాతం |
|---|---|---|
| మొత్తం | మొత్తం | 27.5 |
| | పురుషులు | 40.62 |
| | స్త్రీలు | 12.68 |
| గ్రామీణ | మొత్తం | 21.11 |
| | పురుషులు | 33.65 |
| | స్త్రీలు | 7.51 |
| పట్టణ | మొత్తం | 48.73 |
| | పురుషులు | 65.97 |
| | స్త్రీలు | 30.76 |

*ఆధారం: భారతదేశ జనాభా లెక్కలు 1991. భారత వృద్ధాప్య జనాభా, 1991. జనాభా లెక్కల దత్తాంశ విశ్లేషణ. స్టడీ రిపోర్టు.*

వయోవృద్ధులలో పురుషులకంటే స్త్రీలలో ఎక్కువగా నిరక్షరాస్యులున్నారు. పట్టణ ప్రాంతాలతో పోల్చినప్పుడు గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా అవిద్యతో బాధపడుతున్నారు.

## 9.4 రాజ్యాంగపరమైన నిబంధనలు, శాసనపూర్వకమైన చర్యలు

భారత రాజ్యాంగ నిర్మాణ సమయంలో రాజ్యాంగం ఏడవ షెడ్యూల్ మూడవ జాబితాలో సామాజిక రక్షణ గురించి ప్రత్యేకంగా పొందు పరిచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యతగా సామాజిక రక్షణను నిర్వచించారు. రాష్ట్ర జాబితాలోని తొమ్మిదవ అంశం, ఉమ్మడి జాబితాలోని 20, 23, 24వ అంశాలు వికలాంగులు, నిరుద్యోగులు, వయో వృద్ధుల ఫించను, సామాజిక రక్షణ, సామాజిక భీమా, సామాజిక ఆర్థిక ప్రణాళికలకు సంబంధించిన ఉపశమన చర్యల గురించి వివరిస్తాయి. భారతరాజ్యాంగంలోని 41వ అధికరణం వయోవృద్ధులకు, దిక్కులేని వారికి సామాజిక రక్షణ కల్పించడంలో రాష్ట్రం పాత్రను తెలియజేస్తుంది.

1956లో చేసిన హిందూ దత్తత, పోషణ చట్టంలోని 20(3) ప్రకరణం, నేరశిక్షాస్మృతిలోని 125(1) (d) ప్రకరణం కన్నబిడ్డలకు తగిన స్తోమత వున్నప్పుడు వారి దగ్గరనుండి నెలకు 500 రూపాయల పోషణ భృతికై పొందే హక్కు వృద్ధులకు కల్పించాయి. 1961లో రూపొందించిన ఆదాయపన్ను చట్టం, 1992లోని ఆర్థిక వ్యవహారాల చట్టంలోని 88b ప్రకరణం 65 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ఆదాయపన్నులో తగ్గింపును ఏర్పాటు చేశాయి.

### 9.4.1 సంక్షేమ పథకాలు-సంఘటితరంగం

సంఘటితరంగంలో పనిచేసేవారికి అనేక సంక్షేమ ప్రయోజనాలను ప్రవేశపెట్టడం జరిగింది. వారిలో (a) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు (b) ప్రాంతీయసంఘాలు (c) ప్రభుత్వరంగ సంస్థలు (d) ప్రైవేటు సంఘటిత రంగంలోని ఉద్యోగులు ముఖ్యంగా చెప్పుకోవచ్చును. భారతదేశంలో ఉద్యోగ విరమణ గావించినవారికి గ్రాట్యుటీ, ఫించను, ప్రావిడెంటు ఫండ్ నుండి ప్రయోజనాలు కల్పించబడినాయి. ప్రావిడెంటు ఫండ్ పథకం క్రింద నెలకు 5000 రూపాయలు సంపాదించే ఉద్యోగులకు తమ వ్యక్తిగత నిధికి యజమాని, ఉద్యోగి చేసే మాచింగ్ చందాలు జమ అవుతాయి. 1995లో రూపొందించిన ఉద్యోగుల ఫించను పథకం 1996లో సవరించబడింది. ఈ పథకం క్రింద ఉద్యోగ విరమణ ప్రయోజనాలు ముఖ్యంగా ఫించను రూపంలో (1) సిసిఎస్ ఫించను నియమాలు వర్తించే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరు, (2) రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరు, (3) ఆదాయపన్ను అధికార వర్గాల చేత ఆమోదించబడిన, కార్పొరేట్ సంఘాలలోని ఉద్యోగులందరు పొందుతున్నారని చెప్పవచ్చును. 1972లో రూపొందించిన గ్రాట్యుటీ చట్టం క్రింద కూడా ఉద్యోగులు ప్రయోజనం పొందుతున్నారు. పారిశ్రామికీకరణ పెరుగుతున్నప్పటినుండి గ్రాట్యుటీ ప్రాముఖ్యత పెరుగుతూ వచ్చింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ విరమణ చేసిన వ్యక్తుల ఆరోగ్య రక్షణకై ఆరోగ్య సేవా పథకం ఏర్పాటు చేశారు. జీవిత భీమా సంస్థ వారు ఏర్పాటు చేసిన జీవనమిత్ర, జీవన ధార, జీవన సంధ్య లాంటి పొదుపు పథకాలను ఉద్యోగులకు వర్తింపజేసి ఉద్యోగ విరమణ తర్వాత ఫించనుతోబాటు మరింత ఆదాయం వచ్చే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది. వృద్ధుల భద్రత కోసం అనేక పరిశ్రమలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నాయి. టీ తోటలు, బొగ్గు గనులు, మైకా గనులు పరిశ్రమాధిపతులు పరిశ్రమలలో పనిచేసిన వృద్ధులైన వారికోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారు.

### 9.4.2 సంక్షేమపథకాలు-అసంఘటితరంగం

భారత రాజ్యాంగంలో పొందుపరచిన విధంగా భారత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల వృద్ధులకై కొన్ని సామాజిక రక్షణ పథకాలను ఏర్పాటు చేసింది. ముఖ్యంగా గ్రామీణ వృద్ధులకు ఈ పథకాల అవసరం ఎంతైనా వుందని చెప్పవచ్చును. ప్రస్తుతం మన దేశంలో అమలులో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలు 1. వృద్ధాప్యఫించను పథకం, 2. వృద్ధాప్య శరణాలయాలు, 3. వృద్ధుల దత్తత, 4. ఆరోగ్య విధానాలు, 5. అదనపు ఆదాపై ఉపాంత సబ్సిడీ. ఇప్పుడు

BRAOU

వీటిని వివరంగా పరిశీలిద్దాం.

### 1. వృద్ధాప్య ఫించను పథకం

మొదట కేరళలో 1960 సంవత్సరంలో ఈ పథకాన్ని ప్రారంభించారు. తరువాత ఆంధ్రప్రదేశ్‌లో 1961లో తమిళనాడు రాష్ట్రం 1968లో ప్రారంభించారు. ఈ పథకం కింద వృద్ధులకు నెలకు 30 రూపాయల నుండి వంద రూపాయల వరకు అందజేయడం జరుగుతుంది. మొట్టమొదటగా కేరళ రాష్ట్రం వ్యవసాయ రంగంలో పనిచేసే వృద్ధులకు (60+) నెలకు 60 రూపాయలు చెల్లించే విధంగా ఒక పథకాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. అదేవిధంగా 1984వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయరంగంలో పనిచేసే వృద్ధులకు (60+) నెలకు 30 రూపాయలు చెల్లించే పథకాన్ని ప్రారంభించింది. భారత జీవిత భీమా సంస్థవారి సహాయంతో చాలా రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీరాజ్ వ్యవస్థ గ్రామీణాభివృద్ధి విభాగాల ద్వారా వృద్ధులకు అనేక ప్రయోజనాలు అందించే విధంగా భీమా పథకాలను ఏర్పాటు చేశారు.

### వృద్ధాప్య శరణాలయాలు

మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజం మార్పులకు లోనవుతున్నది. జీవితంలో వేగం పెరిగిన కారణంగా మానవ సంబంధాల్లో సైతం మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కుటుంబ తగాదాల వలన, సమాజంలో విలువలు కనుమరుగవడం వలన, వృద్ధులపై చిన్నచూపువలన వృద్ధులు నిరాధరణకు గురై మానసిక ప్రశాంతత కోసం వారు శరణాలయాలలో చేరుతున్నారు. ఉమ్మడి కుటుంబాల స్థానంలో వ్యష్టి కుటుంబాలు ఏర్పడుతుండడంకూడా దీనికి ఒక కారణంగా చెప్పవచ్చును. ఇటీవలికాలంలో వృద్ధుల శరణాలయాలు గణనీయంగా పెరిగాయి. భారతదేశంలో కేరళలో ఎక్కువగా ఈ శరణాలయాలు నెలకొని వున్నాయి. తరువాత తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో వీటి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది.

BRAOU

### ఆరోగ్య విధానాలు

ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చడానికి మూడంచెల వ్యవస్థ ఏర్పాటు చేశారు. ప్రాథమిక స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ద్వితీయ స్థాయిలో అన్ని సదుపాయాలు కలిగిన ఆసుపత్రులు, మూడవ స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రులు ఏర్పాటు చేశారు. ప్రజల, ముఖ్యంగా వృద్ధుల ఆరోగ్య అవసరాలను తీర్చడానికి కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా పనిచేస్తున్నాయి. హెల్పేజి ఇండియా వారు వృద్ధులకోసం అనేక శిబిరాలను ఏర్పాటు చేసి ఉచిత నేత్ర పరీక్షలు చేయటం, హృద్రోగ పరీక్షలు చేయడం, కేన్సర్, క్షయవ్యాధి, కుష్టువ్యాధి మొదలగు పరీక్షలు చేసి తగిన మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ దిశలో అనేక స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి.

### గృహ సంబంధ విధానం

కుటుంబం అనేది ఒక వ్యక్తి జీవితంలో అతి ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఎంతో మంది వృద్ధులు నిరాదరణకు గురై నిరాశ్రయులై జీవిస్తున్నారు. రైల్వే ఉద్యోగుల సంక్షేమ సంఘం, జీవిత భీమా సంస్థ, హడ్కో వారు ఉద్యోగ విరమణ చేసిన వారికి, అసంఘటిత రంగంలో పనిచేసే వారికి కూడా గృహానికి సంబంధించిన ఋణాలు ఇవ్వడం జరుగుతోంది. నేషనల్ హౌసింగ్‌బోర్డు, హడ్కో, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ వారు వృద్ధులకు గృహ సంబంధమైన అనేక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు.

## 9.5 వయో వృద్ధులు-జాతీయ విధానం

ఐక్యరాజ్యసమితి 1999వ సంవత్సరాన్ని అంతర్జాతీయ వృద్ధుల సంవత్సరంగా ప్రకటించింది. భారత కేంద్ర ప్రభుత్వం వృద్ధులకు అనేక సంక్షేమ పథకాలను పెంపొందించే ఈ విధంగా ఒక జాతీయ విధానాన్ని 1999వ సంవత్సరం జనవరి 13వ తేదీన అంగీకరించింది. వృద్ధుల సమస్యలు ముఖ్యంగా వారి ఫించను, ఆరోగ్య సమస్యల

గురించి పరిశీలించడానికి ఒక జాతీయ సమితి ఏర్పాటు చేశారు. 1990 వ సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అక్టోబర్ 1వ తేదీని 'అంతర్జాతీయ వృద్ధుల దినం'గా ప్రకటించింది. అక్టోబర్ 1న అనేక దేశాలలో వృద్ధుల సమస్యలపై అవగాహన పెంపొందించడానికి అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోంది. సంఘటితరంగం, అసంఘటిత రంగంలో పనిచేసే వృద్ధులకోసం ఒక జాతీయ విధానాన్ని తీసుకుని రావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

## 9.6 ముగింపు

భారతదేశంలో వృద్ధాప్య సమస్య ఇటీవలి కాలంలో ఉద్భవించింది అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన, ఏర్పడుతున్న పరిస్థితుల దృష్ట్యా అది తీవ్ర సమస్యగా రూపొందుతుందనడంలో సందేహంలేదు. భారతదేశంలోని వృద్ధులు పేదరికం, ఆరోగ్య, మానసిక సమస్యలలో చిక్కుకుని తమ గుర్తింపుని కోల్పోతున్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధులను ఆదుకునేందుకు సంఘటిత, అసంఘటిత రంగాలలో పనిచేసేవారికై ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టే వారి అంతస్తును పెంచేవిధంగా అనేక ప్రయత్నాలు చేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి 1999 సంవత్సరాన్ని అంతర్జాతీయ వృద్ధుల సంవత్సరంగా ప్రకటించి వృద్ధుల సమస్యలపై అన్ని దేశాలలో అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తున్నది.

## 9.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. భారతదేశంలో వృద్ధాప్యం లక్షణాలను పేర్కొనండి?
2. భారతదేశంలో వృద్ధాప్య సమస్యలేవి? వివరించండి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబు రాయండి.**

1. వయోవృద్ధుల జాతీయవిధానం.
2. సంఘటిత సంక్షేమ పథకాలు.

## 9.8 చదవదగిన పుస్తకాలు

1. బలహీనవర్గాలు-సామాజిక పునర్నిర్మాణం: తెలుగు అకాడమి, మోనోగ్రాఫ్, 115- సమాజశాస్త్రం

2. Sharma, M.L.& Dak, T.M (1987), : 'Aging in India: Challenge for the Society', Ajantha Publications, Delhi.

BRAOU

# ఖండం- III

## హింస: ఉద్రిక్తతలు

హింస ఒక చారిత్రక వాస్తవం. హింస, ఘర్షణ, వైరుధ్యాలు లేకుండా సమాజం లేదు. సామాజిక మార్పు అవసరం అయినప్పుడు హింస ఒక సాధనంగా పనికొస్తుందని, సంఘర్షణ వాదం చెబుతోంది. అయితే హింస ఇవాళ సామాజిక గమనానికి సవాలుగా నిలిచింది. హింసవల్ల సమాజం అతలాకుతలమవుతోంది. అనేక ఉద్రిక్తతలకు ఉపద్రవాలకు కారణమవుతోంది. కుల, మత, వర్గ, జాతి వైషమ్యాలతో ఇవాళ హింస మొత్తం ప్రపంచాన్నే వణికిస్తోంది. మరి ఈ హింసను ఎలా అర్థం చేసుకోవాలి. ఎలా నివారించాలి. ఎలా ఈ హింస సమాజానికి ఒక అవరోధంగా మారకుండా చూసుకోవాలన్న అంశాలను ఈ ఖండం వివరిస్తుంది.

ఈ ఖండంలో మొత్తం ఐదు భాగాలున్నాయి. వీటిలో మూడు భాగాలు హింసకు సంబంధించిన మౌలిక భావనలు వివరిస్తే రెండు భాగాలు భారతదేశంలోని హింసా ప్రవృత్తిని విశ్లేషిస్తాయి. అవి:

**భాగం-10:** హింస కారకాలు-పర్యవసానాలు

**భాగం-11:** సామాజిక ఉద్రిక్తతలు-హింస

**భాగం-12:** హింస నివారణ: అభివృద్ధి

**భాగం-13:** భారతదేశంలో కులం, మతం, సామాజిక ఉద్రిక్తతలు

**భాగం-14:** భారతదేశంలో సాముదాయిక ప్రకర్షణలు-సముదాయాభివృద్ధికి సూచనలు

BRAOU

BRAOU

# భాగం-10: హింస-కారణాలు-పర్యవసానాలు

విషయక్రమం


10.0 ఉద్దేశాలు

10.1 పరిచయం

10.2 నిర్వచనాలు

10.3 లక్షణాలు

10.4 హింస-వర్గీకరణ

10.5 హింసను ప్రేరేపించే అంశాలు

10.6 రాజకీయ హింస

10.7 ఎన్నికల్లో హింస

10.8 ప్రభుత్వం - హింస

10.9 ఉగ్రవాదం

10.10 హింసకు కారణాలు

10.11 హింస పర్యవసానాలు.

10.12 ముగింపు

10.13 మాదిరి పరీక్ష ప్రశ్నలు

10.14 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 10.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- నిర్వచనాలు, కారణాలు పర్యవసానాలు తెలుసుకుంటారు.
- హింస ఆధునిక సమాజాలను ఏవిధంగా పట్టిపీడిస్తుందో అర్థం చేసుకుంటారు.

## 10.1 పరిచయం

ఆధునిక సమాజాలు ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సవాలు హింస. హింస అనే సమస్యకు ఎప్పటిలాగానే ఇప్పటికీ చాలా ప్రాముఖ్యతవుంది. హింస అనేది ఒక సామాన్య భావన కాక ఒక సంక్లిష్టమైన భావన. సామాజిక పరంగా మాట్లాడాలి అంటే హింస అనేది రాజకీయ పరిభాషలో పదవి కోసం పాటుపడటంలో ఒక దశ. ప్రాచీనకాలం నుండి ఎవరయితే పదవులకోసం పాటుపడి వాటిని పొందారో, వారు హింస, బలప్రయోగం, భయహేతువులను ఉపయోగించి వారి లక్ష్యాలను సాధించుకున్నారని చెప్పవచ్చును.

హింస అనగా చంపడం, బాధించడం అని అర్థం. సృష్టిలో బలవంతులైన జీవులు, బలహీనజీవులను గాయపరచడం, భయపెట్టడం, చంపడం, ఆహారంగా తీసుకోవటం మనకు తెలుసు, దానిని హింస అంటారు.

మానవుడు క్రూరజంతువు లాంటి వాడు కాకపోయినా పగ, ఈర్ష్య, ద్వేషం వంటి దుష్ట గుణాలతో సాటి మానవులను బాధిస్తూ, గాయపరుస్తూ, చంపుతున్నాడు, ఇది నేటి నాగరిక సమాజంలోని హింస.

తక్కిన ప్రాణుల కంటే బుద్ధి, జ్ఞానం, వివేకం, సామర్థ్యం, ప్రదర్శిస్తూ హింసా కృత్యాలకు పాల్పడడం శోచనీయం. తన ఆధిక్యాన్ని, అహంకారాన్ని, ధన బలాన్ని, అంగబలాన్ని వినియోగించుకొని తనకు అడ్డం వచ్చినవారిని, తన్ను వ్యతిరేకించేవారిని మానవుడు నిర్దాక్షిణ్యంగా చంపివేస్తున్నాడు. గృహదహనాలు, దోపిడీలు, చిత్రహింసలు, మానభంగాలు నేటి అధునిక సమాజంలో సర్వసహజమైనవి. విద్యావంతులు, పలుకుబడి కలిగి పదిమందిలో పేరుగల వ్యక్తులు కూడా హింసాకృత్యాలకు పాల్పడుతున్నారు. దీనివలన అకాల మరణాలు, వారిపై ఆధారపడినవారి దీనావస్థ, సామాజిక కల్లోలం, తీవ్ర సంతాపం, ఘర్షణలు సమాజంలో చోటుచేసుకుంటున్నాయి. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి, చంద్రునిపై కాలుపెట్టి, గ్రహాంతరాలకు ఎగురుతున్న మానవునిలో, ఇంకనూ పాశవికమైన హింసాభావం వుండడం సమాజంలో విలయాన్ని సృష్టిస్తోంది.

## 10.2 నిర్వచనాలు

1. ఒకవ్యక్తిని లేక ప్రత్యర్థిని ఉద్దేశ్యపూర్వకంగా మానసిక, శారీరకమైన ఒత్తిడికి గురిచేసి బాధించడమే హింస.
2. వ్యక్తిగత లేక సామూహిక ప్రయోజనాల సాధనకై అన్యాయపూరితమైన భౌతిక బలప్రయోగ పద్ధతులను ఉపయోగించడమే హింస.

## 10.3 లక్షణాలు

1. హింసలో ఉద్దేశ్యపూర్వకమైన బలప్రయోగం ఉంటుంది.
2. ఎదుటి వ్యక్తులను గాయపరచడం, చంపడం, ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులకు నష్టం కలిగించడం మొదలైన అంశాలు హింసలో ఉంటాయి.
3. హింసాత్మక చర్యలకు రాజకీయ అండ ఉండవచ్చును లేదా లేకపోవచ్చును.
4. హింసకు కారణాలు వ్యక్తిగతమైనవి కావచ్చు లేదా సామూహికమైనవి కావచ్చు.
5. హింసలో ప్రత్యర్థులే కాక అమాయకులు కూడా బలౌతుంటారు.

## 10.4 హింస - వర్గీకరణ

హింసను ఈ క్రింది విధాలుగా వర్గీకరించవచ్చును.

1) చట్టవ్యతిరేక హింస

ఉదా : మానభంగం, దొమ్మీలు.

2) చట్టసమ్మత హింస

ఉదా : స్వరక్షణ, దేశరక్షణ

3) వ్యక్తిగతమైన హింస

ఉదా : హత్య, దొంగతనం

4) సామూహిక హింస

BRAOU

ఉదా : యుద్ధం విప్లవం.

5) బహిరంగ హింస

ఉదా : యుద్ధ దహనకాండ

6) నిర్మాణాత్మక హింస

ఉదా: జప్తుచేయుట, స్వాధీనపరుచుకొనుట, పన్నులు విధించుట.

7) న్యాయ ప్రతికూల హింస

ఉదా : జైలులో పెట్టడం, ఉరితీయడం.

8) క్రమశిక్షణాపరమైన హింస

ఉదా : రక్షణ, పరులను రక్షించుట

9) మానసిక హింస : ఈ మానసిక హింస పరుల కంటికి కనిపించదు అసభ్యపదజాలంతో నిందించుట సూటిపోటి మాటలతో బాధించుట, కులంపేరుతో దూషించుట, అస్పృశ్యతను పాటించుట మొదలైనవి మానసిక హింసలోని అంశాలు. ఈ మానసిక హింస ఎక్కువగా కుటుంబ వ్యవస్థలో కుల వ్యవస్థలో గోచరిస్తుంది.

10) భౌతిక హింస : ఎదుటి వ్యక్తిని ఉద్దేశ్యపూర్వకంగా గాయపరుచుట లేక చంపుట.

11) లైంగిక హింస : లైంగిక పరంగా వివక్షతో వేధించుట

ఉదా : ఈవ్‌టీజింగ్

BRAOU

## 10.5 గాంధీజీ అభిప్రాయంలో హింసను నాలుగు అంశాలు ప్రదర్శిస్తాయి

1. కేంద్రీకృత అధికారం
2. విదేశీ దండ యాత్రలు
3. అంతః కలహాలు
4. కుటుంబ వ్యవస్థ

### 1. కేంద్రీకృత అధికారం

నియంతృత్వపాలనగల దేశాలలోని అధికారం ఒక వ్యక్తి చేతిలో అనగా నియంత చేతిలో కేంద్రీకృతమయి ఉంటుంది. నియంత అనగా శాసించువాడు. నియంత చండశాసనం, నియంతృత్వం. తిరుగుబాటు చేసి దౌర్జన్యంగా బలప్రయోగంతో అంతర్యుద్ధం రెచ్చ గొట్టి నెత్తురు చిందించి నియంత వారిని చంపుతాడు. జైలు పాలు చేస్తాడు. నియంతకు దయా దాక్షిణ్యాలుండవు. నియంత ఏక పక్ష నిర్ణయాలు తీసుకున్నప్పుడు అణిచివేత పాలయిన ప్రజలు సహించలేక తిరగబడినపుడు హింస ప్రధాన పాత్ర వహిస్తుంది.

### 2. విదేశీ దండయాత్రలు

రాజ్య విస్తరణాభిలాష, అధికార గర్వం, మూర్తీభవించిన మూర్ఖపాలన విదేశీ దండ యాత్రలకు కారణం కావచ్చు విపరీత జాతీయవాదం యుద్ధానికి దారితీస్తుంది. ఇతర దేశాలను, వారి ఆర్థిక వనరులను దోచుకోవాలనే ప్రయత్నాలు దండయాత్రలకు దారితీస్తాయి. పారిశ్రామికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలు రాజకీయాధికారం కోసం పడే తాపత్రయ ఫలితమే యుద్ధాలు.

### 3. అంతః కలహాలు

సమాజంలో రేగే తీవ్రమైన అంతఃకలహాలు హింసకు మూలం, భాష, మత, కుల, రాష్ట్రీయ విద్వేషాలు అంతః కలహాలకు కారణాలు. సామాజిక ఉద్యమాలు, విప్లవాలు కూడా అంతఃకలహాల కార్యక్రమాలతో కూడిన విప్లవచర్యలు హింసను సృష్టిస్తాయి.

### 4. కుటుంబ అవ్యవస్థ

కుటుంబంలోని సభ్యులు తను పాత్రలను అంతస్థులకు అనుగుణంగా నిర్వహించకపోతే కుటుంబం విచ్ఛిన్నమవుతుంది. కుటుంబ సభ్యులమధ్య సరియైన అవగాహన లోపించినపుడు, సర్దుబాటు తత్వం లేనపుడు, విడాకులు తీసుకున్నప్పుడు కుటుంబ అవ్యవస్థ ఏర్పడుతుంది. దీనివలన కుటుంబ సభ్యులు మానసిక సంఘర్షణలకు గురై, భద్రత, నియంత్రణలు లేక చెడు సావాసాలకులోనై, సమాజ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనే అవకాశముంది. కుటుంబవ్యవస్థలో మానసిక, భౌతిక హింసలకు తావెక్కువ.

## 10.6 రాజకీయ హింస

స్వాతంత్ర్యం సిద్ధించాక దేశం ఆర్థికంగా, పారిశ్రామికంగా, వ్యవసాయికంగా అభివృద్ధి సాధించింది. అయితే ఈ సానుకూల అభివృద్ధితోపాటు కొన్ని ప్రతికూల ధోరణలూ తలెత్తినాయి. అలాంటి ప్రతికూల పరిణామాల్లో ముఖ్యమైనది వినాశకరమైనది 'అధికార రాజకీయాలు' దీనినే ఇంగ్లీషులో 'పవర్ పాలిటిక్స్' అంటారు. అంటే నేటి రాజకీయాల ఏకైక లక్ష్యం తిమ్మిని బమ్మి, బమ్మిని తిమ్మి చేసి అయినా సరే అధికార సంపాదన ఇవే నేటి తరం రాజకీయనాయకుల లక్ష్యాలుగా మారాయి, అధికారం అన్నది అంతిమ లక్ష్యం అయితే రాజకీయాలన్నవి దానిని సాధించడానికి ఉపయోగపడే సాధనం. దరదృష్టవశాత్తు నేటి మన రాజకీయాలు ఈ స్థితికి దిగజారాయి. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో 'గెలిచేశక్తి' ఉన్న వారికే టిక్కెట్లు ఇచ్చే సంస్కృతి సంతరించుకున్నాయి, 'గెలిచేశక్తి' అంటే విచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెట్టగలిగేవాడు, డబ్బు పంచి గానీ, పంచకుండా గానీ 'రిగ్గింగ్' చేసే శక్తి ఉన్నవాడు. రిగ్గింగ్ చేసే శక్తి లేకపోతే డబ్బు ఉండి ఉపయోగం లేదు కనుక దౌర్జన్య చర్యలకే ప్రథమ తాంబూలం లభిస్తుంది. అంటే నేరస్తులకయినా టిక్కెట్లివ్వాలి లేదా నేరస్త సత్తా ఉన్న ధనికుడికయినా టిక్కెట్లుఇవ్వాలి. తారతమ్య భేదాలతో దేశంలోని అన్ని పార్టీలు ఇదే సంస్కృతికి అలవాటు పడ్డాయి.

1993 మార్చిలో ముంబాయిలో వరుసగా పది పన్నెండు చోట్ల బాంబు పేలుళ్ళకు కారణమైన మాఫియా గ్యాంగుకు రాజకీయ నాయకుల ప్రాపకం ఉన్నట్లు వెల్లడయింది ప్రతి నగరంలోనూ మాఫియా అండదండలతోనే రాజకీయ నాయకులు ఈ గ్యాంగు సహకారంతోనే ప్రత్యర్థి నాయకులను ముట్టు బెడుతున్న ఉదాహరణలు కూడా ఉన్నాయి.

## 10.7 ఎన్నికల హింస

1995లో ప్రారంభమయిన రాజకీయ హింస ఈ రోజుకు అనేక క్రొత్త పద్ధతులను నేర్చుకొని మన ప్రజాస్వామ్యాన్ని నవ్వులపాలు చేస్తున్నది. వెయ్యి రెండువేల ఓట్ల మెజారిటీతో గెల్చిన అభ్యర్థులు కేవలం రిగ్గింగ్ ద్వారానే విజయం సాధించిన దాఖలాలున్నాయి. అంటే కొన్ని నియోజకవర్గాలలో ఈ ఎన్నికలలో హింస కీలకమైన పాత్రను పోషించి ఓడిపోయేవారిని గెలిపిస్తుంది. గెలవగలవారిని ఓడిస్తుంది.

ప్రజలు స్వేచ్ఛగా తమ అంతరాత్మ ఆదేశం ప్రకారం ఓటు వేసే అధికారానికి కొన్ని చోట్ల అంతరాయం కలుగుతున్న విషయం తెలిసిందే. ఇంగ్లీషులో ఒక సూక్తి ఉన్నది. నీ స్వేచ్ఛ నాముక్కును తాకేదాకా విస్తరించ కూడదు అన్నది ఆ సూక్తి. అంటే స్వేచ్ఛ ఉంది కదా అని నా ముక్కు తాకేలా బాణాకర్ర తిప్పవద్దు సుమా అని. ఉదాహరణకు కొందరు నక్సలైట్లు తరుచుగా ఎన్నికలను బహిష్కరించడం దాకా సబబే. ఎందుచేతనంటే, మనకు ఎన్నికల్లో

BRAOU

పాల్గొనకుండా ఉండే స్వేచ్ఛ కూడా ఉంది, కానీ నువ్వు ఎన్నికలను బహిష్కరించవల్సిందిగా వత్తిడి తేకూడదు. ఎన్నికల వల్ల సామాజిక పరివర్తన సాధ్యంకాదు, కనుక ఆ ఎన్నికలపై ఆశలు, భ్రమలు పెట్టుకోవద్దని ప్రచారం చేసే అధికారం ఎవరికయినా ఉంది. వారి ప్రచారంలో వాస్తవం ఉందని ప్రజలచేత నమ్మించాలితప్ప ప్రజల అభీష్టానికి అవరోధం కలిగించడం ప్రజాతంత్ర స్ఫూర్తికే వ్యతిరేకం.

ఆంధ్రప్రదేశ్, బీహార్‌లలోనే కాదు పంజాబ్, జమ్ము-కాశ్మీర్ రాష్ట్రాల్లో సైతం అనేకసార్లు ఎన్నికల సందర్భాలలోనూ ఇతరేతర సందర్భాలలోనూ ఇలాంటి హింసాత్మక ఘటనలు జరిగాయి. ముఖ్యంగా బీహార్, ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో ఎన్నికల సందర్భంగా బలహీన వర్గాలు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటువేసే అవకాశం లేకుండా చెయ్యడం పరిపాటి అయింది. ఇలాంటి హింసాత్మక చర్యలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేవి తప్ప మరొకటి కాదు.

## 10.8 ప్రభుత్వం - హింస

ప్రభుత్వం మాత్రం టెర్రరిజానికి పాల్పడిన ఉదాహరణలు లేవా అంటే ఉన్నాయనే చెప్పాలి. నక్సలైట్లకు ఆశ్రయం కల్పిస్తున్నారన్న సాకుచూపి ఆ మధ్య పోలీసులు విశాఖపట్నం ప్రాంతంలోని గిరిజన గ్రామాన్ని అతలాకుతలం చేశారు. గ్రామస్తుల పూరిగుడిశెలను తగలబెట్టారు. అభిమానంతో కాని, భయపడికానీ ఒక గ్రామం నక్సలైట్లకు ఆశ్రయం ఇచ్చినంత మాత్రాన ఆగ్రామాన్ని తగలబెట్టే అధికారం పోలీసులకు లేదు.

## 10.9 ఉగ్రవాదం

BRAOU

ఉగ్రవాదం అంటే సమాజంలో భయంకరమైన బీభత్సం సృష్టించడం. ఏరోజు వార్తా పత్రిక చదివినా ఏదో ఒక మూల ఉగ్రవాదం, ఉగ్రవాదుల ఘాతుకాలు లాంటి పదాలు కనిపించడం మామూలు అయిపోయింది. ఉగ్రవాదం సమస్య లేని దేశాలు అరుదు. కాకపోతే తీవ్రతలో తేడాలు ఉండవచ్చు. ఈ మేరకు ఇదొక అంతర్జాతీయ సమస్యగా పరిణమించింది.

ఇంతకూ ఉగ్రవాదం అంటే ఏమిటి? వెబ్‌స్టర్ ఎన్‌సైక్లోపీడియాలో ఈ పదానికి 'రాజకీయాలక్ష్యాల కోసం జరిగే అసలైన హింస లేదా, బెదరగొట్టే భయపెట్టే హింస అనిఅర్థం వుంది. కనుక హింస వేరు ఉగ్రవాదం వేరు. ప్రతి హింసాత్మక చర్య ఉగ్రవాద చర్య అనిపించుకోదు. ఏ హింసాత్మక చర్యవెనుక రాజకీయ కారణాలుంటాయో ఆ హింసాత్మక చర్యలనే ఉగ్రవాదంగా పరిగణించాలి. ఉగ్రవాదులు ప్రభుత్వ ప్రతినిధులపైనా, ప్రభుత్వ సంస్థలపైనా మాత్రమేగాక, పౌరులపై కూడా హింసకు పాల్పడతారు. వాస్తవానికి పౌరులపై ప్రయోగించే హింసనే ఉగ్రవాదం అని కూడా అంటున్నారు.

పాలస్తీనీయులు సొంత దేశం ఏర్పాటు కోసం చాలా ఏళ్ళక్రితమే పోరాటం ప్రారంభించారు. వారి పోరాటం ఫలించక పోయేసరికి వారు ఇజ్రాయిల్ పౌరులపై హింసాకాండకు దిగారు. మ్యూనిచ్‌లో జరిగిన ఒలెంపిక్స్‌లో పాల్గొనడానికి వచ్చిన ఇజ్రాయిల్ క్రీడాకారుల్లో పదకొండు మందిని పాలస్తీనా ఉగ్రవాదులు సంహరించారు. అప్పటినుంచే ఉగ్రవాదం అన్నది అంతర్జాతీయ సమస్యగా పరిణమించింది. పాలస్తీనా విమోచన సంస్థకు చెందిన సభ్యులే ఉగ్రవాదానికి అంతర్జాతీయ స్థాయి కల్పించారు.

టెర్రరిస్టులు సాధారణంగా హత్యలకు, దాడులకు, కిడ్నాపింగ్‌లకు, విమానాల హైజాకింగ్‌కు పాల్పడుతుంటారు. మనదేశంలో 'ఖలిస్థాన్' ఉగ్రవాదులు (పంజాబ్) తరుచుగా హింసకు పాల్పడేవారు. ఇప్పుడు ఖలిస్థాన్, ఎల్.టి.టి.ఇ., జమ్మూ-కాశ్మీర్‌లోని హిందువుల నివాసాలపై పడి నిర్దాక్షిణ్యంగా హత్య చేసి ఉగ్రవాదులు భయోత్పాతం సృష్టిస్తున్నారు. వేలాది హిందూ కుటుంబాలు కాశ్మీర్ వదిలి న్యూఢిల్లీ వచ్చి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. అందరు ఉగ్రవాదుల్లాగే కాశ్మీర్ ఉగ్రవాదులు కూడా అటు పోలీసులపైన ఇటు అమాయక పౌరులపైనా హింసకు పాల్పడుతున్నారు. కాశ్మీర్ ఉగ్రవాదులకు అంతర్జాతీయ సహకారం లభిస్తున్నది.

ముఖ్యంగా పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ పాలకులు వీరికి శిక్షణ ఇచ్చి, ఆయుధాలందజేసి పెంచి పోషిస్తున్నారు. ఇది భారత్‌పై పాకిస్తాన్ సాగిస్తున్న పరోక్ష యుద్ధం అని హోంమంత్రి ఎల్.కె.అద్వాని తరచుగా వ్యాఖ్యానిస్తున్నారు. సౌదీ అరేబియాకు చెందిన కోటీశ్వరుడు బిన్‌లాడెన్. ఇలా ఒక దేశంలో ఉంటూ మరో దేశంలో టెర్రరిస్టు చర్యలు జరపడాన్నే అంతర్జాతీయ టెర్రరిజం అంటారు. ఇవాళ అంతర్జాతీయ టెర్రరిజానికి సజీవ ప్రతీక బిన్‌లాడెన్. అతడు ఆఫ్ఘనిస్తాన్‌లో మకాం వేసి అమెరికాను, ఇరాన్‌ను, ఇండియాను హడలెత్తిస్తున్నాడు. ఆఫ్రికా నగరాలైన నైరోబీలోనూ, దార్సాలామ్‌లోనూ ఉన్న వందలాది మంది అమెరికా దౌత్య సిబ్బందిని పొట్టన పెట్టుకున్నాడు. అమెరికా దౌత్యకార్యాలయాలపై బాంబుదాడిని జరిపాడు. దీనివలన మొత్తం ప్రపంచంలోని ఆర్థిక వ్యవస్థ అంతా తలక్రిందులయ్యింది. తమిళటైగర్లు (ఎల్.టి.టి.ఇ) అనేక సార్లు తమిళనాడులో దాడులు జరిపి అమాయక పౌరులను హతం చేసారు. ఒక దశలో మద్రాసు నగరం నడిబొడ్డునే వీరు వీరవిహారం చేసి భయోత్పాతం సృష్టించారు. 1991 మేలో భారత్ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని దారుణంగా హత్య చేయడంలో ఎల్.టి.టి.ఇ. ఉగ్రవాదం పతాక స్థాయికి చేరుకుంది.

ఉగ్రవాదులు ఎప్పుడు, ఎక్కడ ఏ హింసాత్మక చర్యలకు పాల్పడతారో చెప్పడం కష్టం. బస్సుల్లో, రైళ్లల్లో, భవనాల్లో టైంబాంబులు పెట్టవచ్చు. వీధుల్లో వెళ్తున్న అమాయక పౌరులను సంహరించవచ్చు విమానాలను హైజాక్ చేసి ప్రయాణీకులందరిని చంపేస్తామని బెదిరించవచ్చు. పంజాబ్‌లో మొత్తానికి ఉగ్రవాద చర్యలు సద్దుమణిగాయి. కాశ్మీర్‌లో నానాటికి అవి తీవ్రరూపం దాలుస్తూ ప్రభుత్వానికొక సవాలుగా పరిణమించాయి. ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్లు, టెర్రరిస్టులు అవునా? కాదా? అన్నది ఆసక్తికరమైన ప్రశ్న. ఈ ప్రశ్నకు సమాధానాలివ్వవచ్చు. నక్సలైట్లు కేవలం పోలీసులనే తమ లక్ష్యాలుగా ఎంపిక చేసుకుంటే వారిది ఉగ్రవాదం క్రిందకు రాదు. కానీ, వట్టి పుణ్యానికే అమాయక పౌరులను చంపినా, గాయపరచినా అది ముమ్మాటికీ ఉగ్రవాదం అవుతుంది.

అస్సాంలో ఉల్ఫా ఉగ్రవాదులు కూడా అమాయక పౌరులను హతం చేస్తున్నారు. అమాయక, పౌరులను హతం చేసే ఉగ్రవాదులు ఒక్కోసారి పోలీసులకు, సరిహద్దు భద్రతా దళాలకు తారసపడి కాల్పులు, ఎదురు కాల్పులు జరగడం మామూలే. ఆ కాల్పుల్లో ఉగ్రవాదులు మరణిస్తే, అమెరికా, తదితర పశ్చిమదేశాలు ఇండియాలో మానవ హక్కులు హరిస్తున్నారంటూ గొడవ చేయడం మామూలై పోయింది. బిన్‌లాడెన్‌ను సంహరించడానికి తాను మాత్రం ఏదేశంపైకి అయినా క్షిపణులు ప్రయోగించవచ్చు. భారత ప్రభుత్వం టెర్రరిజంను నిరోధించడానికి చర్యలు తీసుకుంటే మాత్రం మానవహక్కులను కాలరాస్తున్నట్లు లెక్క! ఇదీ అమెరికా పాటిస్తున్న ద్వంద్వ నీతి. మనదేశంలో శాంతి భద్రతల నిర్వాహణకు అవసరమైన చర్యలు తీసుకోవడం తప్పు! అమెరికా మాత్రం 'ప్రపంచ పోలీసులాగా వ్యవహరించి ఏ దేశం మీదకైనా క్షిపణులు పంపవచ్చు.

## 10.10 హింసకు కారణాలు

భారతదేశంలో గత దశాబ్ది నుంచి దౌర్జన్య పూరిత చర్యలు మితిమీరుతున్నాయి. సమాజంలో హింసాత్మక చర్యలు చోటు చేసుకోవడానికి ఈ క్రింది వాటిని కారణాలుగా చెప్పవచ్చును.

1. సామాజిక ప్రక్రియలలో భావ ప్రసారాలు, సంఘర్షణ, విలీనీకరణ, ముఖ్యమైనవి వీటి ద్వారా సమాజంలో అనేక మార్పులు సంభవించి, అవి హింసాత్మక చర్యలకు దారితీసే అవకాశముంది.

2. పెట్టుబడి దారీ విధానం వ్యక్తి స్వేచ్ఛావిధానానికి, తన స్వంత లాభానికి వినియోగించుకోవడానికి అవకాశమిస్తుంది. అనేక అక్రమ మార్గాలద్వారా (చీకటి బజార్లు, అక్రమ నిల్వలు) వ్యాపార సంస్థలు కృత్రిమంగా ధరలను పెంచి దేశ ఆర్థిక వ్యవస్థలో సంక్షోభాన్ని సృష్టిస్తున్నందువల్ల ఆందోళనలు రేగి, ప్రజలు హింసాయుత పద్ధతులను ఆశ్రయిస్తారు.

3. సామ్యవాద, పెట్టుబడి దారీ వర్గాలవారి మధ్య దృక్పథాలలోను, విలువలలోనూ, వైవిధ్యం హెచ్చుగా ఉండటం వల్ల దేశంలో విఘటనా కార్యక్రమాలు పెరుగుతున్నవి.



BRAOU

4. మానవీయ విలువలు నశించి స్వార్థ పరత్వం, లంచగొండితనం, ధనకాంక్ష మొదలైనవి వ్యక్తులలో పెరుగుట వలన, సమాజంలో కొందరు హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు.

5. అధికార కాంక్ష, సామ్రాజ్యవిస్తరణ, యుద్ధపిపాసుల వలన విదేశీ దాడులు జరిగి హింస ప్రబలుతుంది.

6. ప్రభుత్వ ధనమంతా విదేశీ దాడులు భయంతో దేశరక్షణకే కేటాయించడం వల్ల, సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వ ధన సహాయం లేక సమాజాభివృద్ధి ఉండదు. దీనివలన సామాజిక సంక్షోభాలు ఏర్పడతాయి.

7. సామాజిక అవ్యవస్థ, సంక్షోభాల వలన సామాజిక విప్లవాలు, ఉద్యమాలు బయలుదేరతాయి. ఈ ఉద్యమాలు, విప్లవాలలో హింస చోటు చేసుకుంటుంది.

8. సామాజిక వ్యవస్థ మీద, సిద్ధాంతాల మీద ఏవగింపు కలిగిన యువత సమానసమాజ స్థాపనకై క్రొత్త సిద్ధాంతాలను ఏర్పరచుకొని సమాజం పై తిరగబడుతుంది. వీరు సమాజానికి దూరంగా నివసించి సమాజాలలో కల్లోలాన్ని, హింసను సృష్టిస్తున్నారు.

9. కొందరు నాయకులు అల్ప సంఖ్యాక వర్గాల మధ్య కలతలూ అపోహలు పెంచడం వలన విభేదాలు పెరిగి అవి కలహాలుగా మారతాయి.

10. ప్రకృతి సంక్షోభాలైన అతివృష్టి, అనావృష్టి, భూకంపాలు మొదలైన వాటివలన మానవ జీవితం అస్తవ్యస్తమయి కనీస అవసరాలు తీరక, వాటి సాధనకై వ్యక్తులు అవసరమైతే హింసకు పాల్పడుతున్నారు.

11. ప్రకృతి సంపదలయిన చమురు గనులు, బొగ్గుగనులు, ఖనిజసంపద, జలమార్గాలు, నదీ జలాల పంపకం, మొదలయిన విషయాలలో కూడా రాష్ట్రాల మధ్య, దేశాలమధ్య ఘర్షణ లేర్పడి, అవి హింసగా రూపాంతరం చెందుతున్నాయి.

12. జాతివైషమ్యాలు, జాతిఅహంకారం, జాతి దురభిమానం, జాతి వివక్ష సమాజంలో హింసను ప్రేరేపిస్తాయి.

13. మతసహనం లోపించడంవలన వివిధ మతస్థుల మధ్య ఘర్షణ సంభవిస్తుంది. మత కలహాలు హింసకు కారణమవుతాయి.

14. కులాల మధ్య అంతరాలు, రాజకీయాలలో కుల ప్రాబల్యం అధికమవడం, కులతత్వం, ఒక కుల సమూహానికి మరొక కుల సమూహానికి మధ్య అసూయ, వైషమ్యాలు, కలహాలు ఘర్షణలు, మొదలైన వాటి వలన సమాజంలో అశాంతి సంఘర్షణ లేర్పడి, హింసాయుత చర్యలుగా రూపుదాలుస్తున్నాయి.

15. ప్రాంతీయ తత్వం, భాషా తత్వాల వలన హింసా ధృక్పథం సమాజంలో పెరుగుతోంది. ప్రాంతీయ, భాషా దురభిమానాలు హింసను ప్రేరేపిస్తాయి.

16. రాష్ట్రీయతా భావం కూడా హింసను ప్రోత్సహిస్తుంది.

17. లోపభూయిష్ట మైన విద్యా విధానం వలన విద్యావిలువలు క్షీణించిపోతున్నవి. విద్యాలయాల్లో రాజకీయ జోక్యంవలన ఈ సమ్మెలు, బంద్‌లలో హింస మిళితమై ఉండవచ్చు.

18. కష్టపడి చదువుకోవలసిన విద్యార్థులు రాజకీయ పక్షాల ప్రభావానికి లోబడి, విద్యార్థి ఎన్నికల సమయంలో ప్రత్యర్థి వర్గంపై దౌర్జన్యం, జరుపుతూ, హింసాయుత పద్ధతులను అవలంబిస్తున్నారు. క్రమశిక్షణను ఉల్లంఘించి ఏదో ఒక కారణంతో సమ్మెను ప్రారంభించి ప్రదర్శనలు జరుపుతూ, ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు.

BRAOU

19. నిరుద్యోగం, పేదరికం, క్రొత్త పరిశ్రమలు స్థాపించకపోవడం, ప్రైవేటీకరణ, కంప్యూటరీకరణ మొదలయిన వాటి వలన సమాజంలో అవ్యవస్థత ఏర్పడి, వ్యక్తులు హింసకు పాల్పడే అవకాశముంది.

20. నేటి సినిమాలు సామాజిక అవ్యవస్థకు, హింసకు ముఖ్య కారణాలుగా చెప్పవచ్చు. సినిమాలలో చూపించే అసభ్య శృంగారాలు, శ్లేష గర్భిత పాటలు, హత్యలు దోపిడీలు, మానభంగాలు, క్రౌర్యం, హింస, మొదలైన వాటి వలన బాలబాలికలు, యువత తప్పు దారిపట్టి అనేక హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు.

21. తరాల మధ్య అంతరాల వలన కూడా సమాజంలో సంఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. పాత తరం వారికీ, క్రొత్త తరంవారికీ ఆలోచనలలో దృక్పథంలో విలువలలో వ్యవహారిక రీతులలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉంటాయి. ప్రపంచమంతా సామాజిక వ్యవస్థకే ఎదురుతిరిగి, ఒక ప్రత్యేక సముదాయాన్ని తమకంటూ సృష్టించుకొని సమాజంలో అల్లకల్లోలాలను సృష్టిస్తున్నారు.

22. ముక్కుపచ్చలారని బాలికలపై అత్యాచారాలుచేసి, వారిని లైంగిక హింసకు గురిచేసి కొందరు నభ్య సమాజాన్ని తలెత్తుకోనీయకుండా చేస్తున్నారు. వారి లైంగిక ప్రవృత్తే ఈ హింసలకు కారణం.

23. సమాజంలో అంతః కలహాలు హింసను పెంచి పోషిస్తాయి.

24. కుటుంబ వ్యవస్థలో మానసిక, శారీరక హింసకు స్త్రీలు గురిఅవుతుంటారు.

26. నేడు ఎన్నికలలో హింస ప్రధాన పాత్ర వహిస్తోంది.

27. రాజకీయ అండ దండలతో ఉగ్రవాదులు సమాజంలో భీభత్సాన్ని సృష్టిస్తున్నారు. ఉగ్రవాదం సమాజంలో హింసకు కారణం.

రాజకీయ పార్టీలు, నేరాలు, కుల, మత, వర్గ, ప్రాంతీయ, భాషా సంఘర్షణలు, రాజకీయ సిద్ధాంతాలు, విప్లవాత్మక దృక్పథాలు, ఉద్యమాలు, ఉగ్రవాదం, అధికార కాంక్ష, స్వార్థం, ధనకాంక్ష, విలువల పతనం మొదలైన అంశాలన్నీ హింసకు కారణాలే.

BRAOU

## 10.11 హింస - పర్యవసానాలు

ప్రజాస్వామ్యానికి శత్రువు హింస ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛ పునాది అయితే, హింస దానికి శత్రువు వంటిది. హింసాకాండ ప్రబలిన చోట అర్థవంతమైన ప్రజాస్వామ్యం ఉండడం సాధ్యం కాదు. ప్రజాస్వామ్య ఉనికికే హింస గొడ్డలిపెట్టు.

హింస సామాజిక సామరస్యతకు భంగం కలిగిస్తుంది. అభివృద్ధి కార్యక్రమాలకు అవరోధంగా నిలుస్తుంది. అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా అమలు జరుగకపోతే సామాజిక అసమానతలు పెరుగుతాయి. దీని పర్యవసానంగా సామాజిక ఉద్రిక్తతలు పెరిగి ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు వాటిల్లవచ్చును.

బంద్‌లు నిర్వహించడం వలన సామాన్య జనజీవితం స్తంభించిపోతుంది. హింసా సంఘటనల అనంతరం కర్ఫ్యూలను విధించడం వలన ప్రాథమిక హక్కులలో ఒకటైన స్వేచ్ఛా సంచారానికి భంగం కలుగుతుంది.

యుద్ధాల వలన సామాన్య నాగరిక జీవనం అల్లకల్లోల మవుతుంది. ఉత్పత్తులు తగ్గి, సరుకుల ధరలు పెరుగుతాయి. యుద్ధం సామాజిక రీతులను విచ్ఛినం చేస్తుంది. సామాజిక సంబంధాలు తెగడం వలన నైతిక విలువలు పతనమవుతాయి. యుద్ధ సమయంలో నియమాల నతిక్రమించి లైంగిక స్వైర విహారం చేస్తారు. దేశాదాయంలో అధిక భాగం దేశ రక్షణకే కేటాయింపబడుతుంటే అభివృద్ధి కార్య క్రమాలకు ధనం లేక అనేక దేశాలు విద్య, వైద్య, ఉపాధి, సంక్షేమ రంగాలకు ఎక్కువ కేటాయించ లేకపోడం వలన, అవి సామాజికంగా, ఆర్థికంగా

వెనుకబాటుకు కారణం అవుతుతాయి.

యుద్ధాలతో జరిగే ఆస్తి నష్టం ఊహకందదు. శాంతియుతంగా ఉండే జాతులను, దేశాలను యుద్ధం కల్లోలితం చేస్తుంది. ఒక దేశానికీ ఇంకొకదేశానికీ ఉండే విజ్ఞాన, సాంస్కృతిక, పారిశ్రామిక సంబంధాలను యుద్ధం త్రెంచి వేస్తుంది. అంతర్జాతీయ సంబంధాలను తెంచడమే కాక యుద్ధం వ్యక్తులను నిర్వీర్యం చేస్తుంది. కుటుంబాలు నాశనమవుతాయి. సముదాయాలు విఘటిత మవుతాయి. యుద్ధం వల్ల వచ్చే పరిణామాలు తరతరాల వరకూ ఉంటాయి. ఆస్తినష్టం, భూసారముడిగిపోవడం, అపార జన నష్టం జరుగుతుంది. పాత యుద్ధాలకు, ఆధునిక యుద్ధాలకు తేడా ఉంది. పాతకాలపు యుద్ధాలు కొంతమంది సైనికులమధ్య, కొన్ని ఆయుధాల వాడకంతో కొంతమంది మరణాలకు మాత్రమే పరిమితమై ఉండేది. కానీ ఆధునిక యుద్ధాలు సంపూర్ణ యుద్ధాలు, ఆధునిక మరణాయుధాలతో చేసే యుద్ధం సమాజాన్ని సమూలంగా నాశనం చేస్తుంది.

విప్లవం సామాజిక అవ్యవస్థ విప్లవకారులలోని కార్యకలాపాల వత్తిడికి జాతీయ సమాజం విచ్ఛిన్నమవుతుంది. పూర్వపు రాజకీయ సంబంధాలు వీగిపోయి, ప్రభుత్వ కార్యకలాపాలు కొన్నాళ్ళు స్తంభించిపోతాయి. సామాజిక, నైతిక నియమాలు శిథిలమౌతాయి. ముఖ్యమైన వ్యవస్థలన్నీ తీవ్రమైన మార్పులకులోనౌతాయి. విద్య, మతం, కుటుంబ వ్యవస్థ, రాజకీయ, ఆర్థిక రంగాలు - వీటిలో ఒకదాని మార్పు ఇంకొక దాన్ని ప్రతిబింబిస్తుంది.

కులతత్వం, వలన కులసభ్యులు బాధ్యతాయుతమైన పౌరులుగా కాక కులానికి కొమ్ముకాసే స్వార్థపరులుగా తయారవుతారు. కులాన్ని కొంతమంది వ్యక్తులు తమ స్వలాభానికి వాడుకుంటున్నారు. కులతత్వం, మతతత్వం, సమాజంలో అల్లకల్లోలాన్ని సృష్టిస్తుండడం వల్ల, మనిషిని మనిషి నమ్మడమే కష్టమౌతున్నది. గృహదహనాలు, మానభంగాలు, హత్యలు మొదలైనవి కుల, మతతత్వ పర్యవసానాలు.

భాషా ప్రాంతీయ తత్వాల వల్ల చోటుచేసుకున్న హింస వలన దేశం అనేక ముక్కలుగా విడిపోయే ప్రమాదం ఉంది. రాష్ట్రీయ, ప్రాంతీయ భాషా దురభిమానాలు దేశ సమైక్యతకు అవరోధాలు. హింస వలన సమాజంలో అరాచకం ప్రబలుతుంది. ఎన్నికలలో హింస వలన ప్రజలు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవడానికి భయపడుతున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ఉగ్రవాదుల హింసాత్మక చర్యల వల్ల ప్రజలు ఒక చోట నుంచి ఇంకొక చోటికి ప్రయాణం చేయడానికే భయపడుతున్నారు. ప్రజలలో అభద్రతా భావం పెరిగి భయాందోళనలు చోటు చేసుకుంటున్నాయి.

BRAOU

హింసా దౌర్జన్యాలు అక్కాచెల్లెల్ల వంటివి. ఇవి ఉన్న చోట శాంతి లేదు. శాంతిలేని చోట అభ్యుదయం లేదు, అభ్యదయం లేని చోట అనాగరికత తిష్టవేస్తుంది. అది మానవజాతిని ఆటవిక దశకు తీసుకొనిపోతుంది.

## 10.12 ముగింపు

ఆధునిక సమాజాలకు సవాలుగా మారిన హింస, ఆయా సమాజాలను పట్టిపీడిస్తున్నది. మానవులు ప్రవర్తన జంతుజాలం కన్నా ఎంతో సంస్కరణకు గురైనా ఇప్పటికీ, ఈర్ష్యా, ద్వేషాలు, వ్యక్తిగత, సామూహిక అలజడులు, ఉగ్రవాదం, ప్రభుత్వ వ్యవస్థీకృత హింస. రాజకీయ సంకుచిత కారణాలు. మత, కులోన్మాదాలు హింసకు కారకమవుతున్నాయి. హింస అభివృద్ధి నిరోధకమయింది. హింసాత్మకంగా మారిన సమాజాలలో అభివృద్ధి కుంటుపడుతుంది. అందుకే ప్రపంచ దేశాలన్నీ హింసకు వ్యతిరేకంగా ఐక్యంగా నిలుస్తున్నాయి.

## 10.13 మాదిరి పరీక్ష ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబురాయండి?**

1. హింస నిర్వచనాలను వివరించండి?

2. హింస కారణాలు వివరించండి?

3. సమాజం మీద హింస ప్రభావాన్ని విపులీకరించండి?

II. ఈక్రింద ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. హింస అనగా ఏమి?

2. హింసపై గాంధీ అభిప్రాయం ఏమిటి?

3. హింసను వర్గీకరించండి?

## 10.14 చదవదగిన పుస్తకాలు


1. Seventees Problem of Man and Society : Rolf Borpody.

2. Social Control : Joseph S. Rousec.

3. Political Sociology : Tomm Batamoor.


BRAOU

# భాగం-11: సామాజిక ఉద్రిక్తలు-హింస

విషయక్రమం


11.0 ఉద్దేశాలు

11.1 పరిచయం

11.2 ఉద్రిక్తతలు-అర్థం

11.3 ఉద్రిక్తతలు కారణాలు

11.4 ఉద్రిక్తతల్లో రకాలు

11.5 వర్గ ఉద్రిక్తతలు

11.6 మత సంఘర్షణలు

11.7 రాజకీయ ఉద్రిక్తతలు

11.8 భాషా ప్రాంతీయ ఘర్షణలు

11.9 ఆర్థిక ఉద్రిక్తతలు

11.10 రక్షణ, భద్రతకు సంబంధించిన ఉద్రిక్తతలు

11.11 స్వేచ్ఛకు సంబందించిన ఉద్రిక్తతలు

11.12 స్థిరీకరణ ఘర్షణలు

11.13 ముగింపు

11.14 మాదిరి పరీక్షా ప్రశ్నలు

11.15 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 11.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సామాజిక ఉద్రిక్తతల అర్థ, కారణాలు, రకాలు తెలుసుకుంటారు.
- వర్గ, మత, రాజకీయ, భాషా ఆర్థిక ఉద్రిక్తతల గురించి తెలుసుకుంటారు.

## 11.1 పరిచయం

సమాజం స్తబ్దంగా, చలనం లేకుండా ఉండదనేది చారిత్రక సత్యం, స్తబ్దత అనేది జఢలక్షణం. మార్పు జీవలక్షణం. ప్రకృతిలో మార్పువచ్చినట్లుగానే సమాజంలో కూడా మార్పులు రావడం సహజమే. వెనుకబడిన సమాజాలలో మార్పు మందకొడిగానూ, ఆధునిక సమాజాలలో వేగంగానూ మార్పు వస్తుంది. మానవుడు సహజమైన ప్రాకృతిక పరిస్థితుల మొస్తరుగానే సాంస్కృతిక పరిస్థితులకు కూడా సమాజంలో తీవ్రమైన మార్పులు రావడంతో, సాంస్కృతిక గతి వేగం పెరగడంతో, మానవుడు సర్దుకోలేక పోతున్నాడు. పారిశ్రామికీకరణ, నగరీకరణ, ప్రక్రియల ప్రభావంతో మానవుడు ఎక్కువగా అసమయోజనానికి గురిఅవుతున్నాడు. పాత విలువలకు కొత్త విలువలకు, ప్రాచీన

ఆధునిక సంస్కృతిలో విలువలు పతనం చెందడం వల్లనే సామాజిక అవ్యవస్థ సంభవిస్తుందనీ, దీనివల్లనే అనేక యుద్ధాలు, నేరాలు, విప్లవాలు, ఆత్మహత్యలు, సంభవిస్తున్నాయనీ సోరోకిన్ అభిప్రాయం. ప్రజాస్వామ్యం నియంతృత్వాల మధ్య జరిగే సంఘర్షణ గానీ, పెట్టుబడి దారీ ఆర్థిక విధానం, కమ్యూనిజానికీ మధ్య ఉన్న వైరుధ్యం కానీ, జాతీయ అంతర్జాతీయ వాదాల మధ్య ఉన్న సంఘర్షణ గానీ, స్వేచ్ఛా నిరంకుశత్వాల మధ్య వైరుధ్యాలు గానీ ఈనాటి సామాజిక సంక్షోభానికి కారణాలు కావని చెబుతూ గత నాలుగు శతాబ్దాల సంస్కృతి పతనం చెందడం వల్లనే ఈనాడు సామాజిక అవ్యవస్థ, సంక్షోభం సంభవిస్తున్నవని సోరోకిన్ అభిప్రాయపడినారు.

## 11.4 సామాజిక ఉద్రిక్తత - రకాలు

### కుల సంఘర్షణలు

కుల వ్యవస్థ చాలా ప్రాచీనమైనది. కొంత కాలం దానివల్ల సమాజానికి ప్రయోజనాలు కల్గినా ప్రస్తుతం వ్యక్తికీ, సమూహానికి, సమాజానికి కుల వ్యవస్థ ద్వారా ఎక్కువ నష్టాలే జరుగుతున్నాయి. కుల వ్యవస్థ ఒక విధంగా జడమైన వృత్తి వ్యవస్థను సృష్టించింది. ఒక కులంలో పుట్టినవారు ఐచ్ఛికంగా తమ కులవృత్తిని మార్చుకునే స్థితిలో లేరు పారిశ్రామిక యుగంలో సమాజానికి వృత్తి వైవిధ్యం చాలా అవసరమయినపుడు కుల వ్యవస్థ ఆ అవసరాలను తీర్చలేకపోతున్నది. దానితో వ్యక్తులకు సమాజంలో అంతస్థు, అవకాశాలు తగ్గిపోతున్నాయి. అవసరాలకు తగినట్లు శ్రమ విభజన కూడా జరగడం లేదు.

కులవ్యవస్థ వల్ల నిమ్న కులాల వారు ఎన్నో తరాలుగా బాధపడినారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మనిషి సమానస్వేచ్ఛను కోరతాడు గాబట్టి కులవ్యవస్థ అందుకు విరుద్ధంగా పనిచేస్తుంది. ఒక కులానికి మరొక కులానికి మధ్య అనేక రంగాలలో పోటీలు, తగాదాలు పెరుగుతున్నవి. ఒక కులం పెత్తన్నా ఇంకొక కులం ప్రతిఘటిస్తున్నది. కులతత్వం మరోవిధంగా పెరిగిపోతున్నది. ఎన్నికలలో కులతత్వ ప్రభావం ఎక్కువగా కనబడుతున్నది. అభ్యర్థుల గుణదోషాలను పరిగణించకుండానే, కులాలను బట్టి ఓటు వేయడం జరుగుతోంది. వృత్తి ఉద్యోగాలు ఇవ్వడంలో కూడా కుల ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. అధికారంలో ఉన్న వ్యక్తి తన కులానికి సంబంధించిన వాళ్ళనే ప్రభుత్వంలో తన పలుకుబడిని ఉపయోగించి ఉద్యోగాలను ఇప్పిస్తున్నాడు. రాజకీయ ముఠా తత్వాలు కుల తత్వం మీద పనిచేస్తూ, సామాజిక విద్యా సంక్షేమాలను కూడా ఇంచుమించుగా కులప్రాతిపదిక మీదనే నడిపిస్తున్నారు. ప్రతికులంవారు ప్రత్యేకంగా తమ కుల సంఘాలను ఏర్పరుచుకుంటున్నారు.

కుల ద్వేషాల వలన ఒక కులానికి, వేరొక కులానికి మధ్య హింసాయుతమైన సంఘర్షణలు బయలుదేరుతున్నాయి. గృహనిర్మాణంలో, వినోద కార్యక్రమాలలో దాదాపు నాగరిక జీవనంగా అన్నింటిలో కూడా కులతత్వం విఘటనాత్మకమైన పాత్ర వహిస్తున్నది.

## 11.5 వర్గఘర్షణలు

మన సమాజంలో సాంప్రదాయికంగా వస్తున్న కుల వ్యత్యాసాలే కాకుండా దారుణమైన వర్గ వ్యత్యాసాలు కూడా ఉన్నాయి. ఒక వర్గం ఆదాయానికి, ఇంకొక వర్గం ఆదాయానికి తేడా కొన్ని వేల రెట్ల నిష్పత్తిలో ఉన్నది. ఈ తేడాను తగ్గించడానికి పంచవర్ష ప్రణాళికలు రూపొందించినా, వాటి ప్రభావం సామాన్య పౌరుని మీద ఎక్కువగా లేదు. పట్టణ ప్రాంతాలలో కూడా ధనిక పేద వర్గాల మధ్య వ్యత్యాసాలు, ఇంకా ఎక్కువగా ఉన్నాయి. పల్లె ప్రాంతాల ప్రజలతో పోలిస్తే, గిరిజనులకు దేశ ద్రిమ్మరులకు తదితర జాతులకు ఉన్నవ్యత్యాసం కూడా అమితంగా ఉన్నది. ఈ వర్గ వ్యత్యాసాలన్నీ దేశంలో వర్గ పోరాటానికి, సంఘర్షణకు దారి తీస్తున్నవి. యజమానికి, కార్మికులకు, భూమి లేని కూలీలకు భూస్వాములకు, హరిజనులకు, పై కులాలవారికి, పేదరికానికి మధ్య వర్గ సంఘర్షణలు చెలరేగుతున్నాయి.

BRAOU

## 11.6 మతఘర్షణలు

మతఘర్షణలు పరస్పర వైషమ్యం వలన జనిస్తుంటాయి. వైషమ్యాలు పూర్వ చరిత్రలోని అనుభవాల మీద, సాంస్కృతిక విలువల మీద, వేష, భాష, ఆహార నియమాల మీద ఆధారపడి ఉంటాయి. ఒక తరం నుంచి ఇంకొకతరానికి అవి సంక్రమిస్తుంటాయి. చాలా కాలం నుంచి భారతదేశంలో మత ఘర్షణలు సంభవిస్తున్నాయి. మత ప్రాతిపాదికనే ముస్లింలీగ్ స్థాపన, దేశ విభజన జరిగింది. 1942లో అటు తరువాత 1947లో హిందువులు, మహ్మదీయులు ఒకరినొకరు చంపుకొని దారుణమైన రక్తపాతాన్ని హింసాకాండను నిరాఘటంగా కొనసాగించారు. మతం చెప్పే సౌభ్రాతృత్వాన్ని మంటకలిపి, మనుషులు పశువులుగా, రాక్షసులలాగా ప్రవర్తించినారు. ఈ నాటికి కూడా మతఘర్షణలు మాసిపోలేదు.

మత ఘర్షణలు జరగడానికి ముఖ్యంగా భౌగోళిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ కారణాలుంటాయి.

### 1. భౌగోళిక కారణాలు

మత ప్రకర్షణలకు భౌగోళిక కారణాలు ప్రధానమైనవి. జీవన పద్ధతులు, ప్రవర్తన మొదలగు విషయాలలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవుల మధ్య భిన్నత్వాల కారణంగా, భౌగోళికంగా వేరువేరు ప్రాంతాలలో నివసించుట వలన మత ప్రకర్షణల తీవ్రత, వాటి స్థాయి అధికమవుతున్నది.

### 2. సాంస్కృతిక కారకాలు

మనిషి తన కుటుంబంలో, సమూహంలో తన మతాన్ని గురించి బాల్యం నుంచి సాంఘికీకరణ ద్వారా అనేక విషయాలు నేర్చు కుంటాడు. ఆహారం అభ్యాసాలు, చుట్టరికాలు, స్వకీయ పరకీయ సంబంధాలు మొదలైన అనేక విషయాలను నేర్చుకుంటాడు. ప్రతివ్యక్తికీ తన మతం పట్ల స్వాభిమానం ఇతర మతాల పట్ల ఒక విధమైన నిరసన దృష్టి ఏర్పడతాయి. వ్యక్తులు నేర్చుకున్న మంచి చెడ్డలు విశేష పరిస్థితులలో బయల్పడతాయి. ఎదుటివారు ప్రదర్శించే మత వివక్ష వలన వ్యక్తిలో తనతమ స్వాభిమానము, పరమత ద్వేషం బయల్పడతాయి. ఉత్సవాలలో, పూజా పునస్కారాలలో తమ దేవుళ్ళను ఊరేగిస్తున్నపుడు ఇతర మతాన్ని నిందించాలనే దుగ్ధ చెడ్డపనులకు, ఎదుటివారి మందిరాల మీద దాడి చేయడానికి అపవిత్ర కార్యకాలపాలకు దారితీస్తుంది. దీనితో కుట్రలు, కలహాలు, పరస్పర హింసలు, హత్యలు పెరిగిపోతున్నాయి.

### 3. ఆర్థిక కారణాలు

ఒక మత సముదాయం వారు తమ పిల్లలకు సరైన వృత్తి విద్యావకాశాలు లభించనపుడు ఎదుటి వారి సంకుచిత దృష్టిని అందుకు కారణంగా ఆపాదిస్తుంటారు. ఒక సమూహంవారు, ఎదుటి మతం వారు తమ వైపు చిన్నచూపు చూస్తున్నారని భావించినపుడు గానీ, వారిలో అధిక సంఖ్యాకులకు సరైన ఉద్యోగాలు ఆర్థిక అవకాశాలు లేక బాధ పడినపుడు గానీ ఆ సభ్యులలో కలిగే నైరాశ్యం ఎదుటి మతం వారిపైన ద్వేషాన్ని కలిగిస్తుంది. వీరిలో రగులుతున్న ద్వేషాగ్ని కలహరూపంలో హింసా రూపంలో బైటికి వస్తుంది.

## 11.7 రాజకీయ ఉద్రిక్తతలు

బ్రిటిష్ వారి పాలనలో ప్రధానంశం విభజించి పాలించడం హిందువులను, మహమ్మదీయులను మత పరంగా విడదీసి, సాంస్కృతికంగా వారి మధ్య వైషమ్యాలు పెంచి, రాజకీయంగా వారిని పరస్పర శత్రువులుగా తయారు చేసినారు. దీనివలన హిందూ, ముస్లింల మధ్య మతకలహాలు పెరిగి అవి చివరకు భారతదేశ విభజనకు దారితీసినాయి. పాకిస్థాన్ స్వతంత్రదేశంగా వేరుపడినా, భారత దేశంలో హిందూ ముస్లింల మధ్య మత ఘర్షణలు చెలరేగుతూనే ఉన్నాయి.

BRAOU

## 11.8 భాషా ప్రాంతీయ ఉద్రిక్తతలు

భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత ఒక భాష మాట్లాడే వారంతా భాషాపరంగా తమను గుర్తించి తమకు ఒక రాష్ట్రం ఇవ్వవలసిందిగా కేంద్రప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చారు. తత్ఫలితంగా భారతదేశం భాషా రాష్ట్రాలుగా విభజింపబడినది. ఒక విధంగా భాషా రాష్ట్రాలు సమర్థనీయమే అయినప్పటికీ వాటి ద్వారా ప్రాంతీయ తత్వం కూడా బలపడుతున్నది. ఒక రాష్ట్రానికి చెందిన ప్రజలు తమ రాష్ట్ర ప్రగతి, రాష్ట్రాభివృద్ధి, తమ రాష్ట్రంలో నిర్మించవలసిన ప్రాజెక్టులు, వేయవలసిన రోడ్లు, రైలుమార్గాలు, విద్య, వైద్యం, పరిశ్రమలు, వ్యవసాయం నీటి వనరులు ఇట్లా అనేక విషయాలపై దృష్టి కేంద్రీకరించి వాటికోసం నిరంతరం ప్రయత్నాలు చేస్తూ, ఇదే విధమైన పొరుగు రాష్ట్రాల వారి అవసరాలను విస్మరిస్తూ ఉంటారు. అవసరమైతే తమ స్వప్రయోజనాల నిమిత్తం పొరుగు రాష్ట్ర వాసులతో కేంద్రంతో ఘర్షణలకు దిగుతుంటారు. ఈ పరిస్థితి ప్రాంతీయ తత్వానికి, ప్రాంతీయ ఘర్షణలకు దారి తీస్తుంది.

## 11.9 ఆర్థిక ఉద్రిక్తతలు

సామాజిక ప్రకర్షణలకు ఆర్థిక కారణాలు ముఖ్యమైన పాత్రను వహిస్తాయి. దారిద్ర్యం, ఆకలి, నిరుద్యోగం జబ్బులు ఎక్కువగా ఉన్న దేశాలలో మనుషుల సామాజిక జీవనస్థాయి దుర్భరంగా ఉంటుంది. వారు నీతి నియమాలను, సంస్థల విలువలను పాటించరు. శారీరకంగా, మానసికంగా వ్యక్తిలో రగిలే వ్యథలు సామాజిక సంఘర్షణలను సృష్టిస్తాయి.

## 11.10 రక్షణ భద్రతలకు సంబంధించిన ఘర్షణలు

మనిషికి భౌతికంగానూ, శారీరకంగాను రక్షణ లేకపోతే అతనిలో విప్లవాత్మక దృక్పథాలు ఏర్పడతాయి. జాతీయాదాయంలో ఎక్కువ భాగాన్ని మారణాయుధాల ఉత్పత్తికి ఖర్చుపెట్టే సమాజంలోనూ, అగ్రరాజ్యాల యుద్ధభయం బెదిరిస్తున్న సమాజంలోనూ సామాజిక సంక్షేమం కుంటుపడుతుంది. దీనివలన ప్రజల ప్రాథమిక అవసరాలు తీరక, అనేక సామాజిక సమస్యలను ఎదుర్కొంటూ సంఘర్షణా దృక్పథాన్ని కలిగి ఉంటారు.

BRAOU

## 11.11 స్వేచ్ఛకు సంబంధించిన ఘర్షణలు

జీవుల ముఖ్యలక్షణాలలో స్వేచ్ఛ ఒకటి ఆలోచనలోనూ, ఆచరణలోనూ ప్రతివ్యక్తి స్వేచ్ఛను కోరతాడు. ఏ ప్రభుత్వమైతే వ్యక్తుల స్వేచ్ఛను అరికట్టి పీడిస్తుందో ఆ సమాజంలో సంక్షోభం బయల్దేరుతుంది. మిలటరీ పాలన, పోలీసుపాలన, నిరంకుశంగా చేసే నిర్బంధం, మొదలైన చర్యలన్నీ ప్రజలను రెచ్చగొడతాయి. వాళ్ళు తమ దాస్యశృంఖలాలను తెంచుకొని స్వేచ్ఛా వాయువులను పీల్చడానికి ఘర్షణా పద్ధతులను అవలంబిస్తారు.

## 11.12 స్తరీకరణ ఘర్షణలు

సమాజంలో జడీ భూతమైన స్తరీకరణ ఉన్నప్పుడు ఘర్షణలు తప్పవు. జడీ భూతమైన వర్గ వ్యవస్థ గానీ, కులవ్యవస్థగానీ మనిషి శక్తి సామర్థ్యాలను అణచివేస్తుంది. సామాజిక అసమానతలు ఘర్షణా దృక్పథాన్ని రేకెత్తిస్తాయి.

ఒకేవస్తువును చాలామంది కాంక్షించినపుడు సంఘర్షణ ఏర్పడుతుంది. ఉదాహరణకు మనదేశంలో వివిధ రాష్ట్రాల మధ్య నదీజలాలకు సంఘర్షణలు ఏర్పడుతూ ఉంటాయి.

అంతస్తు, హోదా, గౌరవం, అధికారం మొదలయిన వాటికోసం సంఘర్షణ పడతారు. విలువలలోని, ఆదర్శాలలోని భేదాలు సంఘర్షణలకు దారి తీస్తాయి.

పైన పేర్కొన్న ప్రకర్షణలు సమాజంలో ఉద్రిక్తతలను పెంచి, హింసాకాండ చెలరేగటానికి దోహదం చేస్తున్నాయి.

## 11.13 ముగింపు

సమాజం నిత్య చలనశీలి. సామాజికంగా వచ్చిన మార్పుల ఫలితంగా మనిషి పాత, క్రొత్త ధోరణుల మధ్య సంఘర్షణకు గురవుతాడు. దీనితో ఒక్కొక్కసారి సామాజిక ఉద్రిక్తత తలెత్తి హింసాకాండ జరుగుతున్నది. శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానం పెంపొందడం, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, వలసలు, వ్యక్తివాదం, సామాజిక అస్థిరత సంఘర్షణలకు మూలకారణమవుతుంది. సామాజిక ఉద్రిక్తతలు స్థరీకరణ పరంగా, రాజకీయ పరంగా తలెత్తుతున్నాయి. ఆర్థిక, సాంస్కృతిక, ప్రాంతీయ, భాషా వాదాల సామాజిక ఉద్రిక్తతలకు మూలమవుతున్నాయి. మతం, కులం కూడా సామాజిక ఉద్రిక్తతలకు కారణమవుతున్నది.

## 11.14 మాదిరి పరీక్ష ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబురాయండి?**

1. సామాజిక ఉద్రిక్తతలు అనగానేమి? అర్థవివరణ రాయండి.
2. మతఘర్షణల గురించి వివరించండి?
3. సామాజిక ఉద్రిక్తతలకు కారణాలు వివరించండి?

**II. ఈ క్రింద ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.**

1. స్తరీకరణ ఘర్షణల గురించి రాయండి?
2. వర్గ ఘర్షణలగురించి రాయండి?
3. భాషా, ప్రాంతీయ ఉద్రిక్తత లేవి?

BRAOU

## 11.14 చదవదగిన పుస్తకాలు

1. Rolf Borpandy : Seventiees Problems of Man and Sociology.
2. Tomm Batamore : Political Sociology.

# భాగం-12: హింస-నివారణ-అభివృద్ధి

విషయక్రమం


12.0 ఉద్దేశాలు

12.1 పరిచయం

12.2 మతహింస - నివారణ

12.2.1 కులాల మధ్య హింస - నివారణ

12.2.2 ప్రాతీయ హింస - నివారణ

12.2.3 భాషా సంబంధ హింస - నివారణ

12.2.4 రాష్ట్రీయతా హింస - నివారణ

12.2.5 యువత - అశాంతి - హింస

12.2.6 గ్రామాలు - హింస

12.2.7 సినిమాలు - హింస

12.2.8 భౌగోళిక కారకాలు - హింస

12.2.9 కుటుంబ అవ్యవస్థ-హింస నివారణ

12.2.10 యుద్ధం - హింస - నివారణ

12.2.11 ఎన్నికల హింస - నివారణ

12.2.12 ఉగ్రవాదం - నివారణ

12.3 అభివృద్ధి

12.4 అభివృద్ధికి సూచనలు

12.5 ముగింపు

12.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

12.7 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 12.0 ఉద్దేశం

- అందువల్ల హింసను నివారించే పద్ధతులను అవగాహన చేసుకుంటారు.
- మత, ప్రాంతీయ, భాషా, సంబంధ హింస నివారణ అభివృద్ధికి సూచనలు తెలుసుకుంటారు.

## 12.1 పరిచయం

హింస, హింసకు గల కారణాలు, హింస పర్యవసానాలు, ప్రకర్షణలు, కారణాలు, మొదలైన వాటి గురించి క్రిందటి అధ్యాయాలలో తెలుసుకున్నాము. ఈ అధ్యాయంలో హింస నివారణ అభివృద్ధి అనే అంశాలను చర్చిస్తాము.

ప్రపంచ దేశాలన్నీ శ్రేయోరాజ్యస్థాపనే తమ ఆశయంగా ధ్యేయంగా ఇరవయ్యవ శతాబ్దిలో ప్రకటించినాయి. కేవలం పోలీసు, సైనిక బలం ద్వారా శాంతి భద్రతలను పరిరక్షించడమూ, విదేశీ దండయాత్రలనుంచి దేశాన్ని రక్షించడమూ మాత్రమే గాక, దేశంలోని సామాజిక సమస్యలను, ఘర్షణలను, హింసను నిర్మూలించడం, నిరోధించడం, సంక్షేమ రాజ్యం కర్తవ్యం. సమాజంలో హింస నివారణను ఈ క్రింది విధంగా చర్చించవచ్చును.

## 12.2 మత హింస-నివారణ

రాజకీయాధికారం కోసం ప్రాకులాడే వ్యక్తులు తాము రాజ్యాధికారం చేజిక్కించుకోవడం కోసం మతాన్ని మతగురువులను మతావలంబికులైన ప్రజలను వినియోగించుకుంటున్నారు. ఈ సందర్భంలో మత కలహాలు, మత హింస చెలరేగుతున్నవి. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని మతగురువులు, పీఠాధిపతులు, విజ్ఞులైన ప్రజలు, రాజకీయ పక్షాలు, సమిష్టిగా ఆలోచించి అనేక మతాలున్న భారతదేశంలో మతసహనాన్ని పెంచడానికి మత సంఘర్షణలు నివారించడానికి కృషి చేయాలి. మన దేశంలో నానాటికీ పెచ్చుపెరుగుతున్న మత సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుక్కోవలసిన బాధ్యత దేశంలోని ప్రజాస్వామ్య రాజకీయ పార్టీలన్నింటిపైన ఉన్నది. సమాజశాస్త్రజ్ఞులు, రాజకీయ నాయకులు సమిష్టిగా ఈ సమస్యపై కృషి చేయవలసి ఉంది. మతం రాజకీయాలలో భాగంగా ఉండకూడదని స్పష్టీకరించి ఆచరించేటట్లు చేయాలి. మత హింసను నిరోధించేందుకు సమాజంలో అన్ని మతాల పండగలను సమంగా ఆదరించాలి.

జాతీయ పండుగలలో ఉత్సవాలలో అన్ని మతాల వారూ పాల్గొనేటట్లు చేయాలి. స్వాతంత్ర్యోద్యమంలో హిందువులు, ముస్లింలు పాల్గొన్న సంఘటనలను కథలుగా చిన్నతనంనుంచి పిల్లలకు చెప్పాలి. మత కలహాలవల్ల, మతహింసల వల్ల కలిగే నష్టాన్ని వివరించాలి. 'మనమంతా భారతీయులం' అనే దృక్పథాన్ని అన్ని మతాలవారిలో కల్గించాలి.

### 12.2.1 కులాల మధ్య హింస - నివారణ

భారతీయ సమాజ ముఖ్య లక్షణం స్తరీకరణ. కులతత్వాన్ని, కులాల మధ్య అంతరాలను తొలగించే ప్రయత్నాలు జరగాలి. కులాల పేరిట దూషించే వారిని కఠినంగా శిక్షించాలి. అన్ని కులాల వారికి విద్యాలయాలలో, ఉద్యోగాలలో, ఎన్నికలలో, శాసనసభలలో సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలి. వివిధ కులాలు వారి కులాల పేరిట ఏర్పాటు చేసుకునే సంఘాలను ప్రోత్సహించరాదు. కులాల వారీ వేదికల నిర్మాణాన్ని నిరోధించాలి. కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి. కులాల మధ్య తరతరాలుగా వస్తున్న సామాజిక, ఆర్థిక అంతరాలు నశించనిదే కుల తత్వం పోదు. పారిశ్రామికీకరణం, నగరీకరణ ద్వారా అన్ని కులాలలో కనీసావసరాలు తీరే విధంగా కృషి జరగాలి. సాంఘిక విధానం ద్వారా కులాలలో స్వాతంత్ర్య, సమానత్వ ఆకాంక్షను పెంపొందించే చర్యలు అమలు జరుపాలి. అంచెలవారీగా కులాన్ని సమూలంగా నిర్మూలించడానికి దీక్షాయుత మైన కృషి జరగాలి అట్లా జరుగనిదే కులతత్వ మహమ్మారి మన సమాజాన్ని వీడదు.

### 12.2.2 ప్రాంతీయతత్వం హింస - నివారణ

ప్రథమంగా మనం భాతీయులమనీ, ఆ తరువాతనే మనమందరం ఫలానా ప్రాంతానికి, రాష్ట్రానికి చెందినవారమని, తమ ప్రాంతీయభివృద్ధి రాష్ట్రాభివృద్ధి, పొరుగువారి అభివృద్ధికి అడ్డురాకూడదనే భావన లోపించడమే ప్రాంతీయ తత్వం. ఇదే విధంగా ఒక రాష్ట్రంలో కూడా వివిధ ప్రాంతాలవారు వివిధ జిల్లాల వారు, మండల స్థాయిలోని గ్రామస్థాయిలోని ప్రజలు తమ అవసరాల పరిష్కారానికి చేసే ప్రయత్నంలో అదే రాష్ట్రానికి చెందిన ఇతర ప్రాంతా[illegible]రి అవసరాలను ఇబ్బందులను గుర్తించలేకపోవడం కూడా ప్రాంతీయతత్వమే.

భారతీయులమంతా ఏ రాష్ట్ర ప్రజలయినా ఏ భాష మాట్లాడే వారయినా ప్రథమంగా అందరం భారతీయులమని గుర్తించి దేశ సమగ్రాభివృద్ధికి కృషి చేయడం అవసరం. దేశ సమగ్రాభివృద్ధిని ధ్యేయంగా పెట్టుకుని, ప్రాంతీయ



BRAOU

తత్వాన్ని విడనాడి, ప్రతి రాష్ట్రంలోనూ, ప్రతి ప్రాంతంలోనూ స్థానిక పురోభివృద్ధి కాంక్షిస్తూ అందుకు కృషి చేస్తూనే పొరుగు ప్రాంతాల, పొరుగు రాష్ట్రాల అభివృద్ధిని కూడా కాంక్షించి వారికి అడ్డురాకుండా ఉండడం ప్రతి భారతీయుని కర్తవ్యంగా భావించాలి. వివిధ ప్రాంతాల మధ్య గల ఆర్థిక పరమైన తేడాలను కూడా తొలగించడం అవసరం.

### 12.2.3 భాషా సంబంధ హింస - నివారణ

కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు ప్రజలు మనదేశంలో అనేక భాషలు మాట్లాడుతుంటారు. అధిక సంఖ్యాకులు మాట్లాడే భాషలకు లిపిఉన్నా, లిపి లేని భాషలు మాట్లాడే ప్రజలు కూడా మనదేశంలో చెప్పుకోతగ్గ సంఖ్యలోనే ఉన్నారు. భారతదేశంలోని ప్రజలు భాషా పరంగా అనేక సమూహాలుగా విడిపోయారు. ఏ భాషా సమూహం వారైనా వారి భాషే గొప్పదనే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. దీనివలన వివధ భాషలు మాట్లాడే ప్రజల మధ్య సహకార సమన్వయాలు లేవు. భాషాపరంగా వచ్చే సమస్యలు ప్రాంతీయ సమస్యలను హింసను సృష్టిస్తున్నాయి. భాష అనేది భావప్రసార సౌలభ్యంకోసమేనని, ప్రతి భాషకు విలువ ఉందనీ, అన్ని భాషలు సమానమనుకునే భావన ప్రజలందరిలో కలిగేలా చేయాలి. అన్ని భాషా గ్రంథాలను సమంగా గౌరవించాలి. అప్పుడే భాషాపరమైన భేదాలు తొలగుతాయి. తద్వారా ప్రాంతీయ హింస కూడా తగ్గుతుంది.

### 12.2.4 రాష్ట్రీయతా హింస - నివారణ

ఒక రాష్ట్రానికి చెందిన ప్రజలు తమ రాష్ట్ర ప్రగతి, తమ రాష్ట్రాభివృద్ధి, తమ రాష్ట్రంలో నిర్మించ వలసిన ప్రాజెక్టులు, వేయవలసిన రోడ్లు, రైలు మార్గాలు, విద్య, వైద్య, పరిశ్రమలు, వ్యవసాయం, నీటిపనరులు ఇట్లా అనేక విషయాలపై దృష్టి కేంద్రీకరించి వాటికోసం నిరంతరంగా ప్రయత్నాలు చేస్తూ ఇరుగుపొరుగు వారి అవసరాలను విస్మరిస్తుంటారు. తమ స్వప్రయోజనాలకై రాష్ట్రాలతో, కేంద్రాలతో ఘర్షణలకు హింసకు దిగుతుంటారు. అయితే అన్ని రాష్ట్రాల ప్రజలు స్వార్థప్రయోజనాలకు; తమ రాష్ట్రాభివృద్ధికి మాత్రమే పాటుపడక, అన్ని రాష్ట్రాలు తమ దేశంలోనివేనని, సమగ్ర దేశాభివృద్ధి అన్ని రాష్ట్రాల అభివృద్ధి పై ఆధారపడి ఉందని గుర్తించినప్పుడే రాష్ట్రీయతా పరమైన హింస తగ్గుముఖం పడుతుంది.

BRAOU

### 12.2.5 యువత - అశాంతి - హింస - నివారణ

విద్యార్థుల అశాంతికి కారణాలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నాలు కొనసాగాలి. లోపభూయిష్ట మైన విద్యావిధానంలో మార్పులు రావాలి. వృత్తి విద్య ప్రవేశపెట్టాలి. స్వయంగా తమకాళ్ళపై తాము నిలబడేటట్లు యువతకు ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. క్రమశిక్షణతో మెలిగేటట్లు యువతకు ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. క్రమశిక్షణా రాహిత్యం ఫలితంగా, మానసిక పరిణితిలోపించిన ఫలితంగా హింస తలెత్తుతోంది. కనుక యువతను సరైన దారిలో నడిపించడం విద్యాలయాల్లో ఉపాధ్యాయుల కర్తవ్యంగా భావించాలి. దీనికి ముందుగా ఉపాధ్యాయులు ఆదర్శవంతంగా ఉండాలి. తరాల మధ్య అంతరాలను తొలగించేందుకు ప్రయత్నించాలి. యువతను స్నేహితులుగా తల్లి తండ్రులు చూడాలి. వారి అభిప్రాయలను, పిల్లలపై రుద్దక, తల్లి తండ్రులు పిల్లలకు విద్యలోను ఉద్యోగాలలోనూ స్వేచ్ఛనివ్వాలి. చిన్నప్పటినుంచే శ్రమగౌరవం గొప్పతనాన్ని వివరించి చెప్పాలి. నీతినియమాల గురించి సంఘం పట్ల బాధ్యతలను, మత సహనం లాంటివి చిన్నప్పటినుంచి పిల్లలకు నేర్పాలి. సరైన శిక్షణ ఉన్ననాడు యువత పెడ తోవ పట్టక, సమాజాభివృద్ధికై పాటుపడుతుంది.

### 12.2.6 గ్రామాలు - హింస - నివారణ

భూసంస్కరణలు సరిగా అమలు పరచేటట్లు చేయాలి, భూస్వాములకు, రైతులకు మధ్య సదవగాహన పెంపొందింప చేయాలి. గ్రామీణ ప్రాంతాలలో సమస్యలను పరిష్కరించాలి. పండిన పంటను దళారీ వ్యవస్థ ద్వారా కాక ప్రభుత్వమే ప్రత్యక్షంగా కొనుగోలు చేయాలి. సమాజాభివృద్ధి కార్యక్రమాలను అమలులో పెట్టాలి. గ్రామీణ కుటీర పరిశ్రమలకు చేయూత నివ్వాలి ప్రభుత్వం. గ్రామీణ నిరుద్యోగులకు స్వయం సేవా పథకాలను గూర్చి తెలియజేయాలి. ముఠా కక్షలను రూపుమాపేందుకు గ్రామాలలోని అన్ని వర్గాల, కులాలవారిని గ్రామీణ

సమాజాభివృద్ధిలో సమానంగా పాలుపంచుకునేటట్లు చేయాలి. గ్రామాలలో సదవగాహన సదస్సులను నిర్వహించాలి. ఈ కార్యక్రమాల వలన గ్రామాలలో హింస తగ్గి, గ్రామాలు ఆదర్శవంతంగా రూపొందుతాయి.

### 12.2.7 సినిమాలు - హింస - నివారణ

చలన చిత్రాలలోని హింసను, అసభ్యతను అరికట్టడానికి ప్రభుత్వం ఒక సెన్సార్ బోర్డును స్థాపించింది. అయినప్పటికీ చలన చిత్రాలలో హింస, అసభ్యతలు అలాగే ఉన్నాయి. సెన్సార్ బోర్డు మన సంస్కృతీ, నాగరికతలను గమనించి, సమాజశ్రేయస్సుకు, సమాజ గౌరవానికి భంగం కలుగకుండా చలన చిత్రాలను నిర్మాణం జరిగేటట్లు చూడాలి. ప్రజలకు విజ్ఞాన వినోదాలు అందించే ఈ చలన చిత్ర పరిశ్రమ సరైన త్రోవలో నడిపించాలి.

### 12.2.8 భౌగోళిక కారకాలు - హింస - నివారణ

భూకంపాలు, అతి వృష్టి అనావృష్టి, గృహదహనాలు మొదలైన భౌగోళిక విపత్తులు సంభవించినపుడు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సత్వరమే ప్రజలను ఆదుకోవాలి. వారికి చేయూతనిచ్చి, తిరిగి వారు తమ జీవనాన్ని సక్రమమార్గంలో గడిపేటట్లు చేయాలి. ఈ విధంగా జరిగినట్లయితే వారు దోపిడీలకు, హత్యలకు, హింసాత్మక చర్యలకు పాల్పడకుండా ఉంటారు.

### 12.2.9 కుటుంబ అవ్యవస్థ - హింస - నివారణ

కుటుంబ అవ్యవస్థను, కుటుంబంలోని మానసిక, శారీరక హింసను నిర్మూలించడానికి కృషి చేయాలి. దీనికై భార్యా భర్తల మధ్య సదవగాహన సహకారం, సర్దుబాటు తత్వం ఉండేటట్లు చూడాలి. కుటుంబంలో సాంఘికీకరణ ప్రక్రియ సక్రమంగా జరుగాలి. సమాజాభివృద్ధి, ఏ సమాజంలోనైనా అతి ముఖ్యమైన ప్రాథమిక వ్యవస్థ అయిన కుటుంబం పైనే ఆధారపడి ఉందనే అంశాన్ని మరువకూడదు.

BRAOU

### 12.2.10 యుద్ధం - హింస - నివారణ

1945లో అణ్వస్త్ర ప్రయోగంతో ముగిసిన రెండో ప్రపంచ యుద్ధం అయిదు కోట్ల నిండు ప్రాణాలను బలిగొంది. విజ్ఞానశాస్త్ర వికాసాన్ని మానవ మారణకాండకు వినియోగించిన దురంతం చూసి ప్రపంచ మేధావులు తల్లడిల్లిపోయారు. కవులు, కళాకారులు అణువిధ్వంసకాండను ముక్తకంఠంతో ఖండించారు.

50 ఏళ్లనాటి పరిస్థితులకు వర్తమాన పరిస్థితులకు వ్యత్యాసమున్న మాట నిజం. ఇవాళ ప్రపంచం సోషలిస్టు కుటుంబం, కేపిటలిస్టు కుటుంబం అని రెండు కుటుంబాలుగా చీలి లేదు. ప్రచ్ఛన్నయుద్ధం వాతావరణం కూడా లేదు. ఇవాళ మన కళ్ళ ఎదుట ఉన్నది ఏకధృవ ప్రపంచం. అమెరికా పెత్తనానికి ఎదురులేదు. ఆర్థిక ప్రగతి, అణ్వాయుధాలు అమెరికాకు ప్రపంచ పెత్తనాన్ని అప్పగించాయి. ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితులు అంతరించినా అనేక దేశాల మధ్య భౌగోళిక వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. యాభైఏళ్లనాడు ఒక్క అమెరికా, సోవియట్ యూనియన్‌ల చేతుల్లోనే అణ్వాయుధాలు ఉండేవి. ఇవాళ కనీసం ఎనిమిదివేల అణ్వాయుధాలు ఉన్నాయి. అమెరికా, రష్యా చైనా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇండియా, పాకిస్తాన్, ఉత్తర కొరియా దేశాలకు అణ్వస్త్ర సంపద ఉంది. ఇజ్రాయిల్ కూడా అణ్వస్త్ర ప్రాంగణంలోనే ఉంది అంటున్నారు. పాకిస్తాన్ అణ్వాయుధాలు అరబ్ రాజ్యాలకు చేరి తమ భద్రతకు ముప్పు తెచ్చే ప్రమాదం ఉందని ఇజ్రాయిల్ భయపడుతున్నది. ఇజ్రాయిల్ ఉనికిని సహించలేని పాలస్తీనా ఉగ్రవాదులు కొందరు ఇప్పటికీ ఉన్నారు. పాలస్తీనా ఉగ్రవాదులందరిపైనా పి.ఎల్.ఓ. అధ్యక్షుడు యాసర్ అరాఫత్‌కు పట్టులేదు. ప్రపంచంలో అనేక చోట్ల టెర్రరిస్టు చర్యలు ప్రజ్వలిస్తూనే ఉన్నాయి. మరో వైపేమో అణ్వాయుధవ్యాప్తి నిరాటంకంగా కొనసాగుతోంది. క్షిపణులు, ఖండాంతర క్షిపణులు నిర్విరామంగా వచ్చి వివిధ దేశాల ఆయుధాగారాల్లో చేరుతూనే ఉన్నాయి. ప్రపంచ యుద్ధం సంభవించినా, సంభవించకపోయినా ఎప్పుడేమి ఉపద్రవం ఊడిపడుతుందో అని ప్రపంచ పౌరులు నిరంతరం ఆందోళన చెందుతున్నారు.

ప్రపంచంలో ఈ పరిస్థితిని నివారించి ఎల్లెడలా శాంతి పవనాలు వీయాలంటే ముందు అన్ని దేశాలలో

అణ్వాయుధాలను పూర్తిగా నిర్మూలించాలి. ఇది వెనువెంటనే సాధ్యంకాని పని, నిజమే కనుక అణ్వస్త్ర దేశాలు అందుకు కొంత గడువు తీసుకోవచ్చు రాగల నాలుగేళ్లకో ఐదేళ్లకో తమ వద్ద ఉన్న అణ్వాయుధాలు సంపూర్ణంగా రద్దు చేస్తామని, అణుదేశాలు హామీ ఇవ్వాలి. ప్రజాతంత్ర స్ఫూర్తి లోపించిన ఐక్యరాజ్యసమితి స్వరూపాన్ని మౌలికంగా మార్చాలి. ప్రజాస్వామ్యం నేటి యుగలక్షణం కనుక ఐక్యరాజ్య సమితిని ప్రజాస్వామ్య పద్ధతిలో పునర్ వ్యవస్థీకరించాలి. ఈ పునర్ వ్యవస్థీకరణ క్రమంలో మొదటి చర్యగా భద్రతా మండలి రద్దు చేయాలి. సర్వసభ్య సమావేశానికే సమస్త అధికారాలు తీసుకునే నిర్ణయాన్ని ఇచ్చి, దానికి అణ్వస్త్ర దేశాలతో సహా అన్ని దేశాలు కట్టుబడి ఉండాలి. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి నిబంధనావళిని మార్చాలి. ఐక్యరాజ్య సమితి ప్రజాస్వామ్యస్వభావాన్నే హరిస్తున్న భద్రతా మండలినీ, వీటో హక్కు సౌకర్యాన్ని రద్దు చేస్తే జరిగే నష్టమేమీలేదు.

1. ఐక్యరాజ్య సమితి జనరల్ బాడీకే సర్వాధికారాలు దాఖలు పరచాలి.

2. వివిధ దేశాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించడానికి నలభైమంది నిపుణులతో అంతర్జాతీయ న్యాయస్థానాన్ని నెలకొల్పవచ్చు. ఆ న్యాయస్థానం తీర్పుకు అన్ని దేశాలు కట్టుబడి ఉండాలి.

3. ప్రపంచ దేశాల సైనిక బడ్జెట్‌లను అదుపులో పెట్టే అధికారం కూడా ఐక్యరాజ్య సమితికి ఉండాలి.

## 12.2.11 ఎన్నికల హింస - నివారణ

ఎన్నికల హింసను ఇప్పటిలాగా అనుమతిస్తే రెండు ప్రమాదాలు సంభవించవచ్చు.

1. ఈ హింస ఇతర రంగాలకు విస్తరించవచ్చు

2. ఈ హింస మరింత ఉధృత స్వభావం సంతరించుకొని సామాజిక శాంతిని ఛిద్రం చేయవచ్చు.

అప్పుడు ప్రజాస్వామ్యమే కాదు అన్ని విలువలు నాశనమైపోయి బలప్రయోగమే ఒప్పు అన్న ప్రాచీన సూక్తి మళ్ళీ ఆచరణలోకి రావచ్చు. మొగ్గలోనే తుంచకపోతే గొటితో పోయేదానికి గొడ్డలి అవసరంరావచ్చు. ఈ సందర్భంగా ఒక అంశాన్ని నొక్కి చెప్పాల్సి ఉంది. ఎన్నికల్లో సాగే ఈ హింసాకాండ పట్ల మన స్వచ్ఛంద సంస్థలు, పౌరహక్కుల పరిరక్షణ సంస్థలు పెద్దగా ఆందోళన వ్యక్తం చేసినట్లు కనిపించదు. వీరు ఎంత సేపూ పోలీసు హింసలకే పరిమితమవుతున్నారు. పోలీసుల అక్రమ చర్యలను, చట్టవ్యతిరేక కార్యకలాపాలను, ఎన్‌కౌంటర్ కల్పనా కథలను తీవ్రంగా ఖండించాల్సిందే. చట్టాన్ని కాపాడాల్సిన రక్షక భటులు చట్టాలను ఉల్లంఘించి హింసకు పాల్పడడాన్ని ముక్తకంఠంతో నిరసించాల్సిందే. కానీ సంఘవ్యతిరేక శక్తులు, ఉగ్రవాద సంస్థలు చేసే చర్యలను ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఎన్నికల హింసపైకూడా వీరి ఖండనలు నైతిక అంకుశంగా పనిచేస్తాయి. అట్టి ఖండన ద్వారా ప్రజాభిప్రాయాన్ని సమీకరించడమూ సాధ్యమవుతుంది.

## 12.2.12 ఉగ్రవాదం - నివారణ

ఉగ్రవాదం నిర్మూలనకు భారతదేశం పోలీసులను, సైన్యాలను, పేరామిలటరీ దళాలను వినియోగిస్తున్నది. అయితే ఆందోళన కరమైన విషయం ఏమిటంటే మన దేశంలోని వివిధ టెర్రరిస్టుల గ్రూపుల మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఉన్నాయి. ఈ మేరకు అవి మరింత శక్తిని పుంజుకుంటున్నాయి.

భారతదేశంలో టెర్రరిజం నిరోధానికి ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.

1. ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులలో తీవ్రమైన మార్పులు తెచ్చి అసంతృప్తికి తావు లేకుండా చేయాలి. ఇలా మార్పులు తీసుకొస్తే, సాధారణ పౌరులందరూ ఉగ్రవాదాన్ని ద్వేషిస్తారు. సామాజిక జీవితంలో అసంతృప్తికి తావున్న పక్షంలో ప్రభుత్వ చర్యలకు ప్రజల సహకారం లభించదు. తమ జీవన ప్రమాణాలు బాగుంటేనే, నిరుద్యోగం, నిరక్షరాస్యత, ఆకలిలాంటి సమస్యలు పరిష్కారమైతేనే ప్రజలు ప్రభుత్వ



BRAOU

చర్యలను త్రికరణ శుద్ధిగా బలపరుస్తారు. కనీసం బలపరిచే అవకాశాలు ఉంటాయి.

2. ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను పెంపొందించాలి. ఈ విషయంలో మేధావులు, పత్రికలు చేయదగినంది, చేయగలిగింది చాలా ఉంది. మన మేధావులు, పత్రికలు ఉగ్రవాదం నిరోధానికి చేసిన కృషి చాలా స్వల్పం. ఏ టెర్రరిజమయినా అది మొగ్గలోనే తుంచి వేయకపోతే వికృతరూపం దాల్చడం తథ్యం.

3. రాజకీయ నాయకులు కూడా ఈ విషయంలో చేసింది చేస్తున్నది శూన్యం. ముఖ్యంగా ఉత్తర తెలంగాణా ప్రాంతానికి చెందిన ఏ ప్రజాప్రతినిధీ గుండెల మీద చేయి వేసుకొని తన నియోజక వర్గంలో తిరగగల స్థితి, ధైర్యం లేదు. అంతా తుపాకులు, అంగరక్షకులు కావాలనే వారే కానీ, ఈ భయోత్పాతాన్ని నివారించడం ఎలా అని ఆలోచించే వారు లేరు. ఉత్తర తెలంగాణాలో కొనసాగుతున్న భయోత్పాత పరిస్థితిపై ఒక సభో, సమావేశమో, సదస్సో నిర్వహించాలన్న యోచన ఏ రాజకీయ నాయకునికి కలగటం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రభుత్వం, రాజకీయ నాయకులు మేధావులు పత్రికలవారు అంతా కలిసికట్టుగా కేంద్రీకృత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అమెరికా, లాటిన్ దేశాల పాలకులు గతంలోనే కాదు ఇప్పుడూ ప్రజలను భయోత్పాతానికి గురిచేస్తున్నారు. 70లలో చిలీ నియంత పెనోచేట్ పాలనలో రాత్రికి రాత్రే మాయమయ్యేవారు. ప్రభుత్వ పోలీసులైతే వారిని సంహరించి, 'మిస్సింగ్' కేసు క్రింద రాసుకునేవారు. 1981లో ఎల్ సాల్వడార్‌లో సైనికులు 500 మంది రైతులను హతం చేసారు.

కనుక పాలకులు, పాలితులు ఉభయులూ టెర్రరిస్టు చర్యలకు పాల్పడ్డట్లు చరిత్ర సాక్ష్యమిస్తున్నది. టెర్రరిజం ఆయుధాన్ని బలహీనులూ చేపట్టారు, బలవంతులూ చేపట్టారు. టెర్రరిజం ఏ రూపంలో ఉన్నా ఖండించాల్సిందే ప్రభుత్వం చేసినంత మాత్రాన దానికి చట్ట బద్ధత లభించదు.

BRAOU

## 12.3 అభివృద్ధి

సమాజంలో హింస నివారించినట్టయితే సామాజికాభివృద్ధి సాధ్యమవుతుంది. ఈర్ష్యాసూయ, ద్వేషాలు, దురాశ అణగారినప్పుడు గాని ఈ హింస అంతరించదు. మనోబలం, చిత్త సంస్కారం కావాలి. తాత్కాలికోద్రేకం, విషయలోలత నశించాలి. ముఖ్యంగా బలప్రయోగంతో మాత్రమే పనులవుతాయనే సిద్ధాంతాలు పోవాలి. మత విశ్వాసాలలో హింస ప్రబలింది. రాజకీయ రంగంలో హింసా ప్రవృత్తికి అగ్రతాంబూలం లభించింది. ఈ రెండింటివలన సాంఘిక జీవితంలో సైతం హింస కరాళనృత్యం చేస్తున్నది. దీనిని ఆధునిక యుగంలో నివారించే పూజ్య బాపూజీ అహింసావ్రతాన్ని చేపట్టారు. నేడు కొందరు "తుపాకి గొట్టంతోనే రాజ్యాధికారం లభిస్తుందనే సిద్ధాంతాలతో హింసకు దిగడం చాలా ప్రమాదకరంగా వున్నది. హింస వలన హింసే పుడుతుంది, కనుకనే హింసను సమూలంగా మట్టుపెట్టినప్పుడే సామాజికాభివృద్ధి సాధ్యపడుతుంది.

## 12.4 దేశాభివృద్ధికి కొన్ని సూచనలు

భారత సంస్కృతిలో అంతర్భాగమైన జాతీయ సమైక్యతా భావాన్ని పటిష్ఠంచేసి, చీటికీ మాటికీ చెలరేగుతున్న విధ్వంసక చర్యలు రూపుమాపాలి.

ఆర్థిక రంగంలో సక్రమమైన అభివృద్ధి సాధించాలి. ప్రణాళికలలో అన్ని ప్రాంతాలవారికి సక్రమమైన కేటాయింపులు ఉండాలి. విద్యా ఉద్యోగావకాశాలలో ప్రాంతీయ అసమానతలను తొలగించాలి.

ప్రజాస్వామ్యం, లౌకిక విధానం, వ్యక్తి స్వాతంత్ర్యం అనే లక్ష్యాలను సాధించే ప్రయత్నంచేయాలి. మత స్వేచ్ఛను పౌరులు దుర్వినియోగ పరచకుండా చూడాలి. అల్ప సంఖ్యాకుల సమస్యలను సానుభూతితో పరిష్కరించాలి. ఆర్థిక

అసమానతలను తొలగించాలి. ప్రజల మానసిక దృక్పథంలో మార్పు తీసుకురావాలి. దేశభక్తిని, దేశాభిమానాన్ని పెంపొందించాలి.

భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించే ప్రయత్నాలు చేయాలి గిరిజన, గ్రామీణ నగర సముదాయాలలోని సమస్యలను పరిష్కరించాలి. మూఢ నమ్మకాలను తొలగించాలి. పగకంటే క్షమ గొప్పదని బోధించాలి.

## 12.5 ముగింపు

జాతీయతా స్ఫూర్తి మంచిదేగానీ జాతీయ ఉన్మాదం మాత్రం ఆక్షేపణీయమైనది. జాతీయ భావంకంటే సమాఖ్య స్ఫూర్తి చాలా ఉన్నతమైనది.

మతం మంచిదే కానీ మతతత్వం మాత్రం అవాంఛనీయమైనది. కులాన్ని తప్పు పట్ట లేము గానీ, కులతత్వం మాత్రం ఖండించదగినదే. జాతీయత వేరు జాతీయ తత్వం వేరు. నేను నాజాతి గొప్పవరం అనే భావన హాని కరమైంది. అన్ని జాతులు సమానమైనవే అన్న సమాఖ్య స్ఫూర్తి శ్రేష్టమైనది. విశ్వవిఖ్యాత తత్వవేత్త సర్వేపల్లి రాధాకృష్ణ ఇదే భావాన్ని ఇలా స్పష్టం చేశారు : జాతీయత అన్నది ఉన్నతోన్నత భావమేమీ కాదు. అత్యున్నతమైనది వసుధైక కుటుంబ భావనే. కాలం చెల్లిన భావనలకు మనం ఇప్పటికీ బందీలమై ఉండడం విచారకరం. సమున్నతమైన వసుధైక కుటుంబ భావనకు జాతి, రాజ్యం అనే భావనలు లోబడి ఉండాల్సిన పరిస్థితి ఉన్నది.

ప్రపంచమంతా ఇప్పుడు ఒక చిన్న గ్రామంలా తయారయ్యింది. దేశాల మధ్య జాతుల మధ్య, సంస్కృతుల మధ్య గతంలో ఉన్న అంతరాలు నేడు లేవు. కాలం మారేకొద్ది మన భావాల్లోనూ, ప్రయోజనాల లోనూ మార్పులు రావాలి. పాతకాలం నాటి భావాలనే పట్టుకు వేళ్ళాడడం ప్రగతికి నిరోధం. స్వంత ప్రయోజనం కుటుంబ ప్రయోజనం, సమాజ ప్రయోజనం, జాతీయ ప్రయోజనం ఇవన్నీ కాలం చెల్లిన భావనలు. ఈ భావనల స్థానంలో భౌగోళిక ప్రయోజనం చోటు చేసుకోవలసిన ఆవశ్యకత ఆవిర్భవిస్తున్నది. విస్తృతార్థం కల ఈ ప్రయోజనాన్ని అందరూ అంగీకరించక తప్పదు. ఒకరి భౌగోళిక ప్రయోజనానికి మరొక దేశం ప్రాధాన్యమివ్వాలి. ఈ విధంగా ఎవరి కోసం వారు కాకుండా అందరి కోసం అందరూ అన్న స్ఫూర్తిని పెంపొందించుకోవాలి. పైకి ఆచరణ సాధ్యం కాని ఆదర్శవాదంగా కన్పించవచ్చు. వాస్తవానికి ఇది ఆచరణ యోగ్యమైనదే. పరస్పర సందేహాలను తొలగించుకుని పరస్పర విశ్వాసాన్ని పెంపొందించుకొని అనవసరమైన సైనిక వ్యయానికి స్వస్తి చెప్పి, అందరూ ప్రగతి పథంలో పయనించాలన్న ఆకాంక్ష నిజానికి ఆచరణ యోగ్యమైనదే, వసుధైక కుటుంబ స్ఫూర్తి అన్నది అందరినీ శాసించే ఏకైక సూత్రంగా మారాలి. అందుకు అన్ని దేశాల పౌరులు తమ చిత్త సంస్కారాన్ని పెంచుకోవాలి. ఆదిలో అంటే ఆదిమ సమాజంలో కుటుంబభావనే లేదు. ఒక దశలోనే అది తలెత్తింది. ఆ తరవాతనే ఆభావన ఆవిర్భవించింది. అనంతరం సామాజిక భావన, ఆ తరువాత జాతీయ భావన అంకురించాయి. జాతీయ భావన తరువాత దశ వసుధైక కుటుంబ భావనే. ఈ రోజు కాకపోతే రేపైనా ఆధునిక మానవుడు ప్రపంచ పౌరుడిగా పరివర్తన చెందక తప్పదు. ఆ రోజున సమస్త భూగోళం, అందమైన నందనవనమే.

BRAOU

## 12.6 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబురాయండి?

1. హింస నివారణ అనివార్యతను వివరించండి.

2. గ్రామాలలో హింసానివారణకు మార్గాలు సూచించండి.

3. యుద్ధం - హింస గురించి రాయండి.

4. అభివృద్ధికి సూచనలు ఇవ్వండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. మత హింస నివారణామార్గాలు?

2. ప్రాంతీయ హింస నివారణ?

3. అభివృద్ధి అనగానేమి?

## 12.7 చదవదగిన పుస్తకాలు


1. Tomm Bottamore : Political Sociology.

2. Rolf Borbody : Serentees Problems of Man and Society.


BRAOU

# భాగం-13: భారతదేశంలో కులం-మతం- సామాజిక ఉద్రిక్తతలు

విషయక్రమం


13.0 ఉద్దేశాలు

13.1 పరిచయం

13.2 కులవ్యవస్థ పుట్టుక

13.2.1 వర్ణం సామాజిక అంతస్థు

13.3 కులం - నిర్వచనం - లక్షణాలు

13.3.1 కులవ్యవస్థ - ప్రకార్యాలు

13.3.2 కులవ్యవస్థ - మార్పులు - కారణాలు

13.4 కులం - సామాజిక ఉద్రిక్తతలు

13.4.1. కుల ప్రకర్షణలు ఫలితాలు

13.5 మతం - పరిచయం

13.5.1 మతం - లక్షణాలు

13.6 మత రూపాలు

13.7 మత విధులు

13.7.1 మతం - సామాజిక ప్రకర్షణ

13.8 మత కలహాలకు కారణాలు

13.9 ముగింపు

13.10 మాదిరి పరీక్ష ప్రశ్నలు

13.11 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 13.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- భారత దేశంలో కులం పుట్టుకను వివరించగలుగుతారు.
- భారత దేశంలో వర్ణ వ్యవస్థ ఏర్పాటును తెలుసుకుంటారు.
- దేశంలో మత ఘర్షణలకు కారణాలను అర్థం చేసుకుంటారు.

## 13.1 పరిచయం

భారతదేశంలో కుల, మత ఘర్షణలు సామాజిక ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. వర్ణవ్యవస్థ చాతుర్వర్ణాలుండడం, ఇది సామాజిక స్తరీకరణగా ఉపయోగపడడం, అట్టడుగు పంచములుండడం, వారిపై దౌర్జన్యాలు జరగడం

ఉద్రిక్తతలకు కారణం అవుతున్నది. కుల, మత, దురభిమానాలవల్ల, లౌకిక వాదం అంతరించి మత ఘర్షణలు సంభవిస్తున్నాయి. భారతదేశంలో వర్ణం ఒక సామాజిక అంతస్తుగా పనిచేస్తున్నది. కుల, మతాలు, వాటి పుట్టుకవాటి సామాజిక ప్రాధాన్యతల కారణంగా మతకల్లోలాలు చెలదేగుతున్నాయి. భారతదేశానికే ప్రత్యేకమైన ఈ సాముదాయిక సమస్యను వివరంగా పరిశీలించడమే ఈ భాగం లక్ష్యం.

## 13.2 కులవ్యవస్థ - పుట్టుక - వర్ణం

కులవ్యవస్థ కంటే ముందున్నది వర్ణవ్యవస్థ. సాధారణ వాడుకలో 'వర్ణ' అంటే హిదూ సమాజంలోని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర విభాగాలని వివరిస్తారు. అయితే 'వర్ణం' అనే పదం ఉపయోగించేవారికి ఈ పదంలో ఉన్న సంశ్లిష్టతను గూర్చి చాలా వరకు తెలియదు.

శబ్దార్థాన్ని బట్టి చూస్తే వర్ణం అంటే రంగు. ఆర్యులు దండెత్తి స్థానిక ప్రాంత ప్రజలను వశపరుచుకొన్నప్పుడు పరాజితులైన ప్రజలను దాస్యులని సంబోధిస్తుండేవారు. ఆర్యులకు, దాసులకు శరీరవర్ణంలో తేడాలుండడంవలన, స్థానిక ప్రజలనుంచి ఆర్యులను వేరుచేసి గుర్తుపట్టడానికి, ఆ ప్రజలను ఆర్యవర్ణులని, దాస్యవర్ణులని రెండు తెగలుగా విభజించి పిలిచేవారు. ఆర్యవర్ణులు తెల్లగా అందంగాను, దాస్యవర్ణులు నల్లగానూ ఉండేవారని చాలామంది అభిప్రాయం. అటుతరువాత వచ్చిన చారిత్రక పరిణామాల ఫలితంగా హైందవసమాజం నాలుగు వర్ణాలుగా విభజించడమైనది. ఈ నాలుగు వర్ణాలనే చాతుర్వర్ణ వ్యవస్థ అంటారు.

చాతుర్వర్ణ వ్యవస్థ ఆవిర్భావం గురించి పురుషసూక్తంలో ఒక శ్లోకంలో బ్రాహ్మణులు బ్రహ్మదేవుని ముఖంనుంచి, క్షత్రియులు భుజాలనుంచి, వైశ్యులు తొడలనుంచి, శూద్రులు పాదాలనుంచి జన్మించినారని వివరించారు.

వర్ణం అంటే రంగని అర్థం. మొట్టమొదటి హిందూ సమాజంలో ఈ అర్థంతోనే వర్ణవిభజన జరిగినట్లు ఆర్యులకు, దాస్యులకు మధ్య శరీర ఛాయలో గల భేదం కారణంగా రెండు వర్ణాలు ఏర్పడినాయని ఆచార్య పి.ఎన్. ప్రభు వివరించారు. కొంతకాలం తరువాత శతపథ బ్రాహ్మణంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలగురించి చర్చించడం జరిగింది. ఈ నాలుగు రకాల వర్ణవిభజనకు కూడా శరీరఛాయ కారణమని కొందరు భావిస్తున్నారు. శరీరఛాయ తెలుపురంగుగా గల వారిని బ్రాహ్మణులని, ఎరుపురంగు గలవారిని, క్షత్రియులని, మిశ్రమరంగు గల వారిని వైశ్యులని, నలుపురంగుగా గలవారిని శూద్రులని వివరిస్తున్నారు.

కాలక్రమేణా వర్ణవిభజన చేసేది శరీరఛాయ కాదని, పుట్టుకతో ప్రతివ్యక్తి శూద్రుడని, అతను సముపార్జించుకునే గుణాల ఆధారంగా వ్యక్తి ఈ నాలుగు వర్ణాలలో ఏదో ఒక వర్ణానికి చెందుతాడని హిందూ శాస్త్రకారులు వివరించారు.

ఉదా : భగవద్గీతలో సత్వగుణం కలవారిని బ్రాహ్మణులని, సత్వరోజోగుణాలు గలవారిని క్షత్రియులని, రజో-తామసుగుణం గలవారిని వైశ్యులని, తామస గుణం గలవారిని శూద్రులని పేర్కొన్నారు.

గుణాలతో పాటు వ్యక్తి నిర్వహించే సంస్కారాలు లేదా కర్మలు కూడా ప్రధానమైనవిగా భావించారు. ఉదా : బ్రాహ్మణుడి జీవితం సంస్కారమయంగా ఉంటుంది. పూజలు, యజ్ఞాలు చేయడం లేదా చేయించడం, ఉపనయనం అయిన తర్వాత నిత్యం సంధ్యావందనం చేయడం, గాయత్రీదేవిని పూజించడం, శుచి-అశుచులను పాటించడం, ధర్మాలను నిర్వర్తించడం, మొదలైన బాధ్యతలుంటాయి. అంటే వ్యక్తి తన తల్లితండ్రుల వర్ణంతో సంబంధం లేకుండా తాను అలవర్చుకునే గుణాలు లేదా నిర్వహించే కర్మలు లేదా సంస్కారాల కారణంగా మాత్రమే అతని వర్ణం నిర్ణయించబడుతుంది. ఈ ఉద్దేశ్యంతోనే బెంగాల్‌కు చెందిన ప్రసిద్ధ యోగి శ్రీలోకనాథ్ బ్రహ్మచారి తన అనుచరులతో ఒక సారి ఇలా అన్నారు. "నేను నా జీవితంలో ఇద్దరే బ్రాహ్మణులను చూశాను ఒకరు కాశీకి చెందిన ప్రసిద్ధ యోగి త్రైలింగ స్వామి, వేరొకరు మక్కాకు చెందిన ముస్లిం ఫకీరు గుఫూర్‌మైన్".

పై వివరణల ప్రకారం వర్ణం అనేది వ్యక్తి సాధించు కునే స్వేచ్ఛా వ్యవస్థగా అర్థమౌతుంది. కానీ మనుధర్మ శాస్త్రంలో ఈ నాలుగు వర్ణాలు బ్రహ్మ శరీర వివిధ అంగాల నుండి ఉద్భవించాయనే వివరణ వలన, వర్ణం పుట్టుకతో



BRAOU

వచ్చేదని సమర్ధించడమైనది. కావున ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క విధమైన నిర్వచనం వర్ణానికి ఇవ్వబడినట్లు మనకు అవగాహనమౌతుంది.

విభిన్న వర్ణాలవారికి విభిన్న వృత్తులు కేటాయించారు. విద్యా, పూజాదికాలు బ్రాహ్మణులకు, పరిపాలన - రక్షణ, క్షత్రియులకు, వ్యాపార- వ్యవసాయాలు వైశ్యులకు కేటాయించారు. శూద్రులు తమపై నున్న మూడు వర్ణాల వారికి సేవలందించేవారుగా మను ధర్మం చెబుతోంది. ఆహార సంబంధమైన, వివాహ సంబంధమైన విషయాలలో కూడా వర్ణాల మధ్య ఆంక్షలున్నాయి. ఉదా : బ్రాహ్మణయువకుడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర యువతులలో ఎవరినైన వివాహమాడవచ్చు. క్షత్రియ యువకుడు క్షత్రియ, వైశ్య, శూద్ర యువతులలో ఎవరినైనా వివాహమాడవచ్చు. వైశ్య యువకుడు వైశ్య, శూద్ర యువతులలో ఎవరినైనా వివాహమాడవచ్చు. శూద్ర యువకుడు మాత్ర శూద్ర యువతినే వివాహమాడాలి. ఇటువంటి వివాహ పద్ధతిని 'అనులోమ' వివాహమంటారు స్త్రీ మాత్రం తనకంటే తక్కువ వర్ణానికి చెందే యవకుడిని వివాహం చేసుకోరాదు. దీనిని "ప్రతిలోమ" వివాహమంటారు.

ఏ ఆహారం తినాలి? ఏ ఆహారం తినకూడదు? ఎవరు వండిన ఆహారం తినాలి? ఎవరు వండిన ఆహారం తినకూడదు. అనే విషయాలలో కూడా వివిధ వర్ణాలమధ్య ఆంక్షలున్నాయి. బ్రాహ్మణులు, వైశ్యులు మంసాహారాన్ని తీసుకోకూడదు. శాకాహారాన్ని, మాత్రమే భుజించాలి. క్షత్రియులు, శూద్రులు మాంసాహారాన్ని, శాకాహారాన్ని కూడా భుజించవచ్చు. బ్రాహ్మణుడు బ్రాహ్మణులు వండిన వంట మాత్రమే భుజించాలి. క్షత్రియులు బ్రాహ్మణులు, క్షత్రియులలో ఎవరు వండిన వంటనైనా భుజించవచ్చు. వైశ్యులు బ్రాహ్మణులు వండిన వంటను మాత్రమే భుజించాలి. ఇక శూద్రులు పై మూడు వర్ణాల వారినుండి ఆహారాన్ని స్వీకరించవచ్చును.

### 13.2.1 వర్ణం - సామాజిక అంతస్తు

వర్ణ సిద్ధాంతం ప్రకారం సామాజిక అంతస్తులో బ్రాహ్మణులు మొదటి స్థానాన్ని, రెండవస్థానాన్ని క్షత్రియులు, మూడవస్థానాన్ని వైశ్యులు, నాల్గవ స్థానాన్ని శూద్రులు ఆక్రమించారు.

ఋగ్వేద కాలంలోనూ, ఆతరువాత వర్ణాలు అయా వ్యక్తులు చేసే వృత్తులపై ఆధారపడి ఉండేవి. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు వివిధ వృత్తులను స్వీకరించడం వలన వారు వివిధ వర్ణాలకు చెందరు. అంతేకానీ ఎవరైనా సరే వారు స్వీకరించిన వృత్తులను బట్టి వారి వర్ణం ఆధారపడి ఉండేది. కానీ పుట్టుకను బట్టి మాత్రం కాదు కనుకనే ఒక బ్రాహ్మణ ఋషి ఈ విధంగా చెప్పారు. "నేను కవిని, నా తండ్రి వైద్యుడు, నాతల్లి కాయకష్టం చేసేది. మేమందరం పశువులను పెంచుతాం" దీనిని బట్టి వర్ణవ్యవస్థ సంకుచితమైనది కాదని చెప్పాలి.

వేదకాలంలో ఒక వర్ణంలో సభ్యత్వం ఒక కుటుంబంలో జన్మించడాన్ని బట్టి ఉండేది కాదు. కానీ కాలక్రమేణా చాతుర్వర్ణ వ్యవస్థ నమూనాలో విడిపోయింది. అయినప్పటికీ అన్ని కులాలు చతుర్వర్ణ వ్యవస్థ నమూనాలో ఇమిడి ఉంటాయని సి.హెచ్. కూలే అభిప్రాయపడ్డారు.

## 13.3 కులం-నిర్వచనం-లక్షణాలు

కులవ్యవస్థ పురాతన, ఆధునాతన భారతదేశంలో ఒక ప్రత్యేకమైన సామాజికస్తరీకరణ పద్ధతి. కులము భారతీయుల ఆర్థిక, రాజకీయ, సామాజిక జీవితంలో కీలకమైన పాత్రను వహిస్తుంది. కులము అనే పదము 'కాస్ట' అనే స్పానిష్ పదమునుండి ఉద్భవించినది. "కాస్ట" అనగా వంశపారంపర్య లక్షణాల సంశ్లిష్టత అని అర్థము. కులాన్ని వివిధ సమాజ శాస్త్రవేత్తలు వివిధ రకాలుగా నిర్వచించినారు కులాన్ని హెచ్. హెచ్. రిస్లే ఈ క్రింది విధంగా నిర్వచించారు.

ఒకే మూల పురుషుణ్ణి కలిగి ఉండి, ఒకే వారసత్వ వృత్తిని పాటిస్తూ, అంతర్వివాహాన్ని మాత్రమే చేసుకుంటూ, ఒకే పేరుతో మాత్రమే చలామణీ అయ్యే కొన్ని కుటుంబాలు లేదా బంధు సమూహాల సాధర్మ్య సమూహాన్ని కులమంటారు.

BRAOU

## కులవ్యవస్థ లక్షణాలు

కులవ్యవస్థ భారతదేశంలోని ప్రత్యేకనమూనా స్తరీకరణ పద్ధతి. కులము భారతీయుల సామాజిక, సాంస్కృతిక ఆర్థిక, రాజకీయ జీవితాలను ప్రభావితం చేస్తుంది. కులవ్యవస్థ లక్షణాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

### 1. కులాన్ని పుట్టుక నిర్ణయిస్తుంది

ఒక వ్యక్తి ఏ కులానికి చెందుతాడు అనేది అతని పుట్టుకను బట్టి ఆధారపడి ఉంటుంది. కులాన్ని బట్టే ఒక వ్యక్తి అంతస్తు కూడా నిర్ణయింపబడుతుంది. ఒక వ్యక్తి వృత్తి, విద్య, ఆస్తి మొదలగు విషయాలలో ఎన్ని పరివర్తనలు వచ్చినప్పటికీ అతని కుల అంతస్తు మాత్రం మారదు.

### 2. కులం అంతర్వివాహ సమూహం

విభిన్న కులాలమధ్య వైవాహిక సంబంధాలు ఉండవు. కుల విధానం సారాంశం అంతర్వివాహాలని ఒక సమాజశాస్త్రజ్ఞుడు వివరించారు. ఏ కులానికి చెందిన వ్యక్తి ఆకులానికి చెందిన వారిని మాత్రమే వివాహమాడాలి. వెస్టర్‌మార్క్ ఉద్దేశ్యంలో కులానికి అతి ముఖ్యమైన లక్షణం అంతర్వివాహం.

### 3. కులవృత్తులు

కులవ్యవస్థ వ్యక్తులకు వివిధ అంతస్తులను ఇవ్వడంతో పాటు వివిధ రకాలైన వృత్తులను కూడా ఆపాదిస్తుంది. బ్రాహ్మణులు ఉపాధ్యాయులుగానూ, మంత్రులు గానూ పూజారులుగానూ ఉండేవారు. క్షత్రియులు రాజ్య పరిపాలన చేసేవారు. వైశ్యులు వ్యాపార, వ్యవసాయ రంగములను చేపట్టేవారు. శూద్రులు మాత్రం సమాజానికి సేవ చేసేవారు. వృత్తులు కుల సభ్యులకు వంశ పారంపర్యంగా సంక్రమించేవి. వృత్తులు మార్చుకోవడానికి సంప్రదాయం అంగీకరించదు.

### 4. ఆహార అలవాట్లు ఆంక్షలు

అన్నపానాదుల విషయంలో కులాల మధ్య నియమాలు, నిషేధాలు లెక్కకు మించినన్ని ఉన్నాయి. బ్రాహ్మణులు తమ కులంవారి ఇళ్ళలోనే భోజనం చేయాలి. శాకాహారాన్ని మాత్రమే భుజించాలి. క్రిందకులాల వారినుంచి బ్రాహ్మణులు వంటసామాగ్రిని స్వీకరించవచ్చు. వైశ్యులు శాకాహారాన్ని భుజించాలి. బ్రాహ్మణుల నుండి కూడా వైశ్యులు ఆహారపదార్థాలను స్వీకరించవచ్చును. క్షత్రియులు శాకాహారాన్ని, మాంసాహారాన్ని కూడా భుజించవచ్చు. క్షత్రియులు వారి కులంవారి నుండే గాక బ్రాహ్మణులనుండి కూడా ఆహారపదార్థాలను స్వీకరించవచ్చు. శూద్రులు పై మూడు కులాల వారినుండి కూడా ఆహారాన్ని స్వీకరించవచ్చు.

### 5. కుల పంచాయితీలు

కుల సంబంధమైన నిబంధనలను పరిశీలించడానికి, అమలు పరచడానికి, వ్యక్తుల మధ్య తగాదాలను తీర్చడానికి, కులస్తుల అవసరాలను పరిరక్షించడానికి కుల పంచాయితీలు ఉండేవి.

### 6. సామాజిక సంబంధాలలో నిషేధం

కులాల మధ్య నియమాలు, నిషేధాలు లెక్కకు మించినన్ని ఉన్నాయి. నిమ్న వృత్తులను చేపట్టిన వారిని నిమ్న కులాలుగా గుర్తించి, వారిని అస్పృశ్య కులాలుగా భావించి వారిని సమాజానికి దూరంగా ఉంచేవారు. కులాల మధ్య సంబంధాలు చాలా కఠిన తరంగా వుంటాయి.

### 7. క్రమశ్రేణి

కులవ్యవస్థ భారతీయ సమాజాన్ని నాలుగు అంతస్థులుగా విభజించింది. ఔన్నత్యం - అల్పత్వం ప్రాతిపదికపై



BRAOU

కులాలను క్రమశ్రేణిలో వర్గీకరించినారు. ఈ హెచ్చుతగ్గుల కుల అంతస్థులో మొదటి స్థానాన్ని బ్రాహ్మణులు, తరువాత స్థానాలను వరుసగా క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు కలిగి ఉన్నారు.

## 13.3.1 కులవ్యవస్థ ప్రకార్యాలు

### 1. వృత్తిని నిర్ణయిస్తుంది

హిందూ కులవ్యవస్థలో పుట్టిన ప్రతి వ్యక్తికీ కులం ఒక వృత్తిని నిర్ణయిస్తుంది. ఏ కులంలో పుట్టిన వ్యక్తి ఆ కులానికి సంబంధించిన వృత్తిని స్వీకరించాలి. ఒక్కొక్క కులంలో పుట్టిన వారికి ఒక్కొక్క వృత్తిని నిర్ణయించడం వల్ల చిన్నప్పటినుండి ఆవ్యక్తి తన కులవృత్తిలో నిమగ్నమై నైపుణ్యాన్ని పెంపొందిచుకోగలుగుతాడు.

### 2. సాంఘిక భద్రత - నియంత్రణ

కుల వ్యవస్థ సభ్యులకు భద్రతను, రక్షణను కల్పిస్తుంది. ఏ వ్యక్తికైనా అన్యాయం జరిగితే నిస్సహాయుడుగా ఉన్న అతనిని ఆ కులం వారందరూ ఆదుకొని ఆదరిస్తారు. కులవ్యవస్థ సభ్యులకు భద్రత కల్పించడంతో పాటు వారి ప్రవర్తనను కూడా అదుపులో పెడుతుంది. ప్రతీ కులానికీ కొన్ని నిబంధనలు ఉంటాయి. ఆ నిబంధనలు ఆయా వ్యక్తుల ప్రవర్తనను అదుపులో పెడుతాయి.

### 3. శ్రమ విభజన

కుల వ్యవస్థ ముఖ్యమైన విధి సమాజంలో శ్రమ విభజనను ప్రవేశపెట్టడమే. వివిధ కులాలకు వివిధ వృత్తులను కేటాయించడం వలన కులవ్యవస్థ శ్రమ విభజన యంత్రాంగంగా పనిచేస్తుంది. కుల విధుల నిర్వహణలో వివిధ కులస్థుల మధ్య సహకార ముంటుంది.

### 4. మత పరిరక్షణ

కుల వ్యవస్థ హిందూ మతంలో ఒక భాగం మత విధులను నిర్వహించడం, మతాచారాలను కాపాడడంలో కులవ్యవస్థ ప్రధాన ప్రాత నిర్వహిస్తుంది. హిందూ మత ధర్మాలను కాపాడడంతో పాటు హిందూ మత పవిత్రతను కూడా కులవ్యవస్థ పరిరక్షిస్తుంది.

### 5. సంస్కృతి పరిరక్షణ

కులవ్యవస్థ మతాన్ని పరిరక్షించడంతో పాటు సంస్కృతిని కూడా కాపాడుతుంది. ప్రతి కులానికి ప్రత్యేకమైన ఆచారాలు, సాంప్రదాయాలు, విలువలు, నమ్మకాలు ఉంటాయి. ఫలితంగా ప్రతికులం ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక వర్గంగా రూపొందుతుంది.

## 13.3.2 కులవ్యవస్థ మార్పులు - కారణాలు

పైన వివరించిన కులవ్యవస్థ సాంప్రదాయక లక్షణాలలో కార్యాలలో నేడు అనేకమైన మార్పులు సంభవించాయి. ఈ మార్పులకు ఈ క్రింది అంశాలను కారణాలుగా చెప్పవచ్చు.

1. ఆధునిక విద్యా విధానం కారణంగా వ్యక్తులు తమ కుల వృత్తులను విడనాడి ఇతర వృత్తులను చేపడుతున్నారు.

2. పారిశ్రామికీకరణ వలన అనేక నూతన వృత్తులు ఉద్భవించాయి. నగరీకరణం వలన కుల నిబంధనలు పాటించడానికి వీలుకాని పరిస్థితులు ఏర్పడినాయి.

BRAOU

3. కుల వ్యవస్థ నుండి ఉద్భవించిన అస్పృశ్యతను చట్టపరంగా కూడా ఖండించడమైనది.

4. నూతన చట్టాలు కూడా కులవ్యవస్థ లక్షణాలకు వ్యతిరేకంగా ఉన్నాయి. ప్రత్యేక వివాహ చట్టం కులాంతరవివాహాలను న్యాయ బద్ధమైన వాటిగా సమర్థించింది.

పైన వివరించిన పరిస్థితులు కులవ్యవస్థలో విప్లవాత్మక మైన పరివర్తనలను తీసుకురాలేక పోయాయి. ఈ కారణంగానే ఎ.ఆర్. దేశాయ్ కులాన్ని హిందూ మత 'ఉక్కుకవచం'గా వర్ణించారు. అంతేకాక కొన్ని పరిస్థితులెట్లా అయితే కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఆధునిక కాలంలో ఏర్పడినాయో అదే విధంగా కొన్ని పరిస్థితులు కులాన్ని ప్రోత్సహించే వాటిగా ఏర్పడినాయి.

## 13.4 సామాజిక ఉద్రిక్తతలు

### కులతత్వం-నిర్వచనం

ఒక కులంలోని సభ్యుడు లేదా కుల సమూహం తమ సొంత కులసభ్యుల పట్ల అభిమానం, ప్రదర్శించినా లేదా ఇతర కుల సభ్యుని పట్ల లేదా కుల సమూహం పట్ల దురభిమానం ప్రదర్శించినా, అట్లాంటి దృక్పథాన్ని, నడవడిని కులతత్వంగా నిర్వచించవచ్చు. కులతత్వంలో రెండు ముఖ్యాంశాలు ఉన్నాయి. 1. స్వకులాభిమానం, 2. పరకుల దురభిమానం.

కులతత్వంతో కూడుకున్న దృక్పథాలవల్ల ప్రవర్తనలవల్ల వ్యక్తికీ సముదాయానికి, సమాజానికి అపారమైన నష్టం సంభవిస్తుందనేది నిర్వివాదాంశము. కులతత్వం వల్ల సమాజంలో అనైక్యత, భద్రాతారాహిత్యము, కులపరమైన వైషమ్యాలు, అసూయలు, సంఘర్షణలు బయల్దేరతాయి.

BRAOU

కులతత్వానికి సంస్కృతీకరణ ప్రక్రియ బాగా దోహదం చేసింది. నిమ్నకులాలవారు తమ అంతస్థును పెంచుకోవడానికి ఉన్నత కులాలవారి సంప్రదాయాలను, ఆచారాలను, భోజన, పానీయ నియమాలను, మతపరమైన సంస్కారాలను అనుకరించి తమ కుల అంతస్థును పెంచుకోవడానికి ప్రయత్నిస్తారు. రాజకీయ సత్తావల్ల, ఆర్థిక శక్తి వల్ల వీరు ఆకాంక్షించే కుల అంతస్థులోని పరివర్తన సులభమవుతుంది. తాముకోరే వినూత్న మైన అంతస్థుకు అనుబంధంగా వీరు పురాణ, ఇతిహాసాల ఆధారాలను చూపించి, ఉన్నత కులాల ఆమోదాన్ని పొందడానికి కృషి చేస్తుంటారు. ఉదా : గొల్లలు తాము యాదవులమని, శ్రీ కృష్ణ భగవానుని వంశజులమని, కాబట్టి క్షత్రియులమని వాదిస్తుంటారు. ఈ విధంగా తమ కుల అంతస్థును పెంచుకోవడానికి చేసే ప్రయత్నమే సంస్కృతీకరణ. ఈ సంస్కృతీకరణ ప్రక్రియ వల్ల కులాల మధ్య, ఉపకులాల మధ్య కులతత్వం బలం పుంజుకున్నదే కాని తగ్గలేదని ఖచ్చితంగా చెప్పవచ్చు. కర్ణాటకలో లింగాయతులు సంస్కృతీకరణకు మంచి ఉదాహరణ.

కులతత్వం పెంచడానికి బ్రిటీష్ వారి పాలనా విధానం కూడా ఒక కారణం. విభజించు పాలించు అనే సిద్ధాంతాన్ని పాటించిన బ్రిటీషు ప్రభుత్వం భారతదేశంలోని కుల మత సమూహాల మధ్య వ్యత్యాసాలను, ఘర్షణలను పెంపొందించడానికి ప్రయత్నించింది. బ్రాహ్మణ కులాలకు వ్యతిరేకంగా బ్రాహ్మణేతరులను ప్రోత్సహించారు. కులాల మతాల ప్రాతిపాదికగా ప్రత్యేక నియోజక వర్గాలను లార్డ్ మాంగ్‌టెంగ్ (Lord Montague) సంస్కరణలను రూపొందించినాడు. దీని వల్ల భారతీయ రాజకీయాలలో సామాజిక రంగంలో కులతత్వ ధోరణులు అధికమైనాయి. ఈ కాలంలోనే కులం పేరిట విద్యా సంస్థలు, వృత్తి సంస్థలు అవతరించినాయి.

చాలా రాష్ట్రాలలో బ్రిటీష్ వారు ప్రవేశపెట్టిన స్థానిక స్వపరిపాలనా సంస్కరణలవలన కూడా కులతత్వం అతిశయించింది. కులపరంగా గ్రూపులు, ముఠాలు రూపొంది దోపిడీలకు, హింస, హత్యాకాండలకు దారితీసినాయి. సర్కారు జిల్లాలలోని చాలా గ్రామాలలో కులముఠాలవల్ల జరిగిన దమనకాండ, హత్యలు ఈనాటికీ పూర్వతరం వారి స్మృతి పథంలో సజీవచిత్రాలుగా కదలాడుతూ ఉన్నాయి.

భారతదేశం స్వతంత్ర దేశమయిన తరువాత కులత్వం పెరిగిందే గానీ తగ్గలేదు. 1952లో సార్వత్రిక వయోజన ఓటింగ్ పద్ధతిని ప్రవేశపెట్టిన ఫలితంగా ప్రజా రాజకీయాల శకం ప్రారంభమయింది. అన్ని రకాల రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులు గెలుపొందడానికి కులాన్ని ఆశ్రయించినాయి. రాజకీయాలలో అడుగడుగునా ఈ కులాల ప్రభావం ప్రమేయం కన్పిస్తాయి. ఎన్నికలలో కుల ప్రతిపాదికపై అభ్యర్థులను నిర్ణయించడం, ఎన్నికచేయడం జరిగింది. 1956 తరువాత అమలులోనివచ్చినా ఈ కార్యక్రమం వలన అనుదినం కులతత్వభావన పెరుగుతున్నది కానీ క్షీణించడంలేదు. గ్రామాలలో తరతరతాలనుంచి ఆధిపత్యం వహిస్తున్న వ్యవసాయ కులాలు (రెడ్డి - కమ్మ-క్షత్రియకులాలు) జమిందారీ, ఈనాందారీ రద్దు చట్టాల వల్ల కొంత ఆస్తిని, గౌరవాన్ని కోల్పోయినాయి. అయితే పంచాయితీరాజ్ వ్యవస్థతో వీరు రాజకీయాలలోకి ప్రవేశించారు. వీరందరికీ కుల భూమిక విపరీతంగా సాయపడింది. గ్రామ పంచాయితీలలో, పంచాయితీ సమితులలో, జిల్లా పరిషత్తులలో ఎక్కడ చూసినా ఈ నాడు కులతత్వంతో కూడుకున్న రాజకీయాలే కన్పిస్తున్నాయి. దీనివల్ల గ్రామీణ ప్రాంతాలలో కక్షలు, విరోధాలు, వైషమ్యాలు, లూటీలు, దహనకాండ, వ్యక్తిగత సామూహిక హత్యలు విరివిగా పెరిగిపోయాయి. సామూహిక విలువలు సామాజిక సర్దుబాటు, పరస్పర అనురాగం, స్నేహం సన్నగిల్లినాయి. గ్రామాలలో అరాచక స్థితి, నియమరహిత ప్రవర్తన ఎక్కువయింది. ఈ ధోరణులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారాయి.

జాతీయ రాజకీయాలకంటే ప్రాంతీయ రాజకీయాలలో కుల ప్రాతిపదిక, కులతత్వం మనకు స్పష్టంగా కన్పిస్తాయి. ప్రాంతీయ ప్రభుత్వాల నిర్మాణంలో కులప్రాతిపాదిక ముఖ్యమైనది. కులాల వారీగా మంత్రులను నియమించి, కులాధిక్యతను బట్టి మంత్రిత్వ శాఖలను విభజిస్తారు. అధికారం నుంచి వంచితులైన నాయకులు తమ కులవనరులను సమీకరించి ఉమ్మడి అభిరుచులు కలిగిన ఇతర కులాల వత్తాసును సంపాదించి అధికార వర్గాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారు.

కులతత్వం ఈనాడు కేవలం రాజకీయాలకే పరిమితమై లేదు. ఆర్థిక, వ్యాపార విద్యా రాంగాలకు కూడా వ్యాపించింది. భారత దేశంలో పారిశ్రామికీకరణ గత 50 సంవత్సరాల్లో చాలా వేగంగా పెరిగిపోయింది. ప్రైవేటు రంగంలోని పరిశ్రమలు ఎక్కువగా మార్వాడీ, పార్సీ, జైన్ ఇస్మాయిలీ కులాలు, మతాలకు చెందిన యజమానుల చేతులలో ఉన్నాయి. ఇందులో చిన్న ఉద్యోగాలను పెద్ద పదవులను తమ కుల మతాల వారికే కేటాయిస్తారు. చాలాసార్లు వేరే కులాలకు చెందిన వ్యక్తులకు అర్హత అధికంగా ఉన్నా. తమ కులస్థులనే ఉద్యోగాలకు కేటాయిస్తారు. ఇట్లాంటి కుల దురభిమానాల వల్ల చాలా పరిశ్రమలలో సమ్మెలు, ఘర్షణలు, సామూహిక హత్యలు కూడా సంభవించినాయి.

కులం పేరిట నడిపే వ్యాపార సంస్థలు, గృహ నిర్మాణ సంస్థలు, బ్యాంకులు కూడా మనకు అనుభవంలో కన్పిస్తుంటాయి. వైశ్యాబ్యాంక్, కెనరాబ్యాంక్ కులానికి సంబంధించిన బ్యాంకులు. సహకార సంఘాలు కూడా కులం పేరిటే ఏర్పడుతున్నాయి. రెడ్డి గృహనిర్మాణ సహకార సంఘం. సింధీకాలనీ మొదలైన వాటిని ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

ఇవి కాకుండా చాలా విద్యాసంస్థలు, వసతి గృహాలు, ధర్మశాలలు, ధర్మ కర్తృత్వ సంస్థలు కుల పరంగా నడుస్తున్నాయి. ఉదా : అగర్వాల్ కళాశాల, కాపు విద్యా సంఘం. అంతేకాక ఈ విధమైన సంస్థలను నిర్వహించే వ్యక్తులు వీటిని తమ రాజకీయ అధికారాన్ని పెంచుకోవడానికి, వ్యక్తిగత పలుకుబడిని పెంచుకోవడానికి సాధనాలుగా ఉపయోగిస్తున్నారు. విద్యార్థులకు కేటాయించే సీట్ల దగ్గరనుంచి విరాళాల సేకరణ, సిబ్బంది నియామకం, యాజమాన్య కమిటీ సభ్యత్వం అన్నింటిలో కులతత్వం బాగా కన్పిస్తుంది. వసతిగృహాలు నగర ప్రాంతాలలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలలో కూడా కుల ప్రాతిపదికపై నిర్మించిన వసతి గృహాలే. ధర్మశాలలు, ధర్మ కర్తృత్వ సంఘాలు కూడా కులాధారంగానే నడుస్తున్నాయి.

## 13.4.1 కులఉద్రిక్తతలు - ఫలితాలు

కులతత్వం వల్ల ఒక కుల సమూహానికి ఇంకొక కులసమూహానికి మధ్య అసూయ, వైషమ్యాలు కలహాలు, ఘర్షణలు, అశాంతి, అరాచకం అధికమవుతాయి. కులసభ్యులు సంఘంలోని బాధ్యతాయుత మైన పౌరులుగా



BRAOU

కాకుండా కులాన్ని కొమ్ముకాసే స్వార్థ పరులుగా తయారౌతారు. కుల సంఘాలు పేరుకు కులం శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నా నిజంగా కొంత మంది ధనవంతుల సలుకుబడికి, ప్రభావానికి మాత్రమే ఉపయోగపడతాయి. ఇవి కొంతమంది జేబు సంస్థలుగా చెలామణి అయ్యే ప్రమాదం ఉంది. ఇవి కొంతమంది వ్యక్తుల దోపిడి సంస్థలుగా ఉపయోగపడతాయి తప్ప కుల సంక్షేమానికి సహాయపడవు. కాబట్టి కులాన్ని కొంతమంది వ్యక్తులు తమ స్వలాభానికి వాడుకుంటున్నారని చెప్పడం అతిశయోక్తికాదు.

వెనుకబడిన కులాలలో కులతత్వం వల్ల దారుణమైన వివిధ పరిణామాలు సంభవిస్తున్నాయి. బడుగుతనం వల్ల వెనుకబడిన జాతుల వారికి ఆర్థికంగా సామాజికంగా కొన్ని ప్రత్యేకమైన సౌకర్యాలను కల్పించారు. విద్యా సంస్థలలో సీట్ల కేటాయింపులో ఉద్యోగాల వితరణలో, స్కాలర్‌షిప్‌లలో బలహీన వర్గాలవారికి ప్రాధాన్యతనిస్తున్నారు. రాజకీయంగా బలహీన వర్గాలవారికి నియోజకవర్గాల కేటాయింపులో, మంత్రి పదవుల కేటాయింపులో ప్రత్యేక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుంది. అంతేకాదు. బంజరుభూముల పంపిణీలో, గ్రామీణ పథకాలలో ఈ దళిత కులాలవారికి కొన్ని ప్రత్యేకమైన మినహాయింపులు ప్రభుత్వం కల్పిస్తున్నది. తరతరాలుగా అణచివేతకు గురైన ఈ కులాల అభ్యున్నతికి ఇవెంతో అవసరం.

కులతత్వం వ్యక్తికి, సముదాయానికి అన్ని విధాల నష్టదాయకమైన అంశమని, నిర్ద్వందంగా చెప్పవచ్చు. కులం నుంచి జన్మించిందే కులతత్వం, కాబట్టి కులాలమధ్య తెస్తున్న తరతరాల సామాజిక ఆర్థిక అంతరాలు నశించనిదే కులతత్వం నశించదు. పారిశ్రామికీకరణం, నగరీకరణం ద్వారా అన్ని కులాలలో కనీసపు అవసరాలను తీర్చే విధంగా కృషి జరగాలి. అటుతరువాత ప్రభుత్వం తన రాజకీయ, సామాజిక విధానం ద్వారా కులాలలో స్వాతంత్ర్య, సమానత్వాలు పెంపొందించే చర్యలు అమలు జరుపాలి. అంచెల వారీగా కులాన్ని సమూలంగా నిర్మూలించడానికి, దీక్షాయుతమైన కృషి జరుగాలి. అట్లా జరగనిదే కులతత్వం అనే మహమ్మారి మన సమాజాన్ని విడువదు.

## 13.5 మతం - పరిచయం

మతం అనేది విశ్వజనీనమైంది. అంటే మతం ప్రపంచంలోని అన్ని సమాజాల్లోనూ ఏదో ఒక రూపంలో ఉంటుంది. ఒక సమాజం లక్షణాలు ఆ సమాజంలో ఉండే మతసంస్థల్లో ప్రతిబింబిస్తూ ఉంటాయి. మతాన్ని మనం సంపూర్ణంగా అర్థం చేసుకోలేకపోతే ఆ మతం ఉన్న సమాజాన్ని కూడా మనం అర్థం చేసుకోజాలమని కింగ్స్లే డేవిస్ పేర్కొన్నాడు. మానవ సమాజంలోని సంస్థలన్నీ మానవుని శారీరక అవసరాల్ని నెరవేర్చడానికి ఉద్భవించినవే. మానవుడు తన పరిసరాల్లోని ప్రకృతిశక్తులను సమన్వయం చేసుకోవడానికి మతం ఒక సాధనంలా పనిచేస్తుంది. అంతేకాదు మతం అనేది ఆయా సమాజాల్లోని మిగిలిన సంస్థలన్నింటిపైనా తన ప్రభావాన్ని చూపిస్తూ ఉంటుంది. అంటే ఒక సమాజంలో ఉన్న మతం ఆ సమాజంలో ఉన్న అన్ని సామాజిక సంస్థల్లోనూ అంతర్భాగమై ఉంటుంది. మతం అంటే మానవాతీతశక్తుల్ని విశ్వసించడం అని అర్థం చెప్పుకోవాలి. ఈ విశ్వాసం ఆందోళన, భయం, భక్తి అనే వాటితో కూడుకొని ఉంటుంది. మతాన్ని నమ్మేవారు ఆత్మ దేవుడు అనే వాటిని కూడా నమ్ముతూ ఉంటారు.

### 13.5.1 మతం - లక్షణాలు

మతానికి కొన్ని లక్షణాలుంటాయి.

### 1. మానవాతీతమైన విషయాలపై నమ్మకం

మతం అనేది మానవాతీతమైన అంశాల్ని విశ్వసించడం మీద ఆధారపడి ఉంటుంది. దేవుడు, దేవతలూ మొదలైన వాటినీ, స్వర్గం, నరకం అనే భావాలనూ, పవిత్రత, కర్మకార్యం ఫలితం మొదలైన అనేక మానవాతీత విషయాల్ని, మతాన్ని నమ్మేవారు విశ్వసిస్తారని "జాన్సన్" పేర్కొన్నాడు. ఇటువంటి మానవాతీతాంశాలన్నీ మనుషుల ఇహపర జీవితాన్ని ప్రభావితం చేస్తాయని కూడా ప్రజలు నమ్ముతారని జాన్సన్ భావించాడు.

BRAOU

## 2. ఆత్మ నశించదనే విశ్వాసం

దాదాపు అన్ని మతాలు ఆత్మకు మరణం లేదని భావిస్తుంటాయి. అందువల్లనే మరణించిన తర్వాత వారికి వారు మరణించిన రోజున తద్దినం వంటి శ్రాద్ధాదికర్మని చేస్తుంటారు. వీటిని పితృదేవతలను సంతృప్తి పరిచే శ్రాద్ధకర్మలని పిలుస్తారు. ఆ రోజున వారి పితృదేవతల ఆత్మని ఆహ్వానించడం, వాటిని ఆరాధించడం జరుగుతుంది. చాలా మతాల వారు పునర్జన్మను విశ్వసిస్తారు. మనిషి మరణానంతరం అతని ఆత్మ తిరిగి చెట్టులోనో లేదా జంతువులోనో లేదా మనిషిలోనో చేరుతుంది, దీనినే పునర్జన్మ అనీ భావిస్తారు.

## 3. భగవంతునిపై విశ్వాసం

ప్రతి మతంవారు పరమాత్మను విశ్వసిస్తూ ఉంటారు. ఈ సృష్టి యావత్తూ జరగడానికీ, అది కొనసాగడానికీ, అది నాశనం కావడానికి పరమాత్మే కారణం అనీ అన్ని మతాలు భావిస్తాయి. ఈ విశ్వంలో ఉండే జీవరాసులు భగవంతుని అజ్ఞకులోబడే జీవనాన్ని కొనసాగిస్తుంటాయి. అంతరిక్షంలో ఉండే నక్షత్రాలు, సూర్య చంద్రాది నవగ్రహాలు, భూమిపై ఉండే పర్వతాలూ, కొండలూ, సరస్సులూ, నదులూ, సముద్రాలు మొదలైనవన్నీ భగవంతుని అజ్ఞమేరకే ఉంటాయి. సృష్టిలో ఇహలోకమే గాక పరలోకం కూడా ఉంటుందనీ, ఈ పరలోకానికే చనిపోయిన వారి ఆత్మ చేరుకుంటుందనీ ప్రజలు విశ్వసిస్తారు. కొన్ని మతాల వారు పరలోకం స్వర్గం నరకం అనే రెండు రకాలుగా ఉంటుందనీ, స్వర్గానికి పుణ్యాత్ములూ నరకానికి పాపాత్ములు చేరుకుంటారని భావిస్తారు. ఇటువంటి స్వర్గ నరకాలను హిందూ మతస్తులు కూడా విశ్వసిస్తుంటారు.

## 4. పవిత్రత - అపవిత్రత

ప్రతి సమాజంలోనూ కొన్ని వస్తువుల్ని పవిత్రమైన వాటిగాను, మరికొన్ని వస్తువులను అపవిత్రమైన వాటిగానూ భావించడం జరుగుతుంది. పవిత్రమైన వాటిగా భావించే వస్తువులను భయభక్తులతో గౌరవించడం, అపవిత్రమైన వాటిగా భావింపబడే వస్తువుల్ని చెడుచేసేవిగా భావించి వాటిని దూరంగా ఉంచడం జరుగుతుంది. పవిత్రం, అపవిత్రం అనే భావాల గురించి దుర్ఖైమ్ ప్రత్యేకమైన వివరణనిచ్చాడు. సమాజంలో కొన్ని అంశాలు పవిత్రమైనవనీ, వాటిని గౌరవించాలనీ, వాటికి మతంతో సంబంధం ఉంటుందనీ దుర్ఖైమ్ భావించాడు. మతంతో సంబంధంలేని అంశాలన్నీ అపవిత్రమైనవని కూడా పేర్కొనడం జరిగింది. కొన్ని వస్తువుల్లో అంతర్గతంగానే మతపరమైన విలువలు ఇమిడి ఉండడం వలన అవి పవిత్రమైనవి గానే భావింపబడతాయి.

## 5. సంస్కారాలు

ప్రతి మతానికీ అనేకమైన సంస్కారాలు ఉంటాయి. ఒక మతానికి ఉన్న సంస్కారానికీ, మరొక మతానికి ఉన్న సంస్కారానికీ అనేక భేదాలుండవచ్చు. ప్రతి సమాజంలోనూ, వివిధ సమయాల్లోనూ, సందర్భాల్లోనూ వివిధరకాలైన సంస్కారాల్ని, కర్మకాండల్ని కొనసాగిస్తూ ఉంటారు. మతం అనేది విశ్వాసాలతో కూడుకుని ఉంటుంది. ఒక్కొక్క రకమైన విశ్వాసం ఒక్కొక్క రకమైన కార్యక్రమాన్ని చేపట్టడానికి కారణమవుతుంది. మత పరమైన విశ్వాసాన్ని అనుసరింప చేసే ఈ కార్యక్రమాలనే సంస్కారాలు అని పిలుస్తారు. ఈ సంస్కారాలు అనేక మంత్ర తంత్రాలతో, అనేక తతంగాలతో కూడుకొని ఉంటాయి. నామకరణం, విద్యాభ్యాసం, వివాహం మొదలైనవి, పితృదేవతలకు చేసే కర్మలు మొదలైనవన్నీ సంస్కారాలే, అంతేకాదు, వివిధ రకాలైన పండగ పబ్బాలలోను అనేక విషయాలను ప్రారంభించేటప్పుడు కూడా సంస్కారాలను చేపడుతూ ఉంటారు. వ్రతాలు, నోములు, యాత్రలు, మొక్కుబడులు చెల్లించడం అనే చర్యల్ని కూడా ఈ సంస్కారాల క్రిందే చెప్పవచ్చు. ప్రార్థన, ఆరాధన అనే వాటిని ఆధారంగా చేసుకుని ఈ సంస్కారాల్ని కర్మ కాండలను కొనసాగిస్తారు.

## 13.6 మతరూపాలు

ప్రపంచంలో దాదాపు అన్ని సమాజాల్లోనూ అతి ప్రాచీన కాలం నుండీ మతం అనేది ఏదో ఒక రూపంలో ఉన్నది. ఒక్కొక్క కాలంలో మతం ఒక్కొక్క రూపంలో ఉండేది. అంతేకాదు ఒక్కొక్క సమాజంలో మతం ఒక్కొక్క రూపంలో

BRAOU

ఉంటుంది. ఇప్పుడు ముఖ్యమైన కొన్ని మత రూపాల్ని గురించి కుప్తంగా తెలుసుకుందాం.

మత రూపాల్ని ముఖ్యంగా మూడు రకాలుగా పేర్కొనవచ్చు. అవి ఏమిటంటే 1. ఏకదేవతారాధన 2. బహుదేవతారాధన 3. ప్రకృతి ఆరాధన. ఈ మూడు రకాలైన మతరూపాల్ని పరిశీలిద్దాం.

ఒక దేవతను నమ్మి ఆ దేవతనే ఆరాధించడం అనేది ఏకదేవతారాధన. అనేక దేవతలపై విశ్వాసముంచి ఈ దేవతలందర్నీ ఆరాధించడమనేది బహుదేవతారాధన. హిందువులు కృష్ణుడు, బ్రహ్మ, రాముడు, శివుడు, వినాయకుడు, ఆంజనేయుడు, లక్ష్మీ, పార్వతీ ఆ విధంగా అనేకమంది దేవతల్ని ఆరాధించడం. ఇది బహుదేవతారాధనకు చక్కని ఉదాహరణ. ప్రకృతిలోని సూర్య చంద్రుల్ని, నదుల్నీ, సముద్రాల్నీ, కొన్ని చెట్లనూ, కొన్ని జంతువుల్నీ ఆరాధించడమనేది ప్రకృతి ఆరాధన.

మతం పుట్టుపూర్వోత్తరాలను గురించి అనేకమంది పండితులు అనేక రకాలైన సిద్ధాంతాలను పేర్కొన్నారు. ఈ సిద్ధాంతాలను కూడా పరిశీలిస్తే మతానికి సంబంధించిన మరికొన్ని రూపాల్ని గురించి కూడా తెలుసుకోవచ్చు. ఇప్పుడు ఈ సిద్ధాంతాల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

## ఆత్మవాదం

ఆత్మవాదం అనే సిద్ధాంతాన్ని టైలర్ అనే మానవ శాస్త్రజ్ఞుడు రూపొందించాడు. ఆత్మవాదం అంటే ఆత్మను విశ్వసించడం అని టైలర్ భావించాడు. టైలర్ ప్రతిపాదించిన ఆత్మవాదం గురించి తెలుసుకుందాం. టైలర్ ఆత్మవాదం గురించి ఈ క్రింది విషయాలను తెలియజేసాడు.

BRAOU

అతి ప్రాచీన కాలానికి చెందిన మానవుడు తాను నిద్రిస్తున్నపుడూ, కలలు కనేటపుడు అనేక రకాలైన పనులను నిర్వహించడం, అనేక రకాలైన కార్యకలాపాల్లో పాల్గొనడం జరుగుతున్నట్లు భావిస్తూ ఉండేవాడు. చనిపోయిన తన తల్లిదండ్రులూ, లేదా ఇతర పూర్వీకుల్ని అతడు కలల్లో కలిసేవాడు. నిద్రలేకుండా ఉండే మాములు సమయాల్లో తన మాటల ప్రతిధ్వనిని తాను వినడం జరిగేది. అంతేకాదు నీటిలో తన ప్రతిబింబాన్ని తానే చూసుకుని ఆశ్చర్యపోయేవాడు. అంతేకాకుండా మనుష్యులు అందరూ విధిగా మరణించడాన్ని కూడా అతడు గమనించాడు. ఈ విషయాలన్నీ ప్రాచీన మానవునికి అంతుబట్టని విషయాలుగా మారాయి. ఈ విషయాలన్నీ ప్రాచీన మానవునిలో అనేక ఆలోచల్ని రేకెత్తించాయి. ప్రతి మనిషిలోనూ ఒక "అదృశ్య శక్తి" ఉంటుందనీ ఆ అదృశ్యశక్తి మనిషినుండి బయటికి వెళ్ళిపోవడమే మరణం అనీ ప్రాచీన మానవుడు భావించాడు. మనిషిలో రెండురకాలైన ఆత్మలుంటాయనీ, అందులో ఒకటి శారీరక ఆత్మ అనీ, రెండోది స్వేచ్ఛాపరమైన ఆత్మ అనీ, ప్రాచీన మానవుడు భావించాడని టైలర్ తలచాడు. స్వేచ్ఛ ఆత్మ నిద్రిస్తున్నప్పుడు బయటికి పోయి అనేక మందిని కలుస్తుందని ప్రాచీన మానవుడు భావించాడని కూడా టైలర్ పేర్కొన్నాడు. అయితే శారీరక ఆత్మ శాశ్వతంగా మనిషిని వదిలి వెళ్ళిపోవడమే మరణం అని ప్రాచీన మానవుడు తలచినట్లు టైలర్ పేర్కొన్నాడు. టైలర్ సిద్ధాంతం అనేక విమర్శలకు లోనయింది. ప్రాచీన మానవుడు పై విధంగా ఆలోచించాలంటే అతడొక తత్వ శాస్త్రవేత్త, ఒక తర్కశాస్త్రవేత్త అయి ఉండాలనీ, అయితే ప్రాచీన కాలానికి చెందిన మనిషికి ఇటువంటి మానసిన పరిపక్వత ఉండదనీ డి.ఎన్. మజుందార్ పేర్కొన్నాడు. అయితే టైలర్ సిద్ధాంతాన్ని అంత తేలికగా కొట్టిపారవేయడానికి వీలులేదని మజుందార్ భావించాడు.

## జీవాత్మవాదం

ప్రపంచంలోని ప్రతి వస్తువులోనూ జీవం ఉన్నదని విశ్వాసించడాన్నే జీవాత్మవాదం అని పిలుస్తారు. మాక్స్ ముల్లర్, మారెట్ మొదలైన శాస్త్రవేత్తలు జీవాత్మవాదాన్ని ప్రతిపాదించారు. వీరి దృష్టిలో ఆత్మవాదంకన్నా జీవాత్మవాదం మొదటిది అంటే అతి ప్రాచీన కాలంలో మతం అనేది జీవాత్మవాదం రూపంలో ఉండేది. మాక్స్ ముల్లర్ "ప్రకృతి" వాదాన్ని మారెట్ "మాన" అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. వీటిలో ముందుగా "మానవాదాన్ని" గురించి తెలుసుకుందాం.

అతి ప్రాచీన కాలానికి చెందిన మానవుడు కొన్ని వస్తువులలో ఒక అతీతమైన శక్తి ఉంటుందని భావించేవాడనీ, ఈ శక్తి వల్లనే ప్రపంచంలో అన్ని సంఘటనలూ జరుగుతాయని భావించేవాడని ఈ అతీతశక్తినే "మాన" అంటారనీ మారెట్ పేర్కొన్నాడు. అర్థం చేసుకొనజాలనటువంటి మానవరూపంలో లేనటువంటి అభౌతికమైనటువంటి శక్తిని విశ్వసించడమే మతం తొలిరూపమని మారెట్ పేర్కొన్నాడు. ఇటువంటి నమ్మకం ప్రపంచంలో చాలా దేశాల్లో ఈ నాటికీ ఉంది. ఈనాటి మన ఆధునిక సమాజంలో కూడా కొన్ని కొన్ని వస్తువులూ, కొన్ని కొన్ని సంఘటనలూ, ఇటు మంచిని కానీ, అటు చెడునుకానీ చేస్తాయని ప్రజలు నమ్ముతూ ఉంటారు.

### ప్రకృతి ఆరాధన

ప్రకృతిలోని అనేక వస్తువుల్లో జీవం ఉంటుందనీ, అంతే కాకుండా వాటిలో మానవాతీతమైన అనేక శక్తులు ఉంటాయనీ, ఈ శక్తులంటే ఉన్న భయభక్తులతో ప్రకృతిలోని శక్తుల్ని అతి ప్రాచీన కాలం నాటి మానవుడు ఆరాధించడం మొదలుపెట్టారనీ మాక్స్ ముల్లర్ భావించాడు. ప్రకృతిలోని అనేక వస్తువులను ఈ నాటికీ అనేక సమాజాలకు చెందినవారు ఆరాధిస్తున్నారు. హిందూ మతస్థులను దీనికి చక్కటి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. హిందువులు సూర్య, చంద్రుల్నీ, అనేక వృక్షాల్ని, వరుణుడినీ, అగ్నినీ, అనేక జంతువుల్నీ అనేక ప్రదేశాల్నీ కూడా ఆరాధిస్తారు, పూజిస్తారు.

## 13.7 మతవిధులు

మతం అనేది మానవ సమాజంలో అనేకరకాలైన విధులను నిర్వహిస్తూ ఉంటుంది. మతాలూ, మతాచారాలు మత సంస్కారాలు ఒక సమాజంలో ఒక రకంగా ఉంటే మరొక సమాజంలో వేరొక రకంగా ఉంటాయి. అయినప్పటికీ మతం అనేక విధుల్ని నిర్వహిస్తూ మానవ సమాజంలో అనేక విషయాల్లో కీలకమైన పాత్రను నిర్వహిస్తూ ఉంటుంది.

BRAOU

మానవులలో ఏర్పడే కలతలు నివారించడంలో మతం చాలా ప్రముఖ పాత్రను నిర్వహిస్తూ ఉంటుంది. మానవ జీవితంలో మానవుడు ప్రతి క్షణం అనేక సమస్యలను ఎదుర్కొంటాడు. అంతేకాకుండా తలవని తలంపుగా అనేక సంఘటనలు మనిషి ఎదుర్కోవలసి ఉంటుంది. దానితోపాటు అనేక కలతలు ఏర్పడుతూ ఉంటాయి. మనిషి ఎన్నో రకాలైన మానసిక ఆందోళనలకు లోనవుతూ ఉంటాడు. ఇటువంటి అన్ని రకాలైన కలతలనూ తొలగించడంలో మతం మనిషికి ఎన్ని రకాలుగానో తోడ్పడుతుంది. మతాన్ని నమ్మినవారు అనేక సంస్కారాల్ని ఆచరిస్తారు. అనేక రకాలైన పూజలు చేస్తారు. ఎన్నోరకాలైన మొక్కుబడులను మొక్కుకుంటారు. ఎన్నో తీర్థ యాత్రలను చేస్తుంటారు. ఇటువంటి మతపరమైన కార్యక్రమాలను చేయడంవలన మనిషిలో ఏర్పడే కలతలు రూపుమాసి పోతాయి. మనిషిలో ఏర్పడే సంక్షోభం తొలగిపోతుంది.

'మానవసేవయే మాధవసేవ' అనీ 'ప్రజలసేవే ప్రభువులసేవ'నీ, 'పరులసేవయే పరమాత్మసేవ' అనీ, అనేక మతాలు విశ్వసిస్తూ ఉంటాయి. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, పేదలకూ, నిస్సహాయులకూ సహకరించడం, దాన ధర్మాలు చేయడం, వైద్యాలయాలు, ధర్మశాలలు, విద్యా సంస్థలూ మొదలైన వాటిని నిర్మించడంలాంటి కార్యక్రమాల ద్వారా సమాజ సేవను మతం ప్రోత్సహిస్తుంది.

మతం నిర్వహించే విధుల్లో 'సామాజిక నియంత్రణ' అనేది కూడా చాలా ముఖ్యమైన విధిగా చెప్పవచ్చు. మతం పాపం పుణ్యం అనేవాటిని నమ్మేటట్లు చేస్తుంది. పాపం అంటే ఇతరులకు హాని చేయడం, పుణ్యం అంటే ఇతరులకు తోడ్పడే మంచి పనులు చేయడం. మతం పాపాలను నిషేధిస్తుంది. పుణ్యాన్ని ప్రోత్సహించుటలోనూ ప్రముఖ పాత్రను వహిస్తుంది. పుణ్యాలు చేస్తే అంటే మంచిపని చేస్తే దేవుని చేరడం సులభమనీ అన్ని మతాలూ చాటి చెపుతాయి. భయం భక్తీ అనే అంశాలు, నరకం స్వర్గం అనే భావాలు మనిషి ప్రవర్తననూ అదుపులో పెడుతుంటాయి.

మతం అనేది సమాజంలో సమైక్యతను సాధించడానికి తోడ్పడుతుంది. మత పరమైన ఉత్సవాలు పండుగలు, తీర్థాలు, జాతరలు మొదలైనవి జరిగినపుడు ఆ సమాజంలోని మతానికి చెందినవారందరిలో సమైక్యతా భావం,

సంఘటిత స్వభావం ఉండడం కన్పిస్తుంది. మతం అనేది ఇటువంటి సందర్భాలలో ఆ మతానికి చెందిన వారందరికీ 'సామాజిక ప్రాతినిధ్యం' వహిస్తుందని ఫ్రాన్సు దేశానికి చెందిన ప్రముఖ సమాజ శాస్త్ర వేత్త దుర్క్‌హైమ్ పేర్కొన్నారు. అయితే ఒక సమాజంలో అనేక మతాలున్నపుడు మత సామరస్యాన్ని సాధించడంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలూ, వివిధ మతాలకు చెందిన మతాధికారులూ అవిరళ కృషి చేస్తుంటారు. ప్రతి మతం మానవునిలో ప్రేమాభిమానాలను కలుగజేస్తుంది. తోటి మానవులకు సహకరించడంలోనూ, సహాయపడడంలోనూ మతం కీలకపాత్ర నిర్వహిస్తుంది. తోటి మనిషికి సేవ చేయడాన్ని సమాజంలో ప్రోత్సహించే సంస్థల్లో మతం చాలా ముఖ్యమైనది.

### 13.7.1 మతం - సామాజిక ప్రకర్షణలు

మతం సమాజంలోని ముఖ్య సంస్థలలో ఒకటి. సమాజంలోని రాజ్యాంగ, ఆర్థిక, విద్యా, క్రీడ మొదలయిన మౌళిక సామాజిక సంస్థలలో మతసంస్థ ఒకటి. మనదేశంలో ఉన్నమతాలలో ముఖ్యమయినవి హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలు. "మతమంటే అది ప్రాకృతిక శక్తి పట్లగల వైఖరి" అని అగ్‌బర్న్ నిర్వచించాడు. మతమంటే అధి భౌతిక లేదా అధి ప్రాకృతిక శక్తిపట్ల ఉండే నమ్మకమని చెప్పవచ్చు. ఇట్లాంటి నమ్మకాలే వేర్వేరు విధాలయిన మతాలు. ఆయా మతాలలో ఉండే సంస్కారాలు, పాటించే పద్ధతులు వేర్వేరుగా ఉంటాయి. సమాజంలో మానవుని జీవిత విధానం ఆయా సమాజపు మత విధానాలమీద చాలా వరకు ఆధారపడి ఉంటుంది. మతం సామాజిక నియంత్రణ ప్రకార్యంలో చాలా సహాయపడుతుంది. సమాజంలో "పాపం", "పుణ్యం", "సత్యం", "అసత్యం", "నియమాలు" ఇవన్నీ మతాధారమయిన ప్రవర్తనా రీతులుగా చెప్పవచ్చు.

సాంఘిక జీవనం, సాంఘిక చర్యల పర్యవసానమే, సమాజ జీవనంలో మనకు కనబడే క్రమం, నిర్మాణం కూడా సమాజ సభ్యులు సమూహాల మధ్య జరిగే పరస్పర చర్యలను అనుసరించే వస్తూ ఉంటుంది. స్థిరమయిన రూపాన్ని ధరించే పరస్పర చర్యలనే సాంఘిక ప్రక్రియలు అంటాము. సాంఘిక ప్రక్రియలు అనేవి అన్ని సమాజాలలోనూ ఉంటాయి. సాంఘిక ప్రక్రియలలోని భాగాలు 1. సంఘర్షణ, 2. పోటీ, 3. సర్దుబాటు, 4. విలీనీకరణము.

## 13.8 మతకలహాలకు కారణాలు

BRAOU

మతకలహాన్ని కూడా సాంఘిక ప్రక్రియలలో ఒకటిగా భావించాలి. సంఘర్షణ ప్రక్రియ వ్యక్తుల మధ్యగానీ లేదా సమూహాల మధ్య గానీ ఏర్పడుతుంది. ప్రత్యర్థిని ఏదో ఒక విధంగా మట్టుపెట్టి తమ ప్రయోజనాలను సాధించుకునే ప్రక్రియను సంఘర్షణ అంటారు. సాధారణంగా సంఘర్షణ ఈ క్రింది మూడు సందర్భాలలో జరుగుతుంది.

1. ఒకే వస్తువును చాలా మంది కోరుకున్నప్పుడు సంఘర్షణ ఏర్పడుతుంది. ఉదాహరణకు మన దేశంలో వివిధ రాష్ట్రాలమధ్య నదీ జలాలకు సంఘర్షణలు ఏర్పడుతూ ఉన్నాయి.
2. అంతస్తు, హోదా, గౌరవము, అధికారం మొదలయిన వాటికోసం సంఘర్షణ పడతారు.
3. సాంస్కృతిక మయిన అంతరాలు కూడా సంఘర్షణలకు దారితీస్తాయి. ముఖ్యంగా విలువలలోగానీ, ఆదర్శాలలో గానీ భేదాలుంటే సంఘర్షణ ఏర్పడుతుంది.

మత కలహాలు సంస్కృతి విభేదాలవల్ల ఏర్పడ్డ సంఘర్షణలు. చాలాకాలం నుంచి భారత దేశంలో మతకలహాలు జరుగుతూనే ఉన్నాయి. ఇట్లాంటి కలహాలు ఒకేసారి జరిగి సమసిపోయేవి కావు. ఇవి చారిత్రక కారణాలవల్ల తరతరాలనుంచి జరుగుతూనే ఉన్నాయి. ఈ కలహాలు స్వసమూహ దురభిమానం వల్ల ఏర్పడతాయని తెలుసుకోవాలి. ఈ దురభిమానం ఒక తరం నుంచి ఇంకొక తరానికి సంక్రమిస్తూ ఉంటుంది. ఆయా మతాల వారు సాంఘికీకరణ ప్రక్రియ ద్వారా ఇట్లాంటి భావాలను పెంపొందించుకొని అప్పుడప్పుడు ఘర్షణ పడుతూ ఉంటారు. అయినా సాధారణంగా మతకలహాలు రావడానికి కొన్ని కారణాలు ఉంటాయి. వాటిలో ముఖ్యమయినవి ఇవి:

1. సాంస్కృతిక కారణాలు
2. సాంఘిక, ఆర్థిక కారణాలు

3. రాజకీయ కారణాలు

4. జనాభా వ్యత్యాసం

5. నాయకత్వం, స్వలాభాపేక్ష

## 1. సాంస్కృతిక కారణాలు

మానవుడు పుట్టుకతోనే సంస్కృతిని వెంటబెట్టుకొనిరాడు. సమాజపు సభ్యుడిగా అతడు సాంఘికీకరణ ప్రక్రియ ద్వారా తన సమాజపు సంస్కృతిని నేర్చుకుంటాడు. చాలా సమాజాలలో పిల్లలకు మతాన్ని గురించి చెబుతూ ఉంటారు. పిల్లలకు దేవుని పటం చూపించి మొక్కమనడం, సూర్యునికి నమస్కరించమనడం వంటివి బోధిస్తూ ఉంటారు. అప్పటినుంచి వ్యక్తికి దేవుడు, మతము అనే భావాలు తెలుస్తాయి. ఇట్లా ఏర్పడ్డ భావం వల్ల క్రమేణా అతడు ఈ మతాన్ని అనుసరిస్తాడు. అతని మతాన్ని ఎవరైనా ద్వేషిస్తే ఊరుకోడు. కొన్ని సందర్భాలలో అనవసరంగా ఇతరుల మతాన్ని ద్వేషించినందువల్ల మతకలహాలు వస్తుంటాయి. ఉదాహరణకు మతపరమయిన పూజలు, ఊరేగింపులు జరిగే సమయాలలో ఇతర మతస్తులు, హింసాత్మక చర్యలకుగానీ దిగినట్లయితే, వెంటనే మతకలహాలు మొదలయి రక్తపాతం జరుగుతుంది. కొందరు ఎదుటివారి మతం హీనమయినదని, తమమతమే గొప్పదని భావిస్తారు. ఈ మతతత్వమే మత సంఘర్షణలకు మూలమని చెప్పవచ్చు.

## 2. సాంఘిక, ఆర్థిక కారణాలు

సమాజంలో వచ్చే అంతస్సమూహ కలహాలకు కారణం బహిరంగంగా సాంస్కృతిక కారణాలుగా కనిపించినప్పటికీ సమగ్ర దృష్టితో చూస్తే వీటి వెనుక ఆర్థిక కారణాలు కనిపిస్తాయి. సాంఘిక, ఆర్థిక అంతస్థులలో ఉండే తేడాలు మతసమూహాలతో కలిసిపోయినప్పుడు సాంఘిక, ఆర్థిక అంతస్తులలో వ్యత్యాసాలను అరికట్టడానికి లేదా నిర్మూలించడానికి మత పరమయిన ఉద్రేకాలను రెచ్చగొట్టించడం సర్వ సాధారణ విషయంగా చెప్పవచ్చు.

భారతదేశంలో జరిగే మతకలహాలకు సాంఘిక, ఆర్థికకారణాలు చాలా ముఖ్యమైనవని తెలుసుకోవాలి. ఉదాహరణకు పూర్వ హైద్రాబాద్ రాష్ట్రం నైజామ్ నవాబు ముస్లిం మతస్తుడు. ప్రజలు హిందువులు ప్రభుత్వపు నిరంకుశ పరిపాలన ముస్లింలకు లాభసాటిగా ఉండటం మూలన హిందూ ప్రజలు ముస్లిం మతస్తుడైన రాజుకు, ముస్లింలకూ, వ్యతిరేకమయిన భావాలనూ ధృఢపరుచుకున్నారు. ఇట్లాగే దేశ స్వాతంత్ర్యానికి పూర్వ బెంగాల్‌లో ముస్లిం ప్రజలు ధనికులయిన హిందువులకు వ్యతిరేకంగా పోరాడగా అది మతకలహాల రూపాన్ని దాల్చింది.

## 3. రాజకీయ కారణాలు

సాంఘిక, ఆర్థిక వ్యత్యాసాలు రాజకీయ వ్యత్యాసాలుగా రూపొందడం సహజం. ఎక్కువ అధికారం ఉన్న వ్యక్తి తక్కువ అధికారం ఉన్న వ్యక్తిపై ఒత్తిడి చేయడం, మత తత్వానికి అనుబంధంగా ఉండే రాజకీయ పరమయిన సంఘర్షణ మత సంఘర్షణగా మారడం కద్దు. రాజకీయ ప్రయోజనాలకోసం మతాన్ని వాడుతుంటారు.

## 4. జనాభా వ్యత్యాసం

పైన చెప్పిన కారణాలకు అనుగుణంగా ఒక సమాజంలో ప్రజా బహుళ్యం గల ఒక సమూహం, అల్పసంఖ్యాక వర్గం వారిపై అధికారం కొనసాగించడమో లేదా ఇట్లా అధికారం కొనసాగించకున్నా అల్ప సంఖ్యాకులు తమ కష్టాలకు అధిక సంఖ్యాకులే బాధ్యులని అపోహపడటమో కూడా జరుగుతున్నది. ఈ జనసంఖ్య తేడా మతవ్యత్యాసాలతో కూడుకొని ఉండడం వల్ల సమాజంలో జరిగే సంఘర్షణలు మతకలహాలుగా మారవచ్చు.

## 5. నాయకత్వం - స్వలాభం

భారతదేశంలో జరిగే మతకలహాలలో పైన వివరించిన వివిధ కారణాలు ఉన్నాయని, ఏదో ఒక సంఘర్షణ ఒక కారణం వల్ల జరుగుతూ ఉన్నదని ప్రత్యేకంగా పేర్కొనడం కష్టం. మనుషులు స్వసమూహ దురభిమానాలకు

BRAOU

లోనయినపుడు ప్రతి చిన్న సమస్యకూడా జటిల సమస్యగా తయారవుతుంది. నాయకులు ఏమాట మాట్లాడినప్పటికీ, ఏపని చేసినప్పటికీ అపార్థాలకు దారితీసేటట్లుగా గాని ఇతరులకు కష్టం కలుగజేసేటట్లుగా గానీ ప్రవర్తించకూడదు. నాయకులు స్వలాభాపేక్షతో అవాంఛనీయ పద్ధతిలో ప్రవర్తించడం తరచుగా మతకలహాలకు దారితీస్తుంది.

మన దేశంలో చాలా కాలం నుంచి మత కలహాలు జరుగుతూ ఉన్నాయి. ముస్లింలు ఈ దేశాన్ని ఆక్రమించకముందు మతకలహాలు హిందువుల, బౌద్ధుల మధ్య జరిగేవి. ముస్లింలు ఈ దేశానికి వచ్చిన తరువాత మతకలహాలు హిందూ ముస్లిం రాజుల మధ్య జరిగేవి. క్రమేణా సాంఘిక, ఆర్థిక కారణాల వల్ల ప్రజా బాహుళ్యంలో ఇట్లాంటి కలహాలు ఎక్కువయినాయి. బ్రిటీష్ వారి భారతదేశ పరిపాలన కాలంలో అక్కడక్కడ క్రైస్తవుల, ముస్లింల, హిందువుల మధ్య వైషమ్యాలు బయలుదేరినాయి. బ్రిటీష్ వారి విభజించి పాలించు సిద్ధాంతంవల్ల ఈ మతకలహాలు ఎక్కువయినాయి.

1906 సంవత్సరంలో ముస్లింలు అగాఖాన్ ఆధ్వర్యాన "ముస్లింలీగ్" స్థాపించినారు. ఆగాఖాన్ అప్పటి రాజప్రతినిధి అయిన లార్డ్ మౌంట్ బాటెన్‌ను కలిసి ఎన్నికలు మత ప్రాతిపదిక మీద జరపాలి అని కోరారు. ఈ ప్రాతినిథ్యం వల్లనే హిందువులకు, ముస్లింలకు ప్రత్యేకమయిన నియోజకవర్గాలు ఏర్పడ్డాయి.

### 5. నాయకత్వం, స్వలాభం

1947వ సంవత్సరానికి పూర్వ భారతదేశ స్వాతంత్ర్య పోరాట సమయంలో ఈ మత ప్రకర్షణలు, వైషమ్యాలు ఎక్కువయినాయి. దాని ఫలితమే భారతదేశ విభజన. ఈనాటికీ అప్పుడప్పుడు భారతదేశంలో మత ప్రకర్షణలు చెలరేగుతూనే ఉన్నవి. ప్రొఫెసర్ ఘుర్యే భారతదేశంలో జరిగిన మత కలహాలు చారిత్రకంగా ఎట్లా తగ్గుతూ హెచ్చుతూ వచ్చినాయో "భారత దేశంలో సామాజిక ప్రకర్షణలు అనే గ్రంథంలో వివరించినాడు. అతడు చారిత్రకంగా జరుగుతూ వస్తున్న మతకలహాలు ఎన్నో రక్తపాతాలకు, కారణమై జన నష్టాన్ని కలిగిస్తూ వస్తున్నాయని వివరించినాడు.

BRAOU

## 13.9 ముగింపు

భారతదేశంలో వర్ణవ్యవస్థ, కులాలు వాటి పరిణామాలను తెలుసుకున్నాము. మతాలు, మతాల పుట్టుక, వాటి విధులు, ప్రకార్యాలు కూడా తెలుసుకొన్నాం. వర్ణవ్యవస్థ భారతదేశంలో సామాజిక స్థరీకరణకు కారణమవుతున్నది. కులం కూడా ఈ దేశంలో ప్రత్యేకమైనది. మత, కుల దురభిమానాల వల్ల, వాటి రాజకీయ, సాంస్కృతిక, తేడాలవల్ల, దురభిమానాలు ప్రజల్లో కుల, మత కలహాలకు దారితీస్తున్నది. భారత దేశంలో ఈ రెండింటి మీద ఆధారపడి సామజిక ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయి.

## 13.10 మాదిరి పరీక్ష - ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబురాయండి?**

1. వర్ణవ్యవస్థను గురించి రాయండి?
2. కులవ్యవస్థ భారతదేశంలో స్థరీకరణగా ఎలా ఉపయోగపడుతున్నదీ వివరించండి.
3. మతం పుట్టుక విధుల గురించి వివరించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.**

1. మతం - సామాజిక ప్రకర్షణలు గురించి రాయండి?
2. మతరూపాలేవి?
3. కుల ఘర్షణలు గురించి రాయండి?

## 13.11 చదవదగిన పుస్తకాలు


1. Dutt, S.K. : Origin and Groath of Cast In India.
2. Huttan, J.S. : Cast in India.
3. C.B. Meyo : Social Problem and Social Disorganisation in India.
4. Madan, G.R. : Indian Sociol Problem.
5. G.S. Ghars : Social Tension in India.


BRAOU

# భాగం-14: భారత దేశంలో సాముదాయిక ప్రకర్షణలు- సముదాయాభివృద్ధికి సూచనలు

విషయక్రమం


14.0 ఉద్దేశాలు

14.1 పరిచయం

14.2 చరిత్ర

14.3 ప్రకర్షణలు కారణాలు

- 14.3.1 భౌగోళిక కారణాలు
- 14.3.2 చారిత్రాత్మక కారణాలు
- 14.5.3 మానసిక కారణాలు
- 14.5.4 సామాజిక కారణాలు

14.4 ప్రకర్షణ నివారణ చర్యలు

- 14.4.1 జాతీయతా భావం.
- 14.4.2 పరస్పర సంబంధాలు
- 14.4.3 మత్రపాతిపదిక-రాజకీయ పక్షాలు
- 14.4.4 ఆరోగ్య వంతమైన ప్రజాభిప్రాయం.
- 14.4.5 జాతీయ పండుగలు - ప్రోత్సాహం

14.5 సమాజాభివృద్ధికి సూచనలు

14.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

14.8 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 14.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- ప్రకర్షణలకు గలకారణాలు, దానినివారణ చర్యలు గురించి తెలుసుకుంటారు.
- సమాజాభివృద్ధికి అవసరమైన చర్యలను వివరించగలుగుతారు.

## 14.1 పరిచయం

ప్రకర్షణ' అనే పదానికి సంఘర్షణ, కొట్లాట, ఉద్రిక్తత, అనే అర్థాలు చెప్పవచ్చు. భాష, సముదాయం, నివాసం, సంస్కృతి, సామాజిక ఆర్థిక పరమైన అంతస్తులాంటి విషయాలలో సమూహాలనడుమ భేదాభిప్రాయాలు, భిన్నత్వాల కారణంగా సమాజంలో సామాజిక ప్రకర్షణలు ఏర్పడతాయి. సామాజిక ప్రకర్షణలకు అనేక కారణాలు చెప్పవచ్చు.

వీటిలో భౌతిక, మత, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రాజకీయ కారణాలు ముఖ్యమైనవి. ఒక సమూహం వేరొక సమూహంతో కొన్ని ముఖ్యమైన విషయాలలో గానీ, చాలావిషయాలలో గానీ విరుద్ధంగా ఉన్నపుడు ఉండే దురభిప్రాయాలు, నమ్మకాలు, అభిరుచులు సామాజిక ప్రకర్షణలకు ప్రధాన హేతువులుగా భావించవచ్చు. కానీ క్రైచన్ క్రట్చ్‌ఫీల్డ్ అనే శాస్త్రవేత్తలు భౌతిక, మానసిక, సామాజిక కారణాలవలన సామాజిక ప్రకర్షణలు జరుగుతాయని పేర్కొన్నారు. కింబాల్ యంగ్ అనే శాస్త్రవేత్త సాంస్కృతిక కారణాలవల్ల సమాజంలో ప్రకర్షణలు ఏర్పడతాయని వివరించాడు. సామాజిక ప్రకర్షణల గురించి కూలంకషంగా చర్చించేముందు సామాజిక ప్రకర్షణల రకాలగురించి తెలుసుకొందాము. సామాజిక ప్రకర్షణలలో ప్రాంతీయ ప్రకర్షణలు, భాషా ప్రకర్షణలు, సాముదాయిక ప్రకర్షణలు ముఖ్యమైనవి. కానీ ప్రస్తుత పాఠ్యాంశంలో ముఖ్యంగా సాముదాయిక ప్రకర్షణల గురించి మాత్రమే విపులంగా చర్చించాము.

## చరిత్ర

1947 ఆగష్టు 15వ తేదీన భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అప్పటి నుంచి భారతదేశంలో ప్రతీచోట హిందువులు, ముస్లింల మధ్య ప్రకర్షణలు తలయెత్తి రక్తపాతం జరుగుతోంది. సాముదాయిక ప్రకర్షణలు సంభవించినపుడు మన దేశంలో కనిపించి అమానుష ప్రవర్తన ప్రపంచ చరిత్రలోనే బహుశా ఎక్కడా కానరాదేమో అనిపిస్తుంది. గ్రామాలను అగ్నిమయం చేయడం, అగ్నిజ్వాలల్లోనికి పిల్లల్ని నెట్టివేయడం, స్త్రీలను నగ్నంగా కొరడాలతో కొడుతూ ఊరేగింపుగా తీసుకొనివెళ్లడం, రైళ్ళను ఆపి ప్రయాణీకులను కొట్టడం, చంపడం, ప్రజల ఇళ్ళను ధ్వంసంచేయడం మొదలగు భీభత్స పరిస్థితులు ఆ సాముదాయిక సంఘర్షణల వల్ల ఉత్పన్నమౌతూ వస్తున్నాయి. నాయకులు ఎన్నో కట్టుదిట్టమయిన చర్యలు తీసుకొంటున్నప్పటికీ సాముదాయిక సంఘర్షణలు పూర్తిగా నిర్మూలించలేకపోతున్నారు. ఈ మధ్యకాలంలో కూడా గుజరాత్‌లాంటి రాష్ట్రాలలో సాముదాయిక ప్రకర్షణలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. అయితే ఈ సాముదాయిక ప్రకర్షణలను నిర్మూలించడానికి మార్గాలను అన్వేషించడానికి ముందు అసలు ఏయే కారణాలవల్ల మన దేశంలో సాముదాయిక ప్రకర్షణలు తలెత్తుతున్నాయో వాటిని గురించి చర్చిద్దాం.

## 14.3 సాముదాయిక ప్రకర్షణలు-కారణాలు

### 14.3.1 భౌగోళిక కారణాలు

సాముదాయిక ప్రకర్షణలకు భౌగోళిక కారణాలు ప్రధానమైనవి. జీవన పద్ధతులు, ప్రవర్తన మొదలగు విషయాలలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవుల మధ్య భిన్నత్వాల కారణంగా భౌగోళికంగా వేరువేరు ప్రాంతాలలో నివసించడం వలన సాముదాయిక ప్రకర్షణల తీవ్రత, వాటిస్థాయి అధికమౌతోంది.

### 14.3.2 చారిత్రాత్మక కారణాలు

సాముదాయిక ప్రకర్షణలకు మరొక కారణం ఉంది. కొంతమంది ముస్లింలు మతవాదులు విదేశీయులుగా భారతదేశానికి వచ్చి బలవంతంగా హిందువులను ముస్లిం మతంలోనికి మార్చడానికి ప్రయత్నం చేస్తారు. ఇది చారిత్రాత్మకంగా వాస్తవం. అనేకమంది ముస్లిం చక్రవర్తులు అదే సమాన స్థాయిలో ముస్లిం చక్రవర్తులు తలపెట్టిన అన్యాయాలకు హింసలకూ ప్రతీకారంగా నిలిచినారు. వందలాది సంవత్సరాలు గడిచిన తరువాత హిందువులూ ముస్లింలు కలిసి పరస్పరం సంహకరించుకొనడం అనేక సందర్భాలలో కనిపించింది. 1857లో ప్రారంభమైన భారత స్వాతంత్ర్యసమర పోరాటంలో హిందువులు ముస్లింలు సమష్టిగా పాల్గొన్నారు. ఔరంగజేబు గతంలో హిందువులకు తలపెట్టిన అరాచక చర్యలను, హింసలను, క్రూరత్వాన్ని రెండు వర్గాలు మరువలేక పోయినప్పటికీ కూడా కాంగ్రెస్‌లోనూ, భారత సైన్యంలోను హిందువులు, ముస్లింలు, సమిష్టిగా పాల్గొని బ్రిటీష్ వారికి ఎదురుగ నిలిచారు. ఇది ఇలా ఉండగా కొంతమంది మత ప్రాతిపదికన వారివారి ప్రయోజనాలను కాపాడుకోవడానికి రాజకీయపక్షాలను ఏర్పరిచారు. ఇది హిందూ ముస్లింల మధ్య అనేక చిన్న చిన్న కొట్లాటలకు దారితీసింది. ఈ కొట్లాటలు క్రమక్రమంగా



BRAOU

తీవ్రరూపం దాల్చాయి. హిందూ ముస్లింల మధ్య మరలా వ్యతిరేక భావన పునరావృతమైనది. ముస్లిం లీగ్ పాకిస్తాన్ విభజనకు డిమాండ్ చేసింది. పాకిస్తాన్ విడిపోయింది. అయినప్పటికీ భారతదేశంలో సాముదాయిక ప్రకర్షణలు నిర్మూలింపబడలేదు.

### 14.3.3 మానసిక కారణాలు

మానసిక కారణాలు కూడా సాముదాయిక ప్రకర్షణలకు దారితీస్తున్నాయి. హిందూ - ముస్లింల మధ్య ప్రకర్షణలకు పరస్పర ద్వేషాభావాల కారణంగా దేశంలో అనేక సంఘర్షణలకు దారితీస్తున్నాయి. హిందూ, ముస్లింలలో తప్పు త్రోవను పట్టించే హేతురహితమైన మనోభావాలు పరస్పర ద్వేషాలకు కారణాలైనవి. హిందువులు ముస్లింలను విశ్వాసఘాతకులుగా భావించారు. హిందువులలో ఉన్న ఈ భావన ముస్లింలకు హిందువులంటే ఒక స్థిరమైన అపాయకరమైన భావన చోటుచేసుకుంది. ఇట్లాంటి అజ్ఞానపు భావాలే హిందూ - ముస్లింల మధ్య కొట్లాటలకు దోహదపడుతున్నాయి.

### 14.3.4 సామాజిక కారణాలు

కొన్ని సామాజిక కారణాలు కూడా సాముదాయిక ప్రకర్షణలకు దోహదపడుతున్నాయి. సామాజిక నిబంధనలు, నిషేధాలు హిందూ ముస్లింల మధ్య సత్సంబంధాలు మరుగుపరుస్తున్నాయి. ముస్లింలలో గోవధ హిందువుల మనస్సులను బాధిస్తున్నది. ముస్లింలలో గోవధ హిందువులు అభ్యంతర పెడుతున్నారు. ఇది వారి మధ్య సదవగాహనను, సామాజిక సంబంధాలను భంగపరుస్తున్నది. హిందూ ముస్లింలలో ఉండే అనేక ఆచారాలు పరస్పర విరుద్ధాలుగా ఉన్నవి. ఉదా : హిందువులు మతపరంగా తలమీద తురాయి (పిలక) ఉంచుతారు. కానీ ముస్లింలు ఇది నిరాకరిస్తారు. అదే విధంగా వస్త్రధారణలో కూడా ఇరువురి మధ్య విభిన్నత ఉంది. హిందువులు మోచేతులనుంచి చేతి మణికట్టు వైపు నీళ్ళుపోయేటట్టు చేతులు కడుగుతారు. కాని ముస్లింలు దీనికి పూర్తిగా వ్యతిరేకంగా అంటే చేతికట్టు నుండి మోచేతుల వైపు నీళ్ళ పోయేటట్లు చేతులు కడుగుతారు. నిజానికి ఇవి చాలా అల్పమైన విషయాలే అయినప్పటికీ ఇవి హిందూ ముస్లింల ఆచారాలకు సంబంధించిన మనోభావాల వ్యతిరేకతకు దోహదపడుతున్నాయి. ప్రస్తుత భారతదేశంలో కులాంతర వివాహాలు జరుగుతున్నాయి. అదే విధంగా మతాంతర వివాహాలు కూడా జరిగితే హిందూ ముస్లింల మధ్య సత్సంబంధాలు పెంపొందగలవని ఆశించవచ్చు.

BRAOU

## 14.4 భారతదేశంలో సాముదాయిక ప్రకర్షణలు - నివారణ చర్యలు

పైన ఉదహరించిన కారణాలను దృష్టిలో ఉంచుకొని సాముదాయిక ప్రకర్షణలనివారణకు ఈ క్రింది సూచనలు చేయవచ్చు.

### 14.4.1 జాతీయతా భావాన్ని పెంపొందించడం

భారతదేశంలో సాముదాయిక ప్రకర్షణలను తొలగించాలంటే ముందుగా హిందూ ముస్లింలలో జాతియతా భావాన్ని పెంపొందించాలి. జాతీయ ప్రయోజనాలను, లక్ష్యాలను కాపాడడంకోసం వారిని సన్నద్ధులను చేయాలి. అవసరమైతే త్యాగాలకు కూడా వారు సిద్ధపడేటట్లు ప్రోత్సహించాలి. దీనివల్ల ప్రజలలో సంఘటిత తత్వం, సమైక్యతా పెరిగి జాతీయతా భావాలు పెంపొందుతాయి.

### 14.4.2 పరస్పర సంబంధాలు ఏర్పాటు

సాముదాయిక ప్రకర్షణలకు దోహదం చేసే మానసిక కారణాలను తొలగించాలంటే హిందూ - ముస్లింల మధ్య పరస్పర సంబంధాలను పెంపొందించాలి. ఇందు నిమిత్తం ప్రతి గ్రామంలో పట్టణంలో యువక కేంద్రాలు ఏర్పాటు చేసి, వాటిలో యువకులు చురుకుగా పాల్గొనేటట్లు చేసి, అనేక సాముదాయిక కార్యక్రమాలను చేపట్టాలి. హిందూ ముస్లింల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడానికి ప్రయత్నాలు చేయాలి. దీనివల్ల వ్యక్తుల మధ్య సమూహాల

మధ్య దురభిప్రాయాలు తొలగి సాముదాయిక ప్రకర్షణలు సమసిపోవడానికి వీలవుతుంది. యువక కేంద్రాలు, ఇతర సంఘాలను కూడా స్థాపించి వ్యక్తులు పరస్పరం కలుసుకోవడానికి ఒకరి గురించి ఒకరు తెలుసుకోనే అవకాశాలను కల్పించాలి.

### 14.4.3 మతప్రాతిపదికపై రాజకీయ పక్షాలు ఏర్పడకుండా నిలిపి వేయాలి

మత ప్రాతిపదికపై రాజకీయ పక్షాలు ఏర్పడకుండా ప్రభుత్వం తగు చర్య తీసుకొంటే సాముదాయిక ప్రకర్షణలను నిర్మూలించవచ్చు. మత ప్రాతిపాదికపై పార్టీల ఏర్పాటు వలన ప్రజలలో మతతత్వం ఏర్పడి దానివల్ల దేశంలో సాముదాయిక ప్రకర్షణలు ఏర్పడుతున్నవి. ఇట్లాంటి ప్రయత్నాలు దేశంలో ఎక్కడ కనిపించినా ప్రభుత్వం తగు చర్య తీసుకొని వాటిని నివారించాలి.

### 14.4.4 ఆరోగ్యవంతమైన ప్రజాభిప్రాయాన్ని ఏర్పరచాలి

సమాజంలో ఆరోగ్యవంతమైన ప్రజాభిప్రాయాన్ని ఏర్పరచడానికి వార్తా పత్రికలు, రేడియోలు, చలన చిత్రాల ద్వారా అనేక కార్యక్రమాలను రూపొందించి ప్రజలలో సామరస్యభావనను పెంపొందించాలి. ఈ చర్యలవల్ల చాలావరకు సాముదాయిక ప్రకర్షణలను నివారించవచ్చు.

### 14.4.5 జాతీయ పండుగలు - ఉత్సవాలకు ప్రోత్సాహం

దేశంలో అనేక జాతీయ పండుగలను, ఉత్సవాలను జరిపించి, వాటిలో ప్రజలందరూ ఏవిధమైన భేదభావాలు లేకుండా ఉత్సాహంగా పాల్గొనేటట్లు చేయాలి. అన్ని వర్గాల ప్రజలను ఉద్దేశించి కొన్ని ఉమ్మడి జాతీయ ఉత్సవాలను, పండుగలను ప్రభుత్వం గుర్తించి ప్రజలంతా వాటిని పాటించేటట్లు చేయాలి. ఉదా : హోళీ, దీపావళి, రంజాన్ మొదలగునవి వీటిలో సమూహాల మధ్య పరస్పర సంబంధాలు ఏర్పడి సాముదాయిక ప్రకర్షణలు జరుగకుండా నివారిస్తాయి.

పైన ఉదహరించిన ఈ చర్యలు సమాజంలో సాముదాయిక ప్రకర్షణల నిర్మూలనకు ఎంతగానో ఉపయోగడతాయని ఆశించవచ్చు. అంతేగాక ప్రజలు కూడా తమ సంపూర్ణ సహకారాన్ని అందించవలసి ఉంది. ప్రజలు ప్రభుత్వం సమిష్టిగా కృషి సలిపినట్లయితే భారతదేశంలో సాముదాయిక ప్రకర్షణలను పూర్తిగా నివారించవచ్చు.

BRAOU

## 14.5 సమాజాభివృద్ధి - సూచనలు

భారతదేశ సామాజిక వ్యవస్థ అనేక మతాల కూడలి. వివిధ మతాలకు చెందిన ప్రజలు హిమాలయ పర్వతాల నుండి కన్యాకుమారి వరకు విస్తరించి ఉన్నారు. ప్రజల భాష, ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు కట్టు బొట్టు, ఒక మత సమాజానికి మరొక మత సమాజానికి భిన్నంగా ఉంటాయి. భారతదేశంలోని ప్రతి మతానికి ప్రవచనాలు, మత గురువుల బోధనలు, మత గ్రంథాలు, ఆరాధ్య దైవాలు, మతానికి సంబంధించిన ఆలయాలు, పవిత్రస్థలాలు ఉన్నాయి. మతాన్ననుసరించే వ్యక్తులు అనుసరించవలసిన ఆచార వ్యవహారాలు, జీవన విధానాలు కూడా నిర్వచింపబడి ఉన్నాయి. భారతదేశంలో జన్మించే ప్రతి వ్యక్తి కూడా జన్మతోనే ఏదో ఒక మతంలో జన్మిస్తున్నాడు.

అయితే స్వతంత్ర భారతదేశం 1947లో ఆవిర్భవించిన తరువాత 1950లో భారత రాజ్యాంగం ఆచరణలోనికి వచ్చిన తరువాత భారత పౌరులకు ఏ మతంలో జన్మించినప్పటికీ ఆ వ్యక్తికి ఇష్టమయితే అందులో కొనసాగడానికి గానీ, లేదా ఆ మతాన్ని వదలి తనకు నచ్చిన మరొక మతంలో చేరడానికి గానీ లేదా మతరహితంగా ఏ సంతాచ్ఛాదనా లేకుండా స్వతంత్రుడుగా మతరహిత పౌరుడుగా ఉండడానికి గానీ లేదా తానే సర్వ స్వతంత్రతతో ఒక నూతన మతాన్ని స్థాపించుకొనడానికిగానీ స్వేచ్ఛలభించింది.

అయితే రాజ్యంగ పరంగా స్వేచ్ఛ పౌరునికి మత రహితంగా తన స్వంత మతం స్థాపించుకోవడానికి గానీ స్వేచ్ఛకలిగినా, ఆ స్వేచ్ఛను వినియోగించుకొన్న వారు గానీ, ఆ ప్రయత్నం చేసినవారుగానీ చాలా తక్కువ.

భారతదేశంలో అత్యధిక శాతం ప్రజలు తాము పుట్టిన మతంలోనే కొనసాగుతున్నారు. వారు జన్మించినది మొదలు మరణించేవరకు తమ తల్లిదండ్రుల మతాన్ని అవలంబిస్తున్నారు. ఈ విధంగా భారతీయులంతా వివిధ మతాల పరిధిలో, ఆ మత బోధనల ప్రకారం ఆ చార వ్యవహారాలను జరుపుకుంటూ అనాది నుంచి నేటి వరకు జీవిస్తున్నారు. అందుచేత భారత దేశంలో ఈ నాటికీ అనేక మతాలు, వాటిని అనుసరిస్తున్న మతస్తులు మనకు కన్పిస్తున్నారు. దీనికి కారణం పరమతసహనం.

మనదేశంలోని అన్ని మతాలు కూడా స్థూలంగా బోధించేది పరమత సహనం. శాంతియుత సహజీవనం, సత్యం, అహింస, నైతిక వర్తన, త్యాగం, పరోపకారం, మతాల సారాంశం. ఈపైన చెప్పిన విషయాలవడం వలన భారతదేశంలో అనాదినుండి ఈ నాటివరకు సామాజిక జీవనం ఒడిదుడుకులు లేకుండా కొనసాగుతున్నది.

అయితే ఈ దేశంలో ప్రశాంతమైన సామాజిక జీవనంలో అప్పుడప్పుడు అంతరాయాలు కూడా ఏర్పడక పోలేదు. వీటిని మతపరమైన సహజీవనానికి అడ్డుతగిలిన అంతరాయాలుగా మత సంఘర్షణలుగా మత కల్లోలాలుగా చెప్పవలసి ఉంది.

శాంతియుత సామాజిక మతజీవనంలో, సహజీవనంలో కల్లోలాలు, అంతరాయాలు సంఘర్షణలు కలగడానికి కారణం నిశితంగా పరిశీలించినట్లైతే మనకు ఒక ప్రధానాంశం కనబడుతుంది. దేశంలో రాచరికవవ్యవస్థ గానీ, ప్రభుత్వవ్యవస్థగానీ మారినపుడు గానీ లేదా పతనమయినప్పుడు గానీ, లేదా మన దేశంపై విదేశీయుల దండయాత్రలు జరిగి స్థానికులు విదేశీయులను నిరోధించలేకపోయినప్పుడు మాత్రమే మత ఘర్షణలు, మత కల్లోలాలు జరిగినవి. అంటే దేశంలో కానీ లేదా ఒక ప్రాంతంలో కానీ రాజకీయ వ్యవస్థ, రాచరిక వ్యవస్థ లేదా ప్రభుత్వ వ్యవస్థ అది ఏరకమైనదైనా కానీ మార్పుకు గురయినపుడు మత సంఘర్షణలు అధికమవుతున్నాయి. ఆ విధమైన మార్పు అనంతరం నూతన రాజకీయ ప్రభుత్వ వ్యవస్థ నిల దొక్కుకున్నాక మళ్ళీ మత జీవనంలో ప్రశాంతత, జన జీవనంలో సామాజిక జీవనంలో ప్రశాంతి ఏర్పడుతున్నది.

BRAOU

దీనిని బట్టి మనకు తెలిసేదేమిటంటే రాజకీయాధికారం కోసం ప్రాకులాడే వ్యక్తులు తాము అధికారం చేజిక్కించుకోవడం కోసం మతాన్ని మత గురువులను మతావలంబీకులైన ప్రజలను వినియోగించుకుంటున్నారు. ఈ సందర్భంలోనే మత కలహాలు, మత కల్లోలాలు, సంఘర్షణలు జరుగుతున్నవి.

మనం ప్రపంచ చరిత్రను పరిశీలించినట్లయితే ఏ దేశంలో నైనా మత యుద్ధాలకు కారణం రాజకీయ ప్రాబల్యం కోసం జరిగిన ఘర్షణలుగానే కనిపిస్తాయి. భారత దేశం స్వాతంత్ర్యానంతరం జరిగిన అనేక అంశాలు ఈ విషయాన్ని ధృవపరుస్తున్నాయి.

పై విషయాలను దృష్టిలో ఉంచుకొని మత గురువులు, పీఠాధిపతులు, విజ్ఞానవంతులైన ప్రజలు రాజకీయ పక్షాలు సమష్టిగా ఆలోచించి, అనేక మతాలున్న భారత దేశంలో మత సహనాన్ని నిలబెట్టడానికి, మత సంఘర్షణలను నివారించడానికి కృషి చేయవలసి ఉంది. ఆనాడే భారతదేశాభివృద్ధి సాధ్యపడుతుంది.

## 14.6 ముగింపు

భాష, సముదాయం, నివాసం, సంస్కృతి, సామాజిక, ఆర్థిక అంతస్తుల కారణంగా సమాజంలో ప్రకర్షణలు ఉద్రిక్తతలు ఏర్పడతాయి. సామాజిక ఉద్రిక్తతలకు భౌతిక, మత, సామాజిక, ఆర్థిక కారణాలు అనేకం. సమాజాభివృద్ధికి ఈ ఉద్రిక్తతలు చేటుచేస్తాయి. వీటిని నివారించే మార్గాలున్నాయి. జాతీయ సమైక్యత భావనలు పెంపొందించడం, సాముదాయిక కార్యకలాపాల ద్వారా అభివృద్ధి సాధన లాంటివే నివారణాచర్యలు. భారత దేశంలో సాముదాయిక ఉద్రిక్తతలలో మత కల్లోలాలు ప్రధానమైనవి.

## 14.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబురాయండి?

1. సామాజిక ప్రకర్షణలకు గల కారణాలను వివరించండి.

2. సామాజిక ప్రకర్షణగా మతం పాత్ర వివరించండి.

3. సామాజిక ప్రకర్షణల నివారణా చర్యలు వివరించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. ఆరోగ్యవంతమైన ప్రజాభిప్రాయం అంటే ఏమిటి?

2. పరస్పర సంబంధాలు ఎలా ఏర్పడతాయి.

3. జాతీయ భావనలు అంటే ఏమిటి?

## 14.8 చదవదగిన పుస్తకాలు


1. Memoria, C.B. : Social Dis organisation.

2. G.S. Ghark : Social Tension in India.

3. Madhan G. R. : Indian Social Problem.


BRAOU

# ఖండం- IV

## భావప్రసారం

ఏ సమస్యకైనా పరిష్కారం భావ ప్రసారం ద్వారానే సాధ్యం. ఇద్దరు వ్యక్తులైనా, రెండు వర్గాలైనా, రెండు దేశాలైనా అపార్థాలవల్లో, అవగాహనా లోపంవల్లో అనవసర భావావేశాల వల్లో ఘర్షణకు దిగుతుండడం జరుగుతుంది. అయితే రెండువైపులా సంయమనంతో కూడిన భావ ప్రసారం (Communication) వుంటే సమస్యలు రావు. వచ్చినా పరిష్కారం సులభం అవుతుంది. అంటే సమస్యల పరిష్కారంలో చర్చలు, సంప్రదింపులు పరస్పర అవగాహన ఎంతో అవసరం.

ముఖ్యంగా అనుప్రయుక్త సమాజశాస్త్రంలో ఉద్రిక్తతల సడలింపునకు కమ్యూనికేషన్ ఎంతో అవసరం. ఈ ఖండంలోని రెండు భాగాల్లో కమ్యూనికేషన్ ప్రాధాన్యతను వివరించడం జరిగింది. అవి:

**భాగం-15: భావప్రసారం:సూత్రాలు, వైఖరులు**

**భాగం-16: భావప్రసారం-విస్తరణ: సూత్రాలు, పద్ధతులు**

BRAOU

BRAOU

# భాగం-15: భావప్రసారం-సూత్రాలు-వైఖరులు

విషయక్రమం


15.0 ఉద్దేశాలు

15.1 పరిచయం

15.2 భావప్రసారం-ముఖ్యాంశాలు

15.3 భావప్రసారం-ధ్యేయాలు

15.4 భావప్రసారం-దశలు

15.5 భావప్రసారం-భాగాలు

15.6 భావప్రసారం-రకాలు

15.7 భావప్రసారం-పద్ధతులు

15.8 భావప్రసారం-ఆటంకాలు

15.9 భావప్రసాం-అంతర్యాలు

15.10 ముగింపు

15.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

15.12 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 15.0 ఉద్దేశాలు

సముదాయాలలో భావప్రసారం ముఖ్యమైనది. ఒక వ్యక్తి నుంచి మరొకవ్యక్తికి మధ్య పరస్పర చర్యకు ఇది అవశ్యం. ఈ భావప్రసారం ముఖ్యాంశాలు, ధ్యేయాలు, దశలు, పద్ధతులు, అటంకాలు, అంతరాయాలను ఈ పాఠ్యాంశంలో తెలుసుకుంటారు.

## 15.1 పరిచయం

ఆంగ్లంలో 'కమ్యూనికేషన్' అనేది 'కమ్యూనిస్' అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. కమ్యూనిస్ అంటే సాధారణమైన కమ్యూనికేషన్ అంటే భావాల్ని గానీ, సమాచారాన్ని, విషయాల్ని గానీ పంచుకోవడం. అంటే ఒకరిదగ్గరినుండి మరొకరి దగ్గరకు సమాచారాన్ని భావాల్ని అందజేయడాన్ని భావ ప్రసారం అంటారు. ఇది ప్రజలు ఒకరినొకరు అర్థం చేసుకోవటానికి వంతెన లాంటిది. భావప్రసారం అంటే ఆలోచనల్ని పంచుకోవడం, అభిప్రాయాన్ని చెప్పటం, సమాచారాన్ని ఇవ్వడం, వాస్తవాన్ని, ఘటనల్ని తెలియచేయడం. ఒక వ్యక్తి నుంచి మరొకవ్యక్తికి, ఒక స్థలం నుంచి మరొకస్థలానికి భావావేశాన్ని తెలియ చేయడం భావప్రసారం అవుతుంది. కొంత మంది వ్యక్తులు పరస్పరం భావప్రసారం చేస్తున్నపుడు వారు చర్య తీసుకోవలసిన సమాచారం మార్చుకొంటున్నారు. అంటే ఒక మనిషి మేధస్సులోని భావనని మరొక మనిషిలోని మేధస్సుకు చేరవేయటం.

## 15.2 భావప్రసారంలోని ముఖ్యాంశాలు

### ● క్రమానుగతమైనది

1. **అది ఒక పద్ధతి** : భావప్రసారం ఒక ప్రవాహంలా వుంటుంది. ఇది అనేక అంచెలుగా వుంటుంది. ఇది ఒక భావన విడిగావున్న ఒక సంఘటన కాదు. దీనిని తయారుచేసి అర్థవంతమైన ఒక క్రమపద్ధతిలో పెట్టి ఒక వాహిక ద్వారా వేరొకరికి పంపటం. అంటే ఇది అందుకోవడానికి వేరొకరుండాలి. రెండోవ్యక్తి యీ సమాచారాన్ని అందుకొని దాని మీద చర్యతీసుకుంటారు.

2. **భావప్రసారం పంపటం** : దాన్ని అర్థంచేసుకోవటం రెండింటిమీద ఆధారపడి ఉంటుంది. భావప్రసారం ప్రయోజనకరంగా వుండాలంటే టెన్నిస్ బంతిలా ముందుకు వెనుకకూ కదులుతూ వుండాలి. అంటే ఇది రెండు దిశలుగా ప్రయాణం చేస్తూ వుంటుంది. దీనిలో వున్న భావమేమిటంటే ఒక వ్యక్తి అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తే అందుకునే వారు దాన్ని అర్థం చేసుకోవాలి. సమాచారాన్ని పంపినపుడు అవతలి వ్యక్తులకు అర్థంకాకపోయినా అందకపోయినా సక్రమమైన భావప్రసారం జరగనట్టే భావించాలి.

3. **వ్యక్తులమధ్య మాత్రమే:** మూడవ అంశమేమిటంటే సమాచారాన్ని పంపే వారు దాన్ని అందుకునే వారు అందరూ మనుషులే. భావప్రసారం అనేది మనుషుల మధ్య జరుగుతుంది. ఇది సమాచారం, అందచేసే తెలియజేసే పనిముట్లయిన టెలిఫోన్, రేడియోవైర్‌లెస్ లకే వర్తించదు. అవి కేవలం వాహకాలు, మాధ్యమాలు మాత్రమే.

4. **వాహకం అవసరం:** సమాచారం తెలియజేసేందుకు ఒక వాహకం వుండాలి భావప్రసారం అనేది నోటిమాట ద్వారా గానీ, రాతపూర్వకంగా గానీ, బొమ్మలద్వారాగానీ కాని తెలియజేయవచ్చు. ఒకరునోటితో 'ఔ' నంటూనే నొసటితో వెక్కిరించటం (కాదనటం) చాలా మంది గమనించేవుంటారు. ఇలాంటి వాటికంటే సహేతుకంగా కాదని చెప్పటమే సౌమ్యంగా కనిపిస్తుంది. అందుచేత భావప్రసారంలో భావాలు చాలా ప్రాధాన్యత వహిస్తాయి. సముదాయ కార్యక్రమాలు చేపట్టేటప్పుడు భావప్రసారం చాలా ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఇది సమాజంలోని వ్యక్తులను, ఒకరికొకర్నికలిపి కట్టివేసే నిరంతర చలన బంధం. ఇది సముదాయం పనిచేస్తున్నంత సేపు నిరంతరం పని చేస్తూనేవుంటుంది. వ్యక్తులు సరిగ్గా పని చేయులంటే వారి రక్త నాళాల్లో రక్తం సక్రమంగా ప్రవహిస్తేనే వారు సరిగ్గా పని చేయగలరు. అదే విధంగా సముదాయాలు సక్రమంగా పని చేయాలంటే వాటిలో భావప్రకటన అనేది చాలా అవసరం. ఇది సముదాయ సభ్యుల్లో ధ్యేయ సాధనకై ఎక్కువగా పాటు పడడానికి, పరస్పర సహకారం పెంపొందటానికి దోహదం చేస్తుంది. సముదాయ సభ్యుల్లో పనిచేసే తీరు మారాలన్నా, వారిని ఉత్తేజితుల్ని చేయాలన్నా, వారి పరస్పర ఆధారిత సంబంధాలు ప్రయోజనకరంగా పెంపొందాలన్నా భావప్రసారం అనేది ప్రాథమిక పనిముట్టుగా వియోగించాలి.

BRAOU

## 15.3 భావప్రసారం ధ్యేయాలు

సముదాయపు ధ్యేయసాధన సభ్యులందరి సహకారం మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి సముదాయ నాయకులు సభ్యులందరి సహకారంతో భావప్రసారం సాధించగలరు. కాబట్టి ఈ క్రింది అంశాలు ప్రయోజనకరంగా వుంటాయి.

1. సమాచార నిర్వహణ సముదాయక ప్రయత్నాల కోసం అవసరమైన సమాచారాన్ని అందజేస్తూ సభ్యులందరూ పరస్పరం సక్రమంగా అర్థం చేసుకునేందుకు దోహదం చేయాలి.

2. సముదాయ సభ్యున్ని మార్పుకోసం తయారు చేయాలి. అందుకని వారికి అవసరమైన సమాచారాన్ని ముందుగా తయారు చేసి వారికి అందజేయాలి.

3. సముదాయ సభ్యులను సలహాలు, సూచనలు ఇవ్వటానికి ఉత్సాహపరచాలి.

4. సముదాయ సభ్యులు పరస్పరం సహకరించుకుని ధ్యేయ సాధనకు ప్రయత్నించాలి కాబట్టి వారికి తగిన మానసిక పరిస్థితి వుండేలా చేయాలి.

5. వదంతులు, తప్పుడు సమాచారం ప్రచారంలోకి రాకుండా సముదాయ సభ్యుల మానసిన వత్తిడి తగ్గేలా సరైన భావప్రసారం సకాలంలో చేయాలి.

అందుకు (ధ్యేయసాధనకు) భావప్రకటన ప్రయోజనకరంగా వుండాలంటే ఈ క్రింది సూత్రాలను దృష్టిలో పెట్టుకోవాలి.

1. స్పష్టత : సామాన్య ప్రజలు ఎక్కువగా అర్థం చేసుకుని వారు వాడుకునే భాషలో అందరికీ అర్థమయ్యేలా భావప్రసారం ఉండాలి.


2. **సావధానత** : సమాచారం అన్నిమూలల నుంచి వచ్చేవరకు ఓపికగా, సావధానంగా ఉండాలి. సమాచారం సంపూర్ణంగా లేకపోతే తరువాత తీసుకోబోయే నిర్ణయాలు సక్రమంగా సరిగ్గా ఉండకపోవచ్చు. కొత్త సమాచారం వెలుగులోకి వస్తే నిర్ణయాలు మార్చుకోవలసిన ఆగత్యం ఏర్పడుతుంది. తర్వాత అప్పటిదాకా పడిన శ్రమ, వినియోగించిన వనరులు వృధా అవుతాయి.

3. **నిజాయితీ** : మనం తీసుకునే నిర్ణయాలు, వ్యక్తం చేసే అభిప్రాయాలు సముదాయ ధ్యేయ సాధనకు దోహదం చేయాలి. కాబట్టి వ్యక్తం చేసే అభిప్రాయాలు, తీసుకునే నిర్ణయాలు అదేవిధంగా వుండాలి. దీనికి భిన్నంగా వ్యక్తిగత లాభాన్నికానీ, కొందరిలా మాత్రమే ప్రాధాన్యత ఉండేటట్లు కానీ ఉండకూడదు. ఇందులో నిజాయితీ వుంటేనే ఇది సాధించటానికి సాధ్యమవుతుంది. అనియతసమూహాలు సముదాయ ధ్యేయసాధనకు వ్యక్తుల మధ్య ఉండే పరస్పర వ్యక్తిగత సంబంధాలు చాలా ప్రధానమైనవి ఏ సముదాయ నాయకుడైనా తన సముదాయధ్యేయం సాధనలో వీటిని తప్పకుండా దృష్టిలో పెట్టుకొని వాటిని తన సముదాయానికి ప్రయోజన కరంగా వుండేవిధంగా భావప్రసారం ఉండాలి. ఇది మరచిననాడు సముదాయ ధ్యేయసాధన ఆకాశకుసుమం అయ్యేప్రమాదం వుంది.

BRAOU

## 15.4 భావప్రసార-దశలు

భావప్రసార పద్ధతిని అనేక దశలుగా విభజించవచ్చును. డెర్నాల్ అనే శాస్త్రవేత్త చెప్పినట్లు ఈ భావ ప్రకటనను ఎన్నిదశలుగా విభజించాలి అనేదాని మీద ఏకాభిప్రాయం లేకపోయినప్పటికీ చాలా మందికి అంగీకార మయ్యే పద్ధతిని యీ బొమ్మలో యిచ్చినట్లు సూచించారు.




## 15.5 భావప్రసారం-విభాగాలు

ఈ నమూనాను బట్టి భావప్రకటన అనేదాన్ని ఏడు భాగాలుగా విభజించవచ్చని తెలుస్తోంది. 1) భావ ప్రకటనమూలం, 2) సందేశాన్ని గుప్తసమాచారంగా మార్చే సమాచారం, 3) మాధ్యమం, 4) రెండవవ్యక్తి అందుకోవటం, 5) సందేశాన్ని తిరిగి మామూలుగా మార్చుకోవటం, 6) తీసుకొన్న చర్య, 7) తీసుకున్న చర్యవిరాలు

సమాచారమూలానికి తెలియజేయడం.

1. సమాచారమూలం : ఈ మొదటి దశలో కొంత సమాచారాన్నికాని, ఒక ఆలోచననుకానీ ఉత్పన్నంచేయాలి. అంటే పంపేవారు మిగతా వారికి తమ అభిప్రాయాన్ని కానీ, సమాచారాన్ని కానీ తెలియజేయవలసిన అవసరం ఉందని తెలుసుకుంటాడు. కీత్ డేవిస్ చెప్పినట్లు మెదడు ఆలోచిస్తేనే కానీ మాట్లాడకూడదు. పంపేవారు కొంత సమాచారంగానీ ఆచరణలో పెట్టవలసిన సూత్రాలు కానీ వున్నప్పుడు కానీ లేక మిగతావారిని సమన్వయం చేస్తున్నప్పుడు కానీ సందేశాన్ని పంపవలసిన అవసరం ఉంటుంది.

2. **సందేశాన్ని గుప్తంగా మార్చడం** : సందేశాన్ని పంపవలసిన మూల వ్యక్తి ఒక సందేశాన్ని తయారు చేస్తాడు. పంపవలసిన విషయాన్ని ఉత్తరంద్వారాగానీ, అవసరాన్ని బట్టి టెలిగ్రామ్ ద్వారా గానీ పంపిస్తాడు. పంపేవారు అవతల అందుకునే వ్యక్తికి పంపేవిషయాన్ని గురించి ఎంతవరకు తెలుసు, ఎటువంటి పరిస్థితిలో పని చేస్తున్నాడు అనే వాటిని గురించి ఆలోచిస్తాడు.

బెర్లో ఈ ప్రక్రియను ప్రభావితం చేసే నాలుగు అంశాలను గురించి చెప్పాడు. నైపుణ్యం, వైఖరి, విషయ పరిజ్ఞానం, సామాజిక - సాంస్కృతిక పరిస్థితి.

ఒక వ్యక్తి భావప్రకటనాశక్తి అతని అక్షరాస్యత మీద, విని హేతుబద్ధంగా ఆలోచించడం మీద అతని రాత శక్తి మీద ఆధారపడి ఉంటాయి. అతని వైఖరులు కూడా ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. సామాజిక సాంస్కృతిక ఏర్పాటులో పంపే వ్యక్తి స్థాయి సరియైన సమాచారం పంపే పద్ధతిని అతని సందేశమిచ్చే శక్తిని ప్రభావితం చేస్తాయి.

అవతల అందుకునే వ్యక్తిని దృష్టిలో ఉంచుకొని పదాలను మాటలను పంపేవారు ఎన్నుకొనవలసి వుంటుంది.

3. **సమాచారం ప్రసారం** : తెలియజేయదలుచుకున్న విషయం భౌతిక రూపం సమాచారం మనం మాటల ద్వారా చెప్పేటపుడు, మాట సమాచారం అదేవిధంగా రాస్తే, రాతపూర్వక సమాచారం మనం సంజ్ఞలద్వారా చెపుతున్నపుడు చేతుల కదలిక లేక అవయవాల కదలికలే సమాచారం అవుతాయి. మన సందేశం మన మాటల ద్వారా కానీ, మన సంజ్ఞల ద్వారా మన భావప్రకటనకు మనం ప్రయోగించే సంజ్ఞల ఏర్పాటు ద్వారా ప్రభావితం అవుతుంది.

భావప్రకటనను పంపటానికి సరియైన వాహకాన్ని ఎన్నుకోవాలి అది నేరుగాకానీ వాహకం ద్వారా కానీ పంపవచ్చును. అది ముఖాముఖి సంభాషణ కావచ్చు, లేక రాసి గానీ టైప్ చేసి కానీ ఉండవచ్చు వాహకం, పంపేవారికి అందుకునేవారికి మధ్యన వుండే మార్గాన్ని సేతువై తగ్గిస్తుంది.

4. **సందేశాన్ని అందుకోవటం** : తరువాతి దశ రెండవ వ్యక్తి సందేశాన్ని తీసుకుని చదువుకోవటం వినటం లేకపోతే అందుకోవటం.

5. **సందేశాన్ని 'గుప్త' సాంకేతిక పదం నుంచి మాములుగా మార్చుకోవటం** : సందేశాన్ని సక్రమంగా అర్థం చేసుకుని వ్యాఖ్యానించడం అందుకున్న వ్యక్తి బాధ్యత అందుకున్న వ్యక్తి సందేశాన్ని తీసుకొని దాని గూఢార్థాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాడు. ఇది సందేశం పంపించిన వ్యక్తి విషయాజ్ఞానాన్ని, అతని అధికారాన్ని దృష్టిలో పెట్టుకొని వచ్చిన సందేశాన్ని అన్వయింప చేసుకునేందుకు ప్రయత్నం చేస్తాడు. వచ్చిన సందేశాన్ని సక్రమంగా అర్థం చేసుకోవటం అతని చదువు, నిపుణత, అనుభవం మీద ఆధారపడి వుంటుంది. సందేశం అందుకునేవ్యక్తి సాంస్కృతిక పరిస్థితులు దానిని సక్రమంగా అర్థం చేసుకోవడానికి సహాయపడవచ్చు లేక అడ్డుపడవచ్చు.

6. **తీసుకున్న చర్య** : సందేశం అందుకున్న తర్వాత అందుకున్న వ్యక్తి దాని మీద తగిన చర్య తీసుకుంటాడు. అంటే అది సందేశానికి ప్రతిక్రియ అవుతుంది. అవసరాన్ని బట్టి పరిస్థితిని బట్టి సందేశాన్ని భవిష్యత్తులో వినియోగించడానికి పంపిన సందేశం ఫైల్‌లో భద్రపరచవచ్చు.

BRAOU

7. తీసుకున్న చర్య సందేశం పంపే వ్యక్తికి తెలపటం : దీన్ని బట్టి సందేశం అసలు సక్రమంగా అర్థం చేసుకున్నారాలేదా? అన్నది తేలుతుంది. దీని ద్వారా సందేశం పంపే వ్యక్తి తను తెలియచేయదల్చుకున్నది ఎంత విజయవంతంగా తెలియజేశాడు అన్నదీ తెలుస్తుంది. ముఖాముఖి సందర్భాల్లో సందేశం పంపే మూల వ్యక్తి అందుకునే వ్యక్తి ఎదురుగుండా వుంటారు. కనుక అక్కడికక్కడే పరస్పరం వారి అభిప్రాయాలను తెల్పుకుంటారు ఇది అనేక విధాలుగా జరగవచ్చు మాటల ద్వారాగానీ సంజ్ఞల ద్వారా కానీ అప్పటికప్పుడే వారి అభిప్రాయాలు తెలియ చేయవచ్చు. ఈ ప్రక్రియ ద్వారా మొత్తం చేయవలసిన పని దాని మీదే అధారపడి వుంటుంది. కాబట్టి అందుకునేవ్యక్తి చదువు, నిర్ణయం తీసుకోవటంలో నమ్మకమైన ఫలదాయకమైనవి, విజయసూచకమైన అంగికం లాంటి వ్యతిరేక ఫీడ్ బ్యాక్ లాంటి అవులించటం అడ్డంగా తల తిప్పటం మొదలయినవి.

కాత్ డేనిస్ 'రూల్ అఫ్ ఫైవ్ ఇన్ కమ్యూనికేషన్' సందేశము అందుకున్న వ్యక్తి ఆచరణలో పెట్టవలసిన అయిదు అంశాలను పేర్కొన్నాడు.

1. అందుకోవడం
2. అర్థం చేసుకోవడం.
3. అంగీకరించడం
4. చర్య తీసుకోవడం
5. సందేశం పంపేవ్యక్తికి తీసుకున్న చర్య తెలియ చేయడం.

ఒక సందేశం ఆ అయిదు అంశాలను కనుకసాధిస్తే భావప్రసారం పూర్తిగా సఫలీకృతమయినట్లే, ఒక సంస్థలోగానీ వ్యవస్థలోగానీ భావ ప్రకటన సక్రమంగా పద్ధతులను ఏర్పరచి. నిర్వహించే బాధ్యత యజమాన్యానిది ఇది అన్ని స్థాయిలలో వారు సక్రమంగా సరిగ్గా నిర్వహించేలా యాజమాన్యం తగిన చర్యలు చేపట్టవలసి ఉంటుంది. అందులో పని చేసేవారు మిగతావారితో సందేశాలు ఇవ్వటం పంచుకోవటం చేయవలసి వుంటుంది. దానికోసం వారు ఎవరితో ఎప్పుడు సందేశాలు ఇవ్వాలి అన్నది. అంచనా వేయగల్గి వుండాలి.

BRAOU

పనిలోనైనా పర్యవేక్షకుడు, మేనేజరు కానీ భావప్రకటనలో ప్రధాన పాత్ర వహిస్తాడు. సంస్థ ధ్యేయాలు. కార్యక్రమాలు ఆచరణలో పెట్టే పద్ధతులు, మేనేజర్ తాను తెలుసుకొని తన క్రింది వారికి తెలిసేలా చెప్పవలసిన బాధ్యత వహించాలి. మంచి యజమాని తన క్రింది వారిని అర్థం చేసుకుంటూ, తనతోనే క్రిందివారు స్వేచ్ఛగా తనతో మాట్లాడగలిగే వాతావరణం ఏర్పరచాలి. దీనికి భావప్రకటన చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పర్యవేక్షకుడు ఉపయోగకరంగా సందేశాలివ్వాలంటే ఈ క్రింది విషయాలు అర్థం చేసుకోవాలి.

1. సంస్థ అవసరాలు దాని పనిచేసే విధానాలు పూర్తిగా అర్థం చేసుకోవాలి. వాటిలో వచ్చేమార్పులు, కంపెనీ పనితీరు విధానాల నిర్మితిలో వచ్చే మార్పులు ఎప్పటికప్పుడు తెలుసుకొని తన క్రింది వారికి అర్థమయ్యేలా చెప్పగలిగేలా వుండాలి.
2. తనక్రింద పనిచేసేవారి ప్రయోజనాలు అర్థం చేసుకోవాలి వాటిని పరిరక్షించాలి.
3. తనధ్యేయాలు సాధించవలసినవి నిర్ధిష్టంగా ఏర్పాటు చేసుకోవాలి.
4. తను పనిచేసే సముదాయంలోని సభ్యుల ఆసక్తిని, అభిప్రాయలను తెలుసుకొని వాటిని కంపెనీ ధ్యేయాలతో సమన్వయ పరుస్తూ రక్షించాలి.

## 15.6 సంస్థాపరమైన భావప్రసారం-భావప్రసారం-రకాలు

ఒక సంస్థలో భావ ప్రసారాన్ని స్థూలంగా రెండు విధాలుగా విభజించవచ్చు అవి : ఎ) లాంఛన ప్రాయమైనవి, బి) లాంఛన ప్రాయం కానివి.

## ● లాంఛనప్రాయ భావప్రసారం

లాంఛన ప్రాయమైన సందేశాలు సంస్థకు సంబంధించినవి సంస్థ పని చేసే తీరులో భాగమైనవి ఇవి లిఖిత పూర్వకంగాకానీ, నోటి మాటల ద్వారా కాని వుండవచ్చును. సంస్థాపరమైన సందేశాలు సంస్థలో పై అధికారి నుంచి క్రింది అధికారికి, క్రింది అధికారి నుంచి పై అధికారికి లేక లోపలే ఒక దగ్గరనుంచి ఒక విభాగం నుంచి మరొక విభాగానికి, బయటవారికి కానీ కావచ్చు.

పై అధికారి నుంచి క్రింది అధికారికి వెళ్ళే సందేశాలు క్రింది వైపు ప్రవహించే సంధేశాలు ఇవి నిర్వాహకపరమైన సందేశాలు వాటిలో సమాచారము ఏది ఎలా చేయాలో చెప్పే విశదీకరణ ఎప్పటి లోపల చేయాలో తెలియజేసే సందేశాలు ఇందులో వుంటాయి. క్రింది అధికారిపై అధికారికి సమాచారమిచ్చేటప్పుడు దాన్ని సందేశం సంస్థపైకి ప్రవహించే పద్ధతి అంటారు. సందేశ ప్రవాహం సంస్థనుంచి మరొక సంస్థ వైపువున్నపుడు దాన్ని సంస్థల మధ్య సందేశపువాహకం అంటారు.

బయట సంస్థలతో గానీ, వ్యక్తులతో కానీ నిర్దేశించిన సందేశాలు లాంఛనప్రాయమైన సందేశాలు, ఇవి ప్రభుత్వ విభాగాలకు గానీ, సేవార్థులకు కానీ, సముదాయాలలోని సమూహాలకుకానీ సందేశాలు పంపడం, అందుకోవటం జరుగుతున్నప్పుడు లాంఛన ప్రాయమైన సందేశాలు వినియోగించాలి. లాంఛన ప్రాయమైన సందేశాలు ఉత్తర్వుల రూపంలో వుండవచ్చు, లేదా సూచన ప్రాయంగా గానీ ఉండవచ్చు, అవి వివరణాత్మకంగా కూడా వుండవచ్చును.

## ● లాంఛన ప్రాయంకాని భావప్రసారం

ఈవిధమైన భావ ప్రసారం కలిసి పనిచేసే ప్రజల మధ్య సాంఘిక పరస్పర ప్రక్రియలలో లాంఛన ప్రాయంకాని భావప్రకటనలు తావు చేసుకుంటాయి. ఇటువంటి భావప్రకటనలు ఏవిధమైన నిబంధనలను అదుపులో పెట్టలేవు. వీటిని ఆచారాలు, సంస్కృతి కూడా అదుపులో పెట్టలేవు. ఇటువంటి భావప్రకటన జరగబోయే విషయాల గురించి ఉపయోగమైన సమాచారాన్ని ద్రాక్షతీగ రూపంలో అందజేస్తుంది. కీత్ డేవిస్ ద్రాక్షతీగ రూపపు సమాచార పద్ధతిని ఆపడం కానీ, రూపుమాపడం కానీ, అదుపులో పెట్టడం కానీ చేయలేమని చెప్పారు. ద్రాక్ష తీగరూపంలో వుండే సందేశాలివ్వడం మనుషుల జన్మహక్కని, ఎక్కడైనా, ఎప్పుడైనా కొంతమంది ప్రజలు సమూహంగా ఏర్పడి నప్పుడు ద్రాక్షతీగ రూపపు సందేశాలు తప్పని సరిగా చోటు చేసుకుంటాయని కూడా చెప్పారు.

BRAOU

## ● నోటిమాట ద్వారా సందేశాలు

సాధారణంగా ప్రజలకు చదవటం, వ్రాయటం రాకపోయినప్పుడు లేక మరేవైనా భాషాపరమైన ఇబ్బందులున్నపుడు నోటి మాట ద్వారా సందేశాలు చోటు చేసుకుంటాయి. ఈ విధమైన భావప్రకటనలు పనిచేసే వారికి పర్యవేక్షకునికి మధ్య జరుగుతాయి. ఇవి సాధారణంగా ముఖాముఖి సందేశాత్మకంగా రూపొందుతాయి. చర్చలా వుండటం కానీ, టెలిఫోన్ సంభాషణలా కానీ, అందరినీ ఉద్దేశించి మాట్లాడటం కానీ, ప్రదర్శనలు ఏర్పాటు చేయటం కానీ పరిస్థితిని బట్టి అవసరాన్ని బట్టి కానీ రూపుదిద్దుకొంటుంది. నోటి మాట ద్వారా వచ్చే భావప్రకటనల మూలాన కొన్ని లాభాలుంటాయి. ఇది నేరుగా ఉంటుంది, తక్కువ కాలాన్ని వినియోగిస్తుంది. అంతేకాకుండా తక్కువ ఖర్చుతో కూడింది. ఇది సూటిగా వుండడం మూలాన లాంఛన ప్రాయమైన పద్ధతుల ద్వారా ఉండే ఆలస్యం లేకుండా తొందరగా పని చేయటానికి దోహదం చేస్తుంది. ఇది మిత్రపూరితమైన, విశ్వాస పాత్రమైన సహకారపు ధోరణిని సూచిస్తుంది. ఇది ముఖాముఖి సన్నివేశాలలో జరగటం మూలాన అప్పటికప్పుడు సందేహ నివృత్తికి ఏర్పాటు చేసి ఎక్కువ ప్రయోజనకరంగా వుండటానికి దోహద పడుతుంది.

## ● లిఖిత పూర్వక భావప్రకటన

సందేశం పంపవలసిన వారు దూరంగా వున్నపుడు లేదా సందేశం, శాశ్వతంగా అట్టే పెట్ట వలసిన అవసరం వున్నపుడు. దీనిని వినియోగిస్తారు. దీనిని భవిష్యత్తులో ఉపయోగించటానికి వీలౌతుంది. ఇది సాధారణంగా

ఉత్తర్వులు పంపవలసి వచ్చినపుడు, సమాచారం పంపేటప్పుడు, నిబంధనలు తెలియజేయవలసి నప్పుడు ఎక్కువ ప్రయోజనకరంగా వినియోగించవచ్చును. సాధారణంగా పని వారికి నిర్దేశించిన పద్ధతులు, నిబంధనలు తెలియ చేసే పుస్తకాలలో వినియోగిస్తారు. సందేశం ఎవరికి, ఎప్పుడు, ఏ విధంగా యిచ్చింది తెలియజేయడానికి, తర్వాత ఋజువుగా వినియోగించటానికి పనిచేస్తుంది. వక్రభాష్యాలకు తావులేకుండా చేస్తుంది. ఇది క్రింది అధికారులకు వారి అసంతృప్తిని లిఖితపూర్వకాంగా వ్యక్తం చేయటానికి అవసరమైన విషయాలను పొందుపరచటానికి ఉపయోగపడుతుంది.

ఒక మంచి సంస్థ యాజమాన్యం రెండు విధాలైన సందేశాలను వినియోగిస్తుంది. సందేశాలు పంపటమనేది పెద్ద సంస్థలలో కానీ, సామూహిక ప్రయత్నాలు చేసే చోట కానీ చాలా ప్రాధాన్యత వహిస్తుంది. సాధారణంగా ఈ రెండింటిని సమాజతూకంలో కలిసి సంస్థలు వాటి అవసరాలు తీర్చుకునేందుకు వినియోగిస్తారు. ఒక సమాచారాన్ని తెలియచేయటానికి ఒక పద్ధతి ద్వారా తెలియ చేసినదాన్ని బలపరచటానికి మరొక పద్ధతిని వినియోగించటం ఎక్కువ ప్రయోజనకరంగా వుంటుంది.

### ● లాంఛన ప్రాయంకాని భావప్రకటన చేయటం

లాంఛన ప్రాయంకాని భావాలు, మాటలు సంజ్ఞలు, లిఖితపూర్వకంగానూ, ఇంకా అనేక రకాలుగా పంపిస్తారు. మిత్ర సమూహాలు, మిగతా లాంఛన ప్రాయం కాని సమూహాలు కబుర్లు చెప్పుకోవటం ద్వారాను, పనికి సంబంధించిన వార్తలు ద్రాక్ష తీగ పద్ధతిలో అనేక రకాలుగా చెప్పుకుంటారు. సంస్థలు పెద్దవవడంతోపాటే అనేక ద్రాక్ష తీగ సమూహాలుంటాయి. ఈ సమూహాలలో సభ్యులు లాంఛన ప్రాయంగా తెలియ చేయలేని అనేక రకాల సమాచారాన్ని తెలుపుకుంటూ వుంటారు. ఇది సాధారణంగా ఈ క్రింది పద్ధతులలో కానీ, కలయికలుగా గానీ వుపయోగిస్తారు.

BRAOU

## 15.7 భావప్రకటనా పద్ధతులు

### 1. భిన్నంగా ఉండే కట్టు పద్ధతి

కొంత మందికి మాత్రమే సందేశాలు చెప్పదలచినపుడు ఈ పద్ధతిని వినియోగిస్తారు. ఈ పద్ధతిలో


సమాచారం వదంతుల వలె 'ఎ' నుంచి 'బి'కి 'బి'నుంచి 'సి' కి ఇదే విధంగా మిగతావారికి తెలుస్తుంది.

'ఎ' ——— 'బి' ——— 'సి' ——— 'డి' - ఇతరులకు

గొలుసుకట్టు పద్ధతి

### 2. లాంఛన ప్రాయంకాని నక్షత్ర రూప పద్ధతి


ఒక వ్యక్తి వదంతిని చాలామందికి చెప్పినపుడు అదే విషయం విభిన్న వివరాలతో అనేక మందికి.




నక్షత్ర రూపపద్ధతి

### 3. సంభావ్యతా పద్ధతి

ఈ పద్ధతిలో ఒక సమాచారాన్ని కొంతమందికి అనుకోకుండా అందజేస్తే మరికొంత మందికి వారు అనుకోకుండా చెప్పి కొంతమందికి చెప్పడం మాని వేయవచ్చు. బి, సి లకు ఎ కొంత సమాచారాన్ని ఇచ్చినప్పుడు వారు ఇ, జి లకు చెప్పి మరికొంత మందికి చెప్పకపోవడం.




### 4. గుత్తి లాంటి వరస

ఈ పద్ధతిలో 'ఎ' తన మిత్రులు బి,సి, డి లకు మరొకరికి చెబుతారు. మరొకరు ఇద్దరికి చెబుతారు. ఇది తిన్నటి గొలుసు పద్ధతిలో గానీ లేక నక్షత్ర పద్ధతిలో గానీ ఉండే ద్రాక్షతీగ పద్ధతి.




గుత్తిలాంటి వరస పద్ధతి

BRAOU

ఈ ద్రాక్షతీగ భావప్రకటనా పద్ధతి ద్వారా వచ్చిన సమాచారం పూర్తిగా నమ్మడానికి వీలు లేకపోయినా దీని మూలంగా కొన్ని లాభాలున్నాయి. ఇది ఉద్యోగస్తులలో తోటి వారితో స్నేహబంధాలు పెంచుకోవాలనుకునే అవసరాన్ని తీరుస్తుంది. ఇది పనిచేసే వారికి వచ్చిన ఉత్తర్వులలో స్పష్టంగా లేనప్పుడు పరస్పరం చర్చించు కొని అర్థం చేసుకునేందుకు సహాయపడుతుంది. ఇది ఒక భద్రతా కవాటంగా ఆవేశం మొదలైన వాటి తీవ్రతను ఉపశమింప చేస్తుంది. అందులో పనిచేసేవారికి భవిష్యత్తులో ఏమౌతుందో ఊహించే శక్తి లేక తమ భవిష్యత్తును గురించి వదంతులు లేవదీస్తూ వాటిని అందులో చర్చిస్తూ ఉంటారు. అక్కడ లేనివారిని గురించి మాట్లాడేటప్పుడు సభ్యులు వారిని విమర్శించి వారి మీద తీర్పునిచ్చి తమ పరిస్థితి తాము ఎక్కడ ఉన్నదీ తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తారు. యాజమాన్యంలో ఈ 'ద్రాక్షతీగ' భావ ప్రకటనను ఒక పనిముట్టుగా వినియోగించ వచ్చు. దీని ద్వారా పనిచేసేవారు యాజమాన్యాన్ని గురించి ఏమను కుంటున్నారో తెలుసుకుని అటు పనిచేసే వారిని ఇటు యాజమాన్యాన్ని, ఇద్దరినీ బేరీజు వేయడానికి ఉపయోగపడుతుంది. దీనితో పాటు యాజమాన్యం ప్రాచుర్యం ఇవ్వాలను కున్న విధానాలను కూడా ఈ ద్రాక్షతీగ పద్ధతి ద్వారా ప్రవేశపెట్టవచ్చు.

## 15.8 భావప్రసారం - అటంకాలు

స్టీగ్ లిట్జ్ వీటిని మూడు విధాలుగా విభజించాడు.

ఎ) వ్యక్తుల నుంచి భావ ప్రసారాలు వస్తాయి గాబట్టి వ్యక్తులలో చాలా తేడాలుంటాయి, ఇవి వ్యక్తి తేడాల వలన కావచ్చు లేక ఆర్థిక సామాజిక భౌగోళిక విద్యా పరమైన లేక వృత్తి పరమైన తేడాలైనా కావచ్చు. ఇవి

అంతర్గతమే ఉన్న సందేశం లేక భావప్రకటన ఆటంకాలు కావచ్చు యజమాన్యానికి వారి కోసం పనిచేసే వారికై భావప్రసారం చేయాలనే వైఖరి లేకపోవటం, వారి వైఖరిని ప్రభావితం చేస్తుంది. భావప్రకటనను వారు సోమరితనంతో కబుర్లు చెప్పుకునే పద్ధతి గాను, కాలం వృధా చేసే పద్ధతి గాను భావించవచ్చు.

బి) సంస్థలోని వాతా వరణం : భావప్రసారం చేయడానికి సంస్థలోని వాతావరణం అనుకూలంగా ఉండకపోవచ్చు. దీనిలో ఈ క్రింది వాటిని పేర్కొనవచ్చు.

1. భయాలు : తమను తప్పుగా అర్థంచేసుకుని దుర్విశ్లేషణ చేస్తారనే భయం సంస్థలో పని చేసే వారిలో ఉండవచ్చు.

2. ద్రాక్ష తీగ పద్ధతిలో తాము మాట్లాడినది వక్రీకరింపబడుతుందనే భయం.

3. తాము దుర్వ్యాఖ్యలకు లోనవుతామేమోనని భయం. తమకు తక్కువగా తెలియటం, అందువలన సరైన సమాచారం ఈయలేక పోతున్నామనే భావనలో వ్యక్తులు తమకు తెలిసిన సమాచారం కూడా పూర్తిగా చెప్పకపోవడం. పై ఉద్యోగులు తమ సలహాలను త్రోసి పుచ్చుతారని లేదా తమను ఎగతాళిగా చూస్తారనే భయం.

4. ఉద్యోగంలో ఒక పని చేసేవాడు తనను మందలిస్తారనే భయంతో ఉన్న పద్ధతిలోని సమాచారాన్ని చెప్పక పోవటం లేక వాస్తవం చెబితే తనకు రావలసిన ప్రమోషన్ రాదని భయం లేదా జీతం పెరుగుదల ఉండదని భయం లేదా ఉద్యోగమే పోవచ్చుననే భయం.

5. సక్రమమైన పర్యవేక్షకుడు లేకపోవడం, పనిచేసే వారి సూచనలను ఎవరికీ పంపకపోవుడం, పర్యవేక్షకుడు తనకే ఎక్కువ తెలుసుననుకుని క్రింది వారిని చిన్నచూపు చూసి, అర్థం చేసుకోకపోవడం, సందేశం ప్రాముఖ్యత పై అధికారానికిగాని, పర్యవేక్షకునకు గాని లేకపోవడం మొదలైన వాటి ద్వారా పనిచేసే వారిలో అసంతృప్తి పెరుగుతుంది.

సి) చిత్తశుద్ధి, ధైర్యం, పరస్పరాధారాలు ఇవి లేకపోవడం వలన చేసే భావప్రకటన సరైనది కాకపోవచ్చు. ఇవి సరిగా లేకపోవడం వలన భావప్రకటన చేసే వ్యక్తిని నమ్మకపోవచ్చు.

డి) నిర్మితి పరమైన అడ్డంకులు : సంస్థలో నిర్మితికి సంబంధించిన అడ్డంకులు కొన్ని ఉంటాయి. పదవి, బాధ్యత రెండింటినీ సరిగా ఏర్పాటు చేయకపోయినట్లయితే సందేశాలు సరిగా పంపబడవు. దారులు మూతబడి సందేశాలు పంపడం అస్తవ్యస్తంగా ఉంటుంది.

ఇ) మిగతా కారణాలు : ఇవి భౌగోళిక దూరానికి సంబంధించినవి, సందేశాలు పంపడానికి సరైన కాలం లేకపోవడం, సరైన శిక్షణ లేకపోవడం. వీటికి తోడు ఈ క్రింది వాటిని కూడా భావ ప్రసార ఆటంకాలుగా పేర్కొనవచ్చు.

1. **వ్యక్తిగత ఆటంకాలు :** సామాజిక విలువలు, వ్యక్తి గత భావోద్రేకాలు వాటికి సంబంధించిన అంచనాలు తీర్పులు మానసిక దూరానికి దారితీసి అడ్డుగోడలుగా నిలుస్తాయి.

2. **భాషా పరమైన ఆటంకాలు :** పదాల అర్థాలు ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి మారుతుంటాయి. ఇవి అర్థం చేసుకోలేక పోవడమే ఒక ఆటంకం కావచ్చు మాటల అర్థాలు మాటలలో కాదు మనసులలో ఉంటాయనే నానుడి ఇక్కడ చాలా ప్రాధాన్యం వహిస్తుంది.

3. **మానసిక ఆటంకాలు :** ఇవి కార్యనిర్వాహక స్థాయికి సంబంధించినవి. అతనికి ఉండే ఉన్నత స్థాయి, అతని క్రింది వారిని అతని దగ్గర తక్కువ వారిగా చిత్రింపజేస్తుంది. తద్వారా భావప్రకటన చేయడం కష్టం

BRAOU

అవుతుంది.

4. **భౌతిక ఆటంకాలు** : చుట్టూ ఉండే వాతావరణం పరిస్థితి, దూరం, మొదలైనవి. ఒకే అధికారం నుంచి భావప్రకటన రావాలనే సూత్రం ప్రకారం సందేశాలు అనేక స్థాయిలు దాటాలి. ఒక్కొక్క స్థాయిలో సందేశాలు వక్రీకరించడానికి అవకాశముంది.

## 15.9 భావప్రకటనలో అంతరాయాలు

భావ ప్రకటనలో అంతరాయాల తొలగింపునకు ఈ క్రింది సూచనలు ఉపయోగకరంగా ఉంటాయి.

1. **ఆటంకాలను గుర్తించి విశ్లేషించటం** : సందేశాన్ని పంపడంలో ఆటంకాలు తెలుసుకొని వాటిని దూరం చేయటానికి ప్రయత్నించాలి.

2. **యాజమాన్యంలోని వారు సందేశాల ఆదేశాలను అవసరాలను గుర్తించాలి:** మంచి సంబంధాలు ఉండాలంటే మంచి భావప్రకటన ఉండాలి. మంచి మానవ సంబంధాలు ఉంటే మంచి వ్యాపారం, భావప్రకటన నమ్మేలా ఉండడమే కాకుండా ఆచరణలో పెట్టేందుకు వీలుగా ఉండాలి.

3. **పద్ధతి విధానం మీద లిఖితపూర్వకమైన ప్రకటన ఉండాలి** : ఇది బయట ప్రజలందరికి కూడా సందేశం పట్ల సంస్థల యాజమాన్యానికుండే వైఖరిని తెలియచేస్తుంది. అది సంస్థలో అందరూ అలవరుచుకోవలసిన సందేశవైఖరిని ప్రభావితం చేస్తుంది. అది సంస్థల్లో పద్ధతులు, అలవాట్లకు, మూలస్తంభం అవుతుంది. ఇది తయారు చేసేటప్పుడు క్రింది అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి.

ఎ) సంస్థలో పని చేసేవారు ఏది ఎంతవరకు తెలుసుకోవాలి.

బి) ఎటువంటి విషయం మీద పని చేసేవారికి చెప్పేందుకు అవకాశం ఇవ్వాలి. ద్రాక్షతీగ పద్ధతులు, లాభాలు మొదలైవి.

సి) దైనందిన పద్ధతులలో ఉండే ఆటంకాలన్నీ తొలగించడానికి ప్రతి పర్యవేక్షకుడికి ఎంత బాధ్యత అప్పగించాలి, ప్రతి స్థాయికి సందేశం పంపి, అందుకునే బాధ్యత విస్పష్టంగా తెలపాలి.

4. ఏకరీతిగా వుండాలి. సుసంగతంగా వుండాలి.

5. భావ ప్రకటన ఒక నిరంతర ప్రక్రియ. ఇది ఎప్పుడూ జరుగుతూవుంటుంది. పరిస్థితులలో, వ్యక్తులలో మార్పు వచ్చినప్పుడు, సంస్థాపరమైన పద్ధతిని ప్రకటించాలి.

6. తీసుకున్న చర్య మూలాధారపు వ్యక్తికి తెలియాలి. చేపట్టిన కార్యక్రమాలు ఏ విధంగా అమలులో పెట్టేదో, దాని ఫలితాలు భావ ప్రకటన చేసిన వ్యక్తికి తెలియాలి.

7. సందేశాన్ని మళ్ళీమళ్ళీ ఇవ్వటం ప్రయోజనకరంగా ఉంటుంది.

## 15.10 ముగింపు

ఆంగ్లంలో కమ్యూనికేషన్ అనే పదం అర్థం తెలుగులో భావాప్రసారం అంటే ఒకరి నుంచి మరొకరు సమాచారాన్ని పంచుకోవడం, ఇవ్వడం. క్రమానుగత భావప్రసారాలు సముదాయాలను అనుసంధానం చేస్తాయి. భావప్రసారానికి దశలుంటాయి. ఆదశల ద్వారా అవి అభివృద్ధి అయ్యాయి. ఆధునిక యుగంలో భావప్రసార సాధనాలు విపరీతమైన

B R A O U

అభివృద్ధి సాధించాయి. భావప్రసారాలకు వాహికలు అవసరం. భావప్రసారం పద్ధతులకు ఆటంకాలు, అంతరాయాలు కుడా ఉంటాయి. వీటిని అధిగమించి సమాజంలో పరస్పర చర్యలకు అణువణువునా భావప్రసారం జరగాలి. కొన్ని సూత్రీకరణలు కూడా ఉన్నాయి. వాటి గురించి మీరు తెలుసుకున్నారు.

## 15.11 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబురాయండి?

1. భావప్రసారం అనగానేమి? వివరించండి?

2. భావప్రసారంలో వివిధ దశలను వివరించండి?

3. భావప్రసారం రకాలెన్ని?

II. ఈక్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. భావప్రసారం అంతరాయాలు ఏమిటి?

2. భావప్రసారం రకాలెన్ని?

3. భావప్రసారం ధ్యేయాలేమిటి

## 15.12 చదవదగి పుస్తకాలు


1. Parkh Robert, E. : 'The Urban community As Special Pattern and a moral under.

2. Keeth Devis Kuntz : Organisational behaviout Principles of Management


BRAOU

# భాగం-16: భావప్రసారం-విస్తరణ-సూత్రాలు-పద్ధతులు

విషయక్రమం

16.0 ఉద్దేశాలు

16.1 పరిచయం

16.2 సాముదాయిక అభివృద్ధి - భావన

16.3 నిర్వచనాలు

16.4 లక్ష్యాలు

16.5 విస్తరణ

16.6 విస్తరణా కార్యక్రమాలు

16.7 విస్తరణా సూత్రాలు

16.8 విస్తరణా పద్ధతులు

16.9 ముగింపు

16.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

16.11 చదవదగిన పుస్తకాలు

BRAOU

## 16.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సాముదాయాక అభివృద్ధిలో కార్యకలాపాల విస్తరణకు ప్రాముఖ్యతను తెలుసుకుంటారు.
- సాముదాయిక అభివృద్ధి భావనను నిర్వచించి లక్ష్యాలను వివరించగలుగుతారు.
- విస్తరణ దాని పద్ధతులను, సూత్రాలను కార్యక్రమాలను తెలుసుకుంటారు.

## 16.1 పరిచయం

భారతదేశంలో 70 శాతం జనాభా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. గ్రామాలలోని ప్రజలు వ్యవసాయం పైనా, ఇతర అనుబంధ వృత్తులపైనా ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామ ప్రాంతాలలో పేదరికం, అవిద్య, అనారోగ్యం ప్రబలి ఉన్నాయి. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత గ్రామాభ్యుదయానికి చెందిన ప్రణాళికలను ప్రభుత్వం రూపొందించింది. గ్రామాలలో సాముదాయిక ప్రయత్నాల ద్వారా ఉత్పత్తి పెంచాలనీ, ప్రజలను చైతన్య వంతులను చేయడం ద్వారా ప్రగతిగామి అయిన ఆధునిక నాయకత్వాన్ని రూపొందించాలనీ ఉద్దేశిస్తూ సాముదాయిక అభివృద్ధి పథకాలను చేపట్టడమైనది. ఒక కులానికి లేదా ఒక వర్గానికి లేదా ఒక సమూహానికి పరిమితం కాకుండా మొత్తం సమాజాన్ని అభివృద్ధి పరచడమే సాముదాయిక అభివృద్ధి భావన. సాముదాయిక అభివృద్ధి పథకాల ద్వారా గ్రామీణ వాతావరణాన్ని రూపాంతరీకరించి, అభివృద్ధి కరమైన సముదాయాలుగా వాటిని రూపొందించవచ్చునని ప్రభుత్వం అభిప్రాయపడింది. గ్రామీణ ఆర్థిక సామాజిక వ్యవస్థను సంపూర్ణంగా మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ విషయాన్ని మొదటి పంచవర్ష ప్రణాళిక ముసాయిదాలో నొక్కి చెప్పడం ద్వారా గ్రామాలలోని

సామాజిక ఆర్థిక జీవితాన్ని మార్చే ప్రక్రియను ప్రారంభించడమే మొదటి పంచవర్ష ప్రణాళిక ఉద్దేశ్యం. అని జవహర్‌లాల్ నెహ్రూ సాముదాయిక అభివృద్ధి పథకాల ప్రాధాన్యతను వివరిస్తూ చెప్పారు. వస్తుపరమైన అభివృద్ధి కంటే వ్యక్తిలో, సముదాయంలో నిర్మాణాత్మక శక్తులను పెంచి, వారిని గ్రామ నిర్మాతలుగా, భారతదేశ నిర్మాతలుగా మార్చడమే ఈ సాముదాయిక అభివృద్ధి పథకాల ఉద్దేశ్యమని వివరించినారు.

## 16.2 సాముదాయిక అభివృద్ధి భావన

సాముదాయిక అభివృద్ధి అనే పదం భారతీయ పరిభాషలో ఒక విధంగా కొత్తదని చెప్పాలి. ఈ విషయాన్ని బలవంతరాయ్ మెహతా కమిటీ ఈ విధంగా వివరించింది. "ఇంతవరకు మనం గ్రామీణ అభివృద్ధి, నిర్మాణాత్మక పని, వయోజన విద్య, గ్రామోద్ధరణ మొదలైన పదాలను గ్రామానికి సంబంధించిన కొన్ని అంశాలను తెలియజేయడానికి ఉపయోగించాము. అనేక మతపరమైన సమూహాలను లేదా కులసమూహాలను సూచించడానికి ఉపయోగించాము. కొన్ని సమయాలలో ప్రాంతేతరమైన ఆర్థిక సమూహాలను ఉద్దేశించి ఈ పదాన్ని వాడారు. కానీ సాముదాయిక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన తరువాత సముదాయ భావనను కుల, మత, ఆర్థిక వ్యత్యాసాలకు అతీతంగా మొత్తం గ్రామీణ సముదాయానికి అన్వయిస్తూ ఉపయోగిస్తున్నారు. ఒక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలందరూ తప్పకుండా అక్కడ అభివృద్ధి పట్ల ఆసక్తి చూపించాలన్న విషయాన్ని ఈ కార్యక్రమం నొక్కి చెబుతున్నది". భారతీయ భాషలలో ఈ పదానికి సమానమైన పదం లభించనందు వల్ల సాముదాయిక అభివృద్ధి శబ్దాన్ని వాడటం జరిగింది.

సమాజంలో సర్వతోముఖాభివృద్ధిని సాధించడంలో సమాజ వికాస కార్యక్రమాల పాత్రను లేదా సాముదాయిక అభివృద్ధి కార్యక్రమాల పాత్రను ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న ప్రజాస్వామ్య దేశాలన్నీ గుర్తించినాయి. భారతదేశ ప్రథమ పంచవర్ష ప్రణాళికలో సమాజవికాస కార్యక్రమాన్ని గురించి ఈ విధంగా పేర్కొనడం జరిగింది. "గ్రామీణ ఆర్థిక సామాజిక రంగాలలో అభివృద్ధి కరమైన మార్పును తీసుకు రావడానికి సమాజవికాస కార్యక్రమం ఒక ముఖ్య సాధనం. అది మానవుని సుఖమయజీవితానికి పునాది వేస్తుంది. సమాజవికాస కార్యక్రమాల ప్రధాన లక్ష్యం, సమాజంలోని ఆకలి, అనారోగ్యం, అజ్ఞానాంధకారం మొదలైన వాటిని పారద్రోలి దేశాన్ని సుభిక్షం చేసి విజ్ఞాన వికాసాలను వెదజల్లడమే".

BRAOU

## 16.3 నిర్వచనాలు

1. ఒకే భౌగోళిక ప్రదేశంలో నివసిస్తూ పరస్పర సంబంధాలతో ఉన్న ప్రజల శక్తి సామర్థ్యాలను, గుణగణాలను పెంపొందించడమే సమాజాభివృద్ధి అని చెప్పవచ్చు.

2. గ్రామీణ ప్రజలు తమ ఆర్థిక, సాంఘిక పరిస్థితులను తమకు తాము మెరుగుపరుచుకునేటట్లు సహాయ పడడానికి గాను కార్యక్రమాలలో పాల్గొనేటట్లు చేసి, తద్వారా దేశాభివృద్ధి కార్యక్రమాలలో సార్థకమైన శక్తివంతమైన సమూహాలుగా తయారయ్యేటట్లు చేసే పద్ధతిని సమాజాభివృద్ధి అంటారు.

3. ఒక సమాజంలోని ప్రజలు ప్రణాళికను వేసుకుంటూ ముందుకు పోవడానికి తమంతట తాము క్రమబద్ధమైన సమూహాలుగా ఏర్పడాలి. తమకందరికీ సంబంధించిన అవసరాలను, సమస్యలను నిర్వచించి ఈ సమస్యలను పరిష్కరించుకోవడానికి తగిన విధంగా వ్యక్తిగతమైన, సామూహికమైన పథకాలను రూపొందించాలి. వాటిని సమాజంలోని వనరులపై పూర్తిగా ఆధారపడుతూ అమలుజరపాలి. ఇంకా అవసరమయినపుడు ప్రభుత్వ సంస్థలనుంచి వస్తు సంబంధమైన, సేవా సంబంధమైన సహాయంతో సమాజపు వనరులను అధికం చేయడానికి అనుసరించవలసిన సాంఘిక చర్యను సమాజాభివృద్ధి అంటారు.

4. వీలుంటే సమాజపు చొరవను బట్టి, లేకుంటే వేరుగానూ సమాజానికంతటికి మెరుగైన జీవితం కలిగేటట్లుగా చేయడానికి ఉద్దేశించిన ఒక ఉద్యమాన్ని సమాజాభివృద్ధి అంటారు.

5. ప్రజలు తమ సమాజ ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులను దేశజీవనంలో అంతర్భాగాలయ్యేటట్లు చూడాలి. అట్లాంటి సమాజాలు దేశాభివృద్ధి కార్యక్రమాలలో తమ శక్తి కొద్దీ సహకరించేటట్లు చేయాలి. ప్రజల ప్రయత్నాలు ప్రభుత్వపు ప్రయత్నాలతో పూర్తిగా సహకరించేటట్లు చేసే విధానాన్ని సమాజాభివృద్ధి అంటారు.

6. గ్రామీణ ప్రజలను ప్రోత్సహించడానికి, కొన్ని సేవలను అందించడానికి ఉద్దేశించిన కార్యక్రమం సమాజాభివృద్ధి అవుతుంది.

## 16.4 లక్ష్యాలు

సమాజంలోని వనరులను అభివృద్ధి పరచడమే సమాజాభివృద్ధి కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

1. ప్రజల మనస్తత్వంలో, దృక్పథంలో మార్పు వచ్చేటట్లు చూడటం.
2. ప్రగతిని పెంపొందించగల నాయకత్వాన్ని అభివృద్ధి చేయటం.
3. ప్రజలలో స్వయం సహాయతా భావాన్ని పెంపొందించడం.
4. వ్యవసాయోత్పత్తులను అధికం చేసేందుకు మేలయిన, ఆధునికమైన వ్యవసాయపద్ధతులను, విధానాలను స్థాపించడం.
5. ప్రస్తుతమున్న చిన్న తరహా పరిశ్రమలను, గృహ పరిశ్రమలను అభివృద్ధి పరచడం, క్రొత్త పరిశ్రమలను స్థాపించడం.
6. ఆహారానికి సంబంధించిన అవసరాలను అన్నింటిని తనంతట తానే సమకూర్చుకోవడానికి కావలసిన ప్రోత్సాహ, సహాయ, సహకారాలు కుటుంబానికి లభించేటట్లుగా చేయడం.
7. గ్రామాభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలందరూ పాల్గొనేటట్లు చేయడం.
8. అనారోగ్యం వల్ల రోజురోజుకు అధికమవుతున్న జనాభా నష్టాన్ని సాధ్యమైనంతవరకు తగ్గించడం.

సాముదాయిక అభివృద్ధి పథకం అనేదాన్ని ప్రజలలో ప్రాథమికంగా చైతన్యం కలిగించడానికి నూతన ఉత్సాహం, ఆత్మస్థైర్యం కలిగించి, లభ్యమయ్యే స్థానిక వనరులను సమీకరించి మానవశక్తిని సమన్వయపరుచుకుని అన్ని రంగాలలో పురోగతిని సమతుల్య స్థాయిలో సాధించడానికి ఉద్దేశించడం జరిగింది. అంతమాత్రమే గాక వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు ముఖ్యంగా వ్యవసాయ శాఖ, పశు సంవర్ధకశాఖ, సహకార శాఖ విద్యా వైద్య శాఖలు ఇతర ప్రభుత్వ శాఖలు గ్రామీణాభివృద్ధి కార్యక్రమ ఫలితాలను సమన్వయం చేయడం ద్వారా అభివృద్ధి అన్ని రంగాలకు విస్తరింపచేయడం.

సమాజాభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు ప్రజల ఉత్సాహ సహకారాల మీద ఆధారపడి ఉన్నాయి. ప్రజలను సరైన పద్ధతిలో ఆయత్తపరిస్తే వారు పరస్పర, స్వయం సహాయాలతో అభివృద్ధి సాధిస్తారు.

ప్రజలు సమాజాభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడం అత్యవసరమైన విషయం. సమాజాభివృద్ధి కార్యక్రమాలన్నీ తమకు సంబంధించినవే అనే భావనతో తమ శక్తి సామర్థ్యాల పైన తమ సంఘటిత శక్తి పైన నమ్మకంతో ప్రజలు తమ సమస్యలను తామే పరిష్కరించుకోవాలి. తమకుతాము సహాయం చేసకునే విధంగా ప్రజలను సమాయత్త పరిచి వారు ఎదుర్కొనే సమస్యల్నింటినీ సంపూర్ణమైన దృష్టితో పరిష్కరించడానికి ప్రయత్నించాలి. దేశాభివృద్ధి దృష్ట్యా అతి

BRAOU

ముఖ్యమైనవి, సాధారణమైనవి అయిన సమస్యల ప్రాధాన్యాన్ని బట్టి నిర్ణయించి వాటి పరిష్కారానికి కృషి చేయాలి. ఇతర సౌకర్యాలకు సంబంధించిన సమస్యల కన్నా, వ్యావసాయిక సమస్యలకు సంబంధించిన సమస్యలకు అధిక ప్రాముఖ్యత నివ్వాలి. వ్యావసాయిక ఉత్పత్తులను అధికం చేయడం, రోడ్లు భవనాలు మొదలయిన ఇతర సౌకర్యాలను అభివృద్ధి చేయడం ద్వారా సమాజాభివృద్ధి జరుగుతుంది. కాకపోతే ఇవన్నీ పరోక్షంగా ప్రజల స్థితిగతులను మెరుగుపరచి తద్వారా వారి మానసిక శక్తి సామర్థ్యాలను పెంపొందింప జేస్తాయి.

సమాజంలోని ప్రజలు తమ అవసరాలను గుర్తించడం; అట్లాంటి అవసరాలను నెరవేర్చుకోవడానికి తమ శ్రద్ధను కనబరచడం, స్వయం సహాయంతోను పరస్పర సహకారాలతోను స్థానికంగా పథకాలు వేసుకొని కృషి చేయడం అవసరం. అట్లా స్థానికావసరాలు తీర్చుకోవడానికి తయారు చేసుకున్న పథకాలను నిర్వచించడానికి అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం నుంచి పొందుతూ సమాజాన్ని అభివృద్ధి చేసుకోవాలి. ఒకదాని తరువాత మరొకటి స్వయం సహాయ కార్యక్రమాలను చేపడుతూ సమాజం తన శక్తి సామర్థ్యాలపై తనను తాను పెంపొందించుకుంటూ స్వయం సమృద్ధిని సాధించాలి. గ్రామీణ సమస్యలను పరిష్కరించడానికి దినదినాభివృద్ధి చెందుతున్న సాంకేతిక నిపుణతను పూర్తిగా వినియోగించుకోవాలి. ఈ విధమైన తత్వంతో సమాజాభివృద్ధి భావన పెంపొందుతుంది.

## 16.5 విస్తరణ

1951 సంవత్సరంలో ప్రణాళికా సంఘాన్ని రూపొందించి భారతదేశంలో ఆర్థిక, సాంఘిక రంగాలలో భారీ ఎత్తున అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం తలపెట్టింది. దేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి వ్యవసాయ రంగాన్ని త్వరితగతిని అభివృద్ధి పరచడం అత్యావశ్యకమయింది. దీని ఫలితంగా సాముదాయిక అభివృద్ధి పథకాన్ని అక్టోబర్ 2, 1952 గాంధీ జయంతినాడు ప్రారంభించినారు. ఈ పథకాలను ప్రవేశపెట్టిన కొద్ది నెలలకే ప్రజలలో నూతన చైతన్యం ఏర్పడింది. తరువాత దశలో ప్రభుత్వం వద్ద ద్రవ్యలోపం వలన కమ్యూనిటీ పతకాలను మరింత విస్తరించలేక, "జాతీయ విస్తరణ సేవా కార్యక్రమాన్ని" 1953 ఏప్రిల్‌లో రూపొందించడమైంది. సాముదాయిక అభివృద్ధి పథకాలకు, జాతీయ విస్తరణ సేవా కార్యక్రమానికి మౌలికంగా ఏ విధమైన భేదం లేదు. ఈ రెండు కార్యక్రమాల ఉద్దేశ్యం సమగ్రంగా గ్రామాన్ని అభివృద్ధి పరచడమే. ఈ రెండు ఉద్యమాల ధ్యేయం ఒక్కటే. జాతీయ విస్తరణ సేవాస్థిరమైన వ్యవస్థాపనతో ఉంటుంది. దీని ద్వారా అధికారుల ప్రజ్ఞానుభవాలు, ద్రవ్య వనరులు, అన్నీ అభివృద్ధికి లాభిస్తాయి.

BRAOU

ఈ రెండింటి సంబంధాన్ని తెలుపుతూ పంచవర్ష ప్రణాళిక నివేదికలో "గ్రామాలలో ప్రారంభించిన సామాజిక, ఆర్థిక రూపాంతరీకరణ ప్రక్రియకు సమాజ అభివృద్ధి పద్ధతిగా పేర్కొంటే గ్రామీణ విస్తరణ పథకంగా పనిచేస్తుంది" అని పేర్కొనడం జరిగింది.

## 16.6 విస్తరణ సేవా పథకాల కార్యక్రమాలు

విస్తరణ సేవా పథకాలు చేపట్టవలసిన కార్యక్రమాలను ఈ క్రింది విధంగా చెప్పవచ్చును.

1. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులలోనూ, వ్యవసాయానికి సంబంధించిన తదితర శాస్త్రాలలోనూ వ్యవసాయదారులకు శిక్షణ ఇవ్వడం.

2. వ్యవసాయ పరిశోధన రంగంలోని నూతన ఫలితాలను గురించి వ్యసాయోత్పత్తి మీద వాటి ప్రభావాన్ని గురించి, వ్యవసాయ రంగంలో మెరుగైన నూతన పద్ధతులను గురించి రైతులకు బోధించడం.

3. దేశంలోని వివిధ ప్రాంతాల వ్యవసాయ దారుల సమావేశాలను జరిపించడం.

ఈ విధమైన సమావేశాల వలన వ్యావసాయిక, విజ్ఞాన విషయాలలో పరస్పర సహాయానికి అవకాశం లభించడమే కాకుండా వ్యావసాయికరంగంలో నాయకత్వం పెంపొందడానికి అవకాశం లభిస్తుంది.

జాతీయ విస్తరణ సేవవలన గ్రామంలోని ప్రతి కుటుంబీకున్ని కలుసుకోవడం, దేశ విస్తృత సమన్వయాభివృద్ధికి తోడ్పడుతుంది. దీని ఉద్దేశ్యం గ్రామ ప్రజలకు ఆహారం, దుస్తులు, ఆరోగ్య సౌకర్యాలు అందజేయడం మాత్రమే కాదు. వీటిని కల్పించడం కూడా జాతీయ విస్తరణ సేవ ఆశయం అయినప్పటికీ వీటికంటే ముఖ్యంగా ప్రజల దృక్పథంలో మార్పును తీసుకువచ్చి వారిలో ఉన్నత జీవన ప్రమాణాలపై ఆశలు రేకెత్తించి ఈ జీవన ప్రమాణాలను సాధించడానికి వారు పూనుకునేటట్లు చేయాలి. ఇది ఒక మానవ సమస్య. దేశంలోని 5 లక్షలకు పైగా ఉన్న గ్రామాలలో నివసించే కోట్లకొద్దీ గ్రామీణ ప్రజలను ఎక్కువ జీవన ప్రమాణాలను సాధించడానికి సంసిద్ధులను చేయడం ఒక సామాన్య సమస్య కాదు. ప్రపంచ చరిత్రలో ఇటువంటి సమస్యను ఇది వరలో ఏదేశం ఎదుర్కొని ఉండదు.

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలు అభివృద్ధి శాఖల ద్వారా అమలు జరిగేవి ఈ అభివృద్ధి శాఖలు వ్యవసాయ శాఖ, సహకార శాఖ, పశుపోషణ శాఖ, ఆరోగ్య శాఖ, విద్యా శాఖ మొదలైనవి. విడివిడిగా తమ పథకాలను అమలు పరిచేవి. ప్రతీ శాఖవారు గ్రామ ప్రజలను తమ అధికారుల ద్వారా కలుసుకునే వారు. ఈ విధంగా గ్రామాలలో పనిచేసే అభివృద్ధి శాఖల కార్యకర్తలకు, అధికారులకు శిక్షణ లేకపోవడం వలన వారు అన్ని విషయాలలోను మార్గదర్శకత్వం. ఇవ్వడానికి అర్హులు కారు. అంతేకాక ఈ విధమైన అభివృద్ధి శాఖల పథకాలను సమన్వయపరచే వారు కానీ, ఏకీకరణ చేసే వారు కానీ లేరు. ఈ కారణం వలన అభివృద్ధి పథకాలు ఏకీకృతం చేయకపోవడమే కాక ప్రజల ధృక్పథంలో మార్పులు తీసుకు వచ్చి వారిలో చొరవను రేకెత్తించడానికి ఏవిధమైన ఏకభావయత్నం జరగడంలేదు.

జాతీయ విస్తరణ సేవ ఒక క్రొత్త భావమేమీ కారు. 'విస్తరణ'ను ఒక ప్రత్యేక పద్ధతిగా 1912 లో అమెరికాలో గుర్తించడం జరిగింది. ఇది ముఖ్యంగా ప్రజలను విద్యా వంతులను చేసే పద్ధతి. సమాజాభివృద్ధి పథకంలో భాగంగా భారతదేశంలో దాదాపు 1920 నుంచి విస్తరణ సేవా పథకాలు ఏదో ఒక పేరుతో అమలవుతూనే ఉన్నాయి. విశ్వకవి రవీంద్రుని శ్రీనికేతన్ శిక్షణ పొందిన కార్యకర్తలు, స్పెన్సర్ హాచ్ వద్ద మార్తాండంలో శిక్షణ పొందిన కార్యకర్తలు, బరోడా, పంజాబ్, మద్రాసులో వివిధ పునర్నిర్మాణ కేంద్రాలలో పనిచేసిన కార్యకర్తలందరూ విస్తరణ పద్ధతులను ఉపయోగించినవారే.

1926 లో వ్యవసాయంపై నియమించబడిన రాయల్ కమీషన్ మొదలుకొని భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చే వరకు గ్రామాలలో అన్ని శాఖల అభివృద్ధి పథకాలను సమన్వయ పరచడానికి అనేక ప్రయత్నాలు జరిగినా 1949 లో ఆర్థిక వ్యవహారాల కమీషన్ నియమించబడే వరకు ఏవిధమైన ఏకభావ సూచనలు ఎవరూ చేసి ఉండలేదు. ఆర్థిక వ్యవహారాల కమీషన్ మొట్టమొదటిసారిగా అమెరికా, ఇంగ్లాండు దేశాలలోలాగా భారతదేశంలో కూడా విస్తరణ పథకాల అవసరం ఎంతో ఉన్నదని భావించింది. అంతేకాక, 40 లేదా 50 గ్రామాలలో ఒక ఉపపత్తి క్షేత్రం, దానిలో పనిచేయడానికి విస్తరణాధికారంతో కూడిన కొంతమంది అధికారులు నియమితులు కావాలని కూడా భావించారు. ఈ అధికారి అన్ని అభివృద్ధి శాఖలకు సంబంధించిన ఏజంటు మాత్రమే కాక, వ్యవసాయదారులతో దగ్గరి సంబంధాలు కలిగి ఉండి వారికి స్నేహితుడిగా తత్వవేత్తగా, మార్గదర్శకుడిగా వ్యవహరించాలని సూచించారు. ఆర్థిక వ్యవహారాల కమీషన్ తరువాత 1942లో నియమించిన అధిక ఆహారోత్పత్తి విచారణ సంఘం ఈ విస్తరణ సేవను విపులీకరించి గ్రామీణాభివృద్ధిని సమన్వయ పరచి వ్యవసాయదారుకు సహాయం చేయడానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని భావించింది. ఈ సంఘం వంద నుంచి 120 గ్రామాలు కలిగిన తాలూకాభివృద్ధి బ్లాకుగా ఉండడానికి వీలుగా ఉంటుందని దానికి ఒక అభివృద్ధి అధికారి గానీ, విస్తరణాధికారి గానీ నియమితుడుకావాలని కూడా భావించారు. ఈ విస్తరణాధికారులకు సహాయం చేయడానికి వ్యసాయం మొదలైన విషయాలకు సంబంధించిన సాంకేతికాధికారులు కూడా నియమితులు కావాలని భావించారు. గ్రామీణ జీవితంలోని అన్ని ఆకృతులు పరస్పర సంబంధం కలవి. వీటిలో ఏ ఒక్క ఆకృతిని వేరు చేసి దాని అభివృద్ధికి పాటుపడినా గ్రామాలలో చిరకాలాభివృద్ధిని సాధించలేము. కాబట్టి గ్రామీణ జీవితంలోని ప్రకృతి గ్రామీణ ప్రణాళికలలో ఒక భాగమై ఉండాలి. జాతీయ విస్తరణ సేవా పైన ఆశించిన ఫలితాలను సాధించడానిక కృషి చేయడం జరిగింది. ఇటువంటి ఫలితాలను సాధించడానికి రాష్ట్ర పరిపాలనా యంత్రాంగం, అధికారులు తమ శక్తినంతా ప్రజలలో ఉత్తేజాన్ని రేకెత్తించడానికి అభివృద్ధి పరచడానికి వినియోగించాలి.



BRAOU

## 16.7 జాతీయ విస్తరణ సేవా పథకం మూల సూత్రాలు

జాతీయ విస్తరణ సేవా ఉద్యమం రెండు ముఖ్య సిద్ధాంతాలను నొక్కి చెబుతుంది.

1. అభివృద్ధి సాధనకు అవసరమైన ప్రేరణాబలం ప్రజలనుంచేరావాలి, తమను తాము అభివృద్ధి చేసుకోవాలనే అభిప్రాయం ప్రజలలో కలగాలి. సామాజిక వ్యవహారాలలో కొంతవరకు ప్రభుత్వ సహాయం ఉన్నప్పటికీ, సమాజంలోని సర్వ సంస్కరణలకు స్వయం సహాయం మూలాధారం ప్రజలలో నిద్రాణమై ఉన్న శక్తి నంతా బహిర్గతం చేసి, దేశంలోని నిర్మాణాత్మక కార్యక్రమాలకు వినియోగించాలి. సమాజంలోని ప్రతి కుటుంబం మొత్తం సమాజం శ్రేయస్సుకు కృషి చేయాలి.

2. గ్రామీణ జీవితంలోని సర్వ సమస్యల పరిష్కారానికి సహకార సూత్రాలను పాటించాలి. గ్రామీణ ప్రాంతంలోని లక్షల కొద్దీ రైతు కుటుంబాలన్నీ కలిసి, వ్యవసాయ రంగంలోనే కాకుండా, కుటీర పరిశ్రమలను కూడా సహకార రంగంలోనే నిర్వహించుకోవచ్చు. ఈ సహకార విధానాలకు ప్రభుత్వం కూడా కొంత సహాయం చేస్తుంది.

గ్రామసీమలో కేంద్రీకృత అభివృద్ధిని సాధించి, ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలితాలను అందించి, గ్రామీణ జీవితంలో సర్వతోముఖాభివృద్ధిని సాధించడమే జాతీయ విస్తరణ సేవా పథకం ప్రధానలక్ష్యం. 1953వ సంవత్సరంలో ప్రారంభించిన విస్తరణ సేవా పథకం క్రిందకు తృతీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో దేశం మొత్తం వచ్చింది.

గ్రామీణ ప్రజలకు కేవలం తిండి బట్టలు గృహవసతి ఆరోగ్యం మొదలయిన సదుపాయాలను సమృద్ధిగా సమకూర్చడం మాత్రమే ఈ పథకం ధ్యేయం కాదు. ప్రజల దృక్పథంలో ఒక వినూత్నమయిన మార్పును ప్రవేశపెట్టి వారి భావి సుఖమయ జీవితానికి, జీవన ప్రమాణాలను అభివృద్ధి పరచడానికి ధృఢ సంకల్పాన్ని ప్రజలలో కలిగించి ఆ లక్ష్య సాధనకు వారిని కార్యోన్ముఖులను చేయడమే ఈ జాతీయ విస్తరణ సేవా పథకం యొక్క ముఖ్యోద్దేశం.

BRAOU

## 16.8 విస్తరణ పద్ధతులు

అంతర్జాతీయ ఆహార వ్యవసాయ సంస్థ 1959లో విస్తరణ మీద తయారు చేసిన నివేదికలో విస్తరణ పద్ధతులను, విధులను చాలా చక్కగా సంక్షిప్తపరిచింది.

విస్తరణ లేదా సలహాసేవలు గానీ దానికి సంబంధించిన వ్యవసాయం, గృహ సంబంధవిషయాలపై కొన్ని అనివార్యమైన విధులను నిర్వర్తించాలి. అవి నాణ్యత, ధర, పరిమాణం మొదలయిన విషయాలపై పరిశోధనలు జరిపి ఫలితాలను వ్యవసాయ దారులకు అందచేయడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులను నేర్పడం, పరిశోధనా సంస్థలకు ఏ ఏ వ్యవసాయ పద్ధతులలో, ఏఏ కుటుంబ సమస్యలపై పరిశోధనలు జరుపవలెనో తెలియజేయడం వ్యవసాయ దారులు ఒకరినొకరు అప్పుడప్పుడు కలుసుకోవడానికి వీలు కల్పించి తద్వారా ఒక్కొక్కరి అనుభవాలను అందరూ పంచుకోవడానికి వీలు కల్పించడం, వ్యసాయ విషయాలలో నాయకత్వాన్ని పెంపొందించడం. ఈ విధంగా విస్తరణ ఎప్పుడూ జరుగుతూ ఉండే ఒక ప్రక్రియ. ఇది ప్రజలు తమ సమస్యలను గుర్తించేటట్లు చేసి వాటిని ఏ విధంగా పరిష్కరించుకోవాలో కూడా తెలియపరుస్తుంది. ఈ విధంగా విస్తరణ ప్రజలు తమ సమస్యలను గుర్తించేటట్లు చేసి వాటి పరిష్కార ఉత్తేజాన్ని ప్రేరేపించి వారు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేటట్లు చేస్తుంది. విస్తరణ ముఖ్యంగా పెద్ద వాళ్ళను, యువజనులను సాధారణ విద్యావంతులను చేసే పద్ధతి. కొన్ని ప్రత్యేక పద్ధతులు సరైన మార్గానుసరణ ద్వారా ప్రజలు విజ్ఞాన శాస్త్రాన్ని తమ దిన చర్యలను వ్యవసాయంలోను, గృహంలోను, సమాజంలోను ఉపయోగిస్తూ తమకు తామే సహాయపడే పద్ధతి.

జాతీయ విస్తరణ సేవా ఉద్యమం గ్రామీణ పరిస్థితులలో మార్పును, అభివృద్ధిని తీసుకొని రావడానికి మూడు పద్ధతులను ఉపయోగిస్తుంది.

మొదటిది వ్యవసాయం పశుపోషణ, చేపల పెంపకం మొదలైన విషయాలలో శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించడం ద్వారా కుటీర పరిశ్రమలు మొదలైన వాటిని ఏర్పరచడం ద్వారా అధికోత్పత్తిని, ఎక్కువ ఉద్యోగావకాశాలను కల్పించడం.

రెండవది స్వయం సహాయ స్వశక్తి మీద ఆధారపడడం స్వావలంబన సహకార సిద్ధాంతాలను ఎక్కువగా ఉపయోగించడం.

మూడవది గ్రామాలలో ఉపయోగించకుండా ఉన్న సమయాన్ని, వనరులను సమాజాభివృద్ధికి వెచ్చించడం.

పైన పేర్కొన్న పద్ధతులను, విధులను నిర్వర్తించడానికి జాతీయ విస్తరణ సేవా పథకాలకు కావలసిన పరిపాలనా వ్యవస్థ నిర్మాణాన్ని గురించి, అధిక ఆహార ఉత్పత్తి విచారణ సంఘం నివేదిక లోను, ప్రథమ పంచవర్ష ప్రణాళికలోను విపులంగా వివరించడం జరిగింది. ప్రతి రాష్ట్రంలోను, రాష్ట్ర స్థాయిలోను జాతీయ విస్తరణ సేవా పథకాలను అమలు పరచడంలోను అవలంబించవలసిన సిద్ధాంతాలను విపులీకరించడానికి ఒక రాష్ట్ర అభివృద్ధి సంఘం ఉంది. దీనిలో ముఖ్యమంత్రి, ఇతర అభివృద్ధి శాఖలకు చెందిన మంత్రులు సభ్యులు. ఇది కాక అధికారులతో కూడాన వేరొక సంఘం ఉంది. ఈ రెండింటికీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి వరసగా అధ్యక్షులు. అభివృద్ధి శాఖల కార్యక్రమాలను సమన్వయపరచడానికి ఒక అభివృద్ధి కమీషన్ కూడా ఉన్నది. అధికారస్థాయిలో అభివృద్ధి శాఖల కార్యదర్శుల బృందానికి అభివృద్ధి కమీషనర్ సమన్వయ కర్తగా వ్యవహరిస్తాడు. రాష్ట్రప్రణాళికలో నిర్దేశించిన అభివృద్ధి కార్యక్రమాలను జాప్యం లేకుండా కొనసాగించవలెనంటే అభివృద్ధి కమీషన్ వివిధ అభివృద్ధి శాఖా కార్యదర్శుల మధ్య సన్నిహిత సంబంధం ఉండాలి.

జాతీయ విస్తరణా సేవా పథకలాను అమలుజరిపే కార్యక్రమంలో జిల్లా స్థాయినుంచి, గ్రామస్థాయి వరకు అధికారులందరూ బాధ్యత వహిస్తారు. జాతీయ విస్తరణ సేవా పరిపాలనా వ్యవస్థలో గ్రామస్థాయి సేవకుడు చివరివాడు. సాంకేతిక విషయాలలో, వివిధస్థాయిలలో పనిచేసే సాంకేతిక అధికారులనుంచి సమాచార సలహాలను స్వీకరిస్తూ, గ్రామ స్థాయి సేవకుడు గ్రామ ప్రజలకు సర్వదా సహాయకారిగా ఉంటాడు.

విస్తరణ పరిపాలనా వ్యవస్థలో చాలా వరకు సాధారణ అధికారులకే అభివృద్ధి బాధ్యతలు ఇవ్వడం కూడా జరిగింది దీని ముఖ్యోద్దేశం ప్రత్యేక సంక్షేమ తరగతి ఏర్పడటం కంటే, ప్రస్తుతం ఉన్న సాధారణ పరిపాలనా యంత్రాంగాన్నే సంక్షేమ తరగతిగా మార్చడమే. దీనివలన ఒకప్పుడు రెవెన్యూ పరిపాలన, శాంతి భద్రతలకు సంబంధించిన విధులు నిర్వహించే అధికారులు సమాజాభివృద్ధిలో అభివృద్ధి కార్యక్రమాలకు కూడా బాధ్యులవుతారు. వీళ్ళందరూ తమ శక్తి నంతటినీ గ్రామాభివృద్ధికి సంపూర్ణంగా ఉపయోగించాలి.

జాతీయ విస్తరణ సేవా కార్యక్రమాలలో అధికార వ్యవస్థతోపాటు, అనధికార నాయకత్వం కూడా ముఖ్యమయినది. ప్రతిస్థాయిలోనూ అధికారుల మధ్య సహకారం అవసరం. అంతేకాక, అభివృద్ధి కార్యక్రమాలన్నింటినీ ప్రజలతోను, ప్రజానాయకులతోనూ దీర్ఘంగా ఆలోచించి తయారు చేయాలి. ప్రణాళికల తయారీలోనూ, వాటిని అమలుపరచడంలోనూ ప్రజలు పాల్గొనేటట్లు చేయడమే జాతీయ విస్తరణసేవ ముఖ్యోద్దేశం.

ముందు చెప్పినట్లుగా జాతీయ విస్తరణ సేవ ప్రజలు తమ సమస్యలను గుర్తెరిగేటట్లు చేసి, వారు వాటిని ఏ విధంగా పరిష్కరించుకోవాలో తెలియజేస్తుంది. ఇది ప్రజలను అభివృద్ధి సాధనకు ఉత్తేజితులను చేసి స్పష్టమైన చర్యలకోసం ఉపయుక్తులు గల అధికారులేకాక, శ్రద్ధతో పనిచేసే అధికారులు చాలా అవసరం. జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం రాష్ట్రస్థాయి నుంచి గ్రామ స్థాయివరకు, ప్రతి దశలోనూ అనధికార నాయకుల సలహా సహకారాలతో పనిచేస్తుంది. జాతీయ విస్తరణ సేవా పథకం అధికార, అనధికార వ్యవస్థల అపూర్వ సహకారం సమ్మేళనం వంటిది. ప్రజలతోను, ప్రజా ప్రతినిధులతో పూర్తిగా సంప్రదించిన తరువాతనే ప్రభుత్వం జాతీయ విస్తరణ సేవాకార్యక్రమం నియమావళిని రూపొందిస్తుంది. గ్రామస్థాయిలో అభివృద్ధి ప్రణాళికల కార్యక్రమాలను గ్రామ పంచాయితీలు అమలుజరుపుతాయి.



BRAOU

ఈ విధంగా ప్రతి దశలోనూ అధికార, అనధికార సంస్థలు పరస్పర సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించి అమలు పరుస్తాయి. ఇట్లా జాతీయ విస్తరణ సేవా ఉద్యమం, స్వయం సహాయ సిద్ధాంతం పై ఆధారపడి రూపొంది, సామాజికాభివృద్ధి కృషికి తోడ్పడుతున్నది.

జాతీయ విస్తరణ సేవ లక్షలాది ప్రజల దృక్పథంలో మార్పును తీసుకొని వచ్చి, వారి అభివృద్ధి పథకాలలో సహాయం చేస్తుంది. ఇది సంక్షేమ రాజ్యం లక్ష్యాలను సాధించడంలో సహాయపడుతుంది. ఇతర దేశాలలో ప్రజలు ఈ ప్రాతిపదికపైనే అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నా భారతదేశంలో జరుగుతున్నంత పెద్ద ఎత్తున ఏ దేశంలోనూ జరగలేదు. ముఖ్యంగా జాతీయ విస్తరణ సేవ ఎప్పటికీ ప్రభావంతోనూ, గతిశీలత తోనూ పనిచేస్తూ ప్రజల కొత్త అవసరాలను తీరుస్తూ, కొత్త పద్ధతులను అవలంబిస్తూ నూతనత్వం పోకుండా సమాజపు అభివృద్ధికి, వికాసానికి కృషి చేస్తుంది.

## 16.9 ముగింపు

భారతదేశానికి సాముదాయిక అభివృద్ధి అనేది ఒక కొత్తపదం ఇప్పటి వరకు మనం గ్రామీణాభివృద్ధి తదితర పద్ధతులను విని ఉన్నాం కానీ సాముదాయిక అభివృద్ధి విని వుండలేదు. భారత దేశంలాంటి సువిశాల దేశంలో సాముదాయిక అభివృద్ధి లాంటి పద్ధతులు సువిశాల పరిధిలో ఫలితాలను ఇస్తాయి. గ్రామీణ ప్రాంతా లు విస్తరించి ఉన్న భారతదేశంలో అభివృద్ధిని విస్తరించవలసి ఉన్నది. విస్తరణ లక్ష్యాలను, సూత్రాలను ఈ పాఠంలో మీరు తెలుసుకున్నారు.

BRAOU

## 16.10 మాదిరి పరీక్ష ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబురాయండి?**

1. విస్తరణ అనగానేమి? వివరించండి?
2. సాముదాయిక అభివృద్ధి భావనను వివరించండి?
3. విస్తరణా పద్ధతులను వివరించండి?

**II. ఈ క్రింద ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.**

1. విస్తరణా సూత్రాలు ఏవి?
2. విస్తరణ లక్ష్యాలు ఏవి?
3. భారత దేశానికి సాముదాయిక అభివృద్ధి అవసరం? చర్చించండి.

## 16.11 చదవదగిన పుస్తకాలు


1. Betrand Russels : Principles of Social Re construction.
2. J.R. Batan : Communitees and Development.
3. Lumees and Beenil: Rural Sociology-De Stratagy Change.
4. A.R. Deshai : Rural Socialogy in India.
5. Dharma, O.P. : Extension and Rural Welfare.

BRAOU

# ఖండం- V

## వ్యక్తి సమస్యలు: దృక్కోణాలు

సామాజిక సంక్షేమంలో సమస్య నిర్ధారణకు ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. సమస్య వ్యక్తివల్ల అయినట్టయితే ఆ వ్యక్తిలో ఉన్న అపసవ్యతను తొలగించేందుకు అతని ఆలోచనా దృక్పథాన్ని మార్చేందుకు ప్రయత్నం చేయాలి. అందుకు ముందుగా వ్యక్తి సమస్యను నిర్ధారించాలి. అతని మానసిక, సామాజిక ఆలోచనా ధోరణిని అర్థం చేసుకోవాలి. సరైన మార్గదర్శకత్వం, కౌన్సెలింగ్ ద్వారా ఆలోచనా ధోరణిని మార్చి సామాజిక ఆలోచనా ధోరణికి అనుగుణంగా అతనిని నడిచే విధంగా తయారు చేయాలి. తద్వారా సామాజిక అవ్యవస్థత తలెత్తకుండా జాగ్రత్తపడే అవకాశం, సమాజాన్ని రక్షించుకునే అవకాశం కలుగుతుంది.

ఈ ఖండం వ్యక్తి సమస్యలు-పరిష్కార ధోరణులకు సంబంధించిన విషయాలను చర్చిస్తుంది. ఇందులో మూడు భాగాలున్నాయి. అవి:

- **భాగం-17:** కేసు అధ్యయనం-సమస్య నిర్ధారణ
- **భాగం-18:** మనో సాంఘిక విశ్లేషణ, వ్యక్తి సమస్య పరిష్కారానికి మూల సూత్రాలు
- **భాగం-19:** మార్గదర్శకత, కౌన్సెలింగ్: సూత్రాలు

BRAOU

BRAOU

# భాగం-17: కేసు అధ్యయనం-సమస్య నిర్ధారణ

విషయక్రమం

17.0 ఉద్దేశాలు

17.1 పరిచయం

17.2 కేసు పరిశీలన

17.2.1 వ్యతిరిక్తత

17.2.2 గృహ సందర్శన అధ్యయనం

17.2.3 ఇతర ఆధారాలు

17.2.4 మానసిక-అనువంశిక చరిత్ర

17.3 సమస్య నిర్ధారణ

17.4 సేవార్థి సామర్థ్యం

17.5 చికిత్స-విధానం

17.6 చికిత్స లక్ష్యాలు

17.7 చికిత్స ప్రక్రియ

17.8 చికిత్స విధానాలు

17.9 కౌన్సెలింగ్

17.10 ముగింపు

17.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

17.12 చదవదగిన పుస్తకాలు

BRAOU

## 17.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సామాజిక కార్యాచరణలో క్షేత్ర పరిశీలన స్థాయిలో కేసును అధ్యయనం చేసే మార్గాలను తెలుసుకుంటారు.
- సోషల్‌వర్క్‌లో వ్యక్తికి సమస్యలు ఏర్పడినప్పుడు పరిష్కార పద్ధతులను అవగాహన చేసుకుంటారు.

## 17.1 పరిచయం

ఒక సేవా సంస్థను సేవార్థి తన సమస్య పరిష్కారం కోసం అర్థిస్తాడు. స్వచ్ఛంద సంస్థ కార్యకర్త కార్యాలయంలో ఉండి ఆ సేవార్థి సమస్య వివరాలు సేకరిస్తాడు. అయినా ఆ వ్యక్తి సమస్య పూర్తిగా అవగాహన కానప్పుడు.. కార్యకర్త, సేవార్థి సమస్యగల కార్యక్షేత్రానికి వెళ్లి సమస్యను అధ్యయనం చేస్తాడు. దీన్నే కేస్ స్టడీ కేసు అధ్యయనం అంటారు. సమస్య మూలకారణాన్ని గుర్తించడాన్ని సమస్యా నిర్ధారణ (డయాగ్నసిస్) అంటారు. ఇక కార్యక్షేత్రం స్థాయిలో సేవార్థితోపాటు పాల్గొని సమస్యను నిర్ధారించిన అనంతరం, సేవార్థి తన సమస్యను తాను గుర్తించేట్టు చేసి, అతని

సమస్యను అతడే పరిష్కరించుకునేట్టు చేయడాన్నే ఈ క్రమంలో చికిత్స అంటారు. వ్యక్తి సమస్యల పరిష్కార మార్గాలలో ఈ ప్రక్రియ ప్రధాన పాత్ర వహిస్తుంది.

సమస్యలకు గురయినవాళ్లు ఎవరైనా అంటే ఏ వయస్కులైనా, ఏ నేపథ్యం గలవారయినా కార్యకర్త, కేసును అంగీకరించి పరిశీలన ప్రారంభిస్తాడు. సేవార్థి సమస్యను సామాజిక, ఆర్థిక, భౌతిక, మానసిక కోణాలనుంచి పరిశీలించి, సమస్య కారణాలను వెతకడానికి ప్రయత్నిస్తాడు. ఆవిధంగా కేసు పూర్వాపరాలు పరిశీలించి, ఈ కేసులో గల పరస్పర సంబంధాలను మెరుగుపరచడం ద్వారా సేవార్థి కేసు పరిష్కరించుకోవడానికి సామాజిక సేవా కార్యకర్త సహాయపడతాడు. అయితే ఇక్కడ కార్యకర్త  కేవలం సేవార్థికి సేవలు అందించి, అతని సమస్య పరిష్కారంలో తోడ్పడతాడే తప్ప స్వయంగా నిరంకుశుడుకాడు. నాయకుడు కూడా కాదు. తాను సేవార్థికి సేవలు అందించినందుకు గాను కార్యకర్త గొప్ప పని చేసినట్టు గర్వపడడు. ఈ సేవ అంతా వృత్తి కార్యకర్తగా, వృత్తి ధర్మం నిర్వర్తించినట్టు మాత్రమే భావిస్తాడు.

## 17.2 కేసు పరిశీలన

కేసు పరిశీలనలో అతి ముఖ్యమైనది ఆ వ్యక్తి గురించిన సమగ్ర పరిశీలన. ఒక సేవార్థి గురించి శాస్త్రీయ పరిశీలన జరపాలి. సామాజిక వివరాల అధ్యయనాన్ని శాస్త్రీయంగా నిర్వర్తించాలి. సమస్య గురించి, దానికి సంబంధించిన వివిధ అంశాలను కూడా అధ్యయనం చేయాలి. సేవార్థి వయస్సు, లింగ భేదం, వివాహస్థితి, ఉద్యోగ వివరాలు, ఆదాయం, ఆరోగ్య పరిస్థితులు, మూర్తిమత్వ వివరాలు, ఇల్లు, పరిసరాల వివరాలు, కుటుంబ వివరాలు, కుటుంబ చరిత్ర-అచరిత్రలో ముఖ్యమైన సంఘటనలు, కుటుంబ సభ్యుల ఆంతర్యాలు వారి మధ్యగల సంబంధ బాంధవ్యాలు, పూర్తిగా తెలుసుకోవాలి. .

ప్రతీ కేసుకు అంటే ప్రతీ సేవార్థి గురించి అన్ని వివరాలు అవసరం లేదు. అవసరమైన చోట ఒకే ఇంటర్వ్యూతో అన్ని వివరాలు రావు. రెండు మూడు సార్లు సమస్య గల వ్యక్తితో మాట్లాడి తెలుసుకోవాలి. ఆ వ్యక్తి మూర్తిమత్వం సభ్యుల ఆంతర్యాలు, సంబంధ బాంధవ్యాలు ఒకేరోజున తెలియవు. సేవార్థితోనూ, అతని కుటుంబ సభ్యులతోనూ పరిచయం పెరిగిన కొద్దీ, నెమ్మదిగా అన్ని వివరాలు తెలుస్తాయి.

పిల్లల కేసులయితే, వారి పాఠశాల గురించిన వివరాలు (చదువు మొదలుపెట్టినప్పటినుంచి ఇప్పటిదాకా) స్కూలు గురించి ఆ పిల్లవాని అభిప్రాయాలు, చదువు ఎలా చదువుతున్నది(academic performance) నడత, స్కూలు టీచర్లతో విద్యార్థులతో అతని సంబంధాలు అధ్యయనం చేయాలి.

ప్రత్యక్షంగా సేవార్థి నుంచి వివరాలు సేకరించవచ్చు. లేదా అతని కుటుంబ సభ్యుల నుంచి కూడా విషయ సేకరణ చేయవచ్చు. అలా కాకుండా ఇతర వనరుల ద్వారా కూడా విషయ సేకరణ చేయవచ్చు. సేవార్థి ఉద్యోగస్తుడయినప్పుడు అతని యజమాని నుంచి, సహోద్యోగులనుంచి, రికార్డులనుంచి, ఉత్తరాల నుంచి వివరాలు సంపాదించినప్పుడు దానిని 'కోల్లేటరల్ సోర్సెస్' (ఇతర వనరులనుంచి) విషయ సేకరణగా భావిస్తాము.

సేవార్థికి కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పడం ఇష్టముండదు. అయినప్పటికీ అతని మేలుకోరి అతని సమస్య పరిష్కారానికి మనం విషయాలను రాబట్టాలి. పూర్వం ఇటువంటి సమస్య వచ్చినపుడు ఎలా పరిష్కరించుకున్నదీ తెలుసుకోవాలి. సమస్య ఎప్పుడు మొదలైందీ, ఎలా మొదలైందీ, ఏ అంశాలు ఆ సమస్యను బయటికి తెచ్చాయి, దానిని సేవార్థి ఎలా పరిష్కరించుకొన్నదీ తెలుసుకోవాలి. అనుభవం ఉన్న కార్యకర్త వివరాలు చాలా తొందరగా తెలుసుకోవడానికి అవకాశం ఉన్నది. సమస్యకు సంబంధించిన సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలు వివరంగా తెలుసుకోవాలి. ఈ వివరాలే తర్వాత సమస్య నిర్ధారణకు, చికిత్సకు మూల ఆధారంగా ఉపయోగపడతాయి. సేవార్థి ఈ సమస్యను పూర్వం ఎలా పరిష్కరించాడు అన్నది తెలుసుకుంటే మనం మళ్లీ ఆ మార్గంలో ప్రయత్నించి విఫలమయ్యే ప్రమాదం తప్పుతుంది.

BRAOU

ఇంటర్వ్యూ వలన విషయ సేకరణ కొరకు మాత్రమే కాదు.. సేవార్థి తన సమస్యను పరిష్కరించుకోవడానికి ప్రేరణ, తెలియని విషయాలు తెలుసుకోవడం ఈ ఇంటర్వ్యూ వలన వీలవుతుంది. వ్యక్తుల ప్రవర్తనను పరిశీలించడానికి ఇంటర్వ్యూ సహకరిస్తుంది. ఈ అధ్యయనంతోనే సేవార్థి భావాలను, సంఘర్షణను, మానసిక వేదనలను, గాయాలను, అంతర్‌విషయాలను, తన పరిసరాలలోని కుటుంబ సభ్యులు, సహోద్యోగులతో ఎదురయిన సమస్యలను పూర్తిగా తెలుసుకోవాలి. అయితే పరిశీలనలేని ఇంటర్వ్యూ ఉపయోగంలేదు. ఇంకా ఇంటర్వ్యూలేని పరిశీలన ఒక విధంగా విషయాలను బాగా తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది.

## 17.2.1 వ్యతిరిక్తత

వివరాలు సేకరించేటపుడు సేవార్థి నిశ్శబ్దం, వ్యతిరిక్తత, ఇతరుల మీదికి కారణాన్ని తోసేయడం మనం గమనించినప్పుడు, అతని మనసు అంతచ్ఛేదంలోని సమస్యను, కారణాలను, తెలుసుకునే నేర్పును మనం సంపాదించాలి. సేవార్థి సమాచారం ఇవ్వడానికి నిరాకరించే విషయాన్ని అర్థం చేసుకొని నివారించే ప్రయత్నం చేయాలి. సుశిక్షితమైన చూపు, వినికిడితో విషయాన్ని తొందరగా అర్థం చేసుకొనే అవకాశం ఉంది. అతని సమర్థత లేదా ఆధారపడే మనస్తత్వం, అతని భయాలు, విసుగు, చికాకు అతనిలోని నిరాకరణ, తిరుగుబాటు ధోరణిని మనం అర్థం చేసుకొని అతను తన పరిసరాలతో సర్దుబాటుకావడానికి ఆ వివరాలను వాడుకోవాలి.

సేవార్థి చెప్పిన చిన్న చిన్న ముక్కలను కూర్చి వాటిని వరుస క్రమంలో అతికించి, ఒక ఆకృతినిచ్చి అతని సమస్యను అర్థం చేసుకొని సమస్య పరిష్కారం దిశగా పురోగమించాలి. సేవార్థి ఆర్థిక విషయాలను కూడా పూర్తిగా అధ్యయనం చేయాలి. అతని జీవన ప్రమాణాలు వ్యక్తిగతమైన సాంస్కృతికపరమైన ప్రవర్తనను అర్థం చేసుకోవాలి.

ఈ రకమైన అధ్యయనానికి రెండు ఉపయోగాలున్నాయి. అవి:

1. సమస్య పరిష్కారానికి ముందు సమస్య నిర్ధారణ కోసం విషయాన్ని అధ్యయనం చేయాలి.
2. విషయ సేకరణ సమయంలోనే విషయాన్ని బయటకు చెప్పడం వలన, సమస్యకు సంబంధించిన బాధ, బెంగ, విచారం తగ్గి విషయాన్ని సరిగ్గా నిర్మాణాత్మకంగా ఆలోచించే శక్తి సేవార్థికి కలుగుతుంది.

BRAOU

వ్యక్తి బాల్యానుభవాలు, కుటుంబంతో అతనికిగల అనుబంధం, అలాగే ఇతర సాంఘిక సమూహాలతో గల అనుబంధాలను తెలుసుకోవాలి. కొన్ని పరిస్థితులలో సర్దుబాటు చేసుకోలేని సమస్యలను పరిష్కరించాల్సి వస్తుంది. కార్యకారక సంబంధాన్ని అర్థం చేసుకోవాలి. ముఖ్యమైన విషయం ఏమిటంటే తల్లి, బిడ్డల అనుబంధం అర్థం చేసుకోవాలి. కొన్ని చోట్ల వివాహ సంబంధాలను అధ్యయనం చేయాలి. ఉద్యోగ సమస్య అయితే ఆవివరాలు, వైద్య సంబంధమైన సమస్య అయితే ఆరోగ్య విషయాలు సేకరణ చేయాలి.

## 17.2.2 గృహ సందర్శన-అధ్యయనం

సేవార్థి ఇంటిని సందర్శించి విషయ సేకరణ చేయాలి. కార్యాలయాలకన్నా సేవార్థి ఇల్లు, అరమరికలు లేకుండా మాట్లాడుకోవడానికి అవకాశం ఇస్తుంది. అతని ఇల్లు, స్కూలు, ఆస్పత్రి, పనిచేసే కార్యాలయం, స్నేహితులు, ఇరుగుపొరుగువారు, బంధువులు మొదలైనవారు అతని మొత్తం సాంఘిక ప్రపంచం. వ్యక్తి ఇంటి వద్ద కలిసి సమస్యకు సంబంధించిన విషయాల సేకరణకు మించిన పద్ధతిలేదు. దీర్ఘరోగి, చిన్న బాలుడులాంటి కేసులో ఇంటివద్ద విషయసేకరణ చేయడం చాలా అవసరం. నిరుద్యోగి సమస్య పరిష్కారానికి గృహ సందర్శనం అంతగా అవసరంలేదు. కొందరు సేవార్థుల ఇంటికి మనం వెళ్లినట్లయితే వారు తమ సమస్య ఇరుగుపొరుగుకి తెలిసి, వారు తమని చులకనగా చూస్తారేమోనని భయపడతారు. అందువల్ల సామాజిక కార్యకర్త సేవార్థి ఇంటి సందర్శనను అసౌకర్యంగా భావిస్తాడు.

కార్యాలయంలో కొందరు సేవార్థులు విషయాన్ని చెప్పడం సౌకర్యంగా భావిస్తారు. స్నేహితులు, బంధువులు జోక్యం చేసుకోరనే భావన వీరిలో ఉంటుంది. ఒక్కొక్కప్పుడు వ్యక్తికి ఒక్కరుగాక, సమూహంలో పరిశీలించినప్పుడు,

వారి గురించి ఎక్కువ వివరాలు తెలుసుకోగలుగుతాము. తల్లి, బిడ్డలను, స్కూలు పిల్లల ప్రవర్తన, వార్డులో రోగుల ప్రవర్తన స్వయంగా చూసినప్పుడే సమూహ సభ్యుడు ఎలా ప్రవర్తించేదీ తెలుసుకోగలుగుతాము.

ఒక పిల్లవానిని పరిశీలించి అతని సమస్యను అధ్యయనం చేయడం కంటే పిల్లలను సమూహంగా ఆటపాటల సమయంలో పరిశీలన చేయడంలో ఎక్కువ వివరాలను తెలుసుకోగలం. ఆటల సమయంలో ఇంటర్వ్యూ చేసి, ఆటలోని చిహ్నాలను, ప్రతీకలను, ప్రవర్తనలను గమనించి అర్థం చేసుకోవాచ్చు. తల్లిదండ్రులు చెప్పిన విషయాలే కాకుండాపిల్లవాని అనుభవాలనుంచి మరిన్ని అంశాలను, ఆటపాటల ముఖాముఖి విషయ సేకరణ ద్వారా సేకరించి, పిల్లవాని సమస్యను అర్థం చేసుకోవాలి. కార్యకర్త ఆటలో పాల్గొనకుండా అక్కడి వాతావరణంలో సమూహంలో పక్షపాత రహితంగా పరిశీలించడానికి ప్రయత్నించాలి. వేగంగా ఆడే ఆటలు, ఆటలో పోట్లాటలు, బొమ్మలాట ద్వారాను, ఈరకమయిన పరిశీలన జరపవచ్చు. చిన్న పిల్లల సమస్యను ఆటల ద్వారానూ, కొంచెం పెద్ద పిల్లల భావాలను చెప్పుకోవడం ద్వారానూ ప్రోత్సహించాలి.

## 17.2.3 ఇతర ఆధారాలు

స్కూలు, ఆస్పత్రి, యజమానులు, కార్మిక సంఘాలు, కోర్టులు, బంధువులకు బ్యాంకులు మొదలైన సామాజిక సంస్థల సందర్శనతో లేక ఉత్తరాలు, లేక ఫోన్‌ద్వారా విషయ సేకరణ జరపడాన్ని ఇందుకోసం ఉపయోగపడే ఇతర ఆధారాలు (కొల్లేటరల్ సోర్సెస్) అంటారు.

సామాజిక సమస్యలు కొంచెం క్లిష్టమైనవి. జటిలమైనవి. కనుక చాలా సంస్థలతో ప్రయత్నించినప్పుడు మాత్రమే పరిష్కారం సాధ్యపడుతుంది.

ఉదాహరణకు మానసిక స్వస్థత కోసం ప్రయత్నించే సేవార్థికి సంబంధించిన వైవాహిక సంబంధమైన సమస్యలు దానికి సంబంధించిన పరిస్థితులు, వైవాహిక చరిత్ర లైంగిక విషయాలలో సర్దుబాటు, వివాహానికి సంబంధించిన ఆర్థిక, సాంఘిక అంశాలను పరిశీలించాలి. సలహాలను చెప్పాలి. సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించాలి.

## 17.2.4 మానసిక అనువంశిక చరిత్ర

శిశు మార్గదర్శక కేంద్రాలలో పిల్లల నడతను అర్థం చేసుకొని, పిల్లల అభివృద్ధి, పెరుగుదల క్రమం తెలుసుకొని అందులోని లోపాలను సరిచేయవలసిన అవసరం ఉన్నది. నిరుద్యోగ సమస్య లేదా మరేదైనా సమస్య పరిష్కరించడానికి యధార్థ విషయాలు యధాతథంగా తెలుసుకోవాలి.

సమస్యాపరిష్కారంలో కుటుంబం పాత్ర చాలా ముఖ్యమైనది. వ్యక్తిని అర్థం చేసుకోవడానికి అతని సంస్కృతిని కూడా అర్థం చేసుకోవాలి. డోనాల్డ్ చెప్పినట్లు 'సమూహం మరియు ఒకడు' ఇక్కడ ప్రస్తావించాలి. వ్యక్తిని అతని సమూహం నుండి విడదీసి అర్థం చేసుకోలేము. వ్యక్తి కులం, మతం, ఆర్థికస్థితికి సంబంధించిన వివరాలు సేకరించాలి. సమస్య పరిష్కరించడానికి ప్రయత్నించాలి. విషయసేకరణకు చాలా నిపుణత కలిగి వుండాలి. విషయసేకరణ తగిన పద్ధతిలో చేయాలి. వృత్తిపరమైన క్రమశిక్షణతో శిక్షణ పొందిన కార్యకర్త ఈ విషయ సేకరణ చేయాలి. వ్యక్తుల మధ్య సంబంధాలు, అంతర్యాలు, ప్రవర్తనలు, మనం తప్పనిసరిగా అవగాహన చేసుకోవాలి.

ఎప్పుడు అసలు సమస్య ఏదో దాంతో మొదలుపెట్టాలి. ఒక వ్యక్తి ఇప్పటి ప్రవర్తన ఎన్నాళ్లుగా ఉన్నది, దానికి సంబంధించిన చరిత్ర, ఎప్పుడు సమస్య మొదలైనది, దాని వలన ఎవరికి నష్టం కలుగుతోంది, కుటుంబం, దాని సభ్యులు సమస్యను ఎలా పరిష్కరించడానికి ప్రయత్నించారు అన్న విషయాలు వివరంగా తెలుసుకోవాలి.

పెరుగుతున్న చరిత్ర-పుట్టుక, ఆహారం, ఆహార్యం, అలవాట్లు, నడక, కాలకృత్యాల శిక్షణ ముఖ్యమైన ప్రవర్తన వివరాలు, ఆట, ఉద్రేకాలు, భయాలు, నలతలు, గుణాలు, లక్షణాలు, పాఠశాలలో చదువు, అభివృద్ధి, రోగాలు, ప్రమాదాలు, లోపాలు తెలుసుకోవాలి. కుటుంబ వివరాలు, సాంస్కృతిక, ఆర్థిక స్థితులు, కుటుంబ సంబంధాలు, అంతర్యాలు, చిన్నప్పుడే తల్లిదండ్రులకు దూరమయిన సంఘటనలు, ఇంటిలోని పరిస్థితులు, అక్కా చెల్లెళ్లు, అన్న

దమ్ములతో సంబంధాలు వైవాహిక సంబంధాలు, అసక్తులు, ప్రతిభా పాటవాలు మొదలైన వివరాలు సేకరించాలి. విషయ సేకరణ అయ్యాక సంవత్సరాలవారీగా, వివిధ అంశాలను తరగతులవారీగా విభజించి అమర్చుకోవాలి. సమగ్రమయిన పరిశీలనను తయారు చేయాలి.

## 17.3 సమస్య-నిర్ధారణ

సామాజిక పరిస్థితులు, సేవార్థి మూర్తిమత్వం, పూర్తిగా అర్థం చేసుకున్నప్పుడు, సమస్యకు కారణాలు అర్థమవుతాయి. అలా కారణ కారకాలు తెలుసుకోవడమే నిర్ధారణ లేదా నిదానం అని పిలుస్తారు. నిదానం అనగా

1. సాంఘిక, మానసిక అశాంతితో విపులీకరణ.
2. ఇతర యదార్థ విషయాలు.
3. మార్పు, పునశ్చరణ అవసరమయినప్పుడు, వాటిని అమలు చేసిన విశదీకరణ.

### 17.3.1 సమస్య నిర్ధారణ-సారం

1. సమస్య స్వభావం ఏమిటి? వ్యక్తుల మధ్య సంబంధాలలో సేవార్థి లక్ష్యం ఏమిటి?
2. సమస్యగల వ్యక్తి స్వభావం ఏమిటి?
3. సంస్థ లక్ష్యం ఏమిటి? ఏరకమైన సహాయాన్ని ఏవిధంగా సంస్థ స్వాస్థతకోసం ఇస్తున్నది.

### సమస్య నిర్ధారణ క్రమం

సేవార్థిని ఇంటర్వ్యూ చేసి, సంస్థ నివేదికల రికార్డులు పరిశీలించి, మిగిలిన చికిత్స జట్టుతో చర్చించి సేవార్థి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించాలి. విషయాన్ని వివరంగా తెలుసుకోవడం సామాజిక కార్యకర్త నిపుణత మీద, ప్రతికేసునూ ప్రత్యేకించి పరిశీలన చేయడం ద్వారా, సేవార్థిని అంగీకరించడం ద్వారా, భావ ప్రసారం సరిగ్గా ఉండడం వలన విషయ సేకరణ బాగా జరుగుతుంది.

BRAOU

### సమస్య నిర్ధారణ-అంచనా

సమస్య స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. దానిలో వివిధ అంశాలను పరిశీలించాలి. సమస్యకు కారణమయిన అంశాలను గుర్తించాలి.

#### 1. భౌతిక అంశాలు

శారీరక అనారోగ్యం కనుక సమస్య అయితే రోగి, అతని కుటుంబంతో అతను ఎలా వ్యవహరిస్తున్నాడన్నది తెలుసుకోవాలి. స్వతంత్ర ప్రవృత్తి తగ్గడం, ఆధారపడిఉండడం, అలసిపోవడం, కోపం తెచ్చుకోవడం, బెంగపడడం, ఆత్మన్యూనతా భావం, కుటుంబ సంబంధాలు దెబ్బతినడం అసలు మాట్లాడడమే మానేయడం- సమస్యగల వ్యక్తిలో ఒక్కొక్కటిగానీ, వేర్వేరుగానూ ఈ లక్షణాలు కనబడతాయి.

#### 2. మానసిక అంశాలు

లైంగిక పరమైన సంబంధాలు, స్వతంత్ర ప్రవృత్తి తగ్గిపోవడం, తనను తాను అతిగా అభిమానించుకోవడం లైంగికపరమైన గుర్తింపు కోరుకోవడం, దూకుడు తత్వం ఉంటాయి. వీటిని క్రమబద్ధీకరించాలి. అంతరాత్మ, అహం, యదార్థాన్ని సరిగా చూడడం, తనను తాను అర్థం చేసుకోవడం, తనలో జరగవలసిన మార్పులను కూడా అర్థం చేసుకోవడం జరగాలి.

### 3. సాంఘిక అంశాలు

**ఆదాయం:** ఎక్కువ, తక్కువ, అప్పుల లేకపోవడం- ప్రస్తుత సమస్య మీద ప్రభావం.

**ఇళ్లు:** అప్పుమీద తీసుకున్నది. అద్దె ఇల్లు, ఇంటి యజమాని/నివాసితో పాటు చాలా మంది ఉండడం, కనీస అవసరాలు ఉండడం/లేకపోవడం జరగవచ్చు

**ఇరుగుపొరుగు:** భరించగలగడం/ భరించలేకపోవడం, స్నేహంగా ఉండేవారు/ తరచూ కలహించేవారు.

**ఉద్యోగం:** ఉండడం-జీతం, భవిషత్తు, పనిపరిస్థితులు ఉద్యోగంలో తృప్తి.

**మతం:** విలువలలో నమ్మకం, మతానికి మద్దతు ఇవ్వగలగడం, ఓదార్పు-బయటికి మాట్లాడే అవకాశాలు అపరాధం, బెంగ.

**అవకాశం:** సేవార్థికి సామాజిక సంస్థ, వైద్య సౌకర్యాలు, కోర్టులు, తపాలా ఆఫీసు పట్ల అభిప్రాయాలు.

అపోహలు-మానసిక ఒత్తిడి.

### విద్యాసంబంధమైన సమస్యలు

సమస్య ఎక్కడ ఉన్నదో గుర్తించక సమస్య పరిష్కారానికి ప్రయత్నాలు జరగాలి. పరిష్కారం ఆలోచించే ముందు సేవార్థి, మిగిలినవారు, సంస్థ కార్యకర్తలు- ఎవరు ఎంతవరకు సమస్యను పరిష్కరించడానికి ఉపయోగపడతారో, ఆలోచించాలి. సేవార్థి శక్తి యుక్తులు, ప్రేరణ సమస్యాపరిష్కారానికి పునాది.

BRAOU

## 17.4 సేవార్థి సామర్థ్యం

సేవార్థి శక్తి యుక్తులను మూడు అంశాలుగా చర్చించవచ్చు. అవి:

1. ఇతరులతో సంబంధాలు నిలబెట్టుకొనే శక్తి భావాలను, అనుభవాలను కలిగి ఉండి వ్యక్తీకరించే శక్తి,
2. తన పరిస్థితిని దిద్దుకోగల శక్తి,
3. సమస్య వలన అతను చేయవలసిన పనులు ఎంతవరకు ఆగిపోయినదీ అర్థం చేసుకొన్నట్లయితే సేవార్థి సమస్యను ఎలా పరిష్కరించుకొనేది అర్థమవుతుంది.

పెరల్ మెన్ మూడు రకాల సమస్యా నిర్ధారణలను వర్ణించారు. అవి:

### 1. నిర్ధారణ

సమస్య ఏమిటి? ఏయే అంశాలు దానికి కారణం? పరిష్కారం ఏమిటి? సేవార్థి, అతని పరిసరాలలో ఏయే వనరులు ఉన్నాయి? అన్న వివరాలు తెలుసుకొని ప్రస్తుత సమస్య, దానికి సంబంధించిన కారణాలు తెలుసుకోవడం. దీనినే 'డయాగ్నసిస్'(సమస్య నిర్ధారణ) అంటారు.

### 2. క్లినికల్ డయాగ్నసిస్

ఇక్కడ కార్యకర్త సమస్యను గుర్తించి, దానికి సేవార్థి మూర్తిమత్వంలోని లోపాలను, ప్రవర్తనలో గల దిద్దుకోవాల్సిన అంశాలను పరిశీలించాలి. క్లినికల్ డయాగ్నసిస్ సమస్య స్వభావాన్ని, సేవార్థిలో సమస్యా పరిష్కారానికి గల శక్తి యుక్తులను చర్చిస్తుంది. ఈ 'నిదానం' మూర్తిమత్వ సమస్య తలెత్తినప్పుడు ఉపయోగపడుతుంది.

### 3. కార్యకారణ సంబంధ నిర్ధారణ

కార్యకారణ సంబంధ నిర్ధారణలో సాధారణంగా సేవార్థి సమస్య ప్రారంభదశ, సమస్య, చరిత్ర, మూర్తిమత్వ నిర్మాణం, సమస్య పెరిగిన విధానం అధ్యయనం చేస్తారు. ఏరకంగా దానిని భరించగల సామర్థ్యాన్ని పెంపొందిచుకున్నదీ తెలుసుకోవాలి. ప్రస్తుత సమస్యకు సంబంధించినట్లుగా సేవార్థి సమాధానాలు లేకపోతే సమస్య చరిత్రకు పోయి సమస్య స్వభావాన్ని, కారణాలను విశ్లేషించాలి.

## 17.5 చికిత్సవిధానాలు

వ్యక్తికి పరిసరాలకు మధ్య వచ్చే సమస్యలను సర్దుబాటు చేసుకోవడం, దానికి అనువైన మూర్తిమత్వం అభివృద్ధి చేసుకోవడం, వ్యక్తి సేవా పద్ధతిలో భాగాలు. సమస్యలను పరిష్కరించడంలో రెండు రకాల విధానాలు మనకు గోచరిస్తాయి. అవి: 1. పరిసరాల మార్పు, 2. ప్రవర్తనలో మార్పు.

వ్యక్తి చికిత్స ద్వారా అతని సాంఘికపరమయిన పనితీరును మెరుగుపరచి, అతనిలో శక్తిని పెంచి తనకు తాను, అలాగే సమాజానికి ఉపయోగపడేటట్లు చేయడమే వ్యక్తి సేవా పద్ధతి.

వ్యక్తికి ఇవ్వగలిగిన సేవలు సమస్యను పరిష్కరించడంలో ఒక చికిత్సగా హామిల్టన్ నిర్వచించాడు. సమస్య నుంచి సత్వరం వ్యక్తి విముక్తి పొందడమేకాక ఏయే అంశాలు సమస్యకు కారణమయ్యాయో ఆ అంశాల మీద దృష్టిని కేంద్రీకరించాలి.

## 17.6 చికిత్స లక్ష్యాలు

1. సామాజిక జీవనం, విఫలమవకుండా నివారించడం.
2. సేవార్థి శక్తిని ప్రోగుచేయడం.
3. సామాజిక పనితీరును పునర్నిర్మించడం.
4. సేవార్థికి సహజంగా ఆనంద, అనుభూతులు కలుగజేయడం.
5. పెరుగుదలకు అభివృద్ధికి అవసరమయ్యే అవకాశాలను సృష్టించడం.
6. మానసికమైనదెబ్బలకు ఓదార్పు నీయడం.
7. స్వతంత్రంగా ఆలోచించి పనిచేయడానికి కావలసిన శక్తి ఇవ్వడం.
8. సమాజాభివృద్ధికి కావల్సిన శక్తిని సేవార్థికి కలిగించడం.

ఈ లక్ష్యాలతో సేవార్థి బాధ తొలగించి, అతని పనితీరు పెంచి, అతనిలో తృప్తి, తనను తాను తెలుసుకునేటట్లుగా చేసి అతని అహాన్ని సర్దుబాటు చేసుకొనే నిపుణతను కలుగ చేయాలి.

## 17.7 చికిత్సా ప్రక్రియ

ఈ క్రింది దశలలో సేవార్థికి చికిత్స జరుగుతుంది.

1. ప్రారంభదశ,
2. ప్రేరణ కలిగించి పాత్ర పోషణకు కావాల్సిన శక్తినివ్వడం,

BRAOU

3. విషయ సేకరణ, సమస్యానిదానం,

4. చికిత్సా లక్ష్యాలను ఏర్పరచుకోవడం,

5. చికిత్సకు సేవార్థిని సన్నద్ధం చేయడం,

6. చికిత్స ప్రక్రియలు,

7. చికిత్సను తయారుచేసి అమలు పరచడం,

8. దాన్ని కొనసాగించి, ఉపసంహరించడం.

## I. ప్రారంభదశ

సేవార్థికి సంబంధించిన అన్ని అంశాలు అర్థం చేసుకొని, వ్యక్తి సేవా పద్ధతిని అనుసరించి చికిత్స అవసరమన్నది నిర్ధారించాలి. కార్యకర్త నిర్ణయాలు అవసరాన్ని బట్టి మార్చుకొనేవి. ఈ క్రింది పరిస్థితులను కార్యకర్త పూర్తి చేస్తే ప్రారంభదశ పూర్తయినట్లే.

1. సేవా లక్ష్యాలకు వ్యక్తి సమస్యకు సంబంధించిన అంశాలు సరిపోవాలి.

2. సమస్య స్వభావం, అర్థం చేసుకొని కార్యకర్త, సేవార్థి చికిత్సకు ఉపక్రమించాలి.

3. కార్యక్రమాలు, వనరులు, సేవలకు, సంబంధించిన సమస్యను మాత్రమే తీసుకోవాలి.

4. కార్యకర్త నిపుణత, శక్తి యుక్తులు సరిపోయే సమస్యనే తీసుకోవాలి.

కార్యకర్త సమస్యను అర్థం చేసుకొని సేవార్థికి మానసికమైన మద్దతు ఇవ్వాలి. కార్యకర్త సేవార్థి మధ్య వృత్తి పరమైన సత్సంబంధం ఏర్పడాలి. ఒకసారి సమస్య స్వభావం అర్థమయినట్టయితే అతనే తన సమస్య గురించి ఆలోచించడం మొదలుపెడతాడు. ఒక్కోసారి అతని సమస్య పరిష్కారానికి అవసరమైతే ఇతర సంస్థలకు అతనిని పంపాలి. ఒకసారి సమస్య అర్థమవగానే, కార్యకర్త సామాజిక పరమైన చికిత్స ఇవ్వాలో, వ్యక్తిగతమైన చికిత్స ఇవ్వాలో నిర్ణయించుకోవాలి.

## II. ప్రేరణ పాత్ర, ప్రదేశం

కార్యకర్త సేవార్థితో మొదట వృత్తి పరమైన సంబంధాన్ని ఏర్పాటు చేసుకోవాలి. కార్యకర్త భావాలలో నిజాయితీ ఉంటే సేవార్థుని సమస్యా పరిష్కారం వైపు మెరుగైన అవకాశం కలుగుతుంది. తొందరపడి కేసును ముగించకుండా, చికిత్సను కొనసాగించేటట్లు చేయడమే ఈ దశ లక్ష్యం. ఈ దశలో సేవార్థిలో కార్యకర్తకు ప్రతిఘటన కనిపిస్తుంది. ఎందుకు ఈ చికిత్స? ఈ సంస్థకు వచ్చింది ఎందుకు? అన్న విషయాలపై సేవార్థి అభిప్రాయాన్ని ఆలోచనలను తెలుసుకోవాలి. సేవార్థి సహాయాన్ని అర్థించడంలో గల భావాలను, అతను చికిత్సలో ఏమి ఆశిస్తున్నదీ చెప్పటానికి కార్యకర్త అతన్ని ప్రోత్సహిస్తాడు. కార్యకర్త కూడా ఈ సేవాసంస్థ ఇచ్చే సేవలను వివరంగా తెలియజేయాలి. ఈ కార్యక్రమాలు, కార్యకర్త పాత్ర సేవార్థిని పరిష్కార మార్గాలను తెలుసుకోవడానికి సహాయపడతాయి.

## III. ప్రాథమిక ఒప్పందం

ఈ దశలో సేవార్థితో ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకోవాలి. వృత్తిపరమైన సంబంధాన్ని అనధికారికంగా ఏర్పరచుకొన్నాక, అధికారికంగా నోటి మాటతోకానీ, వ్రాతపూర్వంగా కానీ ఒప్పందం ఏర్పరచుకోవాలి.

BRAOU

## IV. సమస్యా నిర్ధారణ, అంచనా

చికిత్సాకాలమంతా ఈ నిర్ధారణా అంచనా జరుగుతూనే వుంటుంది. కార్యకర్త సమస్య గురించిన పూర్తి వివరాలను సేకరించి, చికిత్సా లక్ష్యాలను ఏర్పరుస్తాడు. కార్యకర్త సేవార్థికి బలాన్ని కలుగజేసి అతని శక్తియుక్తులను పెంచుతాడు. సేవార్థి ప్రవర్తనలో లోపాలను, అతిధోరణులను గుర్తించి, దానినుంచి బయటపడే మార్గాలను సూచిస్తాడు. సేవార్థి సలహాలు లేక కౌన్సెలింగ్, ప్రవర్తన మార్పు చేయడం, సంక్షోభంలో తోడ్పాటు బోధన సలహాలు ఇచ్చే, విషయాన్ని వివరించడం, పర్యవేక్షణ మొదలు కన్సల్టెన్సీ సేవలు ఇస్తాడు. వనరులను గుర్తించడం ఇతర సంస్థలకు పంపడం వంటి భౌతిక సేవలు కూడా అందిస్తారు.

## V. చికిత్సా లక్ష్యాలు

సమస్య కారణాలు తెలుసుకొని, పూర్తి అవగాహనతో సమస్య పరిష్కారానికి లక్ష్యాలను ఏర్పరుస్తాడు. ఈ క్రింది లక్ష్యాలలో ఒకటిగానీ అంతకు మించిన లక్ష్యాలుగానీ కార్యకర్త ఎన్నుకొంటాడు.

1. సేవార్థి పతనం కాకుండా రక్షించుకోవడం.

2. అహాన్ని బలోపేతం చేయడం.

3. సామాజిక కార్యాచరణను పునరుద్ధరించడం.

4. పెరుగుదలకు అభివృద్ధికి అవకాశాలు సృష్టించడం.

5. స్వతంత్రంగా పనిచేయగల అనుభవం.

6. సామాజిక కార్యక్రమాలలో పాల్గొనే అనుభవం.

7. పరిసరాలలో మార్పు.

## VI. చికిత్స ప్రణాళిక అభివృద్ధి


1. సమస్య పరిష్కరించడంలో ఒక పద్ధతి తయారుచేయడం.

2. ఒక ప్రత్యేక చికిత్స విధానాన్ని ఎన్నిక చేయడం.

3. చికిత్స కార్యక్రమాలను రూపొందించి పద్ధతిని తయారు చేయడం.

కార్యకర్త చికిత్స, సామాజిక దృక్పథంలో లేదా వ్యక్తిగత దృక్పథంతో చికిత్స లేదా రెండూ కూడా అన్నది కార్యకర్త నిర్ణయిస్తాడు. కార్యకర్త ఏ పాత్ర అతని సమస్య పరిష్కారానికి ఉపయోగపడుతుందో నిర్ణయిస్తాడు.

BRAOU




BRAOU

### VII. చికిత్స పథకం తయారు చేయడం

వివరాల సేకరణ, పరిష్కార మార్గం సిద్ధం చేసుకోవడం అవసరమయితే సహాయపడే మధ్యవర్తులను తయారు చేసుకోవడం, సేవార్థి పరిసరాలతో మార్పు తీసుకొని రావడం తద్వారా సత్ఫలితాలు రాబట్టడం, సేవార్థిలో నచ్చే కొత్త ప్రవర్తనను తేవడానికి ప్రయత్నించడం ఇందులో భాగంగా ఉంటాయి.

## 17.8 చికిత్సా విధానాలు

1. ఆచరణాత్మక సేవలు,
2. పరోక్ష చికిత్స,
3. ప్రత్యక్ష చికిత్స.

### 1. ఆచరణాత్మక సేవలు

సేవార్థికి కావలసిన వనరులను ఎన్నిక చేసుకొని ఉపయోగించుకొనేలా సహాయం చేయడం, చర్చలతో వివరించడం, వివరణలు, ఆదేశాలతో సేవార్థికి చికిత్స వలన సమాజంలోగల ఉపయోగిత వనరులను కార్యకర్త తెలియజేయాలి. ఏ సమస్య పరిష్కారానికైనా వనరుల అవసరం ఉంది. ఈ రకమైన సేవలు సేవార్థి అవసరాలను తీర్చి అతనికి తృప్తి కలిగించినట్టయితే అది చికిత్స విధానంగా రూపుదిద్దుకొంటుంది. సేవార్థిని వనరులవైపునకు

తీసుకొని వెళ్లడమే కార్యకర్త ముఖ్యవిధి. ధనం, వైద్యసేవలు, నర్సరీ స్కూళ్లు, స్కాలర్ షిప్పులు, పెంపుడు గృహాలు, న్యాయసహాయం, వినోద సౌకర్యాలు, మొదలైనవి కార్యకర్త చూపించగల సేవలు.

## 2. పరోక్ష చికిత్స

సేవార్థికి గల అతి మానసిక వత్తిడులు, శ్రమ తగ్గించాలంటే పరిసరాల మార్పు కలుగజేసి, కొత్తవాతావరణం ఇవ్వవలసి ఉంటుంది. కార్యకర్త సేవార్థికి వివిధ దశలలో తన సమస్యని ఎలా పరిష్కరించుకొనేదీ తెలియజేయాలి. అతనికి మానసికానందం, వినోదం కలుగచేసే వృత్తిపరమైన కార్యక్రమాలను ఏర్పరచాలి. అతని కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను సేవార్థికి అనుగుణంగా మార్పును ప్రతిపాదించాలి. సామాజిక వనరులు ఉపయోగించడం వలన సామాజిక పరిస్థితులను క్రమబద్ధీకరించడం వలన సమస్య పరిష్కారం చేయాలి. అందుకే దీనిని సామాజిక చికిత్స అంటారు.

ఇంటివద్ద సేవలు, క్యాంపులు, సమూహ కార్యక్రమాలు, శిక్షణ, ఉపాధి, వంటి కార్యక్రమాలుసేవార్థి మానసిక ఆందోళనను తగ్గిస్తాయి. కార్యకర్త చాలా కార్యక్రమాలు ఏర్పరచి సేవార్థి మూర్తిమత్వం అభివృద్ధి చేసి సమాజంలో బాగా సర్దుబాటు చేసుకొనేలా తయారు చేయాలి. కార్యకర్త, తల్లిదండ్రులు, అధ్యాపకులు, భార్యాభర్తలు, యజమాని, స్నేహితులు, బంధువుల ఆంతర్యాలను ప్రభావితం చేసి సేవార్థి సమస్య పరిష్కారమయ్యేలా చేయాలి. అంటే సేవార్థి పరిసరాల ఒత్తిడికి ఎక్కువగా లోనయి నిస్సహాయుడు అయినప్పుడు, కార్యకర్త పరిసరాల మార్పును సూచించి సమస్యపరిష్కరించడానికి ప్రయత్నించాలి.

## 3. ప్రత్యక్ష చికిత్స

పెరల్మెన్ ప్రత్యక్ష చికిత్సను శాస్త్రీయ పద్ధతిలో సాగే, అవసరమయిన చోట, కొంచెం మార్పులు చేసుకొనే పద్ధతిగా వర్ణించాడు. ఇక్కడ సేవార్థి తన సమస్యను తానే పరిష్కరించుకొంటాడు. కార్యకర్త తన నిపుణతతో పరిజ్ఞానంతో సేవార్థిని ప్రభావితం చేస్తాడు. సమస్య తెలియనితనం, అహం బలోపేతం చేయడానికి సంబంధించిన బలహీనతలతో బాధపడుతున్నప్పుడు, కార్యకర్త సేవార్థికి మార్గదర్శి అవుతాడు. కార్యకర్త ఎంతవరకు ప్రభావితం చేశాడన్న దాన్ని కార్యకర్త-సేవార్థి మధ్య సంబంధాలు వెల్లడిస్తాయి. కౌన్సెలింగ్ చికిత్సలతో కూడిన ఇంటర్వ్యూ, వివరణ, అన్వయాల ద్వారా అంతర్ దృష్టి కలుగజేయడం ప్రత్యక్ష చికిత్సలో భాగాలు.

BRAOU

## 17.9 కౌన్సెలింగ్

సేవార్థి తనకు తానుగా సమస్య పరిష్కరించుకోవాలి. అలా పరిష్కరించుకోలేని పరిస్థితులలో ఉన్నప్పుడు, నైపుణ్యం గల 'కౌన్సెలర్' సహాయంతో సమస్యను పరిష్కరిస్తాడు. 'కౌన్సెలర్' తన పరిజ్ఞానం అనుభవంతో సేవార్థికి సమస్య పట్ల అవగాహన కలిగించి మానసికమైన మద్దతు ఇచ్చి, పరిష్కరిస్తాడు. వివాహ విషయాలలో, ఉపాధి విషయాలలో, కుటుంబం, స్కూలుకు సంబంధించిన వ్యవహారాలలో 'కౌన్సెలర్' సలహాలు సంప్రదింపుల వలన సమస్య పరిష్కరిస్తాడు.

### చికిత్సాపూర్వక ఇంటర్వ్యూ

మానసిక సమస్యలు, ప్రవర్తనా సమస్యలు ఈ పద్ధతి ద్వారా నయం చేయవచ్చు. ఇక్కడ మానసిక చికిత్స జరుగుతుంది. మూర్తిమత్వం, అభివృద్ధిచేసి, పరిణత మనస్కులుగా తీర్చిదిద్ది సేవార్థి తనను తాను తెలుసుకొనే ఆత్మపరిజ్ఞానం పెంపొందించుకొని, శక్తిమంతులుగా తయారు చేయడానికి ఈ ఇంటర్వ్యూలు దోహదపడతాయి. కార్యకర్త, సేవార్థి అంతశ్చేదంలో విషయాలను బాగా మాట్లాడించడం కలల విశ్లేషణ ద్వారా వెలికి తీస్తాడు. దాని వలన సేవార్థికి గల సమస్యలు పరిష్కారమవుతాయి.

### వివరణ

ఇదికూడా ఒకరకమైన కౌన్సెలింగ్. ఇక్కడ సేవార్థి తనను తాను అలాగే తన పరిసరాలను అర్థం చేసుకోవడానికి ఈ వివరణ ఉపయోగపడుతుంది. కార్యకర్త సేవార్థిలో తనను, తన పరిసరాలను అర్థం చేసుకొనే శక్తిని పెంపొందిస్తాడు. సేవార్థికి పరిసరాలలోని వ్యక్తులను, అర్థం చేసుకొనే శక్తిని కలుగజేయడమే వివరణ అంటారు.

### అన్వయం-అంతశ్చేతన

ఒక్కోసారి పూర్తిగా వ్యతిరేకమైన భావాలు ఉద్రేకాలు సేవార్థిని యథార్థానికి దూరంగా ఆలోచించేలా చేస్తాయి. కార్యకర్త సేవార్థి విషయాన్ని అర్థం చేసుకొనేలా, యదార్థాన్ని వివరించి చెప్పడం జరుగుతుంది.

### మానసిక మద్దతు

ఆందోళన, అపరాధభావనా తగ్గి, ఆత్మవిశ్వాసం పెంచుకొనేలా కార్యకర్త సేవార్థిని ప్రోత్సహించడం జరుగుతుంది.

### రూపకల్పన-అంచనా

కార్యకర్తకు చికిత్స ఎంత వరకు విజయవంతమైనదీ తెలుసుకోవాలి. అనుకున్న లక్ష్యాలను ఎంతవరకు చేరుకున్నదీ తెలుసుకోవాలి.

### కొనసాగింపు

హఠాత్తుగా చికిత్సను ఆపేయకుండా, క్రమంగా సంబంధాలను తగ్గించాలి. మొదట రెండు వారాలకు తరువాత నెలకు, అటు పిమ్మట మూడు నెలలకు, ఆరు నెలలకు, చివరకు సంవత్సరానికి సేవార్థిని కలిసి అతను ఎలా తన సమస్యను పరిష్కరించుకొని సమాజంలో వ్యక్తిగా గౌరవింపబడుతున్నదీ తెలుసుకొని కేసును అప్పుడు ఉపసంహరించుకోవాలి.

BRAOU

## 17.10 ముగింపు

సామాజిక కార్యాచరణలో ఒకకేసును క్షేత్రస్థాయిలో పరిశీలించి, వ్యక్తిగత సేవార్థుల సమస్యల పరిష్కారానికి బహుళ మార్గాలున్నాయి. సామాజిక స్వచ్ఛంద సంస్థల్లో, కార్యకర్తలు ఈ వ్యక్తిగత సమస్యా పరిష్కారాల కోసం, సేవార్థుల చికిత్సకోసం, కౌన్సెలింగ్ కోసం ఈ పద్ధతులను అవలంబించాల్సి ఉంటుంది. సేవార్థుల కేసు పరిశీలన, వారి మూర్తిమత్వ అధ్యయనం, ఇంటర్వ్యూలు, పరిసరాల పరిశీలన ఆకలింపు చేసుకున్న అనంతరం కార్యకర్త నైపుణ్యంతో వ్యక్తికి చికిత్స ప్రారంభించాలి. ఒక వ్యక్తి పరిసరాల పరిశీలన లేకుండా చికిత్స సాధ్యం కాదు. ఈ చికిత్సా పద్ధతులను ఈ పాఠంలో వివరించాము. ఒక కేసుపై పరిస్థితుల నిర్ధారణ జరిగిన తర్వాత జరిపే చికిత్సా విధానాలు కూడా ముఖ్యమైనవే. అనంతరం కౌన్సెలింగ్ అవసరమైనప్పుడు అదికూడా జరిపి వ్యక్తి సమస్యల పరిష్కారానికి కార్యకర్త కృషి చేయవలసి ఉంటుంది.

## 17.11 మాదిరి పరీక్ష ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. సేవార్థిలో వ్యతిరిక్త భావనలు. వాటి నిర్మూలన వివరించండి?

2. సేవార్థి మానసిక-అనువంశిక చరిత్ర గురించి రాయండి?

3. చికిత్స విధానాలు వివరించండి?

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబు రాయండి.

1. కేసు పరిశీలన అంటే ఏమిటి?

2. చికిత్స ప్రక్రియ గురించి రాయండి?

3. కౌన్సెలింగ్ అంటే ఏమిటి? తెలుపండి?

## 17.12 చదవదగిన పుస్తకాలు


1. Young, P.V : Scientific Social Survay and Research.

2. Brijmohan : 'Social Work Research: An Innovation Process'


BRAOU

# భాగం-18: మనో సాంఘిక విశ్లేషణ, వ్యక్తి సమస్య పరిష్కారానికి మూల సూత్రాలు

విషయక్రమం

18.0 ఉద్దేశాలు

18.1 పరిచయం

18.2 మనో సాంఘిక విశ్లేషణ

18.3 పారదర్శకత

18.4 విరుద్ధ పారదర్శకత

18.5 మూలసూత్రాలు- అంగీకారం

18.6 భావ వ్యక్తీకరణ

18.7 పాల్గొనడం

18.8 రహస్య గోపనం

18.9 కార్యకర్త-తనను తాను తెలుసుకోవడం

18.10 ముగింపు

18.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

18.12 చదవవదగిన పుస్తకాలు

BRAOU

## 18.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- వ్యక్తిగత సమస్యలు పరిష్కరించడానికి మనో సాంఘిక విశ్లేషణ అవసరాన్ని గుర్తిస్తారు.
- సేవార్థి తన సమస్యలపై విశ్లేషణ చేయగలుగుతారు.
- సమస్యకు గల కారణాలు, దానికి పరిష్కారమార్గాలు లభించవు.

## 18.1 పరిచయం

వ్యక్తి 'గతం' అతని అంతశ్చేతనలోగల భావాలు సమస్యకు సంబంధించి సాంఘిక విషయాలతో పాటు సేకరించి విశ్లేషించాలి. సేవార్థి సమస్యను అర్థం చేసుకోవడానికి కొన్ని మూల సూత్రాల ఆధారంగా పనిచేయాలి.

## 18.2 మనో సాంఘిక విశ్లేషణ

ఈ మనో సాంఘిక విశ్లేషణ కొన్ని భావనల పునాది మీద నిర్మించినది. మానవ స్వభావం, స్వేచ్ఛాపూరితమైనది. దానిమీద సద్భావనతో అవగాహన చేసుకోవాలి. ఊహకు వీలయినది. దాన్ని అర్థం చేసుకోవాలి.

వ్యక్తి సమస్యను పరిష్కరించడంలో మనో సాంఘిక విశ్లేషణ అవసరమున్నది. ఇది శాస్త్రీయ పరిజ్ఞానంతో నిర్మించినది. మానవత మీద నమ్మకం, గౌరవంతో వ్యక్తి సమస్యా పరిష్కారానికి దీనిని ఉపయోగించాలి. భౌతిక అంశాలు, మానవ అంశాలు, భౌతిక పరిస్థితులు వ్యక్తి మీద ప్రభావం చూపుతాయి. ఆ ప్రభావాన్ని అర్థం చేసుకొని సమస్య పరిష్కారానికి ప్రవర్తనలో మార్పుకు ప్రయత్నించాలి. ఈ మార్గంలో పని చేస్తున్నప్పుడు వ్యక్తి 'గతం' చాలా ప్రధానమైనది. 'గతం' అర్థం చేసుకొంటేనే ప్రస్తుత పరిస్థితిలో ఎలా సర్దుబాటు చేసుకోవాలో తెలుస్తుంది.

చివరగా అంతశ్చేతనలో నిలువ ఉన్న 'విషయాలు' ఈ విశ్లేషణకు అత్యంత ఆవశ్యకం.

## 18.3 పారదర్శకత

చికిత్స అనగా సమస్య పరిష్కారానికి వృత్తిపరమైన సంబంధం చాలా ముఖ్యమైనది. వృత్తి పరమైన సంబంధం ఎంత బలంగా వుంటే అంత బాగా చికిత్స జరుగుతుంది. సేవార్థికి కార్యకర్త పట్ల గల అభిప్రాయాలు ఆంతర్యాలు పారదర్శకత అని పిలుస్తారు. చికిత్సకు ఈ సేవార్థి భావాలు చాల ముఖ్యం.

## 18.4 విరుద్ధ పారదర్శకత

కార్యకర్తకు సేవార్థిపట్ల గల భావాలను, అభిప్రాయాలను విరుద్ధ పారదర్శకత అంటారు. సేవార్థిని మాట్లాడించి అతని సమస్య పట్ల అతనికి గల అభిప్రాయాలను, సమస్యను, సమస్యకారణాలను అధ్యయనం చేయాలి. సేవార్థి కార్యకర్తతో తన సమస్య మాట్లాడడంతో సమస్య వలన వచ్చిన బాధ, ఆందోళన తగ్గి ఆ సమస్యను అర్థం చేసుకోవడంలో కార్యకర్తతో సహకరిస్తాడు. దీనికి 'ఇంటర్వ్యూ' చాలా సహకరిస్తుంది. భౌతిక పరిసరాలు కూడా సేవార్థి సహకరించడానికి తోడ్పడతాయి. ఆఫీసులో 'ఇంటర్వ్యూ' చేయడం కన్నా ఒక్కొక్కప్పుడు కార్లలో, వీధి చివర్లో, హోటళ్లలో లాంఛనప్రాయమైన ఇంటర్వ్యూలు చేయడం ద్వారా ఎక్కువ సమాచారం అందుతుంది. తరువాత సేవార్థి పరిసరాలు, అతని దగ్గరి వారిని ఇంటర్వ్యూ చేయడం ద్వారా వచ్చిన సమాచారాన్ని జోడించాలి.

BRAOU

## 18.5 మూలసూత్రాలు-అంగీకారాలు

ఇటువంటి విశ్లేషణకు వ్యక్తి సేవాపద్ధతి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ పద్ధతిని ఆచరణలోకి తీసుకు రావడానికి కొన్ని మూలసూత్రాలు అనుభవంలోంచి, పరిశోధన నుంచి వచ్చాయి. ఇవే పాటించాలి అని నిర్దేశించలేదు. వీటిని అవసరమయినచోట సవరణ చేసుకోవచ్చు.

1. వ్యక్తి సమస్య పరిష్కారం-మూలసూత్రాలు

2. అంగీకారం

సమస్యతో బాధపడే వ్యక్తి ఆందోళనవలన బలహీనుడై ఇంటర్వ్యూకు హాజరవుతాడు. కార్యకర్త సమాజం గురించి మానవ స్వభావం గురించి, ఆందోళన కలిగించే పరిస్థితుల గురించి జ్ఞానం, అనుభవంతో సేవార్థి సమస్య పరిష్కారానికి సేవార్థిని ఇంటర్వ్యూ చేయడానికి సిద్ధపడతాడు. కార్యకర్త సమాజానికి మానవస్వభావం, మానసికంగా బాధాకరమైన పరిస్థితులు, దానికి తట్టుకొనేశక్తి గురించిన భావనలు ఆధారంగా తన ప్రవర్తనను మలుచుకొని సేవార్థిని గౌరవిస్తాడు. సమస్యను పరిష్కరించడానికి వృత్తిపరమైన కుతూహలంతో ప్రశ్నించి విషయాలను రాబడ్తాడు. కార్యకర్త సేవార్థిని అతని తప్పిదాలకు లోపాలకు నిందించడు. తటస్థ వైఖరి అవలంబించడు. పూర్తిగా అతనిని ఆమోదించి ప్రవర్తిస్తాడు. దీనివల్ల అతని ప్రవర్తన మారుతుంది. అతి నెమ్మది, ఆవేశంతో అరవడం, పూర్తిగా ప్రపంచానికి దూరమవడం లాంటి ప్రవర్తనలో మార్పు వస్తుంది. కార్యకర్త తనకు సహాయం చేస్తాడు. అతని వలన తన సమస్య పరిష్కారమవుతుంది అని నమ్మినప్పుడు ఈ మార్పు వస్తుంది.

## 18.6 భావ వ్యక్తీకరణ

ఇక్కడ పరస్పర సంబంధం కార్యకర్త, సేవార్థి మధ్య ఏర్పడుతుంది. ఒకరు చెప్పేది మరొకరు అర్థం చేసుకోవాలి. మొదట సేవార్థి తన సమస్యను తాను చూసే విధంగా కాక, కార్యకర్త దగ్గర వుండడం వలన కలిగిన ప్రభావంతో, కార్యకర్తకు వివరిస్తాడు. ఒక వ్యక్తి (కార్యకర్త)తో తన సమస్యను చెప్పుకునేటప్పుడు, తన బలహీనతలను అభద్రతాభావం, చేతకాని తనాన్ని సేవార్థి చెప్పడు. ఎదుటి వ్యక్తి తన స్వ విషయాన్ని సమాచారాన్ని ఎలా స్వీకరిస్తాడో తెలియదు. అందుచేత తన మాటలను నియంత్రించుకొంటాడు. ఎవరినయితే కొత్త వ్యక్తిగా భావించాడో, ఆ కార్యకర్త ఏరకమైన విమర్శ చేయని, సమస్యను విని అర్థం చేసుకొనే వ్యక్తిగా గుర్తింపబడాలి.

ఈ మూలసూత్రం- భావవ్యక్తీకరణ పూర్తిగా కార్యకర్త తన అభిప్రాయాలను స్పష్టీకరణ చేయడం అవసరమయిన చోట మరీ స్పష్టంగా చెప్పడం అవసరం. కార్యకర్త-సేవార్థి వృత్తిపరమైన సంబంధం ఏర్పరచుకొన్నాక తన పాత్ర చెప్పడమేకాక సేవార్థిపాత్ర కూడా అతనికి తెలియజెప్పాలి.

### వ్యక్తీకరణ

సేవార్థి మూర్తిమత్వం అతని పరిస్థితులు అర్థం చేసుకొని అతని సమస్యను అర్థం చేసుకోవాలి. ఒకే సమస్య ఉన్నా దాని వెనుక ఉన్న కారణాలు వేర్వేరు కనుక ఒక సేవార్థిసమస్య వేరొక సేవార్థి సమస్య వారి వారి మూర్తిమత్వాన్ని పరిస్థితులను, సమస్యను, సమస్య వెనుక కారణాలను తెలుసుకొని వేర్వేరు పరిష్కార మార్గాలను సూచించాల్సి ఉంటుంది. దీనినే 'వ్యక్తీకరణ' అంటారు.

## 18.7 పాల్గొనడం

ఆందోళన కలిగించే పరిస్థితులనుంచి బయటపడి సామాజిక జీవనం సాగించాలి అంటే సేవార్థి తప్పనిసరిగా చురుకుగా ఈ సమస్య పరిష్కార కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలి. అనుభవం లేని కార్యకర్తలు తమ తొందరపాటుతో తామే సమస్య పరిష్కారానికి ముందుకు వెళతాడు. కానీ వ్యక్తిగత సమస్యల పరిష్కారంలో సేవార్థిని ముందుకు వచ్చి, తన సమస్యకు పరిష్కారానికి ఉత్సాహం చూపించేలా అతనికి మనోధైర్యం కలిగించడం ద్వారా కార్యకర్త కేసును ముందుకు నడిపించడం వీలవుతుంది.

## 18.8 రహస్యగోపనం

సేవార్థి తన సమస్య పరిష్కారంలో పూర్తిగా పాల్గొనాలి. అంటే కార్యకర్త సమర్థుడు, నమ్మకస్తుడు అయి వుండాలి. సేవార్థి ఇంతవరకు ఎవరితోనూ చెప్పని తన స్వంత విషయాలను కార్యకర్తతో చర్చిస్తాడు. కార్యకర్త తన సేవార్థి స్వంత విషయాలను ఎవరితోనూ చర్చించకూడదు. కేసు రికార్డులు ఎవరికీ సమాచారం కోసం ఇవ్వరాదు.

## 18.9 కార్యకర్త తన్ను తాను తెలుసుకోవడం

కార్యకర్త తన జీవన విధానం, సాంస్కృతిక విషయాలను అలాగే వివిధ సాంస్కృతిక సమూహాలనుంచి వచ్చిన సేవార్థులను పూర్తిగా అర్థం చేసుకోవాలి. సేవార్థి కుటుంబ పరిస్థితులు, నమ్మకాలు, అలవాట్లు, అర్థం చేసుకొని ఆ కోణంలో వారి సమస్యను అర్థం చేసుకోవాలి. ఉదా: కార్యకర్త తండ్రి తాగుబోతు, తల్లి బిడ్డలను సరిగా చూడలేని వ్యక్తి అయినప్పుడు సేవార్థి అదే సమస్య చెప్పినపుడు, అతనిలో పూర్తిగా తాదాత్మ్యం చెందడంకానీ, అతనిని వదిలించుకోవడం గానీ చేస్తే కార్యకర్త సమస్య పరిష్కారంలో విఫలుడయినట్లే. కార్యకర్త తన పరిస్థితులను అర్థం చేసుకోవాలి. తనకు కలిగిన భావనలను నియంత్రించుకొని సేవార్థి భావాలను అర్థం చేసుకోవాలి.



BRAOU

## 18.10 ముగింపు

ఒక సేవార్థి తన సమస్య పరిష్కారం కోసం వచ్చినప్పుడు కేవలం అతని సమస్య ఏమిటి? అని మాత్రమే చూడకుండా ఆ సమస్య పూర్వాపరాలు తెలుసుకోవడం అవసరం. పూర్వాపరాలంటే ఆ సమస్య ఉద్భవించిన కారణాలు, సేవార్థి నేపథ్యం, సమస్యను ఆచరించి ఉండే సాంఘిక, మానసిక సమస్యలు లాంటివి కార్యకర్త తెలుసుకోవాలి. ఇందుకు మనో సాంఘిక విశ్లేషణా పద్ధతులు పాటించాలి. దీనివల్ల సేవార్థి అంతశ్చేతన తెలుసుకుని, భావ వ్యక్తీకరణ సాధ్యమౌతుంది. పారదర్శకత వీలవుతుంది. ఈ సందర్భంగానే కార్యకర్త కూడా విభిన్న అంశాలలో తన్నుతాను కూడా తెలుసుకోగలడు.

## 18.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. మనో సాంఘిక విశ్లేషణ అనగానేమి? వివరించండి.
2. మూలసూత్రాలు, అంగీకారాల గురించి రాయండి?
3. భావ వ్యక్తీకరణ గురించి రాయండి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబు రాయండి.**

1. రహస్యగోపనం అనగానేమి?
2. కార్యకర్త తన్నుతాను తెలుసుకోడం అంటే ఏమిటి?
3. వ్యక్తీకరణ?

BRAOU

## 18.12 చదవదగిన పుస్తకాలు

1. Young, P.V : Scientific Social Survay and Research

2. Brijmohan : Socialwork Research: An Innovative Process

# భాగం-19: మార్గదర్శకత కౌన్సెలింగ్: సూత్రాలు

విషయక్రమం


19.0 ఉద్దేశాలు

19.1 పరిచయం

19.2 కౌన్సెలింగ్ లక్ష్యాలు

19.3 కౌన్సెలింగ్ పరిధి

19.4 కౌన్సెలింగ్ మూలసూత్రాలు

19.5 కౌన్సెలింగ్‌లో రకాలు

19.6 కౌన్సెలింగ్‌లో వివిధ పద్ధతులు

19.7 కౌన్సెలింగ్‌లో వివిధ దశలు

19.8 కౌన్సెలింగ్ ప్రక్రియ

19.9 సామూహిక కౌన్సెలింగ్

19.10 ముగింపు

19.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

19.12 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 19.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- కౌన్సిలింగ్ లక్ష్యాలను తెలుసుకుంటారు.
- కౌన్సిలింగ్ మూలసూత్రాలను అధ్యయనం చేస్తారు.
- కౌన్సిలింగ్ పద్ధతులను వివరించగలుగుతారు.

## 19.1 పరిచయం

శిశుమార్గదర్శక కేంద్రాలలో, కుటుంబ సలహా కేంద్రాలలో, స్కూళ్లలో, ఆస్పత్రులలో కౌన్సిలర్ తనను సహాయం కోరినవారి సమస్యలను సేవార్థికి అర్థమయ్యేటట్లు చెప్పి, ఏయే ప్రవర్తన, నిజం కాని నమ్మకాలు, తప్పుడు అభిప్రాయాలు, దానికి సంబంధించిన వ్యక్తులలో ఉన్నదీ గుర్తించి, వారితో వృత్తిపరమైన సంబంధాన్ని ఏర్పరుచుకొని, వారికి సలహా ఇవ్వడం ద్వారా సమస్యను పరిష్కరిస్తాడు. కౌన్సిలర్‌కు విషయ పరిజ్ఞానం, ప్రాపంచికానుభవం కలిగి తన మనసును నియంత్రించుకొని, వృత్తిపరమైన పరిణతితో సేవార్థికి సహాయపడతాడు. కౌన్సిలర్ తనను తాను అర్థం చేసుకొనేందుకు కావలసిన మార్పులు తీసుకువస్తాడు. సమస్యలు పరిష్కరించుకొనేందుకు కావాల్సిన శక్తిని వ్యక్తిగతమైన సంబంధంతో కౌన్సెలింగ్ కలిగిస్తుంది.

## 19.2 కౌన్సెలింగ్ లక్ష్యాలు

1. ఆమోదయోగ్యమైన మానసిక ఆరోగ్యం,
2. సమస్యలు పరిష్కారం చేయడం,
3. వ్యక్తిగమైన సామర్థ్యం పెంచడం,
4. పరిసరాల పరిస్థితులకు లోబడి పూర్తి వ్యక్తి స్వాతంత్రంతో తాము కోరినవాటిని పొందేటట్లు చూడడం.

## 19.3 కౌన్సెలింగ్ పరిధి

1. విద్యార్థులు తమకు కావాల్సిన విద్యావిషయాలను ఎన్నిక చేసుకోవడానికి సరియైన నిర్ణయాలు తీసుకోవడానికి, విద్యావిషయాలలో సమస్యలు పరిష్కరించడానికి 'కౌన్సెలింగ్' ఉపయోగపడుతుంది.
2. సమాజ అవసరాలను తెలుసుకొని, సమాజాభివృద్ధికి కృషి చేయడానికి కౌన్సెలింగ్ ఉపయోగపడుతుంది.

### కౌన్సెలింగ్ అంటే...

తగిన విద్యార్హతలు కలిగి, సుశిక్షితులైన వ్యక్తులు సమస్యలతో తమ జీవనాన్ని సమంగా సాధించలేని వ్యక్తులకు ఏవయస్సు వారికైనా సలహాతో నిర్ణయాలు తీసుకునేలా బాధ్యతలు నిర్వర్తించేలా చేయడాన్ని 'కౌన్సెలింగ్' అంటారు.

విద్యా సంబంధమైన విషయాలలో విద్యార్థులు వారి అవసరాలకు ఆసక్తికి తగిన కోర్సులు ఎన్నిక చేసుకొనేలా చేయడం సంస్థాగత వనరులను సౌకర్యాలను వినియోగించుకొనేలా చేయడం, చదువుతోపాటు ఇతర అలవాట్లు, విద్యా సంబంధమైన విద్యేతరమైన వ్యాపకాలలో సంతృప్తికరంగా పాల్గొనేట్లు చేయడాన్ని మార్గదర్శకత్వం అంటారు.

వ్యక్తి తనను తాను అర్థం చేసుకొని, ప్రస్తుతంలోని, భవిష్యత్‌లోని పరిస్థితులు అర్థం చేసుకొని, కౌన్సిలర్ సహాయంతో తన సమస్యను పరిష్కరించుకొని, సమాజానికి కావల్సిన సహాయం చేసేలా తీర్చిదిద్దే విధానాన్ని 'కౌన్సెలింగ్' అంటారు.

కౌన్సెలింగ్ ఒక అభ్యాసం. వ్యక్తికి కావలసిన సహాయాన్ని కౌన్సిలర్, ఒక పద్ధతి ప్రకారంగా అందజేసి అతని సమస్యను పరిష్కరిస్తాడు. కౌన్సెలింగ్ అంటే ఒక సలహా ఇవ్వడం మాత్రమేకాదు.

3. వ్యక్తికి సంబంధించిన, వివాహానికి సంబంధించిన, ఉపాధికి సంబంధించిన ఇంకా ఇతర సమస్యలను కూడా పరిష్కరించడంలో కౌన్సెలింగ్ ఉయోగపడుతుంది.

4. అధ్యాపకులకు తమ విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకొని వారికి కావల్సిన సలహాలను ఇవ్వడానికి ఉపయోగపడుతుంది. విద్యాబోధన, కౌన్సెలింగ్ వేర్వేరు విషయాలు కావు. అధ్యాపకులు విద్యార్థులకు వారి సమస్యలపై కౌన్సెలింగ్ చేస్తారు.

## 19.4 కౌన్సెలింగ్ మూలసూత్రాలు

కౌన్సెలింగ్ ఒక వృత్తిపరమైన కార్యక్రమం. కొన్ని సూత్రాల మీద ఆధారపడి కౌన్సెలింగ్ చేస్తారు. ఈ సూత్రాలు సామాజిక శాస్త్రం, మనస్తత్వశాస్త్రం మిగిలిన సాంఘిక శాస్త్రాలనుంచి తీసుకున్నవి.

BRAOU

1. కౌన్సెలింగ్ వ్యక్తిగతంగా, ప్రత్యేకంగా ఉంటుంది

ఏ ఇద్దరు వ్యక్తులు ఒకలా వుండరు. ఒకే రకమైన ఆసక్తులు, అభిరుచులు, అంతర్యాలు ఉండవు. కాబట్టి ప్రతీ వ్యక్తి ప్రత్యేకమైన జీవి. ఒకే సమస్య ఉన్నప్పటికీ ఒక వ్యక్తికి ఇచ్చే సలహా మరొక వ్యక్తికి సరిపోదు.

2. 'సంపూర్ణ అభివృద్ధికి కౌన్సెలింగ్

సాంఘిక , ఆర్థిక, మానసిక అంశాలు, అన్నీ అర్థం చేసుకొన్న వ్యక్తి సంపూర్ణమైన అభివృద్ధి సాధించేవిధంగా కౌన్సెలింగ్ ఉండాలి.

3. ఇచ్చే మార్గదర్శకం, కౌన్సెలింగ్‌కు కొన్ని లక్ష్యాలు ఉండాలి

లక్ష్యాలు ఏర్పరచుకోకుండా కౌన్సెలింగ్ చేయడం మొదలుపెడితే వ్యక్తి చాలా రకాల సమస్యలు ఎదుర్కొనవలసి వస్తుంది.

4. కౌన్సెలింగ్ వృత్తిపరమైన వ్యాపకం

విద్యావంతులైన, శిక్షణ పొందిన వ్యక్తులు మాత్రమే కౌన్సెలింగ్ చేపట్టాలి. కానివారు కౌన్సిలింగ్ చేయడం మొదలుపెడితే సమస్యతో బాధపడే వ్యక్తులను మరింత బాధపెట్టినట్టవుతారు.

5. సమస్యలతో బాధపడే వారందరికీ కౌన్సెలింగ్ అవసరం

అన్ని వయస్సులవారికి, అన్ని కులాలు, మతాలు, ఉపాధుల వారికి సమస్య వాటిల్లినప్పుడు కౌన్సెలింగ్ అవసరం.

6. కౌన్సెలింగ్ ఏ ఒక్క అభివృద్ధి దశకూ చెందినదికాదు

కౌన్సెలింగ్ ఏ ఒక్క అభివృద్ధి దశకు చెందినది కాదు. వ్యక్తి జీవిత దశలన్నిటిలో అతని అవసరాలు తీర్చడానికి సమస్యలు పరిష్కృతం కావడానికి కౌన్సెలింగ్ అవసరం.

7. కౌన్సెలింగ్ ఒక కొనసాగే ప్రక్రియ

కౌన్సెలింగ్ సమస్య పరిష్కరించేందుకు ఉన్న ప్రక్రియ మాత్రమే కాదు. ఈ సేవలు సమస్యలకు సంబంధించినవికావు. కౌన్సెలింగ్ పైకి సమస్య పరిష్కరించడానికే అయినప్పటికీ, సమస్య మళ్లీ రాకుండా నివారించడం కూడా అవసరం. జీవిత పర్యంతం ఒక్కోసారి కౌన్సెలింగ్ సలహాల అవసరం ఉంటుంది.

8. కౌన్సెలింగ్ నమ్మదగిన సమాచారం మీద ఆధారపడి జరగాలి

ఏ వ్యక్తీ తనలోని అయిష్టమైన, అవాంఛనీయమైన వివరాలు చెప్పటానికి ఇష్టపడడు. కౌన్సిలర్‌కు తన కౌన్సెలింగ్‌తో సమస్యలు పరిష్కరించడానికి అటువంటి సమాచారం కావాలి. అటువంటి సమాచారాన్ని వ్యక్తి కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగువారితో మాట్లాడి విషయ సేకరణ చేయాలి. ఐ.క్యు. టెస్టులు, అభిరుచి పరీక్షలు, మూర్తిమత్వం పరీక్షలు నిర్వహించాలి. వీటికి ప్రత్యేకమైన పరీక్షలు ఉన్నాయి. వాటిద్వారా సమాచారం తెలుసుకోవాలి. దాని సహాయంతో సమస్య అర్థం చేసుకొని పరిష్కరించాలి.

9. కౌన్సెలింగ్‌లో 'సర్దుబాటుధోరణి' ఉండాలి

సమాచారం సేకరణకు ఉపయోగించే సాధనాలు కావాలి. వాడటంలో ఛాదస్తంగా ఉండకూడదు. ఏఒక్క పద్ధతి అందరి సమస్యలను పరిష్కరించదు. కాబట్టి సందర్భానుసారం పద్ధతిగా మార్చుకోవాలి.



BRAOU

## 19.5 కౌన్సెలింగ్‌లో రకాలు

ప్రతీవ్యక్తి ఏదో ఒక సమయంలో తన జీవితాన్ని ఆనందమయం చేసుకోవడానికి సహాయం కోరుతాడు. తన కుటుంబంతో, సమాజంతో సర్దుబాటు చేసుకోవాల్సి వస్తుంది. నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కొన్ని రంగాలలో వ్యక్తికి సహాయం కావాల్సి ఉంటుంది. కౌన్సెలింగ్‌లో కొన్ని రకాలు

1. విద్యాసంబంధమైన కౌన్సెలింగ్,

2. ఉపాధికి సంబంధించిన కౌన్సెలింగ్,

3. వ్యక్తిగతమైన కౌన్సెలింగ్,

4. సాంఘిక కౌన్సెలింగ్,

5. ఆరోగ్య కౌన్సెలింగ్.

1. **విద్యాసంబధమైన కౌన్సెలింగ్:** విద్య అంశాల ఎన్నిక, నేర్చుకోవడంలో గల సమస్యలు వారిలో ప్రేరణను పెంచేందుకు సంస్థలోగల వనరులను, సౌకర్యాలను ఉపయోగించుకోవడానికి కౌన్సిలర్ సహకరించాలి.

2. **ఉపాధికి సంబంధించిన కౌన్సెలింగ్:** ఉపాధి ఎన్నిక, దానికి అభ్యర్థిని తయారు చేయడం, ఉపాధి అవకాశాలు, శిక్షణా సౌకర్యాలు మొదలయిన అంశాలలో కౌన్సిలర్ సలహాలను ఇవ్వాలి.

3. **వ్యక్తిగతమైన కౌన్సెలింగ్:** సమస్య గల వ్యక్తికి పరిసరాలతో సర్దుబాటు అవసరం. వ్యక్తుల ప్రవర్తన వారి అంతర్యాల మీద వారి మూడ్స్ మీద ఆధారపడి ఉంటుంది. వారి ఆందోళన, ఆవేశాలు చాలా సమస్యలకు కారణమవుతాయి. వాటిని అర్థం చేసుకొని కౌన్సిలర్ సలహా ఇవ్వాల్సి వుంటుంది.

4. **సాంఘికమైన కౌన్సెలింగ్:** నాయకత్వం చేపట్టడానికి జట్టులో ఒకరిగా పనిచేయడానికి ఆరోగ్యకరమైన ఆలోచనలు కలగడానికి ఇతరుల అభిప్రాయాలను నమ్మకాలను గౌరవించడానికి, సహనం, కృషి, స్నేహం, ఐకమత్యం లాంటి లక్షణాలు పెంపొందించుకోవడానికి సమర్థులైన పౌరులుగా తయారు చేయడానికి కౌన్సిలర్ సహాయం కావాలి.

5. **వినోద సంబంధమైన కౌన్సెలింగ్:** విరామ కాలం సరిగా గడపడానికి కౌన్సెలింగ్ అవసరం. వ్యక్తి ఆసక్తి శక్తి గమనించి సలహా ఇవ్వాల్సి ఉంటుంది.

6. **ఆరోగ్యకౌన్సెలింగ్:** ఏపని చేసినా మంచి ఆరోగ్యం ముఖ్యం. ఆరోగ్యాన్ని అనగా శారీరక మానసిక ఆరోగ్య రక్షణకు కావలసిన కౌన్సెలింగ్ అనగా సలహాలు ఇవ్వడం.

## 19.6 కౌన్సెలింగ్‌లో వివిధ పద్ధతులు

కౌన్సెలింగ్‌లో మూడు పద్ధతులు ఉన్నాయి. అవి:

1. నిర్దేశించే కౌన్సెలింగ్,

2. నిర్దేశ రహిత కౌన్సెలింగ్,

3. సామూహిక కౌన్సెలింగ్.

BRAOU

### 1. నిర్దేశించే కౌన్సెలింగ్:

ఈ రకమైన కౌన్సెలింగ్‌లో ఈ క్రింది లక్షణాలుంటాయి.

1. కౌన్సిలర్ ముఖ్య పాత్ర వహిస్తాడు.

2. సమస్య పరిష్కారానికి కౌన్సెలర్ సలహా ఇస్తాడు.

3. సలహాతీసుకునే వ్యక్తికి కౌన్సెలర్ మాత్రమే సలహా విషయాన్ని చెబుతాడు.

4. తిరిగి మళ్లీ విషయాన్ని వివరించి, వ్యక్తి చూపిన పరిష్కారంలోని ప్రాముఖ్యతను కౌన్సిలర్ వివరిస్తాడు.

## 19.7 కౌన్సెలింగ్‌లో గల వివిధ దశలు

1. కౌన్సెలింగ్ సమావేశం ప్రారంభించడం.

2. సమస్యా విశ్లేషణ.

3. సారాంశం.

4. సమస్యా నిర్ధారణ.

5. సమస్య తెచ్చే మార్పులు గుర్తించడం.

6. పరిష్కార మార్గాలు సూచించడం.

7. కొనసాగించడం.

BRAOU

## 19.8 కౌన్సెలింగ్ ప్రక్రియ

కౌన్సిలర్ తన అత్మీయతా, స్నేహపూరిత ప్రవర్తనతో కౌన్సెలింగ్ సమావేశాలకు అనుకూల వాతావరణమేర్పరుస్తాడు. కౌన్సిలర్‌కు, సలహాకోరే వ్యక్తికి వీలయిన సమయంలో సమావేశం ఏర్పాటు చేసుకోవాలి. చర్చల్లో వ్యక్తిగతంగా మాట్లాడి సమాచారాన్ని రాబట్టాలి అందుకు అవసరమైన చోట విషయాలను తెలుసుకోవడానికి ప్రయత్నించాలి.

రెండవ దశలో సమస్యకు సంబంధించిన భవిష్యత్ ఫలితాలను కౌన్సిలర్ చెబుతాడు. కౌన్సిలర్ సేవార్థికి అర్థంకాని కఠినమైన భాష వాడకూడదు. సమస్యగల వ్యక్తి ఏరకంగానూ గాయపడకూడదు.

సమస్యతో ఎలా సర్దుబాటు చేసుకోవాలో చెప్పడంతో మూడవదశ, చికిత్సాదశ ప్రారంభమవతుంది. కౌన్సిలర్ పరిష్కారమార్గాలు అనేకం సూచించి, సమస్య గల వ్యక్తిని ఒక అనుకూలమయిన పరిష్కారాన్ని ఎంచుకోమని చెబుతాడు. కౌన్సిలర్, సేవార్థి భవిష్యత్ ప్రణాళిక సంతృప్తికరంగా ఉంటే, ఆ సమావేశాన్ని ముగిస్తాడు.

కౌన్సెలింగ్‌లో కొనసాగింపు ఆఖరిమెట్టు. కౌన్సిలర్ సేవార్థి ప్రవర్తనమీద దృష్టి ఉంచాలి. ఒకవేళ సమ్య మళ్లీ మొదలవుతే మళ్లీ కౌన్సెలింగ్ సమావేశం వెంటనే అవసరమవుతుంది.

### పరిమితులు

కౌన్సిలర్ ఇచ్చిన సలహాలు, పరిష్కారాలు సేవార్థి ఒప్పుకున్నప్పటికీ, వాటిని ఆచరణలో పెట్టకపోవచ్చు. ఇది

బహుషా కౌన్సిలర్ అన్ని అంశాలు పూర్తిగా విచారించకుండా పరిష్కారం సూచించినప్పుడు ఇటువంటి సమస్య రావడం సామాన్యంగా జరుగుతూ ఉంటుంది. అలాగే సేవార్థి కూడా ప్రతీ చిన్న విషయానికి కౌన్సిలర్ మీద ఆధారపడడం అలవాటు చేసుకుంటాడు. ఇది అతని మూర్తిమత్వం పరిణితికి అడ్డంకిగా నిలబడుతుంది.

## 2. నిర్దేశరహిత కౌన్సిలింగ్

కార్ల్ రోజర్స్ చెప్పిన సేవార్థి కేంద్రక పద్ధతి ఆధారంగా చేసే కౌన్సెలింగ్‌ను నిర్దేశరహిత కౌన్సెలింగ్‌గా పిలుస్తారు. వ్యక్తి జీవన గమనంలో సర్దుబాటు సాధించి కొన్ని విజయాలను సాధించాలని ఆశిస్తాడు. కానీ అరకమైన సర్దుబాటు సాధించలేక సమస్యలు తెచ్చుకొంటాడు. ఇక్కడ కౌన్సిలర్ వ్యక్తి తన సమస్యను అర్థం చేసుకొని, పరిష్కరించుకొనేలా చేయాలి. వ్యక్తి తనను తాను అర్థం చేసుకొనప్పుడు, అంగీకరించనప్పుడు, తన సమస్యను తాను పరిష్కరించుకొనే ఆత్మవిశ్వాసాన్ని సంపాదించుకుంటాడు. పరిష్కార మార్గాలు చూపడు. కౌన్సిలర్ పరిష్కారాలు సూచించేవిధంగా అతనిని ప్రోత్సహించాలి. కౌన్సిలర్ మంచి పరిష్కారమార్గాన్ని అతని చేతే చెప్పించి దానిని అతను అంగీకరించేలా చేయాలి. ఇక అప్పుడు సేవార్థి పరిస్థితి చూసి చివరకు కౌన్సెలింగ్ ఉపసంహరించుకోవచ్చు.

### పరిమితులు

ఆ పద్ధతిలో చాలా కాలయాపన జరుగుతుంది. చాలా సమావేశాలయితేగానీ సేవార్థి సమస్యను అర్థం చేసుకొని పరిష్కారాలను చేపట్టడానికి వీలుకాదు. కౌన్సిలర్‌కు సేవార్థి వ్యతిరేక భావనలను అర్థం చేసుకోవడం ఒక్కోసారి కష్టమవుతుంది. కొన్ని సమయాలలో కౌన్సెలింగ్ సమావేశంనుంచి వెలువడిన పరిష్కారాలను అంగీకరించడం కౌన్సిలర్‌కు కష్టమవుతుంది. కౌన్సిలర్ ఈ రకమైన కౌన్సెలింగ్ సమావేశం వాడటానికి చాలా శిక్షణ పొంది ఉండాలి.

BRAOU

## 19.9 సామూహిక కౌన్సెలింగ్

సామూహిక సంబంధాల పద్ధతిని సమస్యా పరిష్కారానికి ఉపయోగించడమే ఈ కౌన్సెలింగ్‌లో ప్రధానం. సమూహ సభ్యులు, వారి మధ్య పరస్పర ప్రభావంతో ఏర్పడే సమస్యను అర్థం చేసుకొని, కారణాలను విశ్లేషించి పరిష్కరించడానికి ప్రయత్నిస్తారు. వారిలో గల తప్పుడు సమాచారాన్ని సరిదిద్దుకుంటారు. వారు నేర్చుకొనే అలవాట్లు, ఆలోచనావిధానంలో గల పొరపాట్లను గమనించి, వాటిని సరిదిద్దుకొని, కొత్త అలవాట్లను, అంతర్యాలను ఏర్పరచుకొని, జీవన విధానంలో సర్దుబాటు చేసుకుంటారు.

### సామూహిక కౌన్సెలింగ్‌లో వివిధ దశలు

సామూహిక కౌన్సిలర్‌కు ఈ రకమైన కౌన్సెలింగ్‌లో అతని పాత్ర చాలా విస్పష్టమైనది. సమూహంలోనే వారిమధ్య గల సమస్యలను అర్థం చేసుకోవాలి. వారి మానసిక సమస్యలు, సమూహంలోని వ్యక్తుల కుటుంబ వివరాలు తెలుసుకోవాలి. ఈ క్రింది దశలలో కౌన్సెలింగ్ జరగుతుంది.

1. పాల్గొనే సభ్యుల ఎన్నిక,
2. సమావేశం ప్రారంభించడం,
3. చర్చకు కావలసిన సమాచారం ఇవ్వడం,
4. అవాంఛనీయమైన ప్రవర్తనను ఖండించడం,
5. వారి భావాలను వారు వ్యక్తీకరించేలా తీర్చిదిద్దడం,
6. నిర్ణయాలు తీసుకునేలా చూడడం,
7. సమావేశం ముగింపు,
8. కొనసాగింపు.

ఈ పద్ధతిలో ఒకే సమస్యగల వారిని ఎన్నిక చేసుకొంటారు. ఉదాహరణకు నలుగురితో మాట్లాడడానికి భయపడేవారిని, ఆందోళన గలవారిని ఒకే సమస్యగలవారిని ఎన్నిక చేసుకోవాలి.

కౌన్సిలర్ తనను తాను పరిచయం చేసుకోవడంతో సమావేశం ప్రారంభించాలి. ప్రతీ సభ్యుడు తననుతాను పరిచయం చేసుకోవాలి. సమావేశ లక్ష్యాన్ని క్లుప్తంగా వివరించి, సభ్యులను చర్చలో పాల్గొనేలా చేయాలి. దారి మళ్లుతున్నప్పుడు వారించి సరిచేయాలి.

సభ్యులు వారి సమస్య గురించి, వారి భావాల వ్యక్తీకరణకు ఇతర సభ్యులు ప్రోత్సహించాలి. సమూహం సభ్యుల ప్రోత్సాహం వారి అభిమానం వారి చేత విషయాన్ని చెప్పిస్తుంది. సమూహ లక్ష్యాలు వారు వ్యక్తం చేయాల్సిన విషయాలను కౌన్సిలర్ నిర్ణయిస్తాడు. ఈ వ్యక్తీకరణను తొందరగా చేయకుండా, కౌన్సిలర్, వారు సిద్ధంగా ఉండి ఇష్ట పూర్వకంగా చెప్పాలనుకొన్నప్పుడే చెప్పించాలి. ఒక్కొక్కప్పుడు మాట్లాడడం ఆపేయడం జరుగుతుంది. సభ్యుల అభిమానం, అంగీకారం వారిని విషయాన్ని చెప్పడం కొనసాగేలా చేస్తాడు.

చివరి దశలో నిర్ణయాలు తీసుకుంటారు. అదికూడా సభ్యులందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలను, అందరి అభిప్రాయాలను విన్నాక తీసుకుంటారు. ఈ నిర్ణయం సాధారణంగా అందరికీ అంగీకారమైనదే అయివుంటుంది. నిర్ణయాలు తీసుకున్నాక సమావేశాన్ని ముగించవచ్చు.

సభ్యుల ప్రవర్తనలో మార్పు కనబడకపోయినట్టయితే కౌన్సిలర్ మళ్లీ సమావేశం ఏర్పరుస్తాడు. మరొక పరిష్కారాన్ని సూచిస్తాడు. సమస్యగలవారు అతని సమస్యను అతనే సర్దుబాటు చేసుకునేటట్లు చేస్తాడు.

సామూహిక సేవాపద్ధతిలో పరిజ్ఞానం కలిగి పరస్పర ప్రభావం అర్థం చేసుకోవడం మీద కౌన్సిలర్ నిపుణత ఆధారపడి ఉంటుంది. సమూహం మరీ చిన్నది, మరీ పెద్దది కాకుండా ఎన్నిక చేసుకోవడం వలన కౌన్సిలర్ బాగా పనిచేయగలుగుతాడు.

BRAOU

## 19.10 ముగింపు

ఒక సమస్య పరిష్కారానికి ఆధునిక పద్ధతుల్లో కౌన్సెలింగ్ ప్రధానమైనది. ఒక సమస్య గురించి నిపుణతగలవారు, జ్ఞానవంతులు, ప్రతిభగలవారు, ఆయా రంగాలపట్ల అవగాహనకలవారు కౌన్సెలింగ్ జరుపుతారు. సోషల్‌వర్క్‌లో కౌన్సెలింగ్ కూడా ముఖ్యసాధనం. సమస్యా బాధితులు తమ సమస్యల పరిష్కారం కొనం సుశిక్షితులయిన కౌన్సెలర్ వద్దకు వెళతారు. కౌన్సెలింగ్‌కు కొన్ని లక్ష్యాలు, సూత్రాలు ఉంటాయి. అట్లాగే వ్యక్తులకే కాకుండా సామూహిక కౌన్సెలింగ్ కూడా ఉంటుంది.

## 19.11 మాదిరి పరీక్ష ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి?**

1. కౌన్సెలింగ్ మూలసూత్రాలు వివరించండి?
2. కౌన్సెలింగ్‌లో దశల గురించి రాయండి?
3. సామూహిక కౌన్సెలింగ్ పద్ధతులు తెలుపండి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబు రాయండి.**

1. కౌన్సెలింగ్ పరిధి ఏమిటి?
2. కౌన్సెలింగ్ ప్రక్రియ గూర్చి రాయండి?
3. సామూహిక కౌన్సెలింగ్ అంటే ఏమిటి?

## 19.12 చదవదగిన పుస్తకాలు


1. Young, P.V. : 'Scientific Social Survay and Research'

2. Brij Mohan : 'Socialwork Research: An Innovative process'


BRAOU

BRAOU

# ఖండం- VI

## సామూహిక సమస్యలు: దృక్కోణాలు

సమాజంలో వ్యక్తుల వల్లే కాక సమూహాలవల్ల కూడా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. సమూహాలు వారి వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసమో, ఇతర వర్గాల ప్రయోజనాలను అడ్డుకోవడం కోసమో సమస్యలు ముందుకు తెస్తుంటాయి. ఈ గ్రూపుల వల్ల సమాజంలో ఉద్రిక్తతలు పెరిగి సంక్షోభానికి దారి తీస్తుంటుంది.

ఇటువంటి సామూహిక సమస్యల పరిష్కారానికి అనుప్రయుక్త సమాజంలో కొన్ని పద్ధతులు, పరిష్కారమార్గాలు వున్నాయి. వాటిని ఈ ఖండంలో వివరించడం జరిగింది. ముఖ్యంగా సామూహిక అవ్యవస్థను తొలగించేదిశగా ఎటువంటి మార్గదర్శకత్వం అవసరమో ఈ ఖండం వివరిస్తుంది. ఈ ఖండంలో మొత్తం మూడు భాగాలున్నాయి. అవి:

భాగం-20: సమూహ నిర్మాణం, సూత్రాలు: నమూనాలు

భాగం-21: సమూహం-కార్యక్రమాలు-భాగస్వామ్యం

భాగం-22: నాయకత్వం-రకాలు-పాత్ర-అభివృద్ధి

BRAOU

BRAOU

# భాగం-20: సమూహనిర్మాణం-సూత్రాలు, నమూనాలు

విషయక్రమం


20.0 ఉద్దేశాలు

20.1 పరిచయం

20.2 సమూహ అనుబంధాలు

20.3 సమూహంలో రకాలు

20.4 సమూహనిర్మాణం సిద్ధాంతాలు

20.5 సామూహిక సేవా పద్ధతి-మూలసూత్రాలు

20.6 సామూహిక సేవా సిద్ధాంతాలు

20.7 సమూహ నిర్మాణం

20.8 సమూహం నిర్మాణంలో ఉద్వేగభావాలు

20.9 కొన్ని ముఖ్యమైన సమూహనిర్మాణాలు

20.10 ముగింపు

20.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

20.12 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 20.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సమూహాల రకాలు తెలుసుకుంటారు.
- సమూహ నిర్మాణసిద్ధాంతాలను వివరించగలుగుతారు.
- సామూహిక సేవాపద్ధతి-మూల సూత్రాలను అధ్యయనం చేస్తారు.

## 20.1 పరిచయం

సమూహంతో పనిచేసి సామూహిక సమస్యలు పరిష్కరించడానికి కార్యక్రమాన్ని ఒక మాధ్యమికంగా వాడతారు. ఏదో సమూహ సభ్యులకు నచ్చిన కార్యక్రమాన్ని ఎన్నుకొని దాని ద్వారా ప్రతీ వ్యక్తితో వృత్తి పరమైన సంబంధాన్ని ఏర్పాటు చేసుకొని, వారి సమస్యను తెలుసుకొని దాన్ని పరిష్కరించడానికి కార్యకర్త ప్రయత్నిస్తాడు. అవిధంగా పనిచేయడానికి కావాల్సిన మూల సూత్రాలను, వాటి వెనుక ఆధారభూతమైన సిద్ధాంత నమూనాలను ఇక్కడ పొందుపరిచారు.

## 20.2 సమూహ అనుబంధాలు

ఒకే ధ్యేయంతో పనిచేసే రెండు లేక అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు కలిసిన కూటమిని సమూహమని పిలుస్తాము. సమూహాలను అధ్యయనం చేయడం వలన ఒక సంస్థలోని వ్యక్తుల ప్రవర్తనను అర్థం చేసుకోవడం వీలవుతుంది. సమూహంలోని వ్యక్తుల ప్రవర్తన ప్రతీ వ్యక్తి ప్రవర్తనలను మొత్తానికంటే ఎక్కువ అనగా వ్యక్తులు ఒకరు ఉన్నప్పటి ప్రవర్తన కంటే సమూహంలో ఉన్నప్పుడు వారి ప్రవర్తన భిన్నంగా ఉంటుంది. సమూహం, ప్రభావం, వారి ఉత్పాదక శక్తి మీద, ప్రవర్తన మీద చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల సమూహ నిర్మాణం సోషల్‌వర్క్‌లో అత్యంత కీలకమైన అంశం.

సమూహం అనగానే పరస్పరం సంబంధాలు తప్పనిసరిగా ఉంటాయి. ఒకరి మీద ఒకరు ఆధారపడతారు. ప్రతీ వ్యక్తి సమూహం మీద ప్రభావం చూపుతాడు. ప్రభావితుడు అవుతాడు. వ్యక్తులు యధాలాపంగా కూడే కూటమిని సమూహం అనలేము. వారు ఒకరికొకరు తెలియదు. ఒకరితో ఒకరికి సంబంధం ఉండదు. ఉదాహరణకు సినిమాహాలులో సినిమా చూసే వారు, రైలు కోసం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం మీద వేచి వుండే జనాన్ని సమూహంగా భావించలేము. సమూహానికి ఈక్రింది లక్షణాలు ఉండి తీరాలి.

1. ఒకే రకమైన లక్ష్య సాధనకు జనం పరస్పర మైత్రి కలిగి ఉండాలి.
2. మానసికంగా ఒకరినొకరు తెలిసి వుండాలి. ఒకరిమీద ఒకరు పరస్పరం ఆధారపడాలి.
3. వారు అంతా ఒక సమూహంగా భావించాలి.

వీటిలో ఏ ఒక్క పరిస్థితి లోపించినా దానిని సమూహంగా భావించం. ఒకే రైల్లో ప్రయాణం చేసేవాళ్ళ ఒక సమూహంగా చెప్పవచ్చును. ఒకే లక్ష్యం వారికున్నది. ప్రతీ రోజూ ఆ వ్యక్తులు ప్రయాణం చేస్తున్నారు. విసుగు రాకుండా చర్చించుకుంటారు. పేకాడుకుంటారు. వార్తా పత్రికలు, సీట్లు పంచుకుంటారు. ఒకరిమీద ఒకరు ఆధారపడతారు. అందుకని ఒకే బోగీలో రోజూ ఎక్కి ప్రయాణం చేసే కొద్ది మంది ప్రయాణీకులను సమూహం అని పిలువవచ్చు.

BRAOU

## 20.3 సమూహం రకాలు

సామాన్యంగా రెండు రకాల సమూహాలు మనకు కనిపిస్తాయి. 1. నియంత్రిత సమూహాలు, 2. అనియంత్రిత సమూహాలు.

### 1. నియంత్రిత సమూహాలు

ఈ సమూహాలు ఒక సంస్థలో భాగాలు. యాజమాన్యం నిర్దేశించిన విధులను నిర్వర్తించవలసి ఉంటుంది. ఉదాహరణకు పనిచేసే సమూహాలు, కమిటీలు, నాణ్యత జట్లు. ఈ సమూహాలకు అధికారం, బాధ్యత నిశితంగా నిర్దేశింపబడతాయి. సమాచారం తెలియడం చాలా నిర్దిష్టంగా ఉంటుంది. ఈ సమూహంలోని వ్యక్తుల ప్రవర్తనను నియంత్రించడానికి కొన్ని నియమాలను ఏర్పాటు చేస్తారు. అధికారిత ప్రదర్శించే సంస్థనే నియంత్రిత సమూహంగా పేర్కొనవచ్చు.

### 2. అనియంత్రిత సమూహాలు

సంస్థలలో గల పరస్పర సంబంధం వలన వాటంతట అవే నిర్మితమయ్యే సమూహాలను నియంత్రిత సమూహాలుగా పేర్కొంటాము. ఇవి వ్యక్తుల వలన సృష్టించిన సమూహాలేగానీ యాజమాన్యం ఏర్పరిచినవికావు. సాంఘిక పరస్పర సంబంధాలలో అవసరంవల్ల సహజంగా ఏర్పడిన సమూహాలు నియంత్రిత సమూహాలు. ఒకే ఆసక్తి

వలస, భాష, కులం, మతం, వర్గం వలన ఏర్పడినవి. ప్రతీసంస్థలో అనియంత్రిత సమూహాలు వాటంతట అవే ఏర్పడుతాయి.

అనియంత్రిత సమూహాలు అనధికార సమూహాలు. ఇవి వ్యక్తి మీద కేంద్రీకృతమైనవి. అంతేకానీ ఇక్కడ స్థాయి ప్రధానాంశం కాదు. ప్రతీ సమూహం తన సభ్యుల ప్రవర్తనను నియంత్రించడానికి కొన్ని నియమాలను ఏర్పరుస్తుంది. ఈ అనియంత్రిత సమూహాలు సాధారణంగా నియమాలను సడలించే పని చేస్తాయి. సమాచారం అందించడంలో కూడా ఒక పద్ధతిని అనుసరించరు. ఈ సమూహాలు వ్యక్తిగత పరిస్థితులకే ప్రాధాన్యతనిస్తాయి. ఈ సమూహాలు మానవ సంబంధాలకు ఇచ్చిన ప్రాముఖ్యతను సాంకేతిక విషయాలకు ఈయవు.

### 3. ఆజ్ఞాపనా సమూహాలు

నియంత్రిత సమూహాలను తిరిగి రెండు రకాలుగా విభజించారు. 1. ఆజ్ఞాపించే సమూహాల వ్యక్తులకు క్రింద పనిచేసే వ్యక్తులుంటారు. వారు ఒక యజమానికి సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కానీ పనిచేసేసమూహాలలో. వ్యక్తులు అందరూ కలిసి పనిచేయడం ఉంటుంది. ఒక పనిని పూర్తి చేయడం, ఫలితాలు సాధించడమే ఇక్కడ ముఖ్యం. అందరూ అందరికీ సమానమే. ఇక్కడ యజమాని ఉండడు.

### 4. ఆసక్తి సమూహాలు, స్నేహ సమూహాలు

అనియంత్రిత సమూహాలు ఆసక్తిని బట్టీ, స్నేహం వలనా సమూహాలుగా ఏర్పడతాయి. ఒక ప్రత్యేక లక్ష్యంతో ఏర్పడిన ఆసక్తి సమూహం అజ్ఞాపించే సమూహం కాదు. పనిచేసే సమూహం కాదు. ఉదాహరణకు తక్కువ ఖర్చుతో ప్రయాణ సౌకర్యాన్ని ఏర్పరచమని యాజమాన్యం మీద ఒత్తిడి తీసుకురావడానికి ఏర్పడిన సమూహాన్ని ఆసక్తి సమూహం అంటారు. స్నేహ సమూహాలు సంస్థ వెలుపల ఏర్పడుతాయి. స్నేహితులతో, బంధువులతో ఏర్పడతాయి. వారు ఒకరికొకరు బాగా తెలుసు. సంబంధాలు బాగా ఉంటాయి.

BRAOU

## సెలీస్ వర్గీకరణ

ఒత్తిడి తెచ్చే చిన్న సమూహాలను దృష్టిలో పెట్టుకొని సెలీస్ సంస్థలలో ఏర్పడే సమూహాలను నాలుగు రకాలుగా విభజించాడు. అవి:

#### 1. నిర్లక్ష్య సమూహాలు

చాలా తక్కువ జీతాలు, నిపుణతలేని పనిచేసేవారి సమూహం. వారిలో ఐకమత్యం ఉండదు. అధికారం ఉండదు. ఏరకమైన ఒత్తిడి యాజమాన్యం మీద చేయరు. వారు నాయకున్ని అంగీకరించరు. సంస్థపట్ల నిర్లక్ష్యవైఖరి కనపరుస్తారు.

#### 2. నియమరహిత సమూహాలు

ఈ సమూహాలలో సగం నిపుణత కలిగిన పనివారు వుంటారు. సమూహంగా పనిచేస్తారు. ఐకమత్యం ఉంటుంది. కానీ వారు యాజమాన్యంతో ప్రవర్తించేటపుడు ఒక పద్ధతి ఉండదు. ఒకసారి ఒకలా మరోసారి ఒకలా ప్రవర్తిస్తారు. అనగా ఒకసారి సహకారం మరొకసారి విరోధభావం వహిస్తారు. సమూహాల ప్రవర్తన అంచనా వేయడం కష్టం.

#### 3. వ్యూహాత్మక సమూహాలు

ఈ సమూహాలలోని సభ్యులు మిగిలిన సమూహాలమీద, యాజమాన్యం మీద ఒత్తిడి తేగలరు. మొదటి రెండు రకాల సమూహాలలో వ్యక్తులకన్నా వారివి మంచి ఉద్యోగాలు. నిపుణత కలిగి అవసరమైన నిర్ణయాలు తీసుకొనే ఉద్యోగులు. ఐకమత్యం ఎక్కువ. కార్మిక సంఘాల కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

4. తిరోగమన సమూహాలు

చాలా నిపుణత కలిగిన ఉద్యోగుల సమూహం. వీరు సాధారణంగా సంస్థలలో మొదటి స్థానంలో ఉంటారు. చాలా ఆత్మవిశ్వాసం కలిగి వుంటారు. వారంతటవారు పనిచేయగలరు. ఒకవేళ వారు సంస్థ పనిచేయకుండా ఉండాలనుకుంటే అలా చేయగలరు. అవి చాలా బలమైన సమూహాలు. ఒక్కొక్క ప్రత్యేకమైన లక్ష్యాలతో చాలా అరుదుగా అటువంటి వత్తిడిని తెస్తారు.

## 5. 'క్లిక్' సమూహాలు

ఈ సమూహాలలో తరచూ పరస్పర సంబంధాలను కలిగి కొన్ని నియమ నిబంధనలను పాటించడం కనిస్తుంది. ఈ సమూహం లక్ష్యం సమూహం మీద ఆధిపత్యం వహించడమే. వీరు ఐదు లేక ఆరు సంస్థలలో సభ్యులుగా ఉంటారు. ఈ క్లిక్ సమూహంలో సభ్యుల సంస్థకు చెందని మరికొందరితో సమూహాలను ఏర్పరుస్తారు. వీటిని ఉప-క్లిక్ సమూహాలుగా పిలుస్తారు. డాల్టన్ అనే సామాజిక శాస్త్రవేత్త క్లిక్ సమూహాలను మూడు రకాలుగా వర్గీకరించాడు.

1. నిలువు-క్లిక్ సమూహాలు

ఒకే 'లంబ క్లిక్' గ్రూపులు: ఏతరగతికి చెందినా సరే, ఒక విభాగంలోని ఉద్యోగులంతా కలిసి ఒక సమూహంగా ఏర్పడతారు. ఉదాహరణకు అందరికీ అధికారి అయినవ్యక్తి తన కింది వారితో కలిసి సమూహంగా ఏర్పాటు చేయవచ్చు. సహకారం అధికారికి కావల్సి కావచ్చు. లేక తన సామర్థ్యంతో సాధించలేనిదానిని సమూహ సహకారంతో సాధించడానికి ఈ సమూహంతో ఉంటాడు.

BRAOU

2. సమాంతర సమూహాలు:

ఈ సమూహాలు సాధారణంగా ఒకే తరగతికి చెందిన వ్యక్తులతో ఏర్పడతాయి. అనియంత్రిత సమూహాలలో సాధారణంగా కనిపించే సమూహాలు. కొన్ని నియమాలు కొన్ని ప్రమాణాలకు లోబడి ఒక లక్ష్యంతో ఏర్పడిన సమూహం.

3. మిశ్రమ క్లిక్ సమూహాలు

ఆరకం సమూహ సభ్యులు వివిధ తరగతుల నుండి, విభాగాలనుండి, వివిధ ప్రదేశాలనుండి ఒక లక్ష్యంతో సమూహ సభ్యులవుతారు. ఒకే కాలనీలో ఉండే ఉద్యోగులు, ఒకే క్లబ్‌లలో గల సభ్యులు, లేదా ఒకే రైలులో ప్రతిరోజు ప్రయాణించే ప్రయాణీకులు ఈ రకమైన సమూహానికి ఉదాహరణ.

## 20.4 సమూహనిర్మాణం-సిద్ధాంతాలు

1. సామీప్యతా సిద్ధాంతం

వ్యక్తులు ఒకరితో ఒకరు సంబంధాలు ఏర్పరచుకోవడానికి భౌతిక సాన్నిహిత్యం కారణం. ఒకచోట ఉద్యోగం చేసేవారు ఒక సమూహంగా ఏర్పడడం సాధారణంగా జరుగుతుంది. పరిశోధనలుకూడా ఈ రకంగా సమూహ నిర్మాణం జరగటంలో ఉన్న క్లిష్టమైనవిషయాలను విశ్లేషణ చేయకపోవడం ఈ సిద్ధాంతంలోని లోపం.

2. హోమెన్ సిద్ధాంతం

జార్జ్.సి హోమెన్ ప్రకారం, 'కార్యక్రమాలలో పాల్గొనటం వలన వారి పరస్పర సంబంధాలు పెరిగి అభిప్రాయాలు, కార్యక్రమాలు పంచుకోవడం జరుగుతుంది. ఇలా కార్యక్రమాలు, అభిప్రాయాలు పెంచుకోవడం వలన పరస్పర

సంబంధాలు పెరుగుతాయి' అని తెలియజేశాడు. సమూహ నిర్మాణం సమూహ ప్రక్రియ అర్థం చేసుకోవడానికి ఈ సిద్ధాంతం చాలా ఉపయోగపడింది. వ్యక్తులు పరస్పర సంబంధాలు ఏర్పరచుకొంటారు. కేవలం భౌతిక సాన్నిహిత్యం వలన కాదు. తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి, లక్ష్యాలు సాధించడానికి, ఒకరికొకరు సహాయపడడానికి ఉద్రిక్తతలు తగ్గించడానికి సమూహాలు ఏర్పడతాయి.

3. సమన్వయ సిద్ధాంతం

థియేడార్ న్యూ కోంబు ఈ సిద్ధాంతాన్ని ఈ విధంగా నిర్వచించాడు. ఒకే రకమైన లక్ష్యంపట్ల ఒకే రకమైన ఆంతర్యాలు కలిగిన వ్యక్తులు ఒక చోటకు ఆకర్షింపబడతారు. ఒకేసారి ఈ రకమైన సంబంధం ఏర్పడిన తరువాత ఆకర్షణకు, ఒకేరకమైన ఆంతర్యానికి మధ్య చక్కని సమన్వయం సాధించాలి. ఈ సమన్వయం దెబ్బతిన్నప్పుడు దానిని సరిచేయాలి. అలా చేయలేనప్పుడు సంబంధాలు దెబ్బతింటాయి. భౌతిక సామీప్యత పరస్పర సంబంధాలు ఈ సమన్వయ సిద్ధాంతంలో మంచి పాత్రను పోషిస్తాయి.

## 20.5 సామూహిక సేవా పద్ధతి-మూలసూత్రాలు

వ్యక్తిగత సమస్యలను పరిష్కరించడానికి సమూహాలను ఏర్పాటు చేసి ఆయా సమస్యలపరిష్కారానికి సామూహిక సేవా పద్ధతి ఉపయోగిస్తారు. సమస్య గల వ్యక్తులను ఒక సమూహంగా ఏర్పరుస్తారు. ఒక్కోసారి ఏ సమస్యా లేదనుకున్నప్పుడు సమూహంగా ఏర్పడి, తమ సమస్యలను కూడా గుర్తిస్తారు. కొన్ని సందర్భాలలో కేవలం వినోదం కోసం కూడా సమూహ సభ్యత్వాన్ని వ్యక్తులు స్వీకరిస్తారు. ఈ సమూహాలను ఒక నిర్దిష్టమైన పద్ధతిలో శిక్షణ కలిగిన సామూహిక కార్యకర్త ఏర్పరచి కార్యక్రమాలను కొనసాగిస్తాడు. ఆ కార్యక్రమాల నిర్వహణకు అనుభవజ్ఞులు అయిన సామూహిక సేవా కార్యకర్తలు తన అనుభవం, పరిశోధనతో సాధించిన పరిజ్ఞానాన్ని కొన్ని మూల సూత్రాలుగా తయారుచేసి కార్యకర్తగా శిక్షణ పొందిన వ్యక్తులకు అందించారు. ఈ సూత్రాలను యథాతథంగా ఆచరించవలసిన పనిలేదు. అవసరమైన చోట, వ్యక్తుల అవసరాలను గమనించి మార్చుకోవచ్చును. లేనట్లయితే ఆచరణ వలన కలిగిన అనుభవంతో ఈ మూల సూత్రాలను పెంచుకోవచ్చు. మెరుగుపరచుకోవచ్చు. సమూహంలోని వ్యక్తికి అతని అవసరాలకు ఇక్కడ ప్రాముఖ్యత ఇవ్వనైనది.

BRAOU

### 1. సామూహిక సేవాపద్ధతి-మూలసూత్రాలు

ప్రణాళికాబద్ధమైన సమూహనిర్మాణం, ఆ సమూహం ప్రభావం వ్యక్తి మీద చాలా ఎక్కువ. ఈ ప్రభావం ఎల్లప్పుడు అనుకూలంగా ఉండనక్కరలేదు. కొన్ని వేళల్లో వ్యక్తిగత సౌలభ్యానికి వ్యతిరేకంగా కూడా ఉంటుంది. భవిష్యత్తులో వ్యక్తికి ఆ సమూహంలో సభ్యులు అనుకూలురుగాను, ఆ సమూహం వ్యక్తి పురోభివృద్ధికి అనుకూల ప్రదంగానూ ఉండేటట్లు చేయడానికి సమూహాన్ని తయారు చేయాలి. ఉదా: పదిమంది వ్యక్తులతో సమూహాన్ని తయారు చేసేటప్పుడు, ఎక్కువ మంది అనగా, ఆరుగ్గురు చురుగ్గాను, నలుగురు జడులుగానూ ఉన్నప్పుడు, క్రమంగా జడులైన వారు కూడా చురుకుగా కార్యక్రమాలలో పాల్గొనేనట్టు సమూహం ప్రభావం చూపుతుంది. లేదా ఆరుగురు స్వభావ సిద్ధంగా జడులు నలుగురు చురుకుగా పాల్గొనేవారైనప్పుడు, క్రమంగా ఈ నలుగురు చురుకుగా పాల్గొనేవారు కూడా జడత్వం పొంది, కార్యకలాపాలలో పాల్గొనడం తగ్గిపోతుంది. అందువలన సమూహం వ్యక్తి మీద అనుకూలమైన ప్రభావం కలుగజేయడానికి సమూహం నిర్మితమయినప్పుడే జాగ్రత్తపడాలి.

ఇంటింటికి సర్వేచేసి కార్యక్రమాల మంచి చెడ్డలు వివరించి సమూహంలో సభ్యులుగా, చేరమని చెప్పి కొత్త సభ్యుల సమూహం తయారు చేయవచ్చును. లేదా కార్యకర్త మార్గదర్శకం లేని అనియంత్రిత సమూహాన్ని తన సంస్థలోకి ఆహ్వానించవచ్చును. ఏరకంగా సమూహాన్ని తయారు చేసినా సమూహం ప్రభావం వ్యక్తి మీద చాలా ఎక్కువగా ఉంటుందని దృష్టిలో ఉంచుకొని కార్యకర్త సమూహాన్ని నిర్మించాలి.

## 2. నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పరచడం

వ్యక్తుల సామర్థ్యం, అనక్తి అర్థం చేసుకొని సంస్థ శక్తి సామర్థ్యాలు దృష్టిలో ఉంచుకొని సమూహానికి లక్ష్యాలు ఏర్పరచాలి. లక్ష్యం లేని సమూహంతో ఉపయోగముండదు. శాస్త్రీయంగా సమూహాన్ని నడిపించాలంటే లక్ష్యం తప్పనిసరి.

## 3. సామూహిక కార్యకర్త-సమూహాల మధ్యగల వృత్తిపరమైన సంబంధం

కార్యకర్త, సమూహంలో సభ్యులను ఏవిధమైన పక్షపాత వైఖరి లేకుండా చూడాలి. అన్ని విషయాలను సమూహంలోని ప్రతీవ్యక్తి చేత అంగీకరింపజేయాలి. వ్యక్తుల సామర్థ్యం, తెలివి తేటలు, శక్తియుక్తులు కార్యకర్తకు తెలియాలి. కానీ ఆ లక్ష్యాలు కార్యకర్త ప్రవర్తనను ప్రభావితం చేయకూడదు. శక్తి సామర్థ్యాలు కొరవడినవారు, తెలివితక్కువవారు, ధనం, అందం, ఆకర్షణలు లేనివారు కూడా కార్యకర్తకు ముఖ్యులే. ఇది చెప్పినంత సులువుకాదు. కార్యకర్త కూడా మానవ మాత్రుడే. కానీ సాధన వలన వ్యక్తికి వ్యక్తిగత గౌరవమివ్వడం అలవాటవుతుంది. సాధారణంగా ప్రత్యేకతలే సమాజంలో వ్యక్తులకు అభిమానం తెచ్చిపెడతాయి. కానీ సామూహిక కార్యక్రమాలలో కార్యకర్త బలహీనులను, సాధారణవ్యక్తులకు కూడా మిగిలినవారితోపాటు, అభిమానంగా ఆత్మీయంగా, గౌరవమిచ్చి ప్రవర్తించాలి. ఈ ప్రవర్తన కారణంగానే సమూహంలో వ్యక్తులు సహకారం అందిస్తారు. కార్యకర్త, సభ్యుల మధ్య పరస్పర అవగాహన, సహకారం ఏర్పడుతుంది. ముందు ముందు వారి సమస్యలను పరిష్కరించడానికి ఈ వృత్తిపరమైన సంబంధం పునాదిగా ఉపయోగపడుతుంది.

## 4. సమూహాన్ని వ్యక్తీకరించడం

మార్పు ప్రకృతి సిద్ధాంతం. కార్యకర్త ఉండడం వలన ఒక నిర్దిష్టమయిన లక్ష్యం గల సంస్థ ఉండడం వలన, వ్యక్తిలో సహజ పరిణామమయిన మార్పును వేగపరిచి, అనుకున్న లక్ష్యం చేరాలి. ఎప్పటికప్పుడు మార్పు జరుగుతున్నదా? లక్ష్యంవైపు సమూహం పయనిస్తుందా?' లేక వ్యతిరేకదిశలో సమూహం పయనిస్తున్నదా? అని కార్యకర్త అంచనా వేయాలి. ఒకవేళ లక్ష్యానికి వ్యతిరేకంగా సమూహం పయనిస్తున్నప్పుడు, ఆ సమూహంలో మార్పుకు కావాల్సిన అవకాశాలు ఆ కార్యక్రమాలలో లేవని కార్యకర్త తెలుసుకోవాలి. సమూహంలోని వ్యక్తుల శక్తియుక్తులు, బలహీనతలు స్పష్టంగా తెలుసుకోవాలి. తెలుసుకున్న విషయాలను నెమ్మదిగా సందర్భానుసారంగా సభ్యులకు తెలియజేయాలి. వారిని కూడా కార్యకర్త, తను కార్యక్రమాలు తయారు చేసేటప్పుడు కలుపుకుపోవాలి. ఒకసారి తన శక్తి సామర్థ్యాలు, బలహీనతలు అర్థం అయ్యాక, కార్యకర్త వారిని కూడా తన పథకాలలో ఉంచడం వలన లక్ష్యాన్ని చేరుకోవడం సులువుగా వీలవుతుంది.

వ్యక్తులలాగే సమూహాలకు కూడా, వేరువేరు సామర్థ్యాలు, నేర్చుకోవడంలో తేడాలు ఉంటాయి. వారిని తొందరపెట్టకుండా, వారికి సులువైన రీతిలోనే నేర్చుకోనివ్వాలి. వారి అభిప్రాయాలు నిర్భయంగా నిస్సంకోచంగా బయటకు వెల్లడించే వాతావరణాన్ని కార్యకర్త సృష్టించాలి.

## 5. మార్గదర్శక పూర్వకమైన అంతశ్చర్య

కొంతమంది వ్యక్తులు ఒక దగ్గర కలిసి కాలాన్ని గడపడం వలన ఎంతో కొంత పరస్పర ప్రభావం తప్పదు. అటువంటప్పుడు సుశిక్షితుడైన సామూహిక కార్యకర్త, ఆరోగ్యకమైన పరస్పర ప్రభావాన్ని తను పాల్గొని, తన నిపుణతతో, పెంపొందిస్తాడు. వారితో తన పరిచయాన్ని తగ్గించుకొని సమూహ సభ్యులలో వారిలో వారు సంబంధాన్ని పెంచుకొనేలా చూడాలి. అవసరమైన చోట మాత్రమే కార్యకర్త కలుగజేసుకోవాలి.

## 6. స్వయం నిర్ణయం

సమూహంలో సభ్యులు, నిర్ణయాలు తీసుకోవాలన్న రెండు విషయాల మధ్య ఎన్నిక చేసుకోవాల్సి ఉన్నా ఆ నిర్ణయాధికారాన్ని ఆ ఎన్నుకొనే అవకాశాన్ని కార్యకర్త, వారికే విడిచిపెట్టాలి. కార్యకర్త తన అనుభవం నుంచి కూడా

BRAOU

ఎన్నిక చేయవచ్చును. కాని సభ్యులు తామే ఎన్నిక చేసుకోవడం వలన కష్టనష్టాలు తెలుసుకొని, ఎన్నిక చేసుకొనే శక్తి, సరయిన నిర్ణయాలు తీసుకొనే శక్తి, సభ్యులు కాలక్రమేణా నేర్చుకోవడానికి వీలవుతుంది. ఒకవేళ సమూహంలోని సభ్యులు, సమూహంలో పనిచేయడం ఇష్టం లేకపోతే దానికి కూడా వారి నిర్ణయాన్ని గౌరవించాలి.

## 7. మార్చుకోగలిగిన నియమాలు గల సంస్థ

ఏ సంస్థకైనా కొన్ని నియమాలు, సమయపాలన విధులు కేటాయించడం తప్పనిసరిగా ఉంటాయి. ఎవరి విధులువారు నిర్వర్తించాలి. సమయపాలన అవసరం సమూహాన్ని కనుక సంస్థ అనుకుంటే అందులోని వారికి విధులు కేటాయించి కాలవ్యవధి నిర్ణయించాలి. కానీ పనిచేసేటప్పుడు అవసరమయితే నియమాలను సడలించాలి.

ఉదా: శారీరకంగా కష్టపడే సమూహంతో పనిచేసేటప్పుడు కార్యక్రమం కాలాన్ని నిర్ణయించాలి. కానీ ఎక్కువమంది చెప్పిన సమయానికి రాలేరు. కాలాన్ని తప్పించి లేదా ఆలస్యంగా కార్యక్రమానికి తోడయినప్పుడు వారిని కూడా అంగీకరించాలి.

## 8. కార్యక్రమాల అనుభవం

కార్యక్రమాలను సమూహ సభ్యుల అవసరం, ఆసక్తి, అనుభవం, సమర్థతలను దృష్టిలో ఉంచుకొని కార్యక్రమాన్ని ఎన్నుకోవాలి. కార్యక్రమం ఒక మాధ్యమికం మాత్రమే. కార్యక్రమమే మన లక్ష్యం కాదు. కార్యక్రమం ద్వారా సమూహ సభ్యుల మూర్తిమత్వం అభివృద్ధి చేయడానికి ప్రయత్నించాలి. కార్యక్రమం ఏదైనా ఫరవాలేదు. ఉదా: సంగీతం, నాటకం, ఆటలు, చర్చలు, మొదలైనవాటిలో ఏదో ఒకటి సభ్యులు తన అభిరుచులు, అవసరాన్ని బట్టి ఎన్నుకున్నాక దాని ద్వారా వారివారి స్వభావ లక్షణాల మార్పు తెచ్చి మంచి పౌరులుగా మార్చడం ఈ సామూహిక సేవా పద్ధతిలో ముఖ్యాంశం.

## 9. సామాజిక వనరులను ఉపయోగించుకోవడం

వ్యక్తుల సమూహం, సమూహంలో ఉన్నది. సమూహంలో ఉన్న వ్యక్తుల సమస్యలను, ఆ సమూహమున్న సాముదాయిక వనరులను ఉపయోగించి పరిష్కరించాలి. కార్యకర్త సమూహంలోని సమస్యలను, సాముదాయిక వనరులను ఉపయోగించి పరిష్కరిస్తాడు. దానికి కార్యకర్త అవసరమయిన సేవలకోసం వివిధ నిపుణులకు లేక సంస్థలకు వ్యక్తులను సమస్యా పరిష్కారార్థం పంపుతాడు.

## 10. పర్యాలోచన

కార్యకర్త తన సమూహంతో పనిచేసి ఆ పనులను పనితీరుని, దాని తాలూకు సమస్యలను పరిష్కారాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తాడు. ఇది కార్యకర్త బాధ్యత. అలా పర్యాలోచన చేయడం వలన తనను తాను సరిచేసుకోవడం, కార్యక్రమాలలో, వ్యక్తుల స్వభావాలను అర్థం చేసుకొని సరిచేయడానికి వీలవుతుంది.

# 20.6 సామూహికసేవ-సిద్ధాంత రూపాలు

## 1. మనోవిశ్లేషణ సిద్ధాంతం

వ్యక్తి మనోవిశ్లేషణకు సమూహాన్ని ఒక మాధ్యమికంగా ఉల్ఫ్ శాల్విసన్ భావించాడు. సమూహ సభ్యుల పట్ల వ్యక్తి భావాలను, ఆవేశాలను సమూహ కార్యకర్త అర్థం చేసుకుంటాడు. తన కుటుంబ సభ్యుల పట్ల తనకు గల ఆత్మీయత అభిమానం లేదా ద్వేషం, కోపాన్ని సమూహ కార్యకర్తల మీదకు మళ్లించడాన్ని బదలాయింపు అంటారు. వ్యక్తి దీనిని సమూహ కార్యకర్త, ఇతర సభ్యుల మీదకు మళ్లించడం జరుగుతుంది. ఒక వ్యక్తి లోపల అనారోగ్య లక్షణాలు, ప్రేరణలు అర్థంఅవుతాయి. సభ్యులను మాట్లాడిస్తారు. పరస్పర సంబంధాలను అర్థం చేసుకొని, విషయాన్ని కార్యకర్త అర్థం అయ్యేలా చెబుతాడు. మాట్లాడిన విషయాలు మాట్లడకుండా సూచించిన విషయాలు కార్యకర్త విశ్లేషించడం ఈ సిద్ధాంత లక్ష్యం. అంటే వ్యక్తి మానసిక విశ్లేషణమీద ఆధారపడి కార్యకర్త, వ్యక్తిని సమూహంలో భాగం చేడం ఈ



BRAOU

సిద్ధాంత లక్ష్యం.

### 2. క్షేత్ర సిద్ధాంతం

ప్రతీ వ్యక్తికి జీవావరణం ఉంటుంది. దాన్నే క్షేత్రం అంటారు. వాటిలో సానుకూల, ప్రతికూల రెండు అంశాలు ఉంటాయి. అవి వ్యక్తికి ఆందోళన కలుగజేస్తాయి. సానుకూల దృక్పథం లక్ష్యంవైపు నడిపిస్తుంది. ప్రతికూల శక్తులు ఆ పనిని నిరోధిస్తాయి. ఆరెండింటి శక్తుల సమతౌల్యం మీద వ్యక్తి లక్ష్యసాధన ఆధారపడి ఉంటుంది. సమూహం కూడా వ్యక్తిలా లక్ష్య సాధనకు ప్రయత్నిస్తుంది. వ్యక్తులను ఒక బంధంలో సమూహంగా ఉంచిన శక్తులు ఆ సమూహశక్తిగా భావించాలి. సమూహానికి కూడా జీవావరణం ఉంది. సానుకూల, ప్రతికూలతలు శక్తులు అర్థమయినప్పుడు సమూహాన్ని బలపరచడం తేలిక అవుతుంది. క్షేత్ర సిద్ధాంతం జరిగిన కాలాన్ని ఉపేక్షించదు. క్షేత్రం మీద పాత అనుభవాల మీద ప్రభావం అంచనావేసి సమూహ సమస్యలు పరిష్కరిస్తుంది.

### 3. ప్రవర్తనా సిద్ధాంతం

సామూహిక సేవలో సర్రి ప్రవర్తనా సిద్ధాంతం గురించి మూడు యథార్థాలను వివరించాడు. అవి: 1. సామూహిక సేవలో సమూహంలో వ్యక్తుల పరస్పర సంబంధాల వలన మార్పు వీలవుతుంది. 2. సేవార్థికి బాహ్యంగానే చికిత్సా పద్ధతి వాడతారు. అనగా సేవార్థి చుట్టూ వున్న పరిసరాలను సవరించడం ద్వారా అతని సమస్య పరిష్కరిస్తాడు. 3. అతనికి చేసే సహాయం చికిత్స అతని సమస్యకు సంబంధించినది. అతని చుట్టూ సరియైన పరిస్థితులు ఏర్పరిస్తే వ్యక్తి తప్పకుండా తన ఆంతర్యాలను, ప్రవర్తనను మార్చుకుంటాడు. లక్ష్యం వైపునకు సాగడానికి అతన్ని మలచాల్సి ఉంటుంది. ప్రవర్తన గతించిన, జరుగుతున్న సంఘటనల సంగమమే. కోరుకున్న ఫలితాలు, సంతృప్తికరంగా ఉన్నప్పుడు, ఆ ప్రవర్తనను ప్రయోజనమైన ప్రవర్తనగానూ, అవి దొరకప్పుడు అప్రయోజనమైన ప్రవర్తనగానూ భావిస్తాడు. ఇక్కడ ఈ సిద్ధాంతానికి ఒక పరిమితి ఉంది. ఇది కేవలం బాహ్య విషయాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నందున మానవ ప్రవర్తనను చాలా చిన్న పరిధిలోంచి చూడడం జరుగుతోంది.

### 4. పరస్పర సంబంధాల సిద్ధాంతం

కార్ట్‌రైట్, జాండర్ చెప్పినదానికంటే సిద్ధాంతానికి ఎక్కువ పరిధి ఉంది. సమూహం అధ్యయనం కోసం పరస్పర సంబంధాలను అంచనా వేయడం అవసరం అయింది. అలా అంచనా వేయడం శాస్త్రీయంగా జరుగుతుంది. వాటిని గణాంకాలలోకి మార్చాలి. కొన్ని భావాలను కొలవడం వీలవ్వదు. కాబట్టి పరస్పర సంబంధాలను అంచనా వేయడంలో కొన్ని కొలబద్దలు మాత్రమే ఉపయోగపడతాయి.

ఈ సిద్ధాంతమే సామూహిక సేవా ప్రక్రియను నమోదు చేయడానికి దోహదపడింది.

BRAOU

## 20.7 సమూహం నిర్మాణం

సమూహం నిర్మాణం ముఖ్యమైన విషయం సమూహం ఏర్పాటులో జరిగే వివిధ దశలలోనూ చిన్న చిన్న సంఘటనలు జరుగుతాయి. కార్యకర్త దాన్ని పట్టించుకోకుండా, సమూహ లక్ష్యాలను చేరడానికి సమూహం చేసే ప్రయత్నాలను, కార్యక్రమాలను, ఒకరిపట్ల ఒకరికిగల నమ్మకం, సహకారం, అర్థం చేసుకొని వారికి అవసరమైన సలహాలను ఇవ్వాలి.

కొన్ని ప్రత్యేక ధోరణుల వలన సమూహ సభ్యులలో జఢత్వం, కార్యక్రమాలను, లక్ష్యాలను ధ్వంసం చేసే పరిస్థితులు ఏర్పడతాయి. కార్యకర్త వాటిని గుర్తించి, సభ్యులు గుర్తించేలా చేసి సమూహంలో ఆసమస్య పరిష్కారానికి కృషి జరుపుతాడు.

### సమూహం ఏర్పాటు ప్రక్రియ

మొదటి సమావేశంలో సమూహ సభ్యులు ఒకరికొకరు తెలియరు. ఒకరితో ఒకరు అనుభూతులు

పంచుకోజాలరు. కలివిడిగా ఉండరు. పైపైన మాట్లాడుకుంటారు. వారు నివసించిన స్థలాల గురించి, తమ సమవయస్కులతో స్త్రీలయితే స్త్రీలతో, పురుషులయితే పురుషులతో మాట్లాడతారు. అలాగే ఒకే విషయంలో ఆసక్తిగలవారు వారితో మాట్లాడడం జరుగుతుంటుంది. అయితే ఈ క్రమంలోనే సమూహం అభివృద్ధి కూడా ప్రారంభమవుతుంది.

## సమూహ లక్ష్యాల నిర్ణయం

సమూహ సభ్యులు సమూహ లక్ష్యాలను ఏర్పాటు చేస్తారు. సమూహ సభ్యులలో ఆత్మవిశ్వాసం పెంచి, వారి పెరుగుదలకు కావలసిన జాగ్రత్తలు తీసుకొన్నట్టయితే సమూహ లక్ష్యాలు నిర్ణయించడం సమస్యేకాదు. సమూహ సభ్యులు అసలు సమూహంతో జట్టు కట్టడమే కొత్త విషయాలు తెలుసుకోవడానికి కొత్త నైపుణ్యాన్ని సంపాదించుకోవడానికి అయినప్పుడు వారు నేర్చుకోవడానికి సిద్ధంగానే ఉంటారు. ఎక్కువగా, ఒక సమగ్రమైన చర్చతో, సభ్యులు, సమూహ లక్ష్యాలను ఏర్పాటు చేసుకొంటారు. ఒక్కోసారి వ్యక్తిగత సమస్యలు సమూహ లక్ష్యాల పరిధిని విస్తృతం చేస్తాయి. లేదా లక్ష్యాలలో మార్పుతెస్తాయి. సమూహ సభ్యులలో లక్ష్యాలపట్ల అంకిత భావం లేకపోవడం వలన, నిర్ణయాలు తీసుకోవడంలో సమస్యలు ఉత్పన్నమవుతాయి.

కొన్ని సమూహాలలో లక్ష్యాన్ని వ్యక్తీకరించడంలో మొదట స్పష్టత ఉండదు. కానీ సభ్యులంతా మళ్లీ లక్ష్యాలను చర్చించుకొని సమూహ కార్యక్రమాలను నిర్ణయించుకోవాలి. వ్యక్తిగతంగా సామూహికంగా వారికి సంబంధించిన సమస్యలను చర్చించుకొని లక్ష్యాలను ఏర్పరచుకోవాలి. ప్రతీ వ్యక్తికి గల సమస్యలు దానికి సంబంధించి సమాచారం సమస్యకు దారి తీసిన కారణాలు, వాటి పరిష్కారాలు చర్చించుకొని వ్యక్తి ప్రవర్తనకు గల కారణాలను అంచనావేయగలగాలి. ఈ సంబంధాన్నే వారు సందర్శించే స్కూళ్లు, ఉద్యోగం చేసే స్థలాలు, వారి వారి సముదాయాలను విశ్లేషించగలగాలి. సిపోరియన్ కామ్టన్, గాల్లోవే రోజ్ లాంటి సామాజిక శాస్త్రవేత్తలు వ్యక్తిని సమూహాన్ని ప్రవర్తనకుగల కారణాలను అంచనా వేయడానికి ఉపయుక్తమయిన సూత్రాలను అందించినారు. ఈ విధమైన విశ్లేషణ వ్యక్తి, కుటుంబాన్ని, సమూహాన్ని, అంచనా వేయడానికి ఉపకరిస్తుంది. కార్యకర్త, సమూహసభ్యులు వారి సమస్యకు సంబంధించిన సామాజిక వ్యవస్థను అర్థం చేసుకోవడం ద్వారా సమూహంలోని వ్యక్తుల ప్రవర్తన అర్థం చేసుకోగలుగుతారు. వ్యక్తి సేవాపద్ధతి ఉపయోగించే కార్యకర్త ఏ సిద్ధాంతాల మీద ఆధారపడి పనిచేస్తాడో, ఆసిద్ధాంతం మీద ఆధారపడే సమూహ సేవా కార్యకర్త పని చేస్తాడు.

BRAOU

## సమూహ సేవా కార్యకర్త కార్యకలాపం

1. సమూహంలోని సభ్యులు ఒకరినొకరు అంచనా వేసుకోగలిగేటట్లు శిక్షణ ఇస్తాడు. 2. సమూహం ప్రవర్తన అర్థం చేసుకోనట్లయితే వారి వ్యక్తి సంబంధాల ప్రవర్తన వల్ల వ్యక్తి ప్రవర్తనను అర్థం చేసుకోవచ్చును.

ఒకరినొకరు ప్రశ్నించి వారివారి సమస్యల గురించి సమాచారం తెలుసుకుంటారు. ఇక్కడ సమస్యలు, సంస్కృతులు, జీవితానుభవాలు మధ్యగల సాదృశ్యత వలన సమూహంలోని సభ్యులకు కార్యకర్తను మించిన సమస్యా పరిజ్ఞానం కలగడానికి అవసరమున్నది. ఇదే సమూహం వలన గల పెద్ద లాభం అంతే కాకుండా సభ్యులకు సమస్యను అంచనావేసి అర్థం చేసుకోవడానికి శిక్షణ ఇవ్వడం ఈ విధంగా జరుగుతోంది.

సంఘటనలు, పరిణామాలు జరిగినప్పుడు యాధృచ్ఛికాలకు సంబంధించిన ఉదాహరణలతో, పాత్రాపోషణతో సమూహసభ్యులకు తెలియజేయాలి. సమూహంలోని సభ్యులు ఒకరికొకరు పరిచయం కావడం, వారి వారి పరిస్థితులు కూడా అవగాహన చేసుకోవడం వల్ల సమూహం వారి ప్రవర్తన అంచనా వేయడానికి అవకాశం లభిస్తుంది. ఈ సందర్భంలో వ్యవహార విశ్లేషణలు సభ్యులకు అర్థమయ్యేలా చెప్పాలి.

ఈ విశ్లేషణలో వ్యక్తి మూర్తిమత్వంలో మూడు రకాల స్థితులు ఉన్నాయి.

తల్లిదండ్రుల స్థితి: ఈ తల్లిదండ్రుల పాత్ర స్థితి బాల్య స్మృతులలోంచి పెరగుతుంది. తల్లిదండ్రుల వ్యక్తిత్వంలోని విలువలు, మంచి చెడులు గుర్తించి వ్యక్తం చేసే విధానాన్ని వారి మాటలను ఈ స్థితినుంచి వ్యక్తం చేస్తారు.

బాల్య అహంస్థితి: ఈ స్థితిలోంచి వచ్చే మాటలలో వారి బాల్య స్మృతులు, అనుభవాలు, యాజమాన్యం పట్ల వ్యక్తీకరించే శక్తి, ఆధారపడి ఉంటే మూర్తిమత్వం ఈ స్థితి నుంచి మాట్లాడేప్పుడు కనబడుతుంది.

ఎదిగిన స్థితి: పరిస్థితులపట్ల, సమస్యల పట్ల యదార్థమైన సమాచారం కలిగి ఉండే స్థితి. చర్చలలోనూ, పాత్రను పోషించ మనడంలో వారి సంభాషణలను విశ్లేషించి, సదవగాహన నుంచి పరస్పర చర్య ఉండేలా చూడాలి. ఆరకంగా వారి మూర్తిమత్వం అంచనా వేయవచ్చును.

మూడవ విధం 'ఫిష్‌బౌల్' (ప్రతిబింబిత) విధం.ఇక్కడ సమూహం రెండుగా చీలి, ఒక సమూహం రెండవ దానిని చూసి వారి వారి ప్రవర్తనను అంచనా వేయడం వలన వారిలో వారు ప్రవర్తనను అంచనా వేసుకోగలరు. ఈ రకమయిన ఉపసమూహ పరిశీలన రేటింగ్‌కు కొలబద్దలు ఉపయోగిస్తారు.

## ప్రమాణాల నిర్ణయం

గ్లాస్ మెన్, కీట్సు ప్రవర్తనా ప్రమాణాల గురించి, వారి గ్రంథంలో వ్రాసిఉన్నారు. ప్రస్తుతం వారు ప్రస్తావించిన ప్రమాణాల గురించి చర్చిద్దాం.

ప్రతీ వ్యక్తికీ ప్రత్యేకమైన విలువ ఉన్నది. శక్తి యుక్తులు ఉన్నాయి. వ్యక్తిగా వారికి హక్కులు ఉన్నాయి. ప్రతీ వ్యక్తి విలువ, సమూహం అభివృద్ధికి దోహదపడేలా కార్యకర్త పనిచేయాలి. సమూహంలో ఒకరి బాధ్యతలో ఒకరు పాలుపంచుకొంటారు. కార్యకర్త దానికి తగిన దోహదం చేయాలి. సమూహంలోని సభ్యులు ఒకరితో ఒకరు పోటీ పడక ఒకరికొకరు సహకరించుకొనేలా ప్రయత్నించాలి. వారిలో వారికి సహకారం లేని పరిస్థితిని గుర్తించి వారు ఒకరికొకరు సహకరించుకొనేలా, వనరులు పంచుకొనేలా అత్యయిక పరిస్థితులలో సంఘటితంగా పనిచేసేట్లుగా కార్యకర్త సభ్యులను సరిదిద్ది సన్నద్ధం చేయాలి.

ఒకరి అవసరాలు ఒకరు తెలుసుకొని ఏ షరతూ లేకుండా పూర్తిగా అంగీకరించడం సామూహిక సేవలోని మరొక విలువ.

సభ్యత్వం నిర్ణయించేది వ్యక్తుల అవసరాలు మాత్రమే. కానీ, కులం, మతం, వర్గం సభ్యత్వాన్ని నిర్ణయించలేవు. ఒక్కోసారి, 'సమస్యాత్మక సభ్యుల'ను కూడా సమూహం ఇష్టపడి కలిసికట్టుగా వారిని తమలో కలుపుకొన్నప్పుడు, కార్యకర్త నిర్ణయం తీసుకొనడు.

సభ్యులంతా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు. చురుకుగా కార్యక్రమాలలో పాల్గొనలేని సభ్యులపై ఎక్కువ చురుకుగా ఉండే సభ్యులు, అధికారం చెలాయించే ప్రమాదం ఉంది.

స్వయం నిర్ణయాధికారానికి ప్రాధాన్యం ఇచ్చే సామూహిక కార్యకర్త వ్యక్తి, అలాగే సమూహానికి సంబంధించిన కార్యకలాపాలలో నిర్ణయాలను తీసుకొనే విషయంలో, వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వాలి.

సభ్యులు చిన్న వయస్సువారు అయినప్పుడు వారు ఆలోచించే స్థితిలో లేనప్పుడు కార్యకర్త నిర్ణయాలు తీసుకొని సమూహాన్ని నియంత్రించకపోతే ఆసమూహంలోని సభ్యులు అభద్రతకు లోనవుతారు. అక్కడ మాత్రం కార్యకర్త సమూహాన్ని నియంత్రించవలసిన అవసరం ఉంది. భావ వ్యక్తీకరణ స్వాతంత్ర్యం, అనేకత్వం అభివృద్ధి సాధిస్తుందనే నమ్మకం, తనకు కావాల్సినది కోరుకొనే స్వాతంత్రం లాంటి మిగిలిన మరికొన్ని విలువలను కూడా గ్లాస్‌మెన్, కీట్సు చెప్పారు.

## 20.8 సమూహ నిర్మాణంలో ఉద్వేగ భావాలు

సమూహంలో పాల్గొనే ఆకర్షణ, సమూహం అంటే భయం మధ్య వ్యక్తులు నలుగుతారు. సమూహంలో పాల్గొని తమ లక్ష్యాలను సాధించుకుందామనే వారు సమూహంలో చేరతారు. ఈ సమూహం తమని తమ లక్ష్యానికి



BRAOU

చేరుస్తుందా? సభ్యులు తమని ఇష్టపడతారా? అంగీకరిస్తారా? ద్వేషిస్తారా? అందరు సభ్యులకు కావాల్సిన, ఉచితస్థానం, సమూహంలో దొరుకుతుందా? మొదటి సమావేశంలోనే ఒక్కోసారి వారి సంశయాలు తీరి, సంతృప్తిచెంది వారు సామూహిక కార్యక్రమాలలో ఐచ్ఛికంగా, ఆసక్తిగా పాల్గొంటారు.

## కార్యకర్త-సమూహ సభ్యుల సంబంధం

సభ్యులు కార్యకర్తకు ప్రధానపాత్రను ఇస్తారు. కార్యకర్త తన నిపుణత, పరిజ్ఞానంతో, వ్యక్తి సమస్యలు సామూహిక సమస్య పరిష్కరిస్తాడని సభ్యులు నమ్ముతారు. అందరూ కార్యకర్తలతో తమ సమస్యలు పంచుకొని, మనస్సు విప్పి మాట్లాడతారు. తనమీద ఆధారపడే ప్రమాదం ఉన్నప్పటికీ, సామూహిక కార్యకర్త తన సమూహంలోని సభ్యుల సమస్యలు వినడం మొదలుపెడతాడు. పేరుపేరునా పిలిచి వారి సమస్యలను కనుక్కుంటాడు. సామూహికంగా కూడా వారి సమస్యలను తెలుసుకుంటాడు.

సమూహంలో సభ్యుల మనోభావాల గురించి కార్యకర్తకు సరియైన అవగాహన ఉండాలి. భావాలేకాక భావాలు వెలికివచ్చినప్పటి సంఘటనలు కూడా అర్థం చేసుకోవాలి. సభ్యుల భావాలను యథాతథంగా అనుకరిస్తే, వారు తమను కార్యకర్త అవహేళన చేసినట్లుగా భావిస్తారు. అందుకని సహజమయిన, నిజాయితీతో కూడిన ఆత్మీయతను కార్యకర్త వ్యక్తం చేయాలి.

సమూహంలోని వ్యక్తి తనొక ప్రత్యేకమయిన సమస్యకు సంబంధించిన 'షాకు' (దిగ్భ్రాంతి)ను అనుభవించానని తెలియజేసినప్పుడు ఆ సంఘటన జరిగినప్పుడు అటువంటి 'షాకు' సహజమని, అనునయంతో చెప్పినప్పుడు, అవ్యక్తి, కార్యకర్త ప్రోత్సాహంతో తన సమస్యను వివరంగా చెప్పడం కొనసాగిస్తాడు. అలాగే మిగిన సభ్యులు కూడా అటువంటి భావం వ్యక్తీకరించినప్పుడు, వారి మధ్య అవగాహన ఐకమత్యం పెరుగుతాయి. అలా ఐకమత్యం అవగాహన, ఇతరుల భావాలపట్ల గౌరవం సభ్యులలో పెంపొందడానికి కార్యకర్త ఒక ఒరవడిగా సహాయపడతాడు. కార్యకర్త, తన సమూహం ఇటువంటి ఐకమత్యం అనునయం వ్యక్తపరిచే సంఘటనలు తగ్గినట్టు అనిపిస్తే అటువంటి సంఘటనలు పెంచడం సమూహం లక్ష్యాలలో ఒకటి అవుతుంది. లక్ష్యసాధన జరిగినప్పుడు బహుమతి ఇచ్చి సమూహాన్ని ప్రోత్సహించాలి. ఇలా సమూహ నిర్మాణం జరిగిన కొత్తలో పర్యవేక్షణ జరుగుతుంది.

BRAOU

## నిజాయితీ

నిజాయితీ అనగా కార్యకర్త సభ్యులతో మాట్లాడడం, సూటిగా ఉండడమే. అలా సూటిగా వ్యక్తీకరించడానికి, ప్రవర్తించడానికి కార్యకర్తకు సమూహం పట్ల, అందరి సభ్యుల సమస్యల పట్ల మంచి అవగాహన కావాలి. కార్యకర్త ప్రవర్తనలో వైరుధ్యం ఉండకూడదు. ఉదాహరణకు తనకు కోపం వచ్చినప్పుడు కార్యకర్త దాన్ని కాదనకుండా నిజాయితీగా తన ఉద్రేకాన్ని ఒప్పుకోవడం కారణం వివరించడం జరగాలి. అటువంటి ప్రవర్తనతో కార్యకర్త వరవడిగా నిలబడడం జరుగుతుంది. సభ్యుల ప్రవర్తన కార్యకర్త భావాలను, ఆలోచనను వారికి తెలియజేయడంలో నిజాయితీ ద్వారా అతను సభ్యుల అభిమానాన్ని చూరగొని నమూనాగా నిలవాలి.

## సన్నిహితతత్వం

సన్నిహితతత్వాన్ని ఆచరణలో ఉంచడం చాలా కష్టం. స్కూల్‌మెన్ చెప్పినట్లు సమానగౌరవం, నిందించకుండా ఉండడం, సూటిగా తత్తరపాటులేకుండా ఉండడం, దగ్గరతనానికి ఉండాల్సిన లక్షణాలు. వాటిని కార్యకర్త అలవాటు చేసుకోవాలి.

కార్యకర్త సభ్యులపట్ల అభిమానం, అంగీకారం వారిని స్వతంత్రులుగా పనిచేయనివ్వాలి. దీనిని సానుకూల స్పందన అంటాము. సభ్యుల కృషిని అవసరమైతే అభినందించాలి. వారొకవేళ ఆశించినట్లు ప్రవర్తించకపోయినా సభ్యులు తమ సమస్యలనుంచి వెలికి వచ్చే ప్రయత్నంగా భావించి ఆదరించాలి. దానిని సభ్యుల పట్ల కార్యకర్తకు గల గౌరవంగా బావిస్తాం.

## సభ్యుల మధ్య సంబంధం

ఒకరితోఒకరు స్నేహపూరిత సంబంధాలు నెలకొల్పుకొనే ఉద్దేశంతో వారు సమూహంలో సభ్యులవుతారు. ఒకరికొరకు ఒకరు కష్టసుఖాలలో సహాయం చేసుకొనే సామర్థ్యం మీద వారి సంబంధాలు ఏర్పడతాయి. ఒకరి మీద ఒకరు పెట్టుకొనే నమ్మకం మీద వారి సంబంధాలు ఏర్పడతాయి.

## సామీప్యత

కార్యకర్త సాధారణంగా ఒకేరకమైన అనుభవాలు, కష్టసుఖాలు కలిగి, పరిస్థితులపట్ల ఒకలా స్పందించే తీరుగల వారి మధ్య సంబంధాలు ఏర్పడడం గమనిస్తాడు. సమూహంలోని సభ్యులు తమ కష్టసుఖాలు వ్యక్తీకరించడానికి అనువైన చర్యలు ఏర్పరచుకోవాలి. ఒకరే మాట్లాడితే మిగిలినవారికి చర్చలో పాల్గొనే ఆసక్తి తగ్గుతుంది. కాబట్టి కార్యకర్త వారిని సరిచేసి అందరికీ మాట్లాడే అవకాశాన్ని ఇచ్చి చర్చ కొనసాగేలా చూడాలి. సందర్భానుసారంగా సంభాషణకు దారితీసే ప్రశ్నలు వేస్తూ అందరికి మాట్లాడేందుకు అవకాశాన్ని ఇస్తూ చర్చను ప్రభావితం చేయాలి. శిశుమార్గదర్శక కేంద్రాలలో ఆటద్వారా, పిల్లల మనోభావాలను, కుటుంబ వారి విషయాలను తెలుసుకోవాలి. వికలాంగుల సమూహంలో వారి పునరావాసానికి ఉపయోగపడే కార్యక్రమాల ద్వారా వారి అనుభవాలను తెలుసుకోవాలి.

## ఒకరితో ఒకరు మాట్లాడుకొనే కార్యక్రమం

మొదట కార్యకర్తతోనే సభ్యులు మాట్లాడుతారు. సభ్యులకు విషయం అర్థమవడానికి కావాల్సిన సమాచారాన్ని కార్యకర్త అందజేస్తాడు. తనకు సంబంధించిన ప్రశ్నలను మిగిలిన సభ్యులకు పంపడం, ఒకరికి ఒకరు సహాయం చేసుకునేలా చూడడం, వారిలోగల సామీప్యత వారు గుర్తించేలా చేయడం కార్యకర్త విధులు. వారికి తమకు బాగా పరిచయస్తుని పోలిన సభ్యుని గుర్తించమంటారు. సభ్యులు ఇద్దరు ముగ్గురు మాట్లాడుకోవడానికి ప్రోత్సహిస్తారు. ఆ అనుభవాలను సమూహంలో మళ్లీ చర్చిస్తారు. ఈరకంగా సభ్యుల మధ్య అవగాహన పెంచడం చెప్పినంత తేలికకాదు.

## శ్రద్ధగా విని అర్థం చేసుకునే నేర్పు

ఒకరు చెప్పే విషయం మరొకరు శ్రద్ధగా వినాలి. మొదట్లో తోటి సభ్యులు చెప్పిన విషయాన్ని మళ్లీ చెప్పించి అప్పుడు వారి సమాధానాన్ని చెప్పిస్తారు. తరువాత ఒక్కొక్కరిని అక్కడ జరిగే విషయాలను సమీకరించమనడం ద్వారా అందరూ శ్రద్ధగా వింటారు. అలా చెప్పలేకపోయిన సభ్యుని ఆ సమయంలో అతను ఆలోచించే విషయాన్ని భావాలను చెప్పమని, చెప్పించడం ద్వారా వారి భావాలను వారు నియంత్రించుకొనే నిపుణత వారికి పెరుగుతుంది. పిల్లల విషయంలో వారు వినేశ్రద్ధను అభినందించి, బహుమతి ఇస్తారు. ఆవిధంగా వారిని ప్రోత్సహించాలి.

## 20.9 కొన్ని ముఖ్యమైన సమూహ నిర్మాణాలు

సమూహం అభివృద్ధి సాధించాలంటే సమూహ నిర్మాణం సరిగ్గా సాగాలి. కొన్ని ముఖ్యమయిన సమూహ నిర్మాణాలు ఇవి...

1. కమ్యూనికేషన్ నిర్మాణం: ఎవరు ఎవరితో మాట్లాడుతున్నారు. ఏయే పరిస్థితులలో మాట్లాడుతున్నారు.
2. ఎవరిని ఎవరు (సమూహ సభ్యులలో) ఇష్టపడుతున్నారు? ఉప సమూహ వివరాలు.
3. ఎవరిని ఎవరు ప్రభావితం చేస్తున్నారు? ఏవిధంగా?
4. ఎవరు నాయకత్వం వహిస్తున్నారు? సమూహంలో ఘర్షణ తగ్గించి ఐకమత్యం పెంచుతున్నారు? అధికార

అనధికార సూత్రాలు ఏమి తయారు చేశారు.

5. పాత్రా నిర్మాణం: ఎవరు అధికార పదవులను చేపడుతున్నారు? అధ్యక్షులు ఎవరు? కార్యదర్శి ఎవరు? ఎవరు ఏరకంగా అనధికారంగా సమూహంలో పరస్పర చర్య పెంచుతున్నారు? ఉదాహరణకు మధ్యవర్తి, విదూషకపాత్ర, తిరుగుబాటు స్వభావం ఎవరు అన్నది గుర్తించగలగాలి.

## 20.10 ముగింపు

సమూహనిర్మాణం, అవి ఎలా పనిచేస్తాయి. కార్యకర్త ఎలా పనిచేయాలి? ఎలా ఉండాలి? అన్న విషయాలను సరిగా ఆకళింపు చేసుకొన్నప్పుడే ఒక సమూంతో కార్యకర్త పనిలో నిపుణత ఏర్పడుతుంది. సమూహాలు ఐచ్ఛికంగా ఏర్పాటు కావు. వాటికి కొన్ని ప్రయోజనాలు, పద్ధతులు, మూల సూత్రాలు ఉంటాయి. కార్యకర్తకు కూడా సమూహాన్ని అర్థం చేసుకొని మెలగాల్సిన నిపుణత అవసరం. అట్లాగే సమూహాలలోని ఉద్వేగ భావాలను కూడా కార్యకర్త గ్రహించవలసి ఉంటుంది. ఈ భాగంలో ఈ అంశాలనే నేర్చుకున్నాం.

## 20.11 మాదిరి పరీక్ష ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. సమూహనిర్మాణంలో ఉద్వేగభావాలగురించి రాయండి?
2. సమూహాలు 'నెలీస్' వర్గీకరణ రాయండి?
3. సమూహనిర్మాణం సిద్ధాంతాలేవి? వివరించండి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబు రాయండి.**

1. 'క్లిక్' సమూహాలు.
2. సామూహిక సేవాపద్ధతి మూలసూత్రాలు.
3. మనోవిశ్లేషణా సిద్ధాంతం.

## 20.12 చదవదగిన పుస్తకాలు

1. Young, P.V. : 'Scientific Social Survay and Research'

2. Brij Mohan : 'Socialwork Research: An Innovative process'

BRAOU

# భాగం-21: సమూహం-కార్యక్రమాలు, భాగస్వామ్యం

విషయక్రమం


21.0 ఉద్దేశాలు

21.1 పరిచయం

21.2 కార్యక్రమాల స్వభావం-లక్ష్యం

21.3 కార్యక్రమాలలో 'సంస్థ'లపాత్ర

21.4 సభ్యుల ఆసక్తి-అవసరాల పాత్ర

21.5 సమూహం సంస్థగా కార్యక్రమాభివృద్ధికి పనిచేయడం

21.6 మార్గదర్శక పూర్వమయిన అంతఃశ్చర్య

21.7 అంతఃశ్చర్య వివిధ రూపాలను అర్థం చేసుకోవడం

21.8 పెద్ద సమూహాలతో కార్యక్రమాల ఏర్పాటు

21.9 సామూహికసేవ, కార్యక్రమాలు సఫలం చేసే అంశాలు

21.10 ముగింపు

21.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

21.12 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 21.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- కార్యక్రమాల స్వభావాన్ని, లక్షణాలను తెలుసుకుంటారు.
- కార్యక్రమాలలో సంస్థల పాత్రను వివరించగలుగుతారు.
- సామూహిక సేవా కార్యక్రమాలను సఫలం చేసే అంశాలను అర్థం చేసుకుంటారు

## 21.1 పరిచయం

సభ్యుల ఆసక్తి కోరిక మేరకు కార్యక్రమాన్ని వారే ఎన్నుకొనేలా చేయాలి. కలిసి వారే కార్యక్రమాల ప్రణాళిక తయారు చేసుకోవాలి. విధులు పంచుకోవాలి. అవసరమయిన చోట కార్యకర్త మార్గదర్శకాన్ని వాడుకోవాలి. కార్యక్రమం ఏదైనా ఒకటే. సభ్యుల ఆసక్తి వారి అభిరుచిని సంతృప్తి పరుస్తుంది. కానీ, సంగీతంలో ఆటలో నాటకాలలలో వారిని ప్రవీణులను చేయడం కార్యక్రమాల లక్ష్యం కాదు. దీని ద్వారా వారి మూర్తిమత్వం పెంపొంది దేశానికి మంచి పౌరులుగా తయారుచేయడం వారి సమస్యలు వారే పరిష్కరించుకొనే శక్తియుక్తులను పెంచడం ఈ కార్యక్రమాల అసలు లక్ష్యం.

## 21.2 కార్యక్రమాల స్వభావం-లక్ష్యాలు

సమూహం చిన్న పిల్లలతో కావచ్చు. స్త్రీలు, పురుషులు, వృద్ధులు, వికలాంగులు, ఆరోగ్యవంతులతో లేదా అనారోగ్యవంతులతో ఏర్పడినది కావచ్చు. ఏమానవునికైనా పూర్తిగా దినమంతా తమ తమ విధులను నిర్వర్తించడంలో అలసినవారికి, వినోదం కావాల్సి ఉంటుంది. సమూహం ఒక చోట కలిసినప్పుడు వినోద కార్యక్రమాలతో లేదా ఒక కళతో ప్రావీణ్యం సంపాదించడంలో లేదా ఒక చేతిపని నేర్చుకోవడంలో పొద్దుబుచ్చడం ఆనందంగా ఉంటుంది. అక్కడ చేరే వ్యక్తులతో కలిసి కనీసం కబుర్లు చెప్పుకోవడానికి వారికి మంచి కాలక్షేపంగా ఉంటుంది. జనాభా పెరిగి, సంపాదనా వ్యాపకాలు పెరిగి తోటివారితో మాట్లాడడం కరువవుతున్న ఈ రోజుల్లో సమూహంలో ఒక సభ్యునిగా పాల్గొని నచ్చిన ఆటలనో, పాటలనో నేర్చుకోవడం సంఘజీవి అయిన వ్యక్తికి ఆనందాన్ని ఇస్తుంది. అటువంటి ఆనందం, సంతృప్తిని తమ విధులు సక్రమంగా నిర్వర్తించే ఉత్సాహాన్ని కలుగజేస్తుంది. ఇది సమూహం వైపునుంచి పొందే సంతృప్తి. కాగా సామూహిక కార్యకర్త కార్యక్రమానికి ప్రాముఖ్యత ఇవ్వడు. కార్యక్రమం ఒక మాధ్యమికం. ఈ మాధ్యమికం ద్వారా తాను కోరుకున్న వ్యక్తిత్వం అభివృద్ధి లేదా మూర్తిమత్వ అభివృద్ధి సమూహంలో ప్రతీ వ్యక్తిలో కలిగిందా లేదా అనే ఆలోచిస్తాడు. ఆ లక్ష్యసాధనకు తన పరిజ్ఞానాన్ని నిపుణతను ఉపయోగించి వ్యక్తిలో సమాజానికి ఉపకరించే సులక్షణాలను పెంచి, అతని అభివృద్ధిని ఆటంకపరుస్తున్న అవరోధాలను సమస్యలను తొలగించడానికి ప్రయత్నిస్తాడు. ఈ ప్రయత్నంలో భాగంగా ఒక కార్యక్రమాన్ని సమూహం కోసం ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కార్యకర్తమీద ఉన్నది.

కార్యకర్త కార్యక్రమాన్ని తనే తయారు చేయడు. సమూహంలోని సభ్యులు వారి అభిరుచులకు తగినట్లుగా కార్యక్రమాన్ని ఎన్నుకొని సామూహిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తాడు. ఇక్కడ కార్యకర్తకు సమూహంలోని వ్యక్తి చాలా ముఖ్యం. అతని కుటుంబ వివరాలు, స్థితిగతులు, కుటుంబ సభ్యుల మధ్యగల సంబంధాలు, వ్యక్తి కోరికలు, ఆశలు, దానికి అతనికి గల అవకాశాలు అర్థం చేసుకోవడం అవసరం. కార్యక్రమం వారే ఎన్నిక చేసుకోవాలి. కార్యకర్త సభ్యుల అవసరాలు, అభిరుచులు, సామర్థ్యం, అనుభవం దృష్టిలో ఉంచుకొని, వారిని ప్రోత్సహించి, కార్యక్రమాన్ని వారే ఎన్నుకొనేలా చూడాలి. కార్యక్రమం ప్రారంభించాలంటే ఎక్కడ ఈ సమూహం కలుస్తుందో ఆ సంస్థ సమూహంలోని ప్రతీ వ్యక్తి, కార్యకర్త తప్పనిసరిగా ఉండాలి.

BRAOU

### కార్యక్రమం అంటే

కార్యక్రమం అనగా సమూహం తన ఆసక్తిని సంతృప్తి పరచుకోగలిగిన ఏ పనిని అయినా కార్యక్రమం అంటారు. చాలా పనులు, మానవ సంబంధాలు, పరస్పర సంబంధాలు, వ్యక్తికి, సమూహానికి గల అనుబంధాలు కూడా కార్యక్రమాలలో భాగమే. ఈ కార్యక్రమాలను ప్రత్యేక శ్రద్ధతో కార్యకర్త సమూహంతో, ప్రణాళికాబద్ధంగా తయారు చేస్తాడు. కార్యక్రమం ఒక ప్రక్రియ. ఇది పూర్తి అయిపోవడం అంటూ ఉండదు. సమూహం ఒక పండుగ జరుపుకోవాలనుకుంటే అది కార్యక్రమంలో ఒక భాగం. వారు చూపే పనులు, అనుబంధాలు వారి ఆంతర్యాలు కలపోస్తే కార్యక్రమం అవుతుంది.

కార్యక్రమం గురించి చర్చించాలంటే మూడు విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి. అవి: 1. విషయాలు-రంగాలు, 2. వ్యక్తీకరించే మాధ్యమికం, 3. కార్యక్రమాలు నిర్వహించే పద్ధతులు.

కార్యక్రమాలు ఏరంగంలో ఎన్నిక చేసుకుంటారు అంటే సమూహ సభ్యులు సాధారణంగా వినోద కార్యక్రమాలను ఎన్నుకుంటారు. ఈ రోజుల్లో విరామ కాలాన్ని సద్వినియోగం చేయాలని చాలామంది అభిప్రాయం. జనానికి సంబంధించిన పౌర కార్యక్రమాలు-పెద్ద ఆకర్షణ. కొన్ని సంస్థలు ఇంటికి, కుటుంబానికి సంబంధించిన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తారు. ఈ అంశాలలో ఆర్థిక సమస్యలు, సాంఘిక సంబంధాలకు సంబంధించిన అంశాలు కూడా కార్యక్రమాలలో చోటుచేసుకుంటాయి. చాలా సమూహాలలో ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాలు ఉంటాయి.

ఇక 'వ్యక్తీకరించే మాధ్యమాల' దగ్గరికి వస్తే ప్రత్యేకమయిన అంశాలకు సంబంధించిన కార్యక్రమాలు అనగా

పార్టీలు, వినోదకార్యక్రమాలు ఏర్పాటు చేసుకుంటారు. ఆధునిక కాలంలో కళలకు, చేతిపనులకు కూడా వారు ప్రాముఖ్యత ఇస్తున్నారు. నాటకాలు కూడా తయారుచేయించి ప్రదర్శిస్తున్నారు. సామాజిక ఆరోగ్యం అవగాహనకు ఇవి చాలా ఉపయోగపడుతున్నాయి. సమూహ సభ్యుల మధ్య మంచి సదవగాహన కలగాలంటే సంగీతాన్ని మించిన సాధనం లేదు. సామూహిక సభ్యులు స్వయంగా కంటితో చూసి లాభం పొందటాన్ని కార్యకర్తలు బాగా గుర్తించారు. సభ్యులను, పిక్నిక్‌లకు బయటి ప్రదేశాలు సందర్శించేలా ఏర్పాటు చేస్తారు. సభ్యుల అవసరాలు అభిరుచులు తెలుసుకొని సామాజిక వనరులను వారున్న సంస్థాగత వనరులను తెలుసుకొని కార్యక్రమాన్ని రూపుదిద్దాల్సి ఉంటుంది.

సభ్యులను కార్యాచరణకు పూనుకొనేలా ప్రోత్సహించాలి. సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ కార్యక్రమాన్ని సభ్యులతో తయారు చేయించాలి. కార్యకర్తకు తాను చేయడం చాలా తేలిక. సభ్యులతో చేయించడం శ్రమతో కూడినది అయినప్పటికీ సభ్యులతో తయారు చేయించాలి.

కార్యక్రమాన్ని 'ఏమిటి' అని ప్రశ్నిస్తే విషయాలు లేదా రంగాన్ని తెలియజేస్తుంది. 'ఎలాగా' లేదా 'ఎట్లా' అని ప్రశ్నిస్తే వ్యక్తీకరించే మాధ్యమాన్ని తెలియజేస్తుంది. 'ఎందుకు ' అని ప్రశ్నిస్తే కార్యక్రమాల లక్ష్యం తెలుస్తుంది. కార్యకర్త తన అభిప్రాయాలను, అభిరుచులను, సభ్యుల మీద వేయరాదు.

## 21.3 కార్యక్రమాలలో సేవాసంస్థల పాత్ర

BRAOU

1. ఏసంస్థలో సమూహం కార్యక్రమాలు నిర్వహిస్తుందో ఆ సంస్థకు చుట్టూ ఉన్న సముదాయానికి సంబంధించి ఏరకం కార్యక్రమాలను నిర్వహించాలో సూచించే, సంపూర్ణమయిన రాతపూర్వకమైన ప్రతి ఉండాలి.
2. కార్యక్రమం తయారు చేసే కమిటీ ఒకటి ఆ సంస్థకు ఉండాలి.
3. సంస్థలో గల వివిధ విభాగాలకు చురుగ్గా పనిచేసే కార్యక్రమాల కమిటీ ఉండాలి.
4. కార్యక్రమాల నిర్ణయాలు సంస్థ లక్ష్యాలకు సంబంధించి ఉండాలి.
5. సముదాయం అవసరాలు, పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని సంస్థ కార్యక్రమాలను నిర్ణయించాలి.
6. బడ్జెట్, సిబ్బంది అవసరాలు దృష్టిలో ఉంచుకొని కార్యక్రమాలు రూపొందించాలి. సంస్థకు ఏకార్యక్రమానికి ఎంత ఖర్చయిందీ సమాచారం ఉండాలి.
7. సంస్థ తన కార్యక్రమాలలో తన ప్రణాళికను అనుసరించే పని చేయాలి.
8. సంస్థ ఎక్కువగా చిన్న సమూహాలతోనే కార్యక్రమాలను నిర్వహించాలి.
9. సంస్థ నిర్వహించే కార్యక్రమాలలో వైవిధ్యం ఉండాలి.
10. పెరుగుతున్న అవసరాలకు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కార్యక్రమాలు కొత్తవిగా, మార్పుకనుగుణంగా రూపొందించాలి.
11. సమూహ సభ్యులు కార్యక్రమాల ప్రణాళిక తయారీలో భాగస్వాములు కావాలి.
12. కార్యక్రమాలలో మార్పు తెచ్చేటప్పుడు, సభ్యుల అభిప్రాయాన్ని తెలుసుకొనే విధానం ఉండాలి.
13. కార్యక్రమాలు ఎప్పటికప్పుడు 'రికార్డు' చేయాలి.
14. రాసిఉంచిన రికార్డులను కార్యక్రమ పర్యాలోచనకు వాడాలి.
15. తరచుగా కార్యక్రమాలను పర్యాలోచన చేయాలి.
16. కార్యక్రమాలను పరిశీలించి, ఉపయోగం లేని భాగాలను తీసివేయాలి.

ఈ విధంగా కార్యక్రమాలు చేసే సంస్థ కార్యక్రమ అభివృద్ధిలో ముఖ్యపాత్ర వహిస్తుంది.

## 21.4 ఆసక్తి-అవసరాల పాత్ర

సమూహ సభ్యుల ఆసక్తి అవసరాలను కార్యక్రమాలకు పునాదిగా భావించాలి. ఆసక్తి అవసరాలు వేర్వేరుగా ఉండవు. అన్నీ ఒకదానితో ఒకటి కలిసి పనులు జరుగుతాయి. ఒకే వస్తువు, ఆలోచన, కార్యక్రమం, పరిస్థితి మీద ఏకాగ్రత చూపించే గుణాన్ని ఆసక్తి అంటారు. ఈ ఆసక్తి కొద్దికాలం ఉండవచ్చు. లేదా చాలాకాలం నిలబడవచ్చు. వ్యక్తి సామాజిక స్థితిగతులమీద అతని ఆసక్తి పెరగడం, తరగడం ఉంటుంది. ఆసక్తిని అందరూ మాటలతో పైకి వ్యక్తం చేస్తారు. సమూహాలు పార్టీలు కావాలనో, కొత్త ప్రదేశాలు సందర్శించాలనో, ఒక జట్టులో చేరాలనో, ఒక నాటకాన్ని వేయాలనో ఆసక్తిని మాటలలో వెల్లడి చేస్తారు.

అవసరాలను గుర్తించడం తేలిక. మూర్తిమత్వ లక్షణం కావాలనో, మానవ అనుభవం లేక తోటివారితో మానవ సంబంధం కోరుకోవడాన్ని అవసరంగా భావించవచ్చు. ఘనం మానవ సహజమైన అవసరాలు తీరినప్పుడు మన సాంఘిక సంబంధాలలో ఆనందంగానూ సమర్థవంతంగాను ప్రవర్తిస్తాం. అవసరాలకు ఆసక్తికి మధ్య సంబంధానికి చాలా దగ్గరి తనం ఉంది. యువకుల సమూహం యువతకు కార్యక్రమాలలో ఆసక్తి చూపితే, ఆ ఆసక్తి అభివృద్ధి చెందుతున్న వారి అవసరాన్ని తెలియజేస్తుంది.

ఏ విహారయాత్రకో సమూహ సభ్యులు వెళ్లాలని ఆసక్తి చూపితే, వారికి స్థల మార్పు అవసరమని తెలుస్తుంది. కార్యకర్త సభ్యులను వారి అభిప్రాయాలను తెలియజేయడానికి ప్రోత్సహించాలి. మిగిలిన సమూహాలుఏమి చేస్తున్నాయో చర్చించడం వలన సమూహ సభ్యుల అవగాహన పెరుగుతుంది. వారు వారి అవసరాలను తెలిపినప్పుడు ఆ అభిప్రాయం సమూహం అంతటిలో ఏకొద్ది మందో చెప్పినదా? సంస్థ విధులకు లక్ష్యాలకు అటంకం లేదుకదా? సమూహం ఈ అభిప్రాయం అనుభవంలోకి తేవడానికి (పనిచేయడానికి) సిద్ధంగా ఉన్నదా? అని కార్యకర్త ఆలోచించాలి. సమూహాలు అభిప్రాయం వ్యక్తం చేయడంలో చాలా నెమ్మదిగా ఉంటాయి. అటువంటప్పుడు ఏదో కార్యక్రమంతో వారు వారి భావాలు వ్యక్తీకరించేలా చేయాలి. కార్యకర్త ప్రశ్నలడిగి సమాచారం సేకరించడం ద్వారా సమూహం తయారయిన కొత్తల్లోనే వారి ఆసక్తి, అవసరాలను తెలుసుకోవచ్చును.

ఇక్కడ కార్యకర్త పాత్ర చాలా ఎక్కువ. సభ్యులు తమ అవసరాలు, ఆసక్తులు తెలుసుకొనేలా చేసే బాధ్యత కార్యకర్తలది. సమూహం మారుతున్నపడు కార్యకర్త పాత్ర కూడా మారుతుంది. అతని విధులు సభ్యుల స్పందనమీద అధారపడతాయి. ప్రతిక్షణం చురుకుగా, సభ్యులకు స్వాతంత్ర్యం ఇస్తూ; అవసరమయినచోట్ల తన ఆలోచనలను మార్చుకొంటూ కార్యకర్త తన పాత్రను పోషించడం ఇక్కడ ప్రధానమైనది.

BRAOU

## 21.5 సమూహం ఒక సంస్థ కార్యక్రమాభివృద్ధికి పనిచేయడం

ప్రతీ సమూహం స్వతంత్ర, స్వయం నిర్ణయాధికారం కావాలని ఆశిస్తుంది. అందులోని సభ్యులను ఒక సంస్థగా తీర్చిదిద్దుతుంది. ఏరకంగా సమూహం నిర్ణయాలు తీసుకుంటుంది బాధ్యతలు పంచుతుంది, సమూహం కార్యక్రమాలలో పాల్గొనడం, కార్యక్రమాల తయారీ, పర్యాలోచన చేయడం మొదలైన విధులు నిర్వహించే తీరు ఆ సమూహం సంస్థాగత నిపుణతను తెలియజేస్తుంది. ఇలా విధులు నిర్వహించడం ఒక సంస్థగా సమూహం పనిచేయడాన్ని కార్యకర్త తనుగా చేయకూడదు. సమూహ సభ్యులు తమంతట తామే దీనికి సిద్ధం కావాలి.

## 21.6 మార్గదర్శపూర్వకమైన అంతశ్చర్య

ఒక కార్యక్రమాన్ని సమూహం చెయ్యాలనుకొటే ఏరంగంలో చెయ్యాలీ, ఏరకంగా చేయాలి అన్నది సమూహం నిర్ణయించుకొనేలా కార్యకర్త తయారు చేయాలి. జరుగుతున్న కార్యక్రమాల వెనుక సమూహ సభ్యుల అంతర్గతంగా

వున్న మానవ అవసరాలు కనబడతాయి. విహారయాత్రలు, సమావేశాలు లాంటి కార్యక్రమాల వెనుక వారి భావాలూ, ఉద్రేకాలు కూడా కలిసి ఉంటాయి. మరొక సమూహం కన్నా బాగా పనిచేయాలనే తపన, స్పర్థ తన సమూహంలో చూసిన కార్యకర్త వారి మానసిక అవసరాలను గమనించాలి. ఒక్కొక్కప్పుడు వారి పోటీతత్వం వారి అభివృద్ధికి అటంకమయినప్పుడు దానిని అర్థం చేసుకొని సరిదిద్దాల్సిన బాధ్యత కార్యకర్త వహించాలి. సభ్యుల సాంప్రదాయక అభిప్రాయాలను కూడా కార్యకర్త అర్థం చేసుకోవాలి. పాత కార్యక్రమాలే జరుపుతున్నందుకు అసంతృప్తి కార్యకర్తకు రాకూడదు. కార్యక్రమం, వారి మధ్య గల సంబంధాలు ఇక్కడ పరిగణనలోకితీసుకోవాలి.

సభ్యులు వారంతటవారే బాధ్యతలు చేపడతారు. కార్యకర్త ఎక్కడ అభిప్రాయాలు మొదలవుతున్నాయి, సభ్యుల స్పందన ఎలా ఉన్నది గ్రహించాలి. ఒక్కోసారి సభ్యుల ఆలోచనలు యధాతథంగా గ్రహించక, కొంత సవరణలతో గ్రహించాలి. సమూహంలో ఐకమత్యం వున్నప్పుడు చాలా ఆశ్చర్యకరమయిన వేగంతో పనులు పూర్తి చేస్తారు. ప్రతీ వ్యక్తి తన అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు. ఇటువంటి అంతశ్చర్య సమూహం నుంచి సహజంగా ఆవిర్భవిస్తుంది. కార్యకర్త తన నిపుణతతో దానిని పెంచుతాడు.

## 21.7 అంతశ్చర్య వివిధ రూపాలను అర్థం చేసుకోవడం

కార్యకర్త సమూహ సభ్యుల ప్రవర్తనను పరిశీలించి, వారి అంతశ్చర్యలోగల వివిధ రూపాలను అంచనా వేయడానికి ప్రయత్నించాలి.

1. విభజన: సమూహంలో ఏసభ్యుడు కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నాడు, ఎవరు తక్కువగా పాల్గొంటున్నారు. ఎవరు అసలు పాల్గొనడంలేదు అన్న విషయాన్ని కార్యకర్త అర్థం చేసుకోవాలి.

2. సంభవాలు: ఎన్నిసార్లు ఒక్కో సభ్యుడు కార్యక్రమాల్లో పాల్గొనేది తెలుసుకోవాలి. కొందరు ప్రతి కార్యక్రమంలోనే పాల్గొంటారు.

3. కాలం: వారు ఎంతకాలం ఈ కార్యక్రమాలలో పాల్గొన్నది కార్యకర్త పరిశీలించాలి.

4. భాగస్వామ్య వరుస క్రమం: కొందరు ఎప్పుడు మొదటే తమ అభిప్రాయాన్ని తెలియజేస్తారు. కొందరు వారు చెప్పేదాకా ఆగుతారు. 'అ' అను సభ్యుడు 'ఆ' అనే సభ్యుడు మాట్లాడేవరకు ఆగి మాట్లాడతాడు. అలాగే 'ఇ' అనే సభ్యుడు కార్యకర్త మాట్లాడిన తరువాత తన అభిప్రాయం చెబుతాడు. 'ఈ'అనే వ్యక్తి తన భావాలను వ్యక్తీకరించడానికి చివరిదాకా (అందరూ ఆవిషయం మీద మాట్లాడేవరకు) ఆగి మాట్లాడతాడు.

5. మార్గం: కార్యకర్త సభ్యులు ఎవరికి సమాధానం ఇస్తారన్నది గుర్తిస్తాడు. ఉదాహరణకు ఒక సభ్యుడు ఎప్పుడు పడితే అప్పుడు సభ్యులు మాట్లాడితే వారితో పలకడు. ఒక్కోసారి ఏ పనిలోఉన్నారో దాని గురించే మాట్లాడతారు. ఒక్కోప్పుడు మిగిలిన అన్ని విషయాలు చర్చిస్తారు. కానీ చేస్తున్నపని గురించి మాట్లాడరు.

6. విషయాలు: రాబోయే కార్యక్రమాన్ని సభ్యులు చెప్పడంతోబాటు ఏ వ్యక్తి ఏపని చేయాలో చర్చిస్తారు.

7. అంతశ్చర్య అర్థం: కార్యకర్త పర్యాలోచన చేస్తాడు. అందువలన కార్యక్రమాలలో, వారి సంబంధాలలో లోపాలను సవరించగలడు.

ఈ అంతశ్చర్యపై ఐదు అంశాలు ప్రభావం చూపుతాయి. 1. సమూహం అంతశ్చర్యకుగల సామర్థ్యం, 2. సమూహానికి కార్యకర్తకు గల సంబంధం, 3. సమూహాన్ని కట్టివుంచే సభ్యుల అవసరాలు, ఆసక్తులు, 4. వారి కార్యక్రమ లక్ష్యాలు, 5. వారున్న సామాజిక పరిస్థితులమీద వారి అంతశ్చర్య ఆధారపడి ఉంటుంది.

BRAOU

## 21.8 పెద్ద సమూహాలతో కార్యక్రమాల ఏర్పాటు

పెద్ద సమూహాల సహాయార్థం కార్యకర్తను తరచూ సంప్రదిస్తుంటారు. ఈ రకం 'గుంపు కార్యక్రమాలు' వినోద కార్యక్రమాలే అయివుంటాయి. చర్చలు, ఆటలు, పాటలు, నాటకాలు మొదలైనవి జరుగుతాయి. 30-100 మంది వరకు పాల్గొంటారు. ఈ పెద్ద సమూహం చాలా చిన్న సమూహాలతో తయారయినది. పెద్ద సమూహాలు ఉపయోగం లేనివాటిగా పరిగణించకూడదు. దీని లక్ష్యాలు దీనికి ఉన్నాయి. అన్ని స్థలాలనుంచి వచ్చినవారికి ఈ సమూహం చోటిస్తుంది.

జనాభా పెరిగిపోతున్న ఈ రోజుల్లో పెద్ద సమూహాలతో పనిచేయించడం అవసరంగా మారుతోంది. వారి మార్గదర్శిగా పనిచేయగలిగిన కార్యకర్త అవసరం ఇక్కడ ఉన్నది. వ్యక్తిగతంగా సభ్యులను తెలుసుకొని వారి అవసరాలను, అభిప్రాయాలను తెలుసుకోవడంలో కార్యకర్త నిపుణత ఆధారపడి ఉన్నది. పెద్ద సమూహాన్ని చిన్న సమూహాలుగా విడగొట్టి విధులను విభజించాల్సిన అవసరం ఉంది. ప్రత్యేకమైన సహాయం కావాల్సిన వ్యక్తులను కార్యకర్త గుర్తించి సహాయపడతాడు. పెద్ద సమూహాలలో వ్యక్తుల అవసరాలు పెరిగి వారికి సహాయపడాల్సిన సందర్భాలను గుర్తించడంలో కార్యకర్త అప్పుడప్పుడు విఫలమవ్వడం కనిపిస్తుంది. సమూహాలు పెద్దవయినా, చిన్నవయినా కార్యకర్త తన పరిజ్ఞానంతో, నిపుణతతో సమూహ పరిస్థితులను అర్థం చేసుకొని కార్యక్రమాలను అమలు జరిగేలా చూడాలి. కార్యక్రమాల అభివృద్ధి ఒక నిరంతర ప్రక్రియ. ఎంతమంది సభ్యులు పాల్గొంటే అంతబాగా సమూహాలు కార్యక్రమాల ద్వారా లక్ష్యాన్ని చేరుకుంటాయి.

## 21.9 సామూహికసేవ, కార్యక్రమాలు సఫలంచేసే అంశాలు

BRAOU

సామూహిక సేవ, సభ్యుల మూర్తిమత్వాలు కలవడానికి ఒక వాతావరణాన్ని కలుగజేస్తుంది. ఇక్కడ కార్యక్రమం ముఖ్యం. కానీ ఏరకంగా ఆ కార్యక్రమాన్ని సభ్యులు చేపట్టారు? ఏ ఫలితాలు పొందారు అన్నది అంతకంటే ముఖ్యం.

కార్యక్రమాభివృద్ధి ఈ క్రింద ఇవ్వబడిన వివిధ దశలలో జరుగుతుంది.

1. సభ్యుల ఆసక్తి, అవసరం గుర్తించడం.
2. కార్యక్రమాన్ని ప్రారంభించడం.
3. కార్యక్రమాన్ని పూర్తి చేయడంలోగల బాధ్యతల విశ్లేషణ.
4. సభ్యుల విధుల గుర్తింపు.
5. సభ్యుల ప్రయత్నాలను అనుసంధానించాలి. ఐకమత్యం పెంచాలి.
6. కార్యక్రమాల ఎన్నిక.
7. ఈ కార్యక్రమాల పర్యాలోచన, రాబోవు కార్యక్రమాల ప్రణాళిక తయారు చేసుకోవడం.

కార్యక్రమాలు సఫలం కావడానికి ఈ క్రింది అంశాలు తోడ్పడతాయి.

1. కార్యక్రమం వ్యక్తుల ఆసక్తి, అవసరం నుంచి తయారుకావాలి.
2. కార్యక్రమాల తయారీలో సభ్యుల వయస్సు, సాంస్కృతిక వివరాలు, ఆర్థిక వ్యత్యాసాలు దృష్టిలో వుంచుకోవాలి.
3. సభ్యుల (వారికి అంతర్గతంగా ఉన్న) విలువలు దృష్టిలో వుంచుకొని వారి ఒక అనుభవాన్ని అవకాశాన్ని కార్యక్రమాల్లో ఇవ్వాలి.
4. సభ్యుల మారుతున్న ఆసక్తి, అవసరాలనుబట్టి కార్యక్రమం మార్చడానికి వీలుగా ఉండాలి.

5. చిన్న చిన్న కార్యక్రమాలతో మొదలు పెట్టి పెద్ద కార్యక్రమాలలోని సభ్యులను కార్యకర్త ప్రోత్సహించాలి.

కార్యక్రమాలు 'వ్యక్తిగతం'గా మొదలయి, సాంఘికంగా పెరిగి సముదాయానికి ఉపకరించేలా కార్యకర్త సభ్యులను లక్ష్య సాధనకు నడిపించాలి.

## 21.10 ముగింపు

కార్యక్రమాలు ఏవైనా సరే ఒక కార్యకర్త కార్యాచరణకు అవి మాధ్యమికాలు. అయితే కార్యక్రమం అన్నది కార్యకర్త అంతిమ లక్ష్యం కాబోదు. తప్పనిసరిగా సమూహంలో పనిచేసే కార్యకర్తలు గుర్తించాల్సింది ఏమిటంటే వినోద కార్యక్రమమైనా, మరే కార్యక్రమమైనా అంతిమ లక్ష్యం, ఆ సమూహాన్ని తీర్చి దిద్దడమే అని గుర్తించాలి. ఇందుకు చాలా అంశాలున్నాయి. ఒక సమూహాన్ని సంస్థ స్థాయికి మార్చడానికి విశాల సమూహాల్లో పనిచేయడానికి కార్యకర్త సిద్ధపడాలి. సమూహంలోని వ్యక్తుల అంతశ్చేతనలను బయల్పరచి కార్యక్రమాలు నిర్వహించాలి. అట్లని సమూహం ఆసక్తి కనబరచని ఏకపక్ష కార్యక్రమాలు తీసుకోకూడదు. ఏ కార్యక్రమానికైనా సభ్యుల ఆసక్తి అవసరం.

## 21.11 మాదిరి పరీక్ష ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. కార్యక్రమం స్వభావం? లక్ష్యం ఏమిటి? వివరించండి.
2. అంతశ్చర్య అనగానేమి? దాని రూపాలను చర్చించండి.
3. పెద్ద సమూహాలలో కార్యక్రమాల గురించి రాయండి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబు రాయండి.**

1. సభ్యుల ఆసక్తి , అవసరాల పాత్ర?
2. సామూహిక సేవ సఫలం చేసే అంశాలు ఏవి?
3. కార్యక్రమాలలో సంస్థల పాత్ర ఏమిటి?

## 21.12 చదవదగిన పుస్తకాలు


1. Young, P.V. : 'Scientific Social Survay and Research'

2. Brij Mohan : 'Socialwork Research: An Innovative process'


BRAOU

# భాగం-22: నాయకత్వం-రకాలు-పాత్ర-అభివృద్ధి

విషయక్రమం


22.0 ఉద్దేశాలు

22.1 పరిచయం

22.2 నాయకత్వం-రకాలు

22.2.1 సంస్థాగత నాయకులు

22.2.2 ఆధిపత్య నాయకులు

22.2.3 ప్రోత్సాహక నాయకులు

22.2.4 ప్రావీణ్యం గల నాయకులు

22.3 నాయకుని మూర్తిమత్వ లక్షణాలు

22.4 నాయకత్వంలో పరిస్థితుల ప్రాబల్యం

22.5 అవసర చర్యకు ఏర్పడ్డ నాయకత్వం

22.6 నాయకుని అనుయాయులు

22.7 నాయకుని విధులు

22.8 నాయకత్వం-మనోవిశ్లేషణ పద్ధతులు

22.9 ముగింపు

22.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

22.11 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 22.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సంస్థాగత నాయకత్వం రకాలను తెలుసుకుంటారు.
- నాయకుని మూర్తిమత్వ లక్షణాలను అవగాహన చేసుకుంటారు.
- నాయకత్వం-మనోవిశ్లేషణా పద్ధతులను వివరించగలుగుతారు.

## 22.1 పరిచయం

బాధ్యతగా ప్రవర్తించడం, జట్టుగా జనానికి శిక్షణ ఇవ్వడం త్వరగా మంచి నిర్ణయాలు తీసుకోవడం, విషయాన్ని సూటిగా వివరించే నేర్పు, క్రిందివారిని గుర్తించడం మొదలగు లక్షణాలతో నాయకుడు తనను అనుసరించేవారికి ఒక ఒరవడిగా నిలవాలి. అప్పుడే ఒకసమూహానికి ఒకరిని నాయకుడంటారు. ఆ నాయకత్వం లక్షణాలు తెలుసుకుందాం.

## 22.2 నాయకత్వం-రకాలు

ఒక లక్ష్యసాధనకు కొంతమంది వ్యక్తులు ప్రయత్నిస్తున్నప్పుడు నాయకుని పాత్ర తప్పనిసరి అవుతుంది. ఒక కమిటీ లేక ఒక సంస్థ-చిన్న సమూహానికి ప్రతీక. సైన్యం, ఒక రాజకీయ పార్టీ, ఒక అంతర్జాతీయ మత సంస్థ-పెద్ద సమూహాలకు ఉదాహరణ. ఇక్కడ సమూహానికి గల నిబంధనలు అందులోని వ్యక్తులకు వర్తిస్తాయి. ప్రతీ వ్యక్తి కూడా అతను ఏ సమూహానికి చెందివున్నాడో అతనికి ఆ సమూహానికి సంబంధించిన విలువలు పాటించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితులలో నాయకత్వం ఆవశ్యకత చాలా ఉంటుంది.

నాయకత్వం వేరు. అధికారం చెలాయించడం వేరు. అధికారం చెలాయించడంలో సమూహంలోని వ్యక్తులందరినుంచి వినయపూర్వక మర్యాదలను ఆశిస్తారు. సమూహ సభ్యులు భయంతో అతని మాటను వింటారు. కానీ నాయకత్వం పాత్ర పోషించడం ఒక నమూనా లేక ఒరవడిగా ఉండడం వలన సమూహంలో సభ్యుల అంగీకారం పొందగలుగుతారు. నాయకుని సలహాలను అందరూ ఆచరిస్తారు. ఉదాహరణకు మహాత్మాగాంధీని తీసుకుందాం. ఆయనకు ఏరకమైన అధికారం లేదు. కాంగ్రెస్‌పార్టీకే కాదు లక్షలాది భారతదేశ జనాలకి ఆయన మాట వేదవాక్కు. ఒక్కొక్కప్పుడు, విజయవంతంగా ఏదైనా సాధించిన వ్యక్తికి, అటువంటి నాయకత్వం ఆపాదించబడుతుంది. నాయకుడు- అనుసరించే జనం మధ్య ముఖాముఖికానీ, ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. భావాలను అభిప్రాయాలను తెలియజేయాల్సి ఉంటుంది.

నాయకుడు నిరంకుశుడైనా, జనాభిప్రాయానికి విలువఇచ్చేవాడయినా, అతనికి కొన్ని ప్రత్యేక విధులున్నాయి. క్రెచ్, క్రచ్‌ఫీల్డ్ (1948) నాయకత్వ లక్షణాల గూర్చి ఈ విధంగా తెలియజేశారు. సమూహమేదయినా నాయకుడు ప్రణాళిక తయారు చేయగలడు. దానిని అమలు చేయడంలో ప్రావీణ్యం కలవాడు, స్వదేశీ సమూహాలను నియంత్రించువాడు, మధ్యవర్తి, ఒక్కొక్కప్పుడు నాయకుడే స్వయంగా అన్నీ చక్కబెట్టాలనుకుంటాడు. అది ఎక్కువగా సమస్యలకు దారితీస్తుంది. ఒక్కోసారి క్రమశిక్షణ చర్యతీసుకోవాల్సి వస్తుంది. సమూహ సభ్యులకు బహుమతులు, శిక్షలు ఇవ్వాల్సి వస్తుంది. అతని పక్షాన న్యాయమూర్తిగా పక్షపాతరహితంగా, మధ్యవర్తిగా నిలబడి న్యాయాన్ని చెప్పాల్సి ఉంటుంది.

కొన్నిచోట్ల నాయకుని మీద చాలా ఎక్కువగా ఆరాధన ఉంటుంది. మానసికంగా వారిమీద ఆధారపడడం జరుగుతుంది. నాయకుని వ్యక్తిత్వం (మూర్తిమత్వం) వారి అనుయాయులకు పెద్ద ఆకర్షణగా నిలుస్తుంది. వారు తమ నాయకుని నుంచి భద్రత, రక్షణ కోరుకుంటారు. కానీ ఎప్పుడైతే నాయకుడు తన అనుయాయులు కోరింది సాధించలేడో వారు వెంటనే అటువంటి నాయకుని వదిలివేయడం జరుగుతుంది. నాయకుడు అంటే వారి అనుయాయులకు ప్రేమ ఉంటుంది. తమని తమ నాయకుడు గుర్తించాలని ఎదురుచూస్తారు. అలా కాకుండా నాయకుడు పక్షపాతంతో ప్రవర్తించినప్పుడు అతని అనుయాయులు అసంతృప్తితో బాధపడుతారు.

గిబ్ (1969) అమెరికా సైన్యం సూచించిన 11 మూల సూత్రాలనుంచి, ఏడు సూత్రాలతో నాయకత్వ ప్రవర్తనను నిర్వచించాడు.

1. వృత్తిపరమైన, సాకేంతికపరమైన నైపుణ్యత,
2. తన క్రిందివారిని గుర్తించడం,
3. విషయాన్ని సూటిగా వివరించడం,
4. బాధ్యతలను నెరవేర్చి, ఒక ఒరవడిగా నిలబడడం,
5. పనిని ప్రారంభించి కొనసాగించడానికి కావాల్సిన నిర్దేశన,
6. వ్యక్తులనుబట్టి శిక్షణ ఇవ్వగలగడం,
7. అవసరమైన నిర్ణయాలు తీసుకోవడం.

BRAOU

నాయకుడు తన క్రిందివారితో పనిచేయిస్తాడు. పని, వారు చేసినా, పనికి సంబంధించిన బాధ్యత నాయకునిదే. ఆపని విజయానికి కానీ, అపజయానికి కానీ నాయకుడు బాధ్యత వహిస్తాడు. విజయవంతంగా పనిచేసే నాయకుడు, విజయానికి తన క్రిందివారికి కీర్తిని పంచుతాడు. తన క్రిందివారిని సంప్రదించినా నిర్ణయాలు తానే తీసుకోవాల్సి ఉంటుంది.

సమూహంలో సభ్యులు తరచుగా నాయకునితో మాట్లాడతారు. సమూహంలో గొడవలు, ఘర్షణలు నాయకునివద్దకు వస్తాయి. ఇవన్నీ నాయకునికిగల గౌరవాన్ని తెలియజేస్తాయి. నాయకుడు ఉన్నతంగా ప్రవర్తించాలి. నాయకుడు తనకు తాను కొన్ని నిబంధనలు విధించుకోవాలి. ఆ నిబంధనలు సడలినప్పుడు నాయకుడు తన స్థానాన్ని కాపాడుకోలేడు.

## రకాలు

బార్ట్‌లెట్ (1926) నాయకులను మూడు తరగతులుగా వర్గీకరించాడు. 1. సంస్థాగత నాయకులు, 2. అధికారం చూపించే నాయకులు, 3. ప్రోత్సాహక నాయకలు.

### 22.2.1 సంస్థాగత నాయకులు

జిల్లా కలెక్టర్, ఒక సంస్థ ప్రధానాధికారి, దేశాధ్యక్షుడు, మొదలగువారు ఈరకమైన నాయకులకు ఉదాహరణ.

ఇక్కడ ముఖాముఖి పరిచయం ఉండవచ్చు. కానీ జిల్లా అధికారి కలెక్టర్‌కు, దేశాధ్యక్షునికి ఉండదు. రెండవ లక్షణం 'వరుసక్రమం'. ఒక తరగతి మరొక తరగతికి మధ్య వినయం ఉంటుంది. నిర్ణయాలు నెమ్మదిగా తీసుకుంటారు. అందుచేత పని ఆలస్యమవవచ్చుగానీ తప్పులు జరగవు.

BRAOU

### 22.2.2 ఆధిపత్య నాయకులు

వీరు చాలా దురాక్రమణ చేసేటట్టుగా, ఆత్మవిశ్వాసంతో, అందరితో మాట్లాడే మనస్తత్వంతో ఉంటారు. తొందరగా నిర్ణయాలు తీసుకుంటారు. తన క్రిందివారితో పనులు బాగా చేయించగలరు. వారి అనుయాయులు వారికి చాలా నమ్మకంగా పనిచేస్తారు.

### 22.2.3 ప్రోత్సాహక నాయకులు

నాయకులు జనంలో కలిసి పనిచేస్తారు. వారి సమస్యలు అర్థం చేసుకుంటారు. మహాత్మాగాంధీ ఈ రకం నాయకుడు. వేలాది ప్రజలు వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు నడుపుతారు. ఎంత పనిఒత్తిడి ఉన్నా, జనాన్ని స్వయంగా కలుసుకొని మాట్లాడతారు. ఈ నాయకుడు ప్రజలపట్ల అభిమానాన్ని, ఆత్మీయతను కలిగి ఉంటాడు. ప్రజల ఆశలను, ఆశయాలను గుర్తిస్తాడు. ప్రజలను ప్రోత్సహించి ఈ రకం నాయకుడు గమ్యంవైపునకు నడిపిస్తాడు.

### 22.2.4 ప్రావీణ్యంగల నాయకుడు

కళలో సాంకేతిక పరిజ్ఞానంతో చాలా కృషి చేసినవారు కూడా నాయకులవుతారు. వారి సలహాలు తీసుకుని వారి భావాలతో ప్రజలు ప్రభావితులౌతారు. దానితో వారి ప్రభావం పరిమితమవుతుంది. వారి మరణంతో ప్రజలు ఒక్కోసారి వారిని గుర్తిస్తారు. కవులు, వేదాంతులు, శాస్త్రజ్ఞులు, ప్రజల విలువలలో జీవన, విధానంలో చాలా మార్పులు తేవడం జరిగింది. ఇందుకు ఇటువంటివారే ఉదాహరణ.

## 22.3 నాయకుని మూర్తిమత్వం లక్షణాలు

నాయకుని లక్షణాలను అధ్యయనం చేయడం వలన, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జనంతో పనిచేసే ప్రభుత్వాధికారులు తమ పిల్లలకు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం వీలవుతుంది.

జనంలో రెండు రకాల విపరీత ధోరణులు ఉన్నాయి. కొందరు గుడ్డిగా ఆరాధిస్తారు. అనుసరిస్తారు. మరికొందరు నాయకులకు అంత ప్రాధాన్యత ఇవ్వరు. నాయకులకు అనుసరించే జనం ఉండాలి. వారి అంగీకారం, సహకారం కావాలి. కొన్నిచోట్ల సంయుక్త బాధ్యత కనబడుతుంది. బాధ్యత కొద్దిమంది మీద సంయుక్తం ఉంచబడినా అధికారం చలాయించే వ్యక్తి మాత్రమే నాయకుడిగా చలామణి అవుతాడు.

సాధారణంగా నాయకులకు పెద్ద తెలివితేటలు అక్కరలేదు. గొప్పవాళ్లే నాయకులు అవ్వాల్సిన అవసరం లేదు. వివిధ పరిస్థితులలో వివిధ రకాల నాయకులు తయారవుతారు.

తెలివి, సాంఘికమైన పరిచయాలు, ఆర్థిక సాంఘిక స్థితి, నిజాయితీ, ఉత్సాహం, ఒక కార్యక్రమాన్ని చివరకు కష్టపడి పూర్తి చేసే శక్తి, ఆత్మవిశ్వాసం, పనులు జరిగేలా చూసే నేర్పు, కీర్తి, వాక్చాతుర్యం, సర్దుబాటు చేసుకొనే శక్తి నాయక లక్షణాలుగా భావిస్తారు. తన భావాలను నియంత్రించుకొనే శక్తి, స్వయం సమృద్ధి, పొడవు, శరీర ఆకృతి, మొదలగు లక్షణాలు కూడా నాయకునికి అవసరంగా భావించరు.

నాయకులు పొడగరిగా ఉండాలని చాలామంది అనుకొంటారు. అబ్రహం లింకన్ వంటివారు పొడగరి అయినా నెపోలియన్, హిట్లర్ వంటి నాయకులు చాలా సామాన్యమైన పొడవుగలవారు. బాగా శక్తిమంతులు, బలవంతులుగా నాయకులు ఉండాలి. అంటే మహాత్మాగాంధీ వంటివారు శరీర దారుఢ్యంలో చాలా నాజూకైన వ్యక్తి. ఇలా పొడవుతక్కువ శరీర దారుఢ్యం ఆరోగ్యం లేనివారు, నాయకులుగా ఆధిపత్యం చలాయించడంతో తమ లోపాన్ని సవరించుకొంటారని కొందరు వాదిస్తూ వుంటారు కానీ, బలహీనులంతా నాయకులవలేరుకదా!

పరిశోధనలు నాయకులకు అత్యంత మేధాసంపత్తి ఉన్నట్లు నిరూపించాయి. స్త్రీలలో కూడా చదువులో బాగా విజయవంతంగా చదివిన స్త్రీలు, నాయకులవడం కనబడుతోంది. ఆటపాటలలో మిగిలిన కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థులు ఎక్కువగా నాయకులవడం కనబడుతుంది. నాయకులు అందరితో కలిసి సాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వ్యక్తులవుతారు. అధికశాతం నాయకులు హెచ్చు సాంఘిక ఆర్థిక స్థాయినుంచి వచ్చినట్టు పరిశోధనలు వెల్లడిచేస్తున్నాయి.

BRAOU

## 22.4 నాయకత్వంలో పరిస్థితుల ప్రాబల్యం

నాయకత్వ లక్షణాలు, అతను మార్గదర్శకత్వం వహించే సమూహం మీద ఆధారపడి ఉంటాయి. విప్లవానికి ఒక రకమైన నాయకత్వం అవసరం అయితే రాజకీయానికి మరొక రకం మతానికి వేరొకరకమైన నాయకత్వం కావాలి. ఒక్కోసారి ఒకరకం నాయకుడు మరొక రకం నాయకుడుగా మారుతాడు.

## 22.5 అవసరమైన చర్యకోసం

నాయకత్వం అవసరమైన చర్యకోసం ఏర్పడుతుంది. స్వాతంత్ర్యపోరాటం మహాత్మాగాంధీని నాయకుడుగా తయారుచేసింది. నాయకుడంటే మూడో ముఖ్యాంశం. నాయకుడు సమూహంలో ఎక్కువ అభిమానాన్ని అంగీకారాన్ని పొందిన సభ్యుడు, అవసరానికి నాయకత్వం వహించి వారి సమస్య పరిష్కరిస్తాడు. సమూహం సైజు చిన్నదయితే వారితో సఖ్యత, దగ్గరితనం, సహకారం నాయకుడు పొందుతాడు. పెద్ద సమూహాలలో వారిని అధికారంతో ఆధిపత్యం వహించి, నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

## 22.6 నాయకుని అనుయాయులు

నాయకునికి అనుయాయులు ఉండాలి. అనుసరించే జనం ఉంటేనే నాయకుడు పనిచేయగలడు. వారి స్థితిగతులు, సామర్థ్యం కూడా నాయకునికి జయాన్ని కల్పిస్తాయి. రెండవ ప్రపంచయుద్ధంలో ప్రజాస్వామ్యం ఉన్న

ప్రదేశంలోని సైనికులు పై అధికారికి ఇచ్చిన ప్రత్యేక వసతులను ఇష్టపడలేదు కానీ ఇతర సైనికులతో అటువంటి సమస్య రాలేదు.

నాయకులు తమ అనుయాయుల మనస్సును గెలుస్తారు. వారి పేరు మర్యాద జయానికి దారి తీస్తాయి. నాయకులను ఆదర్శంగా ప్రజలు భావిస్తారు. రెండు రకాల అభిప్రాయాలున్నాయి. నాయకులు పుట్టుకతో నాయకులు కాలేరు. కొందరిని పరిస్థితులు నాయకులుగా నిలబెడతాయి.

## 22.7 నాయకుని విధులు

1. నాయకుడు తన ప్రజల సమూహంలో సభ్యుడవ్వాలి. భావాలను, ఆంతర్యాలను, నియమాలను, కార్యక్రమాలను, సమూహ లక్ష్యాలను పంచుకోవాలి. నెహ్రూ జనంతో కలిసిపోవడం ఉదాహరణ. సామాన్యుడి దుస్తులే ధరించడం గమనించదగ్గ లక్షణం.

2. కొన్ని కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసిన చరిత్ర ఉండాలి. ఉదా: గాంధీజీ, దక్షిణ ఆఫ్రికా ప్రజల ఉద్యమంలో విజయం సాధించాక స్వాతంత్ర్య పోరాటంలో భారతీయులు అతనిని నాయకునిగా అంగీకరించారు.

3. తన ప్రజలను పూర్తిగా అర్థం చేసుకొన్న నాయకుడే నిజమైన నాయకుడు. ప్రజల ఆశలు, నిరాశలు, అవసరాలు, విలువలు, అర్థం చేసుకోవాలి.

4. నాయకుడు విధానాలు తయారు చేయాలి. గాంధీజీ సత్యాగ్రహాన్ని సహాయ నిరాకరణోద్యమాలను నడిపించారు. నెహ్రూ మతప్రసక్తిలేని రాజ్యాంగం, తటస్థ విధానం అనుసరింపజేశారు.

5. నాయకుడు నిపుణత కలిగిన పరిపాలనా దక్షుడుగా ఉండాలి. నాయకుడు తనకు సహాయకులను ఎన్నుకోవాలని, పనులు చేయించడం, కార్యక్రమాల ప్రణాళికలు తయారు చేయడం అవసరమైతే జనాన్ని అజ్ఞాపించి పనులు చేయించుకోవాలి.

6. నాయకుడు మంచి ఆదర్శానికి ప్రతీకగా ఉండాలి. తను ఆచరించేదే వారికి ఉపదేశించాలి. ఉపదేశించేదే ఆచరించాలి. ధైర్యంలో, సాహసంలో, నీతిలో ఆదర్శంగా నిలవాలి.

7. నాయకుడు తనను తాను సమూహానికి చిహ్నంగా భావించాలి.

ఉప సమూహాలను ఒకటి చేయడం, వారిలో అభిప్రాయ భేదాలు సరిచేయడం వారి ఐకమత్యానికి దోహదపడడం నాయకుని విధులలో ఆఖరిది.

కొందరు మనస్తత్వ శాస్త్రజ్ఞులు రెండు రకాల విధులు నాయకునికి ఉండాలని భావించారు. నాయకుని మొదటి పని వీరి ప్రజల భావాలను అర్థం చేసుకొని, లక్ష్యాలకు అపాయం కలిగే పనులను త్యజించాలి. మంచి భావాలను మంచి ఆలోచనలను ప్రోత్సహించడం, విధానాలు తయారు చేయడం, ప్రణాళికలు తయారు చేయడం సహాయకులను ఎన్నుకోవడం, అనుయాయులచేత పనిచేయించడం నాయకుని రెండవ విధి.

## 22.8 నాయకత్వం-మనోవిశ్లేషణ పద్ధతి

నాయకుడిని అనుసరించే ప్రజలు అతడిని తండ్రిలా భావిస్తారు. వయస్సులోనే కాదు అనుభవం, మార్గదర్శకత్వం లక్షణాలను బట్టి వారి వారి తండ్రినో, తల్లినో వారిలో చూడడం అవుతుంది. ఫ్రాయిడ్ బాల్యం అనుభవాలను బట్టి వ్యక్తులు నాయకునితో అనుబంధాన్ని ఏర్పరచుకొంటారని చెప్పారు. మహాత్మాగాంధీని తండ్రిగా భావించి 'బాపూ' అని



BRAOU

సంబోధించారు. నచ్చనివి చేసినప్పుడు నిరాశపడ్డారు. అన్ని కష్టాలకు, ఫిర్యాదులకు అయనను బలిపశువును చేశారు.

నాయకులలో నియంతలు, ప్రజాస్వామ్యవిలువ పాటించే నాయకులు ఉంటారు. నియంతలు పూర్తిగా సమూహాన్ని నియంత్రిస్తారు. ప్రణాళికలు కార్యక్రమాలు విధానాలు తయారు చేసుకుంటారు. ప్రజాస్వామ్య విలువలు గల నాయకుడు పరస్పర మైత్రిని ప్రోత్సహిస్తాడు. వారు కోరుకున్న లక్ష్యాలను సాధించడానికి ప్రోత్సహిస్తాడు.

## 22.9 ముగింపు

ఒక లక్ష్యాన్ని సాధించడానికి సమూహంలోని సభ్యులను లేదా విశాల ప్రజానీకాన్ని నడిపించేవాడే నాయకుడు. బాధ్యతగా ప్రవర్తించి మంచి నిర్ణయాలు తీసుకొని, నలుగురికీ ఆదర్శంగా వ్యవహరించే లక్షణాలు నాయకత్వ లక్షణాలు. వీటిలోనూ రకాలున్నాయి. నాయకత్వం పాత్రనుబట్టి, నాయకుడు అనుసరించే ధోరణులను బట్టి వీరిని వర్గీకరించవచ్చు. ఆధిపత్యం వహించే వాళ్లు ప్రోత్సహించేవాళ్లు ఇలా రకరాలుగా ఉంటారు. అట్లాగే నాయకుడు అవసరమైతే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడకూడదు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూలాంటి వారు నాయకత్వానికి మంచి ఉదాహరణ.

## 22.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. నాయకత్వంలో రకాలెన్ని? వివరించండి?
2. నాయకుని మూర్తిమత్వ లక్షణాలను పేర్కొనండి?
3. నాయకుని విధులేవి? వివరించండి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబు రాయండి.**

1. సంస్థాగత నాయకులు.
2. నాయకత్వం-మనోవిశ్లేషణ.
3. నాయకుని అనుయాయులు

## 22.11 చదవదగిన పుస్తకాలు


1. Young, P.V. : 'Scientific Social Survay and Research'
2. Brij Mohan : 'Socialwork Research: An Innovative process'


BRAOU

# ఖండం- VII

## సాముదాయిక సమస్యలు

సమాజనిర్మాణంలో సముదాయం (Community) ఒక భాగమని మనకు తెలుసు. మన సమాజం కులం, మతం, వృత్తి సంఘం, గ్రామీణ, నగర సముదాయాలు ఇలా అనేక సామాజిక సముదాయాల సమాహారం. ఒక ప్రత్యేక ప్రాంతంలో నివసిస్తోన్న సముదాయాల మధ్య సమన్వయం, సామరస్యం లేకపోతే ఆ సమాజం వక్రమార్గం పడుతుంది. సంక్షోభంలో పడుతుంది.

సంఘసంక్షేమ దిశగా ఆలోచించే సమాజశాస్త్ర వేత్తలు సముదాయాల సమస్యలను ప్రత్యేక దృక్కోణాల్లో అర్థం చేసుకోవడం, పరిష్కారించడం జరుగుతుంది. అలాంటి సాముదాయక సమస్యలు-పరిష్కార పద్ధతులు వివరించడం ఈ ఖండం ప్రధాన ఉద్దేశం. ఈ ఖండంలో మూడు భాగాలున్నాయి. అవి:

భాగం-23: సముదాయ నిర్మాణం-భావన, సూత్రాలు, నమూనాలు

భాగం-24: సహభాగిత-గ్రామీణ కార్యక్రమాల మదింపు, సూక్ష్మ ప్రణాళిక

భాగం-25: సామాజిక కార్యాచరణ-భావన, సూత్రాలు

BRAOU

BRAOU

# భాగం-23: సముదాయ నిర్మాణం-భావన-సూత్రాలు-నమూనాలు

విషయక్రమం


23.0 ఉద్దేశాలు

23.1 పరిచయం

23.2 సముదాయం - నిర్వచనం

23.3 సముదాయం - భావన

23.4 సముదాయం - లక్షణాలు

23.5 సముదాయ వ్యవస్థాపన - భావన

23.6 సముదాయ వ్యవస్థాపనా లక్ష్యాలు

23.7 ముఖ్య సూత్రాలు

23.8 సాముదాయిక వ్యవస్థాపన - ప్రక్రియ - నమూనా పద్ధతులు

23.9 భారత దేశంలో సాముదాయిక వ్యవస్థాపనా పరిధి.

23.10 ముగింపు

23.11 మాదిరి పరీక్ష ప్రశ్నలు

23.12 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 23.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సముదాయం అంటే ఏమిటో నిర్వచించగలుగుతారు.
- భావన, లక్షణాలు, సముదాయ వ్యవస్థాపన గురించి నేర్చుకుంటారు.
- భారతదేశంలో సముదాయిక వ్యవస్థ గురించి తెలుసుకుంటారు.

## 23.1 పరిచయం

సమాజాన్ని నిర్మాణం దృష్ట్యా చూస్తే అది ఎన్నో సాంఘిక సమూహాల, సంఘాల, సముదాయాల కలయికగా గోచరిస్తుంది. ముఖ్యమైన సమాజరూపాలలో సముదాయం ఒకటి.

మనం నిత్యవ్యవహారంలో సముదాయం అనే పదాన్ని అస్పష్టంగా ఉపయోగిస్తుంటాం. ఒక మత సమూహాన్ని గానీ, కుల సమూహాన్ని గానీ తెలియజేసేటప్పుడు మనం సముదాయమనే పదాన్ని ఉపయోగిస్తాం. తరచుగా హిందూ సముదాయమని గానీ, ముస్లిం సముదాయమని గానీ, బ్రాహ్మణ సముదాయమని గానీ, ఇలా మతాన్ని కులాన్ని తెలియజేయడానికి సముదాయం అనే పదాన్ని ఉపయోగిస్తున్నాము. అయితే ఇది సమంజసం కాదు.

సమాజశాస్త్రంలో సముదాయమనే పదాన్ని ఒక స్థిరనివాసం గురించి తెలియ జేసేటప్పుడు ఉపయోగిస్తాము. ఉదా : గ్రామం, పట్టణం, దేశం మొదలైనవి. ప్రజలు తను వ్యక్తిగత జీవితాలను సంపూర్ణంగా ఒక గ్రామంలోనో లేదా నగరంలోనో గడపగలరు. కానీ ఒక క్లబ్బులోనో లేదా ఒక వ్యాపార సంస్థలోనో గడపలేరు. వ్యక్తుల సాంఘిక సంబంధాలన్నీ ఇంచుమించుగా ఒక సముదాయానికి పరిమితమై ఉంటాయి.

మనం సమాజాన్ని నిర్మాణ పరంగా పరిశీలిస్తే వ్యక్తులు, సమూహాలు, సముదాయాలు మొదలైన రూపాలతో కనిపిస్తుంది. మానవుడు సంఘజీవి. ఒంటరిగా జీవించలేడు. మనిషి తన చుట్టు పక్కల ఉన్న వ్యక్తులు, సమూహాలతో సంబంధాలను ఏర్పరుకొని, తన జీవితావసరాలను తీర్చుకుంటూ సామూహిక జీవితాన్ని గడుపుతాడు. ఇటువంటి సమూహాలలో సముదాయం ఒకటి.

## 23.2 నిర్వచనం

సమాజశాస్త్రవేత్తలు సముదాయ పదాన్ని పలురకాలుగా నిర్వచించారు.

"నిర్దిష్ట ప్రాంతంలో సామాజిక జీవనాన్ని సంపూర్ణంగా నిర్వహించడాన్ని సముదాయమని" ఆగ్బర్న్, నిమ్‌కాఫ్‌లు నిర్వచించినారు.

"నిర్దిష్ట ప్రాంతంలో సహభావంతో నివసిస్తున్న సామాజిక సమూహాన్ని సముదాయమని" బోగార్డస్ నిర్వచించారు.

"ఏదైనా ఒక ప్రాంతంలో వ్యక్తులు సామాజిక ఐక్యతతో సామాజిక జీవనాన్ని గడిపితే ఆ ప్రాంతాన్ని సముదాయమని" మైకెవర్ నిర్వచించారు.

"కొంత భౌగోళిక ప్రాంతాన్ని ఆక్రమించుకుని తమ జీవితావసరాలను నెరవనేర్చుకుంటూ జీవించే సామాజిక సమూహమే సముదాయమని" కింగ్స్‌లే డేవిస్ నిర్వచించారు.

పై నిర్వచనాలను బట్టి సముదాయమనగా సముదాయంలోని సభ్యులు తామంతా ఒకటేనని, తమది ఉమ్మడి శక్తి అనే మానసిక భావనను కలిగి ఉండి స్థిరనివాసం కలిగిన భౌగోళిక పరమైన సామాజిక సమూహమని చెప్పవచ్చు.

BRAOU

## 23.3. సముదాయ భావన

స్థానికత, సముదాయిక భావం సముదాయానికి పునాదుల వంటివి. సముదాయం ఒక ప్రాంతాన్ని ఆక్రమించి ఉంటుంది. చలనశీలత ఉన్న తెగలు కూడా తాత్కాలికంగా ఒక ప్రాంతాన్ని ఆక్రమించి ఉంటాయి. సాముదాయిక భావనే సామాజిక సంసక్తతగా పేర్కొనవచ్చు. ఈ భావన లోపించినపుడు సముదాయానికి ఉనికి లేదు. ఒక ప్రాంతంలో వ్యక్తులు స్థిరనివాసాన్ని కలిగి ఉండడమేగాక వారి మధ్య పరస్పర గుర్తింపు కలిగి ఉన్నప్పుడే అది సముదాయమనిపించుకుంటుంది.

ఆదిమ సమాజాలలో సముదాయాలు చాలా చిన్నవిగా ఉండేవి. ఇవి స్వయం సమృద్ధిని కలిగి ఉండేవి. దీనికి కారణం మనది అనే భావన వారిలో అధికంగా ఉండేది. సభ్యుల సంఖ్య తక్కువ కావడం ఇందుకు కారణం. ఆధునిక సముదాయాలు పరిమాణంలో చాలా పెద్దవి. అవి స్వయం సమృద్ధమైనవి కావు. సాముదాయిక సభ్యుల మధ్య సంఘీభావం పెంపొందించడంతో వ్యక్తుల సంబంధాలను సమన్వయ పరచడంలో సముదాయ ప్రభావం ఇప్పుడు లోపిస్తున్నది. మానవులు ఒకే ప్రాంతంలో నివసిస్తున్నప్పటికీ సముదాయంలో వారి అవసరాలన్నీ తీరడం లేదు. అందుచేత ప్రజలు వారి అవసరాల కోసం సముదాయంలోని సంఘాలపై ఆధారపడి వారి ప్రత్యేక అవసరాలను నెరవేర్చు కోవడం జరుగుతుంది. ఎమ్. ఆర్. స్టైయిన్ అనే రచయిత ఈ విషయాన్నే "ఎక్‌లిప్స్ ఆఫ్‌ది కమ్యూనిటీ" అనే గ్రంథంలో వివరించాడు.

భారతదేశం అనేక సముదాయాల కలయిక ఉదా : భారతదేశంలో ఒక గ్రామీణ ప్రజా సమూహాన్ని సముదాయమని చెప్పవచ్చు. అలాగని కేవలం గ్రామాలనే సముదాయాలు అనుకోకూడదు. పట్టణాలు, నగరాలు, మహానగరాలు కూడా సముదాయాలే అని చెప్పవచ్చు. చివరకు భారతదేశమంతటినీ ఒక సముదాయమని కూడా అనవచ్చు.

సముదాయ భావనను సంపూర్ణంగా తెలుసుకోవడానికి వాటి లక్షణాలను కూడా తెలుసుకోవాలి.

## 23.4. సముదాయం - లక్షణాలు

సముదాయం ముఖ్య లక్షణాలను ఈ క్రింది విధంగా చెప్పవచ్చును. ఈ సూత్రాల ఆధారంగా సముదాయం రూపొందుతుంది.

### 1. స్థానిక ప్రాంతం

సముదాయ ముఖ్య లక్షణాలలో మొట్టమొదటిది స్థానిక ప్రాంతం సముదాయాలు ఎల్లప్పుడూ కొంత భౌగోళిక ప్రాంతాన్ని ఆక్రమించి ఉంటాయి. నిర్ణీత ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు నివసించినపుడే ఆ ప్రాంతం సముదాయంగా రూపొందుతుంది.

### 2. వ్యక్తుల సమూహం

సముదాయం మరొక లక్షణం వ్యక్తుల సమూహం వ్యక్తులు లేకుండా నిర్ణీత భౌగోళిక ప్రాంతమున్నప్పటికీ సముదాయమనేది ఏర్పడదు. ఈ వ్యక్తులంతా కలిసి మెలిసి సహకారంతో జీవించినపుడే సముదాయం ఏర్పడుతుంది.

### 3. సాముదాయిక భావన

సముదాయానికి సాముదాయిక భావన అతి ముఖ్యమైన లక్షణం. సభ్యుల మధ్య ఉమ్మడి సంస్కృతి, భాష, సహజీవనం ఉండడం వలన వారంతా ఆ సముదాయానికి చెందినవారమనే భావన ఏర్పడుతుంది. కాబట్టి ఒక గ్రామ సముదాయంలో నివసిస్తున్న వ్యక్తుల మధ్య పరస్పర అవగాహన సాముదాయిక భావన లేకపోతే నిర్ణీత ప్రదేశమున్నా అది సముదాయమనిపించుకోదు.

### 4. శాశ్వతమైనవి

సముదాయాలు, మూకలు, గుంపులు లాగా తాత్కాలికమైనవి కావు. సభ్యులు సహజీవనాన్ని, సామాజిక సంబంధాలను శాశ్వతంగా కలిగి ఉంటారు.

### 5. సహజమైనవి

సముదాయాలు ఏదో కొంతమంది నిర్మించడం వల్ల గానీ, స్థాపించడం వల్లగానీ ఏర్పడినవి కావు ఇవి సహజంగా ఏర్పడినవి. వ్యక్తులు సముదాయాలలోనే జన్మించి వాటిలోనే తమ తమ మూర్తిమత్వాలను అభివృద్ధి చేసుకుంటారు.

### 6. ఉమ్మడి సంస్కృతి

సాధారణంగా ఒక సముదాయంలో నివసించే వ్యక్తులందరూ ఒకే రకమైన ఆచార సాంప్రదాయాలను పాటిస్తూ, ఉమ్మడి సాంస్కృతిక వ్యవస్థను కలిగి ఉంటారు.

## 23.5 సాముదాయిక వ్యవస్థాపన:భావన

సాముదాయిక వ్యవస్థాపన అనే పదాన్ని అమెరికాలో మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వమే ఉపయోగించారు. అమెరికాలోని విద్యా సంస్థలలో 1940 సంవత్సరం సాముదాయిక వ్యవస్థాపనను వృత్తి శిక్షణా విధానంగా బోధించారు.

BRAOU

భారతదేశంలో 1950 సంవత్సరంనుంచి విద్యా సంస్థలలో దీనిని ప్రత్యేక వృత్తి శిక్షణా విధానంగా ప్రవేశపెట్టారు.

అమెరికాలో 20వ శతాబ్దం ప్రారంభంలో వివిధ సముదాయాలలో సాముదాయిక మండలాలు ఏర్పాటు చేశారు. ఇవి సముదాయాలలోని విభిన్న సేవా సంస్థలు పలు సేవా కార్యక్రమాల నిర్వహణకు కొన్ని ప్రమాణాలు రూపొందించడానికి, సేవా సంస్థలలో సభ్యుల నాయకత్వంలో సముదాయానికి ఉమ్మడి ప్రణాళికలు రూపొందించడానికి, తగిన శిక్షణలు ఇవ్వడానికే పరిమితమయ్యాయి. తరువాత మొదటి ప్రపంచ యుద్ధానంతరం యుద్ధ నిధి, సాముదాయిక నిధి మొదలైన వాటిని చాలా సముదాయాలలో నెలకొల్పారు. వీటిలో కూడా సంక్షేమ కార్యకర్తలను నియమించడం, వీరు కూడా నిధులను వినియోగించడం నియంత్రణలను ఏర్పరచడం, సాముదాయిక సేవా కేంద్రాల నిర్వహణా పరమైన సమస్యలను పరిష్కరించడానికే వీరి పాత్ర పరిమితమయింది. ఈ విధంగా 1960 సంవత్సరం వరకు సాముదాయిక మండలి, సాముదాయిక నిధి మొదలయిన వాటిలో నియమించడం, వారి పాత్ర వాటి సమస్యలకే పరిమితమయింది. అంతేకానీ వారికి సముదాయంతో ప్రత్యేక్ష కార్యాచరణ ఏమీ ఉండేది కాదు.

1961వ సంవత్సరంనుంచి వృత్తి కార్యకర్తలు సముదాయంలో వివిధ సమస్యలను పరిష్కరించడం, కొంతమంది వృత్తి కార్యకర్తలు సాముదాయిక సంక్షేమ వ్యవస్థాపన అనే పదాన్ని, మరికొంతమంది సాముదాయిక వ్యవస్థాపన అనే పదాన్ని వినియోగిస్తూ ఉండడంతో ఈ పదాల వినియోగంలో గందరగోళం ఏర్పడింది. దీంతో 1961వ సంవత్సరంలో ప్రముఖ విద్యావేత్త విలియమ్ డైసన్ సాముదాయిక వ్యవస్థాపన అనే పదానికి విస్తృతమైన భావన ఉందని పేర్కొనడంతో, సాముదాయిక వ్యవస్థాపన అనే పదం వ్యవహారంలోకి వచ్చింది.

సాముదాయిక వ్యవస్థాపనను పలురకాలుగా నిర్వచించినప్పటికీ, వాటిలో పేర్కొన్న ప్రధానాంశం సముదాయ అవసరాలకు సముదాయ వనరులను వినియోగించి, సముదాయ సమస్యలను పరిష్కరించడమేనని వివరించారు.

"సాముదాయిక వ్యవస్థాపన ప్రక్రియ ద్వారా నిర్ణీత భౌగోళిక ప్రాంతాలలో కానీ, కార్యాచరణ క్షేత్రంలో గానీ, సాముదాయిక సంక్షేమ అవసరాలను, సాముదాయిక సంక్షేమ వనరులను సాముదాయిక సంక్షేమానికై సమన్వయంతో సర్దుబాటు చేయడమని" ఆర్థర్ డన్‌హామ్ నిర్వచించారు.

"సాముదాయిక వ్యవస్థాపన అనే ప్రక్రియ ద్వారా సముదాయం తన అవసరాలను లేదా లక్ష్యాలను గుర్తించి, వాటిని క్రమబద్ధీకరించి, వాటిని సాధించుకోవడానికి అవసరమైన, తగిన సంకల్పం, నమ్మకం పెంపొందించుకుని, వాటిని నిర్వహించడానికి కావలసిన వనరులను సమీకరించి, వాటిని నెరవేర్చుకునే కృషిలో భాగంగా కార్యక్రమాలను రూపొందించడమే" అని ముర్రేజిరాస్ నిర్వచించారు.

పై నిర్వచనాలలో రాస్ నిర్వచనం చాలా ముఖ్యమైనది. రాస్ సాముదాయిక వ్యవస్థాపన అనే భావనను "సముదాయాల ప్రత్యక్ష సేవా కార్యక్రమంగా పేర్కొనడం జరిగింది. ఈయన సాముదాయిక వ్యవస్థాపనకు ఒక ప్రక్రియగానే ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. ఈ ప్రక్రియలో సముదాయం వివిధ సమస్యలను, అవసరాలను గుర్తించి వాటి సాధన కోసం సముదాయం లక్ష్యాలను ఏర్పరచుకుంటుంది. అంతేగాక సముదాయంలోని ప్రజలందరినీ సమైక్యపరచి, వారికి గల సమస్యలను లక్ష్యాలను చైతన్యంతో సాధించుకోవడానికి వారంతా సహకారంతో పనిచేయడానికి తోడ్పడుతుంది.

## 23.6 లక్ష్యాలు

సాముదాయిక వ్యవస్థాపన పద్ధతి ముఖ్య లక్ష్యం స్థూలంగా చెప్పాలంటే ప్రజల భాగస్వామ్యంతో సముదాయాన్ని అభివృద్ధి పరచడమేనని చెప్పవచ్చు. దీనిని బట్టి సాముదాయిక వ్యవస్థాపన పద్ధతి ముఖ్య లక్ష్యం సముదాయం తన అవసరాలను, కోరికలను గుర్తించేటట్లుగా సహకరించడం అనగా సముదాయంలోని ప్రజలు ముందుగా తమ వాస్తవమైన తక్షణ అవసరాలను గుర్తించేటట్లుగా చేయడం, సముదాయంలో లభించే వనరులను వినియోగించి స్వశక్తితో తమ సమస్యలను అవగాహన చేసుకుని వాటి పరిష్కార మార్గాలను రూపొందించి అమలు చేయడంలో



BRAOU

పాల్గొనేటట్లు చేయడమే కాకుండా వాటిని ఉమ్మడిగా పరిష్కరించుకోవడమే ఈపద్ధతి ప్రధాన లక్ష్యంగా పేర్కొనవచ్చు.

సాముదాయిక వ్యవస్థాపన లక్ష్యాలను నిర్దిష్టంగా చెప్పాలంటే ఈ క్రింది విధంగా విభజించవచ్చు.

1. సముదాయంలోని ప్రజలు తమ తక్షణ అవసరాలను గుర్తించేటట్లు చేయాలి.
2. సముదాయంలోని విభిన్న వనరులను తెలుసుకోవాలి.
3. సముదాయ ప్రజలు చైతన్యంతో సంఘటితంగా తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి కృషి చేయాలి.

## 23.7 సాముదాయిక వ్యవస్థాపన ముఖ్య సూత్రాలు

సాముదాయిక వ్యవస్థాపన పద్ధతి లక్ష్యాలను సాధించడానికి కొన్ని ప్రధాన సూత్రాలను రూపొందించారు. సాముదాయిక అవసరాలను నెరవేర్చడానికి, సాముదాయిక సమస్యలను పరిష్కరించడానికి తోడ్పడే విధంగా వీటిని రూపొందించారు.

1. సాముదాయిక వ్యవస్థాపన ఒక సాధనమే కానీ, అంతిమ లక్ష్యం కాదు. సముదాయ సమగ్రాభివృద్ధి ధ్యేయంగా కార్యక్రమాలను రూపొందిచవలసి ఉంటుంది.

2. సముదాయంలోని ప్రతీవ్యక్తి సముదాయ సభ్యులతో స్నేహపూర్వకమైన, విశ్వసించదగిన సంబంధ బాంధవ్యాలను పెంపొందించుకోవాలి.

3. సముదాయంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాన్నైనా చేపట్టినపుడు అవి ఎప్పుడూ సముదాయ పూర్తి అవసరాలను పరిగణలోకి తీసుకోవాలి. సముదాయంలో అనేక సమూహాలు, వర్గాలు, మతాలు, కులాల వారుంటారు. అలాగే సముదాయంలో పిల్లలు, యువతీయువకులు, స్త్రీలు, వయోవృద్ధులు మొదలైన వారు కూడా ఉంటారు. అందువల్ల అభివృద్ధి కార్యక్రమాలు కేవలం ఒక వర్గానికి, మతానికి, కులానికి చెందిన ప్రజల అవసరాలను నెరవేర్చేవిగా కాక, అందరి అవసరాలను తీర్చేవిగా రూపొందించాలి.

4. సముదాయంలో ఏ కార్యక్రమాన్నయినా రూపొందించాలంటే దానికి తక్షణ అవసరాలు ప్రాతిపదికగా ఉండాలి. సముదాయంలోని పలురకాల అవసరాలను తెలుసుకొని వాటిలో తక్షణమే నెరవేర్చవలసిన అవసరాలను ముందుగా గుర్తించాలి. నూతన కార్యక్రమాలను సముదాయ ప్రజల అంగీకారం లేకుండా బలవంతంగా సముదాయంపై రుద్దకూడదు.

5. సముదాయంలోని ఏ అభివృద్ధి ప్రక్రియ అయినా ప్రజలు నూతన పద్ధతులను అవలంబించడానికి తగిన ప్రేరణ, ఉద్దీపన కలుగజేసి కొత్త విధానాలను అనుసరించి వారి జీవన ప్రమాణస్థాయిని పెంపొందించేందుకు తోడ్పడాలి.

6. సముదాయం ఎప్పుడూ స్వయం సహాయంపైనే అధారపడేటట్లుగా చేయాలి. సముదాయం ఇతరుల సహాయంపై ఎప్పుడూ ఆధారపడకుండా తమ స్వయం సహాయ శక్తిని నమ్ముకునేటట్లుగా చేయాలి.

7. సముదాయంలో అమలు జరిపే అన్ని కార్యక్రమాలు సముదాయం ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక జీవన పరిస్థితులకు అనుగుణంగా ఉండాలి. సముదాయం సంప్రదాయాలు, ఆచారాలు, విశ్వాసాలను గౌరవిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలి. సముదాయంలో పరివర్తనా ప్రక్రియను అమలు జరిపేటప్పుడు ప్రగతి నిరోధక మూఢ నమ్మకాలు, విశ్వాసాలు మొదలైన వాటిలో మార్పును నెమ్మదిగా క్రమంగా మాత్రమే ప్రవేశపెట్టాలి. ఎలాంటి మార్పులకైనా సముదాయంలోని ప్రజల భాగస్వామ్యం, సహాయ సహకారాలు అవసరం.

BRAOU

8. సాముదాయిక వ్యవస్థాపన ముఖ్య సూత్రం సముదాయాలు ఎట్లాంటి మార్పులనైనా అంగీకరించే సాముదాయిక మానసిక సంసిద్ధత చాలా అవశ్యకం. ఈ మానసిక సంసిద్ధత లక్ష్యపెట్టకుండా భౌతిక లక్ష్యాలను సాధించడం అంత మంచి పద్ధతి కాదు అంతే కాకుండా సాముదాయిక అవసరాలకు విరుద్ధమైన పథకాలు ఎన్నడూ విజయవంతం కావు. అందువల్లనే ఎట్లాంటి సహాయమైనా మార్పు అయినా సాముదాయిక అవసరాలకు తగినట్లుగా మాత్రమే ఉండాలి.

9. సముదాయంలో గల వివిధ సమూహాల మధ్య సహకారం పెంపొందించాలి. కొన్ని సముదాయాలలో వివిధ సమూహాల మధ్య కొన్ని ఆరోగ్యకరమైన పోటీలను ప్రోత్సహించడం ద్వారా సాముదాయిక అభివృద్ధిని పెంపొందించవచ్చు.

10. సముదాయం తన అవసరాలను, వనరులను గుర్తించడంలోనూ, వాటిని నెరవేర్చుకోవడంలోనూ, భావప్రసార సాధనాల అవసరం ఎంతైనా ఉంది. దృశ్య శ్రవణ సాధనాలు అంటే సినిమాలు, టెలివిజన్‌లు, రేడియోలు, చార్టులు, పోస్టర్లు, కరపత్రాలు, పత్రికలు మొదలైన సాధనాలు వినియోగించాలి.

## 23.8 సాముదాయిక వ్యవస్థాపన - ప్రక్రియ - నమూనా పద్ధతులు

సాముదాయిక వ్యవస్థాపన ద్వారా సాముదాయిక సమస్యలను పరిష్కరించే ప్రక్రియను సాముదాయిక వ్యవస్థాపన ప్రక్రియ అని అంటారు.

BRAOU

సాముదాయిక వ్యవస్థాపన విధానం చాలా విస్తృతమైనది. సాముదాయిక వ్యవస్థాపన ప్రజాస్వామిక విధానాలను గుర్తించి అమలు పరుస్తుంది. సాముదాయిక వ్యవస్థాపన విధాన ప్రక్రియలో సముదాయ పరంగా సాముదాయిక సమస్యలకు ఎక్కువ ప్రాముఖ్యతను ఇస్తూ సముదాయంలోని వ్యక్తులు, సమూహాల వైయక్తిక పురోభివృద్ధికి కృషి చేస్తుంది. ఈ ప్రక్రియలో ప్రతి వ్యక్తికి స్వతఃసిద్ధమైన విలువ, వ్యక్తిత్వం, శక్తి సామర్థ్యాలు నిక్షిప్తమై ఉంటాయనే నమ్మకంతో వ్యక్తిని, వ్యక్తిగా గురించి అతని స్వయం నిర్ణయ హక్కును గౌరవించడం, తాత్కాలికమైన దృష్టితో శాస్త్రీయ విధానాలను అనుసరించి సాముదాయిక సమస్యలను పరిష్కరించడం జరుగుతుంది.

ప్రక్రియ అనగా సముదాయంలో ఒక సమస్యను గానీ, ఒక లక్ష్యాన్ని గానీ గుర్తించడంతో పాటు ఆ సమస్యను పరిష్కరించే వరకు లేదా ఆ లక్ష్యాన్ని సాధించేవరకు జరిగేటటువంటి ఇచ్ఛాపూర్వక మైన గమనం ఈ ప్రక్రియ ద్వారా సముదాయంలోని ప్రజలనందరినీ సమైక్యపరచి, వారికి గల సమస్యలను తెలియజేసి, వారిలో చైతన్యాన్ని కలుగచేసి, వారంతా సహకారంతో తమ సమస్యలను తామే పరిష్కరించుకునేటట్లుగా తోడ్పడడమని చెప్పవచ్చు.

సాముదాయిక వ్యవస్థాపన ప్రక్రియ (1) విషయ సేకరణ (2) సమస్యా నిదానం (3) చికిత్సా విధానం (4) పర్యావలోకనం అనే నాలుగు దశలలో సాముదాయిక సమస్యలను శాస్త్రీయంగా పరిశీలించి, తగు పరిష్కార మార్గాలను అన్వేషించి అమలు పరచడం జరుగుతోంది.

విషయసేకరణలో ముందుగా సముదాయాన్ని గురించి సంపూర్ణంగా తెలుసుకోవాలి. సముదాయం సామాజిక, ఆర్థిక, మత, సాంస్కృతిక పరిస్థితులను అవగాహన చేసుకోవాలి. వీటితో పాటు సముదాయంలోని అవసరాలను, లభించే వనరులను గురించి తెలుసుకోవాలి. తరవాత సముదాయ పెద్దలతోను నాయకులతోను, వివిధ రంగాలకు, వర్గాలకు, కులాలకు చెందిన వ్యక్తులతో చర్చలు, సమాలోచనలు జరిపి సముదాయ సమస్యలను, భావాలను, అవసరాలను కోరికలను, దృక్పథాలను శాస్త్రీయ పద్ధతుల ద్వారా సముదాయాన్ని సమగ్రంగా పరిశీలించి విషయ సేకరణ చేయాలి.

సమస్యా నిదానంలో సముదాయపు అవసరాలలో ఏవి అత్యవసరమైనవి, ఏవి ముఖ్యమైనవి, ఏవి సామాన్యమైనవి అనే ప్రాధాన్యతా క్రమాన్ని ఏర్పరచి వాటిని సముదాయ ప్రజలు తెలుసుకునేటట్లు చేయాలి.

చికిత్సా విధానంలో భాగంగా సముదాయంలోని వివిధ సమూహాల మధ్య ఉండే సంఘర్షణలను అంతః కలహాలను, స్పర్థలను తొలగించడమే కాకుండా మొత్తం సముదాయంలోని ప్రజలలో సహకార భావాన్ని పెంపొందించి తద్వారా సముదాయంలోని ప్రజలు తమ అవసరాలను నిర్ణయించుకుని వాటిని నెరవేర్చుకోవడానికి కావలసిన వనరులను సమీకరించి, వాటికి అనుగుణంగా ప్రణాళికలను రూపొందించి, సముదాయ ప్రజలు సమైక్యంగా పాల్గొంటూ తమ తమ సమస్యలను తామే పరిష్కరించుకుని, తద్వారా సముదాయ పురోభివృద్ధికి తమ స్వశక్తి పైనే ఆధారపడేట్టు, సాముదాయిక భాగస్వామ్యంతో నెరవేర్చుకునేటట్లు చేయాలి.

సాముదాయిక వ్యవస్థాపనలో పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిన తరువాత పర్యాలోకన జరపడం చాలా అవసరం. ఈ పర్యాలోకన ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు ఎంతవరకు విజయవంతమైనవో, వాటిలో లోటుపాట్లను తెలుసుకోవచ్చు. సముదాయాభివృద్ధి కార్యక్రమాల పారదర్శకతను సముదాయాభివృద్ధి కార్యక్రమాల పారదర్శకతను తెలుసు కోవడానికి నిష్పక్షపాతమైన పర్యాలోకనలు చాలా అవసరం.

## 23.9 భారతదేశంలో సాముదాయిక వ్యవస్థాపనా పరిధి

అభివృద్ధి చెందిన దేశాలలో సాముదాయిక వ్యవస్థాపన పద్ధతిని ఉపయోగించి విభిన్న సముదాయాలను ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని నిర్మాణాత్మకమైన ప్రగతిని సాధించడానికి బాట వేస్తారు. నేడు భారతదేశంలో కూడా సాముదాయిక వ్యవాస్థాపన పద్ధతి ద్వారా విభిన్న సముదాయాలలో గణనీయమైన పురోభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోంది. సాముదాయిక వ్యవస్థాపన పరిధిని తెలుసుకోవడానికి ముందు సాముదాయిక అభివృద్ధి పథకం అంటే ఏమిటో తెలుసుకోవాలి.

## 23.10 ముగింపు

సమాజనిర్మాణంలో సముదాయం ముఖ్యమైనది. సామాజిక సముదాయానికి వ్యవహారంలో ఏ వాడుక నిర్వచనాన్ని వాడినా , నిర్ణీత స్థలంలో సంపూర్ణ సామాజిక జీవనం గడిపేదే సమూహమని అసలు అర్థంలో చెప్పవచ్చు. సముదాయానికి స్థానిక భావన ఉంటుంది. విస్తృతార్థంలో భారతదేశమంతటినీ కూడా ఒక సముదాయం అనవచ్చు. సముదాయ లక్షణాలు, స్థానిక ప్రాంతం, వ్యక్తులు సమూహం, తామంతా ఒక్కటే అనే భావన ప్రధానమైనవి. ఇవి శాశ్వతమైనవి సాముదాయానికి ఉమ్మడి సంస్కృతి ఉంటుంది. సామాజిక నిర్మాణ, నిర్వహణ అవసరాలకు సముదాయిక వ్యవస్థాపన ఏర్పాటు చేస్తున్నారు. ఈ సాముదాయిక వ్యవస్థాపన ద్వారా నిర్ణీత లక్ష్యాలసాధన సాధ్యమవుతుంది. ముఖ్యంగా అభివృద్ధి సాధించడానికి సాముదాయిక వ్యవస్థాపన అవసరం. సాముదాయిక వ్యవస్థాపన భారతదేశంలోనూ జరుగుతున్నది.

BRAOU

## 23.11 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబురాయండి?

1. సామాజిక సముదాయం అంటే ఏమిటి? నిర్వచించండి?
2. సాముదాయిక వ్యవస్థాపన లక్ష్యాలు వివరించండి?
3. భారతదేశంలో సాముదాయిక వ్యవస్థాపన గురించి రాయండి?

II. ఈక్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. సాముదాయిక వ్యవస్థాపన సూత్రాలేవి?
2. సముదాయం లక్షణాలు ఏమిటి?
3. సముదాయం భావన గురించి క్లుప్తంగా రాయండి?

## 23.12 చదవదగిన పుస్తకాలు


1. S.K.Day : Community Development.

2. J.R.Balten : Communities and their Development.

3. Murjee : Comminity Development in India.


BRAOU

# భాగం-24: సహభాగిత-గ్రామీణ కార్యక్రమాల మదింపు సూక్ష్మ ప్రణాళిక

విషయక్రమం


24.0 ఉద్దేశాలు

24.1 పరిచయం

24.2 పి.ఆర్.ఎ ఆవిర్భావం

24.3 ప్రయోజనాలు-వినియోగాలు

24.4 పి.ఆర్.ఎ ప్రక్రియలో దశలు

24.5 సహభాగిత పరిశోధనా పద్ధతులు

24.6 సహభాగిత సామూహిక గతిశీలత

24.7 సూక్ష్మప్రణాళిక-పరిచయం

24.8 ప్రణాళికా రచన-కార్యక్రమాలు

24.9 ప్రణాళికారచన-సూచనలు, దశలు

24.10 ముగింపు

24.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

24.12 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 24.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సహభాగిత కార్యక్రమాల మదింపు, సామూహిక గతిశీలతల గురించి తెలుసుకుంటారు.
- సూక్ష్మ ప్రణాళికా రచనా విధానాలను కూడా ఈ పాఠంలో తెలుసుకుంటారు.

## 24.1 పరిచయం

ప్రణాళికా రచన గురించిన ఆలోచనాపద్ధతులు ఈ మధ్యకాలంలో అనేక మార్పులకు లోనయ్యాయి. పురాతన కాలపు ఆర్థికాభివృద్ధి దృక్కోణాలనుంచి మానవ వనరులవైపు ఆలోచనా పద్ధతి మొగ్గు చూపుతోంది. అంతేకాక 'అభివృద్ధి' అనే భావనలోనే చాలా మార్పులు వచ్చాయి. బయటనుండి ప్రేరేపించిన 'అభివృద్ధి' స్థానే స్థానికులే వారి అభివృద్ధిని గురించి ఆలోచించుకుని వారి పథకాలను వారే తయారు చేసుకునే పద్ధతి చోటుచేసుకుంటోంది.

ఇందులో భాగంగా సహభాగిత గ్రామీణ కార్యక్రమాలు మదింపు (పి.ఆర్.ఎ) అంటే బహుళ వృత్తులు గల కార్యకర్తలు స్థానిక ప్రజలు, నాయకులతో కలిసి విభిన్న దృక్కోణాలుగల సమస్యలను విశ్లేషించే పద్ధతి. ఇది ఒక ప్రత్యేక పద్ధతిగా ఈ మధ్యనే ఆవిర్భవించినా, స్వచ్ఛందసంస్థలు, ప్రభుత్వ విభాగాలు కూడా దీనిని ఎక్కువగా వినియోగిస్తున్నాయి. స్థానిక ప్రజలు వారి జీవనానుభవసారాన్ని పంచుకుని విశ్లేషణా శక్తిని పెంపొందించుకొని, వారి

పరిస్థితులను మెరుగుపరచుకునేందుకు ప్రణాళికారచన చేసి, దానిని అమలులో పెట్టి లక్ష్యాల సాధనకోసం చర్యలు తీసుకునేందుకు ఇది సహాయపడుతుంది. ఈ పద్ధతి విషయాలు అందరికీ తేలికగా అర్థమయ్యి, దృగ్గోచరంగా వుండి, మనసుకు హత్తుకుపోయే విధంగా వుంటోంది. బొమ్మల ద్వారా, రేఖా పటాల ద్వారా ఇది సాధ్యం అవుతుంది. ఈ ప్రక్రియలో స్థానికులు కూడా ఎక్కువగా భాగస్వాములు కావడం వలన, అక్కడి సాంస్కృతిక విలువలను కూడా దృష్టిలో ఉంచుకుని స్థానిక సముదాయం దారి చూపే ఆర్థికావసరాలను నిర్ణయించే ప్రణాళికా రచన ప్రక్రియగా రూపొందుతుంది. అందుచేత స్థానికులు అక్కడి అవసరాలను వారే నిర్ణయించుకొని, వాటి ప్రాముఖ్యతా ప్రాధాన్యతలను కూడా వారే నిర్ణయించుకుంటారు. తద్వారా స్థానికులే ఈ కార్యక్రమాలలో ఎక్కువ భాగస్వాములై దానిని జయప్రదంగా నిర్వహించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రజలు, అందునా స్థానిక ప్రజలు భాగస్వాములు కావడం అనేది ఈ క్రింది కారణాలవలన ప్రధానమైనది.

**స్థానిక అవసరాలను అంచనావేయడం:** ఎక్కడి ప్రజలు అక్కడ అంచనా వేస్తేనే, బయటి ప్రజల అంచనాకన్నా సరిఅయినదిగా, నమ్మదగినదిగా ఉంటుంది.

చేపట్టిన కార్యక్రమంలోని ప్రతిస్థాయిలోనూ అందరూ పాల్గొనడం వలన కార్యక్రమంలో పారదర్శకత ఏర్పడుతుంది. దీనివల్ల పరస్పర నమ్మకం కలిగి తద్వారా అధికారులు, ప్రజల మధ్య అవధులు లేని సహకారం ఏర్పడుతుంది.

## 24.2 భాగస్వామ్య సహభాగిత(పిఆర్ఎ) ఆవిర్భావం

1970దశకంలో భాగస్వామ్య సహభాగిత (పిఆర్ఎ) ఉద్భవానికి దారితీసిన పరిస్థితులు ఈక్రింది విధంగా చెప్పుకోవచ్చు.

ఈ దశకంలో పేదరికంపై వ్యతిరేకత, ధనిక పక్షపాతం కారణంగా పెల్లుబికిన అసంతృప్తి, సాధారణ వృత్తితత్వం, ఫలితంగా ప్రశ్నాపత్రాలలో అతి సాధారణమైన మూస సర్వేలు జరపడం, ఫలితాల విశ్లేషణలో అసంతృప్తికి దారితీసింది. ఫలితంగా ఒక సమగ్ర విధానం అవసరం అయింది. ఖర్చు-వినియోగం ఎక్కువగా ఉండేటట్లు నేర్చుకునే పద్ధతులకై అన్వేషణ జరపడం వల్ల పి.ఆర్.ఎ పద్ధతులకు దారితీసింది.

ఆచారాలలో, రీతులలో, ధ్యేయాలలో, ఫలితాలలో మార్పు వస్తేనే చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తాయి. పి.ఆర్.ఎ సముదాయాలకు వాటి ఆర్థిక పరిస్థితి పరిసరాలు, ఆరోగ్య, విద్యాపరిస్థితిని నిర్వచింపజేసుకొని మదింపు చేసుకుని అభివృద్ధి చేసుకునే అవకాశం కలుగజేస్తుంది.

### ● కార్యకర్త సహభాగిత పరిశోధన

పి.ఆర్.ఎ వయోజన విద్యా కార్యక్రమాలు నిర్వహించడంలో పాల్ ఫ్రైరీ పనివల్ల ప్రేరేపించిన ఫలితంగా ఆవిర్భవించింది. దీని ప్రయోజనమేమిటంటే:

1. పేద ప్రజలు కూడా ఆలోచనా పరులేనని, వారు కూడా విశ్లేషించి పథకాలు తయారు చేయగలరని తెలియజేయడం.
2. బయటివారు ఉత్ప్రేరకాలుగాను, సహాయకారులుగా, మాత్రమే సహాయపడగలరని తెలియజేయడం.
3. బలహీనుల్ని అశక్తుల్ని సాధికారులుగా తయారు చేయాలన్న సంకల్పం.

### ● వ్యవసాయ పరిసర విశ్లేషణ

థాయ్‌లాండ్‌లో 1978 నుంచి గార్డన్ కాన్‌వే అనే తత్వవేత్త, ఆయన సహచరులు దీనిని అభివృద్ధి చేశారు.

● ప్రయోజనాలు

ట్రాన్సెక్ట్ కొత్త దారులలో నడవడం, నిశితంగా గమనించడం.

భూమి నైసర్గిక రూపం తెలిపే పటం నేల మీద గీయడం. నేల మీద స్కెచ్‌లు గీయడం.

రేఖాపటం తయారుచేయడం, ఋతువులు తెలిపే సూచిక, బార్ డయాగ్రమ్స్, చపాతీ డయాగ్రమ్స్ తయారుచేయడం.

● అనుప్రయుక్త సమాజశాస్త్రం

అభివృద్ధి శాస్త్రవేత్తలకు, అనుప్రయుక్త సమాజ శాస్త్రవేత్తలు పల్లె ప్రజల జ్ఞానం విలువలను, వైవిధ్యాన్ని ప్రాముఖ్యతను తెలియజేశారు. సామాజిక శాస్త్రాలలో అనుప్రయుక్త సమాజశాస్త్రం, అన్వయశాస్త్రం, సిద్ధాంతాలలో, భావనల్లో చదువుకున్న విషయాలను కార్యక్షేత్రంలో పరిశీలించే శాస్త్రంగా చెప్పవచ్చు.

## 24.3 ప్రయోజనాలు-వినియోగాలు

ఫైళ్లు, పుస్తకాల ద్వారా చదువుకున్నది, సముపార్జించింది మార్పులేని శాస్త్రం కాదని, శాస్త్రం మారుతూ వుంటుందని తెలియజేయడం. పల్లెల్లో ఉంటూ అక్కడి పల్లె ప్రజలతో సంభాషిస్తూ, వారిని నిశితంగా పరిశీలించడం వల్ల కలిగే ప్రయోజనాలను అనుప్రయుక్త సమాజశాస్త్రం తెలియజేసింది.

అక్కడి ప్రజల మనస్తత్వాలు తెలుసుకోవడం, వారి ప్రవర్తన గమనించడం, పరస్పర చర్యల ద్వారా వృత్తి పరమైన సంబంధాలు ఏర్పరచుకోవడం లాంటి వాటి ప్రాధాన్యతను గుర్తించడం. ప్రాంతీయ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగాన్ని తెలియజేయడం. అక్కడి ప్రజల మనస్తత్వాలు తెలుసుకోవడం, వారి ప్రవర్తన గమనించి తెలుసుకోవడం వలన కార్యక్షేత్రంలో సహకారాన్ని ఏవిధంగా పొందాలో తెలుస్తుంది.

● వ్యవసాయ పద్ధతుల మీద క్షేత్ర పరిశోధన

బయటకు పరిశుభ్రంగా, అస్తవ్యస్తంగా కనిపించే వ్యవసాయ పద్ధతులలో కనిపించేది వాస్తవానికి ఒక సంక్లిష్టమైన ప్రక్రియ. గ్రామీణ వ్యవసాయదారులను ప్రయోగాలు చేసేవారిగానూ, వ్యవసాయ పరిశోధనలలో ప్రధానమైన పాత్ర వహించవలసినవారిగానూ కొత్తగా గుర్తించారు.

● భాగస్వామ్యాలు

వ్యవసాయమెంత సంక్లిష్టమైందో, ఎన్ని భిన్నమైన కార్యకలాపాలతో కూడి ఉందో, ఎన్ని నష్టాలను భరించవలసిన అవసరం ఉంటుందో భాగస్వామ్యాలను పరిశీలించడం ద్వారా తెలుస్తుంది. గ్రామీణ ప్రజల ప్రయోగాలు చేయాలనే మానసిక స్థితిని, చేయగలిగేవారి ప్రవర్తనను విశ్లేషించి తెలియజేస్తుంది.

## 24.4 పి.ఆర్.ఎ ప్రక్రియలో దశలు

పి.ఆర్.ఎ ప్రక్రియలో ఉన్న ఎనిమిది ప్రధాన దశలను ఈ క్రింది విధంగా చెప్పవచ్చు. అవి:

1. ప్రథమ పరిచయం
2. సవివరమైన ఇంటర్వ్యూ.
3. సామూహిక సమావేశాలు.

BRAOU

4. ఉద్వేగపూర్వక ప్రాథమిక చర్చ.

5. నాయకత్వం వహించే సమాచార కర్తలు

6. పరస్పర చర్యాపూరితమైన ఆలోచనలు- పద్ధతులు

7. పరిశీలనలు

8. ప్రణాళిక-చర్య


## 24.5 సహభాగిత పరిశోధనా పద్ధతులు

సహభాగితపరిశోధనా పద్ధతులను 11 రకాలుగా పేర్కొనవచ్చును. అవి:

1. విజ్ఞానవంతులను గుర్తించడం.
2. సవివరమైన ఇంటర్వ్యూలు.
3. సామూహిక చర్చ
4. సాంఘిక వనరుల నిర్దిష్టమైన రేఖాపటాల తయారీ.
5. గోడలపై, కాగితాలపై పెద్ద బొమ్మలు.
6. ముగింపులేని కథలు.
7. పాత్ర పోషణ.
8. చారిత్రక పటాలు.
9. అవసరాల క్రమశ్రేణి తయారుచేయడం.
10. కేంద్రీకృత సామూహిక చర్చలు.
11. కార్యక్షేత్రంలో విశ్లేషణ.

BRAOU

## 24.6 సహభాగిత సామూహిక గతిశీలత




BRAOU

## 24.7 సూక్ష్మప్రణాళిక-పరిచయం

ప్రణాళికా రచన సాధారణంగా దేశస్థాయిలో చేసినా లేక సూక్ష్మస్థాయిలో చేసినా అభివృద్ధి కార్యక్రమాలు మన దేశంలో తగిన ప్రాధాన్యతను అందుకోలేదు. దాని అవసరాన్ని, ప్రాముఖ్యతను ప్రణాళికా రచన చేసే కార్యక్రమాలలోను, రచనలలోనూ చెప్పడం జరిగిందే కానీ దానికి తగిన చోటు, ప్రాముఖ్యత ఇంతవరకు అనేక కారణాలవల్ల సంతరించుకోలేదు. దిగువస్థాయిలో గ్రామస్థాయిలో ప్రణాళికా రచన ప్రయత్నం మొన్నమొన్నటిదాకా లేదు. ప్రణాళికా కర్తలు ఈ మధ్యన్నే దీని గురించి ప్రస్తావిస్తున్నారు.

సాధారణంగా అభివృద్ధి కోసం, ఆర్థికాబివృద్ధి కోసం చేసే ప్రణాళికారచన అంతా కూడా పైస్థాయిలో కేంద్రీకృతమై వుంది. ప్రణాళికా రచన మన దేశంలో మొదలు పెట్టినప్పటినుంచి కూడా పైస్థాయిలోనే కేంద్రీకృతమై వుంది. ప్రణాళిక మూలాన వచ్చే లాభాలు అది పైస్థాయిలోనే కేంద్రీకృతమై వుంటేనే వస్తాయి అనే భావన వుండేది. ప్రజలు వారికి నిజంగా కావాలనుకునేవి కేంద్ర స్థాయిలో వుండి ప్రజల కోసం ప్రణాళికా రచన చేయడంలో వుండే క్లిష్టతతో సూక్ష్మస్థాయి ప్రణాళిక రూపొందిస్తే తెలుస్తుంది. ఉదాహరణకు ఒక రాజస్థానీ గ్రామంలో వెనుకబడిన కులానికి చెందిన వ్యవసాయదారులకు ఎక్కువ పాలిచ్చే గేదెలనిస్తే వారు వాటిని మేపలేక పై కులస్థులైన వ్యవసాయదారులకు అమ్మేశారని ఒక అధ్యయనంలో తేలింది. ఇదే విధంగా మరికొంత మందికి గొట్టపు బావులకు, బావులు తవ్వేందుకు పంపులకు కావలసిన విద్యుత్తు సరఫరా చేయలేకపోయారు.

ప్రణాళికా రచనపై శ్రీ తర్లోక్‌సింగ్ అభిప్రాయపడినట్లు, జాతీయ ప్రణాళికా రచన జరిగే ప్రక్రియలో సమరూపతకు ప్రాధాన్యత ఇచ్చారు. ఫలితంగా ప్రణాళికల్లో ఆశించినంత ఫలితాలు కనిపించలేదు. ప్రణాళికలలో స్థానిక వనరుల్ని వినియోగించుకునేందుకు తావు ఇవ్వలేదు. ఇంతేకాక పైస్థాయిలో ప్రణాళికా రచన చేసే వారికి తొందరగా అంకెల రూపంలో ప్రజలకు చూపడానికి వీలయ్యే ఫలితాలమీద ఎక్కువగా దృష్టి కేంద్రీకరించేవారు. ఫలితంగా ప్రజలకు అవసరమయ్యే కార్యక్రమాలకు పెద్ద ప్రాధాన్యత వుండేదికాదు.

వికేంద్రీకృతమైన లేక స్థానిక ప్రణాళికా రచన మెరుగైన మంచి ఫలితాలనిస్తుందని ఆర్థిక శాస్త్రవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయాలని తర్లోక్‌సింగ్ అన్నారు. స్థానికంగా, లేక సూక్ష్మ పథక రచన చేయడం ద్వారా అన్ని ప్రాంతాలు సక్రమంగా అభివృద్ధి చెందుతాయి. ఇది స్థానికుల్ని కూడా ప్రణాళికా రచనతో కలపడం మూలానా అక్కడి అవసరాల్ని తీర్చే సరియైన పథక రచన తయారవ్వడానికి ఎక్కువ అవకాశముంటుంది.

పెద్ద పరిశ్రమలకు ప్రాధాన్యత ఇచ్చే కేంద్రీకృత జాతీయ ప్రణాళిక కంటే స్థానిక అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చే వాటికోసమే చేపట్టే సూక్ష్మ ప్రణాళికలే ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటాయి.

మొదటి పంచవర్ష ప్రణాళిక సిద్ధం చేసేటప్పుడే అల్పస్థాయినుంచి ప్రణాళిక తయారు చేయాలని, వ్యవసాయం అభివృద్ధికి గ్రామస్థాయి ఉత్పత్తి మండలిని ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారు. మూడవ పంచవర్ష ప్రణాళికలో స్థానిక ప్రణాళికా రచనలో ప్రజలు పాలుపంచుకోవటాన్ని గురించి ప్రజాస్వామిక వికేంద్రీకరణలో పంచాయితీలను ప్రవేశపెట్టారు. అయితే ఎక్కువగా ప్రణాళికా రచనలో చెప్పుకోదగ్గ మార్పు రాలేదు. అయితే గిరిజన సంక్షేమ ప్రణాళికా రచనలో మాత్రం కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. తర్వాత డిఆర్‌డిఎ, ఐఆర్‌డిపి సంస్థలను జిల్లాస్థాయిల్లో స్థాపించారు. ఈ సంస్థలు ఏమి చెయ్యాలి అనేది కేంద్ర ప్రభుత్వం నుంచి కానీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కానీ వివరంగా సూచనలు వస్తాయి. దీనితో సూక్ష్మ ప్రణాళికా రచనకు చోటు లేకుండా పోయింది.

జయప్రకాశ్ నారాయణ నుంచి ప్రేరణ పొందిన కొన్ని స్వచ్ఛంద సంస్థలు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలలో కొన్ని ప్రయోగాలు చేశారు. వీటిల్లో గ్రామీణ స్థాయి ప్రణాళికారచనకు దగ్గరగా వచ్చింది. సంపూర్ణ గ్రామీణాభివృద్ధి ద్వారా చేపట్టిన పథకాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన నిధులు ఆలస్యంగా విడుదల చేయడం వల్ల, నిధులు లేకపోవడం వల్ల, ప్రభుత్వ మద్ధతు లేకపోవడం వల్ల క్రమేపీ మాయమయి పోయాయి.

BRAOU

పశ్చిమ బెంగాల్‌లోని మిడ్నాపూర్‌లో ప్రయోగాత్మకంగా గ్రామస్థాయి ప్రణాళిక రచన 1985లో మొదలుపెట్టారు. తమిళనాడులోని కలాల్ పంచాయతీ యూనియన్‌లోని కుంద్రకుడి గ్రామంలో మరొక ప్రయోగం జరిగింది.

ప్రణాళికా రచన అన్నది ఒక క్లిష్టమైన సాంకేతిక ప్రక్రియ. ఇందులో అనేక అంచెలు వున్నాయి. సమస్య, నిదానాలు, ఉద్దేశాలు, నిర్ణయించడం, ఆర్థిక తదితర వనరులను కేటాయించడం, కార్యక్రమాలను తయారు చేయడం, వీటన్నింటినీ మదింపు చేసే శాస్త్రీయ ప్రణాళికా రచనను అనేక అంచెలలో చేయాలి. ఇందులో కొన్ని కార్యక్రమాలను ఒకేసారి చేపట్టవచ్చు. మిగతావి ఒకదాని తర్వాత ఒకటి చేపట్టవచ్చు. ఇందులో కొన్ని ముఖ్యమైనవాటిని ఈ క్రింద చర్చించాము.

## 24.8 ప్రణాళికా రచన-కార్యక్రమాలు

### 1. ప్రణాళిక అనేది కాలచక్రం

ప్రణాళికలో సమయం చాలా ప్రాధాన్యత వహిస్తుంది. అది ఎప్పటిలోగా పూర్తి చేయాలి అనేదే సమయ పరిమితి మీద ఆధారపడి వుంటుంది. ఈ కాలచక్రం చేపట్టిన కార్యక్రమాల ప్రాధాన్యతను బట్టి వుంటుంది. కొన్ని తొందరగా పూర్తి చేయవలసి ఉంటుంది. మరి కొన్ని సంవత్సరంలోను, కొన్ని ఐదు సంవత్సరాలలోను పూర్తి చేయవచ్చును. ఇంకొన్ని 10 లేక 15 సంవత్సరాలలో పూర్తి చేయవచ్చును. కొన్ని కార్యక్రమాలు ప్రణాళికల ముందరే మొదలుపెట్టవలసి వుంటుంది. ఇటువంటి వాటికి వాటి కాల పరిమితి తెలిస్తే ముందరే తగిన జాగ్రత్తలు

తీసుకోవచ్చును. దానికి కావలసిన మానవ వనరులకు మనం శిక్షణ ఇచ్చి తయారు చేసుకోవచ్చును. అంతకంటే తక్కువ కాలంలో పూర్తి చేసే దానికి శిక్షణ ఇచ్చి మానవ వనరులు తయారు చేసుకునేకంటే అక్కడ వున్నవారితో శిక్షణ పొందినవారినే వినియోగించుకుంటే బాగుంటుంది.

## 2. సమస్య నిర్ధారణ

ప్రణాళికా రచన చేసే ముందే ఏ సమస్యను ఉద్దేశించి ప్రణాళిక తయారు చేస్తున్నామో స్పష్టంగా చెప్పాలి. ఇది చేయకుండా పథకం ప్రకారమే కృషి చేసి పురోగతి సాధించడమన్నది అర్థవంతంగా వుండదు. సాధ్యమైనంత వరకు ఎవరికోసం ప్రణాళిక తయారు చేస్తున్నారో వారి భావనలన్నీ గుర్తించి ఏమనుకుంటున్నారో స్పష్టంగా ప్రతిబింబించాలి. సమస్య వారికి భౌతికమైనది, సాంకేతికమైనది, ఆర్థికమైనది, లేదా సామాజిక-ఆర్థికపరమైనది కావచ్చు. ఈ సమస్యలలో ఏది ఏమైనప్పటికీ అక్కడి ప్రజల అవగాహన ఆ ప్రణాళికా రచనలో ప్రతిబింబించాలి. పేదరిక నిర్మూలన ప్రాధాన్యత వహిస్తుంది. కాబట్టి అక్కడ వుండే బడుగు వర్గాల ప్రజల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలి.

## 3. గాంధేయ నిర్ణయం

ప్రణాళికా రచనల్లో గాంధేయ నిర్ణయం ముఖ్యమైన భాగం. చుక్కాని లేకుండా పడవ తీరంపైపు ప్రయాణం చేయడం ఎంత కష్టమో అదేవిధంగా ధ్యేయం ప్రణాళికా రచనలో అత్యంత ప్రాధాన్యమైంది. స్థానిక సమస్యను ఎలా ఎదుర్కోవాలో ఇందులో ప్రతిబింబిస్తుంది. అక్కడ వుండే అన్ని సమస్యలు ఒకేసారి పరిష్కరించాలని అక్కడి వారికున్నప్పటికీ ఆర్థిక, వ్యవస్థాపరమైన పరిమితుల వల్ల వీలు పడదు. అందుచేత ప్రణాళికా రచన చేసేవారు అక్కడున్న సమస్యల్లో ఏదిక్కున ప్రయాణం చేస్తున్నారో ముందుగా నిర్ణయించాలి. మిగతా వాటితో పాటు స్థానిక ప్రదేశాన్ని సర్వతో ముఖంగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నించాలి. ఇది స్థానిక ముఖ్యావసరాలను తీర్చేవిధంగా రూపొందించాలి. దీన్ని సుస్పష్టంగా వివరించాలి.

## 4. అవసరాల క్రమశ్రేణి ప్రాముఖ్యత కాలభాగ నిర్ణయం

నిర్ణయించిన లక్ష్యాలన్నీ వాంఛనీయమైనవే. అయినా అందులో కొన్ని మిగతా వాటికంటే ఎక్కువ అవశ్యకమైనవి వాటిని గురించి సంపూర్ణ సమాచారం, ప్రణాళికా రచన చేయాలి. ఆర్థిక వనరులు, మిగతా సామాన్య వనరులు ఉన్న లక్ష్యాలన్నిటికీ సరిపోవు. కాబట్టి వెంటనే నెరవేర్చుకోవలసిన పనికి దీర్ఘకాలిక లక్ష్యాలు వనరుల్ని దీర్ఘకాలిక లక్ష్యాలకు మళ్లించడం మాని హ్రస్వకాల లక్ష్యాలు సాధించడానికి ఎక్కువ వనరులు వినియోగించాలి. ఈ కేటాయించడంలో కూడా స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలి.

## 5. స్థానిక స్థల గణాంకాలతో కూడిన నివేదిక

అభివృద్ధి చెందటం అనేక పరస్పర ఆధారిత అంశాలపై ఆధారపడి వుంటుంది. అక్కడ వున్న ప్రదేశంలో లభ్యమయ్యే నిర్దిష్టమైన వనరులు (ఉదాహరణకు పనిచేసే వయస్సులో ఉన్న ప్రజలు, మొత్తం మొత్తం ప్రజలు, వారి చదువు మొదలగునవి) అక్కడ ప్రత్యేకంగా వనరులు లభ్యమయ్యే చోటుకి, అక్కడ వాతావరణం, వర్షాలు ఎక్కువగా పడే చోటుకి వర్షాలు పడని చోటుకి ప్రణాళికా రచనలో అవలంబించవలసిన పద్ధతులలో తేడాలుంటాయి. రాజస్థాన్, అస్సాంలలో ప్రణాళికా రచనలో అవలంబించవలసిన పద్ధతులలో తేడాలుంటాయి. రాజస్థాన్, అస్సాంలలో ప్రణాళికా రచన తేడాగా వుంటుంది. ఆ ప్రదేశంలో ఉండే పరిస్థితులు రాష్ట్రంలో ఉండే సాధారణ పరిస్థితులతో కానీ, దేశంలో ఉండే పరిస్థితులతో పోల్చి చూపడం గానీ జరుగుతుంది. వీటిని స్థూలంగా, భౌతికంగా, సాంకేతికపరమైన, ఆర్థిక పరమైన, సామాజిక-ఆర్థికపరమైన మొదలైనవి. వీటిలో ఒక్కొక్క దాని గురించి వివరంగా సమాచారం తెలియజేయవలసిన అవసరం ఉన్నది.

**భౌగోళికమైన:** పటంపై స్వాభావిక స్వరూప లక్షణాల సవిస్తర వర్ణన ముఖ్యమైన భౌగోళిక భాగాలు మురుగు



BRAOU

నీటిపారుదల పద్ధతి, వరదలకు లోనవడం, భూసారం, వాతావరణం ఎటువంట వాతావంణం, కరువు బడదలను పరిగణనలోకి తీసుకుంటుంది.

**సాంకేతికమైన:** వ్యవసాయదారులుపయోగించే పద్ధతులు, మిగతావారు వినియోగించే పద్ధతులు. అంగళ్లు, గోదాములు, రవాణా సౌకర్యం.

**మౌలిక సదుపాయాలు:** విద్యుత్తు, బ్యాంకులు, పోస్టాఫీసులు మొదలైనవి.

**వ్యవసాయ అర్థిక [illegible]:** పశు సంపద, భూ వినియోగం, పంటలు-సంవత్సరానికి పంటలు పండే విధానం, నీటిలభ్యత, పంటల దిగుబడి, ధరలు, కాలువలు, ఎంతవరకు నమ్మకంగా నీరు లభ్యమౌతుంది అన్న విషయాలు.

**సామాజిక-అర్థిక:** భూమి-మనుషుల నిష్పత్తి, ఏ రకాలైన పంటలు పండిస్తారు, భూమి కౌలుకు ఇచ్చే పద్ధతి, భూమి సంపకం, ఎంతెంత వున్నదీ లాంటి విషయాలు.

### 6. పథక ప్రణాళిక

చేపట్టిన పథకాల ద్వారానే ప్రణాళిక ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి దారితీసి మార్పునకు దోహదం చేస్తుంది. పథకాలు ప్రణాళిక సారాన్ని ముఖ్యంగా అవి ఎవరిని అయితే ప్రభావితం చేస్తాయో (మంచిగా కానీ, చెడుగా కానీ,) వారికోసం పథకాల నమూనా తయారుచేయడం ప్రణాళికా రచనలో ముఖ్యమైన భాగం.

పథకాలను గుర్తించడం పథక నమూనాలు తయారు చేయడంలో ఉత్పాదకత వున్న లేక లాభదాయకమైన అవకాశాలను గుర్తించడం. భారతదేశం ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశం అవటం చేత ఉత్పాదకత ఉన్న పథకాలను తయారు చేయడానికి చాలా వరకు అవకాశముంది. అభివృద్ధి అవకాశాలు అక్కడక్కడ విసిరి వేయబడ్డట్టు వుండి అన్ని రంగాలలోను వుండి వుండవచ్చును. వాటిని విడివిడిగా చూసి ఆలోచిస్తే లాభసాటిగా కనిపించకపోవచ్చును. వాటిని ఒకదానితో ఒకటి సమన్వయపరిచి చూస్తే లాభసాటిగా వుండవచ్చు. పథక రచన చేసేటప్పుడు మరికొన్ని ప్రత్యామ్నాయ పద్ధతులను దృష్టిలో పెట్టుకోవాలి. ముక్కుకు సూటిగా ఒక పద్ధతిలోనే కాకుండా రెండింటినీ కలిపి లాభసాటిగా పథక రచన చేయడం దృష్టిలో పెట్టుకోవాలి.

BRAOU

## 24.9 ప్రణాళికారచన-సూచనలు, దశలు

### i) పథకాలను రూపొందించే అంశాలు

పథకాలను అనేక రకాలుగా తయారు చేయవచ్చును. వాటిలో ఈ క్రింది వాటిని ముఖ్యమైనవిగా చెప్పవచ్చును.

1. ప్రజలను సంప్రదించి వారి సూచనలు తీసుకోవాలి.
2. స్థానికులలో విజ్ఞానవంతులను సాంకేతిక జ్ఞానమున్నవారిని సంప్రదించాలి.
3. ఆ ప్రదేశానికి వచ్చే అధికారుల తనిఖీ నివేదికలు చూడాలి.
4. చుట్టుపక్కల వున్నా ఇంతకంటే అభివృద్ధి చెందిన ప్రదేశాలు చూడాలి. అక్కడ చేపట్టిన పథకాలు, కార్యక్రమాలు మనకేమైనా ఉపయోగంగా ఉంటాయేమో చూడాలి.
5. ఆ ప్రదేశాన్ని గురించి వ్యవసాయం, నీటిపారుదల, అటవీశాఖ, పి.డబ్ల్యూ.డి మొదలైన సాంకేతిక విభాగాల వారి దగ్గర నుంచి సలహాలు స్వీకరించవచ్చు.
6. స్థానిక పంచాయితీ మిగతా సంస్థలేమైనా వుంటే వారి సలహాలు తీసుకోవాలి.

7. అక్కడ పూర్తి చేసిన, పని జరుగుతున్న, తలపెట్టిన పథకాలు చూసి వాటిలో లోపాలు ఏమున్నాయో తెలుసుకోవాలి. పెద్ద పథకాల అనుబంధంగా చిన్న పథకాలను తయారు చేయాలి.

8. ఆర్థిక వనరులులేక కానీ మరే కారణాలవల్లనయినా ఆరంభించని ఇంతకు ముందరి పథకాలను తిరిగి పరిశీలనగా చూడడం, అవసరం అనుకుంటే ఇప్పటి పరిస్థితులకు అనుకూలంగా కొన్ని మార్పులు చేయడం.

9. స్థానిక వనరుల పట్టికను మరొకసారి పరిశీలనగా చూసి విశ్లేషించడం.

10. అక్కడ స్థానికంగా జరిగే కార్యక్రమాలను పరిశీలనగా మరొక్కసారి చూసి వాటిల్లో వేటినైనా అభివృద్ధి పరచడానికి వీలుంటుందేమో చూడాలి.

11. అక్కడినుంచి బయటి ప్రదేశాలకు పంపేవస్తువులు చూసి వాటి తయారీ అభివృద్ధి చేయడానికి వీలుంటుందేమో చూడాలి.

12. బయట ప్రదేశాలు, దేశాలనుంచి తెప్పించుకునే వస్తువులు చూసి వాటిలో వేటినైనా స్థానికంగా పండించడానికి, తయారు చేయడానికి వీలౌతుందేమో చూడాలి.

## ii) పథకాలను తయారు చేయడం, అంచనావేయడం

ఇది తరువాతి దశ, దీని కోసం సాంకేతికపరమైన, ఆర్థికపరమైన, వాణిజ్యపరమైన, సాధ్యానుకూలాలు, అధ్యయనాలు చేయాలి.

సాంకేతికంగా అధ్యయనం చేయడం అంటే ఆ పథకం ఆశించిన ఫలితాన్నిస్తుందో, ఇవ్వదో అంచనా వేయడం. ఉదాహరణకు ఒక గొట్టంబావి నుంచి నేలమీదకు నీరును తీసుకురాగలిగితేనే అది దాని నుంచి ఆశించిన పని చేయగలదన్నమాట. ఇది నిర్ణయించడమే సాంకేతిక కోణం నిర్ణయించడం.

ఆర్థిక పరంగా ఒక పథకానికి పెట్టే ఖర్చుకంటే దానికొచ్చే లాభాలు ఎక్కువగా వుంటే అది ఆర్థిక దృక్కోణం నుంచి చూడడమన్న మాట. దానికయ్యే ఖర్చు, లాభాలు భిన్నమైన తావుల నుంచి సేకరించి చూస్తారు. ఇట్లా చేసేటప్పుడు ఖరీదులో అన్ని రకాల ఖర్చులు ఒక పట్టిక తయారు చేసుకుని అన్నింటినీ అందులో చేర్చారో లేదో చూడాలి.

తయారు చేసిన వస్తువును అమ్మడానికి గిరాకీ వుందో లేదో తేల్చడమే వ్యాపారపరమైన దృక్కోణం. ఎక్కడ, ఎంత గిరాకీ వుంది, ఎలా అమ్మాలి అనేవి ముందుగా తేల్చి నిర్ణయించుకోవాలి. లేకపోతే కష్టపడి ఒక వస్తువు తయారు చేసిన తరువాత అది అమ్ముడుపోకపోతే మొత్తానికే మోసం వస్తుంది.

## iii) పథకాల ఎన్నిక

తరువాతి దశ ఏమిటంటే అంత క్రితమే అనుకూలత పరీక్ష జరిగిన పథకాల్లోంచి కొన్నింటిని ఎంచుకోవడమే. ఇటువంటప్పుడు ఆ ప్రదేశానికి అనువుగావున్న పథకాన్ని ఎంచుకోవాలి. ఇక్కడ కొన్ని విషయాలు దృష్టిలో పెట్టుకోవాలి. పని చేసేవారికిచ్చే జీతాలకంటే వారు ఎక్కువ ఉత్పత్తి చేయాలి. అదే విధంగా అక్కడ పథక నిర్వాహణకయ్యే ఖర్చుకంటే లాభాలెక్కువగా వుండాలి. ఉపాధికల్పన ఈ పథక ధ్యేయమైతే వెనుకబడిన తరగతుల వారికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇటువంటి పథకాలు చుట్టూరావుంటే వాతావరణం మీద వ్యతిరేక ప్రభావం లేకుండా చూసుకోవాలి.

ఒక పథకాన్ని ఎన్నుకునేటప్పుడు ఆ చుట్టుపక్కల ఇంకా ఏమైనా వుంటే సమన్వయపరచుకోవాలి. చుట్టుపక్కల అటువంటి వస్తువే ఉత్పత్తి చేస్తే వాటితో ప్రకార్యపరమైన సమన్వయం చేసుకుంటూ వుండాలి.

BRAOU

### iv) పర్యవేక్షణ

పర్యవేక్షణ అనగా పథకాన్ని ఆచరణలో పెడుతూ అందులో పురోభివృద్ధిని నిరంతరం పైకి తెలియజేయడం. ఇది ప్రణాళికలో భాగం కాకపోయినప్పటికీ ప్రణాళికా రచన చేసే సంస్థలన్నింటిలోనూ దానికొక ప్రధాన పాత్రను ముందర నుంచే ఇవ్వటం జరిగింది. ఈ విధంగా సేకరించిన సమాచారం మదింపు చేయడానికి చాలా ప్రయోజనకరంగా వుంటుంది. దీని మూలంగా అధికారులకు, సాధించింది, సాధించలేనిది, కార్యక్రమాల్లో వుండే లోట్లు తెలుసుకోవడానికి సహాయపడుతుంది.

### v) మదింపు

పథకాలు తయారు చేసి వాటిని అమలు పరచడం అనేది ఒక నిరంతర ప్రక్రియ. మనిషి అభివృద్ధివైపు పయనించాలనేది తప్పనిసరి. ఈ ప్రక్రియలో పథకాలను, ప్రకార్యాలను మదింపు చేయడం చాలా ప్రాధాన్యత సంతరించుకుంటుంది. దీని ద్వారా పథకాలు ఏ విధంగా అమలు పరచుకున్నారు? వాటివల్ల ప్రజలకు ఎంత వరకు లబ్ధి కలిగింది? కలుగకపోతే ఏ కారణాల వల్ల కలగలేదు? మొదలైన విషయాల మీద సమాచారమేమైనా సేకరించి భవిష్యత్తులో చేపట్టే పథకాలలో కార్యక్రమాలను పటిష్టంగా తయారు చేయడానికి అమలు పరచి తద్వారా ప్రజలు సక్రమంగా లబ్ధి పొందడానికి దోహదం చేస్తుంది.

## 24.10 ముగింపు

ప్రణాళికా రచనలో ఇటీవలి కాలంలో చాలా మార్పులు కనిపిస్తున్నాయి. అభివృద్ధిలో మానవ వనరులపై దృష్టి పెరిగింది. సముదాయాల సహభాగిత అభివృద్ధికి, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యత పెరిగింది. ఈ మేరకు సహభాగిత కార్యక్రమాల మదింపు (పి.ఆర్.ఎ) కూడా రూపొందింది. సామాజిక శాస్త్రాలను అన్వయించే అనుప్రయుక్త సమాజశాస్త్రం ఇందుకు ఉపయోగపడుతున్నది. పి.ఆర్.ఎ ప్రక్రియలో ఇంటర్వ్యూలు, పరిచయాలు, సామాజిక సమావేశాలు తదితరాలలో అంతిమంగా ప్రణాళిక ఏర్పాటు, దాని అమలుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. అభివృద్ధి మూలాల్లో జరగడానికి వీలుగా సూక్ష్మ ప్రణాళిక రచన జరుగుతున్నది. అన్ని దేశాలు ఈ మదింపు, సూక్ష్మ ప్రణాళికల ద్వారా అభివృద్ధిని అట్టడుగు ప్రజల స్థాయికి తీసుకెళ్తున్నాయి.

BRAOU

## 24.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. సహభాగిత గ్రామీణ కార్యక్రమాల మదింపును వివరించండి?

2. సూక్ష్మ ప్రణాళిక అంటే ఏమిటి? వివరించండి?

3. సహభాగిత, సామాజిక గతిశీలతను వివరించండి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబు రాయండి.**

1. పి.ఆర్.ఎ ప్రక్రియలో అంశాలేవి?

2. సహభాగిత ప్రణాళికను క్లుప్తంగా రాయండి?

3. అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికారచనలో మార్పులేవి?

## 24.12 చదవదగిన పుస్తకాలు


1. Kabrazi, D. : Development of Weakersections: Inter India Publications,

2. Kaamba Prasad : Planing at Grassroots: Sterling Publications, New Delhi,

3. Singh, Tarlok : V.K.N. Meanon Second Memorial Lecture, Indian Public Administration Association, Jaipur, 1983.

4. Jain, L.C.& Brothers : Grass Without Roots, Rural Development under Government Assistance: Sage Publications, New Delhi.


BRAOU

# భాగం-25: సామాజిక కార్యాచరణ-భావన, సూత్రాలు

విషయక్రమం

25.0 ఉద్దేశాలు

25.1 పరిచయం

25.2 నిర్వచనాలు

25.3 ప్రధానాంశాలు

25.4 సమస్యలు-లక్షణాలు

25.4.1 సమస్యలు-వర్గీకరణ

25.4.2 సమస్యలు-కారణాలు

25.4.3 సమస్యల విశ్లేషణా రీతులు

25.5 సామాజిక కార్యాచరణ-నిర్వచనం

25.6 సామాజిక కార్యాచరణ-ప్రధానాంశాలు

25.6.1 సామాజిక కార్యాచరణ-సాంఘిక శాసనాలు

25.6.2 సామాజిక కార్యాచరణ విధానాలు- పద్ధతులు

25.6.3 సామాజిక కార్యాచరణ-దశలు

25.6.4 సామాజిక కార్యాచరణ-సూత్రాలు

25.7 ముగింపు

25.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

25.9 చదవదగిన పుస్తకాలు

BRAOU

## 25.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సామాజిక సమస్యలను నిర్వచించగలుగుతారు.
- సామాజిక సమస్యల లక్షణాలు, వర్గీకరణ కారణాలు తెలుసుకుంటారు.
- సామాజిక సమస్యల పరిష్కారానికి సామాజిక కార్యాచరణ అవగాహణకు వస్తారు.

## 25.1 పరిచయం

మానవుడు సంఘజీవి. మానవుని దైనందిన జీవన విధానం, సాంఘిక కార్యకలాపాలు మొదలైనవి సామాజిక వ్యవస్థాపన మీద ఆధారపడి ఉంటాయి. సమాజంలోని ప్రజలు దేశ, కాల పరిస్థితులను అనుసరించి ఆయా సాంఘిక విలువలను ఆకళింపు చేసుకుని ఆచార సంప్రదాయాలను పాటిస్తుంటారు. అయితే సమాజం నిత్యనూతన చైతన్య

స్రవంతి. సమాజంలో మార్పులు రావడం సహజమేకాక, స్వాభావికం కూడా. వెనుకబడిన సమాజాలలో మార్పులు మందకొడిగానూ, ఆధునిక సమాజాలలో వేగంగానూ సంభవిస్తాయి. అనుక్షణం మారుతున్న సామాజిక విలువలకు, ఆచార వ్యవహారాలకు అనుకూలంగా మానవులు సర్దుబాటు చేసుకోవాలి. సమాజంలోని సభ్యులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు చేసుకోలేకపోతే సామాజిక అవ్యవస్థ పరిస్థితులు ఏర్పడే అవకాశముంటుంది. ఈ అవ్యవస్థ పరిస్థితుల వల్ల సామాజిక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముంటుంది.

సామాజిక సమస్యల స్వరూప స్వభావాలు వివిధ సమాజాలలో, దేశాలలో భిన్నంగా ఉంటాయి. ఆయా దేశ, కాల పరిస్థితులకు అనుగుణంగా కొన్ని ఆచారాలు, విలువలు అమలులో ఉంటాయి. ఆయా పరిస్థితులు మార్పులకు లోనుకావడంవలన అవ్యవస్థ, వ్యభిచారం, బాలనేరాలు మొదలైన సమస్యలు ఉత్పన్నమవుతాయి. వ్యక్తులు, సామాజిక వ్యవస్థలు పారిశ్రామిక వ్యవస్థకు అనుకూలంగా సర్దుబాటు చేసుకోలేకపోవడం వల్లనే ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పవచ్చు. అట్లాగే అనేక దేశాలలోని పరిస్థితులలోని మార్పుల వల్ల, సామాజిక అవ్యవస్థ వలన అనేక సామాజిక సమస్యలు ఉత్పన్నమయినాయి. సామాజిక సమస్యల స్వరూప స్వభావాలు ఆయా దేశాల సాంస్కృతిక, సామాజిక విలువల మీద ఆధారపడి ఉంటాయి.

ఒక సామాజిక అవ్యవస్థ పరిస్థితిని ఒక దేశంలో సామాజిక సమస్యగా పరిగణించవచ్చు. కానీ మరొక దేశంలో దానిని సామాజిక సమస్యగా పరిగణించకపోవచ్చు. ఉదాహరణకు: తాగుడు. ఒక సమాజంలో తాగుడును సమస్యగా పరిగణిస్తే, మరొక సమాజంలో దానిని సమస్యగా పరిగణించరు. అట్లాగే ఒక కాలంలో సామాజిక సమస్యలుగా పరిణమించిన పరిస్థితులు మరొక కాలంలో సామాజిక సమస్యలుగా పరిగణనకు రాకపోవచ్చు. ఉదాహరణకు: యాచన, వ్యభిచారం మొదలైనవి. వీటిని పూర్వం సామాజిక సమస్యలుగా పరిగణించలేదు. కానీ ఇవి ఈనాడు సామాజిక సమస్యలయినాయి. అయితే ప్రతీ సమస్య దేశ శ్రేయస్సును భంగపరిచే సమస్యగా పరిణమించకపోవచ్చు. ఉదాహరణకు: పాశ్చాత్య దేశాలలో విందు, పండగ సందర్భాలలో కుటుంబ సభ్యులు మద్యపానం చేయడం ఆచారం. కానీ వారు శృతిమించి అదేపనిగా మద్యం సేవించినట్లయితే దానిని సామాజిక సమస్యగా గుర్తిస్తారు. కాబట్టి సామాజిక సమస్యల భావనను కూలంకషంగా అవగాహన చేసుకోవాలి.

BRAOU

## 25.2 నిర్వచనాలు

సామాజిక సమస్య అన్న పదం విస్తృతంగా వాడుకలో ఉన్నప్పటికీ దాని స్వభావాన్ని గురించి సమాజశాస్త్రజ్ఞులలో ఏకాభిప్రాయం లేదు. సామాజిక సమస్యలను పలువురు పలు రకాలుగా నిర్వచించారు. సాధారణంగా సమాజంలో ఉన్న అవాంఛనీయ సాంఘిక పరిస్థితులను సంస్కరించవలసిన పరిస్థితులను తెలపడానికి 'సామాజిక సమస్య' అనే పదాన్ని వాడతారు. సమస్య అనేది పరిష్కార మార్గాన్ని అన్వేషించే సవాలును లేదా పరిస్థితిని సూచిస్తుంది. సమాజ సంక్షేమానికి అవరోధం కలిగించే పరిస్థితులను లేదా పరిసరాలను సామాజిక సమస్యలుగా చెప్పవచ్చు.

సమాజానికి చెందిన సాధారణ పరిస్థితులను, ప్రమాణాలను భంగపరిచేవి సామాజిక సమస్యలని కొందరి అభిప్రాయం. అధిక సంఖ్యలో జనాలు చెడు ప్రవర్తనకు లోనయితే దాని ప్రభావం సమాజంలోని ఇతర సభ్యులమీద పడుతుంది. కాబట్టి ఈ చెడు ప్రభావాన్ని నిర్మూలించడానికి సమాజం బాధ్యత వహించవలసి ఉంటుంది. ఈ చెడు ప్రవర్తనల ప్రభావం వల్లనే సామాజిక సమస్యలు ఉత్పన్నమవుతాయి అని లారెన్స్ కె. ఫ్రాంక్ అభిప్రాయపడినాడు.

అధిక సంఖ్యాక ప్రజల జీవన పరిస్థితులపై అవాంఛనీయమైన ప్రభావాన్ని కలిగించి, వారిని అవాంఛనీయ ప్రవర్తనకు పురికొల్పితే, ఆ సామాజిక పరిస్థితిని సామాజిక సమస్యగా పాల్ బి.హర్టన్, గెరాల్డ్ ఆర్. వెస్లీ పేర్కొన్నారు.

ఫుల్లర్ ఉద్దేశం ప్రకారం ఆయా సమాజాలలోని విలువల మధ్య సంఘర్షణ వల్లనే సమాజంలో సమస్యలు తలెత్తుతాయి.

సమాజం సంక్షేమానికి వాస్తవిక ప్రమాదం సంభవించిందని కొంతమంది సభ్యులు భావించి, విలువల

విషయంలో సమన్వయం లేనప్పుడు ఏర్పడే సామాజిక పరిస్థితులను సామాజిక సమస్యలుగా ఫ్రాన్సిస్ ఇ. మెర్రిల్ పేర్కొన్నాడు.

## 25.3 ప్రధానాంశాలు

'సామాజిక సమస్యలు' అనే భావనలో ముఖ్యంగా మూడు ప్రధానాంశాలు ఉన్నాయి. అవి:

1. సామాజిక సమస్యలలో సామాజిక, వైయక్తిక అవ్యవస్థల వాస్తవికతా పరిస్థితులు ఇమిడి ఉన్నాయి.
2. సమాజంలోని అధిక సంఖ్యాకులు సామాజిక విలువలకు ప్రమాదమేర్పడిందని భావిస్తారు.
3. ఇట్టి సామాజిక పరిస్థితిని చక్కదిద్దేందుకు సామాజిక కార్యాచరణ అవసరమనే భావన సర్వత్రా ప్రబలంగా ఉంటుంది.

## 25.4 సమస్యలు-లక్షణాలు

1. సామాజిక సమస్యలు అనేవి ఆకస్మాత్తుగా కాకుండా క్రమానుగతంగా కొన్ని సామాజిక పరిస్థితుల సంచయం వల్ల ఉత్పన్నమవుతాయి.
2. సామాజిక సమస్యలు వివిధ రూపాలలో ఉండి, వివిధ స్వభావాలు కలిగి ఉండడం వలన, సమాజంపై వీటి ప్రభావంలో గూడా భిన్నత్వం ఉంటుంది.
3. సామాజిక సమస్యలు వైయక్తిక అవ్యవస్థ ప్రాతిపదిక గలవిగా ఉండవచ్చు. లేదా సామాజిక అవ్యవస్థ ప్రాతిపదికగా ఉండవచ్చు.
4. విభిన్న సామాజిక సమస్యలకు విభిన్న కారణాలుంటాయి. ఏ సామాజిక సమస్యకయినా అనేక కారణాల సంచయముంటుంది.
5. సామాజిక సమస్యలు సమాజంలోని ప్రజా సమూహాల ద్వారాగానీ, వ్యక్తుల ద్వారాగానీ వ్యాపిస్తాయి.
6. సామాజిక సమస్యలు ఉత్పన్నమయిన ప్రారంభదశలోనే అవి చాలా జటిలంగాను, సంక్లిష్టంగానూ పరిష్కారానికి అతీతంగా ఉన్నట్టు కనిపిస్తాయి. కానీ, కాల క్రమేణా వాటికి అనేక ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాలు కనిపిస్తాయి. అయితే సామాజిక సమస్యలు చాలాకాలం అపరిష్కృతంగా ఉన్నట్లయితే సామాజిక అవ్యవస్థ, సామాజిక విఘటన సంభవిస్తాయి.
7. పరివర్తనలాగానే, సమస్యలు కూడా సమాజంలో నిరంతరం ఉంటూనే ఉంటాయి. వీటిని పరిష్కరించిన తరువాత మరికొన్ని సమస్యలు వేర్వేరు రూపాలలో ప్రత్యక్షమవుతూనే ఉంటాయి. ఇది ఒక అవిచ్ఛిన్న ప్రక్రియ.
8. సామాజిక సమస్యలు నిరంతరం పరివర్తన చెందుతుంటాయి అంటే సామాజిక సమస్యలు సాపేక్ష స్వభావం కలిగి ఉంటాయి.

### 25.4.1 సమస్యలు-వర్గీకరణ

ఎలియట్ మెర్రిల్ అనే సామాజిక శాస్త్రజ్ఞుడు సామాజిక సమస్యలను మూడు రకాలుగా వర్గీకరించాడు. అవి:

1. వ్యక్తిగత అవ్యవస్థనుంచి ఉత్పన్నమయ్యే సమస్యలు: వడుపు వృత్తి, మదిరా వ్యసనం, మానసిక వైకల్యం,



BRAOU

బాలనేరం మొదలైన సమస్యలను దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చు.

2. కుటుంబ అవ్యవస్థ నుంచి ఉత్పన్నమయ్యే సమస్యలు: కుటుంబ అవ్యవస్థ వల్ల భార్యాభర్తల మధ్య విడాకులు, పరిత్యాగం, అనాథల సమస్యలు, అక్రమలైంగిక సంబంధం మొదలైనవి దీనికి ఉదాహరణలు.

3. సాముదాయిక అవ్యవస్థ నుంచి ఉత్పన్నమయ్యే సమస్యలు: ఈ విభాగంలో ముఖ్యంగా నిరుద్యోగం, దారిద్ర్యం, అవినీతి, నేరం, యుద్ధం, కుల, మత సంఘర్షణలు మొదలైనవి పేర్కొనవచ్చు.

హెరాల్డ్ ఎ. ఫెల్ప్స్ అనే సామాజిక శాస్త్రజ్ఞుడు సామాజిక సమస్యలను ముఖ్యంగా నాలుగు తరగతులుగా వర్గీకరించాడు. అవి:

1. ఆర్థిక వ్యవస్థ నుంచి ఉత్పన్నమయ్యే సమస్యలు: దారిద్ర్యం, నిరుద్యోగం, భిక్షాటనం, ఆశ్రితత్వం మొదలైనవాటిని ఈ శ్రేణిలో చేర్చవచ్చును.

2. జీవ సంబంధమైన వ్యవస్థనుంచి ఉత్పన్నమ్యే సమస్యలు: అంధులు, చెవిటి, మూగవారి, వికలాంగుల సమస్యలను దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు.

3. సాంస్కృతిక అంశాలనుండి ఉత్పన్నమయ్యే సమస్యలు: గృహవసతి లేనివారి సమస్యలు, వృద్ధుల సమస్యలు, జాతి, మత సంఘర్షణలు, నేరం, బాలనేరం, మొదలైన వాటిని ఈ తరగతిలో చేర్చవచ్చును.

## 25.4.2 సమస్యలు-కారణాలు

సామాజిక సమస్యలు సంక్లిష్టమైన మానవ సంబంధాల వలన ఉత్పన్నమవుతాయి. ఒకేఒక ప్రత్యేక కారణం వల్లనే సామాజిక సమస్యలు తలెత్తవు. సామాజిక సమస్యలు ఉత్పన్నం కావడానికి అనేక కారణాలుంటాయి. ప్రతీ సామాజిక సమస్య వెనుక ఒక సుదీర్ఘ చరిత్ర వుండవచ్చు. ప్రతీ సమస్య ఒక క్లిష్టమైన సామాజిక పరిస్థితిని సూచిస్తుంది. కాబట్టి ఆ పరిస్థితులను, కారణాలను పరిశీలించి వాటిని అవగాహన చేసుకోవడం ద్వారానే సామాజిక సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించడానికి వీలవుతుంది.

BRAOU

సామాన్య ప్రజానీకం, కొందరు సంస్కర్తలు, రాజకీయ నాయకులు, తదితరులు సామాజిక సమస్యలు ఒక ప్రత్యేకమైన లోపంవల్లనే ఉద్భవిస్తాయని అభిప్రాయపడ్డారు. రాజకీయ తగాదాలు, నేరం, దారిద్ర్యం, నిరుద్యోగం వల్ల మానవులపై ఆధ్యాత్మిక విలువల ప్రభావం సన్నగిల్లడం వల్ల సామాజిక సమస్యలు ఉత్పన్నమవుతాయని కొందరు అభిప్రాయపడ్డారు. భౌగోళిక అంశాలు అంటే శీతోష్ణస్థితిగతులు, ప్రకృతి సంపద మొదలైనవి సామాజిక సమస్యలు తలెత్తడానికి ముఖ్యమైన కారణాలని కొందరి అభిప్రాయం.

సామాజిక సమస్యలు ఏదో ఒక కారణం వల్ల కాకుండా జైవిక, భౌతిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ఇత్యాది అనేక అనుబంధమైన కారణాలవల్ల ఉత్పన్నమవుతాయని కొందరి అభిప్రాయం.

వ్యక్తులు వారసత్వం వల్ల పొందిన మూర్తిమత్వం వలన, మూర్తిమత్వాలలో కొన్ని లోపాలవలన, వైయక్తిక అస్వస్థత వలన సామాజిక అవ్యవస్థ ఏర్పడి సమస్యలకు దారితీయవచ్చు. మూర్తిమత్వంలోని కొన్ని లోపాలు కేవలం జైవికం కావచ్చు. ఉదాహరణకు అంధత్వం, చెవుడు, అవిటితనం, తీవ్రమయిన వ్యాధి మొదలయినవి మూర్తిమత్వంలో మానసికమైన లోపాలుగా ఉండవచ్చు.

భౌతిక పరిసరాలకు సంబంధించిన కారణాల వల్ల కూడా సామాజిక సమస్యలు ఉత్పన్నం కావచ్చు. భౌతిక పరిసరాలంటే చాలీ చాలని సంపద, సరిపడని శీతోష్ణస్థితిగతులు, భూకంపాలు, వరదలు, క్షామం, మొదలైనవి. వీటివల్ల కొన్ని సామాజిక సమస్యలు ఉత్పన్నమవుతాయి.

సామాజిక సంబంధాలలో, సంస్కృతిలో కలుగుతున్న తీవ్రమైన మార్పులవల్ల అనేక సామాజిక సమస్యలు అవతరిస్తాయి. సాంకేతిక, విజ్ఞాన రంగాలలో అభివృద్ధి, పారిశ్రామికీకరణ, నగరీకరణ మొదలైనవి పాత సామాజిక వ్యవస్థలను భంగపరిచి కొంతవరకు సామాజిక అవ్యవస్థ స్థితిగతులను సృష్టించినాయి. ఇవి నేటి సమాజంలో పాత విలువలకు, కొత్త విలువలకు మధ్య సంఘర్షణలు కలగడానికి, సామాజిక సమస్యలు ఉత్పన్నం కావడానికి దోహదమయినాయి. ఆర్థిక రంగంలో ఏర్పడే విస్తృత అవ్యవస్థ స్థితివల్ల పారిశ్రామిక సంఘర్షణలు, వర్గ సంఘర్షణలు, నిరుద్యోగం, మురికివాడలు, దారిద్ర్యం, మొదలైన సమస్యలు ఉత్పన్నమవుతాయి. రాజకీయ రంగంలో ఏర్పడే అవ్యవస్థవల్ల లంచగొండితనం, ఆశ్రిత పక్షపాతం, నేరం, యుద్ధం, విప్లవం, అరాచకం మొదలైన సమస్యలు ఉత్పన్నమవుతాయి.

నేటి సమాజంలో సంతృప్తికరమైన విద్యావిధానం లోపించడం వలన విద్యార్థుల అలజడులు, విద్యావంతులైన వారి నిరుద్యోగం మొదలైన సామాజిక సమస్యలు తలెత్తుతున్నాయి. విభిన్న మతాలకు, భాషలకు, భౌగోళిక ప్రాంతాలకు సంస్కృతులకు చెందిన ప్రజలు ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడం వలన వారి మధ్య వర్గ సంఘర్షణలు, కుల సంఘర్షణలు, జాతి సంఘర్షణలు, మత సంఘర్షణలు చెలరేగుతాయి.

పారిశ్రామికీకరణ వలన సమాజంలో అనేక ప్రయోజనాలతోపాటు ఎన్నో సమస్యలు కూడా ఉత్పన్నమైనాయి. ప్రజలలో సామాజిక కట్టుబాట్లు, సంప్రదాయాలు మొదలైనవాటి ప్రభావం క్షీణించింది. వ్యక్తుల మధ్య ఉండే అన్యోన్యత, పరస్పర అవగాహనలతో కూడిన ప్రాథమిక సంబంధాలు క్షీణించాయి. వారి మధ్య గౌణ సంబంధాలు నెలకొన్నాయి. నాగరిక జీవనంలో అవినీతి, జూదం, వ్యభిచారం, మద్యపానం లాంటి వ్యసనాలు, ఆత్మహత్య, విడాకులు లాంటి సామాజిక సమస్యలు ప్రబలినాయి.

సామాజిక సమస్యలు పరస్పర ప్రభావితాలు. ఒక సామాజిక సమస్య మరొక సామాజిక సమస్యకు దారితీయవచ్చు. ఉదాహరణకు ఒక వ్యక్తి దారిద్ర్యం వల్లగానీ, నిరుద్యోగం వల్లగానీ, మురికివాడలలో నివసించవచ్చు. అక్కడ అతడు జూదానికి, తాగుడుకు అలవాటు పడవచ్చు. అది కుటుంబ అవ్యవస్థకు దారితీయవచ్చు. లేదా కుటుంబ అవ్యవస్థ మద్యపాన వ్యసనానికి, నిరుద్యోగానికి, మురికివాడలలో కాపురానికి కారణం కావచ్చు.

ఆర్థిక సమస్యలనుంచి ఉద్భవించిన సామాజిక సమస్యలలో దారిద్ర్యం, నిరుద్యోగం, ముఖ్యమైనవి. భౌతిక పరిసరాలవల్లగానీ, జైవికకారణాల వల్లగానీ, ఉత్పన్నమైన సమస్యలు కూడా సామాజిక సమస్యలకు దారితీయవచ్చు. ఉదాహరణకు క్షామాలు, వరదలు, తుపానులు, భూకంపాలు మొదలైనవి ప్రకృతి వైపరీత్యాలవలన ఉత్పన్నమయిన సమస్యలు. ఇవి సామాజిక నిర్మితికి, విలువలకు భంగం కలిగించి సామాజిక సమస్యలుగా పరిణమిస్తాయి. అట్లాగే శారీరక అవ్యవస్థతలు, రోగాలు మొదలైన జైవిక సమస్యలు సామాజిక సమస్యలను ఉత్పన్నం చేయవచ్చు. ఉదాహరణకు మానసిక రుగ్మత, ఆత్మహత్య మొదలైనవి. అట్లాగే సామాజిక, సాంస్కృతిక పరిస్థితులవల్ల రూపొందిన సామాజిక సమస్యలతోబాటు వృద్ధుల సమస్యలు, వితంతు సమస్యలు, విడాకులు, జారతత్వం, నేరం, బాలనేరం మొదలైనవాటిని పేర్కొనవచ్చు. శరణార్థులు తమ దేశాన్ని వదిలి ఇతర దేశాలకు వలసపోవడం వలన ఆయా దేశాలలో అనేక సమస్యలు తలెత్తుతాయి. ఉదాహరణకు: బంగ్లాదేశ్ శరణార్థుల రాకవల్ల భారతదేశంలో అనేక సామాజిక సమస్యలు ఉత్పన్నమయినాయి.

అనువర్తిత ప్రవర్తనకు నిర్దేశించిన సామాజిక ఆమోదాలు బలహీనమయితే ప్రజలు వాటిని లక్ష్యం చేయక ఉల్లంఘించి విచలిత ప్రవర్తనకు పూనుకుంటారు. సామాజిక ప్రమాణాలు నిర్దుష్టంగా ఉన్నా, వాటిని సక్రమంగా అమలు జరపకపోతే, ప్రజలు వాటిని ఉల్లంఘించడానికి వెనుకాడక విచలిత ప్రవర్తనకు పాల్పడతారు.

సమాజంలో ప్రజలు తమ అంతస్తును, ప్రతిష్ఠను సంరక్షించుకుంటూ రహస్యంగా సామాజిక ప్రమాణాలను ఉల్లంఘిస్తుంటారు. ఉదాహరణకు తాగుడు, వడుపువృత్తి. వీటిలో పాల్గొనేవారు రహస్యంగా ప్రమాణాలను ఉల్లంఘిస్తుంటారు.

BRAOU

చట్టాలను అమలు జరిపే సిబ్బంది సహాయంతో కొందరు ప్రమాణాలను ఉల్లంఘించి నేరాలు చేస్తుంటారు. సామాజిక సమస్యలు ఉత్పన్నం కావడానికి ఏ ఒక్క అంశమో దోహదపడకపోవచ్చు. సమాజంలో ఈ సమస్యలకు పరస్పర సంబంధముంటుంది. నూతన భౌతిక పరిస్థితులు ఎదుర్కోవలసి వచ్చినప్పుడు సామాజిక నిర్మితిలో ప్రమాణాలలో విలువలలో మార్పులు వచ్చినప్పుడు మానవుడు వాటిని సర్దుబాటు చేసుకోలేక అసమయోజనం పొందినప్పుడు, సామాజికసమస్యలు ఏర్పడతాయి.

## 25.4.3 సమస్యల విశ్లేషణా రీతులు

సామాజిక సమస్యల విశ్లేషణలో సమాజ శాస్త్రజ్ఞులు అనేక రీతులు అవలంబించినారు. వీటిలో ముఖ్యమైనవాటి గురించి ఇక్కడ చర్చిద్దాం.

### 1. మనోవిజ్ఞానశాస్త్ర రీతి

మనో వైజ్ఞానిక రీతిలో మనిషి వ్యక్తిత్వానికి, సామాజికీకరణానికి ఎక్కువ ప్రాధాన్యత ఉన్నది. మద్యపానం, నేరం, ఆకతాయితనం, భాలాపరాధం, హత్యలు, మొదలైన సమస్యలు వ్యక్తులలో ఉండే సాధారణ మూర్తిమత్వం ఫలితంగా ఉద్భవిస్తాయని వ్యక్తికి పరిస్థితులకు మధ్య జరిగే పరస్పర క్రియలద్వారా పుడతాయని మనో వైజ్ఞానిక రీతి ద్వారా విశ్లేషణ చేసి తెలుపుతారు.

### 2. మత రీతి

చాలా శతాబ్దాలు మనిషి జీవితాన్ని మత నియమాలు, ఆచార భావనలు శాసించాయి. మంచి -చెడు, పాప పుణ్యాలు, నీతి-అవినీతి భావనలు మనిషి ఆలోచనా విధానాన్ని, ప్రవర్తనను నిరయంత్రిస్తుండేవి. ఈ భావనల వెనుక భగవంతునిలో విశ్వాసం చాలా ప్రగాఢమైన భూమిక, మత దృష్టితో ఆలోచించే ప్రజలు నేరాలు, హత్యలు, వ్యభిచారం, మొదలైన సామాజిక సమస్యలను నీతి నియమాల ఉల్లంఘనగా భావించేవారు. వీటివల్ల కలిగే పాపానికి శిక్షగా వ్యక్తులు 'ప్రాయశ్చిత్తం', 'ప్రార్థన' మొదలైన సాధనాలు వాడేవారు.

### 3. న్యాయ రీతి

ఫ్యూడల్ సమాజం నుంచి ఈనాటి వరకు సమాజం సమూహాల ప్రవర్తనను న్యాయ చట్టాల ద్వారా నియంత్రించింది. చట్టంలో వ్యక్తులు తప్పకుండా చేయవలసిన పనులను, చేయకూడని పనులను చెప్పడం జరిగింది. చట్ట నియమాలను వ్యతిరేకించినప్పుడు చట్టం వ్యక్తులను శిక్షిస్తుంది. సామాజిక నేరాల సంఖ్యను తగ్గించడమే ఈ శిక్షల ప్రధాన ఉద్దేశం.

### 4. పత్రికా రీతి

పారిశ్రామికీకరణ ప్రక్రియ పెరిగిన తరువాత ఆధునిక సమాజంలో వివిధ సమస్యలు ఉత్పన్నమయినాయి. వీటిని ప్రజల, నాయకుల, పరిపాలకుల దృష్టికి తీసుకొని వచ్చినవారు పత్రికా రచయితలే. పత్రికా రచయితలు గ్రామాలలో, నగరాలలో ఉండే రాజకీయ వైషమ్యాలు, కులతత్వం, అంటరానితనం, బాలాపరాధం, దారిద్ర్యం, నిరుద్యోగం మొదలైన సమస్యలను తమ రచనల ద్వారా ప్రజల దృష్టికి తీసుకువచ్చారు. వీరి రచనా పద్ధతి అభిప్రాయాత్మకంగాను, ఆత్మాశ్రయంగానూ ఉంటుంది.

### 5. కళా రీతి

కళలలో చిత్రకళ, కవిత్వం, నాటకం, నవల మొదలైన కళా ప్రక్రియలున్నాయి. తెలుగులో సామాజిక సమస్యలను ప్రతిబింబించే నవలలు, నాటకాలు, కావ్యాలు చాలా వచ్చినాయి. ఉన్నవ లక్ష్మీనారాయణ రాసిన 'మాలపల్లి' నవలలో అస్పృశ్యత, హరిజనుల దారిద్ర్యం మొదలైన సమస్యలను కళ్లకు కట్టినట్టు చూపినారు. అట్లాగే గురజాడ అప్పారావు

BRAOU

'కన్యాశుల్కం' నాటకంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఛాందస ధోరణులు, వితంతు వివాహ సమస్యలు మొదలైనవాటిని చక్కగా, వ్యంగ్యంగా చిత్రించడం జరిగింది. ఆంగ్ల సాహిత్యంలోని చార్లెస్ డికెన్స్, బెర్నార్డ్‌షా, స్టీన్ బెక్ మొదలయిన రచయితలు పడుపువృత్తి, మురికిపేటలు, వలస ప్రజల బాధలు తదితర సమస్యలను ఉన్నదున్నట్టుగా, వాస్తవికంగా వర్ణించారు.

## 6. మనోగతిశీలతా రీతి

వ్యక్తుల జైవిక నిర్మాణంలో కాక వీరి జీవిత చరిత్రలోకానీ, సమకాలీన పరిస్థితులలోకానీ ఉండే వేగం తేడాలను, నియంత్రణలో గల తేడాలను పరిశీలిస్తారు. దీనిలో వ్యక్తుల మానసిక పరిస్థితులను విశేషణ ద్వారా సమస్యల అవగాహనకు ప్రయత్నించవచ్చు. ఇందులో వ్యక్తుల చిత్తవృత్తులను, మానసిక పరిస్థితిని, ఆవేశాలను, అభిరుచులను పరిశీలించి గ్రహించవచ్చు.

## 7. జైవిక-మానవ శాస్త్ర రీతి

దీనిలో మానవులలోని రకాలను గురించి పరిశీలించడం వ్యక్తులలో అంతర్గతంగా ఉన్న అవ్యవస్థ, వక్రభావాలు, అంతర్నియంత్రణలో ఉన్న లోపాలు ఈ సిద్ధాంతంలో ప్రాముఖ్యత వహిస్తాయి. సామాజిక అవ్యవస్థకు దోహదం చేసే వ్యక్తుల రకాలను నిర్ణయించడం ఈ సిద్ధాంతం ప్రాథమిక లక్ష్యం. వ్యక్తుల శారీరక నిర్మాణాన్ని బట్టి ఈ రకాలను నిర్ణయించవచ్చునని వీరి అభిప్రాయం. ఈ రీతి అవ్యవస్థను, వక్ర ప్రవర్తనలను దృగ్గోచరమైన జైవిక లక్షణాలతో ముడిపెడుతుంది. ఎండోక్రిన్ సిద్ధాంతాలు గ్రంథులు సరిగా పనిచేయకపోవడం వలన ఈ సామాజిక విచలనం ఏర్పడుతుందని తెలియజేస్తాయి.

## 8. ఆవరణ రీతి

మానవుల అంతస్సంబంధాలను పరిశోధించి వాటివల్ల ఉత్పన్నమయ్యే విశ్వమానవ జీవన విధానాలను అవగాహన చేసుకోవడమే ఆవరణ అని భావించినారు. ఆవరణ రీతిలో ప్రధాన అంశం శ్రమవిభజన. నేటి ఆధునిక సమాజాలలో శ్రమ విభజన క్లిష్టమైన ఆవరణ రీతి ప్రకారం ప్రాంతాలను బట్టి సామాజిక సమస్యల తీవ్రత మారుతూ ఉంటుంది. జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో సమస్యలు ఎక్కువగా ఉంటాయనీ, జనసాంద్రత తక్కువగా ఉన్న ప్రాంతాలలో సామాజిక సమస్యలు తక్కువగా ఉంటాయని సమాజశాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మురికివాడలలో సామాజిక సమస్యలు కేంద్రీకృతమై ఉంటాయని ఆవరణ శాస్త్రజ్ఞులు తమ పరిశీలనలను బట్టి సిద్ధాంతీకరించారు.

## 9. సమాజశాస్త్రీయ రీతి

ఈ రీతిలో వ్యక్తులు సామాజిక విధానానికి, నిర్మితికి వాటిలో జరిగే ప్రకార్యాలకు ప్రక్రియలకు ప్రాముఖ్యతనివ్వడం జరుగుతున్నది. అంటే కుటుంబం, ఇరుగు-పొరుగు, పట్టణం, ప్రాంతం, దేశం, సంఘం మొదలైన వాటితో జరిగే కార్యక్రమాలన్నమాట. ఉదాహరణకు వివిధ విచలనాలు ఒక సామాజిక నిర్మితిలో వివిధంగా పంపిణీ అయి ఉంటాయి. అవి ఒక కాలం నుంచి ఇంకొక కాలానికి ఒక సమాజ నిర్మితినుంచి ఇంకొక సమాజ నిర్మితికి మార్పు చెందుతూ ఉంటాయి. దుర్క్‌హైమ్ ప్రతిపాదించిన ఆత్మహత్య సిద్ధాంతం సమాజశాస్త్రీయ రీతికి చక్కని తార్కాణం. ప్రతీ దేశానికి, పట్టణానికి, ప్రాంతానికి కూడా ప్రత్యేకమైన ఆత్మహత్య రేటు ఉంటుంది. ఈ ఆత్మహత్య రేటును ఆయా దేశాల, ప్రాంతాల, ప్రత్యేక సామాజిక పరిస్థితుల ఆధారంగా చేసుకొని ఆయన వివరించాడు. సామాజిక సమస్యల విశ్లేషణలో వాటి ప్రేరణకు ఉద్దేశించిన ప్రక్రియలకు ప్రాధాన్యత ఉన్నది. వీటిని ఆధారంగా చేసుకుని వాటి పరస్పర సంబంధాలను గురించి నిర్దుష్టమైన సిద్ధాంతాలను రూపొందించవచ్చు.

## 10. పరిస్థితి ప్రాముఖ్యత సిద్ధాంతం

దీని ప్రకారం సమాజంలో విచలనానికి, అవ్యవస్థకు దారితీసే వ్యక్తులు ప్రత్యేకంగా ఉండరు. అవ్యవస్థకు దారితీసే పరిస్థితులలో ఉన్న వారెవరైనా అవిధంగానే ప్రవర్తిస్తారు. దీనిలో వ్యక్తులకంటే పరిస్థితికి ఎక్కువ ప్రాముఖ్య



BRAOU

ఉంటుంది.

## 11. పరస్పర చర్యా ప్రక్రియ

దీని ప్రకారం వ్యక్తి, పరిస్థితి రెండూ కూడా సామాజిక అవ్యవస్థకు దోహదం చేస్తాయి. అయితే ఈ రెంటిలో ఏది ఎంతవరకు దోహదకారి అన్నది చెప్పడం కష్టం. సామాజిక అవ్యవస్థ పరిస్థితి వ్యక్తికి, పరిస్థితికి మధ్య ఉన్న పరస్పర చర్యలవల్ల ఏర్పడుతుందని దీని సారాంశం. వ్యక్తిని గురించి, పరిస్థితిని గురించి ఆధారాలను సేకరించి, సామాజిక సమస్యలను విశ్లేషిస్తారు.

## 12. సామాజిక సంబంధాల రీతి

సామాజిక సమస్యలు తలెత్తడానికి ఆయా సమాజాలలోని వ్యక్తుల మధ్య, సమూహాల మధ్యగల సంబంధాల స్వభావం చాలావరకు దోహదం చేస్తుంది. ఉదాహరణకు సమాజంలో నిర్మాణాత్మక సామాజిక సంబంధాల కన్నా విధ్వంసక సామాజిక సంబంధాలు ఎక్కువగా ఉన్నట్టయితే ఆ సమాజంలో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంటుంది.

## 13. విలువలతో కూడిన తీర్పు రీతి

ఈ రీతి సమాజంలోని విలువలు సామాజిక సమ్యల సృష్టికి ఏవిధంగా కారణమవుతాయో, ఈ సమస్యలను పరిష్కరించడానికి మళ్ళీ నూతన సామాజిక విలువలు ఏవిధంగా అవసరం అవుతాయో అనే విషయాలను పరిశీలిస్తుంది.

## 14. సాముదాయిక రీతి

ఈ రీతిలో గ్రామాలలోను, పట్టణాలలోను పెలకొన్న ప్రత్యేక సముదాయాల సమస్యలను అధ్యయనం చేసి తద్వారా సామాజిక సమస్యలను పరిశీలిస్తారు.

## 15. సాంస్కృతిక విలంబన రీతి

భౌతిక సంస్కృతి, భౌతికేతర సంస్కృతుల పరివర్తన రేట్లలోని వ్యత్యాసం వల్ల ఏర్పడే సంస్కృతి విలంబన మూలంగా సామాజిక సమస్యలు ఉత్పన్నమవుతాయని ఈ రీతి సారాంశం.

## 16. సామాజిక పరివర్తన రీతి

సమాజంలో సంభవించే పరివర్తనను అర్థం చేసుకోవడం ద్వారా సామాజిక సమస్యల స్వభావాన్ని అవగాహన చేసుకోవచ్చునని ఈ రీతి విశ్వసిస్తుంది. ఏ సమాజంలోనైనా నిరంతరం జరిగే పరివర్తనను మానవుడు సరిగా అర్థం చేసుకోలేకపోవడం వల్లను, ఈ పరివ్తనను సరైన దిశలో మళ్లించుకోకపోవడం వల్లనే సమాజంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఈ రీతి విశ్వసిస్తుంది. ఉదాహరణకు పారిశ్రామికీకరణ, యాంత్రికీకరణల వలన సంభవించే పరివర్తనను ఊహించలేకపోవడం వలన అనేక సామాజిక సమస్యలు ఉద్భవించినాయి.

భారతదేశంలో సామాజిక సమస్యల శాస్త్రీయ అధ్యయనానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది. సమాజంలోని నిరుపేదలు, అనాదిగా నిర్లక్ష్యంగావించబడిన వర్గాల ప్రజలు, వికలాంగులు, సమాజంలో సర్దుబాటు చేసుకోలేని వ్యక్తులు, అసమయోజనానికి గురైన వ్యక్తులు మొదలైనవారికి సక్రమంగా సహాయం చేయాలంటే, సామాజిక సమస్యలను రూపుమాపాలంటే సామాజిక సమస్యల శాస్త్రీయ అధ్యయనం ఎంతో అవసరం.

BRAOU

## 25.5 సామాజిక కార్యాచరణ-నిర్వచనం

సమాజంలో అసాధారణంగా పీడించే సమస్యలతో జనం తల్లడిల్లినపుడు వాటిని జనబాహుళ్య సమస్యలుగా గుర్తించి, ఆ సమస్యలను పరిష్కరించడానికి ఏర్పడే ఉద్యమరూప చర్యను 'సామాజికకార్యాచరణ' అంటారు.

కొన్ని ప్రత్యేక (నిర్ణీత) సాంఘిక లక్ష్యాలను సాధించడమే సామాజిక చర్య లక్ష్యం. వాల్టర్ ఫ్రీడ్ లాండర్ ప్రకారం 'సామాజిక కార్యాచరణలో వ్యక్తి, సమూహం లేదా సముదాయం చేసే ప్రయత్నాలు, సాంఘిక శాసనాలు, సాంఘిక సంస్కరణలు, సమాజ సేవలో మార్పులను తీసుకువచ్చే ప్రక్రియ ఉంటుంది'. దీని ద్వారా సమష్టి కృషిని సహకారాన్ని సమాజ సభ్యుల ద్వారా జరిపించి, కొన్ని సామాజిక సమస్యల పరిష్కారానికి స్థానికంగా లభ్యమయ్యే వనరులను సమీకరించి జనావసరాలు తీర్చడం, జనబాహుళ్య సమస్యలను అవగాహన చేసుకుని పరిష్కరించడం జరుగుతుంది.

'జన సమస్యలను జనశక్తితోనే పరిష్కరించే ప్రక్రియ' - సామాజిక కార్యాచరణ అని సూక్ష్మంగా చెప్పవచ్చు. ఈ శాస్త్రీయ పద్ధతి మిగతా శాస్త్రీయ పద్ధతుల్లాగే స్వయం సేవ, ప్రజాస్వామిక పద్ధతులపై నడిచేదిగా ఉంది.

నిరక్షరాస్యత, అజ్ఞానం, చేతకానితనం, అనారోగ్యం, బీదరికం వంటి ప్రజా సమస్యలు అభివృద్ధి చెందుతున్న దేశంలో సామాన్యంగా కనిపిస్తాయి. అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడానికి ఇవి అడ్డంపడి, సమస్యలను ఇంకా జటిలం చేస్తాయి. ఈ సమస్యల వల్ల ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య పెద్ద అగాధంలాంటి దూరం ఉంది. సామాజిక ప్రగతి సాంఘికాభివృద్ధి అనేవి ప్రజలు మానసిక పరివర్తన చెందినపుడు మాత్రమే సాధ్యపడేవి. సమాజ ఆశయాలు, ఆశలు, ప్రజల మనోభీష్టం మొదలైన వాటిని నెరవేర్చడమే సామాజిక కార్యాచరణ లక్ష్యం.

ఆచార్య బాల్డ్విన్ 'సామాజిక చర్య ద్వారా వ్యక్తులు కృషిని, సమాజ కృషిని సాధించవచ్చునని ఫలితంగా సాంఘిక ప్రగతి సాధించవచ్చునని అన్నాడు. సాంఘిక చర్య ద్వారా సాంఘిక సంస్కరణలను, సాంఘిక శాసనాలను, సాంఘిక ప్రగతిని సాంఘిక పురోగతిని సాధించవచ్చుని అన్నాడు. సామాజిక కార్యాచరణ వ్యక్తుల కృషి వల్ల సమాజ కృషివల్ల నిరాటంకంగా సాగుతుంది.

ప్రతీ సమాజంలోనూ ప్రజా సమస్యలు ఎన్నో ఉంటాయి. కొన్ని ప్రకృతి భీభత్సాలైతే మరికొన్ని మానవసృష్టి. అగ్ని ప్రమాదాలు, వరదలు, కరువు కాటకాలు, యుద్ధాలు ఒకవైపు, మతోన్మాదం, ప్రాంతీయ కులతత్వాలు, భిక్షాటన, వ్యభిచారం, నేరం, దొంగతనం, బీదరికం, వరకట్నాలు మరొకవైపు సమాజాన్ని పీడిస్తున్నాయి.

ఈ ప్రజాబాహుళ్య సమస్యలను పరిష్కరించడం సామాజిక చర్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. సామాజిక చర్యలో సాంఘిక ప్రణాళికలు, శాసనాలు, సంస్కరణల వంటి అంశాలు కీలకంగా ఉంటాయి. ఆపద సమయాలలో ప్రజలు తమ సంపదలను, శక్తి యుక్తులను వనరులను సంఘటితపరిచి వాటి ద్వారా కొంత సహాయాన్ని పొందుతారు. ఇలా అనుసరించే విధానాన్ని సాంఘికచర్య అంటారు.

1999 సంవత్సరాంతంలో ఒరిస్సా రాష్ట్రంలో పెను తుపాను సంభవించింది. ప్రజలు సర్వం కోల్పోయారు. పెద్ద ఎత్తున ప్రాణనష్టం సంభవించింది. దీనికి దేశంలో ఉన్న ప్రజలంతా సానుభూతితో స్పందించి, భూరి విరాళాలు, మందులు, ఆహారం, నీరు, దుస్తులు మొదలైన ఎన్నో అక్కడి ప్రజలకు అందించారు. దేశంలో ఉన్న వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు విదేశాలలో ఉన్న ప్రజలు కూడా ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. అంతక్రితం దివిసీమలో వచ్చిన ఉప్పెన ఆ తరువాత గోదావరి జిల్లాల్లో వచ్చిన తుపాను, ఆకస్మాత్తుగా 1999లో వచ్చిన కార్గిల్ యుద్ధం కూడా ఇలాంటివే.

ప్రజా సమస్యలు ఏర్పడినప్పుడు ప్రజలే ముందుకు వచ్చి, నడుం కట్టి సమస్యల్ని ఎదుర్కొనడానికి ప్రయత్నిస్తారు. భారీస్థాయిలో ప్రజా బాహుళ్యాన్ని సమస్యల పరిష్కారానికి సమాయత్తం చేయడమే సామాజిక కార్యాచరణ.

BRAOU

## 25.6 సామాజిక కార్యాచరణ-ప్రధానాంశాలు

సామాజిక కార్యాచరణలో రెండు ప్రధానాంశాలున్నాయి. అవి: 1. సామాజిక చైతన్యం, 2. సామాజిక సమస్యలు

సమస్యల గురించి ప్రజలందరూకానీ, అధికశాతం ప్రజలుకానీ, అవగతం చేసుకోవాలి. ఆ సమస్యల నివారణకు అవసరమైన పద్ధతులను అన్వేషించాలి. సాంఘిక సమస్యలు, సాంఘిక సంస్కరణలు, సాంఘిక విప్లవం ఈ కోవలోకి వస్తాయి. ఉదాహరణకు కందుకూరి వీరేశలింగం పంతులు బాల్య వివాహాలను అరికట్టడానికి, వితంతు వివాహాలను ప్రోత్సహించడానికి విశేష కృషి చేసాడు. ఈ కృషి మొతటి సాంఘిక ఉద్యమాల రూపంలో ప్రారంభమైనప్పటికీ, అవే తిరిగి ప్రభుత్వ శాసనాలుగా రూపొందాయి.

సాంఘిక సంస్కరణా పద్ధతులు సామాజిక చర్య రూపంలో మొదలై శాసనాలకు దారితీస్తుందని మనం గ్రహించాలి. ఫలితంగా సమాజంలో సమూలంగా మార్పులను తీసుకురావచ్చు. సతీసహగమన నిషేధ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం వంటివి వచ్చి స్త్రీ, పురుషులకు సమాన అవకాశాలు అన్ని రంగాల్లోనూ లభిస్తున్నాయి.

జాతీయస్థాయిలో ముఖ్యమైన సమస్యలను పరిష్కరించాలంటే సామాజిక చర్య ఒక్కటే మార్గం. జనబాహుళ్య సమస్యలను అధ్యయనం చేసే ఒక ఉత్తమ ప్రక్రియ సామాజిక చర్య. ఈ ప్రక్రియలో ప్రజలంతా పాల్గొంటారు. అస్పృశ్యత, నిరక్షరాస్యత, వ్యభిచారం వంటి సాంఘిక సమస్యలను పరిష్కరించాలంటే సామాజిక కార్యాచరణే ఏకైక సాధనం.

సంస్కరణలు, శాసనాలు, విప్లవాల ద్వారా సామాజిక కార్యాచరణ జరుగుతుంది. సాంఘిక సంస్కరణల ద్వారా సమాజంలో మార్పు నెమ్మదిగా జరుగుతుంది. కానీ సాంఘిక శాసనాలు శక్తివంతమైనవి. వీటి ద్వారా కూడా ప్రజల శక్తులను, ప్రజోపయోగానికే వినియోగించవచ్చు. సంఘ సంస్కర్తలు ప్రజలలో చైతన్యాన్ని కలిగిస్తూ వారి ఆదరాభిమానాలను పొందుతూ ముందుకు వెళతారు. ప్రజలను మెప్పించి వారి అనుమతితో పనిచేస్తారు. చట్టరీత్యా ఉండే నియమాలకు, నిబంధనలకు దూరంగా స్వచ్ఛందంగా సంస్కరణలు, సాంఘిక శాసనాలు రెండూ కలిసి ప్రజలను పీడిస్తున్న సాంఘిక దురాచారాలను దూరం చేసి, వారి సమగ్రాభివృద్ధికి కృషి చేస్తాయి.

BRAOU

సాంఘిక శాసనాలకంటే ముందుగానే సంఘసంస్కర్తలు సమాజంలో ఉన్న దురాచారాలను ప్రతిఘటించి ప్రజలను సంఘటిత పరిచి, చైతన్యవంతులను చేసి హేతు బద్ధంగా ప్రజల వికాసానికి ఎంతో కృషి చేశారు. సంఘసంస్కర్తల కృషి ఫలితంగా ప్రజలలో వచ్చే విప్లవాత్మకమైన మార్పులు మానసిక స్థితివల్ల ప్రభుత్వం శాసనాలను ప్రవేశపెడుతుంది. దురాచారాలను నిర్మూలించడానికి శాసనాలు ఎంతో ఉపకరిస్తాయి. కానీ ప్రజలలో చైతన్యం, మానసిక పరివత్తన ఎంతో అవసరం.

రాజారామమోహనరాయ్-సతీసహగమనం, కందుకూరి వీరేశలింగం-వితంతు పునర్వివాహం, మహాత్మాగాంధీ-అస్పృశ్యతా నివారణ మొదలైనవి ఇందుకు మంచి ఉదాహరణలు.

సమాజాన్ని పీడించే సామాజిక సమస్యలను తీసుకుని, సంఘసంస్కర్త తానాశించిన ఫలితాలను సాధించడానికి ప్రయత్నిస్తాడు. ఆ సమస్యలను పూర్తిగా అధ్యయనం చేసి పరిశోధిస్తాడు. ఆ సమస్యకు సంబంధించిన మంచి చెడులను ప్రజలకు తెలియజేస్తాడు. జనబాహుళ్యం అనుమతి పొందడానికి వారి దృష్టిని ఆ సమస్య మీదికి మళ్లిస్తాడు. పత్రికల ద్వారా, సభలు, సమావేశాలు నిర్వహించడం ద్వారా ప్రజల అభిప్రాయాన్ని సేకరిస్తాడు.

సంఘసంస్కర్తలు సాంఘిక సమస్యల పట్ల, దురాచారాలపట్ల ప్రజల అభిప్రాయాన్ని, దృక్పథాలను మారుస్తారు. బోధించడం ద్వారా ప్రజల మనసులలో మార్పులు తీసుకురావడానికి ప్రయత్నిస్తారు. ప్రజలలో ఉన్న మూఢ నమ్మకాలను దురభిప్రాయాలను దూరం చేయడానికి ప్రయత్నిస్తారు. ఇదంతా సామాజిక కార్యాచరణకు పునాది వంటిది.

విప్లవాలు కూడా కొన్ని ప్రత్యేక పరిస్థితులలో సామాజిక చర్యలను ఉద్భోదిస్తాయి. సాధారణంగా విప్లవం ఆకస్మికంగా వచ్చే మార్పు అయినా విప్లవ పద్ధతులు ప్రజలందరికీ రుచించకపోవచ్చు. ఆమోదం కాకపోవచ్చు. దానివల్ల ప్రజలు సహకరించకపోవచ్చు. కొన్ని విప్లవాలు ప్రమాదకరమైనవి కూడా. విప్లవాలలో హింస, దౌర్జన్యం చెలరేగే ప్రమాదం ఉంది. ప్రజల మద్దతు ఉండే విప్లవాలు సామాజిక చర్యా పద్ధతి అవుతుంది. తరచుగా రాజకీయ అధికారం కోసం విప్లవాలు పుడుతుంటాయి. అప్పుడు ఆకస్మికంగా ప్రభుత్వాలే మారిపోవచ్చు. కానీ, భావ విప్లవం గొప్పది. సమాజానికి అవసరమైనది.

ప్రజలలో భావవిప్లవం మొలకెత్తిందంటే శుభసూచకమే. బిక్షాటన సమస్య, వ్యభిచారం, మద్యపానం, అస్పృశ్యత, బాల్యవివాహాలు వంటి సమస్యలను భావ విప్లవం ఇట్టే పరిష్కరిస్తుంది. ఫలితంగా శాసనాలు వెలుస్తాయి. ప్రజల అభిమతానికి అనుకూలంగా శాసనాలు వస్తాయి. సాంఘిక విద్య, సమర్థ నాయకత్వం ఉంటే ప్రజలు పాలనలో భాగస్వాములై సమాజంలో మార్పు తీసుకురాగలుగుతారు.

సమాజంలో ఉన్న ప్రజల సమస్యలను అవగాహన చేసుకుని వాటిని పరిష్కరించే మార్గాలను సూచించడమే సామాజిక కార్యాచరణ ముఖ్యోద్దేశం. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నప్పుడే సమస్యలు కూడా పరిష్కారమవుతాయి. ప్రజా చైతన్యం ద్వారా సాంఘిక, ఆర్థిక, వైజ్ఞానిక, సాంస్కృతిక, మానసిక, శారీరక వికాసాలకు దోహదం చేయడం సామాజిక చర్య లక్ష్యం. పరిశోధన, ఉపన్యాసాలు, చర్చాగోష్టులు, సభలు-సమావేశాలు, దృశ్యశ్రవణ మాధ్యమాలైన టెలివిజన్, రేడియో, ఇంటర్నెట్, ఈ-మేయిల్ మొదలయిన వాటిద్వారా సామాజిక చర్య ప్రక్రియను చేపట్టవచ్చు. ప్రజలలో చైతన్యం కలిగించడం ద్వారా సమస్యను నివారించడానికి ప్రయత్నం చేయవచ్చు.

ఒక తార్కిక విధానం నుంచి, నమ్మకం నుంచి పుట్టుకొచ్చింది సాంఘిక చర్య. వ్యక్తుల సమస్యలు జటిలమైనప్పుడు, సంస్థలు కూడా పరిష్కరించలేని దశలో సాంఘిక చర్య అవసరమవుతుంది. ఇతర శాస్త్రీయ పద్ధతుల్లాగే సాంఘిక చర్య కూడా సమస్య పరిష్కారాల కృషిలో తనదైన ప్రత్యేకత చూపుతుంది. సాంఘిక చర్యలలో సంస్థల సాంఘిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే ప్రయత్నాలుంటాయి. రాజకీయ సంస్కరణలు, పారిశ్రామిక ప్రజాస్వామ్యం, సామాజిక శాసనాలు జాతి, సాంఘిక న్యాయం, మతస్వేచ్ఛ, పౌరుల స్వేచ్ఛ మొదలైనవన్నీ సాంఘిక చర్యల్లో ప్రధానంగా ఉంటాయి.

BRAOU

## 25.6.1 సామాజిక కార్యాచరణ-సాంఘిక శాసనాలు

సాంఘిక చర్య ఒక సామూహిక కృషి ఫలితం. అటువంటి కృషి ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం జరుగుతుంది. సాంఘికంగా కోరదగిన లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని ప్రాథమికమైన సాంఘిక, ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దేదిగా వుంటుంది. శారీరక హింస, మానసిక హింసలకు దూరంగా ప్రజలనుంచి, సమాజ అభివృద్ధిలో భాగస్వాములను చేసి సహాయపడుతుంది.

సామాజిక శాసనాలను రూపొందించే ప్రక్రియలో సామాజిక చర్య విశేష పాత్రను నిర్వహిస్తుంది. సాంఘిక చర్యద్వారా శాసనబద్ధమైన కార్యక్రమాలు రూపొందడం, ప్రజాభిప్రాయాన్ని మలచుకోవడం, ప్రభుత్వ పాలనను అందించడం జరుగుతుంది. సాంఘికంగా కోరదగిన లక్ష్యాల సాధనకు ప్రభుత్వ పాలన అందేటట్లు చూస్తుంది.

సామాజిక చర్య ఒక శాంతియుతమైన ప్రజావెల్లువ చర్య. సాంఘిక, ఆర్థిక రంగాలలో నూతనత్వాన్ని తీసుకువచ్చే దిశలో సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు రూపొందుతాయి. వేగంగా దూసుకుపోయే తత్వాన్ని సాంఘిక చర్య నిర్దేశిస్తుంది.

## 25.6.2 సామాజిక కార్యాచరణ విధానాలు- పద్ధతులు

1. పరిశోధన -విషయ సేకరణ.
2. ప్రణాళికారచన-ప్రజాభిప్రాయ సేకరణ

3. ప్రధాన వ్యక్తులను కలవడం, సమూహాలు సంస్థలు.

4. ప్రజా సమావేశాలు.

5. సాంఘిక విద్య.

6. ప్రచారం.

7. చర్చలు.

8. ప్రజా సహకారాన్ని తీసుకోవడం.

9. వివిధ సమూహాలను, సంస్థల చర్యలను సంయుక్త పరచడం.

10. అధికారులకు ప్రతిపాదనలు పంపడం.

11. శాసనసభ్యులను కలవడం, సమాచార మాధ్యమాన్ని వినియోగించుకోవడం.

12. సాంఘిక శాసనం.

13. శాసనాన్ని అమలు పరచడం.

14. వ్యక్తి సేవ.

15. సమూహ సేవ, సముదాయ సేవ.

BRAOU

సాంఘిక చర్యద్వారా సులభంగా పరిష్కరించగలిగే సమస్యలను ఉదహరించడానికి వరకట్నం, పరదావిధానం, అస్పృశ్యత, వ్యభిచారం, జమీందారీ విధానం, నిరక్షరాస్యత, నిర్బంధ ప్రాథమిక విద్య ప్రవేశపెట్టడం, మతపరమైన మూఢత్వాన్ని పారదోలడం, మూఢనమ్మకాలు, రాగద్వేషాలు, బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహాలకున్న అడ్డంకులను తొలగించడం మొదలైనవి.

## 25.6.3 సామాజిక కార్యాచరణ-దశలు

### 1. సమస్యను గుర్తించడం

సమాజంలో చాలా సమస్యలు ఉండవచ్చు. కొన్ని సమస్యలతో ప్రజలు విసిగి వేసారి వుండవచ్చు. సామాజిక చర్యలలో ప్రధాన దశ మొదటగా సామాజిక సమస్యను గుర్తించడం. సమావేశాలు, చర్చాగోష్ఠులు నిర్వహించి సభ్యులనుంచి సమాచారాన్ని రాబట్టి, వెంటనే స్పందించి, పరిష్కరించవలసిన సమస్యలు గుర్తించాలి.

### 2. సమస్యా నిర్వచనం

సాంఘిక కార్యాచరణలోని రెండవదశ సమస్యను నిర్వచించడం. అంటే సమస్య లక్షణాలు, లోటుపాతులు కారణాలు, దుష్ఫలితాలను గురించి వివరించాలి. ప్రజలకు ఆ విషయం మీద వాదనలు వినిపించే అవకాశమివ్వాలి. ఆ సమస్య మీద సానుకూలంగా గానీ, ప్రతికూలంగా గానీ ప్రజలు తమ వాదనలు వినిపించవచ్చు. దీని వల్ల తగవులు, విభేదాలు, మనస్పర్థలు పోయి ఏకాభిప్రాయాన్ని సాధించవచ్చు.

### 3. వనరుల సమీకరణ

సమస్య పరిష్కారం కోసం ప్రజలను మానసికంగా సిద్ధం చేసి, పరిష్కార ప్రక్రియలో ప్రజలు స్వయంగా పాల్గొనేటట్లు చేయాలి. ఇది తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా పరిష్కారమయ్యేటట్టు, అందుకు అవసరమైన సామాజిక శాసనాలను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించాలి. ఇందుకు సమాజంలో లభ్యమయ్యే వనరులన్నింటినీ

సమీకరించాలి. సమాజ సభ్యులు అంతా తమ తమ ద్వారా లభ్యమయ్యే వనరులను సమీకరించడానికి కృషి చేయాలి.

### 4. లాబీ

సామాజిక చర్యలోని మరొక దశ లాబీయింగ్. సమాజంలోని ప్రతినిధులు, ప్రముఖనాయకులనబడే పార్లమెంటు సభ్యులు, అసెంబ్లీ సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిల్ సభ్యులు మొదలైనవారిని ప్రోత్సహించి, సామాజిక శాసనాన్ని ఆమోదించవలసిన బిల్లు ముసాయిదాను అంగీకరించేటట్లు కృషి చేయాలి. అందుకు అవసరమైన లాబీ చేసి శాసనాలను ప్రవేశపెట్టేందుకు కృషి చేయాలి.

### 5. ఆచరణ

శాసనం ఒకసారి ఆమోదం పొందిన తర్వాత దానిని సమర్థవంతంగా ఆచరించిననాడే ఫలితం ఉంటుంది. ఈ ప్రక్రియలో ప్రజల మనోభీష్టాన్ని అర్థం చేసుకుని, అందుకు తగినట్లుగా వ్యవహరించాలి. సమూహ ఇష్టాగోష్టి సమావేశాలు, దృశ్య శ్రవణ విద్యావిధానాలు, పత్రికలలో సంపాదకులకు రాసే ఉత్తరాలు, హరికథలు, బుర్రకథలు, ప్రయోగాత్మకత కార్యక్రమాలు మొదలైనవాటిద్వారా ప్రజలలో చైతన్యాన్ని కలిగించి వారిని సమస్యా నివారణా కార్యక్రమాలలో పాల్గొనేటట్లు చేయాలి.

### 6. సామాజిక చర్యలో ఇతర అంశాలు

సంఘసంస్కరణలు, సాంఘిక ఉద్యమాలు, సామాజిక శాసనాలు మొదలైనవన్నీ సామాజిక కార్యాచరణలో ఉండే వివిధ అంశాలు. ప్రతి పద్ధతిద్వారా సామాజిక చర్య కావించవచ్చు. సంఘసంస్కరణ అనేది సామాజిక చర్యలో నెమ్మదిగా నిర్వహించే ఒక అంశం. సంఘ సంస్కరణ అనే ఒక ఉద్యమంలో ప్రజల శక్తులన్నింటినీ సమీకరించి సమాజంలోని మార్పులకోసం ప్రయత్నించాలి. ఆవిధంగా సంఘ సంస్కరణ అనే దానిని సామాజిక చర్యా ప్రక్రియలో సమస్యను అడ్డుకొనే ఒక సాధనంగా చెప్పవచ్చు. సంఘసంస్కరణలో ఒప్పించే ప్రయత్నం, మంచి నడవడి ఉంటాయి. శాసనమనేది అధికారంతో కూడిన సంస్కరణ పద్ధతి. మొదటిది లిఖిత పూర్వకమైనది. ఉల్లంఘించడానికి వీలులేనిది. రెండవది మౌఖికమైనది, ముచ్చటించేదిగానూ ఉండేది. శాసనం అనేది పూర్తిగా రాజకీయపరమైనది, సంస్కరణ సాంఘికమైనది.

సాంఘిక నిర్మితిలో ఒక విప్లవాత్మక పరివర్తన తెచ్చేది సాంఘిక ఉద్యమం. ఇదికూడా సామాజిక చర్యా ప్రక్రియలో ఒక అంశమే. తరచుగా దీనివల్ల హింస జరుగుతుంది. ఒక్కోసారి ఇది సామూహిక కృషికి ఒక విధాన ప్రక్రియగా ఉండి, (ఉదాహరణకు స్వాతంత్ర్యోద్యమం, ఫ్రెంచి విప్లవం) సాంఘిక రుగ్మతలను దూరం చేసి కోరదగిన మార్పులను తీసుకువచ్చేదిగా పనిచేస్తుంది. ఈ విధానాలన్నింటికీ విజయం చేకూర్చేవి సాంఘిక ఆమోదం, సామూహిక కృషి.

## 25.6.4 సామాజిక కార్యాచరణ-సూత్రాలు

### 1. పరపతిని పెంచుకునే సూత్రం

సమాజంలో మనం పరపతిని పెంచుకునే విధానాన్ని ఇలా చెప్పవచ్చు. జనంలో మనకుండే పలుకుబడిని, నాయకత్వ గౌరవాన్ని, నడిపే సంస్థను, న్యాయానికి మరోపేరుగా, విశ్వాసానికి ఉనికిగా, సత్యానికి చేరువగా ఉండడం, ఉద్యమాలలో పాల్గొనే ఉద్యమకారులకు మనమీద గౌరవభావం ఉండేటట్లు చూసుకోవాలి.

### 2. నిజాయితీ సూత్రం

సాంఘిక ఉద్యమాల వెనుక ఉన్న లక్ష్యాలు ప్రజల అవసర సిద్ధికి అనుగుణంగా ఉండాలి. నీతికోసం ప్రాకులాడడం, సత్యధర్మ శాంతుల కోసం ఆరాటం, వేదాంత ధోరణి, న్యాయమార్గ అన్వేషణ మొదలైనవన్నీ



BRAOU

ప్రజాభిప్రాయానికి దగ్గరలో ఉండాలి. నిజాయితీ అనేది నిర్విరామంగా, నిత్యం జరిగే ప్రక్రియ. ఒక కార్యక్రమాన్ని ప్రారంభించాలని సంకల్పించినప్పుడు ముందుగా నాయకుడు తన చర్యలను ఆమోదయోగ్యమైనవిగా నిరూపించాలి. ఏ కారణం వల్లనైనా ఆశించిన ఫలితాలను సాధించలేమనే భావం ఏర్పడితే తిరిగి మరింత ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. అటువంటి సందర్భాలలో కేవలం నాయకులు మాత్రమే బాధ్యత తీసుకోవడం కాదు, ఉద్యమాలలో పాల్గొనే కార్యకర్తలు కూడా బాధ్యత తీసుకుని ప్రజలలోకి వెళ్లాలి

### 3. నాటకీయత సూత్రం

ఇంచుమించు ప్రతీ ఉద్యమకారుడు అనుసరించేది నాటకీయతా సూత్రం. బాల గంగాధరతిలక్, కార్ల్ మార్క్స్, అస్సాం ఉద్యమ నాయకులు ఇలా అందరూ ఈ సూత్రాన్ని పాటించినవారే. నాటకీయతా సూత్రాన్ని ప్రజా బాహుళ్యాన్ని కదిలించడానికి ఉద్యమ నాయకులు అనుసరించే పద్ధతి. ఈ విధానంలో ఉద్యమ నాయకులు నాటకీయంగా, ఉద్వేగంగా మాట్లాడి రెచ్చగొడతారు. మనసుకు స్పందింపజేసే, గగుర్పాటు కలిగించే వార్తలు చెబుతారు. పెద్ద కేకలు, అరుపులు, నినాదాలు చేస్తారు.

### 4. బహుళార్థ ప్రయోజన సిద్ధాంతం, ద్వంద్వ పద్ధతి

అభివృద్ధికి రెండు పద్ధతులున్నాయి. అవి ఒకటి, సంఘర్షణాత్మకమైనది. రెండవది, శాంతియుతమైనది. కార్యక్రమంలో ప్రధాన అంశాలను తీసుకున్నట్టయితే ఒకటి రాజకీయ ఆర్థిక కారకమైతే, రెండవది సాంఘిక అభివృద్ధికి సంబంధించినది.

### 5. సాంఘిక సంక్షేమం, సాంఘిక చర్య, భారత రాజ్యాంగం

ప్రపంచదేశాల రాజ్యాంగాలకు విరుద్ధంగా, భిన్నంగా మన దేశ రాజ్యాంగంలో నిర్దేశక సూత్రాలు అనే విభాగాన్ని ప్రవేశపెట్టారు. ఇది సరికొత్త ప్రయోగం. దీన్ని ఐరిష్ రాజ్యాంగాన్ని అనుసరించి రూపొందించారు. ఈ సూత్రాలు మన దేశంలో ఉన్న కార్య నిర్వాహక, శాసన నిర్మాణ, అధికారాలకు మార్గదర్శకంగా ఉంటాయి. ఈ సూత్రాలను అనుసరించడానికి పరమార్థం - మన దేశం సర్వసత్తాక, ప్రజాస్వామిక, రిపబ్లిక్ రాజ్యంగా స్థిరపడాలనే ఆశయం ఈ సూత్రాల నీడలో ప్రాథమిక హక్కులు పటిష్టమైనాయి.

BRAOU

ఈ రెండింటికీ తేడా ఉంది. ప్రాథమిక హక్కులు సిద్ధించినప్పుడు న్యాయస్థానం ద్వారా రక్షణ పొందవచ్చు. నిర్దేశక సూత్రాలకు ఇది వర్తించదు. ఇవి శాసనబద్ధమైనవి కావు. ప్రాథమిక హక్కులు ప్రజలకోసమైతే, నిర్దేశక సూత్రాలు సమాజ పురోభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు దోహదం చేస్తాయి. ఈ సూత్రాల ఉద్దేశం సంక్షేమరాజ్యస్థాపన. ఈ సూత్రాలను నాలుగు రకాలుగా వర్గీకరించారు. అవి:

1. సాంఘిక సంక్షేమ సూత్రాలు,
2. గాంధేయ సూత్రాలు,
3. స్వేచ్ఛా బుద్ధి, కుశలతా సూత్రాలు,
4. సాధారణ సూత్రాలు.

భారత రాజ్యాంగం ద్వారా పౌరులందరికీ న్యాయం, స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రసాదించారు. రాజ్యాంగం దృష్టిలో జాతి, మత, కుల విభేదాలు, స్త్రీ పురుష విచక్షణ, ధనిక దారిద్ర్య తారతమ్యాలు లేని స్థితిలో అందరూ సమానులుగా ఉండడం, లౌకికవాదం మొదలైనవి ముఖ్యమైనవి. ఇవి సామాజిక చర్యా హక్కుల పరిరక్షణకు పాటుపడుతాయి.

## 25.7 ముగింపు

సామాజిక సర్దుబాట్లు వీలుకాని పరిస్థితుల్లో వ్యక్తి అవ్యవస్థ ఏర్పడుతుంది. ఈ అవ్యవస్థ సామాజిక సర్దుబాటు లోపించిన ఫలితంగా సామాజిక సమస్యగా రూపుదిద్దుకుంటుంది. ఈ సామాజిక సమస్యలకు పలు రకాల నిర్వచనాలున్నాయి. సాధారణంగా సమాజంలో ఉన్న అవాంఛనీయ, పరిష్కరించవలసిన పరిస్థితులనే సామాజిక సమస్యలు అంటారు. సామాజిక సమస్యల భావనలో ప్రధానంగా మూడు అంశాలు ఇమిడి ఉంటాయి. సామాజిక సమస్యలను ఎలియట్, మెర్రిల్ అనే సామాజిక శాస్త్రవేత్తలు మూడు తరగతులుగా విభజించారు. సామాజిక సమస్యలను ఆయా భావనలు, దృక్పథాలకు అనుసారంగా విశ్లేషించవచ్చు. ఈ సామాజిక సమస్యలకు సామాజిక కార్యాచరణ అవసరం. ఆ కార్యాచరణ ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమవుతాయి.

## 25.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. సామాజిక సమస్యల విశ్లేషణా పద్ధతులను వివరించండి?
2. సామాజిక సమస్యల విభజన గురించి రాయండి?
3. సామాజిక కార్యాచరణ గురించి వివరించండి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. సామాజిక కార్యాచరణ, సాంఘిక శాసనాలను పేర్కొనండి?
2. సామాజిక కార్యాచరణ దశలేవి?
3. సామాజిక సమస్యలకు కారణాలు పేర్కొనండి?

BRAOU

## 25.9 చదవదగిన పుస్తకాలు


1. Kulkarni, V.H. : Voluntary action in Developing Society.
2. D.P. Chowdary : Voluntary Social Welfare in India.
3. R.N.Sharma : Indian Society.
4. Vidhya Bhushan Sachdeva: An Introduction to Sociology.
5. Aliet M.A and Aliat Meril : Social Disorganisation.
6. Madhan G.R. : Indian Social Problem.

# ఖండం- VII

## సామాజిక సమస్యలు

వ్యక్తి, సమూహం, సముదాయం ఇలా సమస్యలకు అనేక దశల్లో తలెత్తే అశాంతి కారణమైనప్పటికీ ఇదంతా సామాజిక అవ్యవస్థకు దారితీస్తుందని సమాజశాస్త్రం చెబతోంది. అనుప్రయుక్త సమాజశాస్త్రం ఈ సమస్యలకు పరిష్కార మార్గాలు వెతుకుంది.

సామాజిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి పద్ధతులు పాటించాలో ఈ ఖండం వివరిస్తుంది. ముఖ్యంగా సమాజంలోని సమస్యల విశ్లేషణ, వాటికి అనుగుణమైన పద్ధతుల ఎంపిక, పరిష్కార ప్రణాళిక వంటివి రూపొందించుకుని ప్రజాభిప్రాయం సమీకరించడం సామాజిక కార్యకర్తల బాధ్యత. ఆ పద్ధతులు ఏమిటో ఈ ఖండంలో వివరించడం జరిగింది. ఇందులో రెండు భాగాలున్నాయి. అవి:

**భాగం-26: ప్రజాభిప్రాయం వైఖరులు-ప్రజాభిప్రాయ సమీకరణ**

**భాగం-27: సామాజిక శాసనాలు-లాబీయింగ్-చట్టం రూపకల్పన-ఆచరణ**

BRAOU

BRAOU

# భాగం-26: ప్రజాభిప్రాయ వైఖరులు-ప్రజాసమీకరణ

విషయక్రమం


26.0. ఉద్దేశాలు

26.1 పరిచయం

26.2 నిర్వచనాలు

26.3 లక్షణాలు

26.4 ప్రజలు లేక జనత

26.5 జనత ముఖ్య లక్షణాలు

26.6 అభిప్రాయమంటే ఏమిటి?

26.7 ప్రజాభిప్రాయ నిర్మాణదశలు

26.7.1 జన వాక్య సేకరణ

26.7.2. ప్రజాభిప్రాయ రూపకల్పన

26.7.3 ప్రజాభిప్రాయానికి దోహదం చేసే సాధనాలు

26.7.4 ప్రజాభిప్రాయ వక్తీకరణలో ఆటంకాలు

26.8 ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల సమీకరణ

26.9 ప్రజా వైఖరులు

26.10 శాసన నిర్మాణంలో ప్రజాభిప్రాయం పాత్ర

26.11 ప్రజాభిప్రాయం - విలువ

26.12 ముగింపు

26.13 మాదిరి పరీక్ష ప్రశ్నలు

26.14 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 26.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- ప్రజాభిప్రాయం నిర్వచనాలు, లక్షణాలు తెలుసుకుంటారు.
- ప్రజలు లేక జనత ముఖ్య లక్షణాలు, అభిప్రాయం అంటే ఏమిటో రర్థం చేసుకుంటారు.
- ప్రజల సమీకరణ గురించి కూడా నేర్చుకుంటారు.

## 26.1 పరిచయం

'జన వాక్యం తు కర్తవ్యం, పదుగురాడు మాట పాటియై ధర చెల్లు' అను నానుడులు మనదేశంలో చిరకాలంగా ప్రచారంలో ఉన్నాయి. ఐరోపా మొదలైన పాశ్చాత్య దేశాలలో కూడా ఈ విధంగానే ప్రచారంలో ఉన్న నానుడి 'Vox

Populi - Vox Die' ప్రజావాణి పరమాత్మ వాణి అని దాని అర్థం. క్రీ.పూ. నాలుగవ శతాబ్దికి చెందిన ఆర్యచాణక్యుడు 'ప్రకృతి కోపస్తు సర్వకోపే భ్యోగరీయాన్? అని తన చాణక్యనీతి గ్రంథం ద్వారా - అన్ని కోపాల కంటే ప్రజల కోపం చాలా శక్తి వంతమైనది - కనుక గురి కావద్దని రాజులకు ఉపదేశిస్తాడు. దీనిని బట్టి పూర్వంనుంచి కూడా ప్రజాభిప్రాయానికి గల ప్రాముఖ్యత విశదమవుతుంది.

## 26.2 ప్రజాభిప్రాయ నిర్వచనాలు

1. ఒక సామాజిక వ్యవస్థలో ఒకే సముదాయానికి చెందిన వ్యక్తులు ఒక సమస్య విషయంలో అనుసరించే వైఖరి ప్రజాభిప్రాయం అవుతుంది.

2. ఒక సమాజానికి సంబంధించిన విషయాలపై వ్యక్తులు ప్రకటించే అభిప్రాయాల సమాచారమే ప్రజాభిప్రాయం. దీని ప్రకారం విభిన్న ధృక్పథాలు, విశ్వాసాలు, ఊహలు, పూర్వనిర్ధారణలు, ఆకాంక్షలు ప్రజాభిప్రాయంలో సమ్మిళితమై ఉంటాయి.

3. ప్రజలకు సంబంధించిన విషయాల్లో వారు ఏర్పరుచుకునే నిశ్చయాలు ప్రజాభిప్రాయం అనవచ్చు.

4. జాతి సంక్షేమం దృష్ట్యా ప్రజలు ఏర్పరచుకునే అభిప్రాయమే ప్రజాభిప్రాయం.

5. వాస్తవ పరిస్థితుల ప్రాతిపదికపై సంఘర్షణ మూలంగా గానీ, లేక చర్చల పర్యవసానంగా గానీ, సిద్ధించిన సమిష్టి అభిప్రాయం లేక నిశ్చయమే ప్రజాభిప్రాయం.

7. సమభావన ఉన్న ఒక సమస్యపై సంబంధిత వర్గానికి చెందిన సభ్యులు వెలిబుచ్చే అభిప్రాయమే ప్రజాభిప్రాయం.

ప్రజాభిప్రాయం ఈ క్రింద పేర్కొన్న మూడు అంశాల్లో ఏదో ఒక దానిని సూచిస్తుంది.

1. ఒక వాస్తవాన్ని తెలుపుతుంది.

2. ఒక విశ్వాసాన్ని ప్రకటిస్తుంది.

3. ప్రజల సంకల్పాన్ని వ్యక్త పరుస్తుంది.

## 26.3 ప్రజాభిప్రాయం - లక్షణాలు

1. ప్రజాభిప్రాయం మొత్తం ప్రజల సంక్షేమాన్ని ఉద్దేశించినది.

2. ఒకనిర్ధిష్టసమస్యపై అవేశకావేశాలతో ప్రజలు వెలిబుచ్చే తాత్కాలిక అభిప్రాయం ప్రజాభిప్రాయం కాజాలదు. ధృఢ చిత్తంతో, మంచి చెడ్డ వివేచనతో చిరకాల ప్రయోజనాన్ని ఉద్దేశించి వెలుపర్చే అభిప్రాయమే ప్రజాభిప్రాయం కాగల్గుతుంది.

3. సంకుచిత స్వార్థ ప్రయోజనాలకు ప్రజాభిప్రాయంలో తావుండదు. అది సమాజంలోని అధిక సంఖ్యాకుల ప్రయోజనాలను ఉద్దేశిస్తుంది.

4. అభిప్రాయాన్ని అల్పసంఖ్యాకులు ప్రకటించినా, అధిక సంఖ్యాకులు ప్రకటించినా అది అందరి ప్రయోజనాలను ఉద్దేశించినపుడు మాత్రమే ప్రజాభిప్రాయంగా చెలామణి అవుతుంది.

BRAOU

5. ప్రజాభిప్రాయం ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తుంది. ఎంతటి శక్తివంతమైన ప్రభుత్వమైనా సరే ప్రజాభిప్రాయాన్ని నిర్లక్ష్యం చేయజాలదు. ప్రజాభిప్రాయాన్ని కాలదన్నే ప్రభుత్వాలు పతనమవుతాయి.

6. అధిక సంఖ్యాకుల అభిప్రాయం, ప్రజాభిప్రాయం రెండూ ఒక్కటి కావు. జాతి సంక్షేమానికి హాని కలగని రీతిలో ప్రజా సంక్షేమం ఉద్దేశించినపుడు మాత్రమే అధిక సంఖ్యాకుల అభిప్రాయానికి ప్రజాభిప్రాయం విలువ కలుగుతుంది. ప్రజాభిప్రాయం పేరుతో సంకుచిత వర్గ ప్రయోజనాన్ని ఉద్దేశించే ఏ అభిప్రాయమైనా సరే ప్రజాభిప్రాయంగా గుర్తింపును పొందజాలదు.

## 26.4 ప్రజలు లేక జనత అంటే ఎవరు?

ఒకే విలువలు, ఒకే అవసరాలు కలిగిన వ్యక్తుల సమూహాన్ని జనత లేక ప్రజలు అని చెప్పవచ్చు. పరస్పర వ్యక్తిగత దైహిక సంబంధం లేకుండా కేవలం మానసిక సంబంధమున్న వ్యక్తుల సముదాయమే జనత లేక ప్రజలు. ఆ సమూహంలోని వ్యక్తుల మధ్య పరిణామంలోనూ, అభిరుచులలోను, విద్యార్హతలలోను, సాంఘిక ఆర్థిక పరిస్థితులలోను ఉద్యోగాలలోను తేడాలుండవచ్చు. కానీ వీరందరు ఏదో ఒక సమస్యా పరిష్కార మార్గాన్వేషణలో ఏకం కావడమే జనత లేక ప్రజల ముఖ్య లక్షణం. ఒక సామాన్య సమస్యను చర్చించి పరిష్కారోపాయం కనుక్కోవడానికి ప్రయత్నించడమే జనత ప్రత్యేకత. వ్యక్తులు ఒకే ఒక సాంఘిక ఉద్దీపనతో ప్రభావితులు కావడం వల్ల వాద వివాదాల ద్వారా పరిష్కారమార్గాన్ని అన్వేషించడంలో నిమగ్నులవుతారు.

## 26.5 జనత ముఖ్య లక్షణాలు

1. వ్యక్తుల మధ్య ఉత్పన్నమయ్యే సామాన్య సమస్యలను పరిష్కరించడానికి పూనుకునే ధోరణి ఉండడం జనత మొదటి లక్షణం.

2. వివిధ ప్రసార సాధనాల ద్వారా వ్యక్తుల మధ్య పరస్పర క్రియను పరస్పర భావ ప్రసారాన్ని ప్రోత్సహించడం దీని రెండవ లక్షణం.

3. సమస్యలను చర్చించి, తర్కించి, దృక్పథాలను ఏర్పరచి, ఒక సాధారణ నిర్ణయానికి రావడానికి తోడ్పడడం దీని మూడవ లక్షణం.

4. వ్యక్తుల మధ్య విరుద్ధ భావాలకు అవకాశమున్నప్పటికీ, సామాజికమైన కొన్ని విలువలకు వారు కట్టుబడి ఉండడం వల్ల, వారికి సంబంధించిన సమస్యపై ఒక సాధారణ నిర్ణయానికి రాగలగడం జనత ప్రత్యేక లక్షణం.

## 26.6 అభిప్రాయమంటే ఏమిటి?

పూర్తిగా రుజువు చేయలేని వ్యక్తిగతమైన నమ్మకాలను అభిప్రాయమని చెప్పవచ్చు. ఇదమిత్థంగా నిర్ణయించలేని వ్యక్తి తాత్కాలిక దృక్పథాలను భిన్న భావాలకు అవకాశం ఉన్నపుడే అభిప్రాయానికి తావుంటుంది. ఉదాహరణకు : కుటుంబ నియంత్రణ తీసుకోండి కొందరు వ్యక్తులు దానికి పూర్తి అనుకూలతను ప్రదర్శించవచ్చు. మరికొందరు పూర్తిగా ప్రతికూలత వ్యక్తపరచవచ్చు. ఇంకా కొందరు, ప్రజలలో విద్యావంతుల సంఖ్య పెరిగే వరకు దానిని అమలుచేయరాదనే అభిప్రాయన్ని ప్రకటించవచ్చు. అభిప్రాయం సంస్కృతి పరమైనది. ఆధునిక సమాజం చాలా సంశ్లిష్టమైనది కావటం వల్ల వేరువేరు వృత్తులలో వేరు వేరు విశిష్టీకరణలకు ప్రాధాన్యం కలిగింది. ఈ కారణం చేత ఎన్నో జనతలుగా ఏర్పడి, తద్వారా వివిధ ప్రాజాభిప్రాయాలు ఏర్పరచుకోవడానికి వీలు కలుగుతుంది. ఆదిమ సమాజాలు విద్యావిహీనమైనవి కావడం వల్ల అందరి సమస్యలను జానపదరీతుల ద్వారా, సామాజికరీతుల ద్వారా



BRAOU

పరిష్కరించవలసి వచ్చేది. అట్లాంటి సందర్భాలలో ప్రజాభిప్రాయ నిర్మాణానికి కాని, దాని అభివృద్ధికి కానీ ఆస్కారం లేకపోయింది. నేటి మన గ్రామీణ సమాజానికి నగర సమాజానికి ఎంతో అంతరముంది. నగర సమాజంలో విరివిగా ప్రచారసాధనాలు ఉపయోగించడం వల్ల ప్రజాభిప్రాయ నిర్మాణానికి, అభివృద్ధికి హెచ్చుగా అవకాశముంటుంది.

## 26.7 ప్రజాభిప్రాయ నిర్మాణదశలు

కింబాల్ యంగ్ అనే శాస్త్రవేత్త ప్రజాభిప్రాయ నిర్మాణానికి నాలుగు దశలు పేర్కొన్నాడు.

మొదటి దశ : జనత వ్యాకులత చెందడానికి కారణభూతమైనది. ఏదైనా ఒక క్లిష్టసమస్య జనవాక్య నిర్మాణానికి ఆరంభదశ ప్రతిదినం పెరుగుతున్న ధరలు, నిరుద్యోగ సమస్య, విద్యార్థులు ప్రదర్శించే క్రమశిక్షణా రాహిత్యం మొదలైనవి ఇందుకు ఉదాహరణలు.

రెండవదశ : సమస్యకు సంబంధించిన అన్ని విషయాలను కూలంకషంగా పరిశీలించడమే కాకుండా, వేర్వేరు దృక్పథాలలో ఆ సమస్యను, దాని తీవ్రతను, పరిష్కరించవలసిన అవసరాన్ని తెలియజేస్తాయి. ఈ సమయంలో నిపుణుల అభిప్రాయాలను కూడా సేకరించడం జరుగుతుంది. వార్తా పత్రికలలో సంపాదకీయ వ్యాసాల ద్వారా, లేఖల ద్వారా, చర్చావేదికల ద్వారా సమస్యలను బహువిధాల విడమరచి చెప్పడం జరుగుతుంది.

మూడవ దశ : ఈ దశలో వేరు వేరు పరిష్కార మార్గాలు పరిగణనలోనికి వస్తాయి. పరస్పర విరుద్ధాభిప్రాయాలను పొందుపరుస్తూ రాజకీయ పార్టీలు తమతమ వ్యక్తిగత దృక్పథాలను తెలియజేస్తాయి.

వాద ప్రతివాదాలు, భిన్నాభిప్రాయాలు, ప్రజాభిప్రాయాభివృద్ధికి చాలా అవసరమైనవి. ప్రజాభిప్రాయమనేది చాలా అభిప్రాయాల ప్రాతిపదికగా అభివృద్ధి చెంది, చివరకు వేరు వేరు అభిప్రాయాలతో బలవత్తరమైనదీ యోగ్యమైనదిగా తయారవుతుంది. సాంఘిక నియంత్రణకు ప్రజాభిప్రాయం ఆయువుపట్టు. ఎందుచేతనంటే జనసమ్మతి, అసమ్మతి ఆ రెండు ప్రజాబాహుళ్యం ప్రవర్తనపై చాలా వరకు ఆధారపడి ఉంటాయి. ప్రజాభిప్రాయం అభివృద్ధి చెందటానికి, జనసంబంధ సాధనాలకు ఒకే ప్రత్యేక సంబంధముంది. సమాజంలో వార్తా పత్రికలు, రేడియోప్రసార కేంద్రాలు, సినిమాలు, మొదలైన ప్రచార సాధనాలు బాగా అభివృద్ధి చెందినట్లయితే ప్రజాభిప్రాయం వేరువేరు శ్రేణులలో ఏర్పడి స్థిరపడటానికి అవకాశం ఎంతైనా ఉంది.

BRAOU

### 26.7.1 జనవాక్య సేకరణ

ప్రతిచయనం, పోలింగ్ అనే రెండు ముఖ్యమైన పద్ధతులద్వారా జనవాక్యసేకరణ చేస్తారు.

### ప్రతిచయనం

ఒక సమస్యను గురించి వ్యక్తుల అభిప్రాయాన్ని ముఖాముఖి ప్రశ్నలద్వారా తెలుసుకోవడం నిస్సందేహంగా చాలా ఉచితమైన పద్ధతి. కాని ప్రజాబాహుళ్యంలోని వారిని అందరిని అడిగి వారి వారి అభిప్రాయలను తెలుసుకోవడానికి ప్రయత్నించడం ఎంతో వ్యయప్రయాసలతో కూడినపని. అందువల్ల జనాభాలోని కొందరు వ్యక్తులను మాత్రమే ప్రతిచయన పద్ధతి ద్వారా ఎన్నుకొని, వారి అభిప్రాయాలను మాత్రమే సేకరించి, అవే మొత్తం ప్రజల అభిప్రాయాలకు సూచికగా నిర్ణయించే పద్ధతి సామాజిక శాస్త్రంలో ఇటీవల విస్తారంగా వాడుకలోకి వచ్చింది. అయితే మనము ఎన్నుకున్న "మాదిరి" వ్యక్తులు మొత్తం జనాభాలోని వ్యక్తులు ప్రదర్శించే అభిరుచుల శ్రేణులకు, ఇతర వ్యత్యాస ధోరణులకు ప్రతిరూపాలుగా, ప్రతినిధులుగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే, ప్రతిచయన పద్ధతి ద్వారా మనం సేకరించే అభిప్రాయం నిజమైన ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించలేక పోవచ్చు. ప్రతిచయన పద్ధతి సంపూర్ణ యాదృచ్ఛికతను ప్రదర్శించాలి. అంటే జనాభాలోని ఏ వ్యక్తి అయినా సరే మనం ఎన్నుకునే ప్రతిచయన వర్గంలో ఎన్నిక అయ్యే అవకాశం ఉండాలి. మరోవిధంగా చెప్పాలంటే, ఎన్నిక అయ్యే అవకాశం పాక్షికంగా ఉండకపోవటమే కాకుండా, పక్షపాత రహితంగా కూడా ఉండాలి.

ఒక్కొక్కప్పుడు మనం ఎన్నికచేసిన ప్రతిచయన వర్గానికి జనబాహుళ్యంలోని కొన్ని గుణగణాలను తప్పనిసరిగా కలిగి ఉండాల్సిన అగత్యం కూడా ఏర్పడవచ్చు. దీనిని స్తరితప్రతిచయనం అంటారు. జానాభాలోని వ్యక్తుల లింగ భేదం, వయస్సు, విద్యార్హతలు, సాంఘిక, ఆర్థిక, హోదా మొదలైన లక్షణాల భేదం ఏ నిష్పత్తిలో ఉంటుందో ఆ నిష్పత్తిలో మన ప్రతిచయన వర్గంలోని వ్యక్తులను కూడా మనం ఎన్నుకోవలసి ఉంటుంది. "ఫైల్ ప్రతిచయనం"లో మన దగ్గర ఉన్న జనాభా మొత్తం పట్టిక నుంచి మనకు కావలసిన నిష్పత్తిలో ప్రతిచయన వర్గపు వ్యక్తులను ఎన్నుకుంటాం. ఉదాహరణకు : ఒక ఊరి టెలిఫోన్ డైరెక్టరీలో నాలుగు వేల వ్యక్తుల పేర్లు ఉన్నాయనుకోండి మనం నాలుగు వందల మందిని ప్రతిచయనం చేయవలెననుకొంటే, డైరెక్టరీనుంచి ప్రతి పదవ వ్యక్తిని ఎన్నుకుంటే మనకు కావలసిన సంఖ్య లభిస్తుంది.

"కోటా ప్రతిచయన పద్ధతి"లో ఒక వర్గపు ప్రజలు మొత్తం జనాభాలో ఏ నిష్పత్తిలో ఉంటే అదే నిష్పత్తిని మనం ప్రతిచయన వర్గంలో కూడా "కోటా" గా నిర్ణయిస్తాం. ఉదాహరణకు : షెడ్యూల్డ్ కులాలవారు మొత్తం జనాభాలో ఏ నిష్పత్తిలో ఉంటే, అదే నిష్పత్తిని మన ప్రతిచయన వర్గంలో కూడా కోటాగా నిర్ణయిస్తారు.

## నిర్ణీత ప్రదేశ ప్రతిచయన పద్ధతి

నిర్ణీత ప్రతిచయనమనేది ఇంకొక ప్రతిచయన పద్ధతి. ఇందులో ఒక నిర్ణీత ప్రదేశాన్ని అంశంగా నిర్ణయించుకొని, అందులోని ప్రతి మూడవ ఇంటినికానీ, ప్రతి మూడవ అంతస్తులో నివసించే కుటుంబాన్ని గానీ ప్రతిచయన వర్గంలో చేర్చుకుంటాము.

## పోలింగ్ పద్ధతి

జనవాక్య సేకరణకు గత కొన్ని సంవత్సరాలుగా ఒక కొత్త పద్ధతి ప్రవేశపెట్టినారు. దీనిని 'పోలింగ్' పద్ధతి అని పేర్కొంటారు. అమెరికా, ఇంగ్లాండ్ మొదలైన పశ్చిమ దేశాలలో, వార్తా పత్రికలవారు తమ పాఠకులకు 'బ్యాలెట్' పత్రాలను అందజేసి, ఒక ప్రత్యేక సమస్యపై, వారికి గల వ్యక్తిగతాభిప్రాయాలను తెలియజేయవలసిందిగా వారిని కోరుతారు. పాఠకులు అందజేసే అభిప్రాయాలను క్రోడీకరించిన తరువాత విశ్లేషణ పద్ధతి ద్వారా ఒక సూచికను తయారు చేస్తారు.

ఈ పద్ధతి వాడకపుదారుల అభిరుచులను తెలుసుకోవడానికి కూడా ఉపయోగపడుతూ ఉండడం వల్ల దీనిని 'వినియోగ పరిశోధనాపద్ధతి' అంటారు. ఈ పద్ధతిని ఉపయోగించి రేడియో ప్రసార కేంద్రాల వారు తమ తమ శ్రోతల అభిప్రాయాలను, అభిరుచులను తెలుసుకొంటారు. 1930 సంవత్సరం తరవాత, అమెరికా, ఇంగ్లాండ్, మొదలైన పశ్చిమ దేశాలలో పోలింగ్ పద్ధతి ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరించే సంస్థలు ఎన్నో వెలసినాయి. అమెరికాలో అధ్యక్షుని ఎన్నిక సరళిని, ఇంగ్లాండ్‌లో వేరు వేరు రాజకీయ పక్షాలు ఎన్నికలలో గెలిచే అవకాశాలను, పోలింగ్ పద్ధతి ద్వారా ముందుగానే అంచనాలు వేయడం మనకందరికి తెలిసిందే.

## 26.7.2 ప్రజాభిప్రాయ రూపకల్పన-ఉత్పాదకాలు ఉత్పన్నాలు

ఒక ప్రజాసమస్యను గూర్చి అప్రమత్తంగా వ్యక్తులు ఏర్పరుచుకునే అభిప్రాయం ప్రజాభిప్రాయం రూపొందడానికి కారణమవుతుంది. భోజనశాలలో ఇష్టపూర్వంగా రుచికర పదార్థాలు ఆరగిస్తూ కుటుంబ సభ్యులతో ఇష్టాగోష్టి చేస్తూ ఉండే సందర్భంలో కొన్ని అభిప్రాయాలు వ్యక్తమవుతాయి ఇది ప్రజాభిప్రాయం రూపొందడంలో సక్రియమైన ఒక దశ అని చెప్పవచ్చు. ఈ విధంగానే నల్గురు కలిసే నడిరోడ్డున జనాల సంచారాన్ని క్రమబద్ధం చేస్తుండే ట్రాఫిక్ పోలీసు విధినిర్వహణ తీరు గురించి జరిపే చర్చ ప్రభుత్వపాలనా విధానాన్ని ప్రశంసించేది కావచ్చు లేదా విమర్శించేది కావచ్చు. వాహనం నడిపే వారు విధిగా హెల్మెట్ ధరించాలనే నిబంధనను ట్రాఫిక్ పోలీసు అమలు జరుపుతూ ఉండే తీరు స్కూటర్ ప్రయాణీకులను స్పందిప జేస్తుంది. వారితోబాటు రోడ్డుపై గుమికూడి చూస్తూ ఉండే ప్రేక్షకులను కూడా ఆకర్షిస్తుంది. వారు ప్రభుత్వ విధానాన్ని సమర్థింపవచ్చు, లేదా విమర్శించవచ్చు. వారి మధ్య జరిగే సంభాషణ ఆ సమస్యను గూర్చి ప్రజాభిప్రాయం రూపొందడానికి ప్రేరకమవుతుంది. ఈ విధంగా రోడ్డుపై జరిగే ఏ సంఘటన



BRAOU

అయినా సరే వార్తా పత్రికలు, రేడియోలు, టీవి, వార్తగా ప్రసారమై ఇంకా ఎక్కువ జనాలను ఆకర్షిస్తుంది. అది అప్పుడు విస్తృతంగా చర్చా విషయమవుతుంది. ఈ క్రమంలో ప్రజాభిప్రాయం హఠాత్తుగా ఏర్పడ్డాక నెమ్మదిగా రూపొందుతుంది.

ప్రజాభిప్రాయం రూపొందడంలో రెండు అంశాలు ఉంటాయి.

1. ఒక వ్యక్తి, వ్యక్తిత్వం ఏర్పడటానికి అతని కుటుంబం, పరిసరాలు, విశ్వాసాలు, నిశ్చితాభిప్రాయలు, మొదలైనవి.

2. రెండవది ఒక ప్రత్యక్ష సంఘటన లేక సమస్యలకు సంబంధించి సేకరించిన సమాచారం కలుగజేసే ప్రభావం.

## 26.7.3 ప్రజాభిప్రాయానికి దోహదం చేసే సాధనాలు

ఆధునిక ప్రభుత్వాలు అనేక రకాలైన ప్రచార పద్ధతులను అవలంబిస్తాయి. వాటికోసం విరివిగా డబ్బును వెచ్చిస్తాయి. ప్రభుత్వాలే కాక రాజకీయ పార్టీలు, సంఘాలు, సంస్థలు మొదలైనవి కూడా ప్రచార పద్ధతుల నిమిత్తం ప్రత్యేక శ్రద్ధ వహిస్తాయి. ఇది అనివార్యం. ఎందుకంటే భావాలను అభిప్రాయాలను ముమ్మరంగా ప్రచారం చేస్తూ ఉండడం వలన ప్రజలకు వాటిని గూర్చిన పరిజ్ఞానం కలుగుతుంది. వారు వివేకంతో ఆలోచిస్తారు. మంచిదని భావించిన విధానాలను చిత్తశుద్ధితో సమర్థిస్తారు. విధానాలు దోషయుక్తాలని భావించినట్టయితే వాటిని ఎత్తి చూపుతారు. చేయవలసిన సవరణలను సూచిస్తారు. ప్రజాభిప్రాయ రూపకల్పనకు దోహదం చేసే సాధనాల్లో ప్రసార సాధనాల పాత్ర గుర్తించదగినది. ముఖ్యమైన ప్రసార సాధనాల్లో పేర్కొనదగినవి.

1. పత్రికలు
2. రాజకీయ పార్టీలు
3. సంఘాలు - సంస్థలు
4. ప్రజావేదికలు
5. విద్యాలయాలు
6. ఆకశవాణి (రేడియో)
7. దూరదర్శన్
8. సినిమా
9. శాసనసభలు.

## 26.7.4 ప్రజాభిప్రాయ వ్యక్తీకరణలో ఆటంకాలు

### 1. నిరక్షరాస్యత - అజ్ఞానం

ప్రజలు తమ నిరక్షరాస్యత అజ్ఞానం వలన జాతి ప్రయోజనాలు అర్థం చేసుకోలేరు. నాయకుల మాటలు నమ్మి వారి స్వార్థానికి బలవుతారు. సామాజిక అంశాలలో సరైన అవగాహన లేక, స్వచ్ఛమైన ప్రజాభిప్రాయాన్ని రూపొందించలేరు.

### 2. దారిద్ర్యం

అత్యధిక జనాభా దారిద్ర్యంతో మగ్గుతున్నప్పుడు వారు తమ ప్రాథమిక అవసరాల కోసమే

BRAOU

ప్రాకులాడడంతోనే సరిపోతుంది. కానీ, దేశ సమస్యల గురించి ఆలోచింపజాలరు.

### 3. సాంప్రదాయబద్ధత

పురాతన సాంప్రదాయాలకు కట్టుబడి ఉండే సమాజంలో ప్రజలు దినదినం వస్తూ ఉండే సాంఘిక, ఆర్థిక, రాజకీయ మార్పులను గ్రహించలేక, ఏ అభిప్రాయన్ని సరిగా వ్యక్తం చేయజాలరు.

### 4. అనాసక్తి

చాలా మందికి సామాజిక స్పృహ లేక, సామాజిక విషయాల పట్ల అనాసక్తి ఉంటుంది. మేధావులు సైతం అనాసక్తికి లోనై, సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయలేరు.

### 5. పెట్టుబడిదారీ వ్యవస్థ

పెట్టుబడిదారీ వ్యవస్థ అమలులో ఉన్నట్లైతే ధనవంతులు పేదలను తమ ధనంతో లోబరుచుకుంటారు. తమ అభిప్రాయాన్ని వారిపై రుద్ది, అది అందరి అభిమతంగా చెలామణి చేస్తారు.

### 6. సంకుచిత భావాలు

కులం, మతం, ప్రాంతం, వర్గం, లింగం, తెగ వ్యక్తీకరణకు ఆటంకం కలుగజేస్తాయి.

### 7. స్వార్థం

వ్యక్తులలోని స్వార్థ చింతన వాస్తవమైన ప్రజాభిప్రాయాన్ని రూపొందనీయదు.

### 8. రాజకీయ పార్టీల కుతంత్రాలు

రాజకీయ పార్టీలు ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలుచుకునే నిమిత్తం కుతంత్రాలు చేయడం వలన, నిర్దిష్టమైన ప్రజాభిప్రాయం వ్యక్తం కావడం కష్టమవుతుంది.

BRAOU

## 26.8 ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల సమీకరణ పద్ధతులు

1. ప్రజలలో నిరక్షరాస్యతను, అజ్ఞానాన్ని తొలగించడానికి నిర్బంధ విద్యను అమలుచేయాలి.
2. నిర్లక్ష్యవైఖరి వలన విద్యావంతులు కూడా ఓటింగ్‌లో పాల్గొనరు. దీనిని నివారించడానికి నిర్బంధ ఓటింగ్ పద్ధతిని అమలు చేయాలి.
3. సాంప్రదాయక తత్వాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించినట్టయితే, జనాలు హేతుబద్ధంగా ఆలోచించి, పనికిరాని పాత పద్ధతులను వదలి మేలైన క్రొత్త విధానాలను ఆహ్వానిస్తారు.
4. ప్రజలలో దారిద్ర్యం, పేదరికం నిర్మూలింపబడిన నాడు, వారు ఏ సమస్య గురించైనా నిష్పాక్షికంగా ఆలోచించగలుగుతారు.
5. దేశ పౌరులు కులం, మతం, ప్రాంతం, వర్గం, లింగభేదం, తెగ మొదలైన సంకుచిత భావాలు విడనాడి జాతీయ భావన గలవారు కావాలి.
6. రేడియో, టి.వి. వార్తా పత్రికలు మొదలైన ప్రచార, ప్రసారసాధనాలు వాస్తవమైన సమాచారాన్ని ప్రజలకు అందజేయాలి.

7. ప్రజాభిప్రాయాన్ని మలచడంలో అమోఘపాత్ర వహించగల రాజకీయ పార్టీలు సంకుచిత తత్వాలకు ప్రాధాన్యతనీయక, క్రమశిక్షణ గలవై ఉండాలి.

8. రాజకీయ పార్టీలు సంఘవ్యతిరేక దుష్టశక్తులకు అలవాలమయ్యాక వాటిని నిర్మూలించినపుడు ప్రజలు ధైర్యంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగలుగుతారు.

## 26.9 ప్రజావైఖరులు

సమాజం భిన్నాభిప్రాయాలు కలిగిన ప్రజాసమూహం. ప్రజలందరూ భౌతికంగా ఒకే విధంగా ఉన్నప్పటికీ, మానసిక స్థితిగతులలో వారు అనేక భిన్నతలను కలిగిఉంటారు. ఒక సమాజంలోని ప్రజలలో ఎన్నడూ ఏకాభిప్రాయం ఉండదు. అభిప్రాయ వైవిధ్యం అనివార్యం అయినప్పటికీ, అధిక సంఖ్యాకులైన పౌరులు ఆమోదం పొందిన ఏ అభిప్రాయమైనా ప్రజాభిప్రాయంగా చెలామణి అవుతుంది. ఏ కారణం చేతనైనా అల్ప సంఖ్యాకులు సణుగుతూ, గొణుగుతూ అనిష్టతో గానీ లేక ఏదైనా ప్రత్యేక పరిస్థితిలో భయభ్రాంతులై ప్రకటించిన అభిప్రాయం అధిక సంఖ్యాకుల అభిప్రాయం బొత్తిగాకా జాలదు ప్రజల మనః ఫలకంపై అతని పరిసర రాజకీయ వాతావరణ ప్రభావం చాలా శక్తి వంతంగా ఉంటుంది. అయినప్పటికీ వ్యక్తులందరికీ సమానమైన బుద్ధి వికాసం ఉండదు. కనుక తమతో ప్రత్యక్ష సంబంధం లేని ఎన్నో విషయాలపై వారు గతాను గతికంగా అభిప్రాయాలను ఏర్పరచుకుంటారు. తీక్షణమైన బుద్ధివికాసం గల కొందరు మాత్రమే సమకాలిక సమాజానికి చెందిన సమస్యలను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తారు. వారికి మాత్రమే నిశ్చితాభిప్రాయాలుంటాయి. వారే అధిక సంఖ్యాకుల మద్దతును సంపాదించి ప్రజాభిప్రాయ రూపంలో చెలామణి చేస్తారు.

వ్యక్తుల సముదాయం అభిప్రాయమే ప్రజాభిప్రాయంగా ఇప్పుడు ముద్రలేయడం జరుగుతోంది. అలా చెలామణి అయ్యే ప్రజాభిప్రాయంలో ప్రజలు అధిక సంఖ్యాకులకు ప్రాతినిధ్యం వహించకపోవచ్చు. మొత్తం ఓటర్లతో సరిసమానం కాకపోవచ్చు కూడా. వారి అభిప్రాయం కూడా సరైంది కాకపోవచ్చు కూడా. ఇదంతా పర్యవేక్షకులు ఏర్పాటు చేసుకున్న ప్రమాణాలపై లేదా వారు అనుసరించే దృక్పథంపై ఆధారపడి ఉంటుంది. ప్రజాభిప్రాయంలో ప్రజలు ముఖ్యంగా సమాజంలోని ఒక వర్గం అని మాత్రమే భావించడం జరుగుతుంది. ఈ దృష్ట్యా కార్మికులకు సంబంధించిన, సమస్యలు చర్చకు వచ్చినపుడు కార్మిక సంఘాల అభిప్రాయాలే ప్రజాభిప్రాయం అవుతుంది. అలానే వాణిజ్య వ్యవహారాల్లో వాణిజ్య వర్గాల అభిప్రాయాలకు ప్రజాభిప్రాయం ముద్ర పడుతుంది.

BRAOU

## 26.10 శాసన నిర్మాణంలో ప్రజాభిప్రాయ పాత్ర

ఆధునిక సమాజాలలో అనేక మతాలు, సంప్రదాయాలు ఆచరణ విధానాలు, విభిన్న భావాలు, విభిన్న ఆదర్శాలు ఉన్నాయి. వీటిలో తమకిష్టమైన వాటిని ప్రజలు ఆచరించే అవకాశముంది. దీనివల్ల సమాజమంతటికీ ఒకే మతం గానీ, ఒకే విధమైన ఆచార సాంప్రదాయాలుగానీ, ఒకే ఆలోచనా విధానం గానీ ఉండదని స్పష్టమవుతున్నది. అందువల్లనే సమాజమంతటినీ నియంత్రణ చేయడానికి సాంప్రదాయక ప్రమాణాలు, ఆచారాలు, కట్టుబాట్లు సరిపోవడం లేదు ప్రజలలో కొందరు ప్రమాణాలను గౌరవిస్తారు, కొందరు తిరస్కరిస్తారు. అధికసంఖ్యాకులు ఆమోదించి అనుసరిస్తే గానీ ఏ ప్రమాణమూ సమర్థవంతమైన సామాజిక నియంత్రణా సాధనం కాజాలదు. అంతేకాక, సంశ్లిష్ట సమాజాలలో వివిధ తరగతుల వ్యక్తులకు వేరువేరు ప్రమాణాలుంటాయి. సమాజమంతా ఏకగ్రీవంగా పాటించి, ఆచరించే ప్రమాణాలు ఉండకపోవచ్చు.

కాబట్టి ప్రజలందరినీ సమైక్యపరచి సమాజ శ్రేయస్సు కోసం, ప్రజల శాంతియుత సహజీవనం కోసం అందరికీ వర్తించే కొన్ని సమగ్ర సామాజిక శాసనాలను రూపొందించి అమలు జరపాలి. సామాజిక శాసనాలను రూపొందించేటప్పుడు ప్రభుత్వం సమాజంలో వివిధ వర్గాలవారి సామాజిక రీతులను, సాంస్కృతిక ప్రమాణాలను దృష్టిలో ఉంచుకోవాలి.

పూర్వం ఆచరణలో ఉండి అత్యధిక ప్రజల ఆమోదాన్ని పొందిన సంప్రదాయాలను, కట్టుబాట్లను ప్రమాణాలను శాసనాలుగా రూపొందించడం సాధారణంగా జరుగుతుంది. శాసనాలు ప్రజల హక్కులను పరిమితం చేసి బాధ్యతలను విస్తృతం చేస్తాయి. అయితే ప్రజాస్వామ్యంలో శాసనం విలువ ప్రజాభిప్రాయం మీద, వారి ఆమోదం మీద ఆధారపడి ఉంటుంది. సాధారణంగా ప్రజాస్వామ్యంలో చట్టాలను ప్రజల శ్రేయస్సుకోసం, దేశ శ్రేయస్సుకోసం ప్రజా ప్రతినిధుల ద్వారా శాసన సభలలో రూపొందించడం జరుగుతోంది.

ప్రజాభిప్రాయం శాసనానికి వ్యతిరేకంగా ఉంటే ఆశాసనాలను సక్రమంగా సమర్థవంతంగా అమలు జరపడం కష్టం. అట్లాంటి శాసనాలను ప్రజలు ఉల్లంఘిస్తారు. ఉదా : మనదేశంలో అనేక రాష్ట్రాలలో మద్యపాన నిషేధ చట్టాన్ని అమలు జరిపినారు. మద్యపానము అనాదిగా సమాజంలో ఉన్న ఆచారం. మద్యపాన నిషేధ చట్టానికి అత్యధిక ప్రజలు సుముఖత చూపలేదు. అంటే ప్రజాభిప్రాయం శాసనానికి అనుగుణంగా రూపొందలేదన్నమాట. దానికి తోడు శాసనాన్ని అమలు పరచడానికి అవసరమైన సిబ్బంది కొరత అందుకయ్యే ఖర్చు ప్రభుత్వం భరించడం కష్టమయ్యింది. పైగా ప్రభుత్వం ప్రతి యేటా ఎక్సైజ్‌పన్ను రూపంలో వచ్చే ఆదాయాన్ని నష్టపోయింది. ఈ కారణాల వల్ల ప్రభుత్వం మద్యనిషేధ చట్టాన్ని ఉపసంహరించుకున్నది.

ఇదే విధంగా వరకట్న నిషేధశాసనం విషయంలో కూడా జరుగుతున్నది. వరకట్నం అన్ని సమాజాలలోను అనాదిగా వుస్తున్న వివాహ సాంప్రదాయం. ఈనాటికీ కూడా దాదాపు ప్రజలందరూ ఈ సంప్రదాయాన్ని అనుసరిస్తున్నారు. అందుచేత వరకట్నాన్ని నిషేధిస్తూ శాసనం చేసినప్పటికీ ఆశాసనాన్ని అధిక సంఖ్యాక ప్రజలు ఉల్లంఘించడం చేత ఆశాసనం విలువ క్షీణించింది. కాబట్టి ప్రజల ఆమోదం, సహకారం లభించని విషయాల మీద శాసనాలు రూపొందించినట్లయితే అట్లాంటి శాసనాల పట్ల ప్రజలకు గౌరవం ఉండదు. సామాజిక సంబంధాలను రూపొందించే చట్టాలు ఎట్లాంటివయినా ముఖ్యంగా ప్రజామోదాన్ని పొందాలి. అందువల్ల ప్రభుత్వం ఏదైనా ఒక చట్టాన్ని ప్రవేశపెట్టేముందు ప్రచార సాధనాలను వినియోగించి, సామాజిక శాసనాల ద్వారా ఉద్ధేశించిన ప్రయోజనాలను, ప్రజలకు సమకూరే లాభాలను విడమరిచి చెప్పి ప్రజాభిప్రాయాన్ని శాసనానికి అనుకూలంగా మలచాలి.

కాబట్టి ప్రజా ప్రభుత్వం సామాజిక శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని శాసనాలను రూపొందించేప్పుడు ప్రజానీకానికి శాసనావశ్యకతను గురించి తెలియజేస్తూ వారి విలువలలో, దృక్పథాలలో మార్పు తేవడానికి ప్రయత్నం చేయాలి.

చట్టాలనేవి ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ఉద్ధేశించినవై ఉండాలి. అంతేగాక అవి ప్రజాభిప్రాయానికి, ఆమోదానికి అనుకూలంగా ఉండాలి. ప్రతి కూలంగా ఉండరాదు. ప్రజల అవసరాలను తీర్చడమే శాసనాల ధ్యేయంగా ఉండాలి.

## ప్రజావైఖరులు-ప్రచారం

ఏదైనా ఒక సమస్యను పరిష్కరించడానికి శాసనం చేయబోయే ముందు, సంఘ సంస్కర్తలు, సంఘ సేవకులు, సంక్షేమ కార్యకర్తలు, ప్రభుత్వం ఆ సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి దానికి చెందిన మంచి చెడ్డలను, వివరాలను వ్యాసాల ద్వారా, గోష్టుల ద్వారా, ఉపన్యాసాల ద్వారా, వివిధ ప్రచారసాధనాలయిన రేడియో, సినిమా, వార్తా పత్రికలు, పుస్తకాలు, కరపత్రాలు, వాల్ పోస్టర్లు మొదలయిన వాటి ద్వారా సమస్యల సమగ్ర రూపాన్ని గురించి ప్రజలకు విశదంగా, సమగ్రంగా తెలిసేటట్లు, దానిపట్ల అనుకూలాభిప్రాయం కలిగేటట్లు ప్రచారం చేయాలి. ఈ విధంగా శాసనం పట్ల ప్రజాభిప్రాయాన్ని అనుకూలంగా మలచిన తరవాత శాసనాన్ని పటిష్టంగా రూపొందించడం అవసరం.

ఆ తరవాత శాసనాన్ని అమలు పరచడంలో కూడా సంఘ సంక్షేమ కార్యకర్తలు, సంఘసేవకులు, సంస్కర్తలు ప్రభుత్వానికి సహాయపడాలి. శాసనాలపై తిరిగి సదస్సులను, గోష్టులను, రేడియో, సినిమా, పత్రికలద్వారా నిర్వహించి ఆశాసనం విశిష్టతను దానిని పాటించడం వల్ల ప్రజలకు సమకూరే లాభాలను దానిని నిర్లక్ష్యం చేయడం వల్ల లేదా వ్యతిరేకించడం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలి. ఈ విధంగా శాసనం చేయడానికి ముందు, శాసనం చేసిన తరువాత కూడా సామాజిక సమస్యల గురించి, వాటి నివారణకు రూపొందించిన శాసనాలను గురించి ప్రచారం

BRAOU

జరుగుతూనే ఉండాలి. ప్రచారం సరిగా జరగనట్లయితే శాసనాలు సక్రమంగా అమలు గాక, శాసనాల ద్వారా ఉద్దేశించిన ప్రయోజనాలు కూడా ప్రజలకు సమకూరవు. ప్రజల సహకారాన్ని పొందుతూ, ప్రజలందరూ సామాజిక శాసనాలను అమలు జరిపేటట్లు చూడడానికి నిఘా సంఘాలు ఎంతో ఉపకరిస్తాయి. ఇంతే కాక మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా సామాజిక జీవనంలో మార్పులు తేవడానికి కూడా శాస్త్రీయ పద్ధతిలో కృషి జరపాలి. సామాజిక శాసనాలకు సంబంధించిన విజ్ఞానం అనేక సాధనాల ద్వారా, సంస్థల ద్వారా ప్రజలకు అందించి వారి విలువలలో మార్పు తీసుకురావాలి.

సాంఘిక సమస్యలు ఉద్భవించిన చాలాకాలానికి గాని సామాజికశాసనాలు ఏర్పడవు. శాసనాలు ఎప్పుడూ సామాజికావసరాలకు ప్రజాభిప్రాయానికి వెనుకబడి ఉంటాయని చెప్పవచ్చు అంతేకాక ప్రతిసాంఘిక సమస్యా పరిష్కరించడానికి ఒక శాసనం రాకపోవచ్చును. అలివర్ వెండిల్ హోమ్స్ ఇట్లా అన్నారు! "నిన్నటి సాంఘికావసరాలను తీర్చడానికి ఈనాడు శాసనాలను చేయడం జరుగుతుంది".

సామాజిక రంగంలో సామాజిక శాసనంచేయాలంటే ప్రథమంగా అప్పటివరకు అచరణలో ఉన్న సామాజిక కట్టుబాట్లను, అచారవ్యవహారాలను, నడవడిని శాసనం ద్వారా మార్పు చేయాలి. అట్లా మార్పు చేయవలసి వచ్చినపుడు చాలా చిక్కులు ఎదురౌతాయి. ముందుగా ఏది సరిఅయిన ప్రవర్తననో, ఏది కాదో నిర్ధారించాలి. అట్లా నిర్ణయించడం వల్ల కలిగే లాభ నష్టాలను కూడా బేరీజు వేయాలి. నిర్ణయించిన లేదా ప్రామాణీకరించిన నడవడిని ఉల్లంఘించిన వారికి విధించవలసిన శిక్ష ఏమిటి? ఆ శిక్ష ఎట్లా, ఏరూపంలో, ఎంత మోతాదులో ఉండాలి. అన్ని విషయాలను నిర్ణయించాలి. అంతేకాక, ఆసామాజిక శాసనం వల్ల ఆసాంఘిక సమస్య నివారణ అవుతుందా? ఆ శాసనం, సరిపోతుందా? లేదా అనేది కూడా నిర్ణయించాలి. ఈ విధమైన నిర్ణయాలు చేసన తరవాత ఆ సమస్యపై ప్రజాభిప్రాయాన్ని సేకరించాలి. ప్రజాభిప్రాయం కూడా శాసనానికి అనుకూలంగా ఉన్నదని ధృవపడిన తరవాత ఆ సమస్యపై శాసనాన్ని రూపొందించాలి.

సామాజిక శాసనాలలో ఏమైనా లోటుపాట్లు ఉన్నట్లయితే దానికి కారణం, శాసనాలు రూపొందించడానికి పూర్వం జరపవలసిన సమగ్రమైన చర్చలు, గోష్టులు సక్రమంగా జరపకపోవడం, అని చెప్పవచ్చును. చట్టాలలోని లోటుపాట్లను పరిశీలించి సవరించడం, సమగ్రమైన శాసనాన్ని రూపొందించడం ప్రభుత్వం బాధ్యత.

సామాజిక శాసనాలు రూపొందడానికి పూర్వం సాధారణంగా సమాజంలో సాంఘిక సంస్కరణలు ప్రాథమిక విలువలలో, సామాజిక సంస్థలలో మార్పులు ప్రవేశ పెట్టడానికి ఉపకరిస్తాయి. ఇదివరలో కొన్ని విలువలు, సమాజంలో అచరణలో ఉండవచ్చు. క్రమేణా ఈ విలువలలో మార్పులు రావచ్చు. ఉదాహరణకు : భారతదేశంలో పూర్వం సతీసహగమనాన్ని సామాజిక అచరణగా భావించినారు. ఆ నాటి సామాజిక సంస్థలు, విలువలు దీనిని ఆమోదించినాయి. అయితే ఈ అచారాన్ని గడచిన రెండు శతాబ్దాల కాలంలో సాంఘిక దురాచారంగా భావించడం జరిగింది. ఈ నూతన భావన వ్యాప్తి చెంది సమాజంలో పాత విలువలను, దృక్పథాలను మార్చి సతీసహగమనాన్ని ప్రజా ఉద్యమాల ద్వారా, చట్టాల ద్వారా రూపుమాపడం జరిగింది. ఈ విధమైన ప్రయత్నాన్ని సామాజిక సంస్కరణగా పేర్కొంటారు.

సామాజిక సంస్కరణ సమాజ జీవన విధానాన్ని మార్చడానికి ప్రయత్నిస్తుంది. దానివలన సామాజిక సంస్థల ప్రకార్యాలలో కూడా మార్పు వస్తుంది. అంతేగాక సమాజంలో సామాజికంగానూ, ఆర్థికంగానూ వెనుకబడిన వర్గాలకు, ఇతర బలహీన వర్గాలకు సహాయం చేయడానికి గాను సమాజంలో ఇప్పుడున్న సామాజిక విలువలలో మార్పు రావాలి. స్త్రీలకు పురుషులతో పాటు సమాన హక్కులు కల్పించడం, హరిజనులకు వలస, తదితర సౌకర్యాలను కల్పించడం, బాలనేరస్తులను సంస్కరించడం లాంటి సమస్యలపై జరిపే కృషిని సామాజిక సంస్కరణలుగా భావించవచ్చు. దానిని పురస్కరించుకుని సామాజిక సమస్యల నియంత్రణకు, సమస్యలను పరిష్కరించడానికి కృషి చేసి సత్ఫలితాలను సాధించవచ్చు. ఉదాహరణకు దారిద్ర్యం, నిరుద్యోగం, భిక్షాటన, అస్పృశ్యత, వ్యభిచారం, నేరము, బాలనేరం, మద్యపాన వ్యసనం మొదలైన సామాజిక అవ్యవస్థ వలన ఏర్పడిన సామాజిక విలువలను, అచారాలను ప్రస్తుత కాలానికి అనుగుణంగా మార్చడానికి కృషిజరిపితే. ఈ సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు,



BRAOU

వర్గాలకు లాభం చేకూరుతుంది. వితంతు పునర్వివాహం, అస్పృశ్యతా నిర్మూలన, మద్యపాన నిషేధం, వ్యభిచారం మొదలైన వన్నీ సంస్కరణ పద్ధతిలో పరిష్కరించవలసిన సమస్యలు.

సమాజంలోని వ్యక్తులలో మార్పు రావాలి. వారికి సంస్కరణాభిలాష కలగాలి. సమస్యలలో ఉన్న వక్తులను అది వాని ఖర్మ అని ఉపేక్షించక వారిని సమస్యల నుంచి రక్షించడానికి కృషి జరపాలనే భావన సమాజంలో ఏర్పడాలి. ప్రధానంగా మావుల అంతరంగాలలో మార్పురావాలి. లేకపోతే ఇతర పద్ధతులద్వారా ఎన్ని ప్రయత్నాలు చేసినా సామాజిక సమస్యలకు పరిష్కారాన్ని సాధించలేము. అదే విధంగా సమస్యలకు గురిఅయినవారి అంతరంగాలలో కూడా మార్పు రావాలి. వారు హృదయ పూర్వకంగా సంస్కరణలను ఆమోదించి సమస్యా పరిష్కారానికి దోహదం చేయాలి. వారు సంస్కరణల సహాయంతో నూతన జీవితాన్ని ప్రారంభించి బాధ్యతా యుతమైన వ్యక్తులుగా, ఆత్మవిశ్వాసంతో మెలగాలి. ఈ విధంగా సంస్కరణా విధానం సామాజిక సమస్యల పరిష్కారానికి, లేదా వాటి నియంత్రణకు ఎంతయినా అవసరం. ఈ సంస్కరణోద్యమాలను పురస్కరించుకొని, ప్రభుత్వం ఆ సమస్యలను నిరోధించడానికి సామాజిక శాసనాలను రూపొందిస్తుంది. భారతదేశంలో సతీ సహగమన నిషేధం మొదలుకొని భూ సంస్కరణోద్యమాల పర్యవసనాలేనని చెప్పవచ్చు. ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ పార్టీలు, ప్రభావితవర్గాలు ఈ సంస్కరణోద్యమ నిర్వహణలోను, సామాజిక శాసనాలను రూపొందించడంలోను ప్రముఖ పాత్ర వహిస్తాయి.

## 26.11 ప్రజాభిప్రాయం-విలువ

ఆధునిక ప్రభుత్వాలు ప్రభుత్వ విధాన నిర్ణయంలో ప్రజాభిప్రాయానికి విలువనివ్వడం ఒక కర్తవ్యంగా భావిస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని విదేశీ విధాన నిర్ణయాలలోనూ, కొన్ని అంతర్జాతీయ విధాన నిర్ణయాలలోనూ ప్రభుత్వాలు సర్వేజరిపించి, దానిలోని అంశాలను పరిశీలించి, తగిన విధంగా ప్రజాభిప్రాయాన్ని వినియోగించుకోవడం పరిపాటి. ప్రజా నియంత్రణ పద్ధతులలో ప్రజాభిప్రాయం చాలా శక్తివంతమైనది అధికారంలో ఉన్న ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉందా? లేదా? అని తెలుసుకోవడానికి ప్రజాభిప్రాయం నిత్య జాగరూకమై ప్రభుత్వ విధానాలకు ప్రతి స్పందిస్తూ జాగ్రత్తగా పరిశీలించి తగినట్లుగా తన విధానాలను మార్చు కుంటుంది. ప్రజాభిప్రాయం నిర్లక్ష్యం చేసే ఏ ప్రభుత్వమైనా చిరకాలం మనజాలదు.

BRAOU

ప్రజాభిప్రాయం మొత్తం ప్రజల సంక్షేమాన్ని ఉద్దేశిస్తుంది. సమాజంలోని అధిక సంఖ్యాకుల ప్రయోజనాన్ని ప్రజాభిప్రాయం ఉద్దేశిస్తుంది.

ఒక ప్రసిద్ధ రచయిత ప్రజాభిప్రాయం విలువను ఇలా ప్రస్తుతించాడు

రాజకీయనాయకులు ప్రజాభిప్రాయాన్ని అభ్యర్థిస్తారు. తాత్వికులు దానిని ప్రస్తుతిస్తారు. లేదా గర్హిస్తారు. వ్యాపారులు దానిని సమృద్ధం చేస్తారు. సైన్యాధికారులు దానికి భయపడతారు. సమాజశాస్త్రవేత్తలు దాన్ని విశ్లేషిస్తారు. సాంఖ్యకులు తమ కొలమానంతో కొలిచి విలువగడతారు. శాసనకర్తలు దానిని స్వీకరించి సార్వభౌమ చట్టాలను రూపొందిస్తారు. ప్రజాభిప్రాయం ప్రజాస్వామ్యానికి ఊపిరి వంటిది.

## 26.12 ముగింపు

మనదేశంలో '.నవాక్యం తు కర్తవ్యం' అన్నట్లుగానే పాశ్చాత్య ప్రపంచంలో 'Vox Populi - Vox Die' అనే ప్రజాభిప్రాయం. దృక్పథంవుంది. ఒక సామాజిక వ్యవస్థలో ఒకే సముదాయానికి చెందిన వ్యక్తులు. ఒక సమస్యగురించి అనుసరించే వైఖరి ప్రజాభిప్రాయం అవుతుంది. విభిన్న దృక్పథాలు, విశ్వాసాలు, ఊహలు, పూర్వనిర్ధారణలు, ఆకాంక్షలు ప్రజాభిప్రాయంలో సమ్మిళితమై ఉంటాయి. ప్రజాభిప్రాయానికి మూడు లక్షణాలుంటాయి. ఒకేవిలువలు, ఒకే అవసరాలు కలిగిన వ్యక్తుల సమూహాన్నే ప్రజలు లేదా 'జనత' అంటారు. అట్లాగే ఈ ప్రజల అభిప్రాయాలే ప్రజాభిప్రాయాలు. సమస్యల పరిష్కారంలో ప్రజాభిప్రాయం ఏర్పాటు ముఖ్యమైన

పాత్ర పోషిస్తుంది. ప్రజాభిప్రాయానికి దోహదం చేసే సాధనాలు సమాజంలోనే ఉంటాయి. అట్లాగే ఆటంకాలు కూడా ఉంటాయి. ప్రజాభిప్రాయం సేకరించి, వారిని సమీకరించడం ద్వారా అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి వీలవుతుంది.

## 26.13 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబురాయండి?

1. ప్రజాభిప్రాయం నిర్వచనాలు వివరించండి?
2. 'జనత' ముఖ్యలక్షణాలు వివరించండి?
3. ప్రజల సమీకరణ గురించి రాయండి?

II. ఈక్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.'

1. అభిప్రాయం అంటే ఏమిటి?
2. ప్రజాభిప్రాయం దోహదకాలేవి?
3. ప్రజాభిప్రాయానికి ఆటంకాలేవి?

## 26.14 చదవదగిన పుస్తకాలు


1. R.S.Sharma : Indian Society.
2. Vidhya Bhushan Sahdev : An Introduction to Sociology.


BRAOU

# భాగం-27: సామాజిక శాసనాలు-లాబీయింగ్-చట్టం రూపకల్పన - ఆచరణ

విషయక్రమం


27.0 ఉద్దేశాలు

27.1 పరిచయం

27.2 సామాజిక శాసనాల ఆవిర్భావం

27.3 సామాజిక శాసనాలు - భావన

27.4 ప్రకార్యాలు పరిధి

27.5. శాసనాల లక్షణాలు

27.6. చట్ట రూపకల్పనలో పరిగణించే అంశాలు

27.7. లాబీయింగ్

27.8. శాసన నిర్మాణం లేక చట్ట రూపకల్పన

27.9. శాసనాల ఆచరణ - ప్రభుత్వం పాత్ర

27.10. ముగింపు

27.11. మాదిరి పరీక్ష ప్రశ్నలు

27.12. చదవదగిన పుస్తకాలు


BRAOU

## 27.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సామాజిక శాసనాల ఆవిర్భావం గురించి తెలుసుకుంటారు.
- శాసనాల భావనను, ప్రకార్యాలు, విధులను, లక్షణాలను నేర్చుకుంటారు.
- లాబీయింగ్ గురించి వివరించగలుగుతారు.

## 27.1 పరిచయం

ప్రతిసమాజం తమ సభ్యులు సక్రమంగా తమ తమ నియమాలు పాటించడానికి కొన్ని నిబంధనలు ఏర్పరుస్తుంది. ఈ నియమాలను అనుసరించి నడిచేవారిని సమాజసభ్యులుగా గౌరవిస్తుంది. నియమాలను ఉల్లంఘించేవారిని సమాజం శిక్షిస్తుంది లేదా సమాజం నుండి వెలివేస్తుంది.

సమాజం నిర్ణయించే ప్రవర్తనా విధానాలనే ఆచారాలు, కట్టుబాట్లు, రీతివాజులు అని వేరు వేరు పేర్లతో పిలుస్తారు. ఏ పేరుతో పిలిచినా వీటన్నిటి ధ్యేయం ఉపయోగం ఒక్కటే. ప్రతి సమాజం తాను ఏర్పరచుకున్న కట్టుబాట్ల ప్రకారం సామాజికాభివృద్ధికి తోడ్పడుతుంది.

ఆ ఆచారాలు, కట్టుబాట్లు, జానపద రీతులు రెండు రకాలుగా ఉంటాయి. 1. పాటించవలసినవి, 2. పాటించకూడనివి.

సమాజం ఆమోదించిన ఆచారాలను కట్టుబాట్లను, సమాజ సభ్యులు తూ.చ. తప్పకుండా అనుసరించాలి. అట్లాగే సమాజం ఆమోదించని ప్రవర్తనావళిని సభ్యులు పాటించకూడదు. సమాజ సభ్యుల ప్రవర్తనను అదుపులో పెట్టడానికి సమాజ సమగ్ర పురోభివృద్ధిని సాధించడానికి పైన చెప్పిన రెండు రకాలయిన విధి నిషేధాలు అవసరం. సమాజం నిర్ణయించే ఆచారాలు, కట్టుబాట్లు సామాజిక నియంత్రణా సాధనాలు.

పురాతన సమాజాలలోను, ఆదిమ సమాజాలలోను సామాజిక నియంత్రణ, సామాజికాభివృద్ధి జానపద రీతులు సామాజిక రీతుల ద్వారా మాత్రమే జరిగింది. అంటే ఆనాటి జానపద రీతులు ఈనాడు చట్టాలు శాసనాలు చేస్తున్న పనిని నిర్వర్తించినాయని చెప్పవచ్చు. జానపదరీతులను రాతపూర్వకంగా లేని సారస్వతమని చెప్పవచ్చు. వీటిని ప్రతితరంలోని ప్రజలు తమ తరవాతి తరాలవారికి 'పాటల ద్వారా, కథల ద్వారా, పొడుపు కథలద్వారా, చిక్కుప్రశ్నల ద్వారా, భజనల ద్వారా, ప్రార్థనల ద్వారా అందిస్తారు. పైన చెప్పిన వాటన్నింటిలో సమాజ సభ్యుల నడవడిని తీర్చిదిద్దే అజ్ఞాత సందేశాలు నిండి ఉంటాయి. ఈ విధమైన సామాజిక రీతులు ఒక జాతి సంస్కృతిని, జాతి మొత్తం అనుసరించే ప్రవర్తనా నియమావళిని తెలియజేస్తాయి. ప్రభుత్వాలు గానీ, రాజ్యాలు గానీ లేని ఆదిమ, సాంప్రదాయక సమాజాలలో సామాజిక రీతులే సామాజిక నియంత్రణకు ప్రధాన సాధనాలుగా ఉండి సమాజంలో శాంతి సామరస్యాలను పెంపొందించడానికి తోడ్పడినాయి.

## 27.2 సామాజిక శాసనాల ఆవిర్భావం

ఆదిమ సమాజాలలోను, ప్రాచీన సమాజాలలోనూ సమాజ సభ్యుల దైనందిన జీవితం చాలా సామాన్యంగా ఉండేది. సమాజ సభ్యులందరికీ ఆహారాన్ని సంపాదించుకోవడం, భుజించడం, ఎండ వానల నుండి రక్షణ పొందడం, తమ సంతతిని అభివృద్ధి పరచుకోవడం జీవితధ్యేయంగా ఉండేది. ఈ అవసరాలు సమాజం మొత్తానికి ఒకే రీతిగా ఉండేవి. వీటిని నెరవేర్చు కోవడానికి సమాజ సభ్యులందరూ వ్యష్టిగాను, సమిష్టిగానూ కృషి చేసేవారు. ప్రాచీన యుగం నాటి మానవ సమాజాల అవసరాలు పరిమితంగా ఉండడం చేత ఆనాటి సమాజాలలో సంశ్లిష్టతలేదు. ఆ సమాజాలలో జానపదరీతులు, సామాజిక రీతులు, సామాజిక నియంత్రణను సులభంగా సాధించగలిగినాయి.

BRAOU

అయితే క్రమంగా మానవసమాజాలలో నాగరికత, విజ్ఞానం పెరిగినాయి. సమాజాలు, పాతరాతి యుగం నుంచి కొత్తరాతి యుగానికి, కొత్తరాతి యుగం నుంచి లోహపు యుగానికి అభివృద్ధి చెందినాయి. నాగరికత విజ్ఞానాభివృద్ధితో పాటు సమాజ సభ్యుల అవసరాలు కూడా పెరిగినాయి. ఈ అవసరాలను నెరవేర్చుకోవడానికి కొన్ని నూతన సాధనాలను, నూతన వృత్తులను కనుక్కోవడం జరిగింది. ఆ విధంగా తరవాతి సమాజాలలో వ్యవసాయం చేయడం, ధాన్యం పండించడం, పశువులను పెంచడం, గృహాలను, పల్లెలను నిర్మించుకోవడం, రవాణా సౌకర్యాలను అభివృద్ధి పరుచుకోవడం జరిగింది.

విజ్ఞానం ముఖ్యంగా సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ అవసరాలు పెరిగినాయి. వాటిని నెరవేర్చుకొనడానికి అనుసరించే విధానాలు కూడా అభివృద్ధి చెందినాయి. ఈ విధంగా సమాజసభ్యుల కార్యకలాపాలు క్రమంగా బహుముఖంగా పెరగసాగినాయి. అంటే సమాజాలు సామాన్యస్థితి నుంచి సంశ్లిష్టతస్థితికి చేరుకున్నాయి. ఇంతే కాకుండా సమాజాలలోని జనాభా కూడా క్రమంగా అభివృద్ధి సాందసాగింది. అధికమవుతున్న జనులు, వారి అవసరాలు ఎక్కువ కావడం, ఈ విధంగా సమాజాలలో వ్యక్తుల కార్యకలాపాలు బహుముఖంగా అభివృద్ధి చెందడం జరిగింది. వీటితోపాటు విభిన్న సాంస్కృతిక, సామాజిక సమూహాలు సహజీవనం చేయవలసి వచ్చింది. ఈ పరిస్థితులలో జానపద రీతులు, సామాజిక రీతులు మాత్రమే సమర్థవంతమైన సామాజిక నియంత్రణా సాధనాలుగా పనిచేయలేవు. సమాజాలలోని వ్యక్తుల అవసరాలుగా పనిచేయలేవు. సమాజాలలోని వ్యక్తుల అవసరాలు సక్రమంగా తీర్చడానికి, వారిని అదుపులో పెట్టడానికి అవసరమైన సామాజిక నియంత్రణావశ్యకత పెరిగింది. దానితో సామాజిక శాసనాలను రూపొందించడం జరిగింది.

ఇవి ఇట్లా ఉండగా విద్యుచ్ఛక్తిని, ఆవిరిశక్తితో నడిచే యంత్రాలను కనుక్కున్నారు. సాంకేతిక విజ్ఞాన ప్రగతితో యంత్ర యుగారంభంతో సమాజాల వ్యక్తుల అవసరాలు పెరగడం, వాటిని సాధించే ప్రయత్నంలో వృత్తులు పెరగడం, వీటన్నింటికంటే సామాన్య స్థాయి నుంచి సంశ్లిష్ట స్థాయికి చేరుకున్నప్పుడే సామాజిక శాసనాల ఆవశ్యకత కూడా పెరిగింది. అప్పటి వరకు సామాజిక నియంత్రణా సాధనాలైనా ఆచారాలు, కట్టుబాట్లు సామాజిక రీతులు బహుముఖాభివృద్ధి చెందిన సమాజాలలోని వ్యక్తులను, సమూహాలను అదుపులో ఉంచడానికి, సమాజాన్ని సక్రమంగా నడపడానికి సరిపోలేదు. అందుచేత సంశ్లిష్ట సమాజాల నియంత్రణకు నూతన సాధనాలను, సంస్థలను ఏర్పాటు చేసుకోవలసి వచ్చింది. ఈ ఏర్పాటు ఫలితంగానే సామాజిక శాసనాలు రూపొందాయి.

## 27.3 సామాజిక శాసనాలు - భావన

శాసనమంటే కొన్ని నియమనిబంధనల అల్లిక. శాసనమంటే న్యాయ సూత్రాలను, చట్టాలను నిర్మాణం చేయడమని చెప్పవచ్చు.

శాసనం ప్రభుత్వ అధికారాన్ని నిర్ణయిస్తుంది. కొన్ని సందర్భాలలో పౌరుల మధ్య పరస్పర సంబంధాలను, పౌరులకు రాజ్యానికి లేదా ప్రభుత్వానికి మధ్య ఉండే సంబంధాలను నిర్ణయిస్తుంది. శాసనం ధ్యేయాన్ని జాన్. ఎస్. బ్రాడ్వే ఈ విధంగా నిర్వచించాడు.

"మానవుల సమస్యలను పరిష్కరించడానికి, వివాదాలను పరిష్కరించడానికి సంబంధించిన నిర్ణయాలను తీసుకునే విధానమే శాసనం"

ప్రజల మధ్య వుండే సంబంధాలను, ప్రజలకు, సమాజాలకు మధ్య ఉండే సంబంధాలను, ప్రజలకు రాజ్యానికి, ప్రభుత్వానికి మధ్య ఉండే సంబంధాలను క్రమబద్ధం చేసే విధానమే శాసనం అని చెప్పవచ్చు.

శాసనం అతి ముఖ్యమైన సామాజిక నియంత్రణా సాధనం. సమాజంలోని వ్యక్తులు ప్రతి ఒక్కరూ కూడా తమ నిత్య జీవితంలో శాసనాలకు సన్నిహితులు కాని వారుకానీ, వాటివల్ల ప్రభావితులు గాని వారు గానీ ఉండరు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఈనాడు ప్రతి వ్యక్తి తాను పుట్టక పూర్వం తల్లి గర్భంలో ఉన్నప్పటినుంచి, పుట్టిన తర్వాత మరణించే వరకూ మరణించిన తరువాత కూడా చట్టాల పరిధిలోనే జీవిస్తున్నాడు. అంటే వ్యక్తి జీవితం చట్టానికి లోబడిందనే గానీ స్వతంత్రం కాదన్న మాట. వివాహం చేసుకోగోరిన స్త్రీ, పురుషులు చట్టం నిర్ణయించిన వివాహానుమతిని, సామాజికానుమతిని సంపాదించాలని నిర్దేశించడం ద్వారా పుట్టబోయే బిడ్డకు చట్టబద్ధమైన రక్షణ సంబంధమైనదా? కాదా? అనే విషయం కూడా శిశువు పుట్టిన వెంటనే రికార్డు చేయవలెనని చట్టం ఆదేశిస్తున్నది. ఆ విధంగానే వ్యక్తి మరణానంతరం కూడా అతని మరణాన్ని రికార్డు చేయవలెనని చట్టం ఆదేశిస్తున్నది.

చట్టాలు వ్యక్తుల హక్కులను పరిరక్షిస్తాయి. వ్యక్తుల బాధ్యతలను కూడా తెలియజేస్తాయి. దేశంలోని ప్రతి వ్యక్తి పన్నులు కట్టాలి. శాంతిని కాపాడాలి. దేశంలోని శాసనాలకు, చట్టాలకు వ్యక్తులు విధేయులై ఉండాలి.

నాగరికత అభివృద్ధి చెందుతున్న మొదటి రోజులలో వ్యక్తులు, సమూహాల మధ్య ఉండే స్పర్థలను వారిమధ్య కొట్లాటల ద్వారా, యుద్ధం ద్వారా తీర్చుకునేవారు. కాలక్రమేణా చట్టం ద్వారా నిర్మితమైన ప్రభుత్వ యంత్రాంగాలుగా అవి ఉపయోగ పడుతున్నాయి. క్రమంగా ప్రభుత్వానికి తగాదాలు పరిష్కరించే ప్రాథమిక బాధ్యతతో పాటు ప్రజల రక్షణ, హక్కులను, బాధ్యతలను అమలు జరపడం వంటి బాధ్యతలు కూడా ఏర్పడినాయి. ఆ విధంగా మనకు వ్యక్తి న్యాయం అనే న్యాయ సిద్ధాంత భావనతో పరిచయం ఏర్పడింది. ప్రత్యేక అవసరాలున్న వర్గాల సంక్షేమం కోసం చట్టాలను శాసనాలను చేయడం, ప్రభుత్వ ఏజన్సీలను ఏర్పరచడం లేదా వ్యక్తి అతని సంక్షేమ అవసరాలు అనే భావనకు బదులు సామాజిక సంక్షేమం అనే భావన బయలుదేరడం 20వ శతాబ్ది ప్రత్యేకతగా చెప్పవచ్చు. న్యాయ శాస్త్రం ఈ దశను మనం 'సామాజిక శాసన' మని చెప్పుకుంటున్నాము.

BRAOU

## 27.4 సామాజిక శాసనాలు - ప్రకార్యాలు - పరిధి

శాసనం నియమాల సమూహం నేటి సంశ్లిష్ట సమాజాలలో అనేక వృత్తులు, జీవన విధానాలు ఏర్పడటంతో సమాజంలోని ప్రజలందరి సక్రమ పురోభివృద్ధికి సామాజిక నియంత్రణావశ్యకత అత్యధికమయినది. ఆధునిక సంశ్లిష్ట సమాజాలలో సామాజిక నియంత్రణకు ముఖ్య సాధనాలు శాసనాలు. అందుచేత సామాజిక శాసనాల ముఖ్య ప్రయోజనం సామాజిక నియంత్రణమని చెప్పవచ్చు. సమాజంలో వ్యక్తుల ప్రవర్తనను నియమబద్ధం చేస్తూ సమాజంలో శాంతి సుస్థిరతను పరిరక్షిస్తూ, సమాజ సభ్యులందరూ సమగ్రాభివృద్ధి సాధించడానికి తోడ్పడే పరిస్థితులను కల్పించడం సామాజిక శాసనాల ముఖ్యధ్యేయం.

సమాజంలో కొందరు వ్యక్తులు చాలా తొందరగా అభివృద్ధి పొందవచ్చు, మరికొందరి అభివృద్ధి మందకొడిగా ఉండవచ్చు. ఇంకా కొందరు వ్యక్తులు అసలేమాత్రం అభివృద్ధి చెందక వెనుకబడిపోవచ్చు. అంతేగాక సత్వరాభివృద్ధి సాధించిన వ్యక్తులు సమాజంలో వెనుకబడి ఉన్నవారిని, బలహీనులను దోపిడీ చేయవచ్చు. ఆ విధంగా కొంతమంది వ్యక్తులు అత్యధిక అభివృద్ధిని సాధించడం, మరికొందరు వ్యక్తులు వెనుకబడడం, దోపిడీకిలోను కావడం జరగకుండా అందరికీ సమానావకాశాలు కల్పించడం, ప్రతి సమాజం, ప్రభుత్వం ప్రథమ కర్తవ్యం. సామాజిక శాసనాలు వ్యక్తులందరి సమగ్రాభివృద్ధికి తోడ్పడతాయి.

ఇరవయ్యవ శతాబ్దిలో ప్రపంచంలోని దేశాలన్నీ శ్రేయోరాజ్యస్థాపన తమ ఆశయంగా, ధ్యేయంగా ప్రకటించాయి. శ్రేయోరాజ్యంలో సమాజంలోని వ్యక్తికి పుట్టుకనుంచి అతడు చనిపోయేవరకు కూడా రాజ్యమే అతని బాధ్యత వహిస్తుంది. ప్రజల సర్వతో ముఖాభివృద్ధికి కృషిచేయడం సంక్షేమరాజ్యం ధ్యేయం. సమగ్ర సామాజిక సంక్షేమాన్ని సాధించడానికి ప్రతి దేశం కొన్ని సామాజిక శాసనాలను రూపొందించుకొనవలసి ఉంది.

వైయక్తిక, సామూహిక అభివృద్ధికి దోహదం చేసే సామాజిక నియమాలను రూపొందించడమే సామాజిక శాసనాల ప్రధాన ప్రకార్యం. సమాజంలో కొన్నింటిని సామాజిక ధ్యేయాలుగా పేర్కొనడం జరిగింది. ఈ ధ్యేయాలను సాధించడంకోసం, సామాజికాభివృద్ధి కోసం వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కొంతవరకు అదుపులో పెట్టవలసి ఉంది. శాసనాల రూపంలో వ్యక్తి స్వాతంత్ర్యాన్ని సమాజం అదుపులో ఉంచుతుంది.

ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి జరపడం రాజకీయ సామాజిక సిద్ధాంతం. శ్రామిక దోపిడీనుంచి కార్మికులకు రక్షణ, పురుషుల ఆధిపత్యం నుంచి స్త్రీలకు రక్షణ, తల్లిదండ్రుల అశ్రద్ధ నుంచి పిల్లలకు రక్షణ, పేదవారి సంరక్షణ మొదలైనవి ఈ నాటి ప్రభుత్వాల కర్తవ్యం.

బ్రతుకుతెరువు లేనివారికి జీవనవిధానాన్ని కల్పించడం, వయోవృద్ధుల సంరక్షణ, మార్గదర్శకత్వం కరువైన పిల్లల పోషణ, పెంపకం మొదలైనవన్నీ కూడా ఈనాటి ప్రభుత్వాల బాధ్యతలే. ప్రభుత్వం పౌరులను సంఘ వ్యతిరేక శక్తులనుంచి కాపాడాలి. శాంతి భద్రతలను రక్షించాలి. సమాజాన్ని అస్వస్థతనుంచి అవినీతి నుంచి రక్షించాలి.

వ్యక్తుల దారిద్ర్యాన్ని సమాజ వనరులను సామాజిక అవసరాలకు వినియోగించి తొలగించాలి. వ్యక్తులు తమను తాము స్వయంశక్తితో పోషించుకోవడం, వ్యక్తుల బాధలను తొలగించడం. అశక్తతలను తొలగించడం, అశక్తులకు పునరావాసాన్ని కల్పించడం మొదలైన సేవల నిర్వహణ బాధ్యత ప్రభుత్వం వహిస్తూ దానికయ్యే ఖర్చును పన్నుల ద్వారా వసూలు చేసిన నిధులనుంచి అందచేయవలసి ఉంటుంది. ఈ సమాజ అవసరాలను నిశితంగా పరిశీలించి శాసనాలను రూపొందించాలి. సమాజ అవసరాలు కాలాను గుణంగా మారుతుంటాయి. సమాజం ప్రస్తుతావసరాలను తీర్చడానికి శాసనాలను నిశితంగా పరిశీలించి సరిదిద్దవలసి ఉంటుంది. శాసనాలు ఎప్పటికప్పుడు మార్పులకు లోనవుతుంటాయి. శాసనాలను ఎప్పటికప్పుడు క్రోడీకరిస్తూ నిర్వచిస్తారు. సామాన్య నియమాలను కూడా రూపొందిస్తారు. క్లుప్తంగా చెప్పాలంటే సామాజిక నియమాలు ఈ క్రింది అంశాలకు సంబంధించినవై ఉంటాయి.

1. సంఘంలో బలహీన వర్గాల వారి (ఉదా: స్త్రీలు, బాలలు, కార్మికులు, వికలాంగులు మొదలైన వారి) సంక్షేమానికి సంబంధించినవి.



BRAOU

2. సాంఘిక అసమానతలను తొలగించడానికి ఉద్దేశించినవి.

3. సామాజిక సమస్యలను నిరోధించడానికి, నిర్మూలించడానికి ఉద్దేశించినవి.

### శాసనం-అర్థం

ఆధునిక రాజ్యవ్యవస్థలో శాసనాలకు లేదా చట్టాలకు అత్యంత ప్రాముఖ్యం ఉంది. రాజ్యం శాసనాలను రూపొందించడం, అమలు పరచడం ద్వారా తన సార్వభౌమాధికారాన్ని వ్యక్తం చేస్తుంది. శాసనం అనేది రాజ్యానికి సంబంధించిన విశిష్టలక్షణం. రాజ్యంలోని వివిధ సంస్థల మధ్య, వ్యక్తుల మధ్య, సంస్థలు వ్యక్తుల మధ్య సంబంధాలను శాసనాల ద్వారా రాజ్యం క్రమ బద్ధం చేస్తుంది. రాజ్య లక్ష్యాలు, విధానాలు శాసనాల ద్వారానే సాధించడానికి వీలవుతుంది.

రాజ్యంలోని వ్యక్తులు ఏమిచేయాలి? ఏమి చేయకూడదు అని నిర్దేశించేది శాసనం. చట్టాన్ని లేదా శాసనాన్ని ఆంగ్లంలో 'లా' అంటారు. ఈ పదానికి 'లాగ్' అనే పురాతన ట్యూటానిక్ పదం మూలం. లాగ్ అంటే స్థిరమైనది అని అర్థం. కాబట్టి శాసనానికి స్థిరమైనది అనే అర్థం ఉంది. చట్టబద్ధమైన, అధికారిక వ్యవస్థ, రూపొందించి, అమలు పరచే స్థిరమైన నియమాలను, నిబంధనలను శాసనంగా చెప్పవచ్చు.

## 27.5 శాసనాల లక్షణాలు

1. రాజ్యం లేదా ప్రభుత్వం ఆశయాలను, అభీష్టాలను శాసనాలు వ్యక్తీకరిస్తాయి.
2. శాసనాలను ఉల్లంఘించే ప్రజలను దండించే అధికారం రాజ్యానికి ప్రభుత్వానికి ఉంది.
3. మానవుని భాహ్య ప్రవర్తనను శాసనాలు నియంత్రిస్తాయి.
4. శాసనాలు లిఖిత పూర్వకంగా ఉంటాయి.
5. శాసనాలు అందరికీ సమానంగా వర్తిస్తాయి. శాసనాల అమలులో రాజ్యం ప్రజల మధ్య విచక్షణ చూపదు.
6. శాసనాలు క్లుప్తంగా, స్పష్టంగా ఉంటాయి.
7. శాసనాలను రాజ్యం తనకున్న సార్వభౌమాధికారం ద్వారా అమలు పరుస్తుంది.
8. శాసనాలు సంఘ సంక్షేమ సాధనాలు.
9. శాసనాలు సామాజిక అవసరాలకు అనుగుణంగా మారుతుంటాయి.

BRAOU

## 27.6 శాసన ఆధారాలు లేక చట్టం రూపకల్పనలో పరిగణనాంశాలు

శాసనాలు ఆకస్మికంగా రూపొందవు. అవి అనేక మార్పులకు లోనయి అనేక దశలలో రూపొందాయి. శాసన రూపకల్పనను చారిత్రక, సామాజిక, రాజకీయ సాంస్కృతిక అంశాలు ప్రభావితం చేస్తాయి. వీటిని శాసన ఆధారాలుగా చెప్పవచ్చు.

### 1. ఆచారాలు, వాడుకలు, సాంప్రదాయాలు

ఆచారాలు, వాడుకలు, సంప్రదాయాలు శాసనాలకు ముఖ్యమైన ఆధారాలు. ఆదిమ సమాజాలలో రాజ్య శాసనాలు లేవు. వివాదాలు, విభేదాలు వాడుకలో ఉన్న సామాజిక సాంప్రదాయాలకు అనుగుణంగా పరిష్కృతమయ్యేవి. సంప్రదాయాలే సమాజజీవితాన్ని క్రమబద్ధం చేసేవి. సంప్రదాయాలు సంఘజీవితాన్ని సరైన

మార్గంలో నడపడానికి సహాయపడేవి. ఆచారాలు ఎప్పుడు ప్రారంభమయ్యాయో చెప్పలేం. కొందరు ఒక లక్ష్యంతో ఒక అలవాటు పాటిస్తే అదే అలవాటు ఒక తరం తరవాత మరొకతరం అనుసరిస్తే, అదే ఆచారంగా స్థిరపడుతుంది. అలవాటు, అధిక జనామోదం, న్యాయవాంఛ, వాడుక అనే వాటినుండి ఆచారాలు పుట్టాయి రాజకీయంగా ఆచారాలు శాసనాలు కావు. కానీ రాజకీయాధికారం వాటిని గుర్తించి అమలు చేయడంవల్ల అవి శాసనాలు అవుతాయి. భారతదేశంలో వివాహ చట్టాలు, ఆస్తి పంపిణీ చట్టాలు, విడాకుల చట్టాలు మొదలయినవి చాలా కాలంగా వాడుకలో ఉన్న సంప్రదాయాల ఆధారంగా రూపొందినవే.

## 2. మతం

మతం సమాజాన్ని విపరీతంగా ప్రభావితం చేసే వ్యవస్థ. ప్రాచీన సమాజాల్లో మతానికి, సాంఘికాచారాలకు అతి సన్నిహిత సంబంధం ఉండేది. ఆకాలంలో మతాచార్యులకు అపరిమితాధికారం ఉండేది. మతాధికారుల నిర్ణయాలు శాసనాల మాదిరిగా చెలామణి అయ్యేవి. వారి తీర్పులకు దైవత్వం ఉండేదని నమ్మేవారు. నేటి మన న్యాయ సూత్రాలకు మతం కూడా ఒక ప్రధానమైన మూలం. వారసత్వం, వివాహం, కుటుంబం ఆస్తి మొదలయిన అనేక విషయాలలో హిందూ'లా', ముస్లిం'లా', రోమన్'లా' వంటి మతపరమైన ధర్మ శాస్త్రాలు న్యాయ నిర్ణయాలకు ఆధారం కావడం, శాసనాలకూ, మతానికి ఉన్న సంబంధాన్ని తెలియజేస్తుంది. నేటి ఇరాన్, పాకిస్తాన్ వంటి ఇస్లామిక్ దేశాల్లో సామాజిక జీవనంలో మత నియమాలే శాసనాలకు ప్రధాన ఆధారాలయ్యాయి.

## 3. న్యాయస్థానాల తీర్పులు

సమాజంలో వ్యక్తుల మధ్య భేదాభిప్రాయాలు తలెత్తడం సహజం అధునిక రాజ్య నిర్మాణానికి పూర్వం వ్యక్తుల మధ్య తలెత్తిన వివాదాలను, సంఘర్షణలను సంఘంలోని పెద్దలు విచారించి పరిష్కరించేవారు. వారు ఇచ్చిన తీర్పులు సమానసందర్భాలన్నింటికీ వర్తించేవి. క్రమంగా ఈ తీర్పులు న్యాయసూత్రాల హోదా పొందాయి. అవి అలిఖిత రూపంలో ఉండి ఒక తరం నుంచి ఇంకొక తరం వారికి అందాయి. కాలక్రమంలో అవి లిఖిత రూపం ధరించాయి. ఆధునిక కాలంలో శాసనాలు ఆధారంగా న్యాయాధిపతులు ఇచ్చే తీర్పులు శాసనాల్లో అంతర్భాగమయ్యాయి. శాసనాలను అమలుపరిచే క్రమంలో న్యాయమూర్తులు వాటిని వ్యాఖ్యానించడం జరుగుతుంది. వారు శాసనాలలో చేతనంగా లేదా అచేతనంగా మార్పులు ప్రవేశపెడతారు. ఈ విధంగా న్యాయమూర్తులు ఇచ్చే తీర్పులు, చేసే నిర్ణయాలు, శాసనాలలో అంతర్భాగాలవుతాయి.

## 4. శాస్త్రీయ వ్యాఖ్యానాలు

ప్రముఖ న్యాయ శాస్త్రకోవిదులు, రచయితలు, విమర్శకులు చేసే వాఖ్యానాలు చట్ట నిర్మాణానికి ఆధారమవుతాయి. ఇవి అమలులో ఉన్న శాసనాలను అభివృద్ధి పరుస్తాయి. న్యాయ శాస్త్రజ్ఞులు గతంలో ఉన్న ఆచారాలు, నిర్ణయాలు, తీర్పులు, శాసనాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, దాని ప్రాతిపదికగా వారి తీర్పులను ప్రకటిస్తారు. చట్టాలను వ్యాఖ్యానించడం న్యాయస్థానాల విధి. ఈ వ్యాఖ్యానాలు, వివరణలు ప్రజలకు, ప్రభుత్వానికీ ఉపయోగపడుతాయి. న్యాయమూర్తులు అమలులో ఉన్న శాసనాలను చర్చించి, వ్యాఖ్యానించి వాటిలోని ప్రతిష్టంభనను తొలగిస్తారు. ఈ ప్రక్రియలో వారు శాసనాలు ఏవిధంగా ఉండాలి? సమాజంపై వాటి ప్రభావం ఎట్లా ఉంటుంది? అనే అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్త పరుస్తారు. వారి నిర్ణయాలు, అభిప్రాయాలు, తీర్పులు భవిష్యత్తులో శాసన నిర్మాణానికి మార్గదర్శకత్వం వహిస్తాయి.

## 5. సమత

అమలులో ఉన్న చట్టాలను, నాయ సూత్రాలను ఆధారంగా చేసుకొని న్యాయమూర్తులు తీర్పులు ఇస్తారు. దీనివలన ఒక్కోసారి అందరికీ సరైన న్యాయం జరగకపోవచ్చు. అటువంటి సమయాల్లో న్యాయమూర్తులు సమతాధర్మం పాటించి ఇచ్చే తీర్పులు కొన్ని న్యాయ నియమాలను సృష్టిస్తాయి. ఈ సమతా ధర్మ సూత్రాలు కాలక్రమేణా రాజ్యం గుర్తింపు పొంది శాసనాల మాదిరిగా అమలు అవుతాయి.

BRAOU

## 6. శాసన సభలు

ఆధునిక కాలంలో శాసన నిర్మాణంలో శాసన సభలు కీలక పాత్ర వహిస్తాయి. ప్రజాస్వామ్య దేశాలలో శాసనాలు ప్రజాభీష్టానికి ప్రతీకలు. ప్రజల అభీష్టం ప్రాతినిధ్య సంస్థలైన శాసన సభల ద్వారా వ్యక్తమవుతుంది. శాసన సభల ద్వారా శాసనాలు రూపొందుతాయి. శాసన సభలు రూపొందించే శాసనాలు గత సంప్రదాయాలు, అలవాట్ల స్థానాన్ని ఆక్రమించాయి.

భారతదేశం దాదాపు రెండున్నర శతాబ్దాలు బ్రిటిష్ ప్రభుత్వపాలనలో ఉండి, 1947లో స్వాతంత్ర్యం పొందింది. మనదేశం స్వతంత్రమైన తరువాత రాజ్యాంగాన్ని రూపొందించారు. భారత రాజ్యాంగంలో బ్రిటన్, కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, సోవియట్ యూనియన్, స్విట్జర్లాండ్ రాజ్యాంగంలోని అంశాలను పొందుపరిచారు.

భారతదేశం ధీర్ఘకాలం బ్రిటీష్ పరిపాలనలో ఉండడం చేత బ్రిటన్‌లోని సాంఘిక శాసనాలు, సాంఘిక సంక్షేమం, సాంఘిక భీమా, సాంఘిక భద్రతా కార్యక్రమాల ప్రభావం మన దేశంలోని సామాజిక శాసనాల మీద ఎక్కువగా ఉన్నది. దీనిని పురస్కరించుకొని వివిధ రంగాలలో సామాజిక శాసనాలను రూపొందించడానికి అవసరమైన నిర్దేశిక సూత్రాలను ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగంలో పొందుపరిచారు.

## భారత రాజ్యాంగ ప్రస్తావన

. భారతదేశ ప్రజలమైన మనము ప్రమాణ పూర్వకంగా భారతదేశాన్ని సంపూర్ణ సర్వతంత్ర ప్రజాస్వామిక రాజ్యంగా రూపొందించడానికి తీర్మానించినాము. భారతీయ పౌరులందరికీ ఏటిని సాధించి పెట్టవలెనని కూడా తీర్మానించినాము.

న్యాయం: భారతదేశ పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక రాజకీయ న్యాయాన్ని కలిగించడానికి.

స్వేచ్ఛ : ఆలోచనలను, భావ వ్యక్తీకరణను, నమ్మకాలను కలిగి ఉండడానికి, మత విశ్వాసాలను, దైవారాధనలకు అవసరమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కలిగిఉండడానికి.

సమానత్వం : అంతస్తులలోను, అవకాశాలలోను ప్రజలందరికీ సమానత్వాన్ని కలిగించడానికి

సౌభ్రాతృత్వం : దేశ ప్రజలందరి మధ్య సౌభ్రాతృత్వాన్ని అభివృద్ధి పరచి వ్యక్తి ఔన్నత్యాన్ని, దేశ సమైక్యతను కాపాడడానికి.

1949వ సంవత్సరం నవంబర్, 26వ తేదీన మన శాసన సభలో ఇప్పటినుంచి అనుసరించడానికి, శాసనాలు చేయటానికి ఈ రాజ్యాంగాన్ని మనకోసం మనమే సమర్పించుకున్నాం.

రాజ్యాంగ ప్రస్తావన అనేది రాజ్యాంగ ఉద్దేశాలను, అభిప్రాయాలను తెలయజేస్తుంది. మన రాజ్యాంగ ప్రస్తావనను పరిశీలించి చూస్తే ప్రజలందరికి సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని కలిగించడానికి, ఆలోచనలకు, భావవ్యక్తీకరణకు, నమ్మకాలకు, మతవిశ్వాసాలకు, దైవారాధనకు, అవసరమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కలిగించడానికి, దేశప్రజలందరి మధ్య సోదరభావాన్ని స్నేహ సహకారాలను అభివృద్ధి పరచి వ్యక్తి ఔన్నత్యాన్ని, దేశ సమైక్యతను కాపాడ డానికి ధృడంగా తీర్మానించు కొన్నట్లు మనకు స్పష్టమవుతుంది. అంతేకాక ఈ ముఖ్య అంశాల ప్రాతిపదికగా సామాజిక శాసనాలను నిర్మించడానికి తీర్మానించినట్లు కూడా స్పష్టమవుతున్నది.

మన రాజ్యాంగ ప్రస్తావనలోని ముఖ్యాంశాలనే నిర్దేశక సూత్రాలలోనూ, ప్రాథమిక హక్కులలోను, మరింత విపులంగా పొందుపరచడం, విశదీకరిండం జరిగింది. సామాజిక శాసనాలు రూపొందించడానికి తోడ్పడే ముఖ్యమైన ప్రాథమిక హక్కులను పరిశీలిద్దాం.

BRAOU

## ప్రాథమిక హక్కులు

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మూడు సూత్రాలమీద ప్రజా స్వామ్యం ఆధారపడి ఉంది. ఆ మూడింటిలో స్వేచ్ఛా సమానత్వాలను గురించి భారత రాజ్యాంగంలోని 3వ భాగంలో విపులంగా చర్చించినారు. ఈ భాగానికి ప్రాథమిక హక్కులని పేరు స్వేచ్ఛా సమానత్వాలు పౌరుని జీవితానికి అత్యంత అవసరమైనవి, ప్రధానమైనవి. అందువల్ల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పరిరక్షించడానికి చేసిన నిరంతర కృషి ఫలితమే ఈ ప్రాథమిక హక్కులు.

ఏవోకొన్ని సందర్భాలలో మినహా భారతీయ పౌరులకు లభించిన ప్రాథమిక హక్కులు రాజ్యం, ప్రభుత్వం, చర్యలకు హద్దులను నిర్ణయిస్తాయి. రాజ్యాధికారంనుంచి, ప్రభుత్వాధికారం నుంచి పౌరులకు రక్షణ కల్పించడానికి ప్రాథమిక హక్కులు ఉపయోగపడతాయి. ప్రాథమిక హక్కుల ద్వారా సామాజిక శాసనాల నిర్మాణానికి సంబంధించిన అంశాలు :

## సమానత్వపు హక్కు

రాజ్యం ఏవ్యక్తికీ చట్టం ముందు సమానత్వాన్ని, చట్టాలన్నింటి ద్వారా లభించే రక్షణలను ఇవ్వడానికి నిరాకరించరాదు.

ఏ పౌరుడు కూడా జాతి, మత, కుల, లింగ, జన్మస్థలాల కారణంగా గానీ, లేదా వీటిలో ఏ ఒక కారణంగా గానీ ఎట్లాంటి అశక్తతలకు, వివక్షకు, విధినిషేధాలకు గురికారాదు. అస్పృశ్యతను నిషేధించారు.

బానిసల వ్యాపారం, వెట్టిచాకిరీలను నిషేధించారు. ప్రభుత్వం జాతి మత కులం, వర్ణం మొదలైన కారణాలవలన ఉద్యోగుల పట్ల వివక్ష చూపరాదు. 14 సంవత్సరాలలోపు బాలలను గనులలోగానీ, కర్మాగారాలలో గానీ, ప్రమాదకరమైన పనులలో గానీ నియమించరాదు. సామాజిక నీతి, ప్రజారోగ్యం, పౌరుల క్రమశిక్షణలకు భంగమేర్పడని విధంగా, ఆధ్యాత్మిక భావాలను కలిగి ఉండానికి, ప్రచారం చేసుకోవడానికి సమానమైన హక్కు ఉంది. మతపరమైన సంస్థలను స్థాపించడానికి, నిర్వహించడానికి మత కార్యాలను తామే నిర్వహించడానికి, స్థిర, చరాస్తులను కలిగి ఉండడానికి హక్కు గలదు.

ప్రభుత్వం నిర్వహించే లేదా ప్రభుత్వ సహాయం పొందే విద్యా సంస్థలలో గానీ జాతి, మత, కుల, భాష రీత్యా గానీ ఏ పౌరునికి ప్రవేశం నిరాకరించకూడదు. మైనారిటీ వర్గాలు విద్యా సంస్థలు స్థాపించి నిర్వహించే హక్కు ఉన్నది.

విద్యా సంస్థలకు గ్రాంటులను మంజూరు చేసేటప్పుడు ఆ సంస్థ భాషా పరంగా గానీ, మత పరంగాగానీ మైనారిటీ వర్గాల ఆధ్వర్యంలో ఉన్నట్లయితే దాని పట్ల ప్రభుత్వం వివక్ష చూపరాదు.

## భారత రాజ్యాంగం - నిర్దేశక సూత్రాలు

భారత రాజ్యాంగంలో నాల్గవ అధ్యాయంలో ప్రభుత్వం, రాజ్యం అనుసరించవలసిన నిర్దేశిక సూత్రాలను వివరించడం జరిగింది రాజ్యాంగలోని 36 నుంచి 51వరకు గల ప్రకరణాలు నిర్దేశిక సూత్రాలను వివరిస్తాయి. ఈ సూత్రాలు భారతదేశంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల నిర్వహణకు సంక్షేమ రాజ్యాన్ని లక్ష్యంగా పేర్కొన్నాయి. వీటిని సక్రమంగా అమలు జరపడం ద్వారా సామాజిక పురోభివృద్ధి, దేశ శ్రేయస్సు, శ్రేయోరాజ్య స్థాపన వీటిని సాధించవచ్చునని చెప్పవచ్చు. వీటి ప్రకారం ప్రభుత్వం తన విధానాలను, ప్రణాళికలను రూపొందించి అమలు జరపాలి. ఈ నిర్దేశిక సూత్రాలు ప్రభుత్వం పాలనా విధానాన్ని రూపొందించడంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తాయి.

నిర్దేశిక సూత్రాల అవసరాన్ని గురించి ప్రసంగిస్తూ డాక్టర్ అంబేద్కర్ ఇవి శాసన సభలకు, ప్రభుత్వాలకు, భావి కార్యక్రమాన్ని గురించి, రాజ్యాంగ సభ నిర్ణయం చేసిన ఆదేశాలు అనీ, వీటిని పవిత్ర ఆశయాలుగా గుర్తించవలెననీ, వీటి పట్ల అశ్రద్ధ వహించరాదనీ, ప్రభుత్వం శాసనసభలలో రూపొందించే శాసనాలు ముఖ్యంగా సామాజిక శాసనాలని



BRAOU

చెప్పినాడు. ప్రజల సాంఘిక ఆర్థికాభివృద్ధి ద్వారా సంక్షేమ రాజ్య స్థాపనమే ఈ నిర్దేశిక సూత్రాల ముఖ్య ధ్యేయం.

ప్రజలకు సాంఘిక సంక్షేమాన్ని చేకూర్చడంలో భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకన్న, నిర్దేశికసూత్రాలు సమాజ వైయక్తికాభివృద్ధికి తోడ్పడితే నిర్దేశిక సూత్రాలు సమాజ సమష్టి సంక్షేమానికి, అభివృద్ధికి తోడ్పడతాయి. వ్యక్తుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే న్యాయస్థానాలు వాటిని పరిరక్షిస్తాయి. కానీ ప్రభుత్వం సవ్యంగా సమాజక్షేమాన్ని చేపట్టడం లేదనే అభిప్రాయం ద్వారా అమలు పరచడానికి వీలులేదు, కానీ ప్రజలు ప్రజాభిప్రాయం ద్వారా ప్రభుత్వాలు వీటిని అమలు జరిపేటట్లు చూడవలసి ఉటుంది. నిర్దేశిక సూత్రాలు ప్రభుత్వం ఏమిచెయ్యవలెనో సూచిస్తే, ప్రాథమిక హక్కులు ప్రభుత్వం ఏమి చేయకూడదో తెలియచేస్తాయి.

సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని ప్రజలందరికీ సమకూర్చడానికి భారత రాజ్యాంగంలో పొందుపరచిన కొన్ని ముఖ్యమైన నిర్దేశిక సూత్రాలు :

- స్త్రీ, పురుషులకు తగిన జీవనోపాధిని కల్పించాలి.
- ప్రజల సమిష్టి సంక్షేమానికి దేశ వనరులను వినియోగించాలి. దేశ సహజ సంపద, ఉత్పత్తి సాధనాలు ఏ కొద్ది మంది వ్యక్తుల ఆధిపత్యంలో కేంద్రీకృతం కాకుండా ఉండేటట్లు దేశ ఆర్థిక వ్యవస్థను రూపొందించాలి.
- కార్మికుల, స్త్రీ, పురుషుల, బాలల ఆరోగ్యం, శక్తి యుక్తులు వ్యర్థం కాకుండా చూడాలి. పౌరులు ఆర్థిక ఇబ్బందుల వలన తమ శక్తికి వయస్సుకు అననుకూలమైన వృత్తులలో చేరకుండా చూడాలి.
- గ్రామ పంచాయితీలను ఏర్పరచి స్థానిక స్వపరిపాలన సక్రమంగా పనిచేయడానికి దోహదం చేయాలి.
- రాజ్యం పౌరులకు విద్య నేర్పాలి, ఉపాధి కల్పించాలి, నిరుద్యోగులు, వృద్ధులు, రోగులు, అశక్తులు మొదలైన వారికి ప్రభుత్వం సహాయం అందించాలి.
- స్త్రీలకు ప్రసూతి సౌకర్యాలను కల్పించాలి.
- రాజ్యం పౌరులందరికీ ఒకవిధమైన సివిల్ కోడ్‌ను దేశమంతటా అమలుజరపాలి.
- బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్య బలహీన వర్గాలు, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల ప్రజల ఆర్థిక, విద్యా సంబంధమైన ప్రయోజనాలను రాజ్యం అభివృద్ధి పరచాలి. వారిని ఇతర వర్గాల దోపిడీ నుంచి రక్షించాలి.
- పుష్టికరమైన ఆహార ప్రమాణాలను పెంచడం, ప్రల జీవన ప్రమాణాలను అభివృద్ధి పరచడం, ప్రజారోగ్యాన్ని అభివృద్ధి పరచడం రాజ్యం తన ప్రథమ బాధ్యతగా గుర్తించాలి. ఆరోగ్యానికి హాని కలిగించే మద్యం, మత్తు పదార్థాల వాడకాన్ని నిషేధించాలి.
- వ్యవసాయాన్ని, పశు సంపదను అధునిక శాస్త్రీయ పద్ధతులపై అభివృద్ధి పరచాలి.
- పరిపాలనా వ్యవస్థ నుంచి న్యాయశాఖను వేరుపరచాలి. రాజ్యం ఈ క్రింది వాటిని అభివృద్ధి పరచడానికి కృషి చేయాలి.

ఎ) అంతర్జాతీయ రంగంలో శాంతి భద్రతలను పెంపొందించాలి.

బి) అన్ని దేశాలతో సత్సంబంధాలను పెంపొందించుకోవాలి.

సి) అంతర్జాతీయ న్యాయం పట్ల, సంధులపట్ల, ఒడంబడికల పట్ల గౌరవ భావంతో ఉండాలి.

డి) మధ్య వర్తిత్వం ద్వారా అంతర్జాతీయ వివాదాలను పరిష్కరించే విధానాలు ప్రోత్సహించాలి.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత రూపొందించిన్న సామాజిక శాసనాలన్నీ రాజ్యాంగంలోని నిర్దేశిక



BRAOU

సూత్రాలను అనుసరించి చేసినవే. అంతేకాక నిర్దేశిక సూత్రాలలో ఉదహరించిన అంశాలమీద కూడా సామాజిక శాసనాలు రూపొందించడం జరిగింది. మన రాజ్యాంగంలో నిర్దేశిక సూత్రాలను పొందు పరచడం మూలంగా రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన విధంగా సామాజిక శాసనాలను రూపొందిచడం ద్వారా సాంఘిక సంక్షేమానికి కృషి జరుగుతున్నదని చెప్పవచ్చు.

## 27.7 లాబీయింగ్

భారతదేశపు రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ విడివిడిగానూ, కలిసికట్టుగానూ సామాజిక శాసనాలను చేయటం, వాటిని అమలు పరచడం జరపవచ్చు. ఈ క్రింది రంగాలలో సామాజిక శాసనాలను కేంద్ర ప్రభుత్వం గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ చేయవచ్చు.

1. వివాహం, విడాకులు
2. సాంఘిక భద్రత, సాంఘిక బీమా
3. ఆర్థిక, సామాజిక ప్రణాళికలు
4. కార్మిక సంక్షేమం
5. దాన ధర్మాలు, మత సంస్థలు
6. దేశ దిమ్మరితనం, మానసిక ఆరోగ్యం

రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను, నిర్దేశిక సూత్రాలను రాజ్యాంగ ప్రస్తావనలో ఆశించినటువంటి శ్రేయోరాజ్య సంస్థాపనకు గాను పార్లమెంటు, రాష్ట్ర శాసన సభలు ఎన్నో సామాజిక శాసనాలను రూపొందిస్తాయి. ప్రభుత్వాలు అమలు పరుస్తాయి.

BRAOU

## 27.8 శాసన నిర్మాణం

చట్టం శాసనాలను శాసన సభలు రూపొందిస్తాయి. శాసన సభల అత్యంత ప్రధాన కర్తవ్యం. ప్రభుత్వ విధానాలను కచ్చితమైన రీతిలో ప్రభావితం చేస్తాయి. శాసనాలను రూపొందించునవి కనుక శాసన సభలకు శాసన నిర్మాణ శాఖ అని పేరు సార్థకమయింది. సాధారణంగా బిల్లులను సభలో ప్రవేశపెడతారు. వాటిని కూలంకషంగా చర్చిస్తారు. సవరణలతో గానీ, సవరణలు లేకుండా కూడా చట్టం నిర్దేశించిన పద్ధతిలో వాటిని ఆమోదిస్తారు. సాధారణంగా అన్ని ప్రజాస్వామ్య రాజ్యాల్లో ప్రతిబిల్లు మూడు సార్లు పఠించడం జరుగుతుంది. ఈలోగా వాటిని కాచివడపోసే రీతిలో అప్పుచెప్పడం జరుగుతుంది. ఒక్క కమ్యూనిస్టు దేశాల్లో మాత్రం పద్ధతి వేరు విధంగా ఉంది. అదేమంటే కమ్యూనిస్టు కేంద్రపార్టీ ఆదేశానుసారం రష్యాలో ప్రిసీడియం, చైనాలో స్టాండింగ్ కమిటీ మొదట బిల్లులను ఆమోదిస్తాయి. ఆ తర్వాతనే శాసన సభలు లాంఛనంగా ధృవీకరిస్తాయి. శాసన సభలు సమావేశంలో లేనపుడు ఏవైనా శాసనాలను అత్యవసరంగా ఏర్పాటు చేయవలసి వస్తే రాజ్యాధినేత ప్రత్యేకాజ్ఞలు, ఆర్డినెన్స్ జారీ చేస్తాడు. ఆ ప్రత్యేకాజ్ఞలు శాసన సభలు సమావేశమైన ఆరు వారాల్లోగా బిల్లుల రూపంలో చర్చించి ఆమోదిస్తాయి.

## 27.9 సామాజిక శాసనాలు - ప్రభుత్వం పాత్ర - ఆచరణ

ప్రతి సమాజంలోను కొన్ని సామాజిక సమస్యలుంటాయి. అయితే ఈ సమస్యలన్నీ అంత తీవ్రంగా ఉండకపోవచ్చు. కొన్ని సమస్యలు సమాజాన్ని కొంతవరకు కలవర పెడతాయి. మరికొన్ని సమస్యలు సమాజం మొత్తాన్ని పీడిస్తాయి. సాధారణంగా సమాజంలోని ప్రజలు అవాంఛనీయమని భావించే సామాజిక పరిస్థితిని సామాజిక సమస్యగా భావించడం జరుగుతుంది. సామాజిక సమస్యను నిర్ధారించిన తరవాత దానిని నివారించడానికి,

నిరోధించడానికి కృషి చేస్తారు. ఈ కృషిలో భాగంగా ప్రభుత్వం సామాజిక శాసనాలను రూపొందించి సమస్యా పరిష్కారానికి ప్రయత్నం చేస్తుంది. ఈ విధంగా సామాజిక సమస్యలు పరిష్కారానికి సామాజిక శాసనాలు ప్రధానమైన సాధనాలని చెప్పాలి. సమాజంలో అవాంఛనీయమైన పరిస్థితులను నిరోధించి, వాంఛనీయమైన పరిస్థితులను పెంపొందించడానికి శాసనాలు రూపొందిస్తారు.

సామాజిక శాసనం చేయడమనేది ప్రభుత్వానికి మాత్రమే పరిమితమైన ప్రత్యేక బాధ్యత. సామాజిక సమస్యలను పరిష్కరించడానికి, వాటిని నిరోధించడానికి ప్రభుత్వం శాసనాన్ని రూపొందించి, శాసన సభలలో ప్రవేశ పెట్టి దానిని చట్టంగా చేయవచ్చు. శాసన నిర్మాణం. దానిని అమలు పరచడం రెండూ ప్రభుత్వం ప్రత్యేక బాధ్యతలు అంటే శాసనం వెనక ప్రభుత్వ శక్తి, అధికారం ఉంటాయి. రూపొందించిన శాసనాన్ని ప్రభుత్వం తన అధికారంతో తన అధికారానికి లోబడిన ప్రాంతంలో అమలు జరుపుతుంది. శాసనాన్ని అమలు జరపడానికి ప్రభుత్వం ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించి శాసనాలను కట్టుదిట్టంగా అమలు జరపడానికి గాను వినియోగిస్తుంది. శాసనాన్ని ధిక్కరించిన వారిపై నిఘాఉంచుతూ అట్లా శాసనాలను ఉల్లంఘించిన వారిని శిక్షిస్తుంది. శాసన ధిక్కారం చేస్తే ప్రభుత్వ శిక్షకు గురి అవుతామనే భయంతో ప్రజలు శాసనానికి విధేయులుగా ప్రవర్తిస్తారు. అట్లా ప్రభుత్వం రూపొదించిన శాసనం తన అధికారాన్ని ప్రభుత్వం పటిష్టం చేసుకొని అమలు చేయగలిగినంతవరకు, శాసన ధిక్కారం చేసిన వారిని శిక్షించగలిగినంత వరకు సరిగా అమలులో ఉంటుంది. శాసన ధిక్కారం చేసిన వారిని శిక్షించగలిగిన స్థైర్యం ప్రభుత్వానికి లోపించినప్పుడు గానీ, శాసనాన్ని సక్రమంగా అమలు చేయడానికి తగినంత ప్రభత్వ సిబ్బంది ప్రభుత్వానికి లేనపుడు గానీ, లేదా ఆ సిబ్బందిని నియమించి పోషించడానికి అవసరమైన నిధులు లోపించినపుడు గానీ శాసనము అమలులో ఉండదు. శాసనాలలోనే కొన్ని లోపాలు ఉండడం, ఒక ప్రాంతపు పరిస్థితులకు ఇతర ప్రాంతాల పరిస్థితులకు తేడాలు ఉండడం, వీటి వల్ల చట్టం ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా లేకపోవడం, చట్టాన్ని అమలుచేయడంలో బాధ్యత గల అధికారులు చిత్తశుద్ధితోను, సమర్థవంతంగానూ పని చేయక పోవడం వలన, శాసనాలు సమాజంలో సక్రమంగా అమలులో ఉండకపోవచ్చు. దీనవలన శాసనం ప్రయోజనం ప్రజలకు చేకూరదు.

సామాజిక శాసనాలను కొంతమంది స్వార్థపరులు ఎల్లప్పుడూ ఉల్లంఘిస్తూ ప్రభుత్వానికి, సమాజానికి వ్యతిరేకంగా పనిచేస్తూ ఆశాసనాలను ఉల్లంఘించమని ఇతరులను కూడా ప్రోత్సహిస్తుంటారు. కాబట్టి శాసనాలను రూపొదించడంతో ప్రభుత్వం తన బాధ్యత తీరిపోయినట్లుగా భావించరాదు. ప్రభుత్వం రూపొందించిన శాసనాలను కట్టుదిట్టంగా అమలు పరచాలి. అప్పటికి కాని శాసనం ధ్యేయం నెరవేరి సామాజిక శ్రేయస్సు నెరవేరదు.

BRAOU

అరిస్టాటిల్ మంచి ప్రభుత్వాన్ని ఈ విధంగా నిర్వచించినాడు. ఒక ప్రభుత్వం మంచిదని చెప్పాలంటే అది రెండు ప్రధాన లక్షణాలను కలిగి ఉండాలి అవి :

1. చట్టాల పట్ల పౌరులు అచంచలమైన విధేయతను కనబరచాలి.
2. చట్టాల ద్వారా సామాజిక శ్రేయస్సును సాధించాలి.

మంచినడతగల వ్యక్తులు, మంచి చట్టాలు ఈ రెండూ సాధారణ ప్రజల సంక్షేమానికి తోడ్పడి వర్ధిల్లిన సమాజాన్ని శ్రేష్ఠమైన సమాజమని కూడా అరిస్టాటిల్ పేర్కొన్నాడు.

సామాజిక శాసనాలను అమలు పరచడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగం సామాజిక సమస్యల నియంత్రణకు నివారణకు తోడ్పడుతుంది. సామాజిక అవ్యవస్థ, సామాజిక సమస్యలను నిర్మూలించి, నిరోధించడానికి కేవలం సామాజిక శాసనాలను రూపొందించడంతోనే ప్రభుత్వ బాధ్యత తీరిపోదు. ప్రభుత్వం రూపొందించిన శాసనం పట్ల దేశంలోని అధిక సంఖ్యాక ప్రజలు అయిష్టత కనబరచినప్పుడు ఆశాసనం ప్రయోజనం శూన్యమని చెప్పవచ్చు. అందు చేత సమాజంలోని అధిక సంఖ్యాక ప్రజలు ప్రభుత్వం రూపొందించిన శాసనాలు తమ సంక్షేమం కోసమే అని భావించాలి. ప్రభుత్వం రూపొందించిన శాసనాలు తమ సంక్షేమం కోసమేనని, శాసనాలను అనుసరిస్తే తమకు లాభం చేకూరుతుందని ప్రజలు విశ్వసించేటట్లు ప్రచారం కొనసాగాలి. సామాజిక సమస్యలకు సంబంధించిన విజ్ఞానాన్ని

విద్యా సంస్థలు, తదితర సంస్థల ద్వారా ప్రజలకు అందజేసి, వారి విలువలలో, దృక్పధాలలో పరివర్తన కలిగించాలి. దానితో పాటు సామాజిక శ్రేయస్సుకు తోడ్పడే వ్యక్తులను, స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించాలి. దీనివలన శాసనాలు తమ శ్రేయస్సుకే ననే విశ్వాసం ప్రజలలో ఏర్పడిననాడు ప్రభుత్వం రూపొందించిన శాసనాలను ప్రజలు ఆమోదించి వాటిని స్వచ్ఛందంగా అనుసరిస్తారు. అందుచేత ప్రభుత్వం సామాజిక శ్రేయస్సును పెంపొందించే విషయాలపైన మాత్రమే శానసనాలను రూపొందించవలసి ఉంటుంది. రూపొందించిన శాసనాలను కట్టుదిట్టంగా అమలు పరచినపుడే, శాసనాలు విజయవంతంగా అమలు జరిగి మంచి ప్రయోజనాన్ని సాధిస్తాయి.

## 27.10 ముగింపు

సమాజం తాను స్వయంగా రూపొందించుకున్న కట్టుబాట్ల ప్రకారం సమాజ అభివృద్ధికి తోడ్పడుతుంది. ఈ కట్టుబాట్లే శాసనాల రూపంలో తయారవుతాయి. సమాజం ఆమోదించిన ప్రవర్తనా విధానాలను, ఆచారాలు, కట్టుబాట్లు, రీతి రివాజులుగా పిలుస్తారు. సమాజానికి అవసరాలు పెరిగినక్రమంలో సామాజిక శాసనాలు పుట్టాయి. శాసనమంటే కొన్ని నియమ నిబంధనల అల్లిక అని చెప్పవచ్చు. శాసనమంటే న్యాయ సూత్రాలను, చట్టాలను నిర్మాణం చెయ్యడం. ఇంకోవిధంగా చెప్పాలంటే వ్యక్తుల సమస్యలను పరిష్కరించడానికి, వివాదాలను పరిష్కరించడానికి సబంధించిన నిర్ణయాలను తీసుకునే విధానం శాసనం. ఆధునిక సమాజాలలో సామాజిక నియంత్రణకు ముఖ్యసాధనాలు శాసనాలు. సమాజాన్ని నిర్వహించే రాజ్యం లేదా ప్రభుత్వం ఆశయాలను, అభీష్టాలను శాసనాలు వ్యక్తీకరిస్తాయి. చట్టరూపకల్పనకు కొన్ని సాంప్రదాయాలు ఆధారభూతంగా ఉంటాయి. సమాజం ఏర్పరచుకున్న ఆచారాలు, కట్టుబాట్లు తదనంతర పరిమాణంలో శాసనాలుగా రూపొందాయి. భారత రాజ్యాంగంలో కొన్ని ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కులు పొందుపరిచారు. వీటి అమలుకు 'లాబీయింగ్' ఉంది.

## 27.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి?

1. సామాజిక శాసనాల ఆవిర్భావం గురించి వివరించండి?
2. సామాజిక శాసనాల లక్షణాలను పేర్కొనండి?
3. లాబీయింగ్ గురించి రాయండి?

I. ఈక్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. శాసనాలు,- భావన గురించి రాయండి?
2. చట్టరూపకల్పన గురించి పేర్కొనండి?
3. శాసనాల ఆచరణలో ప్రభుత్వం పాత్రను పేర్కొనండి?

## 27.12 చదవదగిన పుస్తకాలు

1. M. Venkatarangaiah : Welfare State and Social State

BRAOU

# ఖండం- IX

## స్వచ్ఛంద కార్యాచరణ: ఎన్.జి.వోలు

సామాజిక సమస్యలు ఎదురైనప్పుడు ఎవరు స్పందించాలి. కేవలం ప్రభుత్వమే ముందుకు రావాలా? మరి ప్రభుత్వం దృష్టికి సమస్యను ఎవరు తీసుకుపోవలి? నిజానికి సామాజిక సమస్యలను గుర్తించి విశ్లేషించే బాధ్యత అందరిదీ. వ్యక్తిగతంగా ఎవరికి వారు కాకుండా సామూహికంగా, కలిసికట్టుగా ఈ బాధ్యత నిర్వహించడం, సమస్యల పరిష్కారానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం అవసరం.

ఇలా స్వచ్ఛందంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సంస్థలనే పౌర సమాజం అని, స్వచ్ఛంద సంస్థలు అని, ఎన్.జి.వోలు లేదా ప్రభుత్వేతర సంస్థలు అని అంటున్నారు. ప్రభుత్వేతర సంస్థలు వాటికవి సమస్యల్ని పరిష్కరించడంతోపాటు ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా కూడా వ్యవహరిస్తున్నాయి. ఈ అంశాలు ఈ ఖండంలోని రెండు భాగాలలో వివరించడం జరిగింది. అవి:

**భాగం-28:** స్వచ్ఛంద కార్యాచరణ-స్వచ్ఛంద సంస్థలు

**భాగం-29:** ప్రభుత్వేతర సంస్థలు-ప్రభుత్వ అన్యోన్య చర్యలు

BRAOU

BRAOU

# భాగం-28: స్వచ్ఛంద కార్యాచరణ-స్వచ్ఛంద సంస్థలు

విషయక్రమం


28.0 ఉద్దేశాలు

28.1 పరిచయం

28.2 స్వచ్ఛంద కార్యాచరణ నిర్వచనం

28.3 స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వచనం

28.4 స్వచ్ఛంద సేవా సంస్థలో రకాలు

28.5 స్వచ్ఛంద సేవాసంస్థల చారిత్రక అభివృద్ధి

28.6 స్వచ్ఛంద సేవాసంస్థలలో కొన్ని ముఖ్య లక్షణాలు

28.7 ప్రయోజనాలు

28.8 భారతదేశంలో స్వచ్ఛంద సేవా సంస్థలు

28.9 భవిష్యత్తులో స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర

28.10 ముగింపు

28.11 మాదిరి పరీక్ష ప్రశ్నలు

28.12 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 28.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- స్వచ్ఛంద సంస్థలను నిర్వచించగలుగుతారు.
- భారత దేశంలో స్వచ్ఛంద సంస్థలు వాటి పాత్రను వివరించగలుగుతారు.
- భవిష్యత్తులో వాటి ప్రాధాన్యతను అధ్యయనం చేస్తారు.

## 28.1 పరిచయం

రెండవ ప్రపంచయుద్ధ [illegible] ఇంగ్లాండ్, అమెరికా స్వచ్ఛంద సంస్థల ఏర్పాటు విషయంలో అత్యంత శ్రద్ధ చూపించాయి. ఇంగ్లాండ్ సంక్షేమ రాజ్య స్థాపన ప్రధానాశయంగా పెట్టుకుని ప్రభుత్వ కార్యనిర్వహణ క్రింద అనేక సంస్థలను స్థాపించినప్పటికీ చారిత్రిక కాలం నుంచి స్వచ్ఛంద సంస్థలు సాంఘిక సంక్షేమరంగంలో ప్రధాన పాత్ర వహించడం వలన వాటికి ప్రాముఖ్యతనిచ్చి ప్రోత్సహించడం జరుగుతున్నది. స్వాతంత్ర్యాసముపార్జనానంతరం భారతదేశంలో కూడా ఈ రకమైన సాంఘిక చైతన్యం కనిపిస్తున్నది.

మనదేశంలో [illegible] సంప్రదాయ సిద్ధంగా నడుపబడుతూ వస్తున్నాయి. ఒకప్పుడు కరువు కాలంలో [illegible] పోషించడం, వికలాంగులకు సహాయపడటం మొదలైన సహాయ కార్యక్రమాలను [illegible] స్వచ్ఛందంగా నిర్వహించడం జరుగుతుండేది. మహ్మదీయులు తమ

అయిదవ వంతు ఆదాయాన్ని సమాజంలో దిక్కులేక ఇతరులపై ఆధారపడి జీవించే వ్యక్తుల నిమిత్తం ఖర్చు చేసేవారు. పార్టీలు పంచాయితీల ద్వారా లేదా ప్రత్యేక స్వచ్ఛంద సంక్షేమ సంస్థలను స్థాపించి వాటి ద్వారా సమిష్టి కుటుంబాల ద్వారా ఈ సమస్యలను చాలా వరకు పరిష్కరించ గలిగింది. అంతేకాక బ్రిటీష్ వారి వలస విధానం వల్ల క్రైస్తవ మిషనరీ వ్యవస్థతో పాటు ప్రపంచ ఆర్థిక ధృక్పథంలో మార్పులు కలగడం వలన మనదేశ సాంఘిక వ్యవస్థలో విప్లవాత్మక మైన మార్పులు రావడం ప్రారంభమయింది. దానితో సమాజంలో రాజారామ్ మోహనరాయ్, ఈశ్వర చంద్రవిద్యాసాగర్, దయానంద సరస్వతి, కందుకూరి వీరేశలింగం మొదలయిన సంఘ సంస్కర్తలు బయలుదేరి ఉద్యమాలను లేవదీసినారు. తత్ఫలితంగా దేశంలో అనేక ధర్మసంస్థలు, సేవా సంస్థలు వెలసినాయి. ఈ సంస్థలు సమస్యాపూరితమయిన అన్ని రకాల రంగాలలోనూ నిస్వార్థంగా ప్రజలకు సేవచేస్తున్నాయి.

స్వయం సహాయం, పరస్పర సహాయం వంటి ముఖ్య సూత్రాలపై ఆధారపడి స్థానికావసరాలను సమకూర్చుకోవడానికి స్థానిక సామాజిక సమస్యలను పరిష్కరించడానికి, ప్రజలు నిర్వహించే వ్యవస్థిత స్వచ్ఛంద సేవాకార్యక్రమాల అవసరం ప్రజాస్వామ్య దేశాలలో ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో అభిలషించదగింది. సామాజిక విధానాల రచనలోను, వాటిని అమలు పరచడంలోను ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల నిర్మాణాత్మక భాగస్వామ్యం, ప్రజాస్వామ్య సోషలిస్ట్ శ్రేయోరాజ్య సిద్ధాంతాల విజయానికి చాలా ముఖ్యమైనది.

## 28.2 స్వచ్ఛంద కార్యాచరణ నిర్వచనం

స్వచ్ఛంద సేవా సంస్థలు అపదలో చిక్కుకున్న ప్రజలకు, భూకంపాలు, వరదలు, అంటువ్యాధులు, కరువుకాటకాల వంటి అత్యవసర సమయాలలో, సహాయక చర్యలు అందించటంలో అనాదిగా ప్రముఖ పాత్ర వహిస్తున్నవి. శతాబ్ది కాలంనాటి సేవాసంస్థలు కూడా కొన్ని ఉన్నవి. స్వాతంత్ర్యానికి పూర్వం స్వచ్ఛంద సంస్థలు నిధులను సేకరిస్తూ సమాజ సంక్షేమానికి వాటిని ఉపయోగించటంలో ఎంతో కృషి చేశాయి. భారత ప్రభుత్వం స్వాతంత్ర్య సముపార్జనానంతరం సాంఘిక సంక్షేమ రంగం వైపు దృష్టి మరల్చింది. 1947వ సంవత్సరం పూర్వార్థం వరకు ఈరంగం స్వచ్ఛందసంస్థల అజమాయిషీ కిందనే ఉండేది. మనదేశం సంక్షేమ రాజ్య స్థాపన ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నది.

BRAOU

గతకాలంలో సాంఘిక సంక్షేమ కృషి నిమిత్తమై ప్రభుత్వం తోడ్పాటు ఉన్నా లేకపోయినా స్వచ్ఛంద సంస్థలు నామ మాత్రంగా తమ కృషిని కొనసాగించాయి. కానీ ప్రస్తుత కాలంలో ప్రభుత్వం తనంతటతాను ప్రత్యక్షంగా సంక్షేమ రంగంలో కొన్ని కొత్త కార్యక్రమాలను చేపట్టడం, స్వచ్ఛంద సంస్థలకు ఆర్థిక సహాయం చేయడం ఎక్కువగా కన్పిస్తున్నది.

భారత ప్రభుత్వం ప్రజాస్వామ్య, సామ్యవాద మార్గంలో పయనిస్తూ సంక్షేమ రాజ్యాన్ని స్థాపించాలనే మహత్తరమైన ఆశయంతో ఉంది. అందువల్ల ప్రభుత్వపరమైన, స్వచ్ఛంద సంస్థల పరమైన అన్ని రకాల సంక్షేమ చర్యలు, ప్రయత్నాలు ఆ ఆశయం ఫలించడం కోసం సాగించే పయనంలో అడ్డుగా నిలిచిన సాంఘిక సమస్యలు లెక్కలేనన్ని వాటిని ఎదుర్కొనడానికి మనకున్న అవకాశాలు, సాధన సంపత్తులు చాలా తక్కువ. కాబట్టి ఈ సమస్యల పరిష్కారానికి ప్రజా సహకారం ప్రభుత్వానికి అవసరం. ఈ సమస్యలు పరిష్కరించడానికి స్వచ్ఛంద సంస్థల సహాయ సహకారాల అవసరం ఎంతైనా ఉంది. స్వచ్ఛంద సేవా సంస్థలు మానవతా దృక్పథంతో కూడి ఉండడం వలన సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టగలవు.

మనదేశ చరిత్రలో సాంఘిక సేవ అనేది అనాదిగా ఏదో ఒక రూపంలో కనిపిస్తూనే ఉంది. ఆదిమజాతులలో కూడా తమ స్వజాతీయతను కాపడుకోవడానికి బలహీనులను రక్షించడం ద్వారా స్వచ్ఛంద సేవా ప్రయత్నాలు గోచరిస్తున్నాయి.

పూర్వ గ్రామ పంచాయితీలు, ఉమ్మడి కుటుంబాలు వృద్ధులకు, బలహీనులకు రక్షణ కల్పిస్తుండేవి. పేద ప్రజలకు అన్నదానాలు చేయడం, శరణార్థులను ఆదుకోవడానికి వసతి సౌకర్యాలను కల్పిస్తూ ధర్మశాలలను

కట్టించడం మొదలయిన ప్రకార్యాలన్నీ అనాదిగా స్వచ్ఛంధ సంస్థలు మనదేశంలో ఉన్నవని చెప్పడానికి నిదర్శనంగా పరిగణించవచ్చు.

దాతృత్వ భావనే కాకుండా సేవా సంకల్పానికి మతం కూడా ఎంతో దోహదపడింది. అనేక మతాలలో మతస్థులు అవసరాలలోను, చిక్కులలోను ఉండే వారిని ఆదుకునేవారు. ముఖ్యంగా క్రైస్తవ మిషనరీలు ఈ సేవా ప్రకార్యాలలో మన దేశ సాంఘిక జీవనంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషించాయి. మానవసేవయే మాధవ సేవ అనే భావనతో అనాధశరణాలయాను, కుష్టు శరణాలయాను స్థాపించి నడపడంలో హర్షించతగ్గ పాత్ర వహించారు. 1905లో ప్రారంభింపబడిన సర్వెంట్ ఆఫ్ ఇండియన్ సొసైటీలో మాతాతీత సాంఘిక సేవ మనదేశంలో ఉద్భవించింది.

## 28.3 స్వచ్ఛంద కార్యాచరణ-స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వచనాలు

బ్రిటీష్ శ్రేయోరాజ్య నిర్మితికి కర్తఅయిన లాల్ బివరిడ్జ్ ప్రభుత్వ నిర్దేశకత్వం గానీ, నియంత్రణగానీ లేని చర్యను ఐచ్ఛిక కార్యచరణ లేక స్వచ్ఛంద చర్య అని పేర్కొన్నాడు. బయటి శక్తుల ప్రయేయం లేకుండా ప్రజలు తమ స్వేచ్ఛా సంకల్పంతో చేసే చర్యే స్వచ్ఛంద చర్య. కొందరు వ్యక్తులు వ్యక్తిగతంగా గానీ, సాముహికంగా గానీ, స్వేచ్ఛా సంకల్పంతో గానీ, బాహ్య నియంత్రణ, మార్గ దర్శకత్వం లేకుండా తమంతట తాముగా ఐచ్ఛికంగా చేసే సాంఘిక సేవా ధృక్పధమే స్వచ్ఛంద చర్య.

స్వచ్ఛంద చర్య వ్యవస్థిత రూపమే స్వచ్ఛంద సంస్థ.

లార్డ్ బివరిడ్జ్ స్వచ్ఛంద చర్య అనే నివేదికలో స్వచ్ఛంద సేవా సంస్థ అంటే ఏమిటో ఇలా చెప్పాడు. బయటివారి అధికారానికి లోబడకుండా తన సొంత సభ్యుల చేత స్థాపితమై నడిచే దానిని స్వచ్ఛంద సేవా సంస్థ అని వ్యవహరించవచ్చు.

ప్రభుత్వ సేవా సంస్థలకు, స్వచ్ఛంద సేవా సంస్థలకు కొన్ని తేడాలున్నాయి. ప్రభుత్వ సేవా సంస్థలలో పై అధికారుల పర్యవేక్షణ, నియంత్రణ ఎక్కువగా ఉంటుంది. సేవా సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వర్తించడంలో స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యుల వలె తగినంత స్వతంత్రం ఉండదు. ప్రభుత్వ సేవా సంస్థలలో స్వచ్ఛంద సేవా సంస్థల కున్నంత మానవతా దృక్పధం ఉండదు. తక్షణ సదుపాయాలు కల్పించడంలో కూడా స్వచ్ఛంద సంస్థలు చేయగలిగినంత ప్రతిభా వంతంగా ప్రభుత్వ సేవా సంస్థలు చేయలేవు.

BRAOU

## 28.4 స్వచ్ఛంద సేవా సంస్థల రకాలు

స్వచ్ఛంద సేవా సంస్థలు రెండు రకాలు :

1. ప్రభుత్వ సహాయం లేకుండా నడిచే సంస్థలు
2. ప్రభుత్వ గ్రాంటుతో నడిచే సహాయ సంస్థలు

ప్రభుత్వ సహాయక గ్రాంటులను ఉపయోగించుకుంటున్న స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ నియమాలకు, నిబంధనలకు లోబడి తమ విధానాలను, కార్యక్రమాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. ఈ సంస్థలపై ప్రభుత్వ నియంత్రణ పరోక్షంగా ఉంటుంది.

ప్రభుత్వ సహాయం పొందని సేవా సంస్థలలోని వ్యక్తులు ఆర్థిక వనరులను పెంపొందించుకుని, వీలైనంతవరకు ఇతర సంస్థలపై గానీ, ప్రభుత్వం పై గానీ ఆధారపడకుండా, సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. అందువల్ల ఇందులో ఉన్న సభ్యులు బయటవారి అధికారానికి లోబడవలసిన అవసరం లేదు. సేవా కార్యక్రమాలను నిర్వర్తించడంలో సభ్యులందరికీ సంపూర్ణ స్వేచ్ఛ ఉంటుంది.

## 28.5 స్వచ్ఛంద సేవా సంస్థల చారిత్రికాభివృద్ధి

బ్రిటన్, అమెరికా దేశాలతో పోల్చి చూస్తే మనదేశంలో స్వచ్ఛంద సంస్థల సంఖ్య చాలా తక్కువ. మనదేశం ఎక్కువ కాలం పరదేశీయుల పాలనలో ఉండడమే దీనికి ముఖ్యమైన చారిత్రక కారణం ఈ కారణంగా స్వచ్ఛంద సంస్థల ఉనికికి, అభివృద్ధికి ముఖ్యమైన స్వేచ్ఛావాతావరణం చాలా కాలంవరకు లోపించింది. దీనికి తోడు మనదేశం నిరంతర సంఘర్షణలకు గురికావడం వల్ల సామాజిక జీవనంలో శాంతిస్థిరత్వాలు లోపించినాయి. అందువల్ల మనదేశంలో ఇరవైయవ శతాబ్ది ప్రారంభం వరకు స్వచ్ఛంద సంస్థల అభివృద్ధి శీఘ్రంగా సాగలేదు మతపరమైన మరొక కారణం కర్మ సిద్ధాంతం. ఈ సిద్ధాంతాన్ని పురస్కరించుకొని మనదేశంలో మానవ విపత్తులను, సాంఘిక సమస్యలను మానవగత జీవిత కర్మ ఫలితాలకు ముడివేయడం జరిగింది. ఈ కారణంగా మనదేశంలో సామాజిక సమస్యలకు గురిఅయిన వారికి దాన ధర్మాల ద్వారా తాత్కాలిక ఉపశాంతిని అందజేయడం జరిగింది, కానీ, ప్రాచీన కాలంలో ఈ సమస్యల నివారణకు సంస్థాగత రూపంలో స్వచ్ఛంద సంస్థలు ఏర్పడలేదు.

మన సమాజంలో ఉమ్మడి కుటుంబం, గ్రామీణ సముదాయం, ఆపదలో ఉన్నవారిని ఆదుకొని సామాజిక అవ్యవస్థ పరిస్థితులను అరికట్టడంలో ప్రధాన పాత్ర వహించినాయి. మనదేశం ఎక్కువభాగం గ్రామీణ సముదాయాలతో కూడి ఉండడం చేత, ప్రజలలో ఎక్కువగా నిరక్షరాస్యత అమాయకత్వం ప్రబలి ఉండడం చేత, స్వచ్ఛందసంస్థల స్థాపనకు అవసరమైన సామాజిక చైతన్యం లోపించింది. పైగా మనదేశంలో పారిశ్రామికీకరణం, నగరీకరణం మొదలైన ప్రక్రియలు కూడా పాశ్చాత్యదేశాలకన్నా చాలా ఆలస్యంగా ప్రారంభం కావడం వలన సామాజిక సమస్యల ఒత్తిడికూడా నిన్న మొన్నటి వరకు చాలా అల్పంగా ఉండేది. పై కారణాలన్నింటి మూలంగా పూర్వ కాలంలో మనదేశంలో స్వచ్ఛంద సంస్థల అభివృద్ధి అంతగా జరగలేదు.

చారిత్రిక పరిశీలనాధ్యాయంలో పేర్కొన్న మధుకరి, జిజమాని, సముదాయిక భోజనశాల, మత సంబంధమైన ఆరామాలు మొదలైనవి మన ప్రాచీన స్వచ్ఛంద సేవలకు ఉదాహరణలు. మనదేశంలో బ్రిటీష్ వారి పాలన ప్రారంభమయ్యేవరకు సంస్థాగతమైన స్వచ్ఛంద సేవల స్థాపన జరగలేదు. బ్రిటీష్ వారి కాలంలోనే క్రైస్తవ మిషనరీలు మతపరమైన స్వచ్ఛంద సేవా సంస్థలను ప్రవేశ పెట్టాయి. ఈ కాలంలోనే ప్రవేశపెట్టిన ఇంగ్లీషు చదువులు మన దేశీయులలో ఉదారవాదం, హేతువాదం, ప్రజాస్వామ్యం మొదలైన భావాలను రేకెత్తించి, మన సామాజిక సమస్యలలో చైతన్యం తీసుకు రావడానికి ఎంతో తోడ్పడినాయి. పై కారణాలన్నిటి సంచిత ప్రభావం వలన పంతొమ్మిదవ శతాబ్ది ఆరంభం నుంచి మనదేశంలో స్వచ్ఛంద సేవా సంస్థల అభివృద్ధి ప్రారంభమయింది.

పంతొమ్మిదవ శతాబ్దికి పూర్వకాలంలోనే గోవా, కేరళ, బెంగాల్ మొదలైన రాష్ట్రాలలో క్రైస్తవ మిషనరీల వారు విస్తృతమైన సేవా సంస్థలను స్థాపించినారు. వీరిని అనుకరించి మనదేశంలో వివిధ మతాల వారు సాంఘిక సేవా నిర్వహణకు పంతొమ్మిదవ శతాబ్ది ఆరంభంనుంచి సంస్థలను నెలకొల్పడం ఆరంభించినారు. ఇట్లాంటి వాటిలో దార్-ఉల్-ఉలేమా, ముస్లిం విద్యాసంఘం మొదలైనవి మహమ్మదీయ మతస్తులకు ముఖ్యమైనవి అట్లాగే సిక్కుమతస్థులు కూడా సిక్కుల విద్యా సమావేశం వంటి సంస్థలను స్థాపించినారు. సాంఘిక సేవారంగంలో మనదేశంలో ముందంజవేసినారు. పార్శీలు స్థాపించిన వాటిలో బాంబే దేశీయ విద్యా సంఘం, ఉద్యోగావకాశాల బ్యూరో, వృత్తిమార్గదర్శకత్వ బ్యూరో మొదలైనవి ముఖ్యమైనవి. పార్శీలు మనదేశంలో బ్రిటన్, అమెరికా దేశాల సాంఘిక సేవారంగంలో ప్రముఖ పాత్ర వహించిన ఛారిటీ ఆర్గనైజేషన్స్ సొసైటీ వంటి సమన్వయ పరిషత్తును ప్రప్రథమంగా 1919లో నెలకొల్పినారు.

రాజారామ్ మోహన్ రాయ్ ప్రారంభించిన మత సంస్కరణోద్యమం మన దేశంలో అనేక స్వచ్ఛంద సేవా సంస్థల స్థాపనకు కారణభూతమయింది. రామమోహన్‌రాయ్ తన సంస్కరణోద్యమంతో బాటు కొన్ని విద్యా సంస్థల స్థాపనకు కూడా కృషి చేసినాడు. తరువాతి కాలంలో బ్రహ్మసమాజం వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టింది. అట్లాగే దయానంద సరస్వతి స్థాపించిన ఆర్య సమాజం, స్త్రీ విద్యను ప్రోత్సహించడానికి విద్యా సంస్థలను, యువకులలో విద్యా, సాంస్కృతిక కళాభిరుచులను పెంపొందించడానికి ఆర్యవీరదళాలను స్థాపించింది. సాంఘిక సేవా నిర్వహణ ప్రధానాంశంగా గల వాటిలో వివేకానందుడు స్థాపించిన రామకృష్ణామిషన్ చాలా ముఖ్యమైనది. ఈ సంస్థ దేశ

BRAOU

వ్యాప్తంగా విద్యా వైద్య సంస్థలను, అనాథ శరణాలయాలను స్థాపించి మంచిపేరు సంపాదించుకున్నది. జాతీయోద్యమం ప్రబలిన తరవాత స్వచ్ఛంద సేవా సంస్థల స్థాపనకు గొప్ప కృషి చేసిన రాజకీయ నాయకులలో గాంధీజీ ఒకరు. గాంధీజీ కృషి ఫలితంగా నెలకొల్పినవే హరిజన సేవక సంఘం, నయీతాలిమీ సంఘం, కుష్ఠురోగుల సంఘం మొదలైన సంస్థలు.

1953లో కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డు స్థాపనతో స్వచ్ఛంద సేవా సంస్థల చరిత్రలో నూతనాధ్యాయం ప్రారంభమయిందని చెప్పవచ్చు. ఈ సంస్థ స్థాపనలోని ముఖ్యోద్దేశం స్వచ్ఛంద సేవా సంస్థలకు ప్రభుత్వ సహాయక గ్రాంటుల ద్వారా ప్రోత్సాహాన్ని ఇవ్వడమే. వివిధ ప్రాంతాలలోని సేవావసరాలను ఆ ప్రాంతాలలోని ప్రజల కోర్కెలను, నెలకొల్పిన స్వచ్ఛంద సంస్థల పరిస్థితులను పర్యావలోకనం చేసి తదనుగుణంగా సంక్షేమ యోజన చేయవలసిన బాధ్యత ఈ సంస్థకు అప్పు చెప్పినారు. ఈ సంస్థ చేసిన ప్రశంసనీయమైన కృషివల్ల దేశమంతటా వివిధ రంగాలలో స్వచ్ఛంద సేవా సంస్థల సంఖ్య గణనీయంగా పెరిగింది.

## 28.6. స్వచ్ఛంద సేవా సంస్థల కొన్ని ముఖ్య లక్షణాలు

ప్రజలు ఇచ్ఛికంగా ఇచ్చిన విరాళాలతో, దాన ధర్మాలతో లేదా సభ్యుల చందాలతో సాంఘిక సేవా నిర్వహణ నిమిత్తం నెలకొల్పిన సంస్థలు స్వచ్ఛంద సేవా సంస్థలు. స్వచ్ఛంద సంస్థల ఆర్థిక స్థితికి ప్రజల ఐచ్ఛిక ధన సహాయమే కారణం అయితే స్వచ్ఛంద సంస్థల ఆర్థిక వనరులలో ప్రభుత్వ గ్రాంటుల పాత్ర క్రమంగా పెరుగుతున్నది. అంత మాత్రాన స్వచ్ఛంద సంస్థల వాటి ప్రతిపదిక స్వభావాన్ని ... కోల్పోవడం సమంజసం కాదు. స్వచ్ఛంద సంస్థల స్వభావాన్ని, లక్షణాలను ఈ క్రింది విధంగా వర్ణించవచ్చు.

### 1. ప్రజాసహభాగిత

ప్రజలు స్వేచ్ఛా సంకల్పంతో సామాజికాభివృద్ధికి సాంఘిక సమస్యా పరిష్కారానికి పూనుకొనడం అనేది స్వచ్ఛంద సంస్థల ప్రత్యేక లక్షణం. ఈ రకమైన ప్రజా సహకారం ప్రజాస్వామ్య వ్యవస్థల విజయానికి, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో చాలా అవసరం. అట్లాంటి స్వేచ్ఛా సంకల్పంతో కూడిన ప్రజాసహభాగితను సంపాదించడం ప్రభుత్వ సంస్థలకు కష్టమైనది.

### 2. సౌలభ్యం

సారళ్యము స్వచ్ఛంద సంస్థల ముఖ్యలక్షణం. స్వచ్ఛంద సంస్థలు పాలనా నిర్వహణలో ప్రభుత్వ సంస్థల మాదిరిగా కఠిన నియమ నిబంధనలకు లోబడి పనిచేయవలసిన అవసరం లేదు. వాటి యాజమాన్యం, ఎన్నిక సభ్యుల ద్వారా ఏర్పడిన పాలక వర్గం చేతులలో ఉండడం వలన పరిస్థితులకు అనుగుణంగా అప్పటికప్పుడు పాలన, సేవా నిర్వహణా విధానాలను మార్చుకొనడానికి వీలున్నది. ఈ పాలనా సారళ్య స్వభావం వల్లనే స్వచ్ఛంద సంస్థలు అత్యవసర పరిస్థితులలో అతి స్వల్పకాలంలో త్వరితగతిని సహాయ కార్యక్రమాలను నిర్వహించడం మంచి పేరు సంపాదించాయి.

### 3. మానవీయ దృక్పథం

స్వచ్ఛంద సంస్థల ప్రత్యేక లక్షణాలలో అతి ముఖ్యమైనది మానవీయ దృక్పథం. స్వచ్ఛంద సంస్థలు ప్రజల సహకార సానుభూతులతోను, స్వచ్ఛంద సేవకులతోను నెలకొని ఉండడం చేత సేవా నిర్వహణలో మానవీయ దృక్పథాన్ని ప్రవేశపెట్టడానికి అవకాశం కలిగింది. మానవీయ దృక్పథం అంటే సేవార్థులకు సేవలను అందించేటప్పుడు వారిని సంపూర్ణ మానవులుగా గుర్తించి, వారి అవసరాలను తెలుసుకొని వారితో ఆప్యాయంగా ప్రవర్తించడం. స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలను చేపట్టేవారు సామాన్యంగా మానవీయ దృక్పథం, సేవాభావం కలిగి ఉండటం వల్ల వారు సేవార్థుల అవసరాలను దయాదాక్షిణ్యానురాగాలతో అర్థం చేసుకునే అవకాశముంది. దీనివలన సేవార్థులకు కావలసిన సేవలు అంత తృప్తి లభిస్తాయి.



BRAOU

పై స్వభావం వల్లనే స్వచ్ఛంద సంస్థలు వ్యక్తిగత సేవలు అందించడం ఆధిక్యాన్ని గడించినాయి. ఈ మానవీయ దృక్పథం, వ్యక్తిగత సేవ అనే లక్షణాలు ప్రభుత్వ సేవా సంస్థలలో చాలా తక్కువ.

### 4. స్వచ్ఛంద సాంఘిక సేవలు

చారిత్రకంగా స్వచ్ఛంద సంస్థలు సేవానిర్వహణను స్వచ్ఛంద సేవకుల ద్వారా జరపడం పరిపాటి ఈ స్వచ్ఛంద సేవకులు ఐచ్ఛికంగా మానవసేవ చేయడానికి ముందుకు వచ్చినవారు కావడం చేత సేవా నిర్వహణలో కార్యస్థితిని, చిత్త శుద్ధిని ప్రదర్శించి ప్రజల హృదయాలను సులువుగా ఆకట్టుకునే శక్తిని కలిగి ఉంటారు. ఈ లక్షణమే మానవీయతతో కూడిన వ్యక్తిగత సేవ చేయడానికి తోడ్పడుతుంది. తక్కువ వ్యయంతో సేవానిర్వహణ చేయగలగటం గౌరవ స్వచ్ఛంద సేవకుల వల్ల స్వచ్ఛంద సంస్థలకు సమకూరిన మరొక లాభం.

### 5. మార్గదర్శక పాత్ర

ఇవి మార్గదర్శక పాత్రను వహించడంలో ప్రసిద్ధి చెందినాయి. అందుకు ముఖ్య కారణం వాటి పరిపాలనలో గల సారళ్యస్వభావం. ఈ స్వభావంవల్లనే స్వచ్ఛంద సంస్థలు సమాజంలో ఉత్పన్నమయ్యే సామాజిక సమస్యను సూక్ష్మంగా గ్రహించి వాటి పరిష్కారానికి త్వరితగతిన సేవలు నిర్వహించి 'మార్గదర్శులు' అన్ని ఖ్యాతిని సంపాదించాయి. అంతేకాకుండా, సేవా నిర్వహణ పద్ధతులలోను సామాజిక సమస్యాపరిష్కార మార్గాలలోను ప్రయోగాలు జరిపి మంచి ప్రమాణాలు నెలకొల్పడంలో కూడా 'మార్గదర్శులు' అన్న పేరును సంపాదించినాయి.

సామాజిక పాలన సమర్థవంతంగాను, ఫలవంతంగాను సాగడానికి పైన పేర్కొన్న స్వచ్ఛంద సంస్థల ప్రత్యేక లక్షణాల ఆవశ్యకతను నేడు అందరూ గుర్తించినారు. అందువల్ల ప్రభుత్వసేవా సంస్థల నిర్వహణలో కూడా సాధ్యమైనంతవరకు వీటిని ప్రవేశపెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కారణంగా సేవా నిర్వహణ పద్ధతులలో ప్రభుత్వానికి, స్వచ్ఛంద సంస్థలకు మధ్య రాను రాను వైవిధ్యం సన్నగిల్లుతున్నది.

BRAOU

## 28.7 స్వచ్ఛంద సేవా సంస్థలు - ప్రయోజనాలు

స్వచ్ఛంద సేవా సంస్థల ముఖ్యమైన ప్రకార్యమేమంటే మార్గదర్శకత్వాన్ని వహించటం. స్వచ్ఛంద సేవా సంస్థల బలవత్తరమైన అంశమేమంటే ఇవి ప్రయోగరీత్యా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తాయి. స్వచ్ఛంద చర్యకు కావలసినంత స్వతంత్రత ఉంటుంది. వివాదస్పదమైన క్షేత్రాలలో కూడా కృషి జరపడానికి, ఏదైనా కార్యం చేపట్టినపుడు తక్కిన సముదాయ ప్రజలందరూ వ్యతిరేకించినా సేవా సంకల్పమున్న చిన్న సమూహం కృషి జరపటానికి వీలవుతుంది. మనదేశంలో కూడా కొన్ని రకాల సేవా కార్యక్రమాలు, ప్రభుత్వ సంస్థలు చేపట్టే వరకు స్వచ్ఛంద సేవా సంస్థలే చేపట్టిన దృష్టాంతాలున్నాయి. ఆదిమవాసుల సంక్షేమంకోసం థక్కర్ బాబా కృషి, స్త్రీ విద్య కోసం కార్వే మహర్షి చేసిన కృషి ఉదాహరణలుగా చెప్పవచ్చు.

1. స్వచ్ఛంద చర్యలో రాజకీయ వత్తిడుల ప్రభావం ఉండదు. తగినంత స్వతంత్ర్యం ఉంటుంది.
2. స్వచ్ఛంద సంస్థలకు తగినంత సడలింపు, స్వతంత్రత ప్రజల మద్దతు, సహకారం బాగా లభిస్తాయి.
3. స్వచ్ఛంద చర్య అనేది ఉపయోగపడుతుంది. ఈ స్వచ్ఛంద చర్య ద్వారా స్వయం సహాయంగానీ సహాయార్థులకు తోడ్పడే వ్యయాలు గానీ, సహాయం చేయడం జరుగుతుంది.

ప్రజా ప్రభుత్వాలు జాతీయ ప్రణాళికలను తయారు చేసి ప్రవేశపెట్టాలంటే దానికి ప్రజల సహాయ సహకారాలు కావాలి. ప్రజాప్రణాళికలలో కొందరు ప్రైవేటు వ్యక్తుల చేత స్థాపితమై పడిచే స్వచ్ఛంద సంస్థల పాత్ర ప్రధానంగా పేర్కొనబడింది. ఎందుచేతనంటే ప్రజలలో కొందరు వ్యక్తుల చేత సర్వస్వతంత్రంగా నడిచే స్వచ్ఛంద సంస్థ ప్రత్యక్షంగా ప్రజలతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంటుంది కాబట్టి, వారి సంక్షేమాన్ని బాగా అర్థం చేసుకుని

తదనుగుణంగా నడవడానికి ఎక్కువ అవకాశముంటుంది. భారతదేశ **సాంఘిక** సంక్షేమ చరిత్రను ఒక సారి సింహావలోకనం చేసినట్లైతే స్వచ్ఛంద సంస్థలు అద్వితీయమైన పాత్రను **వహించినట్లు** తెలుస్తుంది. సమాజంలో ప్రజలు వ్యక్తిగతమైన ఆపదలలో గానీ, కరువు కాటకాల వల్లగానీ, వరదలు, తుఫానుల వల్ల గానీ బాధపడుతూ ఉంటే స్వచ్ఛంద సంస్థలే ముందుకు వచ్చి సహాయం చేసి ఆదుకోవడం జరిగేది.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రజల నిత్యావసరాలను తీర్చనట్లైతే సాంఘిక అవ్యవస్థ ఏర్పడుతుంది. ప్రతి సంఘంలోనూ బలహీనులు, వృద్ధులు, రోగులు, వికలాంగులు భౌతిక మానసిక వైకల్యం గలవారు, క్షతగాత్రులు మొదలైన వారుంటారు. గత శతాబ్దంనుండి ప్రపంచ మంతటా ప్రజల అవసరాలను తీర్చడానికి, నిస్సహాయులకు సేవలు అందించడానికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. ఈ సేవలు తక్షణ బాధా విముక్తిని కలిగించడం దగ్గరి నుంచి శాశ్వత పునరావాసాన్ని కలిగించడం వరకు జరుగు తుంటాయి. ఈ సంక్షేమ సేవారంగంలో స్వచ్ఛంద సంస్థలు ప్రముఖ పాత్రను వహిస్తున్నాయి.

భారత ప్రభుత్వం గతకాలంలో స్వచ్ఛంద సంస్థలు సంక్షేమరంగంలో చేసిన సేవలను, వాటి మౌలిక పాత్రను గుర్తించి దేశంలో ఉన్న ప్రధాన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల గురుతర బాధ్యతలను స్వచ్ఛంద సంస్థలపైన పెట్టి వాటికి అధిక ప్రోత్సాహాన్ని ఇవ్వడం జరుగుతోంది.

స్వచ్ఛంద సంస్థలు ప్రజల సమస్యలను నిర్మూలించడంలో మార్గ దర్శకమైన పాత్రను వహించి క్రొత్త ప్రయోగాలను చేయడానికి అవకాశముంది. స్వచ్ఛంద సంస్థలు మనవాతా దృక్పథంతో సామాజిక విలువలకు అధిక ప్రాధాన్యతను ఇస్తాయి. స్వచ్ఛంద సేవా సంస్థలు రాజకీయాలకు దూరంగా ఉండి సర్వ స్వతంత్రంగా కృషి చేయడానికి ఎక్కువ అవకాశముంది. చట్టాలను చూసి భయపడే పని లేకుండా స్వచ్ఛంద సంస్థలలో పనిచేసే అధికారులు మనఃపూర్వకంగాను, అవ్యాజ్యానురాగంతోను ప్రజలతో సంత్సంబంధాలను ఏర్పరచుకొని మసలు కుంటారు.

స్వచ్ఛంద సంస్థలకు ప్రజల సహకారం ఎక్కువగా ఉంటుంది. ఇవి ప్రజల అవసరాలను తీర్చడానికి స్థాపితమైనవి కాబట్టి, వారికి అనుగుణంగా వ్యవహరిస్తూ వారితో సన్నిహిత సంబంధాలను పెట్టుకుంటూ ఉంటాయి. అందు చేత ప్రజలు కూడా స్వచ్ఛంద సంస్థలను తమ నిత్య జీవితంలో అంతర్భాగంగా భావించి, వాటితో అన్ని విధాలా సహకరించి తమ సుహృద్భావాన్ని వెల్లడించడం జరుగుతుంది.

సమాజంలో ఎన్నో చిన్న చిన్న సమూహాలు ఉంటాయి. ఆ సమూహాల తక్షణ అవసరాలను తీర్చవలసి వస్తే స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆ అవసరాలను తీరుస్తాయి. అందుచేత ఈ సంస్థలు సమాజంలో ప్రతివారి అవసరాలను తీర్చడానికి అందుబాటులో ఉంటాయి.

స్వచ్ఛంద సంస్థలలో సంక్షేమ కార్యకర్తలు అత్యధిక స్థాయిలో ప్రజలకు తమ సేవలను అందజేయడమే గాక సంస్థలను చాలా కొద్ది ఖర్చుతోనడపడానికి హెచ్చుగా అవకాశముంది. ఈ విధంగా స్వచ్ఛంద సంస్థల వల్ల సాంఘిక సంక్షేమ రంగంలో అనేక విధాలయిన లాభాలు ఉన్నాయని చెప్పవచ్చు.

## 28.8 భారతదేశంలో స్వచ్ఛంద సేవా సంస్థలు

బ్రిటన్, అమెరికా దేశాలలో లాగా భారతదేశంలో కూడా సాంఘిక సేవాభివృద్ధి స్వచ్ఛంద సంస్థల పాత్ర చాలా ప్రముఖమైనది. ఇందుకు ముఖ్యంగా క్రైస్తవ మిషనరీలు మార్గదర్శక పాత్ర వహించాయి. మిషనరీలు మొదట విద్యా వైద్య సంక్షేమ రంగాలలో వివిధ సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేసినారు. తరువాతి కాలంలో మనవతా వాదులు, సాంఘిక మత సంస్కర్తలు క్రైస్తవ మిషనరీలను అనుకరించి వివిధ రంగాలలో స్వచ్ఛంద సేవా సంస్థలను నెలకొల్పారు.

మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సాంఘిక పురోభివృద్ధిలో స్వచ్ఛంద సేవా సంస్థలు చేసిన గణనీయమైన

సేవను గుర్తించి, వాటిని బలపరచడానికి [illegible]లో భారత ప్రభుత్వం కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డును నెలకొల్పింది. ఈ సంస్థ కృషి ఫలితంగా వివిధ ప్రాంతాలలో స్వచ్ఛంద సేవా సంస్థల సంఖ్య విరివిగా పెరిగింది.

స్వచ్ఛంద సేవా సంస్థలను జాతీయ [illegible]లో ఎన్నింటినో స్థాపించి బాలల సంక్షేమం, వికలాంగుల సంక్షేమం, [illegible] సంక్షేమం, [illegible] సంక్షేమం, [illegible] సంక్షేమం, సాంఘికంగా అసమయోజనం చెందిన సమూహాల [illegible] సాంఘికంగా వెనుకబడిన [illegible], [illegible] సేవలు, వైద్య మరో విజ్ఞాన సంబంధమయిన [illegible] చేస్తున్నారు.

పైన పేర్కొన్న రంగాలలోనే గాక, ఇంకా ఇతర అనేక రంగాలలో సేవలను అందిస్తున్న, జాతీయ అంతర్జాతీయ [illegible]లో ప్రసిద్ధి చెందిన కొన్ని స్వచ్ఛంద సంస్థలను ఇక్కడ పేర్కొనడం సమంజసం.

1. రామకృష్ణమిషన్ - బెంగాల్
2. [illegible] - న్యూఢిల్లీ
3. [illegible]
4. [illegible]
5. [illegible] - న్యూఢిల్లీ
6. నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా - నాగ్పూర్
7. సధరన్ బ్రహ్మ సమాజ్ - కలకత్తా
8. [illegible]

[illegible] సంస్థలు ఉన్నాయి. [illegible] ఈ క్రింది [illegible]

1. [illegible]
2. [illegible]
3. [illegible]
4. [illegible]
5. [illegible]
6. [illegible]
7. [illegible]
8. [illegible]
9. [illegible]
10. [illegible]
11. [illegible]
12. [illegible]
13. [illegible]
14. [illegible]

BRAOU

15. విమెన్స్ ఎంప్లాయిమెంటు స్కీం

16. రామకృష్ణ మిషన్

17. ఆంధ్ర యువతీ మండలి

18. భారతీయ గ్రామీణ మహిళా మండలి

19. థియోసాఫికల్ సొసైటీ.

20. కేరెక్టర్ యూత్ ఫోర్స్

21. అసోసియేషన్ ఫర్ లిటిల్ సిస్టర్ ఫర్‌పూర్

22. ముస్లిమ్ యువజన్ సేవా సంస్థ

23. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వెల్‌ఫేర్

24. జూరాస్ట్రియన్ స్త్రీ మండల్

25. ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యూత్ అసోసియేషన్ మొదలైనవి.

## 28.9 భవిష్యత్తులో స్వచ్ఛంద సంస్థల పాత్ర

BRAOU

ఆధునిక సాంఘిక సంక్షేమ కృషి పరిధి చాలా విశాలమైనది ప్రస్తుతం మానవ సంబంధాలకు సంబంధించి సంక్షేమ సేవలన్నింటిని చేర్చడం జరిగింది. దాతృత్వ ధృక్పధం నుంచి సంక్షేమ తత్వానికి మార్పు చెంది ప్రజలు తమ కష్టాలను తాము గుర్తించి తమంతట తాముగా ఆపదలను ఎదుర్కొనే నవీన ధృక్పధానికి దారి తీసింది. నేడు సమాజంలో పారిశ్రామికీకరణం వలన నగరీకరణం వలన, సమిష్టి కుటుంబాల విచ్ఛిన్నత వలన, ఆర్థిక పరిస్థితుల వలన ఎన్నెన్నో మార్పులు సంభవించి సాంఘిక సమస్యలు అధికమయినవి అందుచేత ఈ సమస్య నిర్మూలనం గతకాలంకంటే నేడు ప్రధాన కార్యక్రమంగా తయారయినది. సమస్యను నిర్మూలించే భారం ఒక్క ప్రభుత్వం మాత్రమే వహించలేదు. కాబట్టి స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ భారాన్ని వహించాలి. సమజ శ్రేయస్సుకొరకు స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ముందుకు రావాలి.

ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల ప్రాముఖ్యాన్ని పూర్తిగా గుర్తించడం జరిగింది. గతంలోని సంస్థలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు పరచడానికి సరిపడే అనుభవముంది. మారుతున్న సాంఘిక అవసరాలకు అనుగుణంగా ప్రవర్తిస్తూ సమాజ సహకారాన్ని పొందుతూ ప్రజలే హెచ్చుగా సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనేటట్లుగా స్వచ్ఛంద సంస్థలు నూతన చైతన్యంతో అభివృద్ధి చెందుతున్నాయి.

సాంఘిక సంక్షేమం, వెనుకబడిన వర్గాల సంక్షేమం వీటికి చెందిన పరిశీలక బృందం తన నివేదికలో స్వచ్ఛంద సంస్థల అభివృద్ధి గురించి కొన్ని సిఫార్సులను చేసింది.

1. స్వచ్ఛంద సంస్థలు మూల ధనాన్ని సంపాదించే కార్యక్రమాలను పునః పరిశీలించాలి. కొందరు దాతల దాన ధర్మాలపైన ఆధారపడకుండా అధిక సంఖ్యాకులయిన ప్రజల సహకారాన్ని సంపాదించాలి.

2. స్వచ్ఛంద సంస్థలు సంక్షేమసేవల అభివృద్ధి విషయంలో అధిక బాధ్యత వహిస్తున్నందు వల్ల అధికార సంస్థలతో పాటు వీటికి సమానమైన హోదాను కలిగించాలి.

3. సంక్షేమ సేవాసంస్థల విషయంలో సమాజ సంక్షేమ సేవలకు వసతి సదుపాయాలు లేని కుటుంబాన్ని ఆధార యూనిట్‌గా తీసుకోవడం జరుగాలి.

4. సమన్వయ పరిషత్తులను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో స్థాపించవలెను. ముందుగా ఈ పరిషత్తులను

రాష్ట్రస్థాయిలో రాష్ట్రప్రభుత్వాలు రాష్ట్ర సాంఘిక సంక్షేమం సంస్థల సలహాలను అనుసరించి నడపాలి. ఈ పరిషత్తులు ఒక సారి స్థాపించిన తరువాత వాటంతట అవే కొన్ని నియమాలను ఏర్పరచుకుని వాటికి అనుగుణంగా పనిచేయాలి.

సంక్షేమరాజ్య స్థాపనలో స్వచ్ఛంద సంస్థల పాత్ర అద్వితీయమైనది. ప్రపంచంలోని ప్రముఖ దేశాలన్నీ స్వచ్ఛంద సంస్థల ప్రాముఖ్యాన్ని గుర్తించి వాటి అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేస్తున్నాయి. భారతదేశంలో కూడా ఈ అభివృద్ధికర ధోరణి హెచ్చుగానే ఉంది. భవిష్యత్తులో స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వానికి మధ్య సన్నిహితత్వం సహకారం భావాలు పెంపొంది సంక్షేమ రాజ్య స్థాపన సుగమం కాలదని ఆశిద్దాం.

## 28.10 ముగింపు

రెండవ ప్రపంచయుద్ధానంతరం స్వచ్ఛంద సేవా ప్రాముఖ్యత పెరిగింది. స్వచ్ఛందంగా, లేదా ఐచ్ఛికంగా, ఎవరికీ లోబడకుండా చేసే కార్యాచరణను స్వచ్ఛంద కార్యాచరణ అనవచ్చు. ఇది రెండు రకాలు ఒకటి స్వతంత్రంగా నిధుల సేకరించే కార్యాచరణ, ప్రభుత్వ నిధులు సహాయంతో స్వచ్ఛంద కార్యచరణ. భారతదేశంలో మతాలు కూడా స్వచ్ఛంద సేవలో ఉన్నాయి. కరువు కాటకాలు, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినపుడు బీదసాదలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు కార్యచరణ సేవలు కద్దు. లార్డ్ బివరిడ్జి ప్రకారం ప్రభుత్వ నిర్దేశకత్వం కానీ, నియంత్రణలో కానీ కార్యాచరణ స్వచ్ఛంద కార్యచరణను స్వచ్ఛందంగా లేదా ఐచ్ఛిక చర్య అన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు ధార్మిక సంస్థలు లేదా దాతృత్వ సంస్థలు ఇచ్చిన విరాళాలతో గానీ, ప్రభుత్వ లేదా ఇతర దేశాల సంస్థల నిధులతో కానీ సేవచేస్తాయి. భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం స్వచ్ఛంద సంస్థలు బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. భవిష్యత్తులో కూడా వీటి ఆవశ్యకత ఉంది.

BRAOU

## 28.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబురాయండి?

1. స్వచ్ఛంద కార్యచరణ అనగాఏమి? పూర్వాపరాలు వివరించండి?
2. స్వచ్ఛంద సేవా సంస్థల చారిత్రికాభివృద్ధిని గురించి విపులీకరించండి?
3. స్వచ్ఛంద సేవా సంస్థల లక్షణాలు వివరించండి?

II. ఈక్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వచనం రాయండి?
2. స్వచ్ఛంద సేవా సంస్థల ప్రయోజనాలేవి?
3. భవిష్యత్తులో స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర?

## 28.12 చదవదగిన పుస్తకాలు

1. Kulakarni, V.M : Voluntery Action in Developing Siciety.

2. Pal Chowdary : Voluntery Social Welfare in India.

# భాగం-29: ప్రభుత్వేతర సంస్థలు-ప్రభుత్వ అన్యోన్య చర్యలు

విషయక్రమం

29.0 ఉద్దేశాలు

29.1 పరిచయం

29.2 సంక్షేమ కృషి - రకాలు

29.3 ఎన్జీవోలు-ప్రభుత్వ సంస్థల కార్యరంగ విభజన.

29.4 ప్రభుత్వ రంగంలోని అంశాలు.

29.5 ఎన్జీవో రంగంలోని అంశాలు.

29.6 ఎన్జీవోలు ఎదుర్కొంటున్న సమస్యలు

29.7 ఎన్జీవోలు - ప్రభుత్వ అన్యోన్య చర్యలు

29.8 ఎన్జీవోలు - ప్రభుత్వ సంస్థల సమన్వయ కృషి

29.9 ఎన్జీవోలు-ప్రభుత్వ సంస్థల సంబంధాలు - సమస్యలు

29.10 ఎన్జీవోలు-ప్రభుత్వ సంస్థల వ్యత్యాసాలు

29.11 ఎన్జీవోలు-ప్రభుత్వ సంస్థల సాపేక్ష పాత్రలు

29.12 ముగింపు

29.13 మాదిరి పరీక్ష ప్రశ్నలు

29.14 చదవదగిన పుస్తకాలు

BRAOU

## 29.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సాంఘిక సంక్షేమరంగంలో స్వచ్ఛందసంస్థలు, ప్రభుత్వేతర సంస్థల పాత్రను తెలుసుకుంటారు.
- ఎన్జీవోల కార్యరంగ విభజన, ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుంటారు.

## 29.1 పరిచయం

భారత ప్రభుత్వం స్వాతంత్ర్యం సమపార్జనానంతరమే సాంఘిక సంక్షేమ రంగం వైపు దృష్టి మరల్చింది. అంతకు ముందు అంటే 1947వ సంవత్సరం పూర్వార్థం వరకు ఈ రంగం స్వచ్ఛంద సంస్థల అజమాయిషీ క్రిందనే ఉండేది. దేశంలో సంక్షేమ రాజ్య స్థాపనే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రజలను జాతి మత కులాలతోను, భౌతిక మానసిక సాంస్కృతిక సాంఘిక అశక్తతతోను వేరుపరచకుండా అందరూ సమనమే అనే సమతాభావం ప్రజా ప్రభుత్వాలలో ప్రపంచమంతటా ఏర్పడింది. రాజ్యం ప్రకార్యాలు సంపూర్ణ ప్రజాభివృద్ధికి దోహదం చేసే విధంగా విశాల దృక్పథంతో ఉన్నాయి.

భారత రాజ్యాంగం అమలులోనికి వచ్చినప్పటి నుండి ప్రధానంగా పంచవర్ష ప్రణాళికలను మొదలు పెట్టినది

మొదలు సంక్షేమ సేవలు విస్తారంగా అభివృద్ధి చెందుతున్నాయి. సాంఘిక సంక్షేమానికి సంబంధించి అనేక శాసనాలను ప్రవేశ పెట్టారు. కేంద్ర రాష్ట్ర బడ్జెట్‌లలో సాంఘిక సంక్షేమ కార్యక్రమాల క్రింద అనేక నిధులను కేటాయించడం జరిగింది. ఈ విధంగా ప్రజా సంక్షేమం కోసం పాటుపడడం అనేది ఒక నూతన దృక్పథంగా భావించడం జరిగింది. గత కాలంలో సాంఘిక సంక్షేమ కృషి నిమిత్తం ప్రభుత్వం తోడ్పాటు ఉన్నా లేకపోయినా స్వచ్ఛంద సంస్థలు (Non Governamental Organisations-NGOs) తమ కృషిని కొనసాగించినాయి. కానీ ప్రస్తుత కాలంలో ప్రభుత్వం తనంతట తాను ప్రత్యక్షంగా సంక్షేమరంగంలో కొన్ని క్రొత్త కార్యక్రమాలను చేపట్టడం, స్వచ్ఛంద సంస్థలకు ఆర్థిక సహాయం చేయడం ఎక్కువగా కన్పిస్తున్నది. ఈ విధంగా స్వచ్ఛంద సంస్థల విషయంలోను, క్రొత్త కార్యక్రమాలను ప్రవేశపెట్టడంలోను ప్రభుత్వం అధిక శ్రద్ధను తీసుకోవడం వల్ల సాంఘిక సంక్షేమరంగంలో ఒక నూతన శకం ఆవిర్భవించిందనడంలో అతిశయోక్తి లేదు.

## 29.2 ప్రస్తుత సాంఘిక సంక్షేమ కృషిని రెండు ప్రధాన భాగాలుగా విభజించవచ్చు.

1. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కృషి లేదా ప్రభుత్వ సంస్థల ద్వారా సాగుతున్న సాంఘిక సంక్షేమ కృషి.

2. స్వచ్ఛంద సాంఘికసంక్షేమ కృషి లేదా స్వచ్ఛందసంస్థల (ఎన్జీవోల)ద్వారా సాగుతున్న సాంఘిక సంక్షేమ కృషి.

భారత ప్రభుత్వం ప్రజాస్వామ్య సామ్యవాద మార్గంలో పయనిస్తూ సంక్షేమ రాజ్యాన్ని స్థాపించాలనే ఉదాత్త ఆశయంతో ఉంది. అందు చేత ప్రభుత్వ పరమైన స్వచ్ఛంద సంస్థల పరమైన అన్ని రకాల సంక్షేమ చర్యలు, ప్రయత్నాలు ఆ ఆశయం ఫలించడం కోసం నిరంతరం కొనసాగుతున్నాయి. ఈ లక్ష్య సాధనా పయనంలో అడ్డుగా నిలచిన సాంఘిక సమస్యలు కోకొల్లలు, వాటిని ఎదుర్కోవడానికి గల అవకాశాలు సాధన సంపత్తులు చాలా తక్కువ. కాబట్టి ఈ సమస్యల పరిష్కారానికి ప్రజా సహకారం లేనిదే ప్రభుత్వ మొక్కటే లక్ష్యాన్ని సాధించలేదు. అతి ముఖ్యమైన ఆహార, వస్త్ర, విద్యా, వసతి, రవాణా మొదలైన సమస్యలను కొన్నింటిని ప్రభుత్వమే చేపట్టి ప్రధాన బాధ్యత వహిస్తున్నది. ఇవి కాకుండా ఇంకా ఇతర అనేక సమస్యలు కూడా ఉన్నవి. ఆ సమస్యలను పరిష్కరించడానికి స్వచ్ఛంద సంస్థలకు ఆర్థిక సహాయం, సంస్థలలోని వ్యక్తులకు అవసరమయినపుడు తగిన శిక్షణ, సలహాలు అందజేస్తూ ప్రభుత్వము తగినంత శ్రద్ధ వహించాలి. ప్రజా బాహుళ్యంలో ఒక్కొక్కరికి ఒక్కొక్క సమస్య ఉంటుంది. సమాజంలో ఉన్న సమస్యల నిర్మూలనకు ప్రభుత్వ రంగం స్వచ్ఛంద రంగం అనే తేడాలు పరిధి ఉండ కూడదు.

స్వచ్ఛంద సేవా సంస్థలు సేవాతత్పరతతో, సోదర మానవ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకురికినా విజయవంతంగా సేవా కార్యక్రమాలను తగురీతిలో అందించ లేకపోతున్నాయి. ఎందువల్లనంటే స్వచ్ఛంద సేవా సంస్థలు అనేక సమస్యలను ఎదుర్కొనవలసి వస్తున్నది.

## 29.3 హెన్రీ అడాల్ఫస్ మెన్ చేసిన ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థల కార్యరంగ విభజన

1. సమాజమంతటికీ అవసరమైన కనీస ప్రమాణాలను సులువుగా నెలకొల్పడానికి వీలైన విద్య, వైద్యం వంటి భారీ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించడం వాంఛనీయం.

2. ఏ కార్యక్రమాలలో సారళ్యం, ప్రయోగం, సేవా నిరతి అవసరమో ఆ కార్యక్రమాలను స్వచ్ఛంద సంస్థలు స్వయంగా లేదా ప్రభుత్వ సహాయ సహకారాలతో నిర్వహించడం అభిలషణీయం.

3. వివాదాస్పదమైన సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ స్వచ్ఛంద సంస్థలకు వదలడం.

4. పరస్పర సహాయ పథకాల అభివృద్ధిలో ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం మంచిది.

BRAOU

పాశ్చాత్య దేశాలలో లాగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రస్తుత పరిస్థితులలో ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సాపేక్ష పరిధుల నిర్ణయం అంతగా అవసరంలేదు. ఈ దేశాలలో ఇప్పుడిప్పుడే వివిధ రంగాలలో ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థలు అభివృద్ధి చెందుతున్నాయి. భారతదేశంలో కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డ్ మొదలైన సంస్థల స్థాపన ద్వారా, ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రోత్సాహక విధానాల ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల క్రింద సేవా సంస్థలు త్వరితగతిని అభివృద్ధి చెందుతున్నాయి.

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మొదలైన వారి నాయకత్వంలోని సామాజికాభివృద్ధి పరిషత్తు భారతదేశంలో సామాజిక విధాన అవసరాన్ని గురించి చర్చిస్తూ, ప్రభుత్వ సంక్షేమ సంస్థల సాపేక్ష సేవారంగాలను ఈ క్రింది విధంగా సూచించింది.

## 29.4 ప్రభుత్వ రంగంలోని అంశాలు

1. వివిధ సాంఘిక సమస్యలకు సంబంధించిన సామాజిక శాసనాలు చేసి అవి సమర్థవంతంగా అమలు జరపడానికి తగిన ఏర్పాట్లు చేయడం.

2. విద్య, ఆరోగ్యం, సాంఘిక భద్రత మొదలైన శాసన పరమైన సాంఘిక సేవా కార్యక్రమాలను అభివృద్ధి పరచడం.

3. అభిలషణీయమైన రంగాలలో సంక్షేమ సంస్థలను నెలకొల్పడం.

4. వివిధ సాంఘిక సంక్షేమ సంస్థలకు అనుమతినిస్తూ, పర్యవేక్షణ కార్యక్రమాలను నిర్వహించడం.

5. రాష్ట్ర, జాతీయ స్థాయిలలోని సంక్షేమ సంస్థలకు సహాయక గ్రాంటు కార్యక్రమాలను నిర్వహించడం.

## 29.5 స్వచ్ఛంద సేవా సంస్థల రంగంలోని అంశాలు

BRAOU

ఎన్జీవోల రంగంలోని అంశాలు.

1. సమాజంలో సాంఘిక శాసనాల ఆశయసిద్ధికి, సక్రమంగా అమలు జరపడానికి అనువైన వాతావరణాన్ని సృష్టించడం.

2. సమకాలీన నూతన సామాజిక సమస్యలను గుర్తించి, వాటి గురించి సమాజంలో చైతన్యం కలిగించి, ఆ సమస్యల పరిష్కారానికి అనువైన సామాజిక చర్యలను తీసుకోవడం.

3. సమాజంలో వస్తున్న సాంఘిక పరివర్తనలకు అనుగుణంగా వ్యక్తుల సామాజిక వైఖరులలో మార్పులు కలిగించడం.

4. నూతన సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో మార్గదర్శక పాత్రను వహించడం.

5. స్థానిక, తాత్కాలిక స్వభావాలుగల సమస్యల పరిష్కారానికి తగిన కార్యక్రమాలను నిర్వహించడం.

6. సేవా కార్యక్రమాల పాలన, నిర్వహణలలో ప్రయోగాలు జరిపి మంచి పద్ధతులను ప్రవేశపెట్టడం.

7. సాంఘిక సేవా రంగంలో ప్రజలు పాల్గొనడానికి వీలుగా స్వచ్ఛంద సహాయాలను పెంపొందించి, ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాల అభివృద్ధికి కృషి చేయడం.

8. ప్రభుత్వ సామాజిక విధానాలలోని, పద్ధతులలోని లోపాలను నిర్మాణాత్మక విమర్శల ద్వారా సరిదిద్ది సాంఘిక సేవా రంగంలో మంచి ప్రమాణాలు నెలకొల్పడం.

భవిష్యత్కాలంలో ప్రభుత్వం గానీ, స్వచ్ఛంద సంస్థలు గానీ అపదలో ఉన్నవారికి సహాయపడే కృషి చేయడం కంటే అపదలు కలగకుండా నివారించగల సాంఘిక సంక్షేమ కృషికి అధిక ప్రాముఖ్యాన్ని ఇవ్వవలసి ఉంటుంది. ప్రధానంగా ప్రజారోగ్య రంగంలో ఈ నివారణ పద్ధతి అద్వితీయంగా ఉపయోగపడుతుంది. కలరా, మలేరియా, ప్లేగు వంటి భయంకర వ్యాధులను అరికట్టడం వల్ల లక్షలాది ప్రజలను అకాల మరణం నుంచి తప్పించవచ్చు. భిక్షాటనం, వ్యభిచారం మొదలైన అనేక సమస్యలను పూర్తిగా నిర్మూలించలేకపోయినా కొంత వరకు వాటిని అదుపులో పెట్టగలుగుతున్నారు. సాంఘిక సమస్యా నిర్మూలనమే గాక మహిళలు, బాలలు, కార్మికులు, కుటుంబ సభ్యులు మొదలయిన వారి సంక్షేమ కార్యక్రమాలలో ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థల పాత్ర రాను రాను పెరుగుతున్నది.

## 29.6. స్వచ్ఛంద సంస్థలు(ఎన్జీవోలు) ఎదుర్కొంటున్న సమస్యలు

### 1. ఆర్థిక సమస్య

ఆధునిక కాలంలో స్వచ్ఛంద సంక్షేమ సంస్థలను పోషించడానికి ధర్మనిధులు అందించే లోకోపకార సంస్థలు క్షీణించిపోయినాయి. అంతే కాక మరిన్ని కొత్త సంస్థలను స్థాపించి పోషించే ఉత్సాహవంతులైన ధర్మపరులైన ధనికులు కరువైనారు. స్వచ్ఛంద సంస్థలకు ప్రత్యక్షంగా ఆర్థికంగా సహాయం చేయవలసిన భారాన్ని ప్రభుత్వమే వహించ వలసి వస్తున్నది. అందుచేత ఈ సంస్థలు ఆర్థిక బలహీనత వలన సక్రమంగా సాంఘిక సంక్షేమ సేవలను చేసే స్థైర్యాన్ని కోల్పోతున్నాయి.

### 2. శిక్షితులైన సంక్షేమ కార్యకర్తల కొరత

స్వచ్ఛంద సంక్షేమ రంగంలో శిక్షితులైన సంక్షేమ కార్యకర్తల కొరత హెచ్చుగా ఉంది. సంక్షేమ కార్యకర్తలకు పరోపకారచింతన, త్యాగనిరతి, సహనం, సానుభూతి మొదలైన లక్షణాలున్నప్పటికీ ఆధునిక సాంఘిక సంక్షేమ శాస్త్ర పద్ధతులలో శిక్షణ పొందడం చాలా అవసరం, సమాజంలో ఉన్న సమస్యను కూలంకషంగా అవగాహన చేసుకుని, వాటికి తగిన చర్యలను తీసుకొని సమాజాన్ని క్రమబద్ధం చేయాలంటే శిక్షణ అవసరం అందు చేత ప్రభుత్వం బాధ్యత వహించి కార్యకర్తలకు శిక్షణ ఇప్పించాలి.

### 3. ఒకే ప్రాంతంలో ఒకే రకమయిన సేవలను అందజేయడం

కొన్ని ప్రాంతాలలో స్వచ్ఛంద సంస్థ మరొక ప్రభుత్వ సంస్థ లేదా రెండూ స్వచ్ఛంద సంస్థలే ఒకేరకమయిన సేవలను అందించడం జరుగుతుంది. కాబట్టి ఏకరూప మయిన సేవలను రెండు సంస్థలు చేయడాన్ని అరికట్టి సంక్షేమ సేవలకు వ్యాప్తి కలిగించడంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

### 4. పరిపాలనలో విలంబనం

స్వచ్ఛంద సేవా సంస్థల పరిపాలన, విధి నిర్వహణలో జాప్యం ఉండదు. కానీ ప్రభుత్వ సంస్థలలో పరిపాలన చాలా అలస్యంగా జరుగుతుంది. అంతేకాక, ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల పైన విధించే నియమాలు, తనిఖీ చేసే పద్ధతులు కఠినంగా ఉంటాయి.

### 5. సమన్వయ విధానంలో లోపం

సంక్షేమ సేవలను అందజేయడంలో స్వచ్ఛంద సంస్థలకు, ప్రభుత్వానికి మధ్య సరయిన సమన్వయ విధానం లేదు, స్వచ్ఛంద సంస్థల మధ్య కూడా సమన్వతా భావం లోపించి, దేనికదే స్వతంత్రంగా తమ సేవలను



BRAOU

అందిస్తున్నవి. స్వచ్ఛంద సంస్థలు సాంఘిక సంక్షేమ రంగాలలో ప్రభుత్వ సంస్థలలో సమానమైన స్థాయిలో భాగస్వాములుగా పనిచేయవలసి ఉంటుంది. దీనవివలన సాంఘిక సంక్షేమ రంగంలో ప్రభుత్వానికి, స్వచ్ఛంద రంగాలకు మాత్రమే కాకుండా స్వచ్ఛంద సంస్థల మధ్య కూడా సమన్వయ సహకార భావాలు అభివృద్ధి చెందాలి.

### 6. నాయకత్వలోపం

స్వచ్ఛంద సేవా సంస్థలు ఆరంభంలో చురుకైన నిస్వార్థమైన నాయకుల సహచర్యంలో హర్షించతగ్గరీతిలో పనిచేస్తున్నవి. కానీ కొందరు స్వార్థపరులు, స్వచ్ఛంద సేవా సంస్థలలోనికి ప్రవేశిస్తున్నారు. ఇటువంటి స్వార్థ శక్తుల మూలంగా, ఆయా సేవా సంస్థల అభ్యున్నతి కుంటు పడుతున్నది. కాబట్టి స్వచ్ఛంద సంస్థలు సరైన నాయకుని నియమించుకుని, సార్థపర శక్తులను అడ్డుతొలగించినట్లయితే, సేవార్థులకు మరింత మెరుగైన సేవలను అందించే అవకాశం కలుగుతుంది

## 29.7 ఎన్జీవోలు ప్రభుత్వ అన్యోన్య చర్యలు

స్వాతంత్ర్యానంతరం, ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల అభివృద్ధికోసం ఈ క్రింది చర్యలు తీసుకోవడం జరిగింది.

1. కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలకు గ్రాంట్లు ఇస్తూ స్వచ్ఛంద సేవా చర్యల ప్రోత్సాహమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకుని పూర్తి కాలిక అధ్యక్షున్ని నియమిస్తూ 1953లో (సి.ఎస్.డబ్ల్యూ.బి) కేంద్ర సంక్షేమ బోర్డును స్థాపించారు. బోర్డులో దేశంలో ఉన్న స్వచ్ఛంద సేవా కార్యకర్తలు ఉద్యోగేతరులు, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలతో ముడిపడి ఉండే మంత్రి వర్గాల ప్రతినిధులు, రాష్ట్ర ప్రతినిధులు, సాంఘిక శాస్త్రవేత్తలు, పరిపాలకులు సభ్యులుగా ఉంటారు. కేంద్రీయ సంస్థకు సహాయ సహకారాలందిస్తూ వివిధ రాష్ట్రాలలో కేంద్ర పాలిత ప్రాంతాలలో రాష్ట్రీయ సాంఘిక సంక్షేమ సలహా మండలులు కూడా ఉన్నవి.

2. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్ మెంట్గా గుర్తింపు పొందిన Central Inistitute of Research and Training in Public Co-operation సంస్థను, 1966లో స్థాపించారు. ఇది ప్రణాళికా కార్యక్రమాలలో ప్రజలు పాల్గొనేటట్లు చేయడానికి, స్వచ్ఛంద చర్యను ప్రోత్సహించడానికి స్వచ్ఛంద చర్యలో పాల్గొనే స్వచ్ఛంద కార్యకర్తలకు శిక్షణనివ్వడం, స్వచ్ఛంద చర్య వివిధ అంశాల పరిశోధనా పర్యాలోచణ (evaluation)లను సాగించడానికి దోహదపడుతున్నది.

3. దేశస్థాయిలో ఉన్న స్వచ్ఛంద సంస్థలకు గ్రాంట్లను మంజూరు చేయడం.

4. విభిన్న కార్యక్రమాలు నిర్వర్తించడానికి, స్వచ్ఛంద సంస్థలకు నిధులను మంజూరు చేయడం.

5. ఎప్పటికప్పుడు ప్రభుత్వం నియమించిన వివిధ కమిటీలలోను, వర్కింగు గ్రూపులలోను, స్వచ్ఛంద సేవా సంస్థలకు తగినంత ప్రాతినిధ్యం కల్పించి, సంక్షేమ పథకాలను, రూపొందించడానికి విధాన రచన చేయడంలో వారిని పాల్గొనేటట్లు చేయాలి.

6. గ్రామాలలో ఉన్న స్థానిక స్త్రీ సంక్షేమ సంస్థలను ప్రోత్సహిస్తూ అనేక అభివృద్ధి కరమైన కార్యక్రమాలలో వారిని పాల్గొనేటట్లు చేయాలి.

7. వరకట్నాలు, పిన్నవయస్సులో పెళ్ళిళ్ళు వంటి సాంఘిక దురాచారాలను రూపుమాపడం, ప్రజాభిప్రాయాన్ని ఉత్తేజం చేయడంలో సేవా సంస్థలకు తగిన సహాయ సహకారాన్ని అందించడం.

ప్రభుత్వం, సంక్షేమ సంస్థలు పరస్పర అవగాహనతో సంఘటిత భావంతో కృషి చేసినట్లయితే భారతదేశ సాంఘిక సంక్షేమ రంగం అనతి కాలంలోనే ఉన్నత స్థాయిని చేరుకోగలుగుతుంది.



BRAOU

## 29.8. ప్రభుత్వ-స్వచ్ఛంద సంస్థల సమన్వయ కృషి

1. ప్రభుత్వ సిబ్బంది సాంఘిక సమస్యలను తెలుసుకొని వాటి నిర్మూలనకు తగిన చర్యలను చేపట్టాలి. స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ప్రజల అవసరాలను అభిప్రాయాలను సేకరించి, ప్రభుత్వ సంస్థలకు అంద చేయాలి.

2. స్వచ్ఛంద సంస్థలు ప్రజల అవసరాలను తీర్చే విధంగా సాంఘిక సేవలకు అంకితమయి ఉండాలి. పూర్వం పట్టణ, కార్మిక బాలలకు ప్రాథమిక పాఠశాలలు నడపడం వికలాంగులకు, పేద ప్రజలకు ఆశ్రయాన్ని కల్పించి వారిని పోషించడం మొదలయిన సేవలను ధర్మబుద్ధిపైన, లోకోపకార ప్రవృత్తి పైన ఆధారపడి స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తుండేవి. ఇప్పుడు అబాధ్యతను కొంత ప్రభుత్వం నిర్వహిస్తున్నది. కొన్ని సంస్థలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తున్నది.

3. ప్రభుత్వం మాత్రమే ప్రత్యేకించి కొన్ని సేవలను అంద జేస్తుంది. కొన్ని ప్రధానాంశాలలో ప్రభుత్వమే ప్రమేయాన్ని కల్పించుకుని అభివృద్ధికర శాసనాలను చేస్తుంది. అవసరమైనపుడు ఆ శాసనాలను నిర్బంధ పూర్వకంగా ప్రవేశపెట్టడం కూడా జరుగుతుంది. వివాహానికి కనీస వయస్సు, వారసత్వం, వితంతు వివాహం, బాల శ్రామిక తనం, అస్పృశ్యత, బాలవ్యభిచారం మొదలైన అనేక విషయాలలో ప్రభుత్వం శాసనాలను చేసింది. వాటిద్వారా ప్రజలలో నూతన చైతన్యం అవిర్భవించి సంఘంలో సాంఘిక సమస్యలపైన పాత విలువలు పోయి వాటిస్థానంలో కొత్త విలువలు రావడానికి అవకాశం కలుగుతుంది.

4. ప్రభుత్వం స్వచ్ఛంద సేవా సంస్థలకు గ్రాంటుల రూపేణా సహాయాన్ని అందజేస్తూ ఒక ప్రముఖ పాత్రను వహిస్తుంది. అభివృద్ధి చెందిన దేశాలలో స్వచ్ఛంద సేవా సంస్థలకు కొన్ని ప్రజాధర్మ సంస్థలు పూనుకొని గ్రాంటుల రూపేణా సహాయాన్ని అందజేయడం జరుగుతున్నది. కానీ మనదేశంలో అత్యధికమైన మొత్తాలను సాంఘిక సంక్షేమ కార్యక్రమాల క్రింద ఖర్చుపెట్టడం ధర్మ సంస్థలకు మోయలేని భారమౌతోంది. అందుచేత ప్రత్యక్షంగా ప్రభుత్వమే స్వచ్ఛంద సంక్షేమ సంస్థలకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నది. ఈ విధమైన ఆర్థిక సహాయం వలన స్వచ్ఛంద సేవా సంస్థల కృషి, వాటి సామర్థ్యం పెరగవలెనంటే ప్రభుత్వం నిరంతరం ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించాలి.

5. ప్రభుత్వ సంక్షేమ రంగంలో ఉన్నటువంటి స్వచ్ఛంద సేవా సంస్థల ప్రభుత్వ సంస్థల సేవలను క్రమబద్ధం చేయడం జరుగుతుంది. క్రమబద్ధం చేయడమంటే కొత్తగా స్థాపించే సంక్షేమ సంస్థలకు లైసెన్సులను మంజూరు చేస్తూ అట్లాంటి సంస్థలకు చట్టబద్ధంగా గ్రాంటుల రూపంలో సహాయాన్ని అందజేయడం.

## 29.9 ప్రభుత్వం-స్వచ్ఛంద సంస్థల సంబంధాలు - సమస్యలు

స్వచ్ఛంద సేవలను ప్రభుత్వం ప్రత్యక్షంగా ఏర్పాటు చేయాలా? లేదా ఈ కృషి అంతా స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలా? లేదా వేరేవిధంగా కొన్ని సూత్రాలను తయారు చేసి వాటికి అనుగుణంగా రెండు రకాల సంస్థల మధ్య పనిని విభజించాలా? అనే ప్రశ్నలు తలుత్తుతున్నాయి. ఇక్కడ వివరించిన సూచనలు పై వాటిని చర్చిండానికి ఆధారంగా ఉంటాయి.

1. సామాజిక శాసనాలు అమలు పరచడానికి గాను వాటికి అనుగుణంగా మలిచి ప్రభుత్వం గుర్తించిన క్రమబద్ధమైన కొన్ని స్వచ్ఛంద సంస్థల ద్వారా సంక్షేమ సేవలను అందించాలి.

2. అధీనరక్షణ స్వభావం కలిగిన సేవలు ప్రభుత్వ సంస్థల ద్వారా జరిపించాలి.

3. రాష్ట్ర వ్యాప్తంగా గానీ, దేశవ్యాప్తంగా గానీ చేసే సేవల విషయమై ప్రభుత్వ సంస్థలు నిర్దేశాన్ని పొందాలి.

BRAOU

ఆసేవలు చేయడానికి స్వచ్ఛంద సంస్థలకు తగిన ఆర్థిక వనరులు లేవు. విద్య ఆరోగ్యం, సాంఘిక భద్రత క్రిందికి వస్తాయి. స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రభుత్వ అజమాయిషీ క్రింద ఈ సాంఘిక భద్రతా చర్యలను అందజేస్తున్నాయి.

4. స్వచ్ఛంద సంస్థలు ముఖ్యంగా ప్రాంతీయ లేదా అడ్‌హాక్ స్వభావం గల సేవలను ప్రవేశపెట్టడం జరగాలి. ఆర్తులకు రక్షణ కల్పించే సంస్థలన్నీ చాలా వరకు ఈ వర్గానికి చెందినవే.

5. ప్రభుత్వం క్రమబద్ధం చేసినప్పటికీ సమాజ సహకారం ఉన్నట్లయితే స్వచ్ఛంద సంస్థలు సంక్షేమ సేవలను (ఉదా : ఆర్తసంరక్షణ సేవలు) ప్రాంతీయ స్థాయిలో అమలు పరచవచ్చు.

6. సమాజం ధన రూపంలో గానీ వస్తురూపంలో గానీ సహాయాన్ని అందజేసి సంఘసేవలో పాల్గొన్నట్లయితే స్వచ్ఛంద సంస్థలు సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు బాధ్యత వహించాలి.

## 29.10 ఎన్జీవోలు, ప్రభుత్వ సంస్థల వ్యత్యాసాలు

స్వచ్ఛంద సంక్షేమరంగంలో ఆయా స్వచ్ఛంద సేవా సంస్థలకు ఎక్కువ స్వేచ్ఛా స్వాతంత్రాలు ఉండడం వలన అకుంఠిత కార్యదీక్షతో వ్యవహరించడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. ప్రభుత్వ సంక్షేమ రంగంలో కార్యకర్తలకు తమ కార్యరంగంలో స్వేఛ్ఛా స్వాతంత్ర్యాలతో వ్యవహరించడానికి వీలుపడదు. ఉన్నతోద్యోగుల ఆజ్ఞలకు, ఆదేశాలకు లోనయి వాటికి అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుంది. స్వచ్ఛంద సంస్థలు సరళంగా ఉండడం వలన, పూర్తి స్వేచ్ఛతో వ్యవహరించడం వలన సంక్షేమ రంగంలో అనేక ప్రయోగాలను చేసి కొత్త పద్ధతులను, సాంకేతిక సౌలభ్యాల్ని అవలంబించడానికి సదవకాశముంటుంది. ప్రభుత్వ సంస్థలు కఠినంగా ఉండడం వలన, ఈ కృషి విషయంలో నిశ్చితమైన నమూనాలు అనుసరించి పాటించడం వల్ల ప్రజలతో ప్రత్యక్ష సంబంధం లేకపోవడం వల్ల ప్రయోగాలను చేయడానికి సదవకాశం లభించదు.

ప్రజా ప్రభుత్వాలున్న దేశాలలో స్వచ్ఛంద సంస్థలకు ప్రముఖస్థానముంది. ఇంగ్లాండ్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలలో స్వచ్ఛంద సంస్థలు అన్నీ కలిసి సంయుక్త సమావేశాలను జరిపి కార్యక్రమాలను, పథకాలను రూపొందించడం జరుగుతున్నది. అవి సమాజావసరాలను దృష్టిలో వుంచుకొని, పథకాలను రూపొందిస్తున్నాయి. అవి సమాజావసరాలను తీర్చడానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి నిస్వార్థసేవను చేస్తున్నాయి. స్వచ్ఛంద సేవలో ప్రభుత్వం కూడా పాలు పంచుకుని స్వచ్ఛంద సంస్థలకు వేర్వేరు రకాలయిన ఆర్థిక, నైతిక, మానవతా సహాయ సహకారాలను అందచేస్తూ వాటి అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. భారత ప్రభుత్వం కూడా గడచిన 22 సంవత్సరాల నుంచి స్వచ్ఛంద సంస్థల ప్రాముఖ్యాన్ని గుర్తిస్తూవస్తున్నది. పబ్లిక్ సహకార రంగంలో జాతీయ సలహా రంగం ఒకటి ఉన్నది అది స్వచ్ఛంద సంస్థల పాత్రను గుర్తించి వాటి వనరులను, కార్యకర్తలు నడిపే కార్యక్రమాలను ఆధారంగా చెప్పమని ప్రభుత్వం సంరక్షణ గ్రాంటును అందజేయవలెననీ, ఆ సంస్థలకు అయ్యే కార్యనిర్వహణ, ఖర్చులో 25 శాతం ప్రభుత్వమే భరించేటట్లు ఉండవెలననీ సిఫారసు చేసింది. కేంద్ర సాంఘిక సంక్షేమ మండలి నెలకొల్పినప్పటినుండి స్వచ్ఛంద సంస్థలకు విరివిగా సాయం అందచేయడం జరుగుతున్నది. కేంద్ర సంస్థ రాష్ట్ర, జిల్లా స్థాయిలో అనేక శాఖలను నెలకొల్పడం జరిగింది. బాలలు స్త్రీలు, వయోజనులు వికలాంగులు మొదలయిన వారి సంక్షేమకృషిని కొనసాగించే స్వచ్ఛంద సంక్షేమ సంస్థలకు కేంద్ర సంస్థ ఉచితంగా గ్రాంటులను మంజూరు చేస్తున్నది. అంతే కాకుండా విద్య, ఆరోగ్య, దేశీయ వ్యవహారాలు, సమాజ వికాస, కార్మిక ఉద్యోగ మంత్రిత్వ శాఖలుకూడా సాంఘిక సంక్షేమానికి అన్ని విధాలా పాటుపడుతున్నవి. పంచవర్ష ప్రణాళికలలో ఆర్థిక సహాయాన్ని గ్రాంటుల రూపంలో అందజేస్తున్నది. స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రభుత్వ సహాయాన్ని పొందడమా? మానడమా? లేదా తమ వనరులపైనే ఆధారపడి స్వయం పోషకాలుగా ఉండడమా? అనే విషయాలు కొన్ని చర్చనీయాంశాలుగా కనబడతాయి. ఒక స్వచ్ఛంద సంస్థకు ప్రభుత్వం పూర్తిగా ఆర్థిక సహాయాన్ని అందచేస్తే ఆ సంస్థ ప్రభుత్వం మీదనే ఆధారపడి తన స్వేచ్ఛను, అధికారాలను కోల్పోతుంది. అందువల్ల కొన్ని స్వచ్ఛంద సంక్షేమ సంస్థలు ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని ఏ మాత్రం కోరకుండా సర్వస్వతంత్రంగా నడుస్తున్నాయి. మరికొన్ని సంస్థలు ప్రభుత్వ మిచ్చే గ్రాంటులను తీసుకుంటూ



BRAOU

మిగిలిన లోటును వినోద ప్రదర్శనలు మొదలయిన మార్గాలద్వారా పూర్తిచేసుకుంటున్నాయి. ఈ పద్ధతి వల్ల అటు ప్రభుత్వ సహాయం, ఇటు ప్రజల సహకారం అందుకోవడం జరుగుతున్నది. ఇవేకాక కొన్ని ధర్మ నిధులున్నాయి. వాటి లక్ష్యాలకు ఈనాటి సాంఘిక పరిస్థితులకు సరి అయిన సంబంధం ఉండదు, పైగా నిధులు సక్రమమైన మార్గాలలో వినియోగపడడంలేదు. అట్లాంటి సందర్భాలలో ప్రభుత్వం స్వయంగా గానీ, లేదా ధర్మాదాయ కమీషనర్‌ను నియమించిగానీ, ఆ ధర్మనిధులు సక్రమ మార్గంలో సాంఘిక సంక్షేమ కృషికి వినియోగపడేటట్లు చూడడం జరుగుతున్నది.

## 29.11. ప్రభుత్వం, స్వచ్ఛంద సేవా సంస్థల సాపేక్ష పాత్రలు

ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సాంప్రదాయిక, సాపేక్ష పాత్రల విషయానికి సంబంధించిన "పారలల్ బార్స్", (Paralell Bars) "ఎక్స్‌టెన్షన్ లాడర్" (Extension Ladder) సిద్ధాంతాలు ముఖ్యమైనవి.

బెంజిమన్ కిర్క్‌మన్ గ్రే (Benjaman Kirkman Gray) రూపొందించిన పారలల్ బార్ సిద్ధాంతం ప్రకారం ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థలు ఒకదానికి ప్రక్క ఒకటి ఒకే రంగంలో సేవా నిర్వహణ జరుపుతుంటాయి. ఉదాహరణకు విద్యావిషయంలో ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించినప్పటికీ, ఆర్థిక పరిమితుల వల్ల విద్యా సౌకర్యాలన్నీ వాంఛనీయ ప్రమాణాలలో అందరికీ అందజేయలేకపోవచ్చు. కాబట్టి స్వచ్ఛంద సంస్థలు విద్యాసంస్థలను నిర్వహిస్తాయి. అంతేకాక, ఈ స్వచ్ఛంద సంస్థలు అభిలషణీయ విద్యా ప్రమాణాలను నెలకొల్పి ప్రభుత్వ సంస్థలకు మార్గదర్శకత్వం వహిస్తాయి. ఈ సిద్ధాంతం ప్రకారం ఈ రెండింటికీ ఏ విధమైన ప్రత్యేక బాధ్యతలు, కార్యక్రమాలు కేటాయించడం జరగలేదు.

పై సిద్ధాంతానికి ప్రత్యామ్నాయమే సిడ్నీవెబ్ (Sidny Web) ప్రచారంలోనికి తీసుకొచ్చిన 'ఎక్స్‌టెన్షన్ లాడర్' సిద్ధాంతం. ఈ సిద్ధాంతంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల పాత్ర నిర్ణయం వాటి సాపేక్ష ఆధిక్యాల ఆధారంగా చేయడం జరిగింది. మార్గదర్శకత్వానికి, పరిశోధనకు, వ్యక్తిగత సంరక్షణకు సంబంధించిన సేవా నిర్వహణలో స్వచ్ఛంద సంస్థలకు ఆధిక్యం ఉంటే, నిష్పక్షపాతానికి, స్వాతంత్ర్యానికి సంబంధించిన సేవా కార్యక్రమ నిర్వహణలో ప్రభుత్వ సంస్థలవల్ల ప్రతి పౌరుడు కనీసజీవన ప్రమాణాన్ని చేరుకోవడానికి అవసరమైన విద్యా, వైద్యా, గృహవసతి మొదలైన సాధరణ సాంఘిక సేవల నిర్వహణ భారం ప్రభుత్వ సంస్థలదే అని చెప్పడం జరిగింది. ఆ స్థాయినుంచి ప్రజలను అభిలషణీయ జీవన ప్రమాణాలకు చేర్చడానికి కావలసిన కార్యక్రమాలను నిర్వహించే పాత్ర స్వచ్ఛంద సేవా సంస్థలకు ఇవ్వడం జరిగింది. ఈ సిద్ధాంతం బాగా అభివృద్ధి చెందిన బ్రిటన్ వంటి శ్రేయోరాజ్యాలలోని పరిస్థితులకు అన్వయిస్తుంది. కానీ భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు సరిపడదు. వెనుకబడిన దేశాలలో 'పారలల్ బార్' సిద్ధాంతం పూర్తిగా వర్తిస్తుంది. మనదేశంలో ప్రభుత్వ ఆర్థిక పరిమితుల దృష్ట్యా స్వచ్ఛంద సంస్థల ఆధిక్యాల దృష్ట్యా సాంఘిక సేవా రంగంలో భాగస్వామ్య సూత్రాన్ని అనుసరించి ప్రభుత్వ సంస్థలకు స్వచ్ఛంద సంస్థలకు స్థానాన్ని కల్పించినారు.

## 29.12 ముగింపు

భారత దేశంలో స్వాతంత్ర్యానంతరమే సంక్షేమంపై దృష్టిపెట్టారు. సాంఘిక సంక్షేమ కృషి మన దేశంలో రెండు విధాలుగా జరుగుతున్నది. ఒకటి ప్రభుత్వ సంస్థల ద్వారా జరుగుతున్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమం. రెండవది, స్వచ్ఛంద, ప్రభుత్వేతర సంస్థల(ఎన్జీవోల) ద్వారా జరుగుతున్న సంక్షేమం. అయితే ప్రభుత్వ రంగంలోని సంక్షేమ అంశాలు, స్వచ్ఛంద రంగంలోని అంశాలలో తేడా ఉంది. స్వచ్ఛంద కార్యాచరణకు అనేక అడ్డంకులు కూడా ఉన్నాయి. స్వతంత్రంగా, ఎలాంటి పెత్తనం లేకుండా సాగుతున్న ఈ స్వచ్ఛంద సంక్షేమకృషి మారుతున్న కాలమాన పరిస్థితుల్లో దాని పాత్రపై పెరుగుతున్నది.

BRAOU

## 29.13 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.

1. హెన్రీ అడాల్ఫస్‌మెస్ కార్యరంగ విభజన వివరించండి.
2. స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోలు) ఎదుర్కొంటున్న సమస్యలేవి?
3. ప్రభుత్వానికి, ఎన్జీవోలకు మధ్య సంబంధాలు-సమస్యలు రాయండి?

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.

1. ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల అన్యోన్యకృషి గురించి రాయండి?
2. ఎన్జీవోలకు ప్రభుత్వ సంస్థలకు గల తేడా రాయండి?
3. సాంఘిక సంక్షేమ కృషిని గురించి రాయండి?

## 29. చదవదగిన పుస్తకాలు


Kulkarni V.M. - Voluntary Action in Development Society

D.P. Choudary - Voluntary Social Welfare in India

Walter A. Fried Lander - Introduction to Social


BRAOU

# డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సాంఘిక శాస్త్రాల విభాగం

## ఎం.ఎ ద్వితీయ సంవత్సరం

## సామాజికశాస్త్రం

### కోర్సు-V: అనుప్రయుక్త సమాజశాస్త్రం

### మాదిరి పరీక్ష ప్రశ్నపత్రం

సమయం: 3 గంటలు | గరిష్ఠ మార్కులు: 100
కనిష్ఠ మార్కులు: 35

విభాగం-A 4X15=60

గమనిక

- ఈ క్రింది ప్రశ్నలలో ఏవేని నాలుగింటికి ఒక్కొక్కదానికి 30 పంక్తులలో జవాబు రాయండి.
- ప్రతి ప్రశ్నకు 15 మార్కులు.

1. సామాజిక సమస్యలను నిర్వచించి భావనలు తెలుపండి.
2. యువజనుల ఆందోళనా రూపాలేవి?
3. గ్రామాలలో హింస నివారణకు మార్గాలు సూచించండి?
4. సేవార్థి మానసిక-అనువంశిక చరిత్ర గురించి వివరించండి?
5. అంతశ్చర్య అనగానేమి? దాని రూపాలను వివరించండి?
6. నాయకుని మూర్తిమత్వ లక్షాలను పేర్కొనండి?
7. జనత ముఖ్యలక్షణాలు వివరించండి?
8. స్వచ్ఛంద కార్యాచరణ అనగానేమి? పూర్వాపరాలు వివరించండి?

విభాగం-B 4X15=60

గమనిక

- ఈ క్రింది ప్రశ్నలలో ఏవేని ఐదింటికి ఒక్కొక్కదానికి 15 పంక్తులలో జవాబు రాయండి.
- ప్రతి ప్రశ్నకు 8 మార్కులు.

9. ఏకవర్గ సిద్ధాంతాన్ని తెలుపండి?
10. గ్రామీణ యువజనుల సమస్యలేవి?
11. ఆధునిక కాలంలో బలహీనవర్గాల గురించి రాయండి?
12. మతహింస నివారణ మార్గాలేవి?
13. కేసు పరిశీలన అంటే ఏమిటి?
14. సామూహిక కౌన్సెలింగ్ అంటే ఏమిటి?
15. క్లిక్ సమూహాలు?
16. సముదాయం లక్షణాలు వివరించండి?
17. ప్రజాభిప్రాయం అంటే ఏమిటి?
18. హెన్రీ అడాల్ఫస్‌మెస్ కార్యరంగ విభజనను వివరించండి?

B R A O U

# రచయితల వివరాలు

**ప్రొ. పి. మురళీధరుడు** : దాదాపు 30 సంవత్సరాలుగా అనుప్రయుక్త సమాజశాస్త్రం, గ్రామీణాభివృద్ధి, సమాజశాస్త్రం బోధన, పరిశోధనలో కృషి చేసిన ప్రొఫెసర్ పి. మురళీధరుడు శ్రీకృష్ణదేవరాయవిశ్వవిద్యాలయం, అనంతపురంలో పనిచేశారు. విశ్వవిద్యాలయంలో పాఠ్యప్రణాళిక రూపకల్పన మొదలలు అన్ని దశల్లో తన తోడ్పాటునందించిన మురళీధరుడు 2002లో మరణించారు.

**అల్లం నారాయణ** : సమాజశాస్త్ర పరిశోధన, సామాజిక సమస్యల విశ్లేషణలో అనుభవం ఉన్న అల్లం నారాయణ ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకవర్గంలో ఉన్నారు.

**డా. యం.ఎస్. పార్థసారధి** : విజిటింగ్ ప్రొఫెసర్, సమాజశాస్త్రం, సంఘసంక్షేమ శాస్త్రం, నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

**డా. కనకదుర్గాంబ** : రీడర్, ఆర్.ఎం కాలేజ్ ఆఫ్ సోషల్‌వర్క్, గచ్చిబౌలి, హైదరాబాద్.

**డా. వి. వెంకటేశ్వర్లు** : డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ, సోషల్‌వర్క్, ఐ.ఆర్.పి.ఎం, నాగార్జున విశ్వవిద్యాలయం,గుంటూరు.

**డా. కె. విజయ్‌కుమార్** : డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ, స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్నం.

**డా. ఘంటా చక్రపాణి**
**సమన్వయకర్త** : అధ్యక్షులు, సమాజశాస్త్ర శాఖ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రోడ్ నెం. 46, జుబిలీహిల్స్, హైదరాబాద్. 500033.
e mail: ghantac@braou.ac.in

BRAOU

BRAOU

BRAOU

BRAOU